Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు - వారి కావ్యాలు

DONATION

డా॥ జి. సుమిత్రాదేవి
ఎం.ఏ., పిహెచ్.డి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Samaj Foundation Chenna

Domain. Gurukul Kangri Coll

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

NATION

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు - వారి కావ్యాలు

"Forwarded free of Cost, and with the Compliments of the Department of Education, Government of India New Delhi."

पुस्तकालय
पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

7975
DONATION

पुस्तकालय
पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

డా॥ జీ. సుమిత్రాదేవి
ఎం.ఏ., పిహెచ్.డి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Gribalakshmi Swarna Kankana Graheetalaina Kavayitrulu – Vari Kavyalu – By Dr. G. Sumitra Devi, M.A., Ph.D.

ప్రథమ ముద్రణ : 1988

ప్రతులు : 1000

© సర్వసామ్య సంకలితము.

వెల : రూ. 60–00

ప్రతులకు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాదు – 500 001.

'తిరుమల'

16–7–220 [పోస్టు సాహిఫా]

ఆజంపురా, హైదరాబాదు – 500 024.

ముద్రణ: పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదర్‌గూడ, హైదరాబాదు–500 029

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



నా జన్మదాతలు

శ్రీయుత మంత్రి వెంకటేశ్వరరావు,

శ్రీమతి లక్ష్మీదేవి గార్లకు

కృతజ్ఞతలతో

నా సాహిత్య కృషిని సమర్పిస్తున్నాను

—రచయిత్రి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ ర స్తు

యత్ర నార్యస్తు పూజ్యంతే
రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే
సర్వాస్తత్రాఫలాః క్రియా

(మనుస్మృతి)

చదువన్నేర్తురు పూరుషుల్బలెనె
శాస్త్రంబుల్పఠింపించుచో
నదమన్నేర్తురు శత్రు సేనల
ధనుర్వ్యాపారముల్నేర్పుచో
నుదితోత్సాహము తోడ నేలగల
రుర్విన్ బ్రతిష్ఠించుచో
ముదితల్నేర్వగ రానివిద్య గలదే
ముద్దార నేర్పించినన్.

(చిలకమర్తి లక్ష్మీనృసింహ కవి)

DONATION

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డా॥ ఎస్. వి. రామారావు
రీడర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

అభినందన

నేను పాఠశాల విద్యార్థిగా ఉన్న రోజుల్లో గ్రంథాలయాల్లో గృహలక్ష్మి పత్రికను చూస్తూండేవాణ్ణి. బహుశా మహిళలకోసం ప్రత్యేకమైన పత్రిక అప్పటికి అదొక్కటేనేమో! ఆంధ్రపత్రికలో 'వనితాలోకం', ఆంధ్రప్రభలో 'ప్రమదావనం' శీర్షికలు అప్పుడు ఆకర్షణీయంగా ఉండేవి. శరత్ నవలలు, చలం 'స్త్రీ', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' చదివిన ప్రభావంతో సమాజంలో స్త్రీ స్థానాన్ని గురించిన ఆలోచనలు నాలో మెదలుతుండేవి.

మహిళా సమస్యలకు, మహిళా రచనలకు ప్రాముఖ్యం ఇస్తూ గృహలక్ష్మి పత్రికను నిర్వహించిన కోట నరకేసరిగారు (కె. ఎన్. కేసరిగా ప్రసిద్ధులు) ధన్యజీవులు. ఆయన స్వతః వైద్యులు. స్త్రీల ఆరోగ్యంకోసం తయారుచేసిన ఔషధం 'లోధ్ర' అమ్మగా వచ్చిన లాభాన్ని 'స్త్రీ ధనము'గా భావించి, దానిని మింగితే 'అజీర్ణము' అవుతుందని తలచి, స్త్రీ సేవకే వినియోగించాలన్న సంకల్పంతో స్త్రీ విద్యాభివృద్ధులకు దోహదంచేసే పత్రికను నెలకొల్పారు. వ్యాపారంలో కూడా సమాజ సేవను భాగంగా పెట్టుకొన్నారు నాటి మహనీయులు. అమృతాంజనం ఆధారంతో ఆంధ్రపత్రిక, భారతి వంటి ఉత్తమ పత్రికలు స్థాపించి దేశోద్ధారకులైనారు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు. త్యాగం, ధర్మం పునాదిగా వెలసిన నాటి పత్రికలకూ, పాప్యులారిటీ కోసం అసత్య వార్తలూ, మిథ్యాకల్పనలూ ప్రచురించే నేటి పత్రికలకూ ఎంత భేదం!

అందుకే శ్రీమతి సుమిత్రగారు గృహలక్ష్మి స్వర్ణకంకణ బహుమతి గ్రహీతలపై పరిశోధనకు పూనుకుంటానంటే నేను ప్రోత్సాహం అందించాను. డా॥ కేసరిగారు గృహలక్ష్మి పేరును చిరస్థాయి చేస్తూ మహిళాభ్యుదయానికి పాటుపడిన నారీమణుల సేవకు గుర్తింపుగా ప్రతియేటా స్వర్ణకంకణ బహుమతి ఏర్పరచారు. 1934 లో ప్రారంభమైన ఈ సంకల్పం కేసరిగారు పరమపదించిన తర్వాత కూడా కొనసాగుతున్నది. 1986 వరకు 38 మంది బహుమతులు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొందారు. వీరిలో రచయిత్రులూ, సంఘసేవికలూ ఉన్నారు. వారిలో కవయిత్రుల రచనల పరామర్శనమే ఈ సిద్ధాంత వ్యాసం.

స్వర్ణకంకణ గ్రహీతల్లో పన్నెండుగురు మాత్రమే కవయిత్రులు కావటం, అందునా పాతతరానికి చెందినవారే ఎక్కువగా వుండటం గమనార్హం. 1934-55 మధ్య బహుమతి పొందిన 14 గురిలో 9 మంది కవయిత్రులుండగా తర్వాతి కాలంలో బహుమతి పొందిన 24 గురిలో ముగ్గురే కవయిత్రులు గోచరిస్తారు. 1956 నుంచి నవలా రచయితలుగా, కథకులుగా ప్రసిద్ధిపొందినవారికే బహుమతి వచ్చాయంటే ఆ రంగంలో స్త్రీల ముందంజ వెల్లడవుతున్నది.

ఈ గ్రంథం ఆరంభంలో ప్రాచీనాంధ్ర కవయిత్రులనూ, గృహలక్ష్మికి పూర్వం వెలువడిన స్త్రీల పత్రికలనూ పేర్కొనటం సముచితంగా ఉంది. గృహ లక్ష్మి చరిత్రనూ, దానికి సూత్రధారి అయిన కేసరి జీవిత విశేషాలనూ రచయిత్రి ఆసక్తికరంగా చెప్పారు. తర్వాత కనుపర్తి వరలక్ష్మమ్మ మొదలుకొని నాయని కృష్ణకుమారి వరకూ బహుమతి పొందిన కవయిత్రుల కావ్యాల పరిశీలన చేశారు.

కవయిత్రుల జీవితవిశేషాలు, ముద్రితాముద్రిత రచనల వివరాలూ సేక రించటంలో సుమిత్రగారు ఎంతో శ్రమించారు. కావ్యాలు అనుసరణలు అయి నప్పుడు మూలగ్రంథాలతో పోలికలు చూపారు. పరిశోధకులూ, విమర్శకులూ అయిన కృష్ణకుమారిగారి 'అగ్నిపుత్రి' కవితాత్మను చక్కగా దర్శించారు. ఈ రచయిత్రులందరూ సంప్రదాయమార్గంలో రచనలు చేసినవారు కాగా, ఆధునిక కవయిత్రిగా పేర్కొనదగినవారు కృష్ణకుమారిగారొక్కరే కావటం గమనించ వలసిన విశేషం.

సుమిత్రగారు లోగడ 'రాయవాచకం'పై సిద్ధాంత వ్యాసం వ్రాసి ఎం. ఫిల్. డిగ్రీ పొందారు. రేడియో ప్రసంగాలనూ, వ్యాసాలనూ 'తెలుగు మహిళ' పేరుతో ప్రకటించారు. గృహిణిగా తమ బాధ్యతలు నెరవేరుస్తూనే, ఒకవైపు అనారోగ్యం ఆటంకంగా వున్నా, తాము చదివిన చదువును సార్థకం చేస్తూ సాహిత్య కృషి చేస్తున్న సుమిత్రగారినీ, అందుకు దోహదం చేస్తున్న శ్రీ రామకృష్ణారావుగారినీ అభినందిస్తూ, ఆమె ముందు ముందు మంచి విమర్శ నాత్మకములైన రచనలు వెలువరించాలని ఆశిస్తున్నాను.

డా॥ ఎస్. వి. రామారావు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తొలిపలుకు

ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు పి. హెచ్.డి. పట్టము కొరకు 'గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు - వారి కావ్యములు' అను ఈ సిద్ధాంత వ్యాసమును నేను సమర్పిస్తున్నాను.

ఈ విషయముపై పరిశోధనకు నాకు అవకాశము కల్పించిన డా॥ బిరుదు రాజు రామరాజుగారికి కృతజ్ఞతాభివందనము లర్పించుకొంటున్నాను.

ఈ సిద్ధాంత వ్యాసరచనకు పర్యవేక్షకులుగా నుండి, దయతో నాకు సహకరించినట్టి విశ్వవిద్యాలయ ఆంధ్రోపన్యాసకులు డా॥ యస్. వి. రామారావు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పించుకొంటున్నాను. వారి సౌహార్ద్రసౌశీల్యములు, కార్యసామర్థ్యము ఎన్నటికీ మరువలేనివి. వారు సౌజన్య హృదయముతో మావంటి విద్యార్థులకు విజ్ఞానపథములందు విహరించి, పురోగ మించుటకు దోహదమొనరించుచున్నారు. వారి పర్యవేక్షణలో వెలువడిన పరిశో ధనా వ్యాసములలో, పుస్తకరూపమున వెలువడినవానిలో నాదే మొదటి పరిశో ధనా వ్యాసం. నా కృషిని అభినందిస్తూ గురువర్యులు డా॥ యస్. వి. రామారావు గారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు వారికి నేను సర్వదా కృతజ్ఞు రాలను.

మహిళల ఆరోగ్య భాగ్యములకు, విజ్ఞాన వికాసములకు తోడ్పడినవి కేసరిగారు వెలువరించిన లోధ్రఔషధరాజము, గృహలక్ష్మి పత్రిక. చిన్ననాటి నుండియే నాకు వీనితో అనుబంధము పెరిగినది. మధ్యలో 'గృహలక్ష్మి' ఆగి పోయినను నా స్మృతిపథము నుండి చెదరిపోలేదు.

విశ్వవిద్యాలయమున గల పరిశోధనా వ్యాసములను చూచినపుడు కవ యిత్రులను గురించి అంత ఎక్కువగా పరిశీలన జరుగకపోవుటను గమనించి అందుకు పూనుకొనవలయునని తలచితిని. ఇంతలో 'వనిత' పత్రికలో 1979లో డా॥ నాయని కృష్ణకుమారిగారికి 'గృహలక్ష్మి స్వర్ణకంకణ ప్రదానము' జరిగిన దని చదివినాను. వెంటనే స్వర్ణకంకణగ్రహీతలైన కవయిత్రుల కావ్యాలపై పరిశోధన చేయదలచితిని. నా అభిప్రాయమును డా॥ యస్. వి. రామారావుగారు సహృదయముతో మన్నించినారు. ఈ సిద్ధాంత వ్యాసరచనకు వలసిన గ్రంథ ములకొరకు నేను మద్రాసు కేసరి కుటీరమునకు వెడలినాను. అచ్చట డా॥ కేసరి గారి బంధువగు శేషగిరిరావుగారు నాకు గృహలక్ష్మి పత్రికలను, వలసిన పుస్త

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కముల నిచ్చి ఆదరించిరి. వారికి నా మనఃపూర్వక వందనములు. డా॥ కేసరిగారి పుత్రిక శ్రీమతి శారదాంబగారు కూడా నన్ను ప్రోత్సహించినారు. వారికి నా వందనములు.

వలసిన పుస్తకములను సమకూర్చుటలో సహకరించినట్టి ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు శ్రీయుత దేవులపల్లి రామానుజరావుగారికి, శ్రీయుత ఆవంచ హరికిషన్‌రావుగారికి, శ్రీయుత ఆవంచ గోపాలకృష్ణారావుగారికి నా కృతజ్ఞతా పూర్వక వందనములు. తమ రచనలను దయతో ఇచ్చి నన్నాశీర్వదించిన కవయిత్రీమణి డా॥ ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారికి అనేక వందనములు. కోరగానే తమ రచనలను పంపి, నన్నాశీర్వదించిన మధురకవయిత్రి స్థానాపతి రుక్మిణమ్మగారికి నా మనఃపూర్వక వందనములు. విశాఖలో వారిని స్వయంగా కలసినాను. ఈ వయసున కూడ వారు సాహిత్యసేవ చేయుచునేయున్నారు.

కవయిత్రుల కావ్యపరిశీలనకు నాకు ముందుగా తోడ్పడిన గ్రంథము డా॥ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి 'ఆంధ్ర కవయిత్రులు.' స్వర్ణకంకణ గ్రహీతలందరి పేర్లను దయతో పంపినవారు శ్రీమతి మాలతీచందూర్ గారు. వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

DONATION

పదవయేటనే ఆగిపోయింది నా చదువు. అయినా నాలోని తీరని విద్యా పిపాసను గమనించి, నన్ను ప్రోత్సహించి, నాకు మార్గదర్శకులైన నా జీవిత భాగస్వామి డా॥ గూడా రామకృష్ణారావుగారి సహకారం లేకపోతే నేను ఈ రంగంలో ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయేదాన్ని. అట్టి నా సహచరులకు ఎన్నో కృతజ్ఞతా కుసుమ మాలికల నందిస్తున్నాను. ఈ కార్యక్రమంలో నాకు అడుగడుగునా తోడ్పడి, ప్రోత్సాహమందించిన నా నలుగురు పుత్రులకు ఆశీస్సులు

ఈ గ్రంథమును తగిన సమయములో అచ్చువేసి సహకరించినట్టి పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్‌వారికీ, ప్రూఫులను చక్కగా దిద్ది చూచినట్టి తిరుమల రావుగారికి నా అభివందనములు.

ఎంతో పరిశీలించినను కొన్ని తప్పులు దొరలినవి. సహృదయులను క్షమించుమని వేడుచున్నాను. ఇకముందు నన్నాశీర్వదించవలసిన బాధ్యత సహృదయులదే.

విధేయురాలు

గూడా సుమిత్రాదేవి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయ సూచిక

			పుట
1.	మహిళలు - వాఙ్మయసేవ	....	1
	(అ) మహిళలు - కవిత్వము	....	3
	(ఆ) మహిళలు - పత్రికలు	....	12
2.	గృహలక్ష్మి పత్రిక - దాని విశిష్టత	....	23
	(అ) డా॥ కె. యన్. కేసరి	....	25
	(ఆ) గృహలక్ష్మి పత్రిక	....	28
	(ఇ) సారస్వత సన్మానములు	....	34
	(ఈ) స్వర్ణకంకణ ప్రదానము	....	36
3.	గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు - వారి కావ్యములు	....	39
	1. కనుపర్తి వరలక్ష్మమ్మ	....	41
	2. కవిరాణి చిల్కపాటి సీతాంబ	....	65
	3. కవితా విశారద కాంచనపల్లి కనకాంబ	....	109
	4. కవి కలహంసి చేబ్రోలు సరస్వతీదేవి	....	141
	5. సరస కవయిత్రి గంటి కృష్ణవేణమ్మ	....	181
	6. గిడుగు లక్ష్మీకాంతమ్మ	....	226
	7. మధుర కవయిత్రి స్థానాపతి రుక్మిణమ్మ	....	254
	8. డా॥ ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ	....	293
	9. పొణకా కనకమ్మగారు - శ్రీ రమణ గురుస్తవము	....	335
	10. దేశిరాజు భారతీదేవి - కాంతా శతకము	....	339
	11. కవిసింహి గుడిపూడి ఇందుమతీదేవి	....	351
	12. డా॥ నాయని కృష్ణకుమారి - అగ్నిపుత్రి	....	425
4.	ఉపసంహారము - ఉపయుక్త గ్రంథసూచిక	....	450

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"Forwarded free of Cost, and with the Compliments of the Department of Education, Government of India New Delhi."

కృతజ్ఞతలు

నా యీ గ్రంథ పరిచురణకు తగిన ఆర్థిక సహాయ మొనరించినట్టి తెలుగు విశ్వవిద్యాలయాధికారులకు హృదయ పూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాను.

విధేయురాలు

డా॥ గూడా సుమిత్రాదేవి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



డాక్టర్ కె. ఎన్. కేసరిగారు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"Forwarded free of Cost, and with the Compliments of the Department of Education, Government of India New Delhi."

మహిళలు—

వాఙ్మయ సేవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మహిళలు - కవిత్వము

ఆంధ్ర వాఙ్మయ క్షేత్రము సువిశాలమైనది. అందు నెలకొని కవితా పరిమళములను వెదజల్లిన కవయిత్రీమణులెందరో చిరస్థాయిగా యశస్సు నొంది యున్నారు. 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని మనువు పలికినప్పటికిని, ప్రతిభా వంతురాండ్రైన మహిళలు ఆనాటి నుండీ, ఈనాటివరకు వివిధ రంగములందు తమకుగల నైపుణ్యమును పురుషులతో సమానముగా చాటుచునే యున్నారు. ముఖ్యముగా లలితకళలైన కవిత్వము, గానము, చిత్రలేఖనము వంటి వానిలో స్త్రీలు తమ ప్రజ్ఞాపాటవములను చూపించి కీర్తి గడించుచున్నారు. అట్టివారు వేదకాలము నుండీ నేటివరకు ఎంతోమంది కలరు.

వేదకాలమునందు స్త్రీలకు సమాజములో పరిగణింపదగినట్టి గౌరవ మర్యాదలు కలవు. నాటివారు స్త్రీని గృహసామ్రాజ్ఞిగా భావించి ధర్మకార్యాచరణము లందును, కుటుంబ రక్షణయందును, గృహనిర్వహణ కార్యములందును, ఆమెకు విశిష్ట స్థానమిచ్చినారు. కేవలము గృహ నిర్వహణమున గృహిణిగానే కాక బాహ్య ప్రపంచమున కూడ వనితలకు పురుషులతో సమానమగు అర్హతలను కల్పించి ఆదరించినారు. ఆనాటి సదవకాశములను వినియోగించుకొని నాటి మహిళలు ఎందరో విద్యా విశారదలుగా వెలసినారు. జన్మతః తమకుగల ప్రతిభా విశేషము లను, తమ విద్వత్తును, పాండిత్యమును ప్రదర్శించుకొనినారు. వేదాధ్యయనము నందును, వేద సూక్తములను దర్శించుట యందును, వేదగోష్ఠులయందును, శాస్త్ర చర్చలయందును, యజ్ఞయాగాదులందును మహిళలకు పురుషునితో సమానమగు ప్రతిపత్తి కలదు.

మంత్రఫలితమైన వాక్కులను దివ్యదృష్టితో దర్శించి ప్రతిభాశాలురైన వేద ఋషులతో పాటు స్త్రీలు కూడ కలరు. ఋగ్వేదసూక్తములను పురుషులతో పాటు కనుగొనిన స్త్రీల సంఖ్య ఇరువది నాలుగు. వారిలో పదునార్గురు దశ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మండలములోని ఆయా సూక్తములను దర్శించిరి.[1] వేదకాలము గడిచి ఇంచు మించు అయిదు వేల సంవత్సరములు నిండినవి. అంతటి ప్రాచీన కాలముననే మహిళలు విద్యాజ్ఞాన సంపన్నలై వేద విద్యాభిలాషను కలిగి, మంత్ర దర్శన మొనరించి సంఘమున గౌరవము నందినారను విషయము మనకు గర్వకారణ మగుచున్నది.

అట్టి మంత్ర ద్రష్టలైన బ్రహ్మవాదినుల పేర్లు చాల కలవు. వారిలో ముఖ్యులు గార్గి, రోమశ, వాగ్దేవి, జుహూదేవి, సరమ, లోపాముద్ర, శ్రద్ధ, అదితి, యమి, ఊర్వశి, అపాల, శశ్వతి, ఇషాందూత, శిఖండిని, విశ్వవార, ఇంద్రమాత, శచి, సర్పరాజ్ఞి, ఘోష, సూర్యరాత్రి, దక్షిణ, ఇంద్రాణి, గోధ, ఆత్రేయ, వసుక్రపత్ని, వైవస్వతి, పౌలమి, దేవయాని వంటివారు. ఋగ్వేదము లోనే ఇరువది యారు శ్లోకములను మహిళలే రచించినట్లు తెలియుచున్నది. వీరం దరి యందును గార్గి పాచక్నవి గొప్ప వేదాంతియైన మహిళ.[2] బ్రహ్మవాదినులైన ఈ మహిళలు వైదిక సారస్వతమున నేటికిని పేరొంది యున్నారు.

లౌకిక వాఙ్మయమున సంస్కృత కవితారచన మొనరించి పేరొందిన మహిళలుకూడ ఎందరో కలరు. వికటనితంబ,విజ్జిక, ఇందుబాల మున్నగు సంస్కృత కవయిత్రులు ప్రసిద్ధినొందినవారు.[3] విజ్జిక అను కవయిత్రి కౌముదీమహోత్సవ మను ఐదంకముల నాటకము రచించినది. ఇందలి ఇతివృత్తము చారిత్రకమైనది. క్రీ. శ. 340 ప్రాంతమున మగధను పాలించిన కళ్యాణవర్మ చరిత్ర ఇందు కలదు. ఈ నాటకము అతని సభయందు ప్రదర్శింపబడినది. దండి మహాకవి చేత ప్రశంసింపబడిన మహాకవయిత్రి విజ్జిక.[4]

---

1. విజ్ఞాన సర్వస్వము - 6 వ సంపుటము - పుట 173.
2. **యుగ** యుగాలలో భారతీయ మహిళ (జె. వరలక్ష్మి) పుట 76.
3. **యుగయు**గాలలో భారతీయ మహిళ (జె. వరలక్ష్మి) పుట-76.
4. విజ్ఞాన సర్వస్వము-6 వ సంపుటము-పుట-237.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాతవాహన రాజుల కాలమున ప్రాకృత వాఙ్మయము బాగుగా పోషింప బడెనది. హాలుడు సంతరించినట్టి 'గాథాసప్తశతి' ఏడువందల గాథలచే, మధుర మంజుల శబ్దభరితముగా కూర్చబడినది. 'గాథాసప్తశతి' యందు కవయిత్రులుగా పేర్కొనబడినవారు కలరు. అణులచ్చి, అసులద్ది, పహంయా, భోజ్జీ, మాధవి, రేవా, రీహా, పద్దానహీ, విహా, ససిప్పహా అను పదిమంది రచయిత్రులు 'గాథాసప్తశతి' యందు పధ్నాలుగు గాథలు వ్రాసినారు.[1]

సంస్కృతమున కావ్యములు రచించిన ఆంధ్రమహిళలు కూడ ఎందరో ప్రసిద్ధి నొందిన వారున్నారు. గంగాదేవి, తిరుమలాంబ, రామభద్రాంబ, మధుర వాణి మున్నగు వారు సంస్కృత కవయిత్రులుగా సాహిత్యరంగమున వన్నె కెక్కినారు. వారిని గురించి క్లుప్తముగా తెలిసికొందము.

గంగాదేవి: విజయనగర సామ్రాజ్యమును స్థాపించిన బుక్కరాయల కుమారుడు కంపరాయలు. గంగాదేవి కంపరాయల ప్రియపత్ని. కంపరాయల వీరవిక్రమాలను, విజయ వృత్తాంతమును కథావస్తువుగా గ్రహించి గంగా దేవి 'మధురావిజయమును' రచించినది. సంస్కృతమునందు రచింపబడిన ఈ 'మధురా విజయము' ఎనిమిది సర్గల మహాకావ్యము. ఈ కావ్యమునకు 'వీర కంపరాయ చరిత్రము' అను నామాంతరము కలదు. ఆ కాలపు రాజకీయ, సాంఘిక పరిస్థితులకు ఈ కావ్యము దర్పణమువలె నున్నది. కంపరాయల పట్టమహిషియైన గంగాదేవికి విద్యకుతగిన వినయ విధేయతలు, పెద్దలయెడ గౌరవమున్నట్లు ఈ గ్రంథము వలన తెలియును. రమణీయమైన కల్పనలతో కూడిన ఈ కావ్యములో రచయిత్రి రచనా నైపుణ్యము కానుపించును. గంగాదేవి కవిత చాల మృదువైనది. కాళిదాసు, దండి మహాకవుల శ్లోకములను పోలిన శ్లోకములను రచించి వన్నెగాంచిన కవయిత్రి గంగాదేవి. ఈమె కాళిదాసు మహా కవి యెడల గౌరవ మెక్కువ కలిగినదని చెప్పవచ్చును.[2] మధురావిజయమ-

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం-6 వ భాగం (ఆరుద్ర) పుట-170-171.
2. విజ్ఞాన సర్వస్వము 4 వ సంపుటం (బు. వెం. ర.) పుట-825.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాత్రమే గాక, గంగవంశ చరిత్ర వర్ణించు వసుదేవ రథ గంగాధరుల గంగ వంశానుచరితము, గంగాదాన ప్రతాపవిలాసము, అనునవి కూడ ఈ మహా కవయిత్రి రచించినట్లు తెలియుచున్నది.¹ ఈ కవయిత్రి రచనలవలన కంప రాయని కీర్తి చిరస్థాయిగా నిలిచినది.

తిరుమలాంబ : సాహితీ సమరాంగణ చక్రవర్తియైన శ్రీ కృష్ణదేవరాయ లకు సవతి తమ్ముడైన అచ్యుత దేవరాయల భార్య తిరుమలాంబ. ఈమె సంస్కృతమున వరదాంబికా పరిణయము అను కావ్యము రచించినది. అందు అచ్యుత దేవరాయల దేవేరియగు వరదాంబిక యొక్క వివాహవృత్తాంతము చక్కగా వర్ణింపబడినది. వరదాంబికా పరిణయగద్యమునుబట్టి తిరుమలాంబ ఏక సంథా గ్రాహిత్వమును, సంగీత సాహిత్యములయందు గల అసమాన పాండిత్య మును తెలియును. ఈమె వితరణగుణశాలిని. పెద్దలయందు గౌరవముకలిగి వారి దీవెనలందుచుండెడిది. వరదాంబికా పరిణయము చారిత్రికాంశములకు నిధి. అచ్యుత దేవరాయల నాటి చారిత్రక విషయములెన్నియో తెలియును. రాయల అంతఃపురమున వాచకురాలిగనుండిన ఓదువ తిరుమలాంబయే యీమె అని కొందరు పరిశోధకులు అభిప్రాయపడుచున్నారు.

శ్రీ కృష్ణదేవరాయల పత్నియగు తుక్కాదేవియు కవయిత్రిగా సాహిత్య క్షేత్రమున నిలిచినది. ఈమె రచించిన తుక్కా పంచకమే, భృంగపంచకమని పిలువబడినది. రాయలచే పరిత్యక్తయై విరహిణియైన ఈ దేవేరి రచించిన శ్లోక ములు తుక్కా పంచకముగా వెలసినవి.

రామభద్రాంబ : రాయల కాలమునసేగాక నాయకరాజులకాలమున కూడ కవయిత్రులు కలరు. నాయక రాజులలో శ్రేష్ఠుడైన రఘునాథరాయల ఆస్థానమున రామభద్రాంబ అను కవయిత్రి యుండెను. ఈమె రఘునాథాభ్యుదయము అను కావ్యమును సంస్కృతమునందు రచించినది. ఇందు రఘునాథరాయలనే నాయ

1. విజ్ఞాన సర్వస్వము. 6 వ సంపుటం-పుట-224 (మ. గో. కృ. త)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కునిగా యెన్నుకొని అతని జీవిత వృత్తమునే రచించినది. 'రఘునాథాభ్యుదయము' ద్వాదశ సర్గలతో కూడిన మహా కావ్యము. రామభద్రాంబ అష్ట భాషలు నేర్చినది. చతుర్విధ కవితా రచన మొనరించగలిగిన ప్రజ్ఞావంతురాలగు కవయిత్రి.

మధురవాణి: రఘునాథ నాయకుని ఆస్థానమునగల మరియొక విదుషీ మణి మధురవాణి. రఘునాథుడు తెలుగులో వ్రాసిన రామాయణమును సంస్కృతీకరించినది. 'రామాయణసార కావ్యతిలకము' అను పేరున ఈ సంస్కృత కావ్యము పదునాలుగు సర్గలయందు రచింపబడినది. ఈమె అవధాన విద్యయందును, ఆశుకవిత్వమునందును ప్రతిభావంతురాలు. రఘునాథ భూపతి ఈ కవయిత్రికి స్వర్ణాభిషేకమొనరించినాడు. ఈ కవయిత్రి వాఙ్మాధుర్యమునకు మెచ్చి 'మధురవాణి' యను బిరుదునిచ్చినాడు. ఈ విధముగా సంస్కృతములో రచనలొనరించి కీర్తిగాంచినట్టి ఆంధ్రకవయిత్రులు వీరు. ఇక తెలుగులోనే కవితా రచన మొనరించి గణుతికెక్కిన ప్రాచీన కవయిత్రులను గూర్చి కొంత తెలిసికొందము.

తెలుగు కవయిత్రులు: సంస్కృత ప్రాకృత వాఙ్మయ రంగమున రాణించిన మహిళలే గాక తెలుగులో కూడ కవితారచనమొనరించి, పేరొందినవారు కలరు. ప్రాచీన కవయిత్రులుగా కీర్తినొందినవారిలో తిక్కనార్యుని తల్లి ప్రోలమ, రణతిక్కనయని ఘనతనొందిన ఖడ్గతిక్కన భార్యచానమకూడ చాటుపద్య కవయిత్రులు. పగరకు వెన్నిచ్చి వచ్చిన ఖడ్గతిక్కనలో శౌర్యరసముప్పొంగునట్లు చిన్న చిన్న పద్యములలోనే ఐదులు పలికి యుద్ధోన్ముఖుని యొనరించిన వీర కవయిత్రులుగా వీరు పేరొందినారు.

తెలుగు కవయితులలో ప్రథమాంధ్ర భాషారచయిత్రిగా వన్నెకెక్కిన మహిళ తాళ్లపాక తిమ్మక్క.[1]

---

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం 6 వ భాగము. ఆరుద్ర. పుట - 173.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కీర్తిశేషులు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు పరిశోధించి ఈమెను మొదటి తెలుగు కవయిత్రిగా నిర్ణయించిరి. తాళ్లపాక అన్నమాచార్యుని పెద్ద భార్యయైన ఈ తిమ్మక్క 'సుభద్రాకళ్యాణము'ను ద్విపద కావ్యముగా రచించినది. ఇది స్త్రీలు పాడుకొనుటకు సులభశైలిలో రచింపబడినది. సుప్రసిద్ధుడైన చేమకూర వేంకటకవి తన 'విజయ విలాసము' నందలి సుభద్రాపరిణయ ఘట్టమున ఈమె కావ్యమును పెక్కుచోట్ల అనుసరించినాడు. సుభద్ర పాత్రను రసవంతముగా చిత్రించుటలో వేంకట కవి కంటె తిమ్మక్కయే ఎక్కువ నేర్పు చూపినదని విమర్శకుల అభిప్రాయము.[1]

మొల్ల : రామాయణ మహాకావ్య నిర్మాణమొనరించి, చిర కీర్తి నొందిన తరుణి ఆతుకూరి మొల్ల. మొల్లను గురించి తెలియని ఆంధ్రులు తక్కువ. ఈమె రచించిన 'మొల్ల రామాయణము' ఆరు కాండములయందు 900 పద్యములు కలవు. కుమ్మరి కుల సంజాత అయిన మొల్ల రామాయణమును రామచంద్రునకే సమర్పించి ధన్యురాలైనది. ఈ కవయిత్రి విజయనగర రాజుల కాలమునాటి మహిళ. కాని ఈమెకు రాజుల గౌరవాదరణములు లభించనట్లున్నవి. "తెలుగు కవిత్వము దుర్భేద్యములైన సంస్కృత సమాసములతో కూడియుండక ధ్వని ప్రధానమై యుండవలెననియు, తేనె సోకినంతనే నోరు తీయనగు రీతి కవిత్వము కూడ ఉండవలెననియు, గూఢ శబ్దార్థములతో గూర్చిన కవిత్వము మూగ చెవిటి వారి ముచ్చటవలె నుండుననియు"[2] కవిత్వమును గూర్చి ఈమె తన అభిప్రాయమును తెలిపినది. తాను అంత విద్యావంతురాలను కానని మొల్ల సవినయముగా తెలిపినది. కాని ఈమె కావ్యమున లోపమేమియు లేదని అనవచ్చును. ఈ నాటికి ఈ వనితా రత్నము పేరు చిరస్థాయిగా నిలిచి యున్నందులకు మనము గర్వింప వలయును.

---

1. ఆంధ్రవాఙ్మయ చరిత్ర-దివాకర్ల వెంకటావధాని-పుట 51.
2. మొల్ల రామాయణము-పీఠిక-పద్యము 17.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మోహనాంగి : విజయనగర సామ్రాజ్యాధీశుడగు శ్రీకృష్ణ దేవరాయని అనుగు కుమార్తె మోహనాంగియు కవయిత్రిగా పేరొందుట మహిళల అదృష్టమే. మోహనాంగి కవయిత్రి, చిత్రకారిణి. అంతేగాక సంగీత సరస్వతిగా కూడ పేరొందినది. అళియ రామరాజు ధర్మపత్ని మోహనాంగి. ఈమెకు 'తిరుమలాంబ'యను నామాంతరము కలదు. ఆమె 'మారీచీ పరిణయ' మను కావ్యమును రచించి తండ్రికే అంకిత మొసరించినది. ఈ కావ్యము వలన చారిత్రకాంశములు తెలియును. రామాయణమునందలి కథను గ్రహించి తన కల్పనా చాతుర్యముతో రచించి ఈ కవయిత్రి ప్రశంసింపబడినది.

రాయలకాలము తర్వాత సంగీత సాహిత్యములను పోషించిన రసిక చక్రవర్తులుగా నాయక రాజులలో రఘునాథ నాయకుడు, ఆతని కుమారుడు రాఘవ నాయకుడు కీర్తి పొందినారు. వీరు మహిళా కవయిత్రులను కూడ తమ ఆస్థానము నందుంచి గౌరవించినారు. విజయరాఘవుని కాలమున కీర్తిపొందిన కవయిత్రులు కృష్ణాజి, రంగాజి. కృష్ణాజి కావ్యములు లభ్యము కాలేదు. పసుపులేటి రంగాజమ్మ విజయరాఘవుని కొలువునకు ఆభరణ వంటిది. ఈ విదుషీమణి "అష్టభాషా సర్వంకషమనీషా విశేష శారద." రాజనీతి విద్యావిశారద. విజయరాఘవ నాయకుని చేత కనకాభిషిక్త అయినది. ఈమె సంగ్రహ భారతము, సంగ్రహ భాగవతము, సంగ్రహ రామాయణము, ఉషాపరిణయము, మన్నారు దాస విలాసము, మన్నారుదాస విలాస యక్షగానము అను ఆరు గ్రంథములు రచించినది. ఈ కవయిత్రి కవితా రచనయందు చక్కని నేర్పుగలిగి చిరయశస్సు నందినది.

ఎంతోమంది కవయిత్రులు కావ్యములు వ్రాసినవారు కలరుకానీ ముద్దు పళనివలె శృంగార ప్రబంధమును వెలయించినవారు తక్కువ. ఆమె రచించినది ఒకే ఒక్క శృంగార ప్రబంధము. 'రాధికాసాంత్వనము.' మహారాష్ట్ర ప్రభువయిన ప్రతాపసింహుని ఆస్థాన కవయిత్రి ముద్దుపళని. ఆ ప్రభువునకు వలపుకత్తె కూడా. రాధికా సాంత్వనము రసికజన హృదయానందకరమైనది. ఈమె తన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కావ్యమును బాలకృష్ణున కంకితమొసగినది. ముచ్చటగొలుపు తెలుగు నుడి కారముతో, సరస పదజాలముతో, మిక్కిలి సున్నితమైన భావములతో కూడిన రచనా విధానముతో ఈ కావ్య మొప్పియున్నది. ముద్దుపళని వితరణ ప్రీతియు, ఆస్తిక బుద్ధియు కలిగినట్టి కళారాధకురాలు. నృత్య, గాన, సాహిత్యములు ఈమె సొత్తు. ఈ కవయిత్రి భక్తితో రామకోటి వ్రాయించినది. విద్వాంసులకు ధనము లిచ్చి వారిని తనియించెను. కృతులు గైకొని పేరుకాంచినది. ఈమె గురువు తిరుమల తాతాచార్య వంశీయుడగు వీర రాఘవ దేశికుడు. ఈమె కావ్యమైన రాధికా సాంత్వనము చక్కని కావ్యమే అయినను- "పచ్చివలపును విస్తరించి వ్రాయుట వలన పాలలో ఉప్పురాయి పడినట్లు నీతిరాహిత్యము కావ్యమునకు పెద్ద కళంకమైన"దని విమర్శకులు భావించిరి.[1]

ఈ విధముగా వేదకాలమునుండి దక్షిణాంధ్రయుగము వరకు మహిళలు తాము నేర్చిన రీతిగా, తమకు ఓపిన రీతిగా రచనలొనరించి కీర్తిబడసినారు.

ఆంధ్ర సాహిత్యక్షేత్రమున క్షీణయుగాంతమువరకు కవయిత్రులు కొంద రికి రాజాశ్రయము లభించుటచేత వారి ప్రతిభాపాటవములు కావ్యరూపమున మూడుపూవు లారుకాయలుగా విరిసినవి. ఆ తరువాత క్రమక్రమముగా దేశమున అరాచకవ్యాప్తి జరుగుటచే సాహితీమతల్లిని అడిగినవారే లేరు. స్త్రీలకు సరియైన రక్షణ లేక వారు గృహములందు గోప్యముగ బ్రతుకుచుండిరి. స్త్రీలకు ప్రాచీన కాలములోని స్త్రీలకున్నట్టి స్వతంత్రత తిరిగిరాలేదు. మున్సల్మానులవలెనే హిందు వులలో కూడ 'పరదా' పద్ధతి ఏర్పడెను. అట్టి పరిస్థితులందు కూడ గృహము లందుండి కవితారచన మొనరించిన మహిళామణులు కలరు. కాని సమాజము లోని మూర్ఖాచారాల తెరల చాటున వీరి కవితా ప్రతిభ మరుగునపడిపోయినది. వీరిని ప్రోత్సహించినవారు లేరు. స్త్రీలను మూర్ఖాచారాల తెరల మరుగు నుండి

1. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము - శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనము గారు. ముద్దుపళని - పుట 182-185.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉద్ధరించుటకు పూనుకొనిన సంఘ సంస్కర్త రాజా రామమోహనరాయలు. ఆత్మ శక్తిని కోల్పోవుచున్న దేశంలో విజ్ఞాన ప్రచారమొనరించినవాడు రామమోహన రాయలు. సమాజాన్ని పట్టి పీడించిన మత మౌఢ్యాన్ని, సాంఘిక దురాచారాలను తొలగించి, జాతికి నూతన చైతన్యాన్ని ప్రసాదించినవాడు. ఆ తరువాత గాంధీ మహాత్ముడు జాతీయోద్యమరంగంలో ప్రవేశించి, తిరుగులేని నాయకత్వంతో వెలుగొంది ప్రజాభిమానమును చూరగొనినాడు. అంటరానితనం తొలగించుటకు పూనుకొనినాడు. హరిజనోద్ధరణ, దీనజనోద్ధరణ, స్త్రీజనోద్ధరణ, భాషాభిమానం, దేశభక్తి, జాతీయభావం మొదలగు విప్లవాత్మకమైన బోధనలతో జాతికి క్రొత్త వెలుగును ప్రసాదించినాడు. క్రమక్రమంగా కందుకూరివారు సంఘ సంస్కరణకు పూనుకొనిన తరువాతనే వీరిలో కొందరి పేర్లు బయటపడినవి.

కొందరు కాలగర్భంలో కలిసిపోయినారు. కవయిత్రుల పేర్లు తెలిసినను వారి కావ్యములు కూడ కొందరివి లభించనేలేదు. వీటిని గూర్చి తమకు తెలిసినంత వరకు ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు ప్రస్తావించినారు.

అట్టివారిలో మదిన సుభద్రమ్మ, బండి పాపమ్మ, రత్నాంబ, చెలికాని చెల్లాయమ్మ అనువారు కలరు. లక్ష్మీకాంతమ్మగారు మదిన సుభద్రమ్మగారి కవితలను గృహలక్ష్మి నుండి సేకరించినారు. బాలపాపాంబ అను కవయిత్రి అక్కమహాదేవి యక్షగానము రచించినది. ఈమె కాలము (క్రీ. శ. 1600) పరిశోధకులు నిర్ణయించినారు. 1833 వ సంవత్సరమున భావలింగ శతకమును రచించిన కవయిత్రి దార్ల సుందరీమణి, దీనిని 'పీవర్స్ వెల్ ఫేరు ట్రస్ట్' ప్రచురణగా వెలువరించినారు. ఈ భావలింగ శతక కర్త్రి గొప్ప వేదాంతి యని తెలియు చున్నది. భావలింగ శతకమును కవిశేఖరులు కొండవీటి వెంకట కవిగారు ముద్రించి లక్ష్మీకాంతమ్మగారికి పంపినారట. దీనివలన ఈ కవయిత్రి నామము బయలుపడినది.[1] బాల వితంతువైన తరిగొండ వేంకమాంబ చరిత్రము సకల

1. ఆంధ్ర కవయిత్రులు (ఊ. లక్ష్మీకాంతమ్మ) పుట - 85.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జనవిదితమే. ఈమె 19 వ శతాబ్ది మధ్య భాగమున జీవించినది. తన చిన్ననాట, ఏ ఆచార్యుల యొద్దను విద్య నేర్వకున్ననూ ఈ కవయిత్రి వేంకటశైల పతి యందలి భక్తితో ఎన్నో రచనలొనరించినది. ఈ కవయిత్రి రచించిన గ్రంథములు పది, పదిహేను వరకు గలవు.[1] ఈమె గ్రంథములు ప్రస్తుతము రాజయోగ సారము, వేంకటాచలమాహాత్మ్యము, విష్ణు పారిజాత యక్షగానము, భాగవతము. ఈమె కావ్యములన్నియు ద్విపద రచనలో వెలువడినవి. ఈమె భాగవతముకూడ అందుబాటులో లేకుండెను. కాని కేసరిగారు శ్రమతో దానిని సంపాదించి 1931వ సంవత్సరమందలి మార్చి, ఏప్రిల్ గృహలక్ష్మి సంచికలలో ప్రచురించినారు. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రను రచించిన యస్వీ జోగారావుగారు ఈమెను ప్రశంసించినారు. భండారు అచ్చమాంబగారు ఈ కవయిత్రినిగూర్చి అబలాసచ్చరిత్రమాలయందు విపులముగా వ్రాసినారు.[2]

తరికొండ వెంకమాంబ తరువాత మహిళలు కొన్ని సంవత్సరములవరకు రచనలే చేయలేదు. వారికి విద్యాగంధమేలేకుండ పూర్తిగా అంధకారబంధురమైన వాతావరణములో ఇమిడిపోయినారు. వారినందరిని వెలికి తెచ్చుటకు, స్త్రీ విద్యా ప్రచారమునకు పడరాని పాట్లు పడినవారు శ్రీ వీరేశలింగముగారు.

వారు కావించిన కృషి మూలముననే ఎందరో స్త్రీలు విద్యావంతులై ముందుకు వచ్చి కావ్యరచన చేయగలిగినారు. గృహలక్ష్మివంటి పత్రికలు వారికి ప్రోత్సాహము కలిగించినవి.

(ఆ) మహిళలు - పత్రికలు

సాహితీ రంగములో ప్రాచీనయుగము, మధ్యయుగము గడిచిన పిదప ఆధునికయుగము ప్రారంభమైనది. నిజానికి మహిళలపరంగా చూచినచో ఇది ఒక

---

1. ఆంధ్ర కవయిత్రులు (డా. లక్ష్మీకాంతమ్మ) పుట - 90.
2. అబలాసచ్చరిత్రమాల (భండారు అచ్చమాంబ) పుట. 115-121

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంధి యుగము. ప్రాత కొత్తల మేలు కలయికపలె అయినదీ కాలము. దేశము మహమ్మదీయ రాజుల పాలనలోనికి వచ్చిన తర్వాత స్త్రీలకు రక్షణ లేక పోయినది. వారి చదువు సంధ్యలన్నియు మాసిపోయినవి. వనితల బ్రతుకులు పెతలపాలయినవి. స్త్రీ కేవలము వంటయింటి కుందేలయినది. అయినను ఆ గాఢాంధకారములోగూడ విజ్ఞాన దీపకళికలను వెలిగించిన మహిళామణులు కొందరు కలరు. ఏమైనను స్త్రీవిద్య సన్నగిల్లిపోవుటచే, వీరేశలింగం పంతులుగారివంటి కొందరు మహనీయులు ముందుకువచ్చి స్త్రీవిద్య కొరకు, స్త్రీల పునర్వివాహము నకు పూనుకొనిరి. స్త్రీలకు విజ్ఞానాభివృద్ధి కలుగచేయవలయునని పత్రికలు వెలు వరించి, స్త్రీల వికాసమునకు సంఘ సంస్కరణానుకూలముగ రచనమొనరించిరి. ఎంతోమంది పండితులు, సమర్థులైనవారు తమ తమ సంపాదకత్వమునందు ఎన్నో రకముల పత్రికలను వెలువరించినారు. ప్రతి పట్టణమునందు, స్త్రీ సభలు, స్త్రీ సమాజములు ప్రారంభించిరి. గుంటూరులో స్త్రీ సనాతన ధర్మమండలి, ఏలూరులో స్త్రీ ప్రార్థనా సమాజము, రాజమహేంద్రవరము, కాకినాడ, విజయవాడలలో స్త్రీ సమాజములు నెలకొల్పబడినవి. స్త్రీలలో కవయిత్రులు, పండితురాండ్రు, స్వాతంత్ర్యాగ్ని రగుల్పగల వీరాంగనలు బయలుదేరిరి. కొటికలపూడి సీతమ్మ గారు, బాలాంత్రపు శేషమ్మగారు, మొసలిగంటి రామాబాయమ్మగారు, పులుగుర్త లక్ష్మీనరసమాంబగారు, మోట రాజాబాయమ్మగారు, గుండు అచ్చమాంబగారు, కందుకూరు రాజ్యలక్ష్మమ్మగారివంటి స్త్రీ రత్నములు మహిళాభివృద్ధికొరకు పురుషులతోపాటు పూనుకొనిరి.[1]

వనితాభ్యుదయమునకు దోహదకారియైన వానిలో పత్రికలు ముఖ్యమైన సాధనమని వారందరు గ్రహించి పలురకముల పత్రికలు వెలువరించిరి.[2]

---

1. గృహలక్ష్మి సెప్టెంబరు, 1932 సంచిక.
2. ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమీ వెలువరించిన 'తెలుగులో పరిశోధన' అను గ్రంథమువలన తెలుగు పత్రికల వివరములు తెలిసికొన వచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుగులో పత్రికలు వెలువడిన ఎంతో కాలమునకు స్త్రీలకొరకు ప్రత్యేకమైనవి ప్రారంభమైనవి. వానిలో చెప్పుకొనదగినవి సతీహితబోధిని, తెలుగు జనానా, శ్రీ బాలిక, హిందూసుందరి, సావిత్రి, వివేకవతి, అనసూయ, ఆంధ్ర లక్ష్మి, గృహలక్ష్మి మున్నగు పత్రికలు. ఇవి కేవలము స్త్రీల పత్రికలే. అయినను పురుషుల రచనలు కూడ వీనిలో ఉండెడివి. ఆనాటి పత్రికలు స్త్రీ విద్యా ఉద్యమమునకు బలము చేకూర్చునవిగా ఉండినవి.[1]

స్త్రీల విద్య కొరకు మిక్కిలి పాటుపడుచుండిన వీరేశలింగము పంతులుగారు 'వివేకవర్ధని'ని 1874వ సంవత్సరమున స్థాపించిరి. స్త్రీ విద్యా ప్రోత్సాహకరములైన తమ స్వీయ అభిప్రాయములను లోకమునకు వెల్లడించుటకు ఒక వృత్తాంత పత్రిక తమ అధీనమందుండుట యుక్తమని భావించి, ఈ పత్రికను నెలకొల్పిరి. పంతులుగారు నిర్వహించిన పత్రికలన్నింటి యందును, సంఘ సంస్కరణమును దృష్టియందుంచుకొనియే రచనలు వెలువరించిరి. సంఘ సంస్కరణమే, ఈ పత్రికలముఖ్యోద్దేశము. దేశాభివృద్ధికి భంగకరములైన పూర్వాచారములను నిరసించుచు, దేశాభివృద్ధికరములైన నూతనాచారములను ప్రచారమొనరించిరి. కులాచార సంస్కార విషయమునను, కుల స్త్రీల పఠనా సిద్ధాంతమును గురించియు, స్త్రీ పునర్వివాహ విషయములను గురించియు, ఇందు ప్రచురించెడివారు.

---

1. ఈ పత్రికలను గురించి ఇటీవల వెలువడిన ప్రముఖ స్త్రీల పత్రిక 'వనితా జ్యోతి' వలన కొంత తెలిసికొనవచ్చును. వనితాజ్యోతి 1982, 83 సంచికలలో 'ఆనాటి వనితలు - పత్రికలు' అను పేరుతో 'భట్టు' అనువారు వ్యాసములు రచించినారు. ఆయా పత్రికల ముఖచిత్రములను కూడ ఫోటో తీసి వనితాజ్యోతిలో ప్రచురించినారు. ఈ వనితాజ్యోతుల ఆధారముగా ఆనాటి వనితల పత్రికలు కొన్నింటిని గూర్చి వివరముగా తెలిసికొనవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సతీహితబోధిని : పంతులుగారు 1883 సంవత్సరమున జనవరి నెల నుండి 'సతీహితబోధిని' అను పత్రికను స్త్రీల ఉపయోగార్థమై వెలువరించిరి. ఈ పత్రిక మధ్యమధ్య నిలిపివేయబడుచు వచ్చినను 1889 వ సంవత్సరమువరకు వెలువడినది. పంతులుగారు ఈ పత్రికయందు 'సత్యవతీచరిత్ర', సత్యసంజీవని' 'దేహారోగ్య ధర్మబోధిని', 'పత్నీహితసూచని' మొదలగు రచనలు వెలువరించి యున్నారు. స్త్రీల ఉపయోగము కొరకు సులభ శైలియందు శాస్త్ర విషయములను, ఆరోగ్యవిధులను, నీతి కథలను వ్రాయుచుండిరి. ఛార్లస్ ల్యాంబ్ రచించిన షేక్స్‌పియర్ నాటక కథలను భారతీ యాచార వ్యవహారముల కనుగుణముగా, దేశకాల పాత్రములను మార్చి, స్త్రీలు చదువుకొని, ఆనందించుటకు కథలుగా అనువదించి, వానిలో కొన్నింటి నీపత్రికయందే ప్రచురించిరి.[1] గర్భము, బిడ్డల నాజ్ఞలో నుంచుట, భవిష్యత్తును చెప్పుట, గృహిణీ ధర్మము, దేహమన స్సౌందర్యములు, శకునములు, జీవకారుణ్యము, హిందూ సుందరుల ప్రస్తుత స్థితి మొదలగు వ్యాసములను సరళమైన శైలియందు పంతులు గారు 'సతీహిత బోధిని'లో ప్రచురించిరి. స్త్రీలు చదువుకొనుట కుపయోగించెడి, ఈ పత్రికను పూర్తిగా పెద్దక్షరములలోనే పాఠకుల కోరికపైన ముద్రించిరి.[2]

తెలుగు జనానా పత్రిక : ఈ పత్రికను గూడ వీరేశలింగం పంతులుగారే నిర్వహించిరి. ఇది 1893 వ సంవత్సరమున జూలైలో ప్రారంభింప బడినది. ఈ పత్రికను మల్లాది వెంకటరత్నంగారు స్థాపించిరి. ఇది త్రైమాసిక పత్రిక. 1894 వ సంవత్సరము నుండి దీనిని రాయసం వెంకటశివుడు గారు నిర్వహించుచుండిరి.

వెంకటశివుడుగారు పంతులుగారి శిష్యులు. విద్యావ్యాప్తికి, పంతులుగారి ఆదర్శాల వ్యాప్తికి స్వయం ప్రతిపత్తితో పాటుపడినవారు. దీనిని వారు ఒక

---

1. వీరేశలింగం పంతులు-సమగ్ర పరిశీలన. (అ. రమాపతిరావు) పుట 196.
2. ,, ,, ,, ,, ,, పుట 204, 208.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దశాబ్దం పాటు వీరేశలింగం పంతులుగారి కోరిక ననుసరించి నిర్వహించుటకు పూనుకొనిరి. పది సంవత్సరముల తర్వాత పంతులుగారే మరల జనానా పత్రికకు సంపాదకత్వమును వహించిరి.[1] ఈ పత్రికయందు పతులుగారు భౌతిక, భూగోళ శాస్త్ర సంగ్రహము, విదేశ నారీమణుల చరిత్రములను ప్రచురించి యున్నారు. ఇవికాక కొన్ని ప్రహసనములను ప్రచురించిరి. పెళ్ళి ఆచారములు, విదేశీయుల వివాహ విషయములు, జపాన్ స్త్రీలు మొదలగు ఎన్నో విషయములు ఈ పత్రికలో ప్రచురించిరి. తర్వాతి కాలములో వచ్చిన పత్రికలకు 'తెలుగు జనానా పత్రిక' ఒరవడి పెట్టినది. సంస్కరణ బీజములను నాటి, విజ్ఞానలతలను పెంచినది. సావిత్రి, హిందూ సుందరి మొదలగు పత్రికలలో జనానా పత్రికలోని పంతులుగారి వ్యాసములను, విమర్శించుచుండిరి. ఆ వ్రాతలకు ప్రతివిమర్శలను పంతులుగారు 'జనానా' - పత్రిక యందు వెలువరించుచుండిరి. వీరేశలింగం పంతులుగారు చూపిన బాటలో కొత్తరీతిలో సాగిన ఈ పత్రికను గున్నేశ్వరరావు సోదరులు రాజమండ్రిలో చింతామణి ప్రెస్సులో ముద్రించెడివారు.[2]

శ్రీబాలిక : 1890 ప్రాంతములో అనంతపురము నుండి, శ్రీకాకుళము వరకు సంస్కారోద్యమాలకు నాందిగా స్త్రీజనోద్ధరణకు బీజములు పడినవి. కన్యాశుల్కము, విద్యారాహిత్యము తొలగించవలయునని, వనితలకు కొంచెమైనా లోకజ్ఞానము కలిగించిన మంచిదని అందరూ అభిప్రాయపడినారు. రంగాభట్ల గున్నయ్య చౌదరి గారు విద్యావ్యాప్తికి కృషి చేసిరి. అప్పుడే సంగీతరావు బాపిరాజు గారు 'బాలిక' అను ఈ మాసపత్రికను నడిపినారు. ఆయన మొదటి గ్రేడు ప్లీడరు. 1896 లో ఈ 'బాలిక' పత్రికను మార్చి నెలలో ప్రారంభించినారు. జోగిరాజు పంతులుగారు ముద్రాపకులు. ఛాందసులు కూడ పత్రిక చదివి తేనేకాని వారిండ్లలో ఉంటున్న స్త్రీలకు పత్రిక చేరే అవకాశము కలుగుతుందను భావనతో కొన్ని వ్యాసాలు అన్ని రకాల అభిరుచులను ఆదరించేవి ఉండెడివి.

---

1. వీరేశలింగం పంతులు-సమగ్ర పరిశీలన (అ. రమాపతిరావు) పుట 208.
2. వనితాజ్యోతి - సెప్టెంబరు 1982 సంచిక పుట. 51.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మండ వెంకట అప్పారావుగారు స్త్రీలను గురించి మంచి పద్యాలు వ్రాస్తుండెడి వారు. స్త్రీ ప్రవర్తన గురించి కూడ కొన్ని పద్యాలు వేసినారు.

ఆ కాలంలో శిశు మరణాల సంఖ్య ఎక్కువ. సంతానము నిలువదను భయముతో ఏవేవో పేర్లు పెట్టి సంతానాన్ని పిలుచుకొనెడివారు. దానిని గురించి చిన్న విమర్శ 'తమ సంతతి నిలువదలెనన్న పిచ్చి అభిప్రాయంతో ఏహ్యమైన నామములు తమ చిరుతలకిడు వాడుక కలదు. చిట్టన్న, సూకన్న, తొడన్న, పెంటమ్మ' అని వ్రాసినారు. స్త్రీల పునర్వివాహములను నిరసించిన వారిని గురించి, వ్యంగ్యంగా పత్రికలో వ్యాసములు వ్రాసెడివారు. ఈ పత్రిక ఉత్తర సర్కారు జిల్లాలలో సంఘములోని అన్యాయాలను ఎత్తి చూపుచు, ఎంతో సేవ చేసినది.[1]

హిందూ సుందరి : ఆ కాలమున పేరుగాంచిన పత్రిక హిందూ సుందరి. ఈ పత్రికను స్థాపించినదీ, నడిపినదీ శ్రీ సత్తిరాజు సీతరామయ్య గారు. వీరు విశేష శ్రమకోర్చి స్త్రీలననేకులను వ్యాసములు వ్రాయుటకు ప్రోత్సహించి, ఆంధ్ర నారీమణుల కృతజ్ఞతలకు పాత్రులైనారు. ఒక దశలో ఈ పత్రికయందు ఎనభై నలుగురు మహిళలు రచనలు చేసెడివారట. ఈ పత్రిక 1902 ఏప్రిల్‌లో స్థాపింపబడినది. ఆనాటి మేధావులైన స్త్రీలందరి ఫోటోలు ప్రచురించి, వారి వ్యాసములు వ్రాసెడివారు. ఆ కాలమున పన్నెండువందల ప్రతులవరకు ఈ పత్రిక అమ్మకము జరిగెడిది. ఈ పత్రికలో పూర్వ స్త్రీల ఔన్నత్యమును గురించి చక్కని వ్యాసములు ఉండెడివి. స్త్రీలకొరకు ప్రత్యేకించిన ఈ మాసపత్రిక యందు, ప్రముఖ రచయిత్రి బండారు అచ్చమాంబగారు, కొటికలపూడి సీతమ్మ గారు, విన్నకోట లక్ష్మిభోగమ్మగారు, పులగుర్త లక్ష్మినరసమాంబగారు రచనలు చేసెడివారు. స్త్రీ విద్యాప్రభావము, స్త్రీ విద్య - తదాటంకములు, సమస్యాపూరణ

1. వనితా జ్యోతి - అక్టోబరు, 1982 సంచిక పుట - 66.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ములు, నీతికథామంజరి మొదలగు విషయములు ఈ పత్రికలయందు వ్రాయ బడెడివి. కొంతకాలము పిమ్మట ఈ పత్రికకు మొసలికంటి రామాబాయమ్మగారు, వెంపల శాంతాబాయమ్మగారు అధిపురాండ్రయినారు. ఆర్టు పేపరుమీద ఎక్కువగా బాలికా సమాజాల ఫోటోలను, విశిష్ట విదుషీమణుల ఫోటోలను ప్రచురించినది ఈ పత్రికయే అనవచ్చును. ఆ కాలమున బాల్య వివాహములు ఎక్కువగా జరిగెడివి. వాటిని నిరసించుచు బాల్యవివాహాల నష్టము గురించి హిందూసుందరిలో వ్రాసెడివారు. వీరేశలింగం పంతులుగారి ధర్మపత్నిఅయిన రాజ్యలక్ష్మమ్మగారు ఈశ్వరభక్తిపైన వ్యాసములు వ్రాసెడివారు. స్త్రీ విద్య, విజయవార్తలు, పతివ్రతా ధర్మములు, కుట్టుపనులు, చంటిపిల్లలను పెంచు విధము, తీరిక సమయములలో పాడుకొనుటకు అనుకూలమగు పాటలు మున్నగు ఎన్నో విషయములు హిందూ సుందరిలో ప్రచురింపబడి ఈనాటివారికి మార్గదర్శకములైనవి. 1913 లో బాలాంత్రపు శేషమ్మగారు కూడ ఈ పత్రిక నిర్వహణాధికారమును చేపట్టిరి. పత్రిక నిర్వహణ కత్తిమీద సామువలె ఉన్నరోజుల్లో హిందూ సుందరి నిలిచి పోయినది.[1]

సావిత్రి : కోస్తా జిల్లాలలోని స్త్రీ విద్యా ఉద్యమములకు బలము చేకూర్చుచు 1904, జనవరిలో కాకినాడలో సావిత్రి పత్రికను ప్రచురించినారు. పత్రికాధిపురాలు పులుగుర్త లక్ష్మీనరసమాంబగారు. సావిత్రీ ముద్రాక్షరశాల నుండి ఈ పత్రిక శ్రీ పులుగుర్త వెంకటరత్నముగారిచేత ప్రచురించబడినది. ఈ పత్రికయందు స్త్రీల కత్యంత ఉపయుక్తములైన ప్రకృతి శాస్త్రము మొద లగు ఒకటి, రెండు వ్యాసములు పురుషులచేత వ్రాయింపబడినను, తక్కిన విషయములన్నియు స్త్రీజన లిఖితములే. పిల్లలు, పెద్దలను భేదము లేక జ్ఞానధన మార్జింపదలచినవారు ఈ పత్రికను చదువుచుండిరి. ప్రతి మాసము సులభమైన తెలుగున పతివ్రతా ధర్మములు, సంసార ధర్మములు, ప్రకృతి శాస్త్రాదులు, దైవ ప్రార్థనలు, మంచి పాటలు, కుట్టు పనులు, నీతి విషయములు, సాహిత్య

1. వనితాజ్యోతి - నవంబరు, 1982 పుట, 36-37.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పిపాసను పెంచి పద్యములు వ్రాయుటకు అనేక సమస్యలు మొదలగునవి యిచ్చెడివారు. ఆడవారి పేర్లతో మగవారు వ్రాయుటను ఈ పత్రికయందు గర్హించెడివారు. భార్యల పేరును పెట్టి, శిష్యురాండ్ర పేర్లను పెట్టి వ్రాయువారిని విమర్శించెడివారు. ఈ పత్రిక ధారావాహిక నాటకములు, గార్గి, మైత్రేయి, సులభ, కళావతి, వేదవతి మొదలగు హిందూ స్త్రీలను గూర్చి ప్రచురించెను. స్త్రీల వ్యాధులు, స్వభావాలు, చికిత్సల గురించి అతి విపులముగా ఈ పత్రికయందు చర్చించుచు, ప్రతి నెలకు నందగిరి త్రియంబకరావుగారు వ్రాసెడివారు. ఈ పత్రిక యందు స్త్రీ హితముకొరకు ప్రచురించిన విషయములు చాలా కలవు. రానురాను ఈ పత్రిక కూడ ఆగిపోయినది. ఈ పత్రికను నిర్వహించినట్టి లక్ష్మీ నరసమాంబగారు మంచి పేరుగాంచిరి.[1]

వివేకవతి : ఆ రోజులలో కాకినాడ, గుంటూరు, శ్రీకాకుళము కేంద్రాలుగా క్రైస్తవ మత ప్రచారకులు నడుముకట్టి విద్యావ్యాప్తి చేయుచుండిరి. ఆ సమయము నందే శ్రీకాకుళం 'ఆర్చి బాల్డ్' కన్య సంపాదకత్వం వహించిన వివేకవతి పత్రిక 1909 అక్టోబరులో వెలువడినది. 'రంగవనమ్ అమ్మాళ్' అను మహిళ ఈ పత్రిక సంపాదకత్వం వహించినట్లు కూడా చెప్పుదురు.[2] ఈ పత్రికా నిర్వహణ సంఘములో ఎక్కువగా దొరలు, దొరసానులే ఉన్నారు. ప్రముఖ విద్యాసంస్థల లోనివారు, ఆసుపత్రులలోని ప్రముఖులు ఈ సంఘ సభ్యులుగా మారుచుండెడి వారు. 'గుణవతి యగు స్త్రీ ముత్యముకంటె అమూల్యమైనది.' అని పత్రిక సంచికలలో ప్రముఖముగా ప్రచురించెడివారు. స్త్రీలు చదువతగిన అనేక విషయము లను ఈ పత్రికలో ప్రస్తావించెడివారు. పిల్లల కొరకు ప్రత్యేక శీర్షికలు పెట్టి విజ్ఞాన విషయాలను ప్రచారము చేసినారు. విధవా వివాహములను ప్రోత్సహించుచు, విధవలైన ఎంతోమంచి దురదృష్టవంతులను లెక్కలువేసి చూపి, మేలుకొలిపినది ఈ పత్రిక.

---

1. వనితాజ్యోతి - డిసెంబరు, 1982 పుట. 62-63.
2. తెలుగులో పరిశోధన - పత్రికలు; పుట - 449.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ కాలమున 10, 15 సంవత్సరముల వయసు గల్గిన విధవలెంతో మంది యున్నట్లు ఈ పత్రిక వలన తెలియును. "సకలజన సంస్తవము నొందవలయును స్త్రీ" అని ఈ మాస పత్రిక ప్రకటించేది. పదిహేను సంవత్సరముల పాటు నడిచిన ఈ పత్రిక ఎప్పుడు నిలిచిపోయినదో తెలియదు.[1]

అనసూయ : అనసూయ పత్రిక జూలై 1914 లో ప్రారంభింపబడినది.[2] 1920 నుండి ద్వి మాస పత్రికగా వెలువడినది. కాకినాడనుండి వెలువడిన ఈ పత్రిక సంపాదకురాలు శ్రీమతి వింజమూరి వెంకట రత్నమ్మగారు.

ఈమె సీత, అనసూయ గార్ల తల్లి- దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి అక్కగారు. పిఠాపురము పండితులు శ్రీ వింజమూరి నరసింహారావుగారి భార్య. అనసూయ మామూలు పత్రిక కాదు. సమకాలికుల కవిత్వాన్ని, అలనాటి కావ్యప్రతులను, జానపదుల పాటలను, హాస్య రచనలను, అనన్య సామాన్యమైన గ్రంథ విమర్శ నలను వెలువరించిన పత్రిక. ముఖ చిత్రము రంగుల ఫోటోలతో రావడము అనసూయతోనే ప్రారంభమైనది. అన్నిటినీ మించి రాష్ట్ర వ్యాపితముగా ఏడు కేంద్రాలలో పరీక్షలు జరిపించి, వ్యాస రచనలలోనూ, శాస్త్ర రచనలలోనూ గెలుపొందిన వారికి బంగారు, వెండి పతకముల నిచ్చేదిది. తెలుగు కవయిత్రీ మణుల గురించి వంగూరి సుబ్బమ్మగారు, గుడిపూడి ఇందుమతీ దేవిగారు, కనుపర్తి వరలక్ష్మమ్మగారు మొదలగు మహిళలు వ్రాసిన వ్యాసములుండెదివి. ఆడవారికి వలసిన ఎన్నో సంగతులను ముద్రించవలయునని అనసూయ ప్రయ త్నము చేసినది. "ఆర్యులు చెప్పినవన్నియు పవిత్రములని మూఢ విశ్వాసము లుండరాదు" అని ఈ పత్రిక చాటినది. ఇతర భాషలలో స్త్రీలకు, ఎన్నో పత్రికలున్నను తెలుగులో స్త్రీల పత్రికలు తక్కువగా నున్నవని పత్రికాధిపురాలు వ్రాసికొన్నారు.[3]

---

1. వనితా జ్యోతి ఏప్రిల్, 1983 - పుట - 61.
2. తెలుగులో పరిశోధన పుట - 439.
3. వనితా జ్యోతి (జనవరి, 1983) పుట - 50.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రలక్ష్మి: "విద్యావిహీనులై యున్న స్త్రీలను ఇంటియందు విద్యావంతులను చేయవలయును. వారి మనసుకు వికాసము కలిగించవలయును. విష బీజములను నాట కూడదు. సంసారములను ఆనందముగా గడుపుకొను ధైర్యము, ధర్మ సూక్ష్మములను బోధింపవలయును. జాతీయ భావములను పెంపొందించ వలయును. పాశ్చాత్యుల భావాలు, స్త్రీలపై ప్రసరింపకుండా అరికట్టవలయును" అను అభిప్రాయముతో ఆనాటి స్త్రీల పత్రికలు వెలువడినవి. వానిలో ఆంధ్రలక్ష్మి యొకటి. జాతీయ విద్యాభావ[illegible] గంజాం జిల్లా యందలి బరంపురం నుండి ఈ ఆంధ్రలక్ష్మి మాస పత్రిక 1921 డిసెంబరులో వెలువడినది. ఈ పత్రిక సంపాదకత్వమున కూడ మహిళ యొక్క ఆధిపత్యముననే నడిచినది. కళ్లేపల్లె వెంకట రమణమ్మ గారు దీనికి సంపాదకురాలు. "విద్యావంతులు చేయు పలు ప్రయత్నాలలో పత్రికా నిర్వహణ మొకటని నమ్మిన వనితా రత్నము వెంకటరమణమ్మ గారు. దేశపు హీన దశకు, ఆశాభంగానికి కారణము స్త్రీలకు నేర్పబడుతున్న విద్యావిధానమందలి లోపమని "ఆంధ్రలక్ష్మి" అభిప్రాయము. అరువది సంవత్సరముల క్రిందటనే ఈ అభిప్రాయమును వెల్లడించిన వారు, ఎంతటి సూక్ష్మ దృష్టి, దూర దృష్టి గలవారో యోచించవచ్చును. పత్రికల వలన పాఠకుల కెంత లాభమో, నిర్వాహకుల కంత కష్టము. మొట్ట మొదట జనానా, సుందరి, సావిత్రి, అనసూయ వెలువడి క్రమక్రమముగా నిలిచిపోయినవి. అటువంటి లోపము బాపుటకు, శక్త్యానుసారముగా దేశ సేవ చేయవలయుననెడి కుతూహలముతోను, సాహసముతోడను, వెంకటరమణమ్మ గారు పూనుకొనిరి. కనుపర్తి వరలక్ష్మమ్మ గారి శారద లేఖ లిందు ప్రచురింపబడినవి. మహాలక్ష్మి పూజ పాటలు, పొడుపు కథలు, సుభాషిత రత్నావళి, శిశులాలనం మున్నగు విషయము లుండేవి. విద్యామూలకమైన మోక్షప్రాప్తి గురించి వ్రాసెడి వారు. స్త్రీల వ్రత కథలుండేవి. స్త్రీలకు స్త్రీలే ఉపాధ్యాయినులుగా ఉండవలయునని ఆంధ్రలక్ష్మి ప్రచారము చేసినది. 'దుశ్శీల' అని పేరు మోసిన కాంతలతో నెంత మాత్రము విద్య గరపరాదని ఈ పత్రిక స్త్రీలను, చెల్లెళ్ళను హెచ్చరించింది. లోపాముద్ర, సావిత్రి, మొల్ల వంటి వారి వృత్తాంతములు పాతివ్రత్యము

7975

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గురించిన వ్యాసములు, కథలు ప్రచురించెడివారు.[1] ఎక్కములు పుస్తకము సైజులో వచ్చిన ఈ పత్రిక సంప్రదాయ కుటుంబములందెంతో ఆదరణ పొందినది.[2]

పత్రిక లన్నింటి యందును ఆ నాటి సమాజ పరిస్థితులెట్లున్నవి? అని పరిశీలించి తెలిసికొనుటకు పైన పేర్కొనబడిన పత్రికలు సహకరించుచున్నవి. గృహలక్ష్మి పత్రిక ఉత్తమాభిరుచులతో వెలువడుటకు ఈ పత్రికలు పునాదిరాళ్ల వలె దోహదమొనరించినవి. ప్రస్తుత పరిశీలన "గృహలక్ష్మి స్వర్ణ కంకణ గ్రహీతలైన కవయిత్రులు, వారి కావ్యములు". కనుక ముందు గృహలక్ష్మి పత్రిక ఎట్లు వెలువడినది? మొదలగు వివరములను తెలిసికొనుటకు ముందు ఆయా పత్రికల స్వరూప స్వభావములను తెలిసికొనవలసి వచ్చినది. ఇక పత్రికా రత్నము వంటిదైన గృహలక్ష్మిని గూర్చి తెలిసికొందము.

---

1. వనితా జ్యోతి (మే, 1983) పుట-26.
2. వనితా జ్యోతి (మే, 1983) పుట-26.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గృహలక్ష్మి పత్రిక
దాని విశిష్టత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గృహలక్ష్మి

వంద సంవత్సరముల క్రితము వనితల జీవితము అంధకారబంధురమై గడచుచున్న సమయమున వారి విద్యాభ్యుదయమునకును, బాల్యవివాహములు తొలగించుటకును, కన్యాశుల్కము విరమింపచేయుటకును, మహిళల మనో బుద్ధి వికాసముల కొరకు పత్రికలను వెలువరించిరని ముందు ప్రకరణమున తెలిసికొన్నాము. మహిళాజనోద్ధరణకు పూనుకొనిన కందుకూరి వీరేశలింగముగారు మొదలుకొని, ఇతర పెద్దలవలెనే, వారి అభ్యున్నతికి పాటుపడిన మనిషి కీ.శే. డా॥ కె. యన్. కేసరిగారు. సమాజపురోగతికి, ముఖ్యముగా స్త్రీల అభివృద్ధి కొరకు పాటుపడిన వారు కనుక వీరిని గురించి తెలిసికొనవలసియున్నది.

కేసరి జీవిత వృత్తాంతము

కేసరిగారు గుంటూరు జిల్లాలోని వంగవోలు తాలూకాలో, ఆ పట్టణమునకు సమీపమున నుండెడి ఇనమన మెళ్లూరు గ్రామములో, ఒక పేద వెలనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబమున 26-4-1875 లో జన్మించినారు. వీరు జన్మించిన అయిదు మాసములకే తండ్రి కలరా వ్యాధి సంక్రమించి స్వర్గస్థుడయినాడు. తండ్రి కేవలము జంధ్యాలు వడికి సంపాదించినది తినికి సరిపోయెడిది కనుక కేసరికి తండ్రి ఆస్తి కొన్ని చిల్లర పైసలు మాత్రమే లభించినవి. కేసరి 10, 11 సంవత్సరముల పిల్లవాడగు వరకు తల్లి కష్టపడి పెంచినది. ఆమె కష్టము చూడ లేక ఒకనాడు రాత్రి ఇల్లు వదలి కాలినడకన మెల్లమెల్లగా మద్రాసు చేరినాడు. మద్రాసులో కొత్వాల్ చావడియొద్ద, రావిచెట్టుక్రింద, బ్రాహ్మణులు చేరి, పౌరోహిత్యము చేసుకొనియో, బిచ్చమెత్తుకొనియో జీవించెడివారు. కేసరికూడ వారితో చేరి ధర్మసత్రములలో ఒక పూట తిని బ్రతికేవాడు, కొన్నాళ్లకు చదువుకొనవలయునని ధ్యాసకలుగుటతో పచ్చయప్ప కాలేజీ భవనమునకు ప్రక్కన బందరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీధిలో రామానుజాచారి అనువారినాశ్రయించెను. ఆయన పిల్లలందరి యొద్ద జీతము తీసికొని పాఠములు చెప్పెడివారు కాని, కేసరి ఆయనకు శుశ్రూష యొన రించి, వారి యింటి పనులుచేసి, రామానుజాచారిగారి దయతో చదువుకొనెడివాడు. వారి యొద్దనే రుక్మిణీ కళ్యాణము, గజేంద్ర మోక్షము మొదలైన పద్య కావ్య ములు అర్థ సహితముగా చదువుకొనెను. ఎంత చదివినను తెలుగు చదువు బ్రతుకు తెరువునకు పనికిరాదని తలచి ప్రైవేటుగా ఇంగ్లీషు నేర్చుకొనెను.

తరువాత ఆంగ్ల విద్యపై శ్రద్ధ కలిగి, టంకసాల వీధిలోగల హిందూ థియలాజికల్ హైస్కూలు ప్రధానాధ్యాపకుడైన రామనాథ శివశంకర పాండ్యా గారి నాశ్రయించి పాఠశాలలో స్కాలర్‌షిప్ పొంది జీతము లేకుండా చదువుకొన సాగెను. పాండ్యాగారొకనాడు విద్యార్థుల రిజిష్టరులో పేర్లను హాజరువేయునపుడు 'కె. నరసింహం' అనగానే ఆ పేరు గల యిద్దరు బాలురు లేచినిలచిరి. ఇద్దరికీ ఒకే పేరు చిక్కుగానున్నదని, కేసరి యందుగల చనువుచే అతని పేరును కొద్దిగా మార్చిరి. 'సింహం' అను పదమునకు అర్థముగల 'కేసరి' అను పదమును చేర్చి "కోట నరకేసరి"గా మార్చినారు. అప్పటినుండి మిత్రులందరు 'నరకేసరి' అని పిలిచెడివారు. అదియే 'కె. యస్. కేసరి' అని వ్యవహార నామముగా మారినది.

పుస్తకాలకు, బట్టలకు కష్టమగుచున్న పరిస్థితిలో నరకేసరికి ఆంగ్ల విద్య చదువుట కూడ కష్టమే అయినది. ఉద్యోగము కొరకు వెదకి, వెదకి వారిని వీరిని ఆశ్రయించి అలసిపోయినాడు. ఆ దినములందే, ఆయుర్వేద విద్య నేర్చిన వైద్యుల యొద్ద శుశ్రూష చేసి శాస్త్రరీత్యా ఆ విద్య కొంత నేర్చినాడు. మహదేవ శాస్త్రి అను ప్రముఖ ఆయుర్వేద పండితుని యొద్ద చేరినాడు. అతని వద్దనున్న వైద్య గ్రంథములను చదివి, వాని రహస్యములను బోధపరచుకొని, కొన్ని మందులు తయారు చేసి వైశ్యుల ఇండ్ల యందు వైద్య మొనరించెడివాడు. ఆ విధముగా వర్తక ప్రముఖుల ఆదరణను పొందెను.

తరువాత 'కన్యకా పరమేశ్వరీ ధర్మ వైద్యశాల' యందు పండిత డి. గోపాలాచార్యులవారితోపాటు వైద్యుడుగా పని చేసినాడు. అందు గోపాలా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చార్యుల వారికీ, కేసరికీ సరిపడలేదు. కేసరిగారు తన చిన్న యింటిలోనే వైద్య వృత్తి ప్రారంభించిరి. వైద్యశాల ప్రారంభించ వలెనని ఆలోచన రాగానే, వెంటనే ఆ యింటి గోడపైన బొగ్గుతో పెద్ద పెద్ద అక్షరాలలో "కేసరీ కుటీరము ఆయుర్వేద ఔషధశాల" అని వ్రాసినారు.[1] అదే అతని అదృష్ట రేఖ ధరించిన మొదటి పేరుగల బోర్డు. అప్పటి నుండీ, ఆ వృత్తిలో ఎన్నియో కష్టములు కలిగినను, వాటి నన్నింటినీ జయించి నిలిచినాడు. చూచుచుండగానే అందులో క్రమక్రమముగా అభివృద్ధినొంది లక్షాధికారి అయినాడు. గృహస్థు అయినాడు. తన నంత శ్రీమంతునిగా నొనరించినది 'లోధ్ర' అను ఔషధరాజమే అని వారు వ్రాసికొనిరి. లోధ్ర స్త్రీల ఆరోగ్య సౌభాగ్యముల కొరకు చేయబడిన ఔషధ రాజము. దాని వలన చేకూరిన ధనమును ఆ మహానుభావుడు 'స్త్రీ ధనము'గా భావించినాడు. స్త్రీ ధనము పవిత్రమైనది. ఆ ధనమంతయు మ్రింగిన అజీర్ణము కలుగునని వారు భావించిరి.[2] ఆ యోచనతో స్త్రీల విద్యాభివృద్ధి కొరకు కేసరీ కన్యా విద్యాలయమును నిర్మించి చిరయశస్సు నందినాడు.

గృహలక్ష్మి పత్రికా ప్రారంభం

బందరు వీధిలో నున్నపుడు కేసరిగారు మందుల వ్యాపారము అభివృద్ధి చెందుటతో, ఆ యిల్లు చాలదని తలచి ఎగ్మూరులో ఒక పెద్ద భవనమును కొనిరి. అక్కడకు పోయిన తర్వాత అతని వ్యాపారము ఇంకను ఎంతో అభివృద్ధి చెందినది. అప్పుడు ఆ యింటికి సమీపమున పూనమల్లి హైరోడ్డులో ఒక పెద్ద భవనమును అద్దెకు తీసుకొని, అక్కడ మందులు చేయు ఫ్యాక్టరీని, లోధ్ర ముద్రణాలయమును స్థాపించిరి. కేసరిగారి నడివయస్సులో గాంధీ మహాత్ముడు విజయవాడకు వచ్చినాడు. జాతి చైతన్యము కొరకు మహాత్ముడొనరించిన ప్రబోధములు కేసరిగారి హృదయమునందు ముద్రితమైనవి. మహాత్ముని ఉపదేశములను వినిన

1. నా చిన్ననాటి ముచ్చట్లు. కేసరి. పుట అనుబంధము VII.
2. నా చిన్ననాటి ముచ్చట్లు. కేసరి. పుట ,, ,,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెంటనే కేసరిగారిలో క్రమముగా ఎన్నియో మార్పులు కలిగినవి. కందుకూరి వీరేశలింగము గారొనరించుచున్న 'మహిళా జనోద్ధరణ' చూచియు కేసరిగారెంతో ప్రభావితులైనారు. తాముకూడ తప్పక స్త్రీజన సేవ చేయవలయునని భావించిరి. అప్పటినుండియే స్త్రీ విద్యాభివృద్ధులకు దోహదకారియగు 'గృహలక్ష్మి' పత్రికను 1928 వ సంవత్సరమున మార్చి నెలలో ప్రారంభించినారు.

వీరికి చిత్రలేఖనము, సంగీతము, నాటకములు అన్నింటియందును అభిమానము గలదు. వీరు అనాథ బాలికలకు సేవ యొనరించి, వారిని చదివించి, వారికి తమ గృహలక్ష్మి కార్యాలయమునందు, ఔషధశాల యందు ఉద్యోగములిచ్చిరి. 'మానవసేవయే మాధవసేవ' యని తలచి, ఆ యాదర్శముతో, స్త్రీల వ్యాధులను గుర్తించి ఔషధములనొనరించి, ధనార్జన చేసి మరల సమాజ సేవకే ఆ ధనము నందించిన త్యాగశీలి కేసరిగారు. తన కొరకు, తన బంధువుల కొరకు తానే స్వయముగా గృహనిర్మాణమునకు ప్లానులు వేసి నిర్మించిరి. వీరికి గృహనిర్మాణ శిల్పము చిన్నతనమునుండియే అలవడినదట. ఆరోగ్య సూత్రముల ననుసరించి, పెద్ద పెద్ద భవనములను అందముగా కట్టుటలో వీరికి గల నేర్పును చూచి మిత్రులు గూడ వీరి సాయము కోరెడివారట. పేద కుటుంబమున జన్మించి, చిన్నతనముననే పితృహీనుడై, అష్టకష్టములు పడి పెరిగినందులకే, ఇతనికి భగవంతుడిన్ని మంచి ఆలోచనలను, అభివృద్ధికి వచ్చు ఆశయములను కల్పించెనేమో అను భావన కలుగును. "దిక్కుమాలిన వారి నుద్ధరించుట నా మతము, వారినుద్ధరించుటకై అవసరమైన నరకమునకైన వెళ్ళుట నా మతము"[1] అను వివేకానందుని సూక్తిని పాటించిన మహానుభావుడు డా. కె. యన్. కేసరిగారు.

గృహలక్ష్మి పత్రిక

స్త్రీ విద్య కొరకు కేసరిగారు మిక్కిలి పాటుపడినారనుటకు నిదర్శనము గృహలక్ష్మి పత్రిక. ఆ కాలమున వెలసిన పత్రికలన్నింటి యందును పత్రికా

1. నా చిన్ననాటి ముచ్చట్లు - డా. కె. యన్. కేసరిగారు. పుట. 185.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రత్నము గృహలక్ష్మి. గృహలక్ష్మి గురించి తెలుగు పత్రికా చరిత్రలో స్వర్ణ పత్రములపైన వ్రాయవచ్చును. ఈ పత్రికను కేసరిగారు 1928వ సంవత్సరము, మార్చి నెలలో స్థాపించినారు. ఇంచుమించు ఈ పత్రిక నలుబది సంవత్సరముల పాటు 1960 వరకు కూడ నడిచినది. భారతి మొదలగు పత్రికల ప్రాచీన వైభవాన్ని ప్రతిబింబింపచేయుచు ఈ పత్రిక నడిచినది.

అప్పుడు గృహలక్ష్మి ఒకి సంచిక ఆరు అణాలు. సంవత్సర చందా నాలుగు రూపాయలు. ఎగ్మూరు సందులి లోధ ప్రెస్‌లో ముద్రించెడివారు. ప్రారంభ సంచిక పైన గల త్రివర్ణ ముఖ చిత్రమెంతో సుందరముగా గలదు. ఎరుపు రంగు చీర, తెల్లని, చుక్కల పట్టంచు రవిక, చెవులకు సర్పిణిలు, మెడలో నాను త్రాడు మెరయుచుండగా చెక్కిట చేయి చేర్చి చూచుచు గృహలక్ష్మి ఎంతయు సుందరముగా నున్నది. ఇందు ముఖ్యముగ స్త్రీల ఆయురారోగ్యములు పెంపొందించు విషయములు చర్చింపబడినవి. శరీర మనోబలముల యందు స్త్రీలు, పురుషులకంటె తక్కువ వారు కారని నిరూపించు సంకల్పమును రూపొందించినదీ పత్రిక. మహిళలయందు కేసరిగారికి గల ఉన్నతాభిప్రాయములీ పత్రికవలన తెలియును. వారికి స్త్రీలయందు గల గౌరవాభిమానము లెంతేని హర్షణీయములు.[1]

---

1. స్వవిషయము - గృహలక్ష్మి - మార్చి, 1928.
సృష్టికి మూలాధారము స్త్రీ. గృహమునకు బెట్టని దీపమును, పురుషుని కీర్తిప్రతిష్ఠలకు మూలకందమును, సంపద కాధారమును, సంసార సాగరమునకు నావయై పురుషులను సురక్షితముగ దరిచేర్చు మహదుపకరణము స్త్రీయేగదా. సమస్త విద్యల కాధారమై యలరారు దేవతామ తల్లిని సరస్వతీదేవి యనుచున్నాము. దరిద్ర దేవతను పారదరిమి సమస్త సౌభాగ్యము లొసంగు మహా శక్తిని లక్ష్మీదేవి యని పిలుచుచున్నాము. మన మొనర్చు సమస్త పాపములను భరించి, క్షమించి మన కన్నపానాదు లొసంగి యంకమునందిడుకొని యత్యంత గారాబమున పెంచు మహా తల్లిని భూదేవి యనుచున్నాము. సమస్త లోక పావని యగు గంగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొణకా కనకమ్మగారు శేషమ్మగారు, కంచనపల్లి కనకాంబగారు, రాపూరు సుబ్బమ్మగారు, దుర్గాబాయి, కమలావతి, చిల్కపాటి సీతాంబగారు, కనుపర్తి వరలక్ష్మమ్మగారు మొదలగువారు ప్రతి నెలయందును, ఏదో ఒక రచన పద్య రూపమునకో, వ్యాసరూపమునకో రచించెడివారు. ఆ రోజులందు ఈ పత్రిక మూడు వేలమంది చందాదారులలో నడచినది. సనాతన హిందూసంప్రదాయాన్ని పాటిస్తూ, ఆంగ్ల విద్యాప్రభావముతో వచ్చిన సంస్కార దృష్టినికూడా ఆచరించి నదీ పత్రిక. కేవలము వ్రత కథలు, పాటలేకాక శాస్త్రీయమైన విషయాలు, ఇంటిల్లిపాటికి ఆసక్తి కల్గించువానిని నిశితంగా పరామర్శించి ఇందు ప్రచురించి నారు. కేసరిగారి మంచి అభిప్రాయమునకు తోడు, ఆ దినములలో మంచి ముద్రణ కాగితాలు, ధనము, సహృదయుల సహకార ప్రోత్సాహము అన్నీ కలసివచ్చినవి. ఆధునిక కాలమున వచ్చు మహిళా పత్రికలకు గృహలక్ష్మి ఆదర్శప్రాయమైనది. పత్రిక ఆరంభించిన సంవత్సరములోనే పత్రికాభివృద్ధి ఎట్లు సాగినదో, రెండవ సంవత్సరపు సంచికలో తమ అభిప్రాయమును "స్వవిషయము" అను పేరున గల సంపాదకీయమున తెలిపినారు.[1]

భవానియు, యమునా సరస్వతులును స్త్రీ జాతులే కదా. సర్వాభీష్ట ప్రదాయిని యగు కామధేనువు స్త్రీ జాతి కాదా. సమస్త జీవరాసుల నానంద సాగరమున ముంచు చంద్రుడును, మంగళకరమగు మహర్దశ నిచ్చు శుక్రుడును స్త్రీ గ్రహములు. సంస్కృత భాషయందు 'సీతారామ', 'లక్ష్మీనారాయణ', 'మాలతీమాధవ' యను ద్వంద్వ సమాసములలో స్త్రీ వాచక శబ్దము ముందుపయోగింపబడుట యందు మహత్తర భావ మిమిడి యుండలేదా. వీనినిబట్టి యార్యులకు స్త్రీ జాతియందు గల గౌరవా భిమానములు తేటబడుచున్నవి. వేదములలో స్త్రీలు సమాన స్థాన ముల నాక్రమించి సమముగ నభివృద్ధి నొందుచు సమస్త కార్యములయందు సమముగ బాల్గొనుచుండినటుల స్పష్టపడుచున్నది.

1. స్వవిషయము - గృహలక్ష్మి - మార్చి, 1929 సంచిక. గృహలక్ష్మికొక వత్సరము గడిచినది. ఒక మాసము కన్న, ఇంకొక మాసమున

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంపాదకీయ వ్యాసములలో కేసరిగారు తరచు తమ పత్రిక ఏవిధముగా నడచుచున్నదో, ఏ విధముగా నడపాలని అనుకున్నారో, ఎప్పటికప్పుడు విమర్శించుకొనేవారు. మహిళల ఆరోగ్యమునకు శ్రమించిన మంచి వైద్యుడైన కేసరిగారి ఇంట పెరిగిన ఈ బాలిక ఆరోగ్య, యౌవనములను పుంజుకొని వర్ధిల్లినది. స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ స్వాతంత్ర్యము కొరకు, విద్యాభివృద్ధికి, వారి హక్కులను కాపాడుటకు, సంఘ దురాచారములను రూపుమాపుటకు గృహలక్ష్మి యందు చక్కని చర్చలు సాగినవి. స్త్రీజనపరముగా నేదైన హానికరముగ పరిణమించి

యెక్కడు కళలతో వెలువడుచు వచ్చినది. ఆంధ్ర సోదరీమణుల యాదరణమున కెంతయు పాత్రమై యే ఆశయములతో ప్రారంభింపబడినదో ఆ యాశయములను చాలవరకు నెరవేర్పగలిగినది. ఆంధ్రమున స్త్రీలకై ప్రత్యేకముగా ప్రచురింపబడుచున్న పత్రికలేని కారణముననే మేమీ గృహలక్ష్మి ప్రచురణమునకు గడంగియుంటిమని చదువరు లెరుంగుదురు. స్త్రీల యొక్క ఆరోగ్యము, విద్య, సద్వర్తన, గృహ నిర్వాహణము, ఇవి ఎప్పుడభివృద్ధి నంది సక్రమమార్గమున బడునో, అప్పుడే జాతియు, దేశమును బాగు పడగలవు. ఆదిని స్త్రీలయందు విద్య తక్కువగ నున్నది. చదువుకొనిన వారలలోకూడా చాలామంది ప్రాథమిక విద్యలతోడనే విద్యల ముగించి యుండిరి. ఆ కారణమున అట్టి సోదరీమణుల కున్నతసందేశముల నందజేయ, వలయుననిన లలిత పద భూయిష్టమై, సులభగ్రాహ్యమైన పత్రిక యవసరము. ఆంధ్ర సోదరీమణులు పెక్కుమంది చందాదారులుగ జేరి, వలయునంత ప్రోత్సాహమొసగి యున్నందులకు వారలు వందనీయులు.

"గతవత్సరపు పంట ఘనమైనదైన,
ఆలరంగవలె నంతక ధికమీయేట- —సంపాదకుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నట్లు తెలిసినపుడు, వానిని యేమరుపాటులేక నిర్మొగమాటముగ ఖండించి నారీ లోకానికి అండగా నిలిచినది గృహలక్ష్మి.

ఆ రోజులలోనే క్రొత్తగా చిత్రములు విడుదలైనవి. సినిమా కబుర్లు, సెట్లోని విశేషములు, సమీక్షలు ఈ పత్రికయందు కలవు. కొన్ని పూర్తి పేజీ, నిడివి సమీక్షలు, కొన్ని చిత్రాలపై క్లుప్తమైన సమీక్షలు వచ్చెడివి.

అనేక పత్రికలలో పడిన విశేషాలను "పుష్పచయం" అని వేసెడివారు. "చలివేంద్రం" ముచ్చట్లు అని కబుర్లు చేర్చెడివారు. బాలవిజ్ఞాన శాఖలో చిన్న చిన్న పిల్లల పాటలు, హాస్యప్రసంగములు, చిన్నచిన్న కథలు వేసెడివారు. డాక్టరు యస్. శేషగిరి రావు గారు వ్యాధులనుబట్టి ఆరోగ్య సూత్రములను వ్రాసెడివారు. వానికి తగిన మందులు కూడ వ్రాసేవారు.

గృహలక్ష్మి పత్రికలలో అనేక త్రివర్ణ చిత్రాలు కలవు. పూలమాల, పరధ్యానం, నీళ్ల తెచ్చుకొనే పడుచులు, నవవర్ష, పద్మినీ వల్లభుడు, చిత్రాంగి, మాతృదేవత, శారద, ప్రతీక్షణము, ఆనందమయి మొదలగు ఎన్నో త్రివర్ణ చిత్రాలు ఈ పత్రికలందు గలవు. ప్రాచీన చిత్రకళారీతులను, విశేషములను తెలిసికొనగోరువారికి పత్రికల యందలి చిత్రము లెంతో సహకరించును. గృహలక్ష్మి పత్రికలో రత్నాల కమలాబాయిగారి వంటి చిత్ర కళారత్నాలు గీచిన చిత్రములున్నవి. ఈ త్రివర్ణ చిత్రములు ముద్రించుటకు, ఒక్కొక్కదానికి నూరు రూపాయలకు పైగా బ్లాకులకు పట్టెడివట. అయినను ఎంతో శ్రమకోర్చి, కేసరి గారు గృహలక్ష్మి పత్రికను నడిపినారు.

తెలుగునాటనూ, తమిళదేశంలోను ఉన్న, ఆంధ్ర రచయితలు, రచయిత్రులు, ఏదో ఒక సంచికలో తమ రచనలు ప్రచురించినారు. శేషాద్రి రమణ కవులు, అడవి బాపిరాజు గారి వంటివారు కూడ ఈ పత్రికలలో ప్రత్యేక వ్యాసములు వ్రాసినారు. గృహలక్ష్మి ప్రారంభ సంచిక నుండి కూడ 'శారద లేఖలు' పత్రికకు అలంకారముగా రచింపబడినవి. మాతాశిశు సంరక్షణ, పుత్రపుత్రికా భేదము వంటి వ్యాసములు స్త్రీలకొరకు వ్రాయబడినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్ని రంగముల యందును కీర్తినొందిన దేశ, విదేశ నారీమణుల ఛాయా చిత్రములను అందముగా ముద్రించినారు. నారీమణుల ఛాయా చిత్రములను వేసి వారిని గురించి క్లుప్తముగా వ్రాసెడివారు. గుమ్మడిదల దుర్గాబాయమ్మ, పొణకా కనకమ్మ, రత్నాల కమలాబాయి మొదలగు వారెందరో మహిళల ఛాయా చిత్రములు, వారి పరిచయము కలదు. ఆనాటి ఛాయాచిత్రణా విధానమెట్లుండెనో తెలిసికొనుటకు ఈనాటి వారికి ఈ ఛాయాచిత్రములు సహకరించుచున్నవి.

మహిళల బుద్ధివికాసమునకు, ఆరోగ్యరక్షణకు వెలసిన ఈ పత్రికయందు చక్కని గ్రంథములను విమర్శించెడివారు. గ్రంథపరిచయము చేసెడివారు. ఉదాహరణకు 'వేప' అను గ్రంథ పరిచయమొకటి ఒసగుచున్నాను. వేపయను గ్రంథము డా. కె. యస్. కేసరిగారు వ్రాసిన 48 పుటల వైద్య గ్రంథము. ఈ గ్రంథపరిచయము గృహలక్ష్మి యందు చక్కగా కలదు.[1]

కేసరి గారు చాల గ్రంథములను వ్రాసిరి. 'కాంతాజనకల్ప భూరుహము' అను గ్రంథము కూడా స్త్రీలకు ఉపయోగకరమైనది. అంతేకాక, వీరు కేసరి కుటీరమునందొనరించిన లోధ్ర, అర్క, అమృత, నారాయణ తైలము, మాదీఫల రసాయనము మొదలగు ఔషధ రాజముల ప్రచారములీ పత్రికలలో నుండెడివి. ఆ ఔషధములు, ఆనాటినుండి నేటివరకు కూడ ఎంతో ప్రసిద్ధినొంది, బహుళ

---

1. వేపచెట్టుయొక్క గాలి, ఆకు, చిగురు, పూవు, పండు, గింజ, చెక్క మొదలగువాని యన్నిటివలన మానవ దేహమునకెట్టి ఆరోగ్యము కలుగునో ఇందు వివరింపబడినది. గజ్జి, పుండు, జ్వరము, ఆటలమ్మ, మహాచికము, తామర, కుష్ఠు మొదలగునవన్నియు వేపయొక్క ఉపయోగమున కుదర గలవు. డాక్టరుగారు బహుగ్రంథములను చదివి, తమ స్వానుభవమును మిళితము చేసి, వేపనూనె, వేప గుల్కందు, వేపలేహ్యం, వేపషర్బతు, వేపసబ్బు మొదలగు సౌరభయుక్తమైన ఔషధములను తయారుచేయు రీతులిందు తెలిపినారు.

- గృహలక్ష్మి - సంపు - 1934 ఆగష్టు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జనోపయోగకరములై యున్నవి. ఈ ఔషధములు కేవల ప్రచారకములైనవిగాక నిజమైన ఔషధరాజములు.

ఎక్కువ భాగము రచనలు, కథలు, కవితలు, నవలలు, పల్లెపదాలు, బాలగేయాలు ఇంకనెన్నియో విశేషములిందు గలవు. ఎన్నివిధములుగా పరిశీలించినను గృహలక్ష్మి వనితా పత్రికలయందు తలమానికము వంటిదని చెప్ప వచ్చును.

సారస్వత సన్మానములు

కళారంగములలో కృషి యొనరించిన వారికి, బహుమతులనిచ్చి సన్మానించుట అనాదిగా వచ్చుచున్న ఆచారము. అట్లే సాహిత్య రంగములో నిష్ణాతులై, కీర్తినొందిన కవులు, కవయిత్రులు కూడ నాటినుండి రాజమర్యాదల నందినారు.

రాజులచేత గౌరవింపబడిన వారిలో ప్రముఖుడు శ్రీనాథుడు. దక్షిణాధీశుని ముత్యాలశాలలో దీనారటంకాలతో తీర్థమాడి, ఆంధ్ర సరస్వతికి యశస్సు కూర్చినాడు. ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన మనుచరిత్ర కావ్యమును రచించి రాయలచే ఘన సన్మాన మందినాడు. సాహిత్య సమరాంగణ చక్రవర్తియైన రాయలు స్వయముగా కవి గండపెండేరమును పెద్దన కాలికి ముద్దుముద్దుగా తొడిగి గౌరవించినాడు. దక్షిణాంధ్ర రాజులలో ప్రముఖుడైన తంజావూరు నాయకరాజు రఘునాథ నాయకుడు. ఇతడు సుమారు వంద గ్రంథములు రచించెనట. రఘునాథుడు యామద్వయమున పారిజాతాపహరణ కావ్యమును చెప్పి తండ్రిచే కనకాభిషేక గౌరవమును పొందినాడు.[1] రఘునాథనాయకుని కుమారుడగు విజయరాఘవుని ఆస్థాన కవయిత్రి రంగాజమ్మను విజయరాఘవుడు కనకాభిషేక మొనరించినాడు.

ప్రతి కవిని, కవయిత్రిని, చందన తాంబూలాదులతో, తగిన బహుమతులతో సత్కరించినారు నాటి రాజులు. తరువాత ఆధునిక కాలమున కూడ కవు

1. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము - దివాకర్ల వెంకటావధాని - పుట-62.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లెందరో, జమీందారుల ఆస్థానములయందు మన్ననలందినారు. ప్రముఖ కవులు తిరుపతి వెంకట కవులు నానారాజ సందర్శన మొనరించి, వారిచే సన్మానింప బడినారు. ఇట్లు సన్మానములు, ప్రశంసలు, బహుమతులు పూర్వకాలము నుండియు సాగుచునే యున్నవి.

కేసరిగారు కూడ గృహలక్ష్మి స్వర్ణ కంకణముచేత మహిళలను నిరంతరముగా సన్మానించినారు. ప్రతి వత్సరము జరుగు వారి చిహ్నమగు స్వర్ణ కంకణము, వారు కీర్తిశేషులైనా కూడ, నేటికిని, ప్రతియేటా మహిళల హస్త కమలముల నలంకరించుచు, డా॥ కె. యస్. కేసరిగారి పేరును కీర్తి పథము నందు నిల్పినది.

బహుమతుల ప్రారంభం

స్త్రీ విద్యా వికాసములకై యింతటి కృషి చేసిన డా. కె. యస్. కేసరి గారు పత్రిక నెలకొల్పుటతోనే తమ పని ముగిసినదని కూర్చొనలేదు. చక్కని రచనలొనరించిన మహిళామణులకు బహుమతులనిచ్చుచు వారిలోని ప్రతిభా సక్తులను మరింత పెంపొందించిరి.

వీరికంటె ముందు వీరేశలింగము పంతులుగారు బహుమతీ ప్రదానమును ప్రవేశ మొనరించి పురుషులను ప్రోత్సహించిరి. 1893 వ సంవత్సరమున తెలుగు భాషలో వచన ప్రబంధములు రచించుటను ప్రోత్సహించు నిమిత్తము చింతామణి పత్రిక ద్వారా బహుమతుల నేర్పరచినారు. ప్రప్రథమమున ఏర్పాటుచేసిన ఈ పోటీయందు ప్రథమ బహుమానము డెబ్బదియైదు రూపాయలుగాను, ద్వితీయ బహుమానము యేబది రూపాయలుగాను ఈ చింతామణి పత్రిక సంపాదకులైన శ్రీ న్యాయపతి సుబ్బారావుగా రేర్పరచినారు. బహుమాన ధనము స్వల్పముగా నుండుటవలన మంచి నవలలు రాలేదని అభిప్రాయపడి సుబ్బారావు పంతులుగారు మరుసటి సంవత్సరము నుండి ప్రథమగణ్యమైన నవలకు నూటయిరువదియైదు రూపాయలు, ద్వితీయముగ గణింపబడినదానికి డెబ్బదియైదు రూపాయలు బహుమానము నిచ్చునట్లు ప్రకటించిరి. ఇట్లు ప్రారంభమైన, ఈ బహుమతుల పద్ధతి స్త్రీల పత్రికలకు కూడ వ్యాపించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మన సంస్కృతి కెటువంటి నష్టము వాటిల్లకుండా సమాజము సంఘవి వృత్తులలో అన్యోన్యమైత్రిని, వ్యక్తిత్వ గౌరవమును కలిగించుటకు పత్రికలు పాటుపడినవి. కవులను, కవయిత్రులను, రచయిత్రులను మన్నించినవి. సంపాదకులు స్త్రీలకు పరీక్షల నేర్పాటుచేసి, ఉత్తీర్ణులైన వారికి వెండి, బంగారు పతకముల నొసగెడివారు. అనసూయ పత్రికయందు స్త్రీల పరీక్షల నేర్పాటొనరించి వెండి, బంగారు పతకముల నొసగెడివారు. పత్రికలతోపాటు కవులను మన్నించుటకు కొన్ని సమాజములు కూడ సేవ యొనరించినవి. అట్టివానిలో నెల్లూరు వర్ధమాన సమాజమువారు మహిళారత్నములను ఏటేట మన్నించుచుండిరి. గృహలక్ష్మి పత్రికవారు కూడ ప్రతి వత్సరము "స్వర్ణపతకము" నిచ్చి మహిళలను గౌరవించెడివారు. క్రమముగా ఈ 'స్వర్ణపతకము' రూపములో మార్పును పొంది స్వర్ణ కంకణముగా మారినది.

స్వర్ణ కంకణ ప్రదానము

నెల్లూరు పట్టణములో 11-3-34 న శ్రీ తిక్కన జయంతి ఉత్సవానుబంధముగా జరిగిన గృహలక్ష్మి స్వర్ణకంకణ బహూకరణోత్సవము కూడ వైభవముగా జరిగినది. ప్రప్రథమమున ఇందు సన్మానింపబడిన సతీరత్నము శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు. దేశహితమునకై ఆంధ్ర దేశమున గల మహిళల అభివృద్ధికి పాటు పడిన ఈ పత్రిక నిర్వహించిన ఈ బహుమతి ప్రదానమును పలువురు ప్రశంసించిరి.[1] అట్లు ప్రారంభమైన సువర్ణకంకణ ప్రదానము ఈ నాటికీ జరుగుచునే యున్నది. స్త్రీజన హితాభిలాషి, మహిళా బంధువైన కేసరిగారు 8-6-1953లో మరణించిరి. గృహలక్ష్మి పత్రిక ఆగిపోయినది.

---

1. దేశహితమునకై గృహిణుల అభిమాన పాత్రమై పాటుపడు గృహలక్ష్మి నామమును, నూటపదార్లు విలువయు, ఈ సన్మానమున కర్హతగల గ్రంథము యొక్క ప్రకటనయు నీ బహుమానమున, అంతర్భూతములు. గృహలక్ష్మి యందు వ్రాయుటకును, ఈ బహుమానమునకును ఎట్టి సంబంధము లేదు అని వర్ధమానసమాజ కార్యదర్శిగారు సభవారికి నివేదించిరి.

గృహలక్ష్మి ఏప్రిల్, 1934. పుట-90.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అయినను 'కంకణప్రదానము' మాత్రము కొనసాగుచు, రచయిత్రుల హస్తముల నలంకరించుచు. ఝణ ఝణమను సారస్వత నాదమును వినిపించుచునే యున్నం దులకు మనము గర్వింపవచ్చును.

కేసరి గారి ప్రోత్సాహముతో స్వర్ణకంకణమును పొందినవారిలో కవయిత్రులు, సంఘసేవికలు, రచయిత్రులు మున్నగు వారెందరో అర్హులైన మహిళామణులు కలరు. అందరి యందును ప్రథమ మహిళ కనుపర్తి వరలక్ష్మమ్మగారు.

బహుమతి గ్రహీతలైన వారి పేర్లు :

1. కనుపర్తి వరలక్ష్మమ్మగారు (1934)
2. కవికలహంసి చిల్కపాటి సీతాంబగారు (1935)
3. కాంచనపల్లి కనకాంబగారు (1936)
4. పులవర్తి కమలావతీ దేవిగారు (1937)
5. బాలాంత్రపు శేషమ్మగారు (1938)
   రత్నాల కమలాబాయి (1938)
6. చేబ్రోలు సరస్వతీ దేవిగారు (1939)
   వి. రాధామనోరి (1939)
7. బత్తుల కామాక్షమ్మగారు (1941)

1938, 39 లలో ఆ సంవత్సరము మామూలుగా ఇచ్చే గృహలక్ష్మి కంకణాలతోపాటు. రత్నాల కమలాబాయిగారికి, వి. రాధామనోరిలకు కూడ ప్రత్యేక కంకణాలు ఇచ్చినారు.

రెండవ ప్రపంచ యుద్ధ సందర్భముగా 1942 నుండి 1947 సంవత్సరము వరకు పత్రిక ఆగిపోయినది. స్వర్ణ కంకణ ప్రదానము కూడ జరుగలేదు. మరల 1948 నుండి కంకణ ప్రదానము జరిగినది.

8. ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు (1948)
9. బెంగుళూరు నాగరత్నమ్మగారు (1949)
10. గిడుగు లక్ష్మీకాంతమ్మగారు (1951)
11. స్థానాపతి రుక్మిణమ్మగారు (1952)
12. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు (1953)
13. పొణకా కనకమ్మగారు (1955)

1954 వ సంవత్సరమున డాక్టరు కె. యన్. కేసరిగారి మరణము తీరని లోటు కల్గించినది. ఆ సంవత్సరము కంకణ ప్రదానము గావింపబడలేదు. తరువాత వారి చిహ్నముగా నేవేవరకు సాగుచునే యున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

14. కొమ్మూరి పద్మావతీదేవిగారు (1956)
15. కె. రామలక్ష్మిగారు (1957)
16. దేశిరాజు భారతీదేవిగారు (1958)
17. గుడిపూడి ఇందుమతీదేవిగారు (1959)
18. కె. చంద్రమతీదేవిగారు (1960)
19. ఎ. కనకదుర్గా రామచంద్రన్ గారు (1961)

1962, 63 సంవత్సరములలో అవార్డు లివ్వబడలేదు.

20. ఇల్లిందల సరస్వతీ దేవిగారు (1964)
21. డా॥ తెన్నేటి హేమలతగారు (1965)
22. ద్వివేదుల విశాలాక్షీ దేవిగారు (1966)
23. కోడూరి కౌసల్యా దేవిగారు (1967)
24. ముప్పాళ రంగనాయకమ్మగారు (1968)
25. యద్దనపూడి సులోచనారాణిగారు (1969)
26. ఐ. వి. ఎస్. అచ్యుతవల్లిగారు (1970)
27. డి. కామేశ్వరి (1971)
28. డా॥ సి. ఆనందారామం (1972)
29. కోడూరి లీలావతీదేవిగారు (1974)
30. ద్వారక పార్థసారథిగారు (1975)
31. వాసిరెడ్డి సీతాదేవిగారు (1976)
32. గుళ్ళపల్లి సుందరమ్మగారు (1977)
33. మాదిరెడ్డి సులోచనగారు (1978)
34. డా॥ నాయని కృష్ణకుమారి (1979)

1980, 81 లో కంకణ ప్రదానము గావింపబడలేదు.

35. తురగా జానకీరాణిగారు (1982)

1983 లో ఇవ్వబడలేదు.

36. అవసరాల (వింజమూరి) అనసూయదేవిగారు (1984)
37. కె. వరలక్ష్మిగారు (1986)

ఇప్పటివరకు స్వర్ణ కంకణ గ్రహీతలైనవారి పేర్లు సేకరించబడినవి. వీరిలో "కవయిత్రులు, వారి కావ్యములు" అను విషయముపై నేను పరిశోధన చేయుచున్నాను. ముందు ప్రకరణమునుండి వారి కావ్య పరిశీలనముండును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గృహలక్ష్మి

స్వర్ణ కంకణ

గ్రహీతలైన

కవయిత్రులు

వారి కావ్యములు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కనుపర్తి వరలక్ష్మమ్మ

(1934)

శ్రీ కేసరిగారు మహిళలను గౌరవించుటకేర్పరచిన స్వర్ణ కంకణ గ్రహీతలలో మొదటి మహిళ కనుపర్తి వరలక్ష్మమ్మగారు.

నెల్లూరు పట్టణములో 11-3-34న శ్రీ తిక్కన జయంతి ఉత్సవానుబంధముగా జరిగిన, గృహలక్ష్మి స్వర్ణకంకణ మహోత్సవము కూడ అత్యంత వైభవముగా జరిగినది. ప్రప్రథమమున నిందు సన్మానింపబడిన గౌరవము శ్రీమతి వరలక్ష్మమ్మగారికే దక్కినది. ఆనాటి సభయందు అగ్రాసనమునలంకరించిన మహిళ శ్రీమతి తెలికచర్ల వసుంధరాదేవిగారు. గృహలక్ష్మియందు శ్రీమతి వరలక్ష్మమ్మగారు శారద లేఖలను పేర మహోపన్యాసములను వ్రాసి, ఆంధ్ర మహిళా లోకమునకొనరించిన సేవ ఎనలేనిది. కేసరిగారు శారద లేఖలన్నింటిని ఉచితముగా ప్రకటించి అవి వేయి ప్రతులును, ఆ దినములలో నూటపదహార్లు విలువచేయు స్వర్ణకంకణమును సమర్పించి కవయిత్రిని గౌరవించిరి. వరలక్ష్మమ్మగారు 'శారదలేఖ'లను తనకు పితృతుల్యులైన కేసరిగారికే అంకిత మొనరించినది. అంతకుముందు కేసరిగారేర్పరచిన వ్యాసరచన పోటి పరీక్షలలో స్త్రీ అబల కాదు అను వ్యాసము వ్రాసి గెలుపొంది కేసరీ నామకమగు స్వర్ణపతకమును కూడ వరలక్ష్మమ్మగారు చిన్నతనముననే పొందినది. మహిళాలోకమునకు వన్నె తెచ్చిన ఈ కవయిత్రి జన్మదాతలు పాలపర్తి శేషయ్యగారు, హనుమాయమ్మగారు. శ్రీ కనుపర్తి హనుమంతరావుగారు ఈమె భర్త. బాపట్ల నివాస స్థానము.

స్త్రీ విద్యయందు వ్యతిరేక భావముండిన ఆ దినములందు వరలక్ష్మమ్మగారు తన సోదరుల ప్రోత్సాహముతో విద్యావిజ్ఞానములను బడసినదే గాక, సంఘ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున కెంతో సేవ యొనరించినారు. హిందీ భాషయందు వీరికి అభిమానము మెండు. కాంగ్రెసు సభలలో కూడ పాల్గొని దేశ సేవ యొనరించినారు. 'మా చెట్టు నీడ ముచ్చట్లు' అను శీర్షిక క్రింద 'ఏలాదేవి' అను కలము పేరుతో మహిళా ప్రబోధకరమైన వ్యాసములు వ్రాసెడివారు. మదరాసు, నెల్లూరు, కర్నూలు, విశాఖ పట్టణము, గుంటూరు జిల్లాలవారగు అయిదుగురు ముత్తైదువులు విజయవాడలో కాపురముండి ఆ యింటి ఆవరణలోని నారింజ చెట్టు క్రింద కూర్చుని తమ తమ ప్రాంతీయ యాసలతో వివిధ విషయాలను చర్చించినట్లు రచనచేసినారు. దేశ స్వాతంత్ర్యము కొరకు వారు పడిన ఆవేదన, తెలుగునాడు సమైక్యత కావాలనే ఆరాటము ఆ ముచ్చట్లలో ఉండేవి.

వరలక్ష్మమ్మగారు రచయిత్రి మాత్రమేకాదు, మంచి వక్త కూడా. సంఘ సంస్కరణాభిలాషిణియైన ఈమె ముతకఖద్దరు చీర మాత్రమే ధరించి తన దేశాభిమానమును వ్యక్తపరచినది. ధర్మము, నీతి, మతము సత్శ్రేయము. అనునవి వరలక్ష్మమ్మగారి ఆశయములు. వరలక్ష్మమ్మగారు పుట్టిన ఊరూ మెట్టిన ఊరూ బాపట్లనే. ఆంధ్రోద్యమాలకు పుట్టినిల్లైన బాపట్లలో వరలక్ష్మమ్మ గారు దేశాభిమానముతో 1931 లో స్త్రీ హితైషిణీ మండలి స్థాపించినది. ఇరువది సంవత్సరాలపాటు కార్యదర్శినిగా, పనిచేసి, మండలికి 1942లో శాశ్వత భవనము నిర్మించి, గ్రంథాలయమూ, కుట్టు, సంగీతము, హిందీ క్లాసులు నడిపినారు. మండలిలో ప్రతి శనివారం భజనలు చేయించెడివారు.

బహుముఖ ప్రజ్ఞాశాలినియైన ఈ మహనీయురాలు తన ఎనుబది రెండవ ఏట 1982 ఆగస్టు 13 వ తేదీన బాపట్లలో పరమపదించినారు. మహిళాలోకానికి మరపురాని మణిపూసవంటిది కనుపర్తి వరలక్ష్మమ్మగారు.

వరలక్ష్మమ్మగారు పద్య రచనలోకన్న, గద్యరచనయందే మిక్కిలి నైపుణ్యమును చూపి, గద్యరచయిత్రిగానే కీర్తిగాంచినారు. వీరివి ప్రముఖముగా పేర్కొనదగిన కావ్యములేమియు లేవు. ద్రౌపదీమానసంరక్షణము, సత్యా ద్రౌపదీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంవాదము అను రెండు చిన్న ద్విపదకావ్యములు కలవు. ఓటు పురాణము అను నొక చిన్న పద్యగ్రంథము గలదు. అపరాధిని, వసుమతి, వరదరాజేశ్వరి అను నవలలు, కన్యాశ్రమము అను కథల సంపుటి కలవు. కన్యాశ్రమమునందు కన్యాశ్రమము, ఒట్టు, ప్రణయ లేఖలు, పెన్షను పుచ్చుకొన్ననాటి రాత్రి అను పెద్ద కథ కలవు.

ఈ వచన గ్రంథములు నా పరిశోధన పరిధిలోనికి వచ్చునవి కావు. అయినను ఆంధ్ర మహిళలలో "శారదలేఖల" ద్వారా పేరెన్నికగని, ప్రథమముగా కేసరి గారి గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీత యగుట వలన వీరి రచనలలో శారద లేఖలను మాత్రము కొద్దిగా పరిశీలించినాను.

శారద లేఖలు : 'శారద లేఖలు' పఠించుటవలన వీరికి సమాజము నందు గల గౌరవాభిమానములు తెలియుచున్నవి. రాజకీయ, నైతిక, మత, సాంఘిక విషయములందీ శారద లేఖలు ఆంధ్రమహిళాలోకమునకే గాక పురుషకోటికిని సుప్రబోధమును కావించినవని వక్తలు అభిప్రాయమును తెలిపిరి. శారద లేఖలను ప్రచురించిన పిదప, వరలక్ష్మమ్మ గారికి జరిగిన సన్మాన సందర్భమున శారద లేఖలను గూర్చి ఉత్తమ వ్యాసము వ్రాయగల వనితకు ఏబది రూపాయల విలువగల స్వర్ణపతకమును బహుమతినిచ్చెదనని రిటైర్డు సబ్ జడ్జి కోట నరసింహం పంతులుగారు సభలో ప్రకటించిరి.[1]

1921-22 సంవత్సరముల ప్రాంతమున, ఆంధ్రపత్రికలో చక్కని శైలితో వసంత లేఖలు ప్రచురింపబడుచుండెడివి. వానిని చదువుచుండగా వరలక్ష్మమ్మగారికి స్త్రీలకు సంబంధించిన విషయములను వ్రాయవలయునని కుతూహలము కల్గినది.[2] ఆ కుతూహలముతోడనే ఈ రచయిత్రి అనాటి 'ఆంధ్రలక్ష్మి' అను మాసపత్రికకు పంపినది. కళ్లేపల్లి వెంకటరమణమ్మగారి ఆధిపత్య

1. గృహలక్ష్మి. ఏప్రిల్, 1934 - పుట - 90.
2. శారదలేఖలు - ప్రథమభాగము - విజ్ఞప్తి - కనుపర్తి వరలక్ష్మమ్మగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున వెలువడిన ఆ పత్రిక నడచినంత కాలము 'శారద లేఖలు' సాగినవి. తరువాత వింజమూరి వెంకటరత్నమ్మగారి 'అనసూయ' పత్రికయందు రెండు, మూడు లేఖలు ప్రచురింపబడినవి. 1928 సంవత్సరము నుండి గృహలక్ష్మి ప్రారంభ సంచికనుండియే వీరి 'శారద లేఖలు' మరల నడిచినవి. వానిని రెండు భాగములుగా కేసరిగారు ముద్రింపించినారు.

శారద లేఖలందు జాబునందుకొనిన కల్పిత వ్యక్తి 'కల్పలత'. దేవతా వల్లరియైన 'కల్పలత' వలె చిరకాలము తన లేఖలు వర్ధిల్లవలయునను తలంపుతో రచయిత్రి తన నేస్తురాలికి 'కల్పలత' యని పేరిడినది. మొదటి భాగమున ఇరువది లేఖలు గలవు. మొదటి లేఖ యందు లేఖావసర ప్రస్తావన, 1928 సంవత్సరపు రాష్ట్రీయ సంఘ సంస్కరణ మహాసభ విషయ విచారణ, సుఖదేశాటనోపాయ సూచన మొదలగునవి కలవు.

రెండవ లేఖ : భాషా విషయకము, శ్రీకాళహస్తి క్షేత్రప్రశంస, పూర్వగాథావివరణము, స్థలప్రాశస్త్య విచారణ, దేశీయ వస్తుప్రశంస.

మూడవ లేఖ : శ్రీమతి సరోజినీదేవి దర్శన ప్రశంస, మదనపల్లి యందు హిందూ స్త్రీ సమాజమువారి సభా ప్రమేయము, అధ్యక్ష ప్రసంగ సంగ్రహము, ఖద్దరు ప్రశంస.

నాలుగవ లేఖ : తిరుపతి నుండి ఇంటికి, శర్మిష్ఠా కళ్యాణము, శారదాచట్ట తర్కము, దుఃఖభాగిని యగునొక యువతీమణి గాథ, శారదాశాసనావశ్యకతా నిరూపణము.

అయిదవ లేఖ : శారదా శాసన వాదములు.

ఆరవ లేఖ : గుంటూరు నందలి శారదా నికేతన ప్రశంస. దాని వార్షికోత్సవ వివరణము.

ఏడవ లేఖ : తానొనరించిన దక్షిణదేశ యాత్రా వివరములు, కాంచీపురం, చిదంబరం, కుంభకోణము, తంజావూరు, మధుర, రామేశ్వరము,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ధనుష్కోటి, గంధమాదన పర్వత దర్శనము. హిందూమత ప్రశంస చేయుచు ఈ లేఖ ఇరువది పుటలలో విపులముగా వ్రాయబడినది.

ఎనిమిదవ లేఖ : ఇందుకూడ తాను చేసిన తీర్థయాత్రా ప్రదేశముల వివరణ మొనరించినది. కుర్తాళం, తిరువాన్కూరు, తిరువనంతపురము, కన్యాకుమారి, శ్రీరంగక్షేత్రము మున్నగు వానిని గురించి వ్రాసినది. యాత్రలలో తనకు కలిగిన యిబ్బందులు అచ్చటచ్చట, పోలీసుల అక్రమ చర్యలు అన్నియు వివరించుచు తమ యాత్రా పరిసమాప్తి గురించి వ్రాసిన ఈ లేఖ కూడ చాల విపులముగా కలదు.

తొమ్మిదవ లేఖ : స్త్రీలు నాటక రంగమున ప్రవేశించుటను గూర్చిన సమగ్ర విచారణ.

పదవ లేఖ : సమదర్శినీ సంవత్సరాది సంచికా ప్రశంస.

పదకొండవ లేఖ : స్త్రీపురుషులు పట్టుకొని ప్రాకులాడుచున్న గౌరవ బిరుదములను గూర్చి విముఖత తెలుపుచు వ్రాసినది.

పన్నెండవ లేఖ : సాంఘికోద్యమ ప్రచారకుల ధర్మాధర్మ వివేచనను 'సాంసారిక స్త్రీ రంగస్థలమున కెక్కరాదని' నిర్ణయము.

పదమూడవ లేఖ : 1929 సంవత్సరము నవంబరులో బెజవాడ యందు జరిగిన ఆంధ్ర మహిళా సభలను గూర్చి వివరణ. మన స్త్రీలలోనున్న లోపములు, వివిధ ప్రసంగములు.

పదునాల్గవ లేఖ : ఆడువారి నాటకరంగ ప్రవేశముగూర్చి సమ్మతి పడిన శ్రీమతి ధర్మవరము లక్ష్మీదేవమ్మగారికిచ్చిన ప్రత్యుత్తరము.

పదిహేనవ లేఖ : శారదా పెళ్ళిళ్ళ గడబిడ.

పదహారవ లేఖ : విడాకుల చట్టమునకు వ్యతిరేకాభిప్రాయము.

పదిహేడవ లేఖ : స్వరాజ్యోద్యమ ప్రశంస.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పద్దెనిమిదవ లేఖ : నూలు వడకుట. స్త్రీలు మద్యపాన నిషేధమును ప్రచారము చేయుట.

పందొమ్మిదవ లేఖ : శారదా చట్టమునకు సవరణ లనవసరములు అని తమ అభిప్రాయమును తెలుపుతూ వ్రాసినదీ లేఖ.

ఇరువదియవ లేఖ: ధనుర్మాసము, సంక్రాంతి బాలికల గొబ్బి తట్టుట మొదలగువాని యందిమిడియున్న యుత్తమాశయములు మొదలగునవి.

ఈ విధముగా శారద లేఖల మొదటి సంపుటము సంపూర్ణమైనది. ప్రతి లేఖయందును సజీవత్వము తొణికసలాడుచున్నది. తన నెచ్చెలితో, ఎదురుగా కూరుచుని మాట్లాడుచున్నట్లే వ్రాసినదీ రచయిత్రి. ఇవి ఆనాటి పరిస్థితులనేగాక, నేటికీ జరుగుచున్న సాంఘిక పరిస్థితులను తెల్పుచున్నట్లే యున్నవి.

శారద లేఖల రెండవ సంపుటముగూడ రమణీయమైన రచనతోగూడి వర లక్ష్మమ్మగారి రచనా పాటవమునకు నికషోపలమై యొప్పుచున్నది. ప్రతి లేఖయు రచయిత్రి హృదయానుగతభావములను స్పష్టపరచుట మహిళలకు, జ్ఞానవికాస మునకు తోడ్పడునట్లున్నవి. ఇందు పదునొకండు లేఖలు మాత్రమే ఉన్నవి. ఇందుకూడ సాంఘిక, రాజకీయ, నైతిక విషయముల ప్రస్తావన గలదు. గృహ లక్ష్మి ప్రశంసకూడ ఒకటి, రెండు లేఖలందు కలదు. వాని వివరముకూడ వ్రాయ బడినది.

ఒకటవ లేఖ : నాల్గవ "గృహలక్ష్మి పుట్టినదినము" ఆశీర్వాద ప్రదానము.

రెండవ లేఖ : రాజకీయములలో పూర్వ యుగములందును ప్రస్తుతము యుగమునందును స్త్రీలే చెరలబడి దేశమాతను కష్టవిముక్తనుగా చేసిరి.

మూడవ లేఖ : పూర్ణమ్మ యను శుష్కవేదాంతిని కథ, 'గురు పీఠ ముల నుండదగినవారు' మొదలగు పరమార్థ విషయములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాలుగవ లేఖ : విధివశమున విధవయగు యువతికి శుష్కవేదాంత పాఠము లనవసరము, దేశసేవ ముఖ్యము. దానికిగల అనేకమార్గములు తెలిపినది.

అయిదవ లేఖ : ఐదవ ఆంధ్ర రాష్ట్రీయ మహిళాసభ ప్రస్తావన; అమరావతీయాత్ర, దాని వివరణలు.

ఆరవ లేఖ : గోదావరీ పుష్కర ప్రశంస శాస్త్రజ్ఞుల విధి, ప్రజల కర్తవ్యములు.

ఏడవ లేఖ : అస్పృశ్యతను గూర్చి.

ఎనిమిదవ లేఖ : 1-4-33 తేదీ గృహలక్ష్మియందు పుష్పచయమున ప్రకటింపబడిన స్త్రీలప్రజ్ఞా విశేషములు అను లేఖకు విమర్శనము.

తొమ్మిదవ లేఖ : స్త్రీలు ప్రస్తుతపు ధరలను జూచి లాభాపేక్షతో తమ నగలనమ్ముట దేశమున కమంగళకరమును, దరిద్ర హేతువును అగునను అభిప్రాయముతో వ్రాసినది.

పదవ లేఖ : పూర్వలేఖమీది విమర్శనలకు ప్రతివిమర్శనము.

పదకొండవ లేఖ ; మహాత్ముని హరిజన యాత్రలో గుంటూరునందు జరిగిన సభావివరములు.

ఈ విధముగా శారదా, కల్పలతల మధ్యనడచిన లేఖలందు ఎన్నో ముఖ్య విషయములు చర్చించబడినవి. ఈ లేఖలయందలి విషయములను పరిశీలించినచో రచయిత్రి స్పృశించి విడువని విషయమే లేదనిపించును. ప్రతి విషయమును సమగ్రముగా పరిశీలన మొనరించి, విమర్శాయుతముగా లేఖారచనమొనరించినది. ఇంతటి బహుళ విజ్ఞానఖనియైన వరలక్ష్మమ్మగారు కేసరిగారి సన్మానమునకు అర్హురాలై, స్వర్ణకంకణ గృహీతలలో ప్రథమగణ్యయై వెలుగొందుట యెంతో గర్వకారణమగును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సత్యాద్రౌపదీ సంవాదము

ఆంధ్ర సారస్వత రంగమున గేయ కవిత ప్రాచీనమైనది. గేయ కవిత ఎక్కువగా ద్విపద కవితా రూపమున కూర్పబడినది. ప్రాచీన కాలపు స్త్రీలందరు పాడుకొనుటకు వీలుగా ఈ ద్విపద కవితలను రచించిరి. బసవపురాణము, రంగనాథ రామాయణము, హరిశ్చంద్రోపాఖ్యానము, తాళ్లపాక తిమ్మక్క సుభద్రా కళ్యాణము మున్నగునవి ద్విపద వాఙ్మయములో ప్రసిద్ధి కెక్కినవి. క్రమముగా స్త్రీల కొరకు రచించిన పాటలు చాల వరకు ద్విపద కవితయందే రచింపబడినవి. వ్యావహారికపు తెలుగునందు వ్రాయబడిన ఈ పాటలన్నియు పాడుటకు సులభమై యున్నను, ఛందోబద్ధముగనే యున్నవి. సీత వసంతము, లక్ష్మణ దేవర నవ్వు, సంక్షేప రామాయణము, కుశలవ యుద్ధము మున్నగునవి స్త్రీలకనువైన రీతిలో పాడుటకు ద్విపద కవిత యందే రచింపబడినవి.

వరలక్ష్మమ్మ గారు కూడ సత్యాద్రౌపదీ సంవాదము అను ద్విపద కావ్యమును చక్కగా రచించినారు. మహాభారతమునందు అరణ్య పర్వమున పంచమాశ్వాసము నందుగల 'సత్యాద్రౌపదీ సంవాదము' మహిళాజన మార్గదర్శకమైనట్టి కథ.

పూర్వ కాలమున పురుషులు వేశ్యాలోలురై, భార్యలనెక్కువగా హింసించెడివారు. తమ తల్లి, అక్కచెల్లెళ్లు చెప్పిన మాటలు విని, జీవితభాగస్వామినియైన భార్యను పలువిధముల బాధించి, తిట్టి, కొట్టి, దుఃఖముల పాలొనరించెడివారు. అట్టివారిని తమవైపు ఆకర్షించుకొనవలయుననెడి ఆశతో కొందరు అమాయికలగు గృహిణులు చెప్పుడు మాటలు విని 'వశీకరణపు' మందులు పెట్టెడివారు. అట్లు మందులు పెట్టుటవలన, ఆ పురుషులకు ఏదో ఒక వ్యాధి కల్గెడిది. తరువాత వారి సంసారము దుఃఖభాజనమై అపకీర్తి పాలగుచుండిరి. ఇట్టి మహిళలకు తెలియు రీతిలో వరలక్ష్మమ్మగారు 'సత్యాద్రౌపదీ సంవాదము'ను ద్విపద కావ్యముగా రచించిరి. భారతమునందు, ఈ ఘట్టము రమణీయమైన సంభాషణాత్మకమై మహిళాజనోపయోగకరమై యున్నది. దీనిని పండితులు మాత్రమే చదివెదరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాని పామరులకు చదివినను అర్థము కాదు. అందునను ఆనాటి విద్యాగంధములేని వనితలెట్లు చదివి అర్థము చేసికొనగలరు? అందుకే వరలక్ష్మమ్మగారు ద్విపదలో రచించిన ఈ పాట ఎంతో సరళమైన భాషలో, ఆనాటి గృహిణులు గృహకృత్యముల నొనరించుచు పాడుటకు వీలుగా నున్నది. నీతి బోధనాయుతమైన ఈ పాట ఏదో ఒక రీతిగా మహిళల మనసునందు చేరి, వారికి మనోవికాసము నిచ్చి, మంచులు, మాటలు అబద్ధములని వారి మనసుకు హత్తునట్లు వ్రాయబడినది.

మాయాద్యూతమునందు ఓడిన పాండవ పంచకము ద్రౌపదీ దేవితో గూడి, పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాస మొనరించుటకు వెడలి అరణ్యములందు జీవనము గడుపసాగిరి. వారి క్షేమ మరయుట కొకనాడు శ్రీకృష్ణ భగవానుడు, సత్యభామతో కూడివచ్చెను. పాండవులు, శ్రీకృష్ణుడు, మార్కండేయ మహాముని యొకచోటగూడి, ఇష్టకథా గోష్ఠి యందుండిరి. కృష్ణవల్లభయైన సత్యభామ, పాంచాలి కూడ ఒకచోట కూర్చుని ప్రియసల్లాపముల లొనరించుచుండిరి. అప్పుడు సత్యభామ—

వదినెనాకొక శంకమది యందు కలిగె,
అదియేమిటంటేని అతివరోవినుము,
నీ ప్రియభర్తల - నిప్పాండుసుతుల,
వదలక గొల్తువు - వదినె నీవెట్లు,
ఒకరికంటె నొకరు - యువిదనీయందు,
అనురక్తులై యుండ - యక్కజంబయ్యె,
మంత్రాలవల్లనా - మందులవలన
వ్రతములవల్లనా - పాండిత్యమునన
ఏవిధి నీకబ్బె - యింతభాగ్యంబు

అని తన సందేహమును తెలిపినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అష్టభార్యాసంగతుడైన, దక్షిణనాయకుడగు కృష్ణుని తనకు మాత్రమే వశీకృతునిగా నొనరించుకొనవలయునని సత్య ఆరాటము. కాని భగవంతుని ఏలం నామె గ్రహించలేదు. ఆ తొందరపాటుతోనే మహా ఇల్లాలైన ద్రౌపదీదేవి నట్లు ప్రశ్నించినది. ఆమె అమాయకతను గాంచిన ద్రౌపదీదేవి పరిహసించి, తరువాత ఇట్లు చెప్పినది:

మంత్ర తంత్రంబుల - మగలను సతులు
వశ మొనర్చుకొనుట - వట్టిదిసుమ్మ
సతి యిట్టి దుష్కర్మ - సలిపిన యెడల
కలకూర్మి నశియించు - కాంతుని మదిని
మగువను నమ్మక - మదిరాక్షిపొత్తు
పాముతో పొత్తుగా - ప్రాణేశుడెంచు
వశ్యౌషధంబులు - వనితరో వినుము
చెవుడు, మూగతనము - చీకు జడతయు
ప్రాణహానియుచాల - పతులకు కలుగు
కాన పతులయెడ - కపటంపురీతి
కావింపరాదమ్మ - కాంతతాపతికి

అని తెలిపినది పాంచాలి.

భారతములోని పద్యములందలి భావమును పూర్తిగా గ్రహించి కవయిత్రి సులభశైలిలో ఈ పాట వ్రాసినది. దీనికి మూలమైన పద్యము దిగువ ఈయబడినది.

చ. అలయక మంత్రతంత్ర వివిధౌషధ భంగులజేసి యెంతయున్
వలతురు నాథులంట మగువాకడు బేల తనంబుదానమున్
గలిగిన ప్రేమయుంబొలియుగాని యొకండును సిద్ధి బొందద
బ్బొలతుకతోడి మన్కి యహి పొత్తుగ జూచు విభుండెరింగినన్.[1]

1. మహాభారతము - అరణ్యపర్వము - పంచమాశ్వాసము, పద్యం- 296, పుట - 442.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మందుల వలన భర్తకు కలుగు హానిని గురించి నన్నయ రచించిన ఈ క్రింది పద్యము నందలి భావమునే వరలక్ష్మమ్మగారు గ్రహించిరి.

చ. మగువ యొనర్చు వశ్యవిధి మందులు, మాయలు నొండుచందమై
మగనికి దెచ్చురోగములు మూకత మూకజడాది భావముల్
మొగి యొనరించు నద్దురితముల్ వన చేసినచేతలై తుదిన్
జగమున కెక్కునిందయును, సద్గతిహానియు వచ్చునింతికిన్[2].

ఈ విధముగనే ప్రతి పద్యమునందున్న భావమును గ్రహించి కవయిత్రి రచనను సాగించినది. భారతములోని అరణ్య పర్వమునందు సత్యాద్రౌపదీ సంవాద ఘట్టము291 పద్యమునుండి ప్రారంభమై 324 వచనమువరకు సాగినది. ఇంచు మించు ముప్పది పద్యములలో సాగిన, ఈ నీతిబోధనను కవయిత్రి ఏమాత్రము భావము చెదరకుండునట్లుగా ద్విపద కవితా రూపమున రచించినది.

అందు భర్తతో మెలగవలసిన రీతి, అత్తగారితో నుండు విధము, భర్తల మనసు నాకర్షించుటకు వారికి చేయవలసిన సేవా విధానము, గృహిణిగా స్త్రీ యొక్క బాధ్యతలు అన్నియు వివరింపబడినవి. పతివ్రతా ధర్మములన్నియు వివరముగా తెలుపబడిన ఈ కవిత హృద్యముగా నున్నది. స్త్రీలు పరిహరింప వలసిన వానిని ద్రౌపదీదేవి మాటల రూపమున ఎట్లు తెలిపినది కవయిత్రి:

భర్తల ధనధాన్య - భాగ్యంబునెల్ల
వ్యర్థవ్యయము సేయ - వదినెనేనోర్వ
గృహమైన, పెరదైన - గృహపాత్రలైన
యశుచియైయుండుట - కంగీకరింప

2. మహాభారతము - అరణ్యపర్వము - పంచమాశ్వాసము, పద్యం- 297, పుట - 442.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెడయువిదలతోడ - చెలిమితోనుంట
కయ్యంబులాడుట - పకపకానగుట
నాకుగానివి సుమ్మి - నాతిరోవినుము
పరదేశవాసులై - పతులుండిరేని
సౌగంధవస్తువుల - చక్కని పువుల
దివ్యంపు వలువల - భవ్యంపునగల
నేదాల్చకుందును - నెలతరోయపుడు

అని పతివ్రతలు విడువదగిన వానిని చెప్పినది. కవయిత్రి చెప్పిన పై ద్విపద భాగమునకు ఆధారమైన భారతమునందలి పద్యములిట్లున్నవి.

చ. తగియెడువేళలందు నియతంబుగ మజ్జనభోజన క్రియల్
దగ నొడగూర్తు భర్తలకు ధాన్యధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పుడు గృహస్థలభాండ విశోధనంబు లి
మ్ముగనొకనాడు నేమర ప్రమోదము సల్పుదు బంధుకోటికిన్.

క. పలుమారుందలవాకిట మెలగుట, యసతీ జనైక మిత్రత, కలహం
బులకెలయుట నగుపలుకుల బెలుచనగుట నాకు గాని పేరివిమగువా.

క. పతులిచ్చమెయి బ్రవాస స్థితులైనం బుష్పగంధ దీప్తాభరణ
ప్రతతి ధరియింప దగ్గతమతి నగుచు దదాగమంబ మదిగాంక్షితున్.[1]

మగని ప్రేమను పొందదగిన మగువ మెలగవలసిన రీతులనిట్లు తెలిపినది:

పతిమది వశమగు - భవ్యమార్గాలు
నాలుగు గలవవి - నాతిరోవినుము
పతికరుణించుటే - సతికి భాగ్యంబు
ధనధాన్య సంపత్తి - తగు గౌరవంబు

1. మ. భా. అరణ్యపర్వము-పంచమాశ్వాసము - పద్యములు 301-303.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంబరాభరణాది - ఆర్యవస్తువులు
సంతాన లాభంబు - సద్గతియశము
భర్త యిష్టుండైన - భామకు గల్గు
యెంతవారికినైన - నీపృథ్వియందు
కష్టపడకనెపుడు - కలుగదు సుఖము
కానకాంతుని గొల్చి - కాంతలు భక్తి
ధర్మసుఖాదులు - తగుపొందలెస్స
నిర్మలమతితోడ - నిత్యంబునీవు
భయమును ప్రేమంబు - బహుభక్తి కల్గి
ప్రీతిజూపితివేని - విభుడే తనంత
నిండారు మక్కువ - నీ వెంటదగులు

అని పతిని వశ మొనరించుకొనుటకు తగిన విధానములను చెప్పినది. పై పాదములకు భారతములోని చక్కని పద్యమాధారముగ నున్నది. ఆ పద్యమిది—

చ. పతి గడవంగ దైవతము భామలకెందును లేదు ప్రీతుడై
పతి గరుణించెనేని గలభాషిణి భాసుర భూషణాంబరా
న్విత ధన ధాన్యగౌరవము విశ్రుతసంతతియున్ యశంబుస
ద్గతియును గల్గు నొండుమెయిగల్గునె యెన్ని తెరంగు లారయన్.[1]

ఇంకను ఉత్తమురాండ్రైన ఉవిదలు, భర్త రాగానే సంభ్రమముతో ప్రీతితో ఎదురేగవలయుననియు, రమణుడు చెప్పిన రహస్యములను ఎవరికిని చెప్పకూడదనియు, పతికి మేలు కల్గించువారిని తానుకూడ మన్నించవలెననియు, అకలంక చిత్తముతో అతి గుణవతులై ఉండవలయునని ఉపదేశ మొనరించినది.

సతీమణులకు సహనమును, అనురాగమును, సహృదయతను ఉపదేశించు ఈ చిన్న కావ్యమును తన పెద్ద తల్లి యగు తుర్లపాటి వెంకట సుబ్బ

1. మహాభారతము - అరణ్యపర్వము - పంచమాశ్వాసము పద్యము-314.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాంబ గారికి వరలక్ష్మమ్మగారు అతిభక్తితో అంకితమొనరించినది. పూర్వకాలము నందలి మహిళలు స్నేహానురాగాలకు, సహృదయతకు ప్రతీకలుగా నుండిరి. వారెప్పుడూ పతికనుకూలురై, సంసారమును గుట్టుగా నడుపుకొనవలయుననేటి భావనతోనే జీవించినారు. విద్యా, విజ్ఞానములచేత ప్రజ్ఞావంతురాండ్రైనను వారు తమ విధినిర్వహణయందేమరుపాటు చెందినవారు కారు. తమ విజ్ఞానముతో, తెలియని స్త్రీలకు మంచి మార్గముల నుపదేశించిరి. అట్టి వారిలో చేరిన ఉత్తమురాలే వరలక్ష్మమ్మగారు. తన విజ్ఞానమును సాటి మహిళల అభ్యున్నతికి, దేశసేవ కుపయోగించిన ఆదర్శ గృహిణి.

వారి సత్యాద్రౌపదీ సంవాదము కేవలము ఉపదేశకరమగు గ్రంథమేకాని, అలంకారాలతో, అతిశయోక్తులతో, భావనావీచికలతో, వర్ణనా సౌందర్యముతో కూడిన గ్రంథ శ్రేణిలో చేరదగినది కాదు. గృహిణుల కుపదేశకరమైన ఈ చిన్న కావ్యము వరలక్ష్మమ్మ గారి రచనాపటిమకొక నిదర్శనము.

ద్రౌపదీ వస్త్ర సంరక్షణము

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారిచే రచింపబడిన ద్విపద కావ్యము ద్రౌపదీ వస్త్ర సంరక్షణము.

పాండవులు ఇంద్రప్రస్థ మేలునపుడు ధృతరాష్ట్రుడు పిలువనంపగా వచ్చినది మొదలుకొని ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరములిచ్చువరకు కలదు.

ఇంద్రపస్థ పురము నుండి ధృతరాష్ట్రుని చూడవచ్చిన పాండవులను గౌరవించి ధృతరాష్ట్రుడు దుర్యోధనుడు కట్టించిన మణిమండితమైన వేదికపై జూదమాడుమని ప్రేమతో పలికెను. దానికి ధర్మజుడు యోచించి—

తమయాజ్ఞ తలదాల్తు తండ్రిరోకాని
కలిగె నాకొకటను కడుసందియంబు
సప్తవ్యసనముల చాల జూదంబు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెద్ద వ్యసనమని పెద్దలందూరు
పాపంబు దెచ్చును బగలను బెంచు
దాపు బంధులనైన దాయల జేయు
సర్వస్వమూడ్చియు సన్యాసి జేయు
నెట్టివారికినైననిది కానియాట
ప్రజలను బాలించు పార్థివేంద్రులకు
నిది కాని పనియంచునిక నేలజెప్ప.

అని ధర్మరాజు విన్నవించెను. కాని ధృతరాష్ట్రుడు మరల ప్రోత్సహించిన పిదప కాదనలేక, దుర్యోధనుని వైపున నున్న శకునితో జూదమాడెను. జూదములో ధర్మరాజన్నియు పణముగా పెట్టినాడు కాని "దేవగోబ్రాహ్మణ స్థితులను" మాత్రము పణముగా నొడ్డలేదు. ద్రౌపదిని కూడ పణముగా నొడ్డుటచే రారాజు ద్రౌపదిని దాస్యముచేయుటకు తోడుకొని రమ్మని ఆజ్ఞ యిచ్చెను. ఆ పలుకు లాలించి విదురుడు కోపముతో—

అఖిల భూసామ్రాజ్య యభిషిక్త సాధ్వి
వరమునబుట్టిన వనితయా కృష్ణ
పావనా యోనిజా పాండవపత్ని
సామాన్య సతులతో సరిబోల్పరాదు.
ఆమె దాస్యము సేయనాగునేప్పృథివి.

అని ద్రౌపది యొక్క ప్రత్యేకతను తెలిపెను. నాతులపై మోహమును చూపిన నరకమే ప్రాప్తించునని విదురుడిట్లు పలికెను:

నాతుల దెసవోవ నరకమేగాక
కులమే నశించును కురురాజ తనయ
రావణుడేమాయె రమణిని బట్టి
అయ్యింద్రుడేమాయె నాహల్య గోరి
సుందోపసుందులు సుదతిమోహాన
యేమైరొ రారాజ యెరుగవానీవు.

అని నీతి బోధన చేసెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రాతికామి వచ్చి ద్రౌపదిని రమ్మని పిలువగానే, ఆమెలో భయము, దుఃఖము, విస్మయము పెనగొనినవి. ప్రాతికామితో పాంచాలి ఇట్లు పల్కెను :

భయమును దుఃఖంబు బహువిస్మయంబు
చిత్తానపురిగొని చిటపొటలాడ
సూతసుతుని తోడ సుదతి యిట్లనెను.
యేయుగ మందును నేకాలమందు
యెట్టి జూదరియైన నెంత దుష్టైన
త్రాగుబోతైనాను దబ్బరీయైన
భార్యను జూదాన పణమిడకనము
సత్యంబు తప్పని సర్వజ్ఞమూర్తి
పాపంబుదెసవోని పావన కీర్తి
తన్నోడి నంతట నన్నోటు వడెనో
నన్నోడి మీదట దన్నోటు వడెనా
ఎరిగిన నెరిగింపు నెరుగకుంటేని
ఆ జూదరినడిగి యరుదెంచి వేగ
తోడ్కొని రమ్మన్న తోడ్కొని పొమ్ము.

అని ధర్మ సందేహమును వెలిబుచ్చినది. సభలోనే సందేహము దీర్తురు రమ్మని వారు చెప్పుటతో "కన్నీటి ధారల కడుగొత్తుకొనుచు, సిగ్గున భయమున శిరమును వంచి, యేక వస్త్రముతోడ నెరియుచు వచ్చి" సభలో నిలిచినది. సభలో ద్రౌపది పల్కులకు పెద్దలెవ్వరు బదులాడకున్నను పిన్నవాడైన వికర్ణుడిట్లు బదులు పలికినాడు:

సమహిత చిత్తులు సర్వజ్ఞులంద్రు
కురు వృద్ధులు మరియా గురుబంధుజనులు
ద్రౌపది ప్రశ్నకుత్తర మీయకుండ
ఊరక యుండుట యూర్జితంబగునె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెలది జూదంబాడి వెసనాల దిరుగు
పురుషుండు ధర్మంబు వోనాడి నడుచు
అట్టి వారీ పల్కులను మతిసేయ
ధర్మంబు తప్పుటే ధర్మ విదులకు
పాండవాగ్రజుడౌను పతిగాడు సతికి
యేవురసతియౌను యింతి పాంచాలి
తమ్ముల సమ్మతి తాగోరకుండ
ఒక్కడె జూదాన నొడ్డుట తప్పు
అన్యాయ విజిత యీ యతివ పాంచాలి
ఏకవస్త్రను దెచ్చి యిటు సేయరాదు

అని ఏకవస్త్రయై విలపించు ద్రౌపదిని చూచి పలికెను. పెక్కు భర్తలున్నదాని పతివ్రతగా పాటించరు అని ఆ దుష్టులు పలికి, ద్రౌపది చీరనూడ దీయుటకు పూనుకొనిరి. దుష్టాత్ముడైన దుశ్శాసనుడెంత లాగినను, ద్రౌపది చీర తొలగ లేదు. సభయంతయు దుష్టులను దూషించగా, ధృతరాష్ట్రుడు పుత్రుని మందలించి, కోడలిని ప్రశంసించి, వరము కోరుకొమ్మనెను. మామగారి కోరిక తీర్చుటకు ద్రౌపది రెండు వరములు కోరినది. మూడవ వరము కోరుకొమ్మని ధృతరాష్ట్రు డనగానే ఆమె తన ధర్మమునిట్లు తెల్పినది:

మూడవ వరమింక ముగుదరోకోరు
మామగారిట్లన మదిని శంకించి
సతియిట్లు పలికెను సభవారు మెచ్చ
వైశ్య సతికి యొక్క వరమద్దగును
వరములు రెండగు వరరాచ సతికి
శూద్రభామకు మూడు చొప్పడు నెందు
వర విప్రవనితకు వరుసతో నూరు
వరములు కోరుట వరధర్మమౌచు
పరగును నిలగలపడతుల కెల్ల
వరరాచ సతినౌట వరములు రెండు
కోరితినే నింక కోరంగ రాదు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని తన ధర్మబుద్ధిని తెలియబరచినది. ద్రౌపది కోరిన విధముగా అంధరాజు వరములిచ్చిన పిదప పాండవులు ద్రౌపదితోగూడి కాంచన రథమెక్కి, ఇంద్ర ప్రస్థమునకు వెడలిరి.

మహాభారతమున సభాపర్వమునందు ద్వితీయాశ్వాసమున గల ఈ ఘట్ట మును కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ద్విపద కావ్యముగా రచించి, తన పెదతల్లి యగు తుర్లపాటి వేంకట సుబ్బమాంబ గారి కంకితమిచ్చెను. వరలక్ష్మమ్మగారి కావ్యములలో నిది ప్రథమ ప్రయత్నములో నున్నదేమో కనుక అచ్చటచ్చట అల్ప దోషములున్నను, కావ్యము స్త్రీలు పాము పాటవలె పాడుకొనుటకు బాగుగా నున్నది. కథా విధాన మేమాత్రము చెడకుండ కవయిత్రి రచించిన తీరు బాగుగా కలదు.

నవభారతేతిహాసము (అను) ఓటు పురాణము

దేశ సేవాభిమానియైన కనుపర్తి వరలక్ష్మమ్మగారు తన రచనా శక్తిని కేవలము శారద లేఖలు, సత్యా ద్రౌపదీ సంవాదమువంటి మహిళాజనోపయుక్త మగు రచనలతోనే, నిలుపలేదు. దేశము నందలి నిరక్షరాస్యులగు జనులకు 'ఓటు' విలువ తెలియుటకు ఓటు పురాణము అని చమత్కార భరితముగా ఉప దేశయుతమగు రచన మొనరించినది.

తెలుగువారికి ప్రాచీన కాలమునుండి పురాణములు చెప్పుకొనుట యందాసక్తి మెండు. పనిపాటలు తీరగానే సాయంకాలము, చల్లని వేళలందు, ఏదో ఒక నీత్యుప దేశకరమైన కథనో, మనోల్లాసకరమగు నృత్య గీతాదులనో, విని, చూచి, ఆనందించి సేద దీరుట మనకున్న మంచి అలవాటు.

ప్రాచీన కాలమున కూడ జనులిట్లే విశ్రాంతి సమయములందు ఆట పాటలతో, పురాణ శ్రవణముతో, నృత్య గానాదులను తిలకించుటతో కొంత ఆనందదాయకమగు జీవితమును గడిపిరని ' మన భారత, భాగవతాది పురాణ గాథలవలన తెలియుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాసభట్టారకుడు భారత భాగవతాది పురాణములను రచించి, తన సుతుడైన శుకమహర్షికిని, శిష్యులకు చెప్పినాడు. ఆ తరువాత నైమిశారణ్యమను మహారణ్యమునందు సూతమహర్షి ఋషులందరు వినగా భారత, భాగవత పురాణ పఠనమొనరించినాడు. ఆనాటి నుండి నేటికి కూడ పురాణ పఠనము ఉత్తములైన పండితులు చేయుచునే ఉన్నారు. మానవునికి, ఒక్కొక్క సమయమున తాను పఠించిన దానికంటే, ఇతరులచేత కథా రూపమున చెప్పబడిన విషయము తొందరగా మనసునకు హత్తుకొనును. అంతేకాక, అందరూ విద్యావంతులే కాజాలరు. విద్యావంతులు కాని వారికీ పురాణ పఠనము వలన విషయము త్వరగా అవగాహనమగును.

అట్టి అభిప్రాయమును మనమునందిడుకొని కవయిత్రి ఈ చిన్న గ్రంథమును 'ఓటుపురాణ' మను పేరున రచించినది. ఇందు నవభారత చరిత్రము, ఓటు విశేషమును వివరింపబడినవి.

ఈ పుస్తకమున ముంపుగా కవయిత్రి భరతమాత కంజలి యొనరించిన పద్యమెంతయు రమ్యముగా నుండి, ఆమె భక్తి భావమును తెల్పుచున్నది.

భరతమాత గొప్పతనమును తెలుపు పద్యములు పలువురు కవులు రచించినారు. వరలక్ష్మమ్మగారి 'అంజలి' కవితయు హృద్యముగా నున్నది.

అంజలి :

శ్వేతాతపత్రమై శీతగిరీంద్రంబు
చెన్నొందునేతల్లి శీర్షమునను
క్రమహారంబులై గంగాది వరనదుల్
కైసేయునే తల్లి కంఠమందు
హరిత కౌశేయమై యఖిల సస్యంబులు
దీపించునే తల్లి దేహమునను
రమణీయభూషలై, రతనాల ఖనిజముల్
తనరారునే తల్లి తనువునందు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తే. సింహళ ద్వీపమే తల్లి క్షేమ పీఠి
జలధి నాయకుడే తల్లి గొలుచు బంటు
ఆ భరత ధాత్రి నా తల్లి కంజలిడుదు
భక్తి భరితాంత రంగనై ప్రతిదినంబు.

భక్తిభావ భరితమైన ఆశయముతో నొనరించిన ఈ 'ఓటుపురాణ' గ్రంథమును 'ఆంధ్ర కేసరి'యని కీర్తి నొందిన 'టంగుటూరి ప్రకాశం' పంతులుగారికి మిక్కిలి భక్తితో అంకితమొనరించినది.

పురాణ ప్రారంభమును కూడ కవయిత్రి ప్రాచీన పౌరాణికుల పద్ధతి యందే రచించినది.

"శ్రీకరంబై, సకల సుందర తరులతా విలసితంబై, తాపసోత్తమ శరణ్యంబైయలరు నైమిశారణ్యంబున మహనీయగుణ గరిష్ఠులగు శౌనకాది మహామునులు, నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుడైన సూతుఁగని, నవభారతేతిహాసంబు వివరింపుమని యడుగ, హర్షనిర్భర చేతస్కుండై రోమహర్షణపుత్రుడైన సూతుండు వారల కిట్లనియె" అని పురాణపఠనమును ప్రారంభించినది. ఇందు పూర్వభాగము ఉత్తరభాగము, అని రెండుభాగములు గలవు. పూర్వభాగమున 'నవభారతేతిహాసము' పురాణముగా రచింపబడినది.

"పెక్కండ్రు సార్వభౌములు, మనహస్తినాపురమును రాజధానిగా నొనరించుకొని పాలించినపిదప, పృథ్వీరాజుసుచక్రవర్తి భరతవర్షమును పాలించుచుండగా శత్రురాజులు మత్సరగ్రస్తులై, మ్లేచ్ఛరాజుల నాశ్రయించిరి. మ్లేచ్ఛులు అదియెసమయముగా జూచి పృథ్వీరాజును జయించి, మిగిలిన హిందూ రాజులను కూడ సమయించి హస్తినా పురమును కైవస మొనరించుకొనిరి. నాటి నుండి అది ఢిల్లీగా మారినది" అనిచెప్పి, మనలోమనకు ఐక్యత కరువైనపుడు ఇతరులకు ఆక్రమించుకొనుటకు అవకాశము లభిస్తుంది అని కవయిత్రి యిట్లు తెలిపినది:

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తే.గీ. గంధగొడ్డలి పదునెంత కలిగియున్న
కొయ్యపిడి లేక కొయ్యను గొట్టగలదె
స్వీయజనులలో కొందరు హేయభంగి
వైరిపక్షంబు కుటిలులై చేరకున్న
నవనిసే దేశమైనను నగ్రమముగ
శాత్రవాధీనమంచుట సంభవిలునె.[1]

మహమ్మదీయులు కొన్ని సంవత్సరముల పాటు పాలించిన తరువాత వర్తక వ్యాజమున ఫ్రెంచివారు (పరాసులు) మొదలగు శ్వేతజాతివారు ఖండాంతరమున వచ్చిరి. వారిలో ఆంగ్లేయులు తమ రాజ్యమును సుస్థిరము గావించుకొనిరి.

వారిని పారద్రోలుటకు బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్ మున్నగువారు పూనుకొనిరి. మాతృ దాస్య విమోచనము కొరకు, ప్రజలలో స్వాతంత్ర్య వాంఛ రేకెత్తునట్లొనరించిరి. మహా శక్తి సంపన్నుడగు మహాత్ముని ప్రబోధమునకు వశ్యులై ప్రజలు పోరు సాగించిరి. దాని ఫలితముగా ప్రజలకు పందొమ్మిది వందల నలుబదియేడు ఆగష్టు పదునైదవ తేదీన, అనగా సర్వజిన్నామ సంవత్సర ఆషాఢ బహుళ చతుర్దశి శుభవాసరంబున భారత వర్షమునకు స్వరాజ్యము వచ్చినదని వరలక్ష్మమ్మగారు తెలిపినారు. నిజముగా వీరి రచన యంతయు పురాణ ధోరణిలోనే సాగినది. కథ కొంతవరకు చెప్పి మధ్య మధ్యన పద్యములను కూర్చిన విధము హృద్యముగా నున్నది.

త్రివర్ణ పతాకమును చూచి కవయిత్రి చక్కని వర్ణన మొనరించినది.

సీ. కాషాయ వర్ణంపు కమనీయకాంతిలో
త్యాగమూర్తుల తేజు తాండవింప
ధవళాతిధవళమై తరళించు ఛాయలో
శాంతి సత్యంబులు సౌరుజూప

---

1. ఓటుపురాణము - పూర్వభాగము - పుట 2.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సహజ సుందరమైన శ్యామలకాంతిలో
పైరుపచ్చల తీవి ప్రతిఫలింప
నిగనిగ మెరసెడి నీలంపు వన్నెలో
ధర్మ చక్రము శోభ తళుకులీన.

తే.గీ. సరస స్వాతంత్ర్య భారత జయపతాక
అతులనయనాభిరామమై యాకసమున
గాలి కెరటాల యూపుల తేలియాడ
కనగనయ్యెను కన్నుల కరువు దీర

అని కన్నుల కరువు తీరునట్లుగా త్రివర్ణ పతాకము నందలి మూడు వన్నెలను ముచ్చటగా వర్ణించినది కవయిత్రి.

స్వాతంత్ర్యము పొందిన పిదప గాంధీ మహాత్ముని 'గాడ్సే' అనువాడు చంపిన విధము వివరముగా తెలిపినది. సర్వధారి నామ సంవత్సర పుష్య బహుళ పంచమీ, శుక్రవారంబునకు సరియగు పంతొమ్మిది వందల నలుబది యెనిమిదవ సంవత్సరము జనవరి ముప్పదవ తేదీ సాయంత్రమైదుగంటల వేళ దైవ ప్రార్థనా కుతూహలాయత్త చిత్తుడైన మహాత్ముని వక్షస్థలమున గురిపెట్టి విగ తాసుంజేసె. అని గాంధీ మరణించిన విషయమును ప్రజలకు తెలిపినారు. మహాత్ముడు మనను వీడినందులకు వేదనతో కవయిత్రి యిట్లు తెలిపినది:

కం. మన దేవుడు, మన యేలిక
మన జనకుడు, గురుడు, హితుడు, మాన్యుడు జగతిన్
మన గాంధి మహాత్ముడకట
మనలను విడనాడి చనియె మన పాపమునన్.[1]

ఈ పద్యము చదువగానే, భాగవతమునందు శ్రీకృష్ణ నిర్యాణమును గూర్చి అర్జునుడు ధర్మరాజుతో చెప్పిన విధము స్ఫురించును.

1. ఓటు పురాణము - పూర్వ భాగము - పుట 10.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. మన సారథి, మన సచివుడు,
మన వియ్యము, మన సఖుండు మన బాంధవుడున్
మన విభుడు, గురువు, దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా.[1]

మన భారతి ప్రియతనయుడు, మన జాతికి జీవగఱ్ఱ, మన నేత, మనపాలి కల్పవృక్షము మనలను విడనాడిపోయెనని మిక్కిలి ఆలమటించినది కవయిత్రి వరలక్ష్మమ్మగారు.

ఉత్తర భాగమునందు ఓటు విలువను గూర్చి పురాణ రూపమున చెప్పినది. అట్లు "సూతుండు నవభారతేతి హాసంబున పూర్వభాగంబును సవిస్తరముగా వివరింప నాకర్షించి, సంతుష్టాంతరంగులై మహనీయగుణ గరిష్ఠులగు సమ్మాని శ్రేష్ఠులు నిఖిల పురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుంగని యిట్లనిరి" అని మరల సూతుడు చెప్పినట్లే రచించినది.

ఇందు ఓటనగా ఏమిటి? అని వారు ప్రశ్నించగా, ఓటు యొక్క విలువను, దానికి ప్రజల యొక్క సమ్మతి ఎట్లుండవలయును అన్నియు వివరముగా రచించినది. ఓటు యొక్క ఆధిక్యతను, విలువను గూర్చి కవయిత్రి యిట్లు తెలిపినది:

కం. వోటే దైవము సత్యము
వోటే ప్రాణము రాజ్యంబోటున నిలుచున్
వోటుల నెక్కువ బడయమి
యోటు పడును నెట్టిదైన నుర్వినిసుండీ.[1]

ఓటు యొక్క బలమును గూర్చి తెలుపుచునే చిన్న పద్యములో వ్యంగ్యమును చేర్చి రచించినది కవయిత్రి. 'ఓటుల నెక్కువ బడయని వారికి, యోటు పడును' అని పరిహసించినది.

దేశ, కాల, పాత్రములను తెలియకుండా ఓటు దానము చేయవద్దనియు, వర్ణ, మత, వర్గ భేదపు వత్తిడులందు దగుల్కొని ఓటు నొసగిన మోసమగు ననియు, గో, భూ, హిరణ్య, కన్యాదిషోడశదానముల కంటె ఓటు దానము

---

1. శ్రీమహాభాగవతము - ప్రథమస్కంధము-అధ్యాయము-15, పద్యం 356.
2. ఓటు పురాణము - ఉత్తరభాగము - పుట 14.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గరిష్ఠమైనదని ఓటు యొక్క ప్రభావమును తెలిపినవి వరలక్ష్మమ్మగారు. ఓటు డబ్బు కమ్ముకొనవలసినది కాదు. ఓటును దేశహితార్థము, ప్రజాహితార్థము సమర్పించవలయుననియు చెప్పినది. ఓటు యొక్క విలువ గాపాడుట, ప్రజా సంస్థలను జగన్మాన్యంబొనరించుట ఓటరుల ధర్మమైయున్నది అని చెప్పి దేశ మాతృ స్తుతియొనరించినది.

సీ. ధర్మమే మన జీవితార్థము సుమియంచు
వివరించి పల్కిన విమలభూమి
అర్థార్జనకు గూడ హద్దులు గల్పించి
అమరత్వమిచ్చిన యార్ష భూమి
కామ్యోపభోగముల్ కడముట్ట గూర్చియు
నీతికే ముడిపెట్టు నియమ భూమి
పై మూడు ధర్మాలు పదునుగా నడుపుచే
మోక్షమార్గమటన్న ముక్తి భూమి.

గీ. చతురపురుషార్థ సాధనా చతురులైన
పూతచరితులగనినట్టి పుణ్యభూమి
విమల విజ్ఞాన దీప్తుల వెలయు భూమి
పరులు మెచ్చెడి భూమి మా భరత భూమి.[1]

వేయి కాలములు సుఖముగా వెలయుసని ప్రారంభమున దేశమాతృస్తుతి యొనరించినట్లే అంతమున కూడ దేశమాతృస్తవ మొనర్చినది. ఈ పద్ధతి చూడగా కవయిత్రికి దేశాభిమానము మిక్కుటమని తెలియును. అంతేగాక, ప్రజలలో దేశాభిమానము రేకెత్తింప వలయునను భావనతో, వీరొనరించిన ఈ లఘుకావ్య నిర్మాణము ఎంతో రసవంతమై యున్నది.

శ్రీరామచంద్ర చరణ సేవానురక్త చిత్తయైన కనుపర్తి వరలక్ష్మమ్మగారు గృహలక్ష్మి స్వర్ణ కంకణ గ్రహీతలయందు ప్రథమురాలుగా నుండుటవలన, వారికి గద్య రచయిత్రిగా పేరున్నను, వారి చిన్న చిన్న కావ్యములు, శారద లేఖలు పరిశీలింపబడినవి.

దేశాభిమానియైన కనుపర్తి వరలక్ష్మమ్మగారు ఆంధ్ర సారస్వత రంగమునకు, ఇంతటి సేవ యొనరించి కేసరిగారి గృహలక్ష్మి స్వర్ణ కంకణమును పొంది తెలుగు కవయిత్రులలో శాశ్వత కీర్తి వహించినారు.

---

1. ఓటు పురాణము - ఉత్తర భాగం - పుట 19.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవిరాణి చిల్కపాటి సీతాంబ
(1935)

గృహలక్ష్మి పత్రికా సంపాదకులైన శ్రీ కె.యన్ కేసరిగారు సన్మానించిన కవయిత్రులలో రెండవవారు చిల్కపాటి సీతాంబగారు. 193౪వ సంవత్సరమున వీరికి నెల్లూరు వర్థమాన సమాజము వారొసరించిన మొల్ల జయంత్యుత్సవములో కేసరిగారు స్వర్ణకంకణ ప్రదాన మొసరించి గౌరవించినారు. ఆనాటి సభలో విద్వాన్, కవితిలక కాంచనపల్లి కనకాంబగారు అధ్యక్షురాలిగా నుండిరి. సింహపురి వాసులచే కవిరాణి బిరుదమును పొంది సన్మానింపబడినదీ కవయిత్రి.

సీతాంబగారి జన్మస్థలము నెల్లూరు జిల్లాలోని 'కలికివాయి' గ్రామము. 1900 సంవత్సరమున అక్టోబరు 18 వ తేదీన జన్మించినది. శ్రీమాన్ పర్ణశాల రాఘవాచార్యులుగారు, మంగమ్మగారు ఈ కవయిత్రి తల్లిదండ్రులు. ఈమె తల్లి వైపువారు, తండ్రి వైపువారు అందరును సంస్కృతాంధ్రములయందు మంచి పండితులు. పుట్టినింట తండ్రిగారి యొద్దను, బావగారైన విద్యారణ్య పంచానన శ్రీమాన్ విక్రాల రామచంద్రాచార్యుల యొద్దను, సంస్కృత వ్యాకరణ పరిజ్ఞానమును, కావ్యనాటకపరిచయమును బాల్యము నుండియే సీతాంబగారు అభ్యసించినారు. ఈమె భర్తయైన చిలకపాటి వెంకట నరసింహాచార్యులవారు మంచి పండితులు. ఈ కవయిత్రి సహజప్రతిభా విశేషములను వీరింకను ప్రకాశింప చేసినారు.

సీతాంబగారు తన భర్తయగు నారసింహార్యుని కావ్యమునందు భక్తితో ప్రస్తుతించినది.

తే.గీ. వినయవిద్యాభిమాన సద్వినుతయశుడు
నవని శ్రీచిల్కపాటి వంశాబ్ధిసోము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దైన వేంకట నారసింహార్యునాదు
ప్రాణవిభు పాదపద్మముల్ భక్తిగొలుతు.

గృహిణీ ధర్మమును నిర్వహించుచు అనేక కావ్య, నాటక, కవితా సంప్రదాయ ములను ఆకళింపు చేసికొనిన దీకవయిత్రి.

ఈమెకు సంస్కృత భాషయందు మంచి పాండిత్యమున్నను, ఆంధ్ర కవిత్వాస్వాదనముననే ఆసక్తి మెండు. అట్టి ఆసక్తియే తెలుగు కావ్య, నాటక, రచనారూపమున బయలు పడినది. వీరి రచనలు: (1) పద్మినీ పరిణయ కావ్యము, (2) సముద్ర మథనము (విష్ణుమాయావిలాసము) నాటకము, (3) దిలీప అను నాటకము, (4) అరవింద అను నవల. శూర్పణఖ అను ఏకాంకిక అముద్రితముగా నుండి శిథిలమైపోయినదట.

గృహలక్ష్మి పత్రికయందు ప్రచురింపబడిన పద్యములు, అచ్చటచ్చట సభలయందు చదివినట్టి పద్యములు "కాదాచిత్క పద్యరత్నములు" అను పేరున ముద్రింపబడినవి. ఆంధ్ర సాహితీ లోకమున నిశ్చల స్థానమును పొందినట్టి శ్రీమతి చిల్కపాటి సీతాంబగారికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పక్షమున విద్వన్మహిళా సూచకమైన బహుమాన ప్రదానము 9-1-1969 న చేయబడినది.

ఈ కవయిత్రి కావ్యరచన చేయుటయందేగాక ఆశుకవిత్వమునుకూడా చెప్పగలదు. ప్రతిభకును, కవితాస్ఫూర్తికి నిట్టి ఉదాహరణ కలదు. ఒకనాడీమె భర్తయు, మరియొక పండితుడును విద్యాప్రసంగములు సలుపుకొనుచుండగా ప్రాస్తావికముగ ఆ పండితుడు హనుమన్నాటకములోనిదని తెలియవచ్చు ఈ క్రింది శ్లోకమును చదివి, దానికి వ్యాఖ్యానము చెప్పెను. ఆ సమయమున, కవయిత్రి తలుపుచాటున నిలుచుండి ఆ శ్లోకమును విని, దానికి తెలుగు పద్యమొక దానిని వ్రాసి పంపినది.[1]

---

1. ఒంగోలు వెంకటరంగయ్యగారు బి.ఏ., బి.ఎల్. గృహలక్ష్మి - మార్చి-1933 - పుట. 33-37.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్లో. కమఠపృష్ఠ కఠోరమిదంధనుః
మధురమూర్తి రసౌ రఘునందనః
కథ మధిజ్య, మనేక విధీయతాం
అహహ తాతఫణః ఖలుదారుణః

దీనికి సీతాంబగారి అనువాదమిట్లు వ్రాసినది :

తే. కమఠ పృష్ఠ కఠోరమీకార్ముకంబు
సరస సుకుమారుడీ రామచంద్రమూర్తి
ఎటుల నెక్కిడ నేర్చునో యేమి యౌనో
కటకటా యేమి శపథంబు కన్నతండ్రి.

విద్వత్కవయిత్రియైన సీతాంబగారి కావ్యములలోని అందచందములు పరిశీలన మొనరింపదగినవి. ముందుగా పద్మినీ పరిణయ కావ్యమును పరిశీలించెదను.

పద్మినీ పరిణయం

పద్మినీ పరిణయము కల్పిత వస్తు ప్రధాన కావ్యము. ఇందు మూడా శ్వాసములు కలవు. దీనియందలి ప్రధాన రసము శృంగారము. కవయిత్రి దీనిని ప్రాచీన ప్రబంధముల రీతితో రచించినది. ఈ కావ్యములో తన ఇష్టదైవమైన శ్రీ మదనగోపాలుని చక్కగా వర్ణించినది.[1] కావ్యమునందలి అవతారిక యందు తన పుట్టినింటి వంశ వర్ణన, అత్తవారింటి వంశవర్ణము దీర్ఘముగా యొనరించినది. ఇష్టదైవముల నందరిని ప్రార్థించి, ప్రాచీన కవులను ప్రస్తుతించినది.[2]

ప్రథమాశ్వాసమునందలి ఇరువది రెండవ పద్యమునుండి పద్మావతీ పరిణయ కథ ప్రారంభమైనది. అష్టాదశ వర్ణనలలో కొన్ని కావ్యమున సందర్భానుసారముగా జొప్పింపబడినవి. పుర వర్ణన, పుష్పలావికా వర్ణన

1. పద్మినీ పరిణయము. షష్ఠ్యంతములు - పద్యం. 16-21.
2. పద్మినీ పరిణయము - అవతారిక-1-15.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సూర్యాస్తమయ, చంద్రోదయ వర్ణనలు, వసంతఋతు వర్ణనము, రాజకుమారి, రాజకుమారుల యొక్క విరహ వర్ణనము, వివాహము, శోభనము మున్నగు వర్ణనలు రమ్యముగా చేయబడినవి.

కావ్యమునందలి కథ క్లుప్తముగా ఇట్లు కలదు.

ప్రథమాశ్వాసము : శోభవతీ పట్టణపురాజు రత్నగర్భుని పాలన, అతని భార్య గౌతమీదేవి సౌశీల్యము, వారికి సంతానములేక దుఃఖించుట. దివినుండి భువికి దిగివచ్చిన సురమౌని నారదుని దయవలన సంతానమును పొందు మార్గమును తెలిసికొనుట. తులసీ వ్రతమహాత్మ్యమున లక్ష్మీదేవిని పోలిన పుత్రిక జన్మించుట. శ్రీకాంత రూపమున పెరిగిన బాలిక 'పద్మ' యను పేరుతో నొప్పుచు కావ్య, నాటకాలంకార శాస్త్రముల నన్నింటిని తెలిసికొని యెల్ల విద్యల యందును ప్రౌఢయై విలసిల్లుట. ఈ విధముగా ప్రథమాశ్వాసపు కథ నడచినది.

ద్వితీయాశ్వాసము : ద్వితీయాశ్వాసము నందుకూడ కథ రమణీయముగా మలచిన దీకవయిత్రి రాజైన రత్నగర్భుడు కుమార్తెకు తగిన వరుని కొరకు మంత్రిని ప్రశ్నించుట, అమరావతీ పట్టణరాజగు శూరసేనుని పుత్రుడు మాధవుడు తగిన వాడని మంత్రి అతనిని వర్ణించి చెప్పుట, ఆ మాటలను వినిన పద్మావతి మనసునందు మాధవుని తలచుట, ఆమె ఇష్టసఖియైన కళావతి యతి వేషమున అమరావతీపురమునకుపోయి రాజోద్యానవనమున నిలుచుట, కపటయతికి తండ్రి ఆనతి ప్రకారము మాధవుడు స్వయముగా సేవలొనరించుట.

కుహనాయతి మాధవునకు శోభవతీపురమునేలు రత్నగర్భుని కుమారిత పద్మావతి భార్యకాగలదని భావిస్థితినితెల్పి తన వాక్చమత్కారముతో రాజకుమారుని మనసును పద్మావతి యందు లగ్నమగునట్లుజేయుట.

కపటయతి వేషమున నుండిన కళావతి మరల శోభవతీపురమునకు వచ్చి విరహవేదన చెందుచున్న పద్మావతికి తాను వ్రాసిన రాజకుమారుని చిత్రరుపును చూపించి, ఆమె నూరడించి అంతఃపురమునకు పంపుటతో ద్వితీయాశ్వాసము ముగిసినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తృతీయాశ్వాసము : ఈ అశ్వాసమున కథ విరహ వర్ణనలతో ప్రారంభ మైనది. చంద్ర, మలయానిల, మన్మథోపాలంభనము, విరహార్తి నోర్వలేని పద్మావతి నిశాసమయమున చెలులనెవ్వరిని హెచ్చరింపక మందగమనమున తానే ఉద్యానవనమునకు వచ్చి దుఃఖించుట. కాపాలికుడొకడు గాంచి ఆమెను కాళికా దేవికి బలియొసగుటకు గొనిపోవుట, పద్మావతికి దేవి ప్రసన్నమై ధైర్యవచనము లను తెలుపుట, రాజకుమార్తెపైనిగల ప్రేమతో మారువేషమున వచ్చిన రాజ కుమారునికి, ఆమె ఆర్తనాదము వినిపించుటతో వచ్చి, పాషండుల నెదుర్కొని పద్మావతిని రక్షించుట. ఒకరి వృత్తాంతమొకరు తెలిసికొనిన పిదప గాంధర్వ వివాహమొనర్చుకొని మాధవుడు తన పట్టణమునకు రాజకుమార్తెను తీసికొని పోవుట. తల్లి దండ్రులు వచ్చి దంపతులను రాచనగరుకు కొనిపోవుట, పద్మావతి తల్లి దండ్రుల కెరుకపరచుట. వారు కూడ వచ్చిన పిదప మరల వివాహము జరిగి సుఖముగా జీవించుట. ఈ విధముగా మూడవ ఆశ్వాసము మంగళాంతముగా ముగిసినది.

కావ్యమును చక్కగా పరిశీలించినచో కవయిత్రికి ప్రాచీన ప్రబంధములను బాగుగా చదినట్టి పరిజ్ఞానము కనిపించుచున్నది. ముఖ్యముగా మను, వసు చరిత్రాది ప్రబంధముల ప్రభావము కవయిత్రిపై చాల కలదు. పుర వర్ణనల యందును, పుష్పలావికా వర్ణనల యందును, రాజకుమారుని వర్ణన మొనరించు పద్యములో మను చరిత్ర ప్రభావ మెక్కువగా గలదు. కథా విధానములో వసు చరిత్రవలె నడచినది.

వసు చరిత్రలోని పద్యముల పోలికలు

ద్వితీయాశ్వాసమునందు పద్మావతి ఇష్టసఖియగు కళావతి కపటయతి వేషముపూని అమరావతీ పురమునకు పోవును. అచ్చట రాజకుమారుని చూచి యిట్లు భావించును:

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. అద్దినవీని చక్కదనమయ్యల కేసని పుత్రు, జంద్రుని
స్దద్దయునాసురేంద్ర సుతు, దామరసాంబకు నవ్వసంతునిన్
గొద్దిగ చేయజాలు నవకోమల రూపుని వీని గాంచెయే
ముద్దియ యైన మోహమున మున్గక నిబ్బరమున్వహించునే.[1]

రాజకుమారుని అందచందములను కంతు, వసంత, జయంత, నలకూబరులతో పోల్చినట్టి పద్యమే మనుచరిత్రమున కలదు.

ఉ. ఎక్కడివాడొ యక్షతనయేందు జయంత వసంతకంతులన్
చక్కదనంబునన్ గెలువ జాలెడువాడు మహీసురాన్వయం
బెక్కడ? యీతనూ విభవమెక్కడ? యేలనిబంటుగా మరున్
డక్క గొనంగ రాదే యకటా నను వీడు పరిగ్రహించినన్.[2]

ఉపవనమునందు విహరించు పద్మినీదేవికి కళావతి మాధవుని అందచందములను తెలుపుచు చిత్రపటమును గీచి చూపినది. చిత్రపటమునందు మాధవుని రూపమును గాంచి పద్మినీదేవి భావించినట్టి పద్యము కూడ పై పద్యమునే పోలియున్నది.

ఉ. ఎక్కడి రూపమోయిది సురేంద్రకుమార కుబేర సూనులన్
మిక్కిలి రూపసంపదల మించుచున్నది మర్త్యజాతియం
దెక్కడంయీతనూ విభవమెంతయు నుండుటయేడ వీనినిం
దక్కగ గొంచునుండు నలదానిదె భాగ్యమసంగనీ భువిన్.[3]

తృతీయాశ్వాసమునందు పద్మావతిని కాపాలికుడెత్తుకొని పోవునపుడు పద్మావతి తన వారిని తలచుకొని దుఃఖించిన పద్యమును చూచినచో ప్రవరుడు

1. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 35.
2. మనుచరిత్రము - ద్వితీయాశ్వాసము - పద్యం - 35.
3. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 25.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హిమాలయమునందు తన తల్లిదండ్రులను తలచుకొని వెతచెందిన పద్యము జ్ఞప్తికి వచ్చును. పద్మినీ పరిణయమున మూడవ ఆశ్వాసమున ఈ పద్యమిట్లు కలదు:

సీ. పదిమాసములు మోసి బహుకష్టముననను
 సన్పడయు మాయమ్మ యెంతదలునొక్కొ
పొత్తు కూర్చుండక భుజియింపకుండునా
 కన్నయ్య మదినెంత కలగునొక్కొ
నేనె ప్రాణంబుగా నెంచు నానేస్తంపు
 టింతు లేమంచు శోకింతురొక్కొ

ఆ.వె. పండులేనొసగకుండిన దిననొల్ల
కుండినట్టి చిలుక పిండులెట్లు
కలతనొందు నొక్కొ కటకటానను గూర్చి
యెందరెన్ని వెతలనొందవలసె.[1]

మనుచరిత్రమునందు ద్వితీయాశ్వాసమున పద్యమిట్లు గలదు:

సీ. నను నిముసంబు గానకయున్న నూరెల్ల
నరయ మజ్జనకుడెంత డలునొక్కొ
యెపుడు సంధ్యల యందు నిలువెళ్ళ నీకస
న్నోమెడు తల్లి యెంతొరలు నొక్కొ
యనుకూలవతి నాదు మనసులో వర్తించు
కులకాంతమది నెంతకుందునొక్కొ
కెడ దోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు
లింతకు నెంత చింతించురొక్కొ

గీ. యతిథి సంతర్పణంబు లేమయ్యె నొక్కొ
యగ్ని లేమయ్యె నొక్కొ నిత్యంబులైన
కృత్యముల బాపి దైవంబ కినుకనిట్లు
పారవైచితె మిన్నులు పడ్డచోట.

1. పద్మినీ పరిణయము - మూడవ ఆశ్వాసము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కావ్యములందు నాయికలు విరహవేదనతో, చంద్ర మలయానిలాదుల వేడిమి నోర్వలేక విలపించుట ప్రబంధకాలము నుండియు కలదు. శ్రీనాధుని కాశీఖండమునందు సుశీలయను పతివ్రత విద్యాధర చక్రవర్తి మరణించుటతో 'ఉసిరిక కాయలంత కన్నీటిబొట్లు పయోధరముల పైన పడునట్లుగా' దుఃఖించినది. అల్లసాని పెద్దనగారి వరూధిని, ప్రవరుని నిరసనను సహించలేక అటూ ఇటూ కాకుండ "మీటిన విచ్చు గుబ్బ చనుమిట్టల నశ్రులు చిందువందగా" నేడ్చినది. ముక్కు తిమ్మన్నగారి సత్యభామ ముద్దుముద్దుగా "కలకంఠవధూకల కాకలీ ధ్వనితో" ఏడ్చినది. ఇట్లే, ఎంతోమంది కావ్యనాయికలు కన్నీరు కురిపించినారు. కవయిత్రి సీతాంబగారి నాయిక పద్మావతి కూడ వెన్నెల వేడిమి నోర్వలేక విరహముతో విలపించినది.

ఉ. శారద పూర్ణిమాద్యుతి దిశల్ రమణీయముగాగ నిండుటల్
గోరువలున్ముకంబులును గోరి హళాహళిగాగ కూయుటల్
మారుడు సాయకంబులను మాటిడినేయగనోర్వలేకయ
వ్వారి జగంధి యేడ్చె బికవాణిని గేరుకలస్వనంబునన్.

వెన్నెల వేడిమినోర్వలేని గిరికాదేవియు ఇట్లే విలపించినది. కావ్యమును పరిశీలించి నచో, ఇంకనెన్నియో పద్యములు ప్రాచీన ప్రబంధములలోని పద్యము రీతిలో కనుపించును. తమకంటె ప్రాచీనుల రచనలను మనసారా చదివినప్పుడు, వారి రచనల ప్రభావము తమపై పడుట సహజము. అంతమాత్రమున వీరిని మనము ప్రతిభలేని వారనజాలము. కేవలము వీరికిగల అభిమానమును తెల్పుటయే సహృదయ లక్షణము. ఈ కవయిత్రి పద్యరచనయందెంతయు ప్రతిభావంతు రాలని కావ్యమే తెలుపుచున్నది.

కథా విధానములో కొంత వసుచరిత్రమును పోలియున్నది. వసురాజు నర్మసఖుడు కపట యతివేషము పూని గిరికాదేవి నెచ్చెలులతో నున్నచోటికి వచ్చి నట్లు, పద్మినీ పరిణయమునందు పద్మావతి సఖి కళావతి మాయాముని వేషమును ధరించి అమరావతీ పురమునకు వెడలి, మాధవునకు, అతని భావి స్థితిని, పద్మావతి అందచందముల వర్ణనమొనరించి అతని హృదయమున ప్రేమనంకురింప చేయును,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కపటయతి అనగానే వసురాజు నర్మసఖుడు, విజయవిలాసమున అర్జునుడు, కపటముని వేషమును దాల్చిన ఘట్టము మనసునకు స్ఫురించును. యతి వేషధారణ మున కవయిత్రి వైష్ణవ మతాను సరణముగ యతిని అలంకరించినది. 'శారదా పూర్ణిమాచంద్రుగేరు మొగంబునందు ఊర్ధ్వపుండ్రమును పొందుపరచి. ఆణి ముత్తియముల హారంబు లెడలించి నలినాక్షమాలిక లలవరించి యతివేషము నలంకరించుకొనిన దాకళావతి'.[1] డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారును, ఒంగోలు వెంకటరంగయ్య గారు కూడ కవయిత్రికిగల వైష్ణవ మతాభిమానమును గురించి ప్రస్తావన యొనరించినారు.[2] భాస్కర రామాయణము నందును రావణా సురుడు కపటయతి వేషము దాల్చి సీతాదేవి ముందుకు వచ్చినపుడు-

సీ. తుదిద్రేవేలనెగసెన ద్రోచినపుదియ బొట్టు
రుపాల పట్టికనుల్లసిల్ల
తులసీదళాంకిత తుచ్ఛ శిఖాపుచ్ఛ
మల వదనునుదలనందమొంద.[3]

భిక్షువేషమును ధరించి వచ్చినాడు. రావణునకు ఊర్ధ్వ పుండ్రమును, తులసీ దళములను ధరింప చేయుటలో కవియొక్క వైష్ణవ మతాభిమానము వెల్లడి యగు చున్నది. విజయ విలాసమునందు అర్జునుడు కూడ కపట సన్యాస స్వీకారమొన రించునపుడు "మృగనాభి తిలకంబు బుగబుగల్ గల, లలాటముపై మృదూర్ధ్వ పుండ్రంబు దీర్చినాడు."[4] కవులు తమ అభిమానమును వెల్లడించినట్లే కవయిత్రియు మతాభిమానమును తెల్పి యుండవచ్చును.

---

1. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము- పద్యము- 24.
2. ఊ. లక్ష్మీకాంతమ్మ గారు - ఆంధ్ర కవయిత్రులు - పుట. 168.
   ఒంగోలు వెంకటరంగయ్యగారు గృహలక్ష్మి - మార్చి, 1933. పుట. 33-37.
3. భాస్కర రామాయణము-అరణ్య పర్వము-ద్వితీయాశ్వాసము పద్యం-66.
4. విజయవిలాసము-ద్వితీయాశ్వాసం - పద్యం - 81.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పద్మినీ పరిణయమున మూడవ ఆశ్వాసమున పద్మినీదేవి, విరహ బాధచే అంతఃపురమునందు శయనింపనొల్లక మందగమనమున ఉద్యానవనము సొచ్చినది. వసుచరిత్రమున గిరికాదేవి, వసురాజు నందలి ప్రేమచే విరహ సంతప్తయై, ఒంటరిగా ఉపవన విహారమున కేగినట్లు కలదు. గిరికాదేవి వ్యథను తెలుపుటకు మంజువాణి వసురాజు చెంత కేగినట్లే పద్మినీ ప్రణయమును తెలుపుటకు కళావతి అమరావతీ పట్టణమునకు రాజకుమారుని చెంత కరిగినది. ఇట్లు కొన్ని సందర్భము లందు కథా విధానములో వసుచరిత్రను పోలియున్నది.

వర్ణనలు : పద్మినీ పరిణయమున యొనరించిన, వర్ణనలు రమ్యముగా నున్నవి. సహృదయ రంజకమగు ఈ వర్ణనలు కావ్యమునకు శోభను కల్గించినవి. పద్మావతిని వర్ణించునపుడు పద్మావతి తులసి వనము నుండి ప్రత్యేకమైన లక్ష్మి దేవి యనుగ్రహమున జన్మించిన కన్య కావున, ఆమె శరీరమునందు పూర్తిగా విష్ణు చందంబులు కలవని వర్ణించినది.

సీ. ఘన కృష్ణవిభవంబు గనె నాతిపెంజెడ
విధుని చందము బూనె వెలదిమోము
మీనాకృతి వహించె మానిని కందోయి
మాధవీకృతి బూనె మగువ మోవి
గళము శంఖము భాతి కనుపెట్టెనింతికి
అచ్యుత స్థితిబూనె నతివచనులు
కలదు లేదను మాక్కిగల్కి మధ్యంబొప్పె
కటిరథాంగ స్ఫూర్తి గాంతకాంచె.

తే.గీ. తరుణి పదములు కూర్మంబు కరణి వెలసె
కాంచనాంబరమున నొప్పె గాంతమేను
నిటుల శ్రీవిష్ణు చందంబు లెన్నియేని
గలిగి జగముల వినుతింప నలరుచుండె.[1]

---

1. పద్మినీ పరిణయము - ప్రథమాశ్వాసము - పద్యం - 60.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సూర్యాస్తమయ వర్ణనము : ప్రబంధములలో సూర్యోదయ, అస్తమయ, చంద్రోదయాది వర్ణనలొనరించుట యొక లక్షణము. ఈ ప్రబంధ శైలిని విడువక కవయిత్రి సూర్యాస్తమయాది వర్ణనములను ఉచితరీతిలో యొనరించినది.

తే. చరమగిరి యనియెడు తాళతరువునందు
పండి వ్రాలిన పరిపక్వఫలమనంగ
నఖిల దిక్కుల రాగంబు లలమికొనగ
పశ్చిమాంబుధిలో గ్రుంకె భానుడంత.[1]

సూర్యాస్తమయమైన పిదప, ఆకసమున క్రమ్ముకొనిన కారు చీకట్లను వర్ణించిన పద్యమునందు కవయిత్రి లోకసహజమైన విధానమును, మనుజుల తత్వమును జోడించి చెప్పినది.

చ. అధికులు మాటు కేగునెడనల్పులు దాంబికవృత్తితోడుతన్
బుధులనిరోధమార్గముల బూనినకై వడి గారు చీకటుల్
నధికము గాగనిండె జగమంతయు జేష్టలు మానియుండెమ
న్మధునకు జిక్కిజారులను మానము దక్కిరి చోరులు న్వెసన్.[2]

చంద్రోదయము : కువలయములకు మోదమును కలిగించు రాజు వచ్చిన రీతినిట్లు వర్ణించినది కవయిత్రి.

ఉ. తూరుపు కొండపై బొడమె దుర్జనవృత్తిని బూను వారలన్
గారియవెట్టు మేటి ఘన కౌతుకమొప్పగ సజ్జనాళిక
వ్వారిగ సౌఖ్యమిచ్చు దొర వాసవ ముఖ్యులమే లిపంటయ
మ్మారుని జోడుకాడు బుధమండలికి న్ముదమందజేయగన్.[3]

1. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం - 53,
2. పద్మినీ పరిణయము. ద్వితీయాశ్వాసము - పద్యం - 54.
3. పద్మినీ పరిణయము. ద్వితీయాశ్వాసము - పద్యం - 56.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజకుమారుడైన మాధవుడు, ఉద్యానవనమున విహరించు సమయమున గల ప్రకృతి వర్ణన మొనరించినది కనుక ఈ పద్యములందు రాజతనయునకుపదేశ కరమగు అంతరార్థము తోచును. రాజైనవాడు దుర్జన వృత్తిని బూనువారిని గారియపెట్టవలయుననియు, సజ్జనులకు సౌఖ్యమునియ్యవలెననియు ఇందలి అర్థము. బాహ్యమున కారుచీకట్లు క్రమ్మినట్లును, చంద్రోదయమైనట్లు తోచినప్పటికి అన్యాపదేశముగా నీత్యుపదేశకరమై యున్నది.

సూర్యోదయవర్ణనము : సూర్యోదయవర్ణనము కూడ చక్కని యుపదేశ సహితముగా చేయబడినది. లోకమునకు తన రాకచే ముదమును కల్గించు భానునిట్లు వర్ణించినది:

సీ. జతబాసి దుఃఖించు జక్కవ కవలెల్ల
ముదముతోదనరాక కెదురుచూడ
అఖిలలోకంబుల కాధారభూతుడీ
తండని బుధులు సంస్తవమొనర్ప
తన మిత్రుడేతెంచె నని యరవిచ్చుచు
తమ్ములెల్లను సంతసమ్మునంద
చంద్రాతపమ్మున శ్రమచెందియున్నట్టి
కాముకుల్ దనుగాంచి కలకదేర.

తే.గీ. ధరణిగల జీవులెల్ల జైతన్యమంద
నఖిలదిశలను ధ్వాంతమ్ములంతమొంద
సరవిలోకంబులకు నెల్ల సాక్షియగుచు
నుదయ పర్వతమున భానుడుదయమయ్యె.[1]

ముక్తియొక్క రాకతో చూచువారికి సంతసము కలుగవలెను అనెడు భావమును కలిగించుచు సూర్యుని రాకను వర్ణించినదీ కవయిత్రి. భానూదయ

1. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసం - పద్యం - 68.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముతో లోకమునకు హితము, చైతన్యము కల్గినట్లు మానవుని రాకతో కూడ లోకులకు ముదము చేకూరవలయునను సందేశము కలిగి వర్ణనాయుతమై పై పద్యము హృద్యముగా నున్నది.

ఉపాలంభనము : పద్మినీదేవి విరహముతో నిదురలేక ఉపవనమునందు ఒంటరిగా తిరుగుచున్నపుడు, చంద్రోదయమును గాంచి విరహము నోర్వలేక, ఆ రాకుమారి చంద్రోపాలంభన మొనరించినది.

సీ. బాడబానలముతో పాటు సాగరమందు
జనియించినట్టి దుర్జనుడవీవు
రాహుకోరలచేత రహిగ్రాగి విషమును
వెదజల్లుచుండు దుర్మదుడవీవు
దైవంబటంచని తలపక శంభుని
తలపైకి నెక్కిన ఖలుడవీవు
చెలియ లిల్లునుబాడు చేసియు మిన్నంచి
దనరు విశ్వాస ఘాతకుడవీవు.

తే.గీ. గురునియిల్లాలి బట్టిన కూళవీవు
జంట పుల్గులబాపు దుర్జాతివీవు
కన్న సుతునకు బగయైన కష్టమతివి
అబలలను నేచనే పాటి యజ్ఞవైతి.[1]

అని చంద్రుని నిందించిన తరువాత మన్మథ దూషణము కూడ చేసినది. చంద్ర మన్మథోపాలంభనము తర్వాత శుకపికములను, మలయానిల, మధుకరముల నుపాలంభించిన పద్యము చమత్కారవంతముగానున్నది.

1. పద్మినీ పరిణయము - తృతీయాశ్వాసము - పద్యము - 6.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. పలుమారు నాపైకి జరుగు లెత్తెదవేల
పవనుడానిను బట్టి పాము మ్రింగ
మాటికి నను జేరి మాటలాడె దవేమి
చిలుకనిన్బంధించి చిక్కుపరుప
కన్నులెఱ్ఱగ జేసి కళ కూక లిడెదేమి
పికమ నిన్గాకులు బిట్టదల్ప
చలముని ఝుంకృతుల్ సల్పెదవదియేమి
తుమ్మెదా నీమేను దుమ్ముగాను.

తే.గీ. పంచపాతకులని మిమ్ము బలుకవలయు
నట్టుగాకున్న నబలల బిట్టలంచు
బుద్ధి మీకేల గలుగు దుర్బుద్ధులార
ఎగ్గొనర్చితిమే మీకు నెన్నడైన.[1]

అని తూలనాడినది. ఈ ఆక్షేపణలో కూడ సత్యమునే తెలుపుచున్నది. పవనునకు, శుక పికములకు, తుమ్మెదకు గల సహజమగు అనుభవములను ఆక్షేపణ రూపమున తెలిపినది. వాయువును పాములు ఆహారముగా గ్రహించును. చిలుకను పంజరములో బంధించుట దానికి అనుభవమే. కోయిల కన్నులు సహజముగనే ఎఱ్ఱగా నుండును. కూకలిడుట దాని సహజ గుణము. పూలపుప్పొడులలో తిరుగుటచే తుమ్మెద రెక్కలు పుప్పొడితో దుమ్ముపడినట్లుండును. చంద్రునితో గూడ కలిపి అయిదుగురిని పంచపాతకులని దూషించినది.

ఇట్లే ఈ కావ్యమున ఎన్నియో ప్రబంధోచిత వర్ణనలు సుందరముగా నున్నవి. ఋతువర్ణనము, రాజకుమార్తె చెలులతో జలక్రీడలాడుట, పుష్పాపచయ వర్ణనము, వివాహము, పెండ్లి భోజనములు, శోభన వర్ణనములతో కథ శుభాంత మైనది. ఇతివృత్తము చిన్నదే కాని వర్ణనాధిక్యతతో కావ్యము ప్రబంధరీతిలో ఒప్పుచున్నది.

---

1. పద్మినీ పరిణయము - తృతీయాశ్వాసము - పద్యము - 10.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవయిత్రి కొన్ని యెడల ఉత్పల మాల, శార్దూలము వంటివే గాక ప్రత్యేక వృత్తములను వాడినది. వృత్తములను ముద్రాలంకారముతో కూర్చి రచించినది. ముద్రాలంకారమనగా ఆ వృత్తము పేరు వృత్త రచనలో చేర్చుట.

వసంత ఋతువు సందర్భమున మత్తకోకిల వృత్తము ముద్రాలంకారమున గలదు.

మత్తకోకిల : మత్తకోకిల వాణి నిమ్మదె మాధవుండనురాగమున్
హత్తు చిత్తముతోవసేందిర యందమై తగునట్టులన్
చిత్తమందున, సంతసంబును జెందు భాష లొసంగెనా
గ్రొత్త క్రొత్త సుమంబు లెల్లెడ కొల్లగా వికసించెడున్.[1]

మలయజ వృత్తము : మలయజ గంధిరొ మదనుని గన్గొని
మనమున సంతసమందుచుదా
జలువ జలంబుల స్నాన మొనర్చియు
జందన శీతల చర్చితుడై
యలరుల తావులు నంతట నిండగ
నలిముద మునజనునట్టులుదా
మలయ సమీరుడు మాటికి మాటికి
మందగతింజను మాపికదగున్.[2]

అని మలయ సమీరమును వర్ణించినది.

కవయిత్రి వచనములో రచించిన వన వర్ణనము మనోరంజకముగా నున్నది.

---

1. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం - 84.
2. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం - 87.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వచనము : ఇవ్విధంబున నవ్వధూమణిందోడ్కొని రసాల, సాల, హింతాల, తాల, తక్కోల, తమాల, నారికేళ, లవంగ, లుంగ, పున్నాగ, పూగ, కదంబ, నింబ, జంబీర, పిచుమంద, మందార, పారుజాత, కుంద శ్రీగంధ, కనకవకుళ, కురంట కాశోక కపిద్ధ ఖర్జూర కోవిదార చంపక, మల్లికా మాధవీ, కుంజ, పుంజ రంజితంబగు వనంబు ప్రవేశించి....ఇట్లే కావ్యమున పలు తావులందు వచన రచన చేయబడినది. పద్య రచనలో మాత్రమే గాక కవయిత్రికి వచన రచనలో కూడ నైపుణ్యము కలదని తెలియుచున్నది.[1]

వసంత ఋతు సందర్భమునే పద్మావతి ఉద్యానవనమున విహరించు నపుడు చెలులందరొనరించిన పుష్ప దోహద క్రియలను వర్ణించిన సీస పద్యము పది పాదములలో నున్నది. అకాలమునందు తరుగుల్మ లతాదులయందు పూవులు పుట్టించుట దోహదములందురు. పాదములకు పారాణి పెట్టుకొని నగలు ధరించిన యువతి కాలితో తన్నినచో అశోకము అకాలమున పుష్పించును. కౌగిలించి కొన్నచో, ఎఱ్ఱ గోరింట పూచును. యౌవనవతి దానిమ చెట్టు క్రింద నిలిచి నవ్విన పూచును. ఇట్లు అనేక దోహదములు గ్రంథాంతరములందు కలవు. దశదోహదము లను గురించి సంస్కృతమున ఇట్లు కలదు:

దశదోహదములు

శ్లోకము : స్త్రీణాంస్పర్శాత్ప్రియంగు ర్వికసతి వకుళః సేధుగండూష సేకా,
త్పాదాఘాతా దశోక, స్తిలక కురవకౌ వీక్షణాలింగనాభ్యామ్,
మన్దారో నర్మవాక్యా త్పటుమ్మృదు హసనాచ్చమ్పకో వక్త్రవాతా,
చ్చూతోగీతాన్న వేరుర్వికసతి చపురోన ర్తనాత్కర్ణికారః.[2]

కరస్పర్శచే మాకందమును, ఆలింగనముచే కురువకమును, తిలకమును వీక్షణము తోడను, అశోకమును పాదతాడనమున, చూతమును గీతముతో. ముఖ రాగముతో

1. పద్మినీ పరిణయము -
2. కాళిదాసు మేఘ సందేశము - ద్వితీయ స్సర్గః శ్లో - 17.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చంపకమును, వకుళమును ముఖ సీధువుతో, సింధువారమును ముఖానిలముతో, కర్ణికారమును సల్లాపనుతో కన్నెలు వికసింపచేయుదురు. ఈ దశ దోహద క్రియల చేత ఆ యాతరువులు పూలను వికసించి హృదయానందమును కలుగ చేయునని కవులు వ్రాయుదురు. ఈ కవయిత్రియు పూర్వ కవుల రీతిలోనే దశదోహద క్రియలను తెలుపుచు పద్య రచన సుందరముగా నొనరించినది.

సీ. సరసిజముఖియోర్తు సహకార భూజంబు
కరములచే నందిగారవించె
కలకంఠియొక్కతె తిలకద్రుమంబును
గౌతుక మొప్పగా గలయజూచె
సింధువారము నీడ సుందరీ మణియోర్తు
నాసీనయై ముదంబలరనూర్చె
తరుణీమణి యొకర్తు కురవకంబునుజేరి
కౌగిట గదియించి గారవించె
వారిజాననయోర్తు వకుళ భూజము జేరి
రమణదలిర్ప కల్లుమిసివైచె
కలికి యొక్కతెయశోకంబు డాయగనేగి
తన పాదపల్లవంబునను దన్నె
కలకంఠి యోర్తు ప్రేంఖణము నీడ వసించి
నీటు దలిర్పగా పాటపాడె
నయము దలిర్పగా నాగవేణియొకర్తు
పొన్నమ్రాకును జేరబోయినగియె
నాగయాన యొకర్తు గోగుజేరగనేగి
మంజులంబై తగు మాటలాడె
చంద్రాస్య యొక్కతె చంపకంబును డాసి
పరువడి యానన ప్రభలు నెరపె.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తే.గీ. ఇటుల దశదోహదంబుల నింపుగాంచు
తరుల నలరుల నెత్తించి తరుణులపుడు
మరియనుత్సాహ వశమున మగువ లెల్ల
కూర్మి జలకేళి యొనరింపగోరి మదిని.[1]

పద్మినీ పరిణయకావ్యము చక్కని వర్ణనలతో, ద్రాక్షాపాకముతో, శృంగార రస ప్రధానముగా నుండి కవయిత్రి ప్రతిభకుదాహరణముగా నిల్చియున్నది. పద్యము లన్నియు మనోరంజకముగా నున్నవి కాని, తృతీయాశ్వాసమునందు, పద్మినీ మాధవుల శోభన వర్ణనము విస్తారముగా సాగినది. తృతీయాశ్వాసమునందు నూట యేబది నాలుగు పద్యము నుండి నూట ఆరువది యేడవ పద్యము వరకు ప్రాచీన శృంగార కావ్యముల రీతిలోనే నడచినది. డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారు "ఈ వర్ణనలను పచ్చి పచ్చిగా వర్ణించుట యుచితమా" అని భావించినది.[2] మహిళా కవయిత్రులకు అది కొంత అనుచితమే. ఆ ఘట్టము తప్పించిన, మిగిలిన కావ్యమంతయు మృదుమధుర శబ్ద సహితమై, రమణీయాత్మకమైయున్నది.

ప్రాచీన కవయిత్రులలో పేరొందిన ముద్దుపళని కావ్యము పూర్తిగా శృంగార శాస్త్ర ధోరణిలో సాగినది. అట్టి ప్రబంధముల కన్నను కవయిత్రి కావ్యము ఎంతో ప్రశంసించదగియున్నది. సీతాంబగారి "పద్మినీ పరిణయము"న అచ్చటచ్చట గల సుబోధకములగు పద్యములు కావ్యమునకు శోభను కలిగించి, కవయిత్రి కీర్తిని నిలుపునవిగానున్నవి. కవయిత్రియైన సీతాంబగారు స్త్రీ విద్యాభిమానియని ఈ పద్యము వలన తెలియును.

యౌవన వతియైన పద్మిని సౌందర్యముతో విరాజిల్లుటేగాక సకల శాస్త్రములనభ్యసించినది.

---

1. పద్మినీ పరిణయము - ద్వితీయాశ్వాసము, పద్యం - 97.
2. డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారు-ఆంధ్ర కవయిత్రులు, పుట-166-71

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తే.గీ. కావ్యనాటకముల యందు గణనకెక్క
మహిసలంకార శాస్త్రంబు రహినెరింగి
సరస కవితను భారతి సరణి నొప్పి
యెల్ల విద్యల ప్రౌఢయై యుల్లసిల్లె.[1]

అని వివరించినది. సరసకవితా ధురీణురాలగు ఈ కవయిత్రి రచించిన పద్మినీ పరిణయమును నెల్లూరులోనున్న శ్రీ వాగ్వల్లి గ్రంథమాల వారు ప్రకటించి, ఆమెకు చిరయశస్సును కూర్చినారు.

గృహిణిగానుండి, ఇంటిపనులు, పిల్లల పెంపకము, భర్తసేవ వంటి దిన కృత్యములను నెరవేర్చుచు కూడ రచనా వ్యాసంగమును చేపట్టి, ఈ పద్మినీ పరిణయ కావ్యమును రచించినట్టి కవిరాణి చిల్కపాటి సీతాంబగారు ఎంతయు ప్రశంసనీయురాలు. వర్ణనాత్మకమైన ఈ కల్పిత కావ్యము కవయిత్రి మేధా సంపన్నతకు మచ్చుతునుక మాత్రమే. ఈ కావ్యమును ఆ కాలమున మెట్రిక్ లేషన్ తరగతులకు పాఠ్యపుస్తకముగా నిర్ణయించదగినదిగా యున్నదని శ్రీ వెంకట రంగయ్యగారు అభిప్రాయమును తెలిపినారు.[2] ఈ పద్మినీ పరిణయమే గాక సముద్రమథనము, దిలీప అను నాటకములు అరవిందయను నవల కలవు.

సముద్రమథనము అను విష్ణుమాయావిలాస నాటకము

కవిరాణి చిల్కపాటి సీతాంబగారి రచనలలో పద్మినీ పరిణయము తర్వాత గణింపదగిన రచన విష్ణుమాయావిలాసము అను నాటకము. దీనికే సముద్ర మథనము అను పేరు గలదు. దీనిని కూడ 'శ్రీ వాగ్వల్లి' గ్రంథమాలవారే ప్రకటించినారు. శ్రీమాన్ కొమాండూరు వేంకట రామానుజాచార్యులవారు ఈ గ్రంథమునందు కూడ సాయపడిరి.

1. పద్మినీ పరిణయము-ప్రథమాశ్వాసము - పద్యం - 61.
2. ఒంగోలు వెంకటరంగయ్యగారు బి. ఎ. బి.ఎల్., గృహలక్ష్మి మార్చి, 1933 సంచిక పుట. 33 నుండి 37 వరకు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ నాటకము ఏడంకములు గలదై చక్కని రచనచే నొప్పుచున్నది. ఇతివృత్తము 'సముద్ర మథనము' నొనర్చి విష్ణువు మోహినీ రూపమున అమృతమును పంచి ఇచ్చినది. కథ సామాన్యముగా అందరకును పరిచితమైనది. కాని నాటకమును రచించిన తీరు చక్కగా నున్నది. ప్రథమాంకమునుండి, సప్తమాంకము వరకు చదివించగల రచనా పటుత్వమును కలిగి యున్నదీ నాటకము. నాటకము చదువుచున్నపుడు విసుగు జనించదు. ఇది ప్రదర్శన యోగ్యముగా కూడ నున్నది. ఈ నాటకమున సంభాషణలతో పాటు చక్కని, చిక్కని పద్యములున్నవి. నాటక లక్షణముల ననుసరించి ప్రథమాంకమున "నాంది" ఎంతో చక్కగా రచింపబడినది. 'నాంది' లోని పద్యము "తరుణి విధంబు గైకొనుచు దానవులగ్గికురించి మున్సుధన్ వేల్పులకు కౌతుకమొప్పగ పంచి ఇచ్చియున్" అని అనుటచే నాటకము యొక్క పేరు తెలియుచున్నది. సూత్రధారి, నటి యొక్క సంభాషణను బట్టి నాటక ఇతివృత్తము తెలియును.

ఇతివృత్తము: దూర్వాస మహాముని ఇంద్రునికొసగిన పుష్పమాలను ఏనుగు త్రొక్కుటచే, ఆ ముని యాగ్రహము చెంది, ఇంద్రుని శపించెను. ముని శాపము వలన ఇద్రుని విభవ మంతయు చెదిరిపోవును. కల్పవృక్షము, కామధేనువు, ఐరావతము, ఉచ్చైశ్రవము, అమృత కలశము అన్నియు అబ్ధిలో కలియును. బలిచక్రవర్తి స్వర్గము నాక్రమించుట, ఇంద్రుడు మరల తన విభవమును పొందుటకు రాక్షసుల సహాయమున, సాగర మథనమొనరించి, తొలగిపోయిన వస్తువులన్నింటిని తిరిగి పొందుట, ఈ నాటకము ఇతివృత్తము. ఇందులోనే కవయిత్రి చివరి భాగమున కొంత కల్పన చేసినది. ఈ కల్పనలో కవయిత్రికి వైష్ణవ మతమునందుగల అభిమానము కనుపించును. ఈ విషయములో కనుపర్తి వరలక్ష్మమ్మగారు కూడ తమ అభిప్రాయమును వ్యక్తీకరించినారు.[1] శివుని హాలాహలభక్షణ సమయమున మంగళగౌరి తనపతి భక్షణ

---

1. ఈ సముద్ర మథనమునందు గరళ భక్షణము సేయనున్న పతిని పార్వతి వారించినదనియు, వినక శివుడు హాలాహలమును మ్రింగి స్మృతిహీనుడై

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున కెట్లు ఒప్పినది మహాకవి పోతన, ఒక చిన్న పద్యములోనే ఎంతో భావ గర్భితముగా వర్ణించినాడు.

క. మ్రింగెడువాడు విభుండని
మ్రింగెడిదిగరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళసూత్రంబునెంతమది నమ్మినదో.[1]

ఆ విషభక్షణ వలన పరమేశునకెట్టి కష్టము కూడ కలుగ లేదనియు, కంఠము నందు నలుపు మచ్చ కలిగి, అది, ఒక భూషణమువలె కన్పించినదని పోతన మహాకవి వ్రాసినాడు.[2]

కాని కవయిత్రి ఈ నాటకమున, విషము మ్రింగుటవలన శివునకు విషము తలకెక్కి, శరీరమంతయు ముచ్చెమటలు గ్రమ్మి అవయవములు స్తంభీభూతములై నట్లును పతిని కాపాడుమని పార్వతీదేవి విష్ణుమూర్తిని ప్రార్థించినట్లును రచించినది.[3] విషతాపముచే మూర్ఛనొందిన శివుని గాంచి, తాను కూడ మూర్ఛపోయి సఖులు శైత్యోపచారములు చేయగా స్పృహ గాంచిన పార్వతీదేవి "ఓ దీనదయాపరా, ఇందిరావరా, ఎందున్నావు?" అని యిట్లు ప్రార్థించినది :

పడిపోయెననియు, అప్పు డుమాసతి భయంబుచెంది విష్ణుమూర్తిని గూర్చి మొరపెట్టుకొనెననియు శ్రీహరి ప్రత్యక్షమై హరుని రక్షించి పార్వతి దుఃఖ ముడిపెనని గలదు. ఇది ఏ గ్రంథమునగలదో తెలియదు. అయినను కవులగు వారు తమ కావ్యములందు తమ మతాభిప్రాయములను వివరించుట లోకసామాన్యము. ఇందును కవయిత్రి కవి సాంప్రదాయ మునే అనుకరించెనని చెప్పవచ్చును.

కనుపర్తి వరలక్ష్మమ్మగారు - గృహలక్ష్మి, ఆగష్టు 1934-పుట 475.

1. భాగవతం - అష్టమస్కంధం - పద్యం 241.
2. భాగవతం - అష్టమస్కంధం - పద్యం 244-247.
3. శ్రీ విష్ణుమాయావిలాసము - పుట 34.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. విసతాపమున నొక్క పసదూలియున్న నా
పతిని రక్షింపవే పద్మనాభ
శరణాగతుల బ్రోవ సమకట్టి నట్టినా
వల్లభుగావవే వాసుదేవ
నిరతంబు నీపాద స్మరణ గావించునా
కాంతుని మనుపవే కమలనేత్ర
అని శంబు సుజనాళి నరసి రక్షించునా
ప్రభుని గాపాడవే భక్తవరద

తే.గీ. దిక్కు నీవని నమ్మితి దివిజవంద్య
చేరగా వచ్చి యేలవే శేషతల్ప
అభయ హస్తం బొసంగవే యార్తపాల
కరుణ జూడవే యిందిరావరముకుంద.[1]

నాటకమునకు "విష్ణుమాయా విలాసము" అను మరియొక పేరు కలదు. విష్ణు మాయా విలాసమని పేరు పెట్టుటచే విష్ణుమహిమను ప్రతిచోటను చూపించవలయు ననెడి ఉద్దేశ్యము కూడ కొంత యుండవచ్చును.

విష్ణువు మోహినీ అవతారమెత్తి అమృతమును దేవతలకు పంచిన పిదప నాయకుడు, కైలాసమున కేతెంచి పరమేశ్వరునిముందు మోహినీ సౌందర్యమును పొగడినట్లు పంచమాంకమున ప్రథమరంగమున కలదు. నారదుని మాటలు విని మహేశ్వరుడు మదనుని జయించిన నన్ను మోహిని యేమి చేయగలదని పల్కెను. పార్వతీదేవి "మోహిని సౌందర్యమునకు ఎట్టివారలైనను వశులగుదురు. అదియును గాక మత్స్య కూర్మాది అవతారములనేకములు దాల్చి ప్రపంచంబు నుద్ధరించు ఆ భక్త వరదుని మహాత్మ్యంబు లెరుగరా" అని పలికి పంతములాడ వలదని చెప్పెను. అయినను ఈశ్వరుడు నారాయణునిపై పంతముబూని హరియొక్క మోహినీరూపమును గాంచుటకు వైకుంఠమునకు వెడలెను.

1. సముద్రమథనము - ప్రథమ అంకము - తృతీయరంగము, పుట 34.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

షష్ఠాంకమునందు ప్రథమరంగమున విష్ణువు మోహినీ అవతారమెత్తి తన చెలులతో కూడ మహేశునకు, నందీశునకు, భృంగీశునకు, వలపు గొలిపి మాయా మోహముతో నిలుపును. వారిని గాంచిన మహేశుడు, అతని అనుచరులు మదన జ్వాలల యందు వేగిపోవుదురు. కాముని జయించిన ధీమంతుడనని గర్వించిన శివునకు మోహోద్రేకము కల్పించి పిచ్చివానిగా చేసి,చివరకు తన నిజరూపమును ప్రదర్శించి నారాయణుడు పరిహాసముతో నవ్వును. ఇదియే విష్ణుమాయా విలాసము.

ఈ కథ పంచమాంకమునుండి ప్రారంభమై సప్తమాంకము వరకు నడచినది. విష్ణుమాయను చూపించుటయే ప్రధాన విషయముగా భావించి కవయిత్రి ఈ శృంగార రసభరితమైన ఈ కల్పిత కథను చివరి అంకములందు చేర్చినది. కథ కల్పితమైనను సంభాషణలలో పటుత్వముండుట వలన నాటకము చివరి వరకు విసుగులేక చదవగల్గునట్లు రచించినది. ఈ నాటకము కవయిత్రి కల్పనా ప్రతిభకొక చిన్న మచ్చుతునుక వంటిది.

ఈ నాటకమున పద్యములు కూడ చాలా గలవు. ఆ కాలమున నాటకములలో అడుగడుగునా పద్యములను, పాటలను చేర్చి, రాగయుక్తముగా రంగస్థలము నందు పాడెడివారు. ఆ పద్ధతిని బట్టియే ఈ కవయిత్రి కూడ నాటకమునందు చాల పద్యములను చేర్చినది. ఈ పద్యములలో ప్రాచీన కావ్యములలోని పద్యముల పోలిక యెంతయు కన్పట్టుచున్నది. కొన్ని పద్యములు నీత్యుపదేశకరమునైనవి కలవు. మఱికొన్ని వర్ణనలతో కూడినవి కలవు. షష్ఠాంకమున తృతీయ రంగమున, ఉద్యానవనములో పరమేశ్వరుడు మోహినిపైగల మోహములో మూర్ఛిల్లి, మరల లేచిన పిదప విరహముతో చెంతనున్న తరువులను,లతలను గాంచి ఇట్లు పలుకును:

సీ. పున్నాగ కానవే పుండరీ కాక్షిని
 తిలకంబకానవే జలజముఖిని
మందారగానవే కుంద సుందరదంత
 చందన కంటివే జలజగంధి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చూతంబ గానవే సుందరీమణి నెందు
ఘన సారకానవే ఘననితంబ
సంపెంగ జూచితే చంపకామోదను
కుందంబ గానవే మందగమన

తే.గీ. దండమొనరింతు మీకునో తరువులార
మీమరుంగున నాయన్ను మిన్న యున్న
తగవుగా మందలించి యామగువ తోడ
నన్ను దానిని గూర్చరే నయము మీర.[1]

ఇట్టి పద్యమే ఆంధ్ర పాఠక లోకమంతయు నెరిగిన భాగవతమున గోపికా గీతల యందు ప్రసిద్ధమై యున్నది. కృష్ణుని విరహముతో కాళిందీతటమున గోపికలు తరువు తరువున వెదకుచు, ఇట్లనిరి:

సీ. పున్నాగకానవే - పున్నాగవందితు
తిలకంబకానవె తిలకనిటలు
ఘన సార కానవే మన్మధాకారుని
వంశంబ కానవే వంశధరుని
చందన కానవే చందనశీతలు
కుందంబ కానవే కుందరదను
మన్మధకానవే మన్మధాకారుని
వంశంబకానవే వంశధరుని.

తే. నింద్రభూజమ కానవే యింద్ర విభవు
గువల వృక్షమ కానవే కువలయేశు
బ్రియక పాదపకానవే ప్రియవిహారు
ననుచు కృష్ణుని వెదకి రయ్యబ్జముఖులు.[2]

1. సముద్రమథన నాటకము-షష్ఠాంకము-తృతీయ రంగము - పుట. 115.
2. పోతన భాగవతము. దశమ స్కంధము - అధ్యాయము - 30. పద్యం 1008. - పుట. 427.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ కవయిత్రి భారత, భాగవతాది గ్రంథముల నన్నింటిని పఠించినది. కనుక, ఆమె కవితా వాహినిలో, అన్ని గ్రంథముల సారము కలిసి యున్నదని చెప్పకనే చెప్పుచున్నది. నాటకమునందు చిక్కగా సాగిన సంభాషణల మధ్యన అచ్చటచ్చట చక్కని సదుపదేశ కరములగు పద్యములు కలవు. ముక్కోపి యగు దుర్వాసునికి, ఇతరులపైన ఆగ్రహించుటే కాని, అనుగ్రహించుట తెలియదనియు, మానవుడెన్ని వ్రతము లాచరించినను, శాంతమును ముఖ్యముగా వహింపవలయు నని ప్రథమాంకమున, ఇంద్రుని ద్వారా చెప్పించినది.

తే.గీ. వ్రతము లొనరించినను నేమి యతులనిష్ఠ
జపము గావించినను నేమి తపసి యగుచు
జడలు దాల్చిన ఫలమేమి జనుని మదిని
కరుణయును, శాంతి లేకున్నగలదె ఫలము.[1]

మానవునకు కరుణ, శాంతములే ప్రధానమైనవని పై పద్యము వలన తెలియును. మానవునకు కష్ట సుఖములు సమానముగా కల్గుచుండును. సకల జంతు కోటికి కల్గు కష్ట సుఖములలో కష్టములందు అధైర్యపడగూడదని జయంతుడు, ఇంద్రునితో పలుకును.

చం. సకల జగంబు రక్షణకు సాక్షియునై నిగమ స్వరూపుడై
ప్రకటిత లీలదేజరిలు భానుడు గృంగుట లేదె నిత్యమున్
వికలత నొంది సత్కళల వీడడె చందురు దట్ల గుందివా
రకలుషులౌచు సభ్యుదయ మందుచు నుండుట లేదె క్రమ్మరన్.[2]

బలి చక్రవర్తి రాక్షస రాజైనను, అతని యందు సుగుణములే కలవు. తన అనుచరులైన దానవులకు బలి చక్రవర్తి ఇట్లు బోధించెను:

---

1. సముద్ర మథనము - ప్రథమాంకము - పుట. 5.
2. సముద్ర మథనము - ద్వితీయాంకము - ప్రథమరంగము - పుట. 8.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మ. తపములేసేయుచు నుండు సన్మునుల బంతంబూని బాధింపగా
నెపుడుంజిత్తమున న్దలంపకుడు యేయే చోట్ల యాగంబులన్
జపముల్జేసెడువారి కెగ్గు లెచటన్ సల్పంగబోరాదు మీ
రెపుడున్ ధర్మము తప్పకున్న సుకృతంబెంతేనియున్గల్గెడిన్.[1]

మునులను బాధింపవలదని చెప్పుటయేగాక, అమరుల ఆడువారెచటనైన కనపడిరేని గౌరవము చూపవలయును కాని, విమూఢచిత్తముతో మెలగవద్దని ఆదేశించెను. కపటవ్యక్తులను గురించి శుక్రాచార్యు డిట్లు పలికెను:

ఆ.వె. మానసంబున గపటంబు మరుగుపరిచి
వెలికిసుజనుల పలె దోచు కలుషమతుల
నెరిగి గురుతించి దండిపనెంచవలయు.
నృపుల ధర్మంబులివి మదినెంచుడెపుడు.[2]

ధూర్తులతెరగును, శుక్రాచార్యుడు బలి చక్రవర్తి కిట్లు తెలిపెను :

చ. వదనము చూడబద్మమన వచ్చును బల్కుల తీరునెన్నగా
సదమలమైన చందనము చాడ్పున చల్లదనంబు గూర్చెడున్
మది పరిశోధనల్ సలుప మాటికి రంపముకన్న వాడియౌ
నిదియగుధూర్తవృత్తి తగదిట్టి స్వభావుల నొద్దజేరగన్.[3]

ధూర్తుల లక్షణమును తెలుపు ప్రసిద్ధమైన శ్లోకప్రభావము పై పద్యముపై కలదు.

శ్లో. ముఖం పద్మదలాకారం వాచా చన్దనశీతలా
హృదయం క్రోధ సంయుక్తం త్రివిధం ధూర్త లక్షణమ్.[4]

---

1. సముద్ర మథనము - (ద్వితీయాంకము). ద్వితీయ రంగము - పుట. 15.
2. సముద్రమథనము - ద్వితీయాంకము - ద్వితీయ రంగం, పుట 16.
3. సముద్రమథనము - ద్వితీయాంకము - ద్వితీయరంగము, పుట 17.
4. సుభాషితరత్న భాండాగారములో నున్నది. మూలము చూపలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనుజునకు కష్టములే శుభములకు కారణములగును. కష్టములను జూచి వగ జెంద నేలయని శుక్రాచార్యుడు బలి చక్రవర్తికి, శతమఖుని గురించి పలుకు నపుడు తెలిపెను.

ఆ.వె. కడుభయము గూర్చు పిడుగులు పడిగాదె
యఖిల జీవదాయిమైనయట్టి
వర్షమొదవుచుండు వసుధనీ తీరున
కష్టములెశుభముల కారణములు.[1]

మానవుడు చతుర్విధ పురుషార్థములు గడింప దగినవి అని "ధర్మార్థకామ మోక్షములను" చతుర్విధపురుషార్థములను కలిగినట్టి బలి చక్రవర్తిని నారదుడు ప్రశంసించెను.

సీ. తపమును, శాంతంబు, దయయు నిష్టయుగల్గి
మహితమై నట్టి ధర్మముగడించి
విభుదేంద్రు బోద్రోలి విష్టపత్రయమును
శాసించి యర్థంబు సంగ్రహించి
అఖిలోపభోగంబులనుభవింపుచు నిష్ట
కామ్యార్థములనంది ఘనతబొంది
శ్రీరమావిభు పాదచింతనంబున ముక్తి
కరతలామలకంబుగా గ్రహించి
తే.గీ. లలిజతుర్విధ పురుషార్థముల గడించి
నట్టిపురుషవరుండ వీవగుచు నుండ[2]

అని చతుర్విధ పురుషార్థములను పొందిన బలి చక్రవర్తిని ప్రస్తుతించెను. మానవ జన్మ పొందిన ప్రతివాడు పొందవలసిన వానిని కవయిత్రి నారదుని ముఖమున చెప్పినది.

---

1. సముద్ర మథనము-ద్వితీయాంకము-ద్వితీయరంగము - పుట. 18.
2. సముద్ర మథనము-ద్వితీయాంకము-ద్వితీయరంగము - పుట. 20.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరోపకారమును గూర్చి నారదుడు శుక్రాచార్యునితో నిట్లు పలికెను:

క. తనకుప కారమొనర్చెడు
ఘనునకు నుపకృతి యొనర్పగా సహజమగున్
అనయంబు గీడు సేసెడు
జనునకు మేలెంచవలయు జగతిని ధీరుల్.[1]

పరోపకారమును గూర్చి ప్రసిద్ధులైన నీతిశతకకారులు కూడ వివిధ రకములుగా ఉపదేశించినారు. అందు బద్దెన కవి చెప్పిన నీతి శతకమునందు కూడ పై పద్యమును బోలిన పద్యము కలదు.

క. ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయవివరింపంగా
అపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ.[2]

తమ నాశ్రయించినవారికి రక్షణ మొనరింపవలయునని కవయిత్రి ఇట్లు తెలిపినది. హాలాహలముద్భవించినపుడు బ్రహ్మాది దేవతలు పరమేశ్వరుని ప్రార్థించిరి. దేవతలను భయపడవలదని పలికి శివుడు కాలకూటమును కబళించుటకు వెడలును. పార్వతి వలదని వారించును. కాని మహేశుడు తన నాశ్రయించిన వారికి రక్షణ నొసగవలయునని, ఇట్లు పలుకును:

చ. భయమును జెంది దీనులయి పాదములన్బడి నట్టివారలన్
గయికొని రక్షణ న్సలుపగా దగు సజ్జనులైనవారికిన్
దయవిడనాడి వారి విపదంబుధి ద్రోచిన దుర్జనాళికె
వ్వయిన శుభంబు గల్గునె మహాపదలంబడి క్రుంగకుందురే.[3]

---

1. సముద్ర మథనము - ద్వితీయాంకము - పుట. 21.
2. బద్దెన - నీతి శతకము.
3. సముద్ర మథనము - ద్వితీయాంకము - పుట 32.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సముద్రమథనము తర్వాత, దేవేంద్రుడు కోలుపోయిన విభవమునంతయు పొంద గలిగెను. అతని ఓరిమిచేత తిరిగి సంపదలను పొందగలిగినాడని విష్ణుమూర్తి ఇంద్రుని సహనమును గూర్చి దేవగురువునకు తెలిపెను. సజ్జనులను కష్టపెట్టు వారికి జయము కలుగదని, అసురులను నిందించి ఇట్లు పలికెను :

తే.గీ. ఆపదలె సాధువులకు మహా శుభముల
కాకరంబగు సుజను లౌనట్టివారి
విజయములె దుఃఖ హేతువై వెలయుచుండు
సజ్జనుల నేచువారికి జయముగలదె.[1]

సాగరమథన సమయమున జనించిన వేలుపుటావు, ఉచ్చైశ్రవము, ఐరావతము, కల్పవృక్షము, అచ్చరలతోపాటు వారుణియను నొక స్త్రీ సురాభాండముతో పుట్టినది. మంచి వస్తువులు జనించినచోట చెడు వస్తువులు కూడ నుండుట సహజము. ఆ మదిరాపానము వలన లోకమున కెంత నష్టము వాటిల్లునో ఈ పద్యమున తెలిపినది కవయిత్రి సీతాంబగారు.

సీ. ధనవంతులగువారి ధనమెల్ల హరియించి
పాకముందరనుండు బంట్లజేయు
నాలు బిడ్డలయందు నమరెడి ప్రేమంబు
వేగమే దరలించి జోగిజేయు
దాస్యవృత్తిని బూని ధనము నార్జించుచు
దనసేవనొనరింప ననువుజూపు
మనవంటి వారల ఘనస్నేహ బద్ధుల
గావించి యాడించు గౌతుకమున.[2]

అని మదిరాపానమువలన కలుగు నష్టమును వారుణియను స్త్రీ చెప్పినది. అది పరమ సుఖమునిచ్చునని వారుణి వ్యంగ్యముగా చెప్పినను దుఃఖమును కల్గించునను భావము తెలియుచున్నది.

---

1. సముద్రమథనము - చతుర్థాంకము - తృతీయరంగము - పుట 57.
2. సముద్రమథనము తృతీయాంకము - పుట 39.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పద్యములలో కొన్ని తావులందు వ్యవహారికమున నుండు జాతీయములను చేర్చి, పద్యమునకు శోభను కల్గించినది కవయిత్రి. "అగ్నియినుముగూడ సమ్మెట వ్రేటులకుందినటుల" అగ్గి కొంగున ముడిపైచినటులుగాక, పుండుపయి కారము, ఉప్పునుజల్లినట్లుగన్ మొదలగు జాతీయములను సందర్భోచితముగా పద్యములందు చేర్చినది.

నాటకమునందు పలుదావులలో, పద్యములలో కూర్చబడిన సదుపదేశముల చేత కవయిత్రి యొక్క సౌశీల్య హృదయము విశదమగుచున్నది.

వర్ణనలు కనులకు కట్టినట్లు వర్ణించుట ఈ కవయిత్రికి గల సహజ పాండిత్యమునకుదాహరణములు. సముద్ర మథమున, ద్వితీయాంకమున; అమృత పానము వలన చిరాయులై, నిత్యయౌవనము కలిగి, అఖిల సుఖములను పొందె దరనియు, అది సేవించని యెడల వచ్చునట్టి దుర్భర వార్ధక్యముతో, ఎన్ని భోగములున్నను అనుభవింపజాలమనియు, శుక్రుడు బలిచక్రవర్తికి వార్ధక్యపు బాధను గురించి తెలిపిన పద్యమిట్లు గలదు :

సీ. నీలంపు చాయల నెగడు శిరోజముల్
రాలుచువెస పాండురతవహించు
లావణ్యపుంజమై రహిమించు వదనంబు
దంతంబులూడగా దరుగువన్నె
దేహపటుత్వంబు దెరలి శుష్కించుచు
కడురోత పుట్టించు ముడుతలువడు
కనులకు వెస పొరల్ గ్రమ్మచిత్తమ్ము స్వా
ధీనమొందదు వాక్కుదిటముచెడును

తే.గీ. చెవుడు ప్రాప్తించు దండంబు చేతనమరు
సతియు, సుతులును బరిజనుల్ సరకుగొనరు
మౌనముద్రయు గైకొని మంచమునను
కష్టములనట్టి కాలంబుగడుప వశమె ?[1]

1 సముద్ర మథనము-ద్వితీయాంకము-ద్వితీయరంగము - పుట. 27.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్టి జరాభారమును మోయుటకన్న మరణమే మేలు అనునట్లుగా కన్నుల కట్టినట్లు వర్ణించినది కవయిత్రి. ఈ నాటకమున చతుర్థాంకమువరకు, బలిచక్రవర్తి స్వర్గ పాలనకు వచ్చుట, సాగరమథనము తరువాత ఇంద్రుడు తిరిగి వైభవముతో స్వర్గమును పొందుట కలదు. తరువాత పంచమాంకము నుండియు విష్ణు మాయా విలాసము ప్రదర్శింపబడినది. విష్ణుమాయకు లోనైన రుద్రుడు, రుద్రానుచరులు మోహినిపైగల మోహముతో శృంగార చేష్టలనొనరించుట, విష్ణుమూర్తి వారికి కనువిప్పు కలుగజేయువరకు నాటకము శృంగార రసభరితముగా సాగినది. మోహిని వర్ణనలు, మహేశుని మదనతాపము, అన్నియు ప్రబంధ ధోరణిలో సాగినవి. అంతమున సప్తమాంక ద్వితీయ రంగమున పార్వతీదేవి నారాయణుని ప్రస్తుతించుటయు, నారదుడు నారాయణ నామమును నృత్యగీతములతో వినిపించుటతో ఈ నాటకము ముగిసినది.

గీ. గడియకొక్కొక విధముగా గానుపించి
చూడజూడగ నొకవింత సొగసుగలిగి
కమ్మతావులు దిశలందు గ్రమ్మనలరు
బంతి నాడుచునున్నదీ ఇంతిమిన్న.[1]

అని చూచి మురిసిపోయెను. ప్రబంధవర్ణనారీతిలో సాగిన ఈ పద్యము హృద్య ముగా నున్నది. ఇట్టి పద్యములు నాటకమున మోహినీ వర్ణనా సందర్భమున కలవు. కవయిత్రి నాటకమునందు సదుపదేశకరములైన పద్యములను ఉచిత రీతిలో రచియించినట్లే శృంగార రసభరితమై, వర్ణనాయుతములగు పద్యము లను కూడ మధురముగా రచించినది. సాగర మథనమం దుద్భవించిన మోహినిని గాంచి బలిచక్రవర్తి మోహపరవశుడగును. మోహినితో చతుర ప్రసంగముతో ఆనందించును. ప్రసంగ వశమున ఆమెను ప్రశంసించుచు ఇట్లు అనును:

1. సముద్ర మథనము - షష్ఠాంకము - ప్రథమ రంగము-పుట 92.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తే.గీ. చతురపతిగాని సతిపొందు సలుపు కంటె
ప్రౌఢతోడుత సరస సంభాషణములె
సరసుడగువాని కెంతయు సంతసంబు
గలుగజేసెడి నను పల్కు పలుక వినవె.[1]

ఇట్లు భావవ్యక్తీకరణ మొనరించు చక్కని పద్యములతోడను, అద్భుత కల్పనలతో, సంభాషణాపటిమ కలిగిన ఈ నాటకము రస భరితమై యున్నది.

సాధారణముగా గద్యరచన మొనరించినవారు పద్యరచన యందును, పద్యరచన మొనరించినవారు గద్య రచనమునందును రాణించ జాలరు. ఏ కొందరో అట్టి ప్రతిభాశాలురుందురు. కవిరాణి చిల్కపాటి సీతాంబగారు గద్య, పద్య రచనలు రెండింటను తమ కౌశలమును చాటుకొన్నారు. ఈ నాటకమున మంగళాభివృద్ధి నాశించుచు నాటకాంతమున భరత వాక్యము తెలిపినదీ కవయిత్రి.

భరతవాక్యము

తే.గీ. ధరణి సకల సుఖంబుల దనరుగాక
ధర్మమున నేలుదురుగాక ధరణి విభులు
పాడిపంటలచే భువి ప్రబలుగాక
కవుల గ్రంథంబులకు వన్నె కలుగుగాక.

ఆ కవయిత్రి ఆశయము చిరకాలము ఫలించుచునే ఉండును.

దిలీప నాటకము

కవిరాణి చిల్కపాటి సీతాంబగారి రచనలలో దిలీప నాటకము కూడ ఎన్నదగినది. ఇది చిన్న నాటకము. ఆరు అంకములిందు కలవు. కాని చాల చిన్నవిగా నున్నవి. ఇందలి ఇతివృత్తము ప్రసిద్ధమైనదే. మహాకవి కాళిదాసు రచించినట్టి రఘు వంశములోని ప్రథమ, ద్వితీయ, తృతీయ సర్గల యందు

1. సముద్ర వధము-చతుర్థాంకము-ప్రథమ రంగము - పుట 43.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దిలీపుని కథ కలదు. రఘు వంశ కథ ఆధారముగనే ఈ నాటకము రచింపబడి నది. నేను పరిశోధన కొరకు గ్రహించునవి కేవలము కవయిత్రుల కావ్యములే. నాటకములు, నవలలు, వచన రచనలు, నా పరిశోధనా పరిధిలోనికి వచ్చునవి కావు. కాని కవయిత్రి నాటకమునందు కూడ, ఎన్నో పద్యములను రచించి, తన కవితా పటిమను చాటుకొన్నది. అందువలన పరిశోధనలో భాగముగా ఈ నాటక పరిశీలన జరిగినది.

రఘు వంశమున ప్రథమ సర్గ యందు పదుకొండవ (11) శ్లోకము నుండి దిలీప మహా రాజు కథ ప్రారంభమైనది. తృతీయ సర్గలో ఇరువది యొకటవ శ్లోకము వరకు దిలీపునికి సంతాన ప్రాప్తి యగువరకు గలదు. కాని కవయిత్రి ఎక్కువ భాగము ద్వితీయ సర్గ ఆధారముగనే రచించినది.

ఈ నాటకమున సుదక్షిణా దిలీపులు సంతాన ప్రాప్తికొరకు తమ కుల గురువగు వసిష్ఠుని ఆశ్రమమునకు వెడలి అతనిని ప్రార్థింతురు. వసిష్ఠుని యుప దేశముచే నందినీ ధేనువును పూజించి గోవు కరుణ వలనసంతాన ప్రాప్తి నొందుదురు.

వసిష్ఠుని ఆజ్ఞతో దిలీప మహా రాజు గోవును అరణ్యములో మేపుచుండెను. ఆ వనములో పార్వతీ దేవి పెంచిన సురదారు తరువు కలదు. వన్య మృగముల బారి నుండి దానిని రక్షించుటకు స్మరహరుడు కుంభోదరుడను సింహమును నియమించెను. వృక్షచ్ఛాయకు వచ్చినట్టి జంతువును సంహరించి తినుమని ఈశ్వరుడు కుంభోదరునకు చెప్పెను. ఆ మాట ప్రకారము దేవదారు వృక్షచ్ఛా యకు ఏతెంచిన నందినీ ధేనువును సింహము పట్టుకొనినది. అపుడు దిలీపునకు సింహమునకు మధ్య జరిగిన సంభాషణ దీర్ఘముగా సాగినది. ధీరోదాత్త నాయకు డైన దిలీపుడు ధేనువును రక్షించుటకొరకు తన గురు భక్తిని, త్యాగ శీలతను, కార్య దీక్షను వెల్లడి చేయుటచే నాటకము రసవంతముగా సాగినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలమైన రఘు వంశమునందు సంతానము లేక పోవుటచేత చింతతో వారిరువురు వసిష్ఠాశ్రమమున కరిగిరి అని యున్నది. కాని కవయిత్రి స్త్రీ సహజమైన హృదయముతో సంతానము లేకపోవుటచే సుదక్షిణా దేవి ఎంతో దుఃఖించినట్లు వివరముగా వర్ణించినది. సంతానము లేని సుదక్షిణా దేవిని చూచి వెరపు చెందిన చెలికత్తె బాధతో-

చ. కరము కృశించె మేను, నవకంజములందులకించు మోముపై
నిరతము పెన్విచారములు నిండిన చందముతోచు, నూర్పులన్
బరపెడి మాటి మాటికిని, బల్విభవంబుల నిచ్చగింపకే
నరవరుదేవి నాటికిని నాటికి వంతలనొందె నక్కటా.[1]

అని వేదన చెందినది. పిల్లలు లేక కుమిలి పోవు స్త్రీ రూపమిందు కన్నుల కట్టుచున్నది. సుదక్షిణ తనలో తానే పుత్రుల కొరకెట్లు కుమిలినట్లు వర్ణింపబడినది:

గీ. అన్వయంబును వృద్ధి సేయంగ జాలు
సుతులబడయంగ నేరని సతియు సతియె
అట్టి కాంత కుటుంబిని యౌనె పతికి
గటకటా వట్టి గొడ్డుతాకట్టుగాక.[2]

"చిట్టి యడుగులు లేని గృహము చిట్టడుపులకన్నను చెడినది" అని సుదక్షిణా దేవి కుమిలి పోయిన విధము, కవయిత్రి కరుణ రస భరితముగా వర్ణించినది. ఈ క్రింది పద్యమున వంధ్యయైన స్త్రీ హృదయమెట్లు విల విల లాడునో వర్ణించిన విధమెంతయు బాధా జనకముగా నున్నది.

చ. బిలి బిలి యాటలున్, మురువు చెందెడి తిన్నని తొక్కు పల్కులున్
గల గల నవ్వులున్ వెలయకన్నులపండువు సేయునట్టి ము

1. దిలీప నాటకము - స్థలకము - 1.
2. దిలీప నాటకము - స్థలకము - 2.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ద్దుం పసిపాపలన్ శిరము దువ్వుచు, బిగ్గ గపుంగిలించు ధ
న్యుల సుకృతంబుకన్న ధరసున్నవె పుణ్యము లెంచి చూడగన్.[1]

సంతానము కొరకు సుదక్షిణ పడిన వ్యాకులమును వర్ణించుటలో కవయిత్రి స్త్రీ హృదయ వేదనను చక్కగా చెప్పినది.

కొన్ని కొన్ని పద్యములను, మూలమైన రఘు వంశము నందలి శ్లోకముల నాధారముగా గొని రచించినది. మూల శ్లోకము నందలి, అర్థమేమాత్రము చెడకుండా చక్కని పద్య రచన చేసినదీ కవయిత్రి.

దిలీప మహా రాజునకు సంతానహీనతకు, కారణమును కనుగొనుటకు వసిష్ఠుడు దివ్య దృష్టి చేత చూచి కామధేనువునకు కల్గిన ఆగ్రహము చేత సంతానము కలుగలేదని రాజునకు చెప్పెను. ఆ ఘట్టమునగల శ్లోకము లిట్లున్నవి:

శ్లో. పురాశక్రముపస్థాయ తవోర్వీంప్రతియాస్యతః
ఆసీత్ కల్పతరు చ్ఛాయా మాశ్రితా సురభిః పథిః 75 శ్లో.

శ్లో. ధర్మలోపభయా ద్రాజ్ఞీమృతు స్నాతా మనుస్మరన్
ప్రదక్షిణ క్రియార్హా యాం తస్యాంత్వం సాధునాచరః శ్లో - 76.

శ్లో. అవజానాసి మాం యస్మాత్ తతస్తేన భవిష్యతి
మత్రప్రసూతి మనారాధ్య ప్రజేతి త్వాంశశాపసా శ్లో - 77.

పై మూడు శ్లోకములలోని భావమును గ్రహించి కవయిత్రి చక్కని పద్య మల్లినది.

---

1. దిలీప నాటకము - స్థలకము - 2.
2. రఘువంశ ప్రథమసర్గ, 75, 76, 77 శ్లోకములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. అతిబలిష్ఠమై సురాహితుల సంగరమున
నణచిమునీన్నీవు దేవాళి కధిక
భద్రంబు గూర్చిన బహుతుష్టుడై శచీ
విభుడు సమ్మానించి వినయమమర
దనరథంబిచ్చి మాతలితోభవత్పురి
కనిపినవేళ నీవతిరయమున
సత్సుత ప్రాప్తి కుత్సాహంబుతో ఋతు
స్నాతయై యున్న నీ సతినిజేర

లే.గీ. బోవనట కామగవి, కల్పభూరుహంబు
హెంతనుండిన నద్దాని పూజసేయ
కరుగు నినుగూర్చి గోవు బిట్టలిగినాదు
సంతతిని గొల్వకే నీవు సత్సుతులను
బడయగానేరవంచు శాపంబొసంగె.[1]

సంభాషణములు కూడ మూల శ్లోకమునందలి భావమునకు అనుకూలముగా, అనువదింపబడినవి.

నాటకమున సంభాషణలు దీర్ఘముగా లేవు. అనవసరమైన పాత్రలు లేవు. కవియిత్రి ధీరోదాత్తుడైన దిలీపమహారాజును నాయకునిగా ఎన్నుకొన్నది. ప్రతి సంభాషణ యందును అతని ధీరోదాత్తత వెలయింపబడినది. కులము, మహా భాగ్యము, ఉజ్వలత, ఉదారత, మహావిశాలత, ధర్మాకలనము, విదగ్ధత అను అలంకార శాస్త్ర రచితగుణములను కలిగియున్న దిలీపుడు నాయకుడగుటచే నాటకము మెచ్చదగినదిగా ఉన్నది.

నాటకమున గోపూజా మహిమ వసిష్ఠుని వలన తెలుపబడినది. గోపూజా మహిమ ఎంతో వివరముగా, హైందవ సంప్రదాయమును తెలుపుచున్నది.

1. దిలీప నాటకము - స్థలకము - 4.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. యాగాది కర్మలయందు గోఘృతమును
గోక్షీరమును మునుల్ గోరిభక్తి
నాగమోక్తంబుగా నగ్నికి వ్రేల్చునా,
హవ్యవాహనుడు ప్రీతాత్ముడగుచు
నాహవిర్భాగంబులాదిత్యుల కొసంగు
నంత దేవేంద్రుడు హర్షమొందు
నాతడు కరుణించి యవనిపై వర్షించు
ధర సస్యవంతమై తనరునంత

తే.గీ. పాడిపంటలచే ధర పరగునవల
నఖిల జగములు సౌఖ్యంబునందు దాన
గాన సృష్టి స్థితులకెల్ల గారణంబు
నిక్కముగ ధేనువే ధరణీశ చంద్ర.[1]

గోఘృతమును, గోక్షీరమును యజ్ఞములలో నుపయోగించుటచే దేవతలు హర్ష మొంది, లోక క్షేమమును కల్గింతురని చెప్పినదే కాక, గోమహిమను ఇంకను ప్రస్తుతించెను.

"మున్ను వేల్పులు భూమిని గోవునుజేసి హిమవంతుని వత్సముగా నొనరించి. సంజీవనీ మున్నగు ఔషధీచయములను పితికిరి. సమస్త ప్రపంచమునకు స్వరూపంబగు ధాత్రి గోరూపిణియే. సర్వ విద్యాధి దేవత యగు వాణియు గోసమాఖ్యచే విలసిల్లుచున్నది. సకల సంపత్ప్రదాత్రి యగు శ్రీ మహాలక్ష్మియు గోరూపమున ముల్లోకముల నారాధింపబడుచున్నది. గోక్షీరము, గోఘృతము' గోదధి, గోమయము, గోమూత్రంబులను పంచగవ్యంబుల నెవ్వరు సేవింతురో' వారు సమస్త పాపంబుల నుండి విముక్తులగుచున్నారు" అని వసిష్ఠుడు

1. దిలీప నాటకము - స్థలకము - 4.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గోమహిమను దిలీపునితో తెలిపెను.[1] వనమునందు నందినీ ధేనువును కుంభోదరుడను సింహము సంహరింపవచ్చినపుడు, దిలీపుడు గోవు యొక్క ఘనతను, పవిత్రతను తెలిపినాడు.

మన హిందువులకు ప్రత్యక్షదైవము వంటి గోవు యొక్క పవిత్రతను, వసిష్ఠ మహారుషి ద్వారా చెప్పించి తన హిందూమతాభిమానమును చాటుకొన్నది కవయిత్రి సీతాంబగారు. దిలీపమహారాజునకు, సింహమునకు జరిగిన వాగ్వాద ఘట్టమున కవయిత్రి ప్రత్యేక వృత్తములను వాడినది. మహాస్రగ్ధరవంటి వృత్తములను ప్రాచీన కవులు యుద్ధ సందర్భములవంటి ఘట్టములను వర్ణించునపుడు ఉపయోగించిరి. కవయిత్రియు సందర్భోచితముగా రచించినది. కవయిత్రి కవితా రచనా నైపుణ్యమును తెలుపుటకీ వృత్తములు ఉదాహరణములవలెనున్నవి. పంచచామరము, రథోద్ధత వృత్తము మున్నగునవి కూడ రచించినది. నాటకాంతమున గల భరత వాక్యమువలన నాటకమునకు మంగళకరమగు నట్లొనరించి నాటక లక్షణములను పాటించినది. గోపూజామహిమచేతను, గురుసేవా ప్రభావముచేతను దిలీప, సుధేష్ణలు, తమ సంతానాభీష్టమును దీర్చుకొని మనోరథము సిద్ధించిన తరువాత నగరుకు వెడలిరి. అపుడు దిలీపుడు భరత వాక్యమునిట్లు పలికెను:

తే.గీ. కోరినట్టుల వర్షముల్ కురియుగాక
ధరణి దాడియు బంటయు దనరుగాక
ప్రజలకారోగ్య భాగ్యముల్ ప్రబలుగాక
కబ్బములు రాజమన్నన గాంచుగాక.

కావ్యరచనయందేగాక, నాటకరచన యందును కవయిత్రి ప్రతిభావంతురాలని ఈ నాటకము వలన తెలియును.

కాదాచిత్క పద్య రత్నములు

శ్రీమతి చిల్కపాటి సీతాంబగారు అప్పుడపుడు పత్రికలకు పంపిన పద్య రత్నములన్నింటిని చేర్చి, "కాదాచిత్క పద్య రత్నములు" అను పేరున బెల్లంకొండ వెంకట వరదాచార్యులను వారు ముద్రింపించినారు.

1. దిలీప నాటకము - స్థలకము – 4.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందు శ్రీ తల్పగిరి రంగనాయకస్తుతి, తిరుమామణి మంటప వర్ణనము, కృతజ్ఞతా పంచరత్నములు, సీత యుత్కలిక, బాలక్రీడ, దాగిలి మూతలు, గ్రీష్మము, యశోద పుత్రవాత్సల్యము, రాధాకృష్ణ విలాసము, దసరా పండుగు, చిన్ని గృహలక్ష్మి, కురంగ పంచకము, కష్టజీవి, శ్రీకృష్ణ తులాభార నాటక ప్రశంసా పంచ రత్నములు, మహాత్మగాంధీ, నెచ్చెలి యెడబాటు, శ్రీమతి కనుపర్తి వరలక్ష్మీదేవి ప్రశంసా పంచరత్నములు, శ్రీ సింహపురి మహిళా సభా ప్రశంసా పంచరత్నములు, భావాబ్దము, నెల్లూరు పల్లికొండ రంగనాథ స్వామి అను శీర్షికలతో పద్యభాగములు కలవు. ఇవియన్నియు చేర్చి ముద్రించుటచే నివియొక చిన్న ఖండకావ్యముగా రూపొందినది. ఇందుగల ప్రతి పద్యమును ఎంతో చక్కని శైలితో రచింపబడినది.

శ్రీ తల్పగిరి రంగనాయకస్తుతి : పినాకినీ నదీ తీరమున తల్పగిరి పైన పశ్చిమాభి ముఖముగ పవ్వళించిన శ్రీరంగేశుని కవయిత్రి మనసారా వర్ణించినది. లలిత లలితములైన పదములను గూర్చి రచించిన పద్యములు శ్రవణ సుభగముగా నున్నవి.

సీ. లలితమౌక్తిక పద్మ రాగాదిమణులతో
 రాణించుకల్కితురాయి మెరయ
కాంచనవజ్రసంకల్పిత కుండలదీప్తి
 గండ భాగంబులు గడలు కొనగ
ముఖ చంద్ర రుచులతో మురియుచు నీలంపు
 తిలకంబు మోమున చెలువుగుల్క
అతిమనోహర మందహాస సుందరకాంతి
 ప్రకటమౌ మోవి మానికము వెలయ

తే.గీ. సత్కృపామృతపూరముల్ జల్లు చెపుడు
దనరు రక్తాబ్జ పత్ర నేత్రములు దనర
సుందరంబగు నీ మోము జూపి నన్ను
కరుణ జూడవె రంగేశ కలుషనాశ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిరుమామణి మంటప వర్ణనము: తిరుమామణి మంటపమును సామాన్య భాషలో "అద్దాల మంటప" మని అందురు. ప్రత్యేకోత్సవములందు స్వామి ఉత్సవ విగ్రహముల నిందు నిలిపి భక్తుల నలరింతురు. ఆ మంటప వర్ణనము కవయిత్రి చక్కగా నొనరించినది. 'తిరు మహామణి మంటపము' అను పదము 'తిరుమామణి మంటపము' అని పిలువబడినది. మణులచే నిర్మింపబడిన పవిత్రమైన మంటప మనియు అందురు.

ఉ. ఎచ్చట జూడ చిత్రకళలెచ్చట గాంచిన శ్రీశు సత్కథల్
మచ్చిక దెల్పురూపములు మానుష శిల్పకళావిచక్షణన్
పొచ్చెములేక నల్గడల పొల్పుగ దాపిన నిల్వుటద్దముల్
హెచ్చుగు రత్నకంబళము లేర్పడ క్రిందనమర్చిరోయనన్.
పచ్చగనెఱ్ఱగన్ వివిధ భంగులనిగ్గులు దీర్చుభూములన్
అచ్చపు జీవరత్నముల యట్ల వెలింగెడి దీపముల్ మదిన్
మబ్బులు కమ్మ ధూపముల ముూగెడుమంటపసీమశోభకున్
ఆచ్చెరువంది చిత్తముల నందున నిందున నెందుజూచినన్
ముచ్చట లొల్కు రంగవిభుముద్దుల రూపులు వేనవేలుగా
తచ్చనలాడు చందమున దాగిలి మూతల నాడు తీరునన్

శోభిల్లుచున్న తిరుమామణి మంటపమున గల రంగవిభునెంతయు మదినిల్పి కవయిత్రి ఉత్పల మాలికను సుదీర్ఘముగా రచించినది. కవుల మనసునందు, ఆనందోత్సాహములు కల్గినపుడు వెలువడు కవితాప్రవాహమునకు ఆనకట్ట యుండుట కష్టము. ప్రాచీన కవులెందరో ఇట్లే దీర్ఘమైన ఉత్పలమాలలను రచించి మెప్పుబడసినారు. ఆంధ్ర కవితా పితామహుని "పూత మెరుంగులున్ పసిడిపూప బెడంగులు చూపునట్టి వాకైతలు" అను పద్యము సహృదయ లోకమునకు సుపరిచితమైనది. అట్లే కవయిత్రి రచనము దీర్ఘముగా నడచినది.

యశోద పుత్రవాత్సల్యము : అల్లంపల్లివాడైన గోపాలకృష్ణుని, తల్లి యశోద వాత్సల్యముతో మందలించుట ఈ పద్యములందు కనుపించును. వెన్న

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దొంగిలించిన చిన్న తనయుని గోపికలందరు చోరుడనుచు సారెసారెకు దూరుట చూచి, వేదనతో, ప్రేమతో, తల్లి బుద్ధి గరపినది. కొంటె గోపాలుని గొల్ల పడుచులు నిందించినారని, ఆ తల్లి ముద్దుల బాలుని పిలిచి యిట్లు చెప్పినది:

సీ. వెన్నదొంగిలితంచు వ్రేపెలంది యొకర్తు
తంటనీపై జెప్పెతనయమొన్న
పాలద్రుచ్చిలితని చాల కోపము బూని
నేరమొక్కలతాంగినిన్న జెప్పె
మీగడ వారింట మెక్కి వచ్చితివని
నేడు నీపై నోర్తు చాడిదెచ్చె
పెరుగు కుండల నెల్ల విరుగగొట్టితివని
యిప్పుడొకతె సుద్ది జెప్పి చనియె

గీ. కొంటెగోపాలుడవటంచు గొల్లలెల్ల
ఊరకే నిను బలుమారులుప్పతింప
యెరుగవే వెట్టి తండ్రి, నీ తెరగుదోచి
కన్నకడుపు సహించునా? చిన్న తనయ.

కన్నకొడుకెట్టి వాడైనా తల్లి ప్రేమిస్తుంది. పరులు వానిని దూషిస్తే కన్నకడుపు సహించలేదు. కవయిత్రి రచించిన యశోద పుత్రవాత్సల్యము నందు మాతృ హృదయములోని మమతానురాగములు కన్నుల కట్టినట్లు కనుపించును.

రాధాకృష్ణ విలాసము : యశోద పుత్రవాత్సల్యమునందు మాతృ హృదయమెట్లు వ్యక్తమగుచున్నదో, అట్లే రాధాకృష్ణవిలాసమునందు ప్రియురాలి అనురాగ భరిత హృదయము సుస్పష్టమగుచున్నది. ఇందు రాధిక 'సరస సుకుమారమూర్తియై చిన్న బాలకృష్ణుని' మనసు నందిడుకొని ప్రేమించినది. జాబునంపినది. వచ్చిన మనోహరునితో ప్రేమానుభూతి చెందినది. ఆ ప్రేమ తోనే రాధిక-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొలకనగవున ప్రియు జూచి పలికె నిటుల
అంతకంతకు నాయందు నమరుచుండు
వమలమౌనీదు ప్రేమయే యఖిలజగతి
కెపుడు శ్రీరామ రక్షయై యెసగుగాత.

అని లోకరక్షణ కొరకు పలికిన పలుకులలో కవయిత్రి మధురభక్తి విశద మగును.

కష్టజీవి : కష్టజీవి యను పద్యభాగమును చదివినపుడు, కవయిత్రి సుందర వస్తువులనెంత రమ్యముగా వర్ణించగలదో, అంతటి వేదనాభరితమైన రచనను కూడ చేయగలదని కరుణ రసపూరితమగు కష్టజీవి పద్యములు నిరూపించును. పుట్టిన నాటినుండియును కట్టదుకూలములు, సుఖముగా వసియించుటకు మంచి మేడలు, సువర్ణ భూషలు, యేవి లేకున్నను, అడిగినవారికి పట్టెడన్నము పెట్టలేక, తాను సుఖింపలేని బ్రతుకు నిరర్థకమని తలచి, ఈశ్వరునిట్లు ప్రార్థించినట్లు రచించినది కవయిత్రి.

ఉ. కాయమశాశ్వతంబెపుడొకాలగతిన్ బడిపోవుదానికై
జేయగరాని పాపములు జేయుచు ఘోర దరిద్రతాహతిన్
దోయిలి యొగ్గుచున్ కరము దుఃఖములన్ వెతలొందుచుండున
న్నీయెడ కష్టజీవిధరనిట్టుల నేల సృజించితీశ్వరా.

పద్యపంచకములో నున్న 'కష్టజీవి' రచన సామాన్యమానవుని మనసులోని భావములను అద్దము పట్టి చూపినట్లున్నది.

నెల్లూరు పల్లికొండ రంగనాథస్వామి : నెల్లూరు పుర నివాసియైన సీతాంబగారు రంగనాథస్వామి వర్ణనము, స్వామికి జరుగు వాహనముల యొక్క సేవల వర్ణనము ఇందు చక్కగా చేసినారు. స్వామికి సేవలు తీయునపుడుపయోగించు శేషవాహనము, సూర్యప్రభ, గరుడసేవలను అందముగా వర్ణించినది. స్వామి మోహినీ అవతారవర్ణన కూడ మనోహరముగా నున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగనాథస్వామికి గరుడసేవ యొనరించినప్పటి స్వామి వర్ణనమిట్లున్నది:

గరుడ సేవ

మ. లలితంబౌధవళాతపత్రములతో, లావణ్యపుంజంబుతో
నల సుశ్రీవరదాభయ ప్రదములౌ హస్తద్వయీ రాజితో
బలు సూర్యప్రభలీను వజ్రమయ దివ్యశ్రీ కిరీటంబుతో
జలజాతాక్షుడు జూడనొప్పెసగె తార్క్ష్యస్కంధ భాగంబున్

ఎక్కడా ఆగకుండా, నడచిన, పద్యములోని తూగు చూడగానే బమ్మెర పోతరాజుగారి పద్యము జ్ఞప్తికి వచ్చును.

ప. కర్ణాలంబిత కాకపక్షములతో, గ్రైవేయహారాళితో
స్వర్ణభ్రాజిత వేత్రదండకముతో, సత్పించ దామంబుతో
బూర్ణోత్సాహముతో, ధృతాన్న కబళోత్ఫుల్లాబ్జ హస్తంబులో
దూర్ణత్వంబుననేగె లేగలకునై దూరాటవీ వీధికిన్.[1]

పై పద్యమే గాక మిగిలిన పద్యములన్నియు చక్కని తూగుతో నడిచి, కవయిత్రి కవితా పటిమకుదాహరణములై నిలిచినవి.

చిన్ని గృహలక్ష్మి : కేసరి మహాశయుని ఇంట అలరారిన గృహలక్ష్మిని గాంచి, ఆశీర్వదించుచు కవయిత్రి వ్రాసిన పద్యము హృద్యముగా నున్నది. మహిళల విజ్ఞాన వికాసములకేర్పరచిన గృహలక్ష్మిని సీతాంబగారు ఇట్లు ఆశీర్వదించినారు:

సీ. అఖిల భూజనములకల్లారు ముద్దుగా
నల్లి బిల్లగుచు వర్ధిల్లు మమ్మ
జిలిబిలి మాటల, చిన్న పద్దెంబుల
ప్రౌఢంపు పల్కుల బరగుమమ్మ

1. మహాభాగవతము - దశమస్కంధము - పద్యము - 500.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవని చిరంజీవివై నిత్యసౌభాగ్య
వైభవంబులు గల్గి వఱలుమమ్మ
ఎలమికాంతామతల్లులకెల్ల నారోగ్య
భాగ్యంబునొసగుచు బరగుమమ్మ

గీ. నిండు దసరాదినంబుల పండుగలకు
బుధులొసంగెడి దీవనలొంది వేడ్క-
ధరణి పెంపొంది తామర తంపరట్ల
చిన్ని గృహలక్ష్మి యభివృద్ధి జెందుమమ్మ.

గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీత యైన కవిరాణి చిల్కపాటి సీతాంబగారి గృహలక్ష్మి ఆశీర్వచన పద్యముతోపాటు వారి కావ్య పరిశీలన ముగించుచున్నాను.

వారి అరవిందయను నవల, కొన్ని చారిత్రకాంశములకు, కల్పితాంశములు చేర్చి వ్రాయబడిన నవల. ఈ నవలను మహారాజన సారస్వత పోషకులైన శ్రీ కేసరిగారే ముద్రింపించినారు. కావ్య నాటకములను రచించుటలోనే గాక నవలలను మనోజ్ఞముగ రచించుటలో కూడ నీ కవయిత్రి ప్రావీణ్యత కలిగి యున్నది. ఈ విదుషీమణి రచనలతో ఆంధ్ర సరస్వతికొక అమూల్యభూషణ మొనరించి చిర కీర్తి నందియున్నది.

నా పరిశోధనలో కావ్యములే భాగముగా నున్నవి కనుక నేను 'అరవింద' నవలను గురించి పరిశీలన మొనరించి వ్రాయలేదు.

చిల్కపాటి సీతాంబగారి 'సీతారామాయణము' అను శతకము అముద్రితము. అది లభ్యము కాలేదు. సాహిత్య రంగమునకు అపార సేవ యొనరించి, స్వర్ణ కంకణ గ్రహీతయైన ఈ కవయిత్రి చిరస్మరణీయురాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవితా విశారద కాంచనపల్లి కనకాంబ
(1936)

కవితా విశారద కాంచనపల్లి కనకాంబగారు

కేసరిగారి స్వర్ణకంకణమును పొంది, ఆ కంకణమునకే అలంకారముగా శోభిల్లిన కవయిత్రి కాంచనపల్లి కనకాంబగారు. కవి లోకమంతయు ప్రస్తుతించిన ఈ కవితా విశారద సాహిత్య సామ్రాజ్ఞిగా వెలుగొందినది. ఈ కవయిత్రి కలము నుండి వెలువడిన కవితలన్నియును ఆధ్యాత్మిక చింతనాతత్త్వమును. సదుప దేశమును బోధించునవిగా నున్నవి.

బ్రహ్మశ్రీ కవిరాజు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారిచే రచియింపబడిన జీవయాత్రా ప్రశంసా పద్యరత్నముల వలన ఆమె తల్లిదండ్రుల ఔన్నత్యము, ఆమె అభిజాత్యము తెలియుచున్నవి.

ఉ. కాంచనపల్లి వంశమున గాంచనమై తగురంగమూర్తికిన్
గాంచనగంధి రంగమకు గాదిలికూతురు సద్గుణంబులన్
గాంచనమే యనంగ గనకమ్మ యనంగను బేరుగాంచి వి
ద్యాంచిత మూర్తియైన పరమాత్మమతిన్ సతి సన్నుతించెదన్.

పల్నాడు సీమయందలి దుర్గియను గ్రామము ఈ కవయిత్రి జన్మస్థలము. విజయ సంవత్సర శ్రావణశుద్ధ అష్టమి 3-9-1893 న ఆదివారమునాడు జన్మించినదీ కవయిత్రి. తల్లిదండ్రులు రంగారావుగారు, రంగమ్మగారు. ఆమె బాల వితంతువు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు ఆమెను గూర్చి ఇట్లు చెప్పినారు.

తే.గీ. ఆపెనామంబు కనకమ్మయల్ల జ్ఞాన
వతికి బాల్యమ్మునన దైవవశత సంస
రణపు మూలంబు భర్తస్వర్గతికి బోయె
భాగ్యవశము తప్పింప నెవ్వరి వశంబు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. ఇలగల తరుణులకదిదు
ర్బలతాహేతువని యెల్లవారెరిగినదే
తొలిబామున గల విజ్ఞా
నలవంబున కనకమకుమనము చెడెదయ్యేన్

ఈ కవయిత్రి తండ్రి బాల్యముననే గతించినాడు తల్లి రంగమ్మగారు కనువిప్పని పసిపాపలతో పెక్కు యిడుములు పడినారు. 1906 లో నెల్లూరునందలి వారి ఆప్తబంధువులగు మంగు రామానుజము పంతులుగారును, పంగనామాల వెంకట రంగారావుగారును పిలిచి ఆదరించిరి. రంగమ్మగారు పసికూనలతో నెల్లూరుచేరి అచటనే జీవితమును గడిపినారు.

మంగు రామానుజముగారిని, వెంకటరంగారావు గారిని కవయిత్రి అభిమానముతో కీర్తించినది.

మంగు రామానుజము పంతులుగారి ప్రశంస :

ఉ. తానొక ధర్మవాదిగ బ్రధన్ బురమందునగన్న మంగురా
మాను జుడాప్తుడౌచు బ్రథమంబుననన్ గవయిత్రి జేసివి
ద్యానిపుణుల్ కవుల్ యతులు దన్నొగి ధన్యునిజేయ వారి స
న్మానము చేసి చూపె నొక మార్గము నాకును సాధుసేవకున్.

పంగనామాల వెంకట రంగారావుగారి ప్రశంస :

శా. రంగారాయని బంగనామ కులపారావార రాకాసు ధాం
శుంగీర్తి ప్రియు భావుకున్ దలతు నేపథ్యాంత రంగంబునం
దుంగావ్యమ్ములు పత్రికల్ చదువగా నూల్కొల్పినన్నింత దా
నింగా నేడు దివంబు నుండి కనువానిన్ సాధు సమ్మాన్యునిన్.

అసమాన ప్రతిభా సంపత్తిని కలిగిన ఈ కవయిత్రి చిన్న తనమునుండియే పూవు పుట్టగనే పరిమళము వెదజల్లునట్లు తన ప్రజ్ఞా విశేషములను చూపించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈమె ప్రతిభనుగాంచి ప్రేమతో ఆమె పెదనాయనగారగు మంగు రామానుజము పంతులుగారు విద్యాబుద్ధులను గరపిరి. పందిరివేయగనే తీగ అల్లుకొన్నట్లువిద్యావ కాశము కలగగానే, ఆమె స్వయముగా కృషిచేసి యెన్నో పరీక్షల యందుత్తీర్ణ రాలై పేరుగాంచినది.

విజ్ఞానచంద్రికా పరిషత్తువారు నిర్వహించిన పోటీ పరీక్షలలో - కనకాంబగారు గెలుపొంది వారితో ఘన సన్మానమును పొందినారు. విజ్ఞాన చంద్రికవారు మిక్కిలి ప్రశంసించినారు.[1]

ఆంధ్ర నారీ రత్నములలో విద్యావతియై జయమును గాంచి సంఘల కామెను వారు మిక్కిలి శ్లాఘించినారు. ఈ బహుమానములు పొందువరకు ఈ కవయిత్రీమణి వయసు పదునెనిమిదేండ్లు.

ఈ కవయిత్రికి మొదటిబహుమతి మండలివారిచ్చినారు. తరువాత స్త్రీలలో మొదటి బహుమతి పిఠాపురమురాణీగారిది. సాహిత్యములో నెమలిపట్టాభి రామారావుగారిది. చరిత్రలో రాజనాయని వెంకటరంగారావు బహద్దరుగారిది. ప్రకృతి శాస్త్రములో రాజా పానుగంటి రామారాయనిగారిది. సాహిత్యమునందు

1. విజ్ఞాన చంద్రికవారి ప్రశంస-మదరాసు - చింతాద్రిపేట. 14-9-1912.

అమ్మా,

తామీ సంవత్సరము విజ్ఞాన చంద్రికా పరిషత్తునందందరకంటె నెక్కుడు గుణములు సంపాదించి బహుమానములు పొందగలిగితిరని తెలుపుటకు సంతసించు చున్నాము. రొక్కముగా 216-00 రూపాయలు ఆరు సువర్ణపతకములు తమకు బహుమానమియబడును.

ఇట్లు
వేమూరి విశ్వనాథశర్మ
కార్యదర్శి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృష్ణా జిల్లాలోని ఒక జమీందారుగారిది. సాహిత్యములో, చరిత్రలో శాస్త్రజ్ఞాన ములోకూడ కృష్ణా జిల్లాలోని ఒక జమీందారుగారిది. ఇట్లు ఆరు బంగారుపతక ములు, రెండు వందల పదహారు రూప్యముల బహుమతి నందినది.

నరసాపురము పరీక్షలో కూడా స్త్రీలలో అగ్రగణ్యయై బంగారు పతక మును పొందినది. బంగారు పతకములను పొంది, ఈమెతోడి బాలికలతో పోవు నపుడు, ఎవరో ఈర్ష్యతో తలకు తగులునట్లుగా రాయి విసరినారట. ఆ దెబ్బతో ఇరువది దినములు జ్వరపడి, దైవయోగమున జీవించినది. అంతకు పూర్వమామె ఏకసంథాగ్రాహిగా యుండెడిదట. దెబ్బతగిలిన తరువాత కొంత ధారణాశక్తి తగ్గినది. అయినను పట్టువిడువక, చెన్నపురి వితంతు శరణాలయమునుండి ఆంగ్ల భాషనేర్చి బి.ఏ. వరకు చదివినది. కవయిత్రి యొక్క విద్యార్థినీ జీవితము, ఉద్యోగ జీవితము ఆమె రచించిన అంబాస్తవము వలన తెలియుచున్నది.

సీ. బాల్యంబుననె యాంధ్ర భాషాకవిత్వంబు
గరపెమున్ మంగు రామానుజుండు
ఆంగ్ల విద్యా రహస్యంబు నాకెరిగించె
లీలమై పిదప క్రైస్తేయ సాధ్వి
సాంస్కృత సాహిత్య సంప్రదాయము నృసిం
హాచార్య పండితుండవలదెల్పె
విజ్ఞాన సంఘాల వివిధ పరీక్షల
బంగారు పతకాల ప్రతిభ గూర్చె

గీ. క్వీను మేరీ కళాశాల పిదపనంబ
యాంధ్ర బోధకురాలను నాఖ్యదెచ్చె
బాఠ్యపుస్తక నిర్ణయ పరిషదర్హ
నను యశము విశ్వ విద్యాలయంబె గూర్చె

(అంబాస్తవము - కనకాంబగారు)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కనకదుర్గ కృపతోడనే తనకు కవితా శక్తి చిన్ననాటనుండియే కల్గినట్లు తెలిపినది.

సీ. పదియు రెండవ యేట బలికించితిదికదా
నెల్లూరి శ్రీరంగ నేత్రమహిమ
పదియునేసవ యేట ప్రతిభ కూర్చితికదా
జెప్పించితిదికదా సీసమాల
నెల ప్రాయమున లిఖియింప జేసితికదా
వాసికెక్కిన మాసపత్రికలకు.

గీ. దరుణభావంబు రానట్టి తరుణమందె
పాండవ జయంబు గౌతమ ప్రభుని చరిత
నమృత వల్లియు వ్రాయించి తంబయర్థ
కాయభూషిత భర్గ యోకనక దుర్గ - [1]

ఇదియేగాక, ఈ కవయిత్రి విజ్ఞాన లేఖినినుండి వెలువడిన గ్రంథములు జీవయాత్ర పద్యకావ్యము, ఆనందసారము, అమృతానందబోధ సారము పద్యగ్రంథములు, తోమాలియ ప్రాస్తావిక పద్య సంపుటి, మున్నగు పద్య రచనలు నాటకములు :

(1) హంస విజయము, (ఆధ్యాత్మిక చింతనతోగూడినది), (2) అభిజ్ఞాన శాకుంతలమునకు అనువాదము. రామాయణ కథాసంగ్రహము (సంస్కృత గద్యము)

అనితర సాధ్యమైన రచనలచే ఈ కవయిత్రి చిరకీర్తి నందినది. క్వీన్ మేరీ కళాశాలలో ఆంధ్ర ఉపన్యాసకురాలిగా వన్నె కెక్కిన ఈ వనిత మద్రాసు

---

1. అంబా స్తవము - కనకాంబగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లోని మాక్మిలన్ కంపెనీ వంటి విద్యా సంస్థలకు ఆంధ్ర గ్రంథములను వ్రాసియిచ్చి నది. మద్రాసులో ఉద్యోగ విరమణ మొనరించిన పిదప విజయవాడకు వచ్చినది. అచ్చట పేరొందిన శ్రీ చుండూరి వెంకటరెడ్డి గారిచే గౌరవింపబడి, తన గురు దేవులగు శ్రీ అమృతానంద స్వామి వారి ఆదేశానుసారము త్రిలింగ విద్యా మహా పీఠము నెలకొల్పినది. అచట తెలుగు కవి, పండితులను నూటపదహార్లిచ్చి మన్నన సేయుచు, విద్యావంతులచే తాను మన్నన లందుచు శేష జీవితమును గడిపినది.

ఈ కవితావిశారదకు, ఈ కవితిలకకు, డా. కె. యస్. కేసరిగారు 27-12-1936 సంవత్సరమున, నెల్లూరులో జరిగిన మొల్ల జయంతి సందర్భమున గృహలక్ష్మి స్వర్ణ కంకణమునొసగి గౌరవించినారు. ఆమె చేయుచున్న పండిత సత్కారాది దానముల కుపకరించునట్లుగా ఐదునూటపదహారులచే కవయిత్రిని సన్మానించిరి.

21-3-1936 నాడు జరిగిన తిక్కన జయంతి సందర్భముగా తిక్క వరపు లక్ష్మీనారాయణ రెడ్డిగారు నూటపదహార్లు బహూకరించి సన్మానించిరి.

కవయిత్రి తనకొనరించిన ప్రతి సన్మాన సభయందును చదివిన పద్యములు మృదుమధురముగా నున్నవి. ప్రస్తుతము కనకాంబగారిచే రచింపబడిన 'జీవయాత్ర' అను ఆధ్యాత్మిక కావ్యము పరిశీలింతము.

జీవయాత్ర

కాంచనపల్లి కనకాంబగారిచే రచింపబడిన ఈ 'జీవయాత్ర' అను గ్రంథము ఆధ్యాత్మిక పరమైన కావ్యము. శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారు, కవిరాజు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు జీవయాత్రా ప్రశంసా పద్య రత్నములను రచించిరి. చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిగారు తమ అభిప్రాయములో జీవయాత్రను గూర్చి ఇట్లు తెలిపిరి:

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ.వె. పేరు జీవయాత్ర ధోరణి సరళంబు
తప్పుగాన రాదు తత్వమెల్ల
యెడల వేద్యమిట్టి యెడదయే సాధ్వికి
గలుగు పున్నెమెంతొ సలుపకున్న

అని సరళ ధోరణిలో వ్రాయబడిన జీవయాత్రను ప్రశంసించిరి.

కృష్ణమూర్తి శాస్త్రిగారు జీవయాత్రను గురించి తమ భావన నిట్లు వాక్కుచ్చినారు.

ఉ. పద్యములెల్ల హృద్యములు పండితపామర వేద్యముల్ పవి
త్రోద్యమ బోధకంబులన నొప్పెడు నెప్పుడు నాత్మచింతయే
విద్యయటంచు జెప్పు గుణవిశ్రుతు రాలగు కాంచనాంబకా
వ్యాద్యముగా రచించిన మహత్తర తత్త్వము జీవయాత్రలోన్.

కనకాంబగారి 'జీవయాత్ర' గ్రంథమును వ్యాకరణ భాషావేత్తలైనట్టి, వేద మూర్తులు బ్రహ్మశ్రీ లంక లక్ష్మీనరసింహ శాస్త్రిగారు సంస్కృతములోనికి అనువదించినారు.

ఈ 'జీవయాత్ర' అను కావ్యము రాజశేఖరుడను రాజు కుమారుడైన నిరంజనుని కథ. నిరంజనునికే జీవుడని మరొకపేరు. జీవుడొనరించిన యాత్రలచే కూర్పబడినది కావున జీవయాత్ర అని పేరు వచ్చినది. కాని జీవుడను రాజకుమారు డొనరించినవి తీర్థయాత్రలు. యుద్ధయాత్రలు కావు. ఆధ్యాత్మిక పరమైన గ్రంథము కావున తీర్థయాత్రల వర్ణన చేయబడినది. జీవయాత్ర అను ఈ కావ్యము యొక్క కథ సంక్షిప్తముగా ఇట్లు కలదు:

జీవయాత్ర ఇతివృత్తము

ఈ కావ్యమునందలి కథ స్వకపోల కల్పితము. పింగళి సూరనామాత్యుని కళాపూర్ణోదయము నందువలెనే జీవయాత్ర యందును సరస్వతీ చతుర్ముఖుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శృంగారము కథాబీజముగా నున్నది. సత్యలోకమున శారదాదేవి వీణాగానము చేయుచుండగా, బ్రహ్మదేవుడామెను చేరి, ఆమె చూడామణియందలి తన ప్రతి బింబమునుకాంచి, పరపురుష భ్రాంతిని వహించి, భార్యవలన తన పొరపాటుమ గ్రహించెను. తన కట్టి భ్రాంతిని, దేవియందు దోషశంకను కల్పించినట్టి ఆ చూడామణికి కొంత కాలము జడత్వము ఘటిల్లుననియు, తన భ్రాంతిని చూచి నవ్విన తన వాహనమగు హంస కొంతకాలము భ్రాంతిని పడునట్లును శపించెను. ఆ శాపము వలన శారద అను యోగినిగా చూడామణియు, హంస రాజశేఖర మహారాజు పుత్రుడగు నిరంజనునిగా జన్మించినవి.

కళ్యాణపురమను దేశమునకు, ఆనందపురమును రాజధానిగా నొనరించు కొని రాజశేఖర మహారాజు పాలించుచు సపరివారముతో తిరుపతి వెంకటేశ్వరుని దర్శనమునకు వెడలెను. అచ్చటికి కొలది దూరమున గల జాబాలి తీర్థమునందు జయంతాశ్రమమున పరమహంస స్వామి గలదని రాజు జనులవలన తెలిసికొని వెడలి, స్వామి నాశ్రయించి తత్త్వోపదేశమును పొందెను. ముని బోధనలను భార్య యగు ధర్మాంబతోను మంత్రియగు సుదర్శనునితోనూ కలిసి విని, స్మరించు కొనుచు తన రాజ్యమును చేరెను. స్వామి వరమున రాజునకు పుత్రుడు కలిగెను. వానికి నిరంజనుడని పేరుపెట్టిరి. బాలుడు మంత్రితో తన పేరు నిరంజనుడని పెట్టుటకు గల కారణమేమని ప్రశ్నించెను. అందుకు మంత్రి నిరంజనుడనగా శివుడనియు పాపరహితుడగుటచే శివునకానామము కలదని చెప్పెను. అట్లైన నేను 'శివుడనా' అని బాలుడు ప్రశ్నించెను. మంత్రి నవ్వుచు. నాయనా శివుడు దేవుడగును. మనము జీవులము. అని బదులు పలికెను. అప్పుడా బాలుడు తాను దేవుడు కాడు కనుక, తన నందరును 'జీవుడని' పిలువవలెనని చెప్పెను. అందరును ఆ బాలుని గారాబముతో జీవుడనియే పిలుచుచుండిరి.

రాజు పుత్రుని తన ఆస్థాన పౌరాణికుని కుమారుడగు అన్నంభట్టుతో కలిపి సుశీలుడను గురువు నొద్దకు పంపెను. నిరంజనుడు గురుకులవాసమున సకల విద్యల నభ్యసించెను. తన మిత్రుడగు అన్నంభట్టును ఖండాంతరవిద్యా ప్రభావ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మును తెలిసికొనుటకు పంపెను. మిత్రుడు వచ్చువరకు వివాహము కూడ చేసి కొననని చెప్పెను. తరువాత నిరంజనుడు రాజ్యమునకు చేరగనే తండ్రి రాజ్య భారమును మోపి, తాను భార్యతో కూడ పరమహంస ముని ఆశ్రమమునకు వెడలెను. మంత్రి సుదర్శనుడు రాజ్యతంత్రములను చూచుచు నిరంజనుని వివాహమాడుమని కోరెను. కాని నిరంజనుడు వివాహమునకు వ్యతిరేకించెను.

మంత్రి నిరంజనుని తల్లి దండ్రుల చెంతకు తీసికొనిపోయెను. జాబాలి తీర్థమున పరమహంస మునిని, తల్లి తండ్రులను సేవించి తత్త్వోపదేశమును, గృహస్థాశ్రమ ధర్మము నెరిగిన నిరంజనుడు కళ్యాణపురమునకు చేరి, మేనమామ కూతురైన బుద్ధిమతి యను బాలికను వివాహమాడెను.

విదేశములనుండి తిరిగి వచ్చిన అన్నంభట్టు రాజకుమారుని వివాహమాడి నందుకు ప్రశ్నించెను. అతని సమస్త ధర్మముల నెరిగించుటకు నిరంజనుడు వివిధ పుణ్య స్థలములను దర్శింపచేయుటకు తీసికొని వెడలెను. తుదకు జయంతా శ్రమమును చేరిరి. నిరంజనుడు గురుకటాక్షమున తాను పొందిన విద్యలచే శారద అను యోగిని సోమశిలా క్షేత్రమున తపమొనరించుకొనుచుండగా హంస రూప మున వెడలి జయంతాశ్రమమునకు కొనివచ్చెను. శారద అను యోగిని అన్నం భట్టునకు స్వధర్మ తత్త్వోపదేశ మొనరించినది. ఇంతలో నారద ముని యేతెంచి శారద, నిరంజనుల జన్మవృత్తాంతమును వారందరికి తెలిపెను. నిరంజనుడు, తల్లి దండ్రుల, గురువుల దీవెనలంది భార్యతోను, అన్నంభట్టుతోను కలిసి తన రాజధానియగు ఆనందపురమునకు వెడలి సుఖముగా రాజ్యము నేలెను. శారద ఆశ్రమముననే మునిని కొలుచుచు నుండెను.

ఈ కథను కవయిత్రి 'జీవయాత్ర'అను పేరున చక్కని వేదాంత విషయ ములను, నానావిధ ధర్మములను, భక్తి ప్రపత్తులను, రాజనీతులను, విద్యా విధాన ములను చేర్చి విపులమైన కావ్యముగా రచించినది.

నిరంజనునకు జీవుడను నామము కల్గుటను బట్టియు, అతడు ఇతర రాజుల వలె యుద్ధయాత్ర లొనరించక తీర్థయాత్ర లొనరించినందులకును, జీవమణియగు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శారద జీవచరిత్ర ఇందు కీర్తింపబడుటవలనను, ఈ గ్రంథమునకు 'జీవయాత్ర' అను పేరు స్థిరపడినది.

ఈ కథయందు ధర్మతత్వముల నుపదేశించు భాగములను విపులముగా రచించి, ఇతర వర్ణనాదులను సంగ్రహముగా రచించుటచే ఈ గ్రంథమునకు 'జీవయాత్రా సంగ్రహ'మని కూడ పేరు కలదు.

కవయిత్రి కాంచన పల్లి కనకమ్మగారు గ్రంథమునకు నామమును నిర్ణయించుటలో కూడ కవుల హృదయముల నరసి ఔచిత్యవంతముగా పేరు కూర్చి ఈ మహా గ్రంథమును రచించినది. శాంతరసముతోకూడి, వేదాంత బోధనలతో నిండిన ఈ కావ్యమును ఉత్తమ గ్రంథముగా నిర్ణయించి, బి. ఏ., యం.ఏ., విద్వాన్ పరీక్షలకు పఠనీయ గ్రంథముగా మద్రాసు విశ్వవిద్యాలయము వారు ఆ కాలమున నిర్ణయించిరి.

జీవ యాత్ర

కాంచనపల్లి కనకాంబగారిచే రచితమైన జీవయాత్ర ఆధ్యాత్మిక పరమైన కావ్యము. ఇందు వర్ణనలు, అలంకారములు మున్నగునవి లేవు. చిన్ని, చిన్ని పద్యములలో పారమార్థికమైన విషయములనే యెక్కువగా వివరించినది. జీవుడను నామాంతరమున వెలసిన నిరంజనుని కథ కావ్యముగా సాగుచునే మధ్య మధ్య జ్ఞాన, తత్వ, బోధన చేయు పద్యములు చేర్చబడినవి. వానినిట కొన్ని పరిశీలించుచున్నాను.

సోమశిలా క్షేత్రమునందు యేకాంతమున కూర్చుండిన యోగిని తనకు గురుబోధలేనిచో వ్యర్థమని తలచినది. గురుబోధను పొంది ముక్తి మార్గమును చేరవలయునని తలచినది. ఈ సందర్భమున గురువు మాహాత్మ్యమును, గురువు యొక్క విశిష్టతను యోగినిచేత కవయిత్రి పెక్కు పద్యములందు చెప్పించినది. పరమాప్తుడు, పరమాత్ముడు అయిన గురువు యొక్క చరణములే విజ్ఞు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లకు ఆశ్రయములైనవనియు, గురునామస్మరణముచేతనే దోషము లడగుననియు, పరమౌషధమువలె సేవింప దగినవని కవయిత్రి తెల్పినది.

క. గురుచరణము, సుఖకరణము
శరణము భవతారకంబు సత్పురుషులకా
భరణము, నిగమచయాలం
కరణము, భవహరణము శివకైవల్యదమున్.[1]

అని గురుచరణముల యొక్క పవిత్రతను కవయిత్రి చాటినది.

రాజశేఖర మహారాజు జయంతాశ్రమమునకు వెడలి పరమహంస ముని పాదముల నాశ్రయించును. అతనిని గురువుగా ధ్యానించి తత్వ ముపదేశింపుమని కోరెను. పరమహంసముని ఓంకార విశిష్టతను తెలిపి ఓంకార మునుపదేశించును.

క. ఓం కారము శివనాదమ
హంకృతి జీవునికి సహజమగుట సతతమా
యోంకారము శ్రుతి యౌటన
హంకృతి నిజకృతులనాత్మ నందెడువీకన్.[2]

అని ఓంకారముపదేశించిన పిదప తత్వసార మెరిగించును.

క. బీజము వృక్షంబందున
బీజమునన్ వృక్షముండు బృథివీ స్థలిలో
బీజంబొమ్మందురు కద
బీజములన్నిటను ప్రణవ బీజము వెలయున్.[3]

1. జీవయాత్ర - పద్యం 39.
2. జీవయాత్ర - పద్యం - 111.
3. జీవయాత్ర - పద్యం - 136.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తన పాదములను బట్టిన రాజశేఖరునికి పరమహంసముని దేవునకు జీవునకు గల భేదములను తెలియ చెప్పుచు, తపమొనరించి శాంతి ఫలమును పొందగలుగు విధమును తెలిపెను. సచ్చిదాత్మకమైన జగత్తును గూర్చి వివరము చేయును.

సీ. జీవత్వమాలేదు దేవత్యమాకాదు
భావింప సర్వంబు బ్రహ్మమగుట
చింతయాలేదు నిశ్చింతయా కాదు
శాంతం తపోయనుట విశ్రాంతికాంతి
ధనకాంక్ష లేదుగా తనకాంక్ష లేదుగా
తను కాంక్ష లేదుగా తనువెలేదు
పరమేశ్వర ప్రీతి ప్రభవించుటకురీతి
కాకున్నమతికోలు కమలసూతి

గీ. బ్రహ్మమనెద రస్మత్పద వాచ్యడెందు
నెందుగనుగొందు వేరు నేనెందునుందు
దావులే లేవు నాకెందు దత్వమందు
సచ్చిదాత్మకము జగత్తు స్వామిసొత్తు.[1]

సర్వంబ్రహ్మమయమైన జగత్తును గూర్చి పరిపరి విధముల బోధించి ఓంకార స్మరణ చేయుమని గురువాదేశించిన పిదప రాజశేఖరుడు తన నగరమునకు పోయెను. రాజ్యవిధులను నిర్వహించుచు, గురుస్మరణ చేయును. తన మంత్రి యైన సుదర్శనునితో పారమార్థిక స్నేహ ప్రశంస యొనరించునపుడు మిత్రుని యొక్క ప్రత్యేకతనిట్లు తెలుపును:

ఉ. మిత్రుడు లోకబాంధవుడు మేటినృపుండు భిషగ్వరుండువే
దత్రయమూర్తి ముక్తులకు ద్వారముదీయు మహాత్ముడాత్ముడున్

1. జీవయాత్ర - పద్యం - 141.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జిత్రవిభూషణుండు దరిజేర సహింపరు సన్నిధిన్‌గటా
మిత్రుడులేని జీవనము మేదినిగల్గునె యెరికైననీ
చిత్రముగాంచి మిత్రులను జేర్చుట చేరుట వట్టిమాట స
ర్వత్రనిజార్తి బాపగ నవశ్యమదెంతో భజింతురంతయే.[1]

ఉత్తమగతులను పొందుటకు ఉత్తములైన మిత్రులనే చేరవలయును.

రాజశేఖరుడు తన కుమారుడగు నిరంజనుని గురుకులమునకు పంపుచు నీతి గరపును. నీతిబోధ గరపిన పద్యము లెక్కువగా ఆట వెలదిలో నడిచి, వేమన పద్యముల రీతులను జ్ఞప్తికి తెచ్చును.

ఆ.వె. పరుల ధర్మమెంత బాగనితోచిన
దాని జేయకుంట ధర్మబుద్ధి
చూచువానినెల్ల నాచరించి చెడును
స్వీయ ధర్మమంచు జిత్తమందు.[2]

లోకమును కవయిత్రి వేమన్నవలెనే కాకులమూకతో పోల్చినది:

ఆ.వె. లోకమన్న పెద్దకాకులమూకన్న
ముద్దకైన నరచు గ్రద్దకైన
దెబ్బకైన నరచు దీనినైజంబింత
లోకమందు దూరబోకు జీవ.[3]

నిరంజనుడు తన మిత్రుడగు అన్నంభట్టుతోపాటు సుశీలుడు అను గురువు నాశ్రయించెను. గురువు వానిచే శాస్త్రవిద్యలను అభ్యసింప జేయును. ఈ ఘట్టమున గల పద్యములన్నియు నీతి బోధాత్మకములై యున్నవి. విద్యార్థి పట్టువిడువక

---

1. జీవయాత్ర - పద్యం 185.
2. జీవయాత్ర - పద్యం 209.
3. జీవయాత్ర - పద్యం 210.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చదివినపుడే విద్య అలవడును. ఈ విద్యల నభ్యసించుటకు తాను పట్టిన గురు పాదము విడువవద్దని గురువిట్లు చెప్పెను-

క. కట్టెన్ గట్టెన్ రాచిన
బుట్టెడు నద్దాన నగ్నిపుట్టెడుదాకన్
జట్టు విడువకుండవలె దా
బట్టిన పాదంబునట్లు పట్టగవలెగా.[1]

అని పట్టుదలతో, వినయముతో మెలగవలయునని నిరంజనునికి గురువు తెలిపెను. గురుబోధలను వినిన పిదప నిరంజనుడు గురువును ప్రస్తుతించి ధ్యానించును.

క. గురుకేసరి భూసురకే
సరి నరకేసరి త్వదీయసత్త్వము మాకే
సరి, యిటు సద్యోగముతో
సరి కదపట్టువులు మాకు సరిసరినీకున్.[2]

అంత్యప్రాసతో కూడిన ఇట్టి పద్యములు కొన్ని పోతన రచనా విధానమును గుర్తుకు తెచ్చుచున్నవి.

మంత్రియైన సుదర్శనుడు నిరంజనుని వివాహమాడుమని చెప్పి స్త్రీల యొక్క పవిత్రతను, వారి విలువను గూర్చి తెలుపును. స్త్రీలవలననే పురుషునకు తేజో, బల, యశములు కలుగునని చెప్పును.

క. తేజో బలయశములకై
భూజనులు భజింప కల్పభూజముభంగిన్
దాజేయును పరిపూర్ణుల
రాజీవదళాక్షి మిత్రరత్నంబిలలోన్.[3]

---

1. జీవయాత్ర - పద్యం - 247.
2. జీవయాత్ర - పద్యం - 302.
3. జీవయాత్ర - పద్యం - 340.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మంత్రి స్త్రీలను గౌరవముతో ప్రశంసించి, వివాహమాడుమని చెప్పినను నిరంజనుడు వివాహము వలదని స్త్రీనింద యొనరించును. లోకమున స్త్రీలలో పతివ్రతలు కలరు. కులటలు కలరు. కవయిత్రి దుష్ట స్త్రీలను నిరంజనునిచే దూషింపజేసినది. కొందరు స్త్రీలలోని దుర్గుణములను వివరించిన తీరు సత్య సమ్మతమై యున్నది. కవయిత్రి స్త్రీయే అయినను, ఈ విషయమున స్త్రీ పక్ష పాతమేమియు చూపలేదు. స్త్రీల మోసము, మాయ, స్వార్థము మున్నగు గుణము లను యెంచి చూపించినది. వారి క్రూర బుద్ధులను నిరంజనుడిట్లు వివరించెను:

క. కట్టింతురు కొట్టింతురు
పుట్టింతురు లేనిమాట పూవుంబోడుల్
పెట్టింతురు విషమైనన్
గట్టాయిటువంటి చిత్రకర్మము తగునే.[1]

ఇల్లు, సంసారపు బాధ్యతలను వదలి మహిళా సభల పేరున తిరుగు కొందరిని కవయిత్రి ఇట్లు విమర్శించినది:

ఆ. వె. చదువజదువజదువ సంసారమాలేదు
వంటలేదు కడుపు పంటలేదు
మంట మగని జూడ మహిళా సభలనుంట
జదుపునకు ఫలంబు శాంతిగాదె.[2]

నిరంజనుడు వివాహము వలదని, వనితలను నిందించిన మాటలను విని, సుదర్శనుడు అతని మనసు మరల్చుటకు మరల ప్రయత్నించి స్త్రీ యొక్క ఔన్నత్యమునిట్లు తెలిపెను:

క. చదువనగా శ్రీ హృదయము
చదువుట వేరొండుగాదు చదువిలదానిన్ . . .

1. జీవయాత్ర - పద్యం - 346.
2. జీవయాత్ర - పద్యం 350.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముదితల కృప లేకుండిన
విదితంబగుటెట్లు బ్రహ్మవేత్తలకైనన్.[1]

అంగనకు హంస అనగా ఆత్మకు గల పోలిక ఇట్లు చెప్పబడినది :

క. అంగనకును హంసంబున
కుంగమనంబొకడు తెలిసికొనదగు భేదం
బంగనపురుషోత్తముగొ
ల్చుంగతి హంసమెపుడు నడచున్ విధివెంటన్.[2]

అని సుదర్శనుడు, నిరంజనునికి చెప్పి, సత్పురుషులకు పురుషార్థమును పొందుటకు స్త్రీయే ఆధారమని బోధించెను. అయినను నిరంజనుడు స్త్రీలను నిరసించుచు ఇట్టులనెను:

ఆ.వె. మిడుత యగ్గి యందు మిక్కిలి ప్రీతిని
గన్నుగాన కెట్లు కాలిపోవు
ధరణి మూఢ జనుడు తరుణులకూటమి
దత్త్వమరయ లేమి దన్నుకొనడె.[3]

నిరంజనుడు వివాహ విముఖుడై పలికిన పలుకులు విని మంత్రి సుదర్శనుడు చింతిలి ఇట్లనుకొనును:

ఆ.వె. చదివినాడు గాని సంశయమూపోదు
చదువ జదువ దెలివి సన్నగిల్లె

---

1. జీవయాత్ర - పద్యం 367.
2. జీవయాత్ర - పద్యం 370.
3. జీవయాత్ర - పద్యం 372.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పిదప జూడవీడు మొదటని బోలుగా
గుణముకుదురదేమి కొట్టుకొందు.[1]

చదువు నేర్చినను, సంస్కారమలవడని వారిని గూర్చి వ్యంగ్యముగా పై పద్యము నందు కవయిత్రి తన భావనను చేర్చినది.

మిగిలిన భాగ మంతయు కూడ ఆధ్యాత్మికమైన బోధనలతోనే గడచినది. నిరంజనునికి తల్లిదండ్రు లుపదేశించిన బోధనలు, పరమహంసముని బోధించిన సద్గుణములు, తరువాత శారద అను యోగిని కుపదేశించినట్టి తాత్వికబోధనలు మున్నగు వానితోనే కావ్యము నడిచినది. కేవలము బోధనలే కాక కొంత కథ నడచుటచే కావ్యముత్సాహ భరితముగానే నడిచినది కాని విసుగు జనించునట్లు లేదు. కావ్యములో గ్రీష్మకాలవర్ణన ఎంతయు హృద్యముగా గలదు.

మ. దినముల్ దీర్ఘములై ప్రసూనలతలున్ దేజోవిహీనంబులై
ఘనకాంతారము లగ్నినాహుతములై గాలింబరాగంబులున్
మిను ముట్టన్ బ్రబలంబులై హ్రదములన్నీరంబు శూన్యంబునై
చన దాపంబొనగూడు బంధులకు భీష్మంబైన గ్రీష్మంబునన్.

గ్రీష్మవర్ణన మీ పద్యమునందు చేయబడినది. వేరు వర్ణనలేమియు లేవు. కవయిత్రి బాల వితంతువు కనుక మనసును చిన్న నాటినుండియు దైవభక్తి, గురుభక్తి, ఆధ్యాత్మిక చింతనలతో గడిపినట్టి పవిత్రవనిత. అందువలన తన కవితలలో కూడ సదుపదేశములనే చేర్చి లోకమునకందించ వలయునని ఈ 'జీవయాత్ర' కావ్యమును రచించి, చిరకీర్తి నందినది. మూడు ఉల్లాసములతో కూడిన ఈ కావ్యము ఆధ్యాత్మికచింతనకు తావలమై, సదుపదేశపూరితమై, సహృదయ రంజకమై, కథాకల్పనలో కళాపూర్ణోదయ రీతిలో కొంత చమత్కార భరితమై రచియింపబడినది.

1.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అమృత సారము

కవితిలక కాంచనపల్లి కనకాంబ గారిచే రచింపబడిన 'అమృతసారము' అద్వైత బోధనామృత మందించు కావ్యము. ఈ కవయిత్రి శ్రీ తిరుమల శ్రీనివాస త్రిలింగ మహా విద్యాపీఠమునందలి భక్తురాలు. ఈ కవయిత్రి గురువుగారి దీక్షా నామము "అమృతానంద నాథుడు." అమృతానందుల వారి బోధసారమును ఈ మహా కవయిత్రి 'అమృతసారము' 'ఆనందసారము' అని గురునామాంకితములుగా రెండు కావ్యములు రచించినది.

అమృతమైనది అనగా జరామరణ రహితమైనది బ్రహ్మము. దానిని ప్రతి పాదించు బోధనలను కూర్చుటచే ఈ కావ్యమునకు 'అమృత సారము' అని పేరు కలిగినదనియు అనవచ్చును. గురువు నామము కవయిత్రి మనసునందు సర్వదా జ్ఞప్తికుంచుకొనుటకును 'అమృతసార'మను పేరిడినదనవచ్చును. ఇందలి కవిత్వము అమృత ప్రాయముగా నుండి సహృదయ, హృదయాహ్లాదమొనరించుచున్నది. కనుక ఈ గ్రంథము "అమృత సార"మని అనబడును అని పెద్దల అభిప్రాయము.[1]

జీవయాత్ర, హంస విజయము, తోమాలియలను పరిశీలన మొనరించుటచే కనకాంబగారి కవిత్వ తత్వము, జ్ఞానవిశేషము విదితమైనవి. అమృత సారము వలన కూడ కవయిత్రి భక్తి ప్రపత్తులను తెలిసికొన వచ్చును. ఈ కావ్యము ఏకాశ్వాసమునందు వ్రాయబడినది. కాని అయిదు వందలకు పైగ పద్యములు కలవు. ఎక్కువగా కంద పద్యము, ఆటవెలదులతోనే సాగినది. అచ్చటచ్చట ఉత్పలమాలాది వృత్తములు కలవు. ఇందలి కవితా విధానమిట్లు కలదు. భగవంతుని కొలుచు మానవుడు సదాచారుడై యెట్లొప్పునో కవయిత్రి ఇట్లు వర్ణించినది:

శా. సర్వారంభము లుజ్జగించి శుచియై
శాంతాత్ముడై యోగియై

---

1. కాంచపల్లి కనకాంబ - అమృతసారము (సంపాదకీయ భూమిక-పుట 2.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిర్వాణ ప్రభుడై మహా మహిముడై
నిర్ద్వంద్వ సంచారియై
శర్వారాధన తత్పరత్వ నిధియై
శశ్వద్భవోత్తీర్ణుడై
యుర్విన్ ధీరుడు పూర్ణుడై సులభుడై
యొప్పున్ సదాచారుడై.[1]

భగవంతుడు భాగవత బృందమునందునే సంచరించుననియు భాగవతులను గొలిచినచో భగవంతుని కొలిచినట్లే యని కవయిత్రి ఇట్లు వివరించినది:

క. భాగవత బృందమందున
భోగించున్ రాముడెపుడు బుధులాహరి స
ద్యోగంబున ధ్యానించెద
రీగుట్టరయంగ జాలవే తత్సేవల్.[2]

మంద బుద్ధియగు మానవుడు ఒకపని చేయుచు, వేరొక పనియందు మనసు నిలుపును. ఒక వైపు దైవపూజ చేయుచు, మరొక వైపు మనసును వేరొక ఆలోచనలచే నింపును. అట్లుగాక భగవంతుని బాహ్యమునను, భావమునను నిలుపవలెనని కవయిత్రి ఇట్లు తెలిపినది.

గీ. బాహ్య భక్తి సలుపు, భావంబునను నిలుపు
తరుణ మనుసరించి తత్వవిదుడు
మంద బుద్ధి దురభిమానియు నెట్టెట్లొ
యొండు సల్పు, వేరొకండు నిల్పు.[3]

---

1. అమృతసారము - పద్యం 3.
2. అమృతసారము - పద్యం 13.
3. అమృతసారము - పద్యం 26.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మానవునకు లోకమున ప్రధానముగా కావలసినది శాంతి. అట్టి శాంతి ఎందు లభ్యమగునో కవయిత్రి ఇట్లు చెప్పినది:

గీ. శాంతి హరిపాద పద్మ విశ్రాంతి సుమ్ము
శాంతి భాగవతాత్మీయ కాంతి సుమ్ము
శాంతి జన్మాది దుర్వ్యాధి శాంతి సుమ్ము
శాంతి నిర్లిప్తుడైన వేదాంతి సుమ్ము.[1]

విశ్వమును హరిమయముగా భావించువానికి అరియను వాడుండడని కవయిత్రి యిట్లు చెప్పినది:

క. హరిమయము విశ్వమను వా
దరిమయముగ నెట్టులెంచు నానందముతో
జరియించు దగిన రీతిని
బొరయించుక లేక సర్వమున్ గ్రహియించున్.[2]

భగవంతుని చేరుటకు మానవునకు స్థిర బుద్ధి కావలెను. దానిని ఇతరులు నేర్పజాలరు. ఆ స్థిర బుద్ధి నెట్లుంచవలయునో కవయిత్రి చిన్న ఉదాహరణముచే చెప్పుచున్నది:

గీ. తాటి చెట్టు కాల్వ దాటుటకై వేయ
దానిమీద నడచు తరుణమందు
స్వాస్థ్యము నిలబెట్టు సహజంబుగా గాక
దానినెట్లు చెప్ప బూనునొరుడు.[3]

---

1. అమృతసారము - పద్యం 42.
2. అమృతసారం - పద్యం 77.
3. అమృతసారం - పద్యం 139.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జీవుడు నిమిత్తమాత్రుడు. భగవంతుడే అన్ని విధముల శ్రేయస్సు కల్పించువాడు. ఈ భావము ఈనాటిది కాదు, అనాదినుండి వచ్చిన భావన. గీతాకారుడేనాడో చెప్పినాడని కవయిత్రి తెల్పినది.

ఉ. నీవు నిమిత్తమాత్రముగ నిల్వుము సర్వము సిద్ధమంచునా
నా విభవాసనల్ తొలగ నవ్యత రోక్తుల గృష్ణుడర్జునున్
గావగ సర్వమున్ దెలిపెగాదె వివేక మొకింత గల్గినా
జీవులకిద్దె చాల దొకొ శ్రేయము గూర్పగ శ్రీశు జేర్పగన్.[1]

కవయిత్రి పంచాయతన పూజను భక్తిప్రపత్తులతో చేయునని ఈ క్రింది పద్యము వలన తెలియును:

క. ఆదిత్యునంబ విష్ణుగ
ణాధిపతి మహేశ శ్రేని నామ్నాయ విధిన్
మాదివ్యమంది రమ్మున
దాదాత్మ్యం బొసగ గొలిచెదము గురుభక్తిన్.[2]

కవయిత్రి తిరుమల శ్రీనివాస త్రిలింగ మహా విద్యాపీఠమునందుండి గురువులను, స్వాములను భక్తితో సేవించి తరించినది. అందువలన "మా దివ్య మందిరము" అని గురుపీఠమును గూర్చి పేర్కొనినది.

అద్వైత తత్వబోధకములైన పద్యములిందెన్నియో కలవు. కవయిత్రి తనలో ఊహాజనించినపుడు వ్రాసినవన్నియు చేర్చి పుస్తక రూపమున కూర్చినది. ప్రతి పద్యమును చదువదగి యున్నది. చిన్న చిన్న జాతీయములు, సామెతలు

---

1. అమృతసారం - పద్యం 166.
2. అమృత సారము - పద్యం 190.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కూడ చేర్చబడిన పద్యములతో రచింపబడిన ఈ గ్రంథము వేదాంత జిజ్ఞాసువులకు పఠనీయమైనది. అంతమున తన గురువగు 'అమృతానంద స్వామి'ని కవయిత్రి భక్తితో వర్ణించినది.

మ. అమృతానందుని నాశ్రితావనుని సన్వర్ధాభి ధానున్ గురున్
సుమనః కోవిదు సూరిలోకవినుతున్ సుశ్లోకు గీర్తింతు స
ద్విమలాచార్యుని శబ్ద శాస్త్ర చతురున్ విజ్ఞాన సంసత్ప్రదున్
సమునిన్ స్వాత్మ సుఖైక వేది ననఘున్ సత్వార్థ సంధాయకున్.[1]

వేదాంత తత్వము, భక్తి భరితములగు కావ్యములే కాక రచయిత్రి నాటకములు, వచన రచనలు ఎన్నియో రచించి, కవి శ్రేష్ఠులచేత మన్ననలంది, సాహిత్య లోకమున చిరకీర్తినొందినది.

తో మా లి య

కవితిలక కాంచనపల్లి కనకాంబగారి రచనలలో 'తోమాలియ' అను గ్రంథము సహృదయజన రంజకముగా నున్నది. నానావిధ వర్ణ పుష్పములతో గూర్చిన మహా మాలికను 'తోమాలె' అందురు. అట్లే ఆయా ప్రస్తావములందు కవయిత్రి రచియించిన పద్యమాలికలతో కూర్చిన మహామాలయే ఈ 'తోమాలియ' అను పుస్తకము. తాను కూర్చిన 'తోమాలియ'ను కవయిత్రి లక్ష్మినాథునకు సమర్పించినది. భక్తులు, బుధులు దీనిని ప్రసాదముగా కంఠమున ధరించి, మధుర పరిమళములకు సంతసింతురని కవయిత్రి భావించినది.[2]

ఇందుగల పద్యములు కవులు, ప్రముఖులు, గురువులు మొదలగువారి జయంతులు, భగవంతుని జయంతుల (కృష్ణ జయంతి మున్నగునవి) సందర్భ

---

1. అమృత సారము - పద్యం 545.
2. కాంచనపల్లి కనకాంబ తోమాలియ కై సేత - పద్యం 1.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మునను, మహానుభావుల నిర్యాణ సమయములందును, సాహిత్య సభలయందును, స్త్రీల సభలయందును, సంధర్భామసారముగా పఠించిన పద్యములన్నియు ప్రచురించి 'తోమాలియ' అను పేరిడినారు.

గృహలక్ష్మిని ప్రశంసించుచు కవయిత్రి పదునారు పద్యములను రచించినది. గృహలక్ష్మియగు ఇల్లాలి ప్రత్యేకతను వివరించుచు ఒక్కొక్క పద్యమునందొక్కొక్క రీతిగా ప్రశంసించినదీ కవయిత్రి. చివరన గల పద్యమునందు గృహలక్ష్మి పత్రికను పొగడుచు వ్రాసిన పద్యము ముచ్చటగా నున్నది.

చ. అది గృహలక్ష్మి కేసరి గృహంబున వెల్వడి సర్వగేహినీ
హృదయములుల్లసిల్లగ సమీరిత ధోరణి వ్యాసరాజముల్
పదములు పద్యముల్ సరస భంగులసుం గవయిత్రులుం గవుల్
చదువరులున్ లిఖించినవి చల్లెడు నెల్లెడ వేయి మోములన్.[1]

మొల్ల జయంతి సందర్భమున 1936 వ సంవత్సరమున తనకు కేసరిగారు కనక కంకణ ప్రదాన మొనరించి గౌరవించినపుడు 'కనక కంకణ తారావళి' రచించినది. అందొక పద్యమున కేసరిగారిని ఇట్లు ప్రశంసించినది:

ఉ. ఎల్లరు మోదమంద గవయిత్రులనేరిచి కోరితెచ్చి యా
మొల్ల జయంతి నాడు సభ బూజలు సల్పును కంకణమ్మునున్
మొల్లము నిచ్చినేడు బుధ ముఖ్యుడు కేసరి కన్ని సంపదల్
కొల్లగ వచ్చు దేవుడను కూలత నుండెడి నెల్లకాలమున్.

కుమ్మరి వారింట జన్మించిన కవయిత్రి మొల్లను స్తుతించుచు కొన్ని పద్యములు రచించినది. అందొక పద్యము :

ఉ. కుమ్మరివారి యింటను జకోర విలోచన యుద్భవించిలో
కమ్ము దృణమ్ము గాదలచి కంజదళాక్షుని సేవ జేయ జ

1. తోమాలియ - పద్యం 16. పుట - 113.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

న్నమ్ము పవిత్రమౌ ననుచు నమ్మి మహాత్ముని రాముగూర్చి గ్రం
థమ్ము లిఖించి చల్లగను దాటెను మొల్ల భవాబ్ధి వెల్లువన్.

ఇట్లే ఈ తోమాలియయందు సందర్భానుకూలముగా రచించిన పద్యములు కవయిత్రి రచనా పటిమను నిరూపించుచు, సౌరభయుక్తమై విలసిల్లినవి.

హంస విజయము - నాటకము

ఉభయ భాషా ప్రవీణయైన కవయిత్రి కనకమ్మగారు 'హంసవిజయ' మను నాటకమును రచించి కీర్తి బడసినారు. 'జీవ యాత్ర' అను కావ్యమునే 'హంసవిజయ' మను పేరుతో అయిదంకముల నాటకముగా రచించినది. ఇందు వేదాంత విషయములు, నానావిధ ధర్మములు, భక్తి ప్రపత్తులు, రాజనీతులు, విద్యా విధానములు మున్నగునవి చక్కగ రచింపబడినవి. వేదాంత విషయమును దృశ్యకావ్యముగ రచించి కవయిత్రి పెద్దలచే మన్ననలను పొందినది. జయపురాధిపతియైన శ్రీ విక్రమ దేవవర్మగారు, శ్రీయుత సర్ సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారును ఈ హంసవిజయమును గూర్చి తమ అమూల్య అభిప్రాయములను తెలిపి కవయిత్రిని ప్రశంసించినారు. ఈ నాటకమును శ్రీ కూచిమంచి సుబ్బారావు గారు హిందీలోని కనువదించినారు. సనాతన ధర్మములను తానాచరించుటయే గాక, లోకమునకు అందించ వలయునను కోరికతో కవయిత్రి యెంతో శ్రమతో భక్తి, జ్ఞాన, వైరాగ్యములతో గూడిన ఈ నాటకమును రచించినది. ఈ నాటకము ప్రదర్శనాత్మకమై యొప్పుచున్నది.

ఇందు పురుష పాత్రలు, స్త్రీ పాత్రలు పెక్కుగలవు. రమ్య సంభాషణాయుక్తమగు ఈ నాటకమును కాశీనాథుని నాగేశ్వర రావుగారు తమ భారతి పత్రికయందు ముద్రింపించిరి. సులభశైలిలో రచింపబడిన ఈ నాటకమున పద్యములు కూడ బాగుగా రచింపబడినవి. శబ్దాలంకారములను, అర్థాలంకారములను గూర్చి కవయిత్రి చక్కని పద్యరచన మొనరించినది. నిరంజనుడు తన గురువగు సుశీలుని ముందు సత్య సారము చదివి తెలిసికొనును. సర్వ సంశయములు వీడి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోవు వరకు చేయు వ్రతము తపమువలె నుండుననియు, ఇంద్రియములచేర గాక, భక్తితో అంతరంగములోని హరిని తెలియవలయుననియు, తెలిసికొనెను, యోగి, భోగి, రోగి తమ కోరిక తీరువరకు ఒక్క రీతిగనే. కటకట పడెదరని నిరంజనుడు ఇట్లు చదివెను:

గీ. తాప మెచ్చుకొలది తగ్గుచుండును నిద్ర
వలువనైన విప్పుదెలివి దప్పు
గలువరించుచుండు గటకట పడుచుండు
యోగి, భోగి, రోగి యొక్కరీతి.[1]

తృతీయాంకమునందు రాజశేఖరు మహారాజకుమారునకు సంసార జీవిత విశిష్టతను తెలిపి, ఉత్తమ మూర్తియైన నారీమణిని గూర్చి ఇట్లు పలికెను:

సీ. ఆదినారాయణు పాదాబ్జమందు సం
భవమొందు నమృతంపు బావి మోవి
బ్రహ్మసారంబైన ప్రణవాక్షరంబును
బ్రాణంబుగా దాల్చు ఘ్రాణపుటము
స్ఫటికాకృతిని వెల్గు పరమ పూరుషు నిల్పు
నిర్మల తేజంబు నేత్రయుగము

పతి రూపమును దాల్చి సుతురూపమున దేల్చి
విపరీత చర్య మెప్పించు మేను.
యోగమూర్తియు, నతుల సంభోగమూర్తి
దాన కీర్తియు సానంద ధర్మవృత్తి
గలిగి వెలిగెడు దివ్య విగ్రహము నాత్మ
భక్తి భజియించు భాగ్యంబు భాగ్యమందు.[2]

---

1. హంస విజయము - తృతీయాంకము - ద్వితీయ రంగం.
2. హంస విజయము - అవతారిక - కాంచనపల్లి కనకాంబ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తృతీయాంకమునందు తృతీయ రంగమునందు నిరంజనుడు తన మేన మరదలైన బుద్ధిమతిని చూచి పరవశించెను. ఈ ఘట్టమున కల పద్యము చక్కని అపహ్నవాలంకారము చేత ఒప్పియున్నది.

సీ. కాబోలు నిది నూత్న కమలంబు కాదు పో
జడవృత్తి లేమినే జాడజూడ
గాబోలు నిది సుధాకర మూర్తి కాదుపో
తేరిజూచిన యేని తెల్లబోమి
గాబోలు గనకవిగ్రహమిది కాదుపో
పద్మగంధంబున పరిధ విలుట
గాబోలు నిది చిల్కగ విశన కాదుపో
శుకహీన సకల వచోభి వృద్ధి.

గీ. అపును గాకేమి యిది నిశ్చయముగ మరుని
రత్నబాణాసనము శరీర రహితుండు
గాన గానంగరాదను మానమునన
దెలియ వలయును ధీరుల గలచుచూపు
తూపులను దీవ్రగతి దాన దొడగు చుంట.[1]

భక్తి భావ భరితములగు పద్యములను రచించుటలో కవయిత్రి పోతన, మొల్ల వంటి మహనీయులతో సరియైనది. నిరంజనుడు, తన మిత్రుడైన అన్నం భట్టుకు భారతీయ సంస్కృతిని బోధింప దలచి, అతనిని తీర్థయాత్రలకు కొని పోవును. అన్నభట్టు కన్యాకుమారిలో సముద్రమున స్నానమాడి వచ్చిన పిదప భగవధ్యానమునిట్లొనరించెను:

సీ. రామామృతము నోట ద్రావగల్గిన నాడు
నిలమరొక్కడు రుచియించు నెట్లు

1. హంస విజయము - తృతీయాంకము - తృతీయ రంగము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృష్ణ కథల్ చెవికింపుగా వినునాడు
వినిపించునే మరి వింతలెందు
బ్రహ్మ విద్యాలబ్ధి పరిఢవిల్లిననాడు
నరుగునే సభకు పన్యాసములకు
సద్గురూపాస్తిచే శాంతి గల్గిన నాడు
తర్కమంత్రంబుల దగులుకొనునె.

గీ. ముక్తియందేని మోహంబు పట్టదన్న
జీటికిని మాటికెట్లొకో చేరనేర్చు
నిరత విషయంబులను మానసేంద్రియముల
యను భవము లేక చర్చించుట దియగాక.[1]

ఇట్లే ఈ నాటకమున భక్తి, వేదాంత బోధకములైన పద్యములు అచ్చటచ్చట చేర్చబడి కవయిత్రి భక్తిపూరిత అంతరంగమును వెలువరించుచున్నవి. సహృదయులకీ నాటక పఠనమునందు హృదయోల్లాసము కలుగును. నాటకమును చదివిన విక్రమదేవ వర్మగారు తన ఆస్థాన కవియు, ఆంతరంగిక కార్యదర్శియు అగు శ్రీయుత సెట్టి లక్ష్మీనరసింహముగారిచేత ప్రశంసా పద్యమును చెప్పించిరి.

గీ. ఇంటిపేరను దనపేర హేమముగల
యట్టి కాంచనపల్లి కనకమ్మ మేలి
వన్నె కనకమ్మ, కవిత సువర్ణకలిత
యాపె సొమ్మౌట యజుకొమ్మ యలుగకమ్మ.

అభిజ్ఞాన శాకుంతలము - నాటకము

సంస్కృతాంధ్ర ఆంగ్లభాషావిశారదయు, కవితిలక, కవితా విశారదయైన కాంచనపల్లి కనకాంబగారు కాళిదాస మహాకవి కృత ఆభిజ్ఞాన శాకుంతలమును

1. హంస విజయము - చతుర్థాంకము - తృతీయ రంగము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రీకరించి సారస్వత రంగమున యెనలేని యశస్సు నొందినది. ఈ కవయిత్రి అనువదించిన ఈ నాటకము ఎంతయు రమ్యముగా నుండి, రచనా సౌకుమార్య మును కలిగి, ఇంపు గొలుపు శైలితో నొప్పియున్నది. కవయిత్రి ఆంధ్రోప న్యాసకురాలగుటచే భాష నిర్దుష్టముగా సాగినది. ఇందలి పద్యములన్నియు హృద యంగమముగా నుండుటచే ఈ నాటకమును పరిశీలించినాను.

శకుంతల నాటకమును కందుకూరి వీరేశలింగం పంతులు మొదలగువారు తెలుగు భాషలోనికి పరివర్తన మొనరించినారు. అయినను కవయిత్రి తన సహజ కుతూహలముచేత రమ్యముగా రచించినది. ఇందలి భాషాంతరీకరణ విధానము స్పష్టముగా నున్నది. నాటకమునందలి పద్యములను గమనించినచో అది తేటపడును.

నాంది పద్యము చదివిన పిమ్మట సూత్రధారుడు, నటి ప్రవేశింతురు. వారిరువురు సంభాషించు సమయమున సూత్రధారుడు గ్రీష్మఋతు వర్ణన మొన రించును.

గీ. సుభగసలి లావగాహ సంశోభనములు
పాటలా సంగ సురభిళ వన పవనము
లాతత చ్ఛాయ సులభ నిద్రాగ మములు
వాసరములివె పరిణామ భాసురములు.[1]

పై పద్యమునకు మూలమైన శ్లోకమిట్లు కలదు.

శ్లో. సుభగ సలిలావగాహా పాటల సంసర్గ సురభివన వాతాః
ప్రచ్ఛాయ సులభనిద్రా దివసాః పరిణామ ర మణీయాః.[2]

---

1. అభిజ్ఞాన శాకుంతలము - (తెలుగు) ప్రథమాంకము.
2. అభిజ్ఞాన శాకుంతలము - సంస్కృతం - ప్రథమాంకము. శ్లోకము 3.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కణ్వాశ్రమ పరిసరములకు దుష్యంతుడు సూతునితో ప్రవేశించిన తరువాత సూతుడు రాజును చూచి ఇట్లనును:

గీ. కృష్ణసారమ్మునందును నెక్కువెట్టు
విల్లు గల్గిన నీయందు వీక్షణంబు
నిల్పునాకు గన్నట్లయ్యె నిక్కముహరి
ణంబు వెన్నాడు సాక్షాత్ పినాకపాణి.[1]

సంస్కృతనాటకమునందలి శ్లోకము కూడ యిట్టి శబ్దముల చేతనే కూర్చబడినది.

శ్లో. కృష్ణసారే దదచ్చక్షు స్త్వయిచాధిజ్య కార్ముకే
మృగానుసారిణం సాక్షాత్పశ్యా మీవపినాకినమ్.[2]

ప్రథమాంకమునందు దుష్యంతుడు శకుంతలను చూచిన పిదప పలికిన మాటలు శ్లోక రూపమున రమణీయముగా ఉన్నవి. వానినన్నింటిని కవయిత్రి యేమాత్రము ఔచిత్య భంగను వాటిల్లకుండునట్లు రచించినది. కవయిత్రి యొనరించినది అనువాదమే అయినను ఇందు ఆమె ప్రతిభ విదితమగుచున్నది.

ద్వితీయాంకమునందు దుష్యంతుని శృంగార భాషణలు మనోల్లాసకరమగు పద్యములందు కలవు. శకుంతల సౌందర్యమును గాంచిన రాజు విదూషకునితో ఇట్లనును:

మ. కననాఘ్రాణము సేయనట్టి సుమమా కళ్యాణి రూపంబుచే
తను గిల్లంబడదట్టి పల్లవ మవిద్ధంబైన సద్రత్నమా
తని క్రొందేనియ పుణ్య పూర్ణఫలమున్ నానిర్మలంబౌరయె
వ్వనికిన్ భోగముగా విధాత సమకూర్పన్ జేసెనో నేర్పుమై.[3]

పై పద్యమునకు మూలమగు కాళిదాస కవికృత శ్లోకమిట్లు కలదు:

---

1. అభిజ్ఞాన శాకుంతలము - తెలుగు - ప్రథమాంకం.
2. అభిజ్ఞాన శాకుంతలము - సంస్కృతం - శ్లో. 6.
3. అభిజ్ఞాన శాకుంతలము - తెలుగు - ద్వితీయాంకము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్లో. అనాఘ్రాతం పుష్పం కిసలయ మలూనం కరరుహై
రనావిద్ధాం రత్నం మధు నవమనాస్వాదిత రసమ్
అఖండం పుణ్యానాం ఫలమివచ తద్రూపమనఘం
నజానే భోక్తారం కమిహ సముప స్థాస్యతి విధిః [1]

తృతీయాంకమునందును రచనా విధానము పటుత్వము చెడని విధమున సాగినది. కవయిత్రి రచనా పటిమ కొక ఉదాహరణమువలె ఈ నాటకము కలదు. తృతీయాంకమున మన్మథుని, చంద్రుని దుష్యంతుడు విరహముచే దూషించిన పద్యము హృద్యముగా నున్నది.

ఉ. నీసుమసాయకత్వమును నీరజవైరి హిమాంశుకత్వమున్
నాసరివారి యందివి గుణంబులు రెండును గల్లమంచు పై బూసిన
స్వాంశుజాలమున బోరన జందురు డగ్గి జల్లునీ
వేసరి వజ్రసారముల నేపున జేసెదు పూవుటమ్ములన్. [2]

సంస్కృత శాకుంతలమునగల శ్లోకము :

శ్లో. తవకుసుమ శరత్వం శీత రశ్మిత్వ మిందో
ర్ద్వయ మిద మయథార్థం దృశ్యతేమద్విధేషు
విసృజతి హిమగర్భై రగ్ని మిందు ర్మయూఖై
స్త్వమపి కుసుమ బాణాన్వజ్ర సారీ కరోషి. [3]

నాటకము లన్నింటి యందును 'శాకుంతలము' నాటకము శ్రేష్ఠతమ మైనదని ప్రసిద్ధినొందినది. అందు నాలుగవ అంకము నందలి శ్లోకములు రమ్యమైనవని పెద్దలు చెప్పుదురు. శకుంతలను అత్తవారింటికి పంపుటకు కణ్వమహా

---

1. అభిజ్ఞాన శాకుంతలము - సంస్కృతం - ద్వితీయాంకం - శ్లో. 10.
2. ,, - తెలుగు - తృతీయాంకం -
3. ,, సంస్కృతం - తృతీయాంకం - శ్లో 3.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముని ప్రయత్నములొనరించును. ఆమె పోవుచున్నదని భావించగనే కణ్వుని హృదయము వేదనా భరితమైపోయినది. అప్పుడాముని యిట్లనుకొనెను:

శా. ఏగున్నేడిదె తాశకుంతల యనన్ హృత్సీమనుత్కంఠయా
నాగన్ బాష్పములెల్లగురాల్పడి యెమాంద్యంబందె జూడ్కిన్ వగన్
రాగం బాకుల పెట్టు నన్నె యిటరణ్యస్థున్ గటాయింకనే
లాగున్ గేస్తులు వంతనోర్తు రాకొ పిల్లన్ గ్రొత్తగా బంపుచోన్.[1]

శకుంతల ప్రయాణమును తలచిన కణ్వుడు వేదన నొందిన విధము మూలము నందిట్లు కలదు:

యాస్యత్యద్యశకుంతలేతి హృదయం సంస్పృష్టముత్కంఠయా
కంఠః స్తంభిత బాష్పవృత్తి కలుషశ్చిన్తా జడం దర్శనమ్
వైక్లబ్యం మమతావదీ దృశమిదం స్నేహాదరణ్యౌ కసః
పీడ్యంతే గృహిణః కథంను తనయా విశ్లేష దుఃఖైర్నవైః[2]

శకుంతలను పంపుచు కణ్వమహాఋషి బోధించిన నీతి పద్యములన్నియు స్త్రీ లోకమున కాచరణీయములై యున్నవి.

మారీచాశ్రమమునందు దుష్యంతుడు కుమారుడగు సర్వదమనుని గాంచి, ఇట్లు భావించును:

చ. నగుచునహేతుకంబుగ గనన్ బలుమొగ్గ లొకించుకంత దో
పగ దెలియంగ రాని వగు వర్ణములన్ రమణీయ వాక్ప్రవృ
త్తి గలిగి యంకమెక్కగమదిన్ గడు గోరెడు పుత్రులన్ వహిం
పగను దదంగ పాంసుపున బంకిలు లౌదురు ధన్యులిద్ధరన్.[3]

దీనికి మూలమగు సంస్కృత శ్లోకము ఇట్లు గలదు:

---

1. అభిజ్ఞాన శాకుంతలమ్ - తెలుగు - చతుర్థాంకం.
2. అభిజ్ఞాన శాకుంతలమ్ - సంస్కృతం - చతుర్థాంకం - శ్లో. 6.
3. అభిజ్ఞాన శాకుంతలము - తెలుగు - సప్తమాంకము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆలక్ష్య దన్తముకులాన నిమిత్తహాసై
రవ్యక్త వర్ణ రమణీయ వచః ప్రవృత్తీన్
అంకాశ్రయ ప్రణయి నస్తనయాన్వహన్తో
ధన్యాస్త దంకరజసా మలినీ భవంతి.[2]

ఈ విధముగా ప్రతి శ్లోకమును, సంభాషణలను ఆంధ్రీకరించినదీ కవయిత్రి. సంస్కృత భాషా ప్రవీణురాలగు ఈ కవయిత్రి శాకుంతల నాటకమును అనువదించుటలో తన నైపుణ్యమును చూపినది. ప్రతి పద్యమును, సంభాషణలను లలితములైన పలుకులచే నిమిడియున్నవి. ఒక్కొక్క అంకమునుండి ఒక పద్యమును గ్రహించి కవయిత్రి అనువాద విధానమును ఉదహరించితిని.

కవయిత్రి ప్రతిభను ఈ అనువాదము వ్యక్తమొనరించుచున్నది. జ్ఞానబోధకములగు రచనలు చేయుటలో నేర్పునొందిన ఈ కవయిత్రి శృంగార రస భరితమగు ఈ శాకుంతల నాటకమునందలి రస పోషకములగు వర్ణనలను హృద్యముగా నొనరించినది. ఇట్లు తన కవితలచే కాంచనపల్లి కనకాంబగారు కవయిత్రీ లోకమున శాశ్వత కీర్తి నొందినారు.

కనకాంబగారి ప్రశంస

మ. జననంబందితి సత్కవీట్కులమునన్ సత్సేవగావించి పెం
చిన కైతన్ పరమాత్మ సాత్కృతిగ వానిన్ సర్వమర్పించి స
జ్జన మాన్యత్వముగాంచి శాశ్వత యశస్సంతాన మార్జించితో
కనకాంబా సతులందు నీకుపమ లోకంబందు లేదెందునేన్.

(బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు.)

---

2. అభిజ్ఞాన శాకుంతలము - సంస్కృతం - సప్తమాంకం-శ్లో 15.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవి కలహంసి చేబ్రోలు సరస్వతీదేవి

(1939)

చేబ్రోలు సరస్వతీదేవి

మహిళాజన బంధువు డా॥ కె.యన్. కేసరిగారు గృహలక్ష్మి సువర్ణ కంకణ ప్రదానమొనరించి సన్మానించిన వారిలో చేబ్రోలు సరస్వతీదేవిగారు మహిళాలోకము గర్వింపదగిన స్థానమలంకరించినారు. ఆంధ్ర శారద కంఠ సీమలో రామాయణ రత్నహారము నలంకరించి, ప్రాచీన రామాయణ కావ్యకర్తల సరసన శ్లాఘించదగిన స్థానము పొందినారు.

1939 వ సంవత్సరమున కేసరిగారిచే గృహలక్ష్మి స్వర్ణకంకణమును పొంది సన్మానించబడినది కవికలహంసి చేబ్రోలు సరస్వతీదేవిగారు. ఈ కవయిత్రి నీలగిరి నివాసులు, సుప్రసిద్ధ న్యాయవాదులగు కి. శే. రాజగోపాలము నాయుడుగారి పుత్రిక. వీరు 'యతిరాజదాసు' అను నామమున కూడ ఖ్యాతి నందినట్లు రామాయణ అవతారిక యందు కవయిత్రి రచించిన పద్యము వలన తెలియుచున్నది. ఈమె తండ్రిగారు సంగీత, సాహిత్యములందు వన్నెగాంచిన వారనియు, రామచరితమును కృతులుగా రచించి కీర్తినందెననియు, దివికేగిన పితృదేవుని వర్ణించినది. కాని తల్లిపేరు పేర్కొనలేదు. ఈ విదుషీమణి చేబ్రోలు రాజగోపాలము నాయుడుగారి ధర్మపత్ని. సత్కీర్తి వడసిన పుణ్యశాలి, సుగుణ రత్నాకరుని, బరిశుద్ధచరితు, భవ్యధీశాలి, రాజగోపాల వరుని కరము పట్టితినని సంతోష కలితాంతరంగముతో తన భర్తను గురించి తెలిపినది. కవయిత్రి రచించినట్టి 'ఇది శ్రీ సకల కవీంద్ర బృందచాతకానంద సంధాయక చంద్రబింబా యమాన-శ్రీమత్సరస్వతీ రమణీ, రమణీయ చరణారవింద సేవా సమాసాదిత,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రసబంధుర ప్రబంధ రచనా ధురంధర, పద్మవెలమనాయకకుల, పెంపాలగోత్ర పవిత్ర, చేబ్రోలు వంశోద్యాన సమాగత వాసంత లక్ష్మీ సమాన, రాజగోపాల పురుషపుంగవ కుటుంబిని, శ్రీ సరస్వతీదేవీ ప్రణీతంబైన సరస్వతీ రామాయణ, మని తన భర్తగారి వంశమును గూర్చి వివరించినది. సంస్కృతాంధ్ర, ఆంగ్ల హిందీ భాషలను అభ్యసించి, సంస్కృతమున ధారాళమైన సాహిత్యజ్ఞానమును పొందినదీ విద్యాసరస్వతి. కవయిత్రి తన భర్తయగు రాజగోపాలము నాయుడు గారి చెంత జ్యోతిషశాస్త్రము నభ్యసించి పలువురి మన్నన లందినది.

ఈ కవయిత్రి సాహిత్య గురువు కాంచీపురము నందలి శ్రీ కందాడై కృష్ణమాచార్యులుగారు. వారియొద్దనే పంచకావ్యములను, నాటకాలంకారములను జ్ఞానసముపార్జనా దృష్టితో అభ్యసించినది. ఈనాటి విద్యార్థులు జ్ఞానసముపార్జన కంటె యెక్కువగా పదిమందిలో ప్రచారము కావలెనను దృష్టితో విద్య నార్జించి డిగ్రీలను పొందుచున్నారు. కాని నాటి మహిళామణులు ప్రదర్శన దృష్టితో చదువు నేర్వలేదు. వారు ఆసక్తితో విద్య నభ్యసించి, పండితురాండ్రు అయినారు.

సరస్వతీ రామాయణము, సరస్వతీ శతకము, సత్యనారాయణ వ్రత కల్పము, ఆత్మోపదేశము, పతివ్రతా శతకము అను గ్రంథములను రచించినదీ కవయిత్రి. జటప్రోలు సంస్థాన కవివరేణ్యుడగు శ్రీ వాజపేయయాజుల రామ సుబ్బారాయశాస్త్రిగారి శిష్యురాలు. ప్రసిద్ధినొందిన స్నేహలతా కవితా సంఘము నకు వీరు అధ్యక్షులుగా నుండిరి. సరస్వతీదేవి ఉపాధ్యక్షపదవి నొంది సాహిత్య సేవ యొనరించినది. కేసరిగారు వీరికి గృహలక్ష్మి స్వర్ణకంకణ మొసగుటయేగాక 'కవికలహంసి' బిరుదమునిచ్చి గౌరవించిరి. గృహలక్ష్మికి ఉపసంపాదకురాలుగా కూడ వీరు కొన్ని సంవత్సరములపాటు పత్రికాసేవ యొనరించినారు. 'సరస్వతీ రామాయణము'ను మీర్జాపురము రాణిగారు దయాపూర్వకముగ అచ్చొత్తించి నారు. రాణిగారికి కృతజ్ఞతలను తెలుపుచు కవయిత్రి 'నవరత్నమాల' సమ ర్పించినది. నవరత్నమాలలోని పద్యరత్నములవలన రాణిగారి పేరు వేంకయాంబ అనియు, భర్త శ్రీరామవిభుడు అనియు, సకల సుగుణ సంశోభిత, సౌశీల్యవతి యైన ఆ రాణి దయాశీల అని తెలియుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సరస్వతీదేవిగారి రామాయణమును గాంచినట్టి కవిశ్రేష్ఠులు, పండిత వర్యులు ఎందరో తమ అభిప్రాయములను సహృదయముతో వెల్లడించి ఆశీర్వదించినారు. శతావధానులు రాజశేఖర వేంకటశేషకవులు, అవధాని శిరోమణి కాశీ కృష్ణాచార్యులు, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహము, ఆమె గురువుగారగు వాజపేయ యాజుల రామసుబ్బాయుడుగారు, అచ్యుతుని వేంకట చలపతిరావు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి, జనమంచి వేంకటరామయ్య, జానపాటి పట్టాభిరామశాస్త్రి, శతావధానులు శేషాద్రిరమణ కవులు మొదలగు వారెందరో, ఈ కృతిని గురించి తెలిపిన అమూల్య అభిప్రాయములు, ఆశీస్సులు కవయిత్రి కీర్తిచంద్రికలను సాహిత్యాంబరమున వెదజల్లినవి.

ప్రతిభాశాలియైన ఈ కవయిత్రి యొక్క రామాయణము మద్రాసు విశ్వ విద్యాలయమున, ఇంటర్మీడియట్ క్లాసువారికి పఠనీయ గ్రంథముగ నిర్ణయింప బడినది. సరస్వతీదేవిగారి కుమారులు తల్లిగారి పేరు, ఆమె కీర్తి చిరస్మర ణీయముగనుండవలెనను తలంపుతో, ఉత్తరకాండమును పునర్ముద్రించినారు. సరస్వతీ దేవిగారికి ముగ్గురు కుమారులు. ముగ్గురు కూడ ఉన్నతోద్యోగములందున్నారు. గోక్లే, రమానంద గోక్లే, ప్రేమానంద్ గోక్లే - మువ్వురి పత్నులుకూడ అత్తగారియందుగల భక్తి శ్రద్ధలతో భర్తలకు సహకరించినారు. ఉత్తరకాండ ద్వితీయ ముద్రణమునకు డా. దివాకర్ల వెంకటావధానిగారు తొలిపలుకు రచించినారు. "ఆమె రచన ధారాళమై, భావ నిర్భరమై, ఔచిత్య శోభితమై, నిర్దుష్టమై, అత్యంత హృద్యముగా నున్నదనియు, కవిత సర్వవిధముల మొల్ల కవితతోడను, వెంగమాంబ కవితతోడను సాటి చెప్పదగి యున్నది'' అని డా. దివాకర్ల వెంకటావధానిగారు ప్రశంసించినారు. ప్రస్తుతము వీరి రచనలో ప్రసిద్ధమైన 'సరస్వతీ రామాయణము' పరిశీలించుచున్నాను.

సరస్వతీ రామాయణము

భారతీయులకు అడుగడుగునా కష్టసుఖాలలో జ్ఞప్తికి వచ్చేది రామనామ పదము. శ్రీ రాముని తలచనివారు మన భూమిలో లేరనే చెప్పవచ్చును. ఏదో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక రీతిలో, పద్యరూపముననో, గద్యరూపముననో, పాటల రూపముననో ఆ రాముని గూర్చి రచనా నైపుణ్యము గలవారు తలచి రచించినారు. ఆదికవి వాల్మీకి సంస్కృతమున మధుర శబ్ద భరితమైన రామాయణ రచన మొనరించి లోకానికి మేలు చేకూర్చినాడు. క్రమంగా తెలుగు కవులు కూడ రామాయణ రచనకు పూనుకొన్నారు. ఏదో ఒక విధమున రామునికథ నుడువుట పుణ్యదాయక మని ప్రతి కవీ తమ ప్రతిభావ్యుత్పత్తుల నుపయోగించి రామకథను వ్రాసి తరించినారు. అందువలననే తెలుగులో ఎన్నియో రామాయణాలు వెలసినవి. ఒకటి, రెండు కావు, ఎన్నో కలవు. అన్నీ కూడా దేనికవే సాటి. ఒకరి రచనను పోలినది మరియొకటి కాదనవచ్చును.

సకలగుణసంపన్నుడూ, మానవులకు ఆదర్శమైన అవతారమెత్తినవాడు, ధీరోదాత్తుడైన శ్రీరామచంద్రుని నాయకునిగా వర్ణింపుచు పలువురు కవులు రామాయణాలు రచించినారు. ఒకరు వ్రాసిన చరిత్రయే మరల ఎందుకు వ్రాయవలయును అని వారు భావించలేదు. లోకోత్తర గుణములతో, ధీరోదాత్తుడైన కథానాయకుడు లభించుట కష్టము. అందుకే విముఖత లేకుండా రామకథ వ్రాయవలెనని అనర్ఘరాఘవ కర్త మురారి కవి చెప్పినాడు.[1] ప్రసన్నరాఘవ కర్తయైన జయదేవుడు కూడ "కవులు తమ కావ్యాలకు అధినాయకునిగా ఆ రఘుకుల తిలకమైన రామ చంద్రుని ఎన్నుకొన్నారంటే శ్రీ రామచంద్రుని యందున్న గుణగణముల దోషమేకాని కవుల దోషమేమీకాదు". లోకంలోని సమస్త సద్గుణాలూ రాశీభూతమై మరెక్కడా చోటులేనట్లు ఆ రాముని ఎందుకు ఆశ్రయించాలి? అని భంగ్యంతరముగా స్తుతించినాడు.[2] ఇట్లే కవులు ఎందరో తమ తమ అభిప్రాయాలను వ్యక్తమొనరించినారు.

రామాయణాలు తెలుగుభాషలో ఉన్నన్ని ఇతర భాషలలో లేవనే అన వచ్చును. అది అతిశయోక్తి ఏమీకాదు. చేబ్రోలు సరస్వతీదేవిగారి రామాయణ

1. రామాయణసుధాలహరి (తెలుగు రామాయణాలు) పుట 2-20 వరకు.
2. రామాయణ సుధాలహరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిశీలనకు ముందు తెలుగులో ఉన్న రామాయణాలు కొన్ని సూక్ష్మంగా పరిశీలింపదగి యున్నవి.

1 రంగనాథ రామాయణం (1240) : తెలుగు రామాయణాలలో గోన బుద్దారెడ్డి రచించిన రంగనాథ రామాయణము. ద్విపద రచనలో సాగిన ఈ రామాయణం పండిత పామర జనరంజకముగా నున్నది. రచనా రామణీయకతతో గూడిన ఈ రామాయణ సమకాలీనమైనదే భాస్కర రామాయణం.

2 భాస్కర రామాయణం : హుళక్కి భాస్కర కవి కుమారుని తోడను, శిష్యుని తోడను, మిత్రునితో కలిసి 'భాస్కర రామాయణము' అను పేరున ఈ కావ్యమును రచించినాడు. రంగనాథ రామాయణము దేశి మార్గములో సాగితే, ఈ కావ్యము మార్గ కవిత్వములో సాగినది. అనర్గళమైన ధారతో కూడిన ఈ కావ్యమున కూడ అవాల్మీకములు కొన్ని కలవు. విద్వజ్జన రంజకమైన ఈ కావ్యము కవి కీర్తిని చిరస్థాయిగా నిల్పినది.

3. మొల్ల రామాయణం : ప్రప్రథమంగా, రామాయణ మహాకావ్యాన్ని తేనెసోక నోరు తీయన యగురీతిగా, తన కావ్యాన్ని చదివి పరవశించి పోవలెనను భావనతో మొల్ల రామాయణమును రచించి ఆంధ్ర పాఠకలోకమునకు అందించినది. ఈమె రామాయణము ఆరు కాండలతో సుమారు 900 గద్య పద్యములతో విరాజిల్లుచున్నది. ప్రసన్న కవితామాధుర్యాన్ని కలిగిన ఈ కావ్యమును కవయిత్రి మొల్ల తన ఇష్ట దైవతమైన శ్రీరామచంద్రునికే అంకితమొనరించినది.

4. రామాభ్యుదయము : అయ్యలరాజు రామభద్ర కవిచే రసవంతముగా రచింపబడిన ఈ గ్రంథం సుమారు 1800 గద్య, పద్యములతో రచింపబడినది. శ్లేష చమత్కారం, శబ్దాలంకార చాతుర్యం కలిగిన ఈ కావ్యము విజయ విలాసానికి మార్గదర్శకమైందని విమర్శకులందురు.

GL-10

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కట్టా వరదరాజ రామాయణము : సూర్యవంశ క్షత్రియుడైన ఈ వరద రాజ కవి రామాయణము యథా వాల్మీకముగా రచింపబడినది. దీనిలో 23,170 ద్విపదలున్నవి. ఒకటి రెండు అవాల్మీక అంశములు గలవు.

రఘునాథ రామాయణము : తంజావూరు రాజులలో నాయక మణి వంటి వాడైన రఘునాథ రామాయణ కావ్యము. ఇది బాలకాండ వరకు లభించినది. రఘునాథుని ఆస్థాన కవయిత్రి మధురవాణి దీనిని సంస్కృతంలోనికి అనువదించినది.

అచ్చతెనుగు రామాయణము : కవిసార్వభౌమ కూచిమంచి తిమ్మకవి రచించిన ఈ అచ్చ తెనుగు రామాయణము కవి ఇష్టదైవమగు పీఠికాపుర కుక్కుటేశ్వర స్వామికి అంకితమొనరించినాడు. 'తేనియ తేటలు మా కూచిమంచి తిమ్మయ మాటలు' అను ప్రశంసనందుకొన్నాడు తిమ్మకవి.

గోపీనాథ రామాయణము : గోపీనాథము వెంకటకవిగారు రచించిన ఈ రామాయణమునకు కవి తన ఇంటిపేరును చేర్చి 'గోపీనాథ రామాయణము' అని పేరిడినాడు. 19 వ శతాబ్దికి చెందిన ఈ కవి వెంకటగిరి సంస్థానకవి. అక్కడ ఆస్థానకవిగా కీర్తినందినాడు.

ఆంధ్ర వాల్మీకి రామాయణము : 'ఆంధ్ర వాల్మీకి' బిరుదు నందిన శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు వాల్మీకి రామాయణమును యథా మాతృకంగా రచించినారు. ధారాళమైన శైలితో, ద్రాక్షాపాకములో రచింపబడినదీ కావ్యము.

ఇట్లే ఇంకను ఎన్నియో రామాయణములున్నవి. ఆంధ్రశ్రీమద్రామాయణము, ధర్మసార రామాయణము, శ్రీరామకథామృతము, శ్రీకృష్ణ రామాయణము, గోవింద రామాయణము సీసము సుభద్రమ్మగారి సుభద్రారామాయణము, మానికొండ రామాయణము (తెలుగు వాల్మీకము), యోగానందాంధ్ర రామాయణము, జగన్నాథ రామాయణము, దాశరథి విలాసము, రామోదయము మున్నగునవి కలవు.[1] కవి

1. రామాయణ సుధాలహరి (తెలుగు రామాయణాలు) పుట 2-20 వరకు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి అమరకృతియైన 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము' నేటి సాహిత్యలోకమున చిరస్థాయినందుకొన్నది. 'ఎంతోమంది కవులు రామాయణాలు వ్రాసినారు. మరల మీరు రామాయణము నెందుకు వ్రాయుచున్నారు?' అని ఎవరో కవిగారిని ప్రశ్నించినారట. అందుకు కవి సామ్రాట్టు విశ్వనాథ ఇట్లు బదులు పలికినాడు-

మరలనిదేల రామాయణంబన్నచో
నీ ప్రపంచకమెల్ల నెల్లవేళ
దినుచున్న యన్నమే తినుచున్నదిన్నాళ్ళు
తనరుచి బ్రతుకులు తనవిగాన
తలచిన రామునే తలచెద నేనును
నా భక్తి రచనలు నావిగాన
కవిప్రతిభలోన నుండును గావ్యగతశ
తాంశములయందు దొంబదియైన పాళ్లు
ప్రాగ్విపశ్చిన్మతంబున రసమువేయి
రెట్లు గొప్పది నవకథా ధృతిని మించి.[1]

వాల్మీకి రచించిన రామాయణమును నూతన కల్పనలతో కొందరు, పుణ్యము కొరకు కొందరు, ఈ విధంగా ఎన్నో ప్రయోజనాల నాశించి వ్రాసినారు. తండ్రిగారి కోరిక ప్రకారం విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షమును రచించినట్లు తెలిపినారు.

ప్రముఖులైన కవులందరూ రచించి తమ కీర్తిని ఆచంద్రతారార్కము నిలుపుకొన్నట్లే చేబ్రోలు సరస్వతీ దేవిగారు కూడ రామాయణ రచన మొనరించి శాశ్వతకీర్తిని పొందినారు. అయితే సామాన్యంగా కవులందరూ రామాయణంలోని ఆరు కాండములను మాత్రమే రచించినారు. కాని ఈ కవయిత్రి యేడు కాండలను

1. శ్రీమద్రామాయణ కల్పవృక్షం - విశ్వనాథ సత్యనారాయణగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచించినది. ఇది ఆమె ప్రత్యేకత అనవచ్చును. ఉత్తర రామాయణమును ప్రాచీన కవులలో రచించినవారు అరుదు. తిక్కన సోమయాజి 'నిర్వచనోత్తర రామాయణము'ను రచించి మనుమసిద్ధికి అంకితమొనరించినాడు. కంకంటి పాపరాజు ఉత్తర రామాయణమును రచించినాడు. 'రాఘవేశ్వరు చారిత్రము లెందరెన్ని గతులన్ వర్ణించినన్ గ్రాలదే' అనియు 'జానకీ జానికథల్ రచింపక యసత్కథ లెన్ని రచించె నేనియున్, వాని వివేకమేమిటికి, వాని పవిత్వమహత్త్వమేటికిన్' అనియును కంకంటి పాపరాజు పలికినాడు. వేరుగా ఉత్తర రామాయణమును వ్రాసినవారుకలరు కాని కవయిత్రి యేడు కాండములను కూడ రచించుట శ్లాఘనీయమైన విషయము.

కవయిత్రికి గురువుగారగు వాజపేయయాజుల రామసుబ్బారాయుడుగారు రామాయణమును రచింపుమని ప్రోత్సాహమిచ్చినారు. వారి యానతితోనే రచించుటకు పూనుకొని గురు స్తుతి ఇట్లొనరించినది-

గీ. వాజపేయయాజుల వంశ వార్థిసోము
డైన శ్రీరామ సుబ్బారాయని కరుణను
రామచంద్రుని చరితనే వ్రాయగంటి
గురువరుండాతదే భక్తి గొలుతునతని.

రామాయణ బాలకాండ ఆరంభమునందు శ్రీమహావిష్ణుమూర్తిని, బ్రహ్మ, పరమేశ్వరులను, మోహనమూర్తి కృష్ణుని, తారకరాముని, వాగ్దేవిని, విఘ్నరాజును, సాధువులను, వాల్మీకి, భవభూతి, కాళిదాస, అమరసింహుని, శ్రీహర్షుని, శ్రీనాథుని, మల్లనను, బాణుని, భారవిని, తిక్కన, భట్టుమూర్తి, పోతనార్యుని, ఇట్లు సంస్కృతాంధ్ర కవుల నందరినీ ప్రస్తుతించినది. కరుణావీక్షణములతో విద్యార్థులను గారవించు తన గురువర్యుని స్తుతించినది. ప్రాచీన కవులందరినీ ప్రస్తుతించుట అనూచానముగా వచ్చుచున్నదే. కాని కవయిత్రి సాధువులను, పతివ్రతలైన స్త్రీలను కొనియాడుట ఈ అవతారికయందలి ప్రత్యేకత. కృష్ణుని ప్రార్థించిన విధానము కూడ రమ్యముగా నున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చ. ఇరుగడలందు గోపికలు నిగ్గడవారికి దాను నిచ్చుచున్
గరములు కంఠసీమ బెనగన్ నవగోపకుమార వేష సుం
దరుడయి చంద్రికా విలసితంబగురాత్రుల రాసమండలిన్
మురళిరవంబునం దనుపుమోహన మూర్తి మదిన్దలంచెదన్.[1]

సాధువులైన వారిని వర్ణించి ప్రస్తుతించిన రీతి ఇట్లు కలదు :

ఉ. సత్యము ధర్మముందెలిసి చక్కని మార్గము బట్టి యేగుచున్
నిత్యము భక్తి యుక్తముగ నీరజనాభుని నమ్మి కొల్చుచున్
స్తుత్యములైన జ్ఞాని జన సూక్తములన్ స్మరియించి జన్మరా
హిత్యము గొన్న సాధువుల కెంతయు మ్రొక్కెద నిత్యశాంతికిన్.[2]

పతివ్రతలగు మహిళలకు ఇట్లు నమస్కరించినది:

చ. సతతము ధర్మచింతనయు, శ్లాఘ్య తమంబగు శీల వృత్తులున్
ఋతమృదువాక్కునెందు జలియింపకనిల్పెడు దైవభక్తియున్
హితమగు రూప సంపదయు హెచ్చిన ప్రేమ రసంబు మీరగా
బతిపద సేవలన్ మెలగు భవ్య చరిత్రలకేను మ్రొక్కెదన్.

సాధువులను, సాధ్వీజనులను ప్రత్యేకించి ప్రస్తుతించుట వలన కవయిత్రి శ్రీ సహజమగు సౌశీల్యము తెలియుచున్నది. ఈ మానినీమణి తన కృతియగు రామాయణమును మకరకుండల మండితుడై, మందహాస విలసితుడైన రమానాథునకు అంకిత మొనరించినది.

ధారాళ శైలీ పూరితమై, వర్ణనా భరితమైన ఈ కావ్యము అయోధ్యా పురవర్ణనతో ప్రారంభమైనది. పురవర్ణనము, పురమునందలి చాతుర్వర్ణముల వారి వర్ణనము, రథ, గజ, తురగ, పదాతుల వర్ణన, పాడి పశువుల వర్ణనము అన్నియు ఉచిత రీతిలో సాగినవి. రచనా విధానము కొంత మొల్ల రామాయణ

1. చేబ్రోలు సరస్వతీ దేవి - సరస్వతీ రామాయణము - పద్యం 3.
2. చేబ్రోలు సరస్వతీ దేవి - సరస్వతీ రామాయణము - పద్యం 10.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రీతిలోనే సాగినది. మొల్ల కూడ అయోధ్యాపుర సాకేతపురములను ముందు వర్ణించినది. కవయిత్రియు అట్లే కథా ప్రారంభమొనరించినది. అయోధ్యా నగర వర్ణన హృద్యముగా నున్నది.

సీ. నిత్యకళ్యాణంబు నిబిడ సద్విభవంబు
సరయూ నదీ వాయు పరిగతంబు
శరధి గంభీరంబు సౌభాగ్యనిలయంబు
మణిమయ ప్రాసాదమండితంబు
భువనమోహన దివ్య నవరత్న రుచిరంబు
సంతత సంగీత సంకులంబు
ఘన సారక దళికా కల్పకోపేతంబు
ప్రకృతిలావణ్య సంపన్నుతంబు

గీ. మత్తకుంజరయూధ సమ్మానితంబు
త్రిభువనాతిగ బహు భోగదీపితంబు
చిత్రభానుని మణిమయ సింహపీఠ
మనగ విలసిల్ల మహినయోధ్యాపురంబు.[1]

పురవర్ణన కాని, ఏదైన ఒక వస్తు వర్ణనగాని చేయునపుడు కవయిత్రి రచన ఎక్కడను ఆగక తీగవలె సాగిపోయినది. ఇట్టి ధారాశుద్ధితో వర్ణించిన పద్యము లనేకములు కలవు.

సుందరకాండమునందు మారుతి లంకానగరము జొచ్చి అక్కడ విశ్వ కర్మ నిర్మితమైన, గగనగామి యగు ఒక విమానమును గాంచెను. ఆ విమాన వర్ణన మిట్లు సాగినది:

సీ. మణిమయాలంకార మరకత వేదికల్
వైడూర్యఖచిత గవాక్షములును
తప్తకాంచనదివ్య తరకుట్టిమములును
శక్రనీలోపల స్తంభములును

1. సరస్వతీ రామాయణము - బాలకాండము - పద్యం 27.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రవిమల నవరత్న భద్ర సోపానముల్
చిత్రితకృత్రిమ పుత్రికలును
మాణిక్య సంతాన మయకవాటంబులు
మేలిమి ముత్యాల మేలికట్టు
గీ. దివ్య దీపికా కోటులదీధితులును
దనర గైలాసగిరివోలె నొనరు విశ్వ
కర్మ నిర్మిత మగునట్టి గగనగామి
యైన యొక్క విమానంబు నతడుగాంచె.[1]

ఆ విమానమునందు శయనించియున్న రావణుని, అతని శయ్యను వర్ణించిన పద్యము కావ్యకన్యకు మెత్తని అక్షర శయ్యను కూర్చినట్లు గలదు.

సీ. పగడంపు సరికోళ్ల పసిడి కంబముతోడ
మరకతయుతమైన మంచమలర
ముత్యాలజాలీలు మువ్వంపు తలదిండ్లు
వెలిపట్టు దుప్పట్లు విరులునిండ
మిసమిస దళుకొత్తు మేల్పట్టు జలతారు
తూలికా తల్పంబు తులకరింప
నాలుగు ప్రక్కల నవరత్న దీపికల్
దేదీప్యమానమై తేజరిల్లు
గీ. బాములను బోలు వింశతి బాహువులును
దశశిరంబులు నొప్పనుద్దండముగను
ఘోరఫూత్కార రవముబు మారు మ్రోగ
సుప్తుడై యున్న రావణుజూచెనచట.[2]

---

1. సరస్వతీ రామాయణము - సుందరకాండము - పద్యం 20.
1. సరస్వతీ రామాయణము - పద్యం 22.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యక్తి శరీరమునకు నిమ్నోన్నతములు లేని శయ్య (పడక) యెట్టిదో కావ్య శరీరస్థానీయమగు శబ్దములకు పరస్పరానుగుణమైన విధముగా కూర్చిన కూర్పు అట్టిది. ఈ శయ్యను 'మైత్రీముద్ర' అనియు అందురు. కావ్యమున వర్ణితమైన కథావస్తువును వినువారు అప్పుడే తమ కనుల యెదుటనే అది జరుగుచున్నట్లు భావించుట ప్రత్యక్ష శయ్య అనబడును.[1] పదమైత్రి యొనరించి పద్యమున చక్కని శయ్య నేర్పరచుటలో కవయిత్రి మంచి నైపుణ్యము కలిగియున్నది.

సీ. కమలాకరంబులు కలహంస సారస
కైరవ కోమల విస్తారితములు
క్రీడావనంబు లామ్రేడిత శుకపిక
శారికాశిఖిర వాశబ్దితములు
మందమారుతముల చందన చాంపేయ
కురవక మందార సురభిళములు
పురగోపురంబులు, పౌలుపార రఘువంశ
విజయ వర్ణావళి విలసితములు

గీ. దానజలపాత పంకిలోత్తము పదమున
గానగీత ప్రపూర్ణ రంగస్థలమున
దివ్యహరికీర్తనా క్రాంత దిక్తటమున
బరమ పావన సాకేతపురవరమున.[2]

కవయిత్రి రచనలో సహజత్వము యెక్కువగా కలదు. దశరథుని రాణులగు కౌసల్యా, సుమిత్ర, కైకేయిలకు గర్భచిహ్నములు కలుగుట. వారి వేవిళ్లు, పుత్రులు జన్మించిన పిదప దశ దినముల తర్వాత పురిటి వేడుకలు,

1. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము - కావ్యప్రకరణము- పుట 115, 117.
2. సరస్వతీ రామాయణము - బాలకాండము. పద్యం - 31.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జాతకర్మనామకరణాది క్రియలు, చౌలోపనయనవిధులు అన్నియు చక్కగా వర్ణించినది. దశరథుని మువ్వురు రాణులకు కలిగిన గర్భచిహ్నములను వర్ణించిన విధము చూడదగినది.

చ. తెలతెలనయ్యె జెక్కిళులు తేజము సవ్యము తోచె మేన బల్
నలుపలరారె చూచుకములన్ మనమందున దోచెగ్రొత్త కో
ర్కులు వళులల్ల విచ్చె బెడ గున్నదకల్ మెలమెల్లనయ్యె నూ
ర్పులు బలయయ్యె గన్నుల లపుంజిగిమై కొనెనాడు నాటికిన్[1]

గీ. చిట్టుముల తోడ నోకిలిబిట్టు గలిగె
దొడవు లెంతయు బరువుగా దోచెమదికి
నవ విలాసము చిగిరించెను విదలకును
మెరుగు నూగారు గాటమై మిసిమినొందె.[2]

సీత వివాహ సందర్భమున, వారిని అత్తవారింటికి పంపునపుడు జనకు డొనరించిన సదుపదేశములు గమనించదగినవి. పతివ్రతా ధర్మముల నెరిగించు పద్యములు పరిశీలింపదగినవి.[3]

పతివ్రతా ధర్మములనుపదేశించుచు పుత్రికను చందురు నంటిన వెన్నెలవలె ఉండుమని జనకు డాదేశించెను.

చ. అలికులవేణి నీదు ప్రియుడాగ్రహమంచి కటూక్తులాడిన
న్వెలవెల బోయి కోపవడి నిప్పులు గక్కగ బోకుమమ్మ యా
సలిలమునంటి చల్వయును, చందురు నంటియు వెన్నెలం బలెన్
మెలగుచు సౌఖ్యవారిధిని మెప్పు గడించుమ యిందు నందునన్.[4]

---

1. సరస్వతీ రామాయణము - బాలకాండము. పద్యం - 63.
2. సరస్వతీ రామాయణము - బాలకాండము. పద్యం - 64.
3. సరస్వతీ రామాయణము - బాలకాండము - పద్యం 113.
4. సరస్వతీ రామాయణము - బాలకాండము - పద్యం 116.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఇందునందునన్" అని అనుటలో పుట్టింటను అత్తవారింటను మెప్పుగడించుమని పుత్రికలకు సద్బుద్ధి నుపదేశించెను.

కవయిత్రి యొనరించిన వర్ణనలలో ఋతువర్ణనములు కూడ హృద్యముగా నున్నవి. హేమంత ఋతువర్ణనములో, శీతకాలమునందలి ప్రకృతి రీతినిట్లు వివరించినది :

ఆ. పగలు సన్నమయ్యె జ్వలనుడు హితుడయ్యె
నిశలు నిడుదలయ్యె నిండె హిమము
విరహిజనుల బాధపెట్టె మీనధ్వజుం
డుత్తరానిలంబు లెత్తివేసె.[1]

క. తోయజనయనలనెయ్యము
సాయముచే బ్రతుకగలిగె జక్కగ జగముల్
ప్రాయము మీరిన వారిక
జేయముహేమంత మనుచు జెప్పగ వినమే.[2]

వర్షఋతువు వర్ణనలో కూడ సహజత్వమును చూపించినది కవయిత్రి.

ఉ. వీచెను బూర్వ వాయువులు వెక్కసమౌ తటిదంశు జాలముల్
దోచె నెసంగె జాతక తతుల్ వడదేరగ వానలెంతయున్
బూచె శిలీంధ్ర నీపములు బుట్టె బ్రతీచిని శక్రచాపముల్
లేచిన కాక్కొగిప్టను జలించెను దక్షిణమార్గగాములై.[3]

ఉ. కప్పిన నీలమేఘముల గాంచి మయూరము విప్పె బింఛమున్
గప్పురపువ్వి ఖండములుగా గడకన్ గరకల్ ధరంబడెన్
గప్పలుగూసె గర్షకులు కౌతుక మందిరి కారుచిచ్చులా
చప్పన నాగె వర్షములు సాగెను మింటికి మంటికేకమై.[4]

1. సరస్వతీ రామాయణము - అరణ్యకాండము - పద్యం 20.
2. సరస్వతీ రామాయణము - ఆరణ్యకాండము - పద్యం 21.
3. సరస్వతీ రామాయణము - కిష్కింధకాండ - పద్యం 32.
4. సరస్వతీ రామాయణము - కిష్కింధకాండ - పద్యం 33.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గడగడ మొరయునట్టి యురుములతో, తళుకుమని మెరయు మెరపులతో విడువక కురిసిన వర్షముతో, విశ్వమంతయు కదలిపోవు సమయమున సీతా విరహాతురుడగు శ్రీరాముని చిత్తము అంధకారమైనది. వర్షాకాలమున శ్రీరాముని విరహవేదన వర్ణించుటలో కవయిత్రి ప్రతిభ వెల్లడి యగును. విప్రలంభమునందు కలుగు సాత్త్విక భావములను వచనములో కవయిత్రి సుదీర్ఘముగా వర్ణించి, కావ్యమునకు శోభను కూర్చినది.[1]

రామాయణ కావ్యమున నాయిక యైన సీతాదేవిని కవయిత్రి మనోహరముగా వర్ణించినది. పూర్ణచంద్రుని బోలిన మొగము గలిగి, లేతనును వెన్నెలల బోలిన నవ్వును కలిగి, శ్రీమహాలక్ష్మి బోలిన సీతాదేవి యొక్క చూపులను, నవ్వును, పలుకును, నడకను భావయుక్తముగా వర్ణించినది కవయిత్రి.

సీ. చూచెనా యొక్కమించుం జూపు చేతనే
 మరులు గొల్పగజాలు హరిణ నయన
నవ్వెనాయొకమారు నవ మల్లికలు చల్లు
 చెలువున దనియించు స్మేరవదన
పలికెనా తరువుల బల్లవింపగ జేయు
 మధుర మనోహర మంజువాణి
నడయాడెనా మత్త నాగేంద్రుని హసించు
 మంజీరయుగ నద న్మందయాన

గీ. నాతి వర్ణింప దరమౌనె నలువకైన
గాంత కౌగిలి సౌఖ్యంబు గలుగువాడె
ధన్యుడిట మీద సరయంగ దానవేంద్ర
విన్నవించితి నేనట గన్న విధము.[2]

---

1. సరస్వతీ రామాయణము - కిష్కింధాకాండము - వచనము 36.
2. సరస్వతీ రామాయణము - అరణ్యకాండము - పద్యం 39.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క్రియా పదముతో ప్రారంభించి పద్యపు నడకకు గంభీరతను కల్గించుట ప్రాచీన కవులందరికీ కల అలవాటే. ఎఱ్ఱన, పోతన, శ్రీనాథాదులెందరో క్రియా పదముతో పద్యమును గంభీరముగా ప్రారంభించినారు. కవయిత్రి రచనలో కూడ కొన్ని పద్యములట్టివి కలవు. సీతాదేవిని గాంచి రావణుడు అశోకవనము నందు పలికిన పద్యము చూడ తగియున్నది.

ఉ. చూచితి నప్సరోంగనల జూచితి గిన్నెర యక్షకాంతలన్
జూచితి భోగ భామినుల జూచితి దేవ సతీ లలామలన్
జూచితి మర్త్యకామినుల జూడ్కికి నింపగువారి నెల్లరన్
జూచితిగాని నీ తళుకు సోయగమెందును జూడగోమలీ.[1]

హనుమంతుడు అశోకవనమును ధ్వంసమొనర్చిన తీరును వర్ణించుటలో హనుమంతుని క్రోధము అతని చేష్టలలో వ్యక్తమగునట్లు వనమును నుగ్గు నుగ్గు చేసిన విధము వలన తెలియుచున్నది.

సీ. విదలించి ఫలముల విరుల పత్రంబుల
గుంజపుంజంబుల గూలద్రోసి
పెకలించి వ్రేళ్ళతో బెద్ద వృక్షంబుల
గొమ్మల రెమ్మల గొట్టివైచి
కదలించి లతలను గరములతో ద్రెంచి
పద్మాకరంబుల బాడుచేసి
వెడలించి ద్విజముల వివిధ సత్వంబులు
గావలివారల గదిసిచంపి
గీ. వీకప్రమదావనంబుల పెరికివైచి
కాలభైరవ భీకరాకారుడగుచు
గోటకొమ్ముల బడగొట్టి గోపురములు
నుగ్గునురుమాడి వనమెల్ల నూతగలుప.[1]

1. సరస్వతీ రామాయణము - సుందరకాండము - పద్యం 56.
2. సరస్వతీ రామాయణము - సుందరకాండము - పద్యం 112.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యుద్ధకాండమునందు కూడ వర్ణనలు కన్నులకు కట్టునట్లుగా వర్ణించినది. సందర్భమునననుసరించిన రచన యొనరించుటలో కవయిత్రి కవితా చాతుర్యమును చక్కగా చూపినది. విభీషణుడు రాముని శరణాగతి పొందుటకు వెడలునపుడు మధురగతి రగడలో వర్ణించినది. గరుడవ్యూహమున వానర వీరులు రాత్రించరులను తాకిన ఘట్టము సరభసముగ వర్ణింపబడినది.

సీ. నల్లగొండలు లేచి నడయాడు చందాన
మదవారణంబులుగడిసినడువ
నాస్కందితంబు లోనగు భేదముల దురం
గములు తరంగ రేఖలను దెలుప
దతహయ ధావనోత్కట రథవ్రాతముల్
కేతుకింకిణుల బెనొక్కళిలిడగ
గరవాల తోమర పరశుపట్టిసకుంత
ధారులై భటులొక్కబారు తీరి.

గీ. యుద్ధసన్నద్ధమై రుషాక్రుద్ధమగుచు
భేరి ఝాంకరణంబులు ద్వేలముగను
గెరలియరిసేన దాకనాసుర విరోధి
సైన్యతతు లొక్క పెట్టున సరభసముగ. [1]

మోహరించిన రెండు వాహినుల వర్ణన కవయిత్రి దీర్ఘముగా వచనములో రచించినది. రెండు పుటలయందు రచింపబడిన ఈ వచనములో యుద్ధములందుపయోగించు వివిధాయుధములతో, తురగములతో, వానరులు, రాక్షసులు కలహించిన విధమును వర్ణించినది.

యుద్ధరంగమున నీలాంగదులు విజృంభించిన తీరును వర్ణించుటలో రౌద్ర రస ముప్పొంగు చున్నది.

---

1. సరస్వతీ రామాయణము - పద్యం 70 (యుద్ధకాండ).

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. తాళంబులను జిమ్ము దంతావళము భంగి
దలబట్టి ధరకీడ్చి తాచి తాచి
మత్త మాతంగేంద్ర మస్తంబులం ద్రుంచు
సింహా కృతింబట్టి జీల్చి జీల్చి
పలువాతహతి బిల్వ ఫలము లూడెడురీతి
రప రపశిరములు రాల్చి రాల్చి
కాలమృత్యువు దీరి కసి మసంగిన భాతి
జాను కూర్పరహతి జదిపి జదిపి

గీ. కాలభుజగేంద్ర సన్నిభవాలములను
గంఠముం జుట్టి గట్టిగా గట్టికట్టి
రక్తధారలు వెడలంగ రక్కి రక్కి
పింకి పిండిగ నుగ్గాడి పీచమడచి.[1]

దశకంఠుడు కుంభకర్ణుని మేలుకొలిపి సమర సన్నద్ధునిగా జేసి పంపినపుడు కుంభకర్ణుడు:

సీ. ఆకలి కోర్వక హస్తి యూధంబుపై
లంఘించు మృగరాజు చెలువు మెరసి
సమయకాలంబున సమవర్తికైవడి
నుగ్రుడై కనులగ్గినుమియుచుండ
దిగిభకర్ణంబులు దగిలి ఘూర్ణిల్లంగ
సింహనాదంబుల జేసికొనుచు
వాత విజృంభిత వన వహ్నివడువున
గపివరూధిని మీద గలియనురికి.

గీ. గొప్పనడకొండ వలె దారి గుములుగాగ
నెదురుగ డిసిన కొందరినీడ్చి త్రొక్కి
శ్వాసవాతంబునం బెక్కు వానరులను
దీల్చి మ్రింగుచు వెడలె సంప్రీతితోడ.[2]

---

1. సరసతీరామాయణము-పద్యం 89 (అరణ్యకాండ).
2. సరస్వతీ రామాయణము-పద్యం 123 (యుద్ధకాండము).

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రౌద్ర, వీరములు కలబోసిన ఆ యుద్ధరంగమున రావణుని వధానంత రము మండోదరి విలపించిన తీరు కరుణ రసభరితమై యొప్పినది. ఎందరు చెప్పినను వినక, హేయ సుఖమును కోరి, ధారుణీనందనను తెచ్చి నశించిన లంకా నాథుని శౌర్య సాహసములను తలచుకొని, దురపిల్లినది.

శా. ఆ సావాసములా చమత్కృతులు నాహాసంబు లాభోగవి
న్యాసంబుల్ చెలువారనిన్ గలిసి దివ్యారామ మందల్లకై
లాసంబందు వియన్న దీర్ఘలిన లీలాకేళి గైకొంటిమ
న్నాసౌభాగ్యములింక లేవుగద నాథా దైత్య చూడామణీ.[1]

ధీరోదాత్త నాయకుడగు శ్రీరామచంద్రుని నాయకునిగా నిల్పి, ఈ రామా యణ కావ్యమును రచించుటకు ముందు కవయిత్రి కావ్యమున కొక రూపమును మనసున చిత్రించి, వాల్మీకి రామాయణ కథను స్వతంత్ర రచనతో మలచినది. కావ్యాంతమున నాయకుని శుభమునుగోరుచు రాముని పట్టాభిషేక వర్ణనము సముచి తముగా యొనరించినది.

సీ. మరకతమణి రత్నమంటపమున భద్ర
సింహాసనంబున సీత తోడ
శ్రీరామచంద్రుని శృంగారముగ నుంచి
భరతుండు ఛత్రంబు బట్టుచుండ
సౌమిత్రులిద్దరు చామరంబులు వీవ
బవమానతనయుండు పదములొత్త
వేదఘోషంబులు విపులంబులై మ్రోయ
నభిషేకముల జేసి హర్షమెసగ

గీ. ఫాలభాగంబునన్ ధర్మపట్టమలర
గట్టినవరత్న మకుటంబు కాంతి దనర
శిరమునందుంచి 'జే' యని సేసలిడిరి
రాజితంబుగ బట్టాభి రామునకును.[2]

1. సరస్వతీ రామాయణము-యుద్ధకాండము-పద్యం 123.
2. యుద్ధకాండము - పద్యం 156.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లోక కళ్యాణ గుణుడైన శ్రీరాముని కథను రచయిత్రి కమనీయ కావ్యముగా దీర్చినది. ఇందు శ్రీరామ భక్తుడగు పోతన మహాభాగవతమునందలి కొన్ని పోలికలు కానవచ్చుట విశేషము. అట్టి పోలికలు కొన్ని పరిశీలనార్హమై యున్నవి. శ్రీరామునకు పట్టాభిషేక మొసరించు వార్తను విని కైకేయి దశరథుని తన కీయ వలసిన వరద్వయమును కోరినది. భరతుని రాజ్యపట్టాభిషేకము. శ్రీరాముని పదునాలుగేండ్ల వనవాసము. కైకేయి వినిపించిన మాటలతో శ్రీరాముడు వల్లెయని మునివేషమును దాల్చి, వనగమనమునకు సిద్ధపడునంతలో జనక రాజనందన తానును అరణ్యములకు వత్తునని పలికినది. అప్పుడు శ్రీరామ చంద్రుడామెను వారించుచు ఇట్లనియె:

సీ. చంద్ర శాలలయందు జలువ వెన్నెలకాదు
చండమార్తాండ ప్రచండ రశ్మి
పసిడియుయ్యేలమీద పండియూగుట కాదు
కాంతార కంటకకఠిన భూమి
శుకశారికాకేకిపిక కూజితముగాదు
కంఠీరవంబులగర్జితములు
మృదు విపంచికమీద మీటు గానము కాదు
క్రూర రాక్షసుల సంక్షుభితరవము
గీ. భీకరంబైన వన భూమి బృథ్వితనయ
కుసుమ సుకుమారి వేలగగ్గోలు పడగ
బురమునందుండు సుఖముగ బుణ్యచరిత
యత్తమామల గొల్చుచు జిత్తమలర.[1]

ముందు అపహ్నవమును చెప్పి, తరువాత ఆరోపమును చెప్పుట, ఈ పద్యములోని అలంకార ప్రత్యేకత. అందువలన దీనిని అపహ్నవారోపాలంకారముతో కూడిన పద్యమని గ్రహింపవచ్చును. పోతన భాగవతమున నరకాసురవధయందు

1. సరస్వతీ రామాయణము - అయోధ్యకాండ - పద్యం 18.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సత్యభామ తానుకూడ రణరంగమునకు వత్తునని పలికినపుడు కృష్ణుడు ఇట్లు వారించెను:-

సీ. సమద పుష్పంధయ ఝుంకారములు గావు
భీషణ కుంభీంద్ర బృంహితములు
వాయునిర్గత పద్మవన రేణువులుగావు
తురగరింఖాముఖోద్ధూతరజము
లాకీర్ణ జలతరంగాసారములు గావు
శత్రుధనుర్ముక్త సాయకములు
కలహంస సారస కాసారములు గావు
దనుజేంద్ర సైన్య కదంబకములు
తే. కమల కల్హార కుసుమ సంఘములు కావు
చటులరిపు శాల ఖడ్గాది సాధనములు
కన్య నీవేడ రణరంగ గమనమేడ
వత్తు వేగమ నిలువుము వలదు వలదు.[1]

పోతన్నగారి 'నల్లనివాడు పద్మనయనంబులవాడు' అను పద్యమును తరువాతి కవులెందరో అనుకరించిరి. కవయిత్రి సరస్వతీ దేవికూడ రాముని వర్ణించునపుడు 'నల్లని మేనివాడు' అను శబ్దప్రయోగముతోనే పద్యమును ప్రారంభించినది.

ఉ. నల్లని మేనివాడు చిరునవ్వులు చిల్కెడు మోముతోడ శో
భిల్లెడు వాడు, చక్కనగు పీవర వక్షమువాడు, సోగలౌ
ఫుల్ల సరోజపత్రముల బోలుకనుంగవ వాడు లోకమున్
జల్లగ నేలువాడు కరుణాఖని శ్రీ రఘురాముడమ్మరో.[2]

---

1. పోతన భాగవతము - దశమ స్కంధము - పద్యం 153.
2. సరస్వతీ రామాయణము - సుందరకాండము - పద్యం 88.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోతన భాగవతమునందు :

మన్నుదినిన బాలకృష్ణునినోట అఖిల భువన భాండములను గాంచిన యశోద విస్మయమంది ఇట్లు పలికినది:

మ. కలయో, వైష్ణవమాయయో, యితర సంకల్పార్థమో, సత్యమో
తలపన్నేరక యున్నదాననొ యశోదా దేవి గానోపర
స్థలమో బాలకుడెంత యీతని ముఖ స్థంబై యజాండంబు ప్ర
జ్వలమై యుండుటకేమి హేతువొ మహాశ్చర్యంబు చింతింపగన్.[1]

సరస్వతి రామాయణమున :

అశోకవనమునందు శాఖాస్థితుడైన, అంజనతనయుని గాంచి జనకాత్మజ అనుమానముతో స్వప్నమేమోయని తలచి ఇట్లు పలికినది:

మ. కలయో, రాక్షస మాయయో, వివిధ సంకల్పార్థ సంభ్రాంతియో
తలపన్ సత్యములౌనొ, నాదు తపముల్ దైవారు చిహ్నంబులో
కలలో గీశముగాంచు టొప్పదుగదా కానున్న కార్యంబులె
ట్టులగానున్నవొ? రామ సోదరులకుండున్ గాక సద్భద్రముల్.[2]

రామాయణమును రచించి కీర్తినొందిన మహిళలలో ఆతుకూరి మొల్ల ప్రథమగణ్యురాలు ఆకవయిత్రి కవితా ఛాయలు కలిగిన పద్యములు కొన్ని మనము సరస్వతి రామాయణమున గమనింపవచ్చును.

బాలకాండమున దశరథుని వర్ణించునపుడు సరస్వతీ దేవి రచించిన పద్యము మనోహరముగా నున్నది.

---

1. పోతన భాగవతము - దశమ స్కంధము - పద్యం 341.
2. శరస్వతి రామాయణము - సుందరకాండము - పద్యం 79.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. రాజు పరాక్రమోగ్రమృగరాజు ప్రకాశిత దివ్యకాంతిరే
రాజు సురూపరేఖ రతిరాజ సమాన గుణంబునందు రా
రాజు పరోపకార శిబిరాజు మహోన్నత భాగ్యమందు స్వా
రాజు విభూతి సంపదల రాజిలుచుండును నీతిమంతుడై.[1]

రామాయణమునందు బాలకాండమున పురవర్ణన మొనర్చునప్పుడు, అందు రాజులను గూర్చి కవయిత్రి మొల్ల రచించిన పద్యమిట్టిదే గలదు.

ఉ. రాజులు కాంతియందు రతి రాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు, మృగరాజులు విక్రమ కేళి యందుగో
రాజులు భోగమందు దినరాజులు సంతత తేజమందు రా
రాజులు మానమందు నగరమ్మున రాజకుమారులందరున్.[2]

పై పద్యమువంటి శైలితో నడచిన పద్యములు సరస్వతీ రామాయణమున అందందు కలవు. శ్రుతి రంజకమగు ఈ పద్యములు చూడదగియున్నవి. అట్టి పద్యమే మరి యొకటి -

ఉ. మారులు రూపమందు, సుకుమారులు దేహమునందు, హస్తి సం
హారులు శౌర్యమందు, వ్యవహారులు రాజునీతియందు గం
భీరులు భావమందు, సురవీరులు భోగమునందు, నర్థి మం
దారులు దానమందు నిరతమ్మును నప్పురిరాజ నందనుల్.[3]

ఇట్లే -

ప్రాచీన కవీంద్రుల రచనల పోలికలు అచ్చటచ్చట కలిగి, ధారాశుద్ధితో సాగినది 'సరస్వతీ రామాయణము'.

సకల గుణాభి రాముడైన శ్రీరాముని చరితమును ఎందరో కవులు రచించినను, ఏడు కాండముల నెవ్వరును రచింపలేదు. కవయిత్రి ఉత్తరకాండతో కలిపి, ఏడు కాండములను రచించి తన కావ్యమున కొక ప్రత్యేకతను గూర్చుకొన్నది.

---

1. సరస్వతీ రామాయణము - బాలకాండ - పద్యం 47.
2. మొల్ల రామాయణము - బాలకాండము.
3. సరస్వతీ రామాయణము బాలకాండ - 33 పద్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉత్తరకాండ

రామాయణము ఉత్తర కాండను రచించిన వారిలో ముఖ్యులు తిక్కన సోమయాజి, కంకంటి పాపరాజు గారు.

నిర్వచనోత్తర రామాయణము :

తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణమును రచించి, తనను 'మామా' అని సంబోధించిన మనుమసిద్ధి మహా రాజునకు తన కృతికన్యక నిచ్చి నాడు. ఈ రామాయణమునందు పది ఆశ్వాసములు కలవు. ప్రథమాశ్వాసము నుండి, సప్తమాశ్వాసము వరకు, రామాయణపూర్వగాథ, రావణుని పూర్వగాథ, రావణుని వంశవర్ణనము మున్నగు వానితో కావ్యరచన సాగినది. అష్టమాశ్వాస ములో 'శ్రీరాముని వినోదవిహారము' అను ఘట్టమునుండి సీతారాముల ప్రణయ లీలలు, జలవిహార వర్ణనము, సీతాదేవి గర్భధారణ మున్నగు విషయములతో, సీతాపరిత్యాగకథ ప్రారంభమైనది. దశమాశ్వాసమునందు, అంతమున సీత తన నిజ పాతివ్రత్యమహిమచే భూదేవిని పిలుచుటతో, భూదేవి తన లోపలికి కొనిపో యిన పిమ్మట శ్రీరాముడు కుమారులగు లవకుశలను వెంటనిడుకొని వారికి రాజో చితవిద్యలను నేర్పి, సుఖముగా నున్నట్లు తిక్కన రచించినాడు. అనగా కావ్యాం తము రాముడు పుత్రులతో సుఖముగా నున్నట్లు సుఖాంతమొనరించినాడు. కాని రామ నిర్యాణము మొదలగునవి వ్రాయలేదు.

ఉత్తర రామాయణము :

కంకంటి పాపరాజుగారు రచించిన రామాయణము కూడ ప్రసిద్ధిగాంచినది. శృంగార, కరుణ రస భరితమగు ఈ కావ్యమును కంకంటి పాపరాజుగారు పూర్తిగా ప్రబంధరీతిలో రచించినారు. ప్రథమాశ్వాసమంతయు పుర వర్ణన, పరిఖావర్ణన, సౌధవర్ణన, బ్రాహ్మణ వర్ణన, గజ, అశ్వ, రథ్వ, భట, వేశ్యా, పుష్పలావికా వర్ణనలు, ఇంకనెన్నియో వర్ణనములతో ప్రబంధోచిత రీతిని సాగినది. ఈ కావ్యమున ఎనిమిది ఆశ్వాసములు కలవు. పంచమాశ్వాసము వరకు ఉత్తర కాండము వివిధ కథాప్రసంగములతో నడిచినది. షష్ఠాశ్వాసమునుండి వసంతకాల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వర్ణనముతో ప్రారంభమై, సీతారాముల విహార లీలలు, సీతాదేవి గర్భమును దాల్చుట, సీతాపరిత్యాగము మొదలగు సంఘటనలతో కూర్పబడి అష్టమాశ్వాసము వరకు సాగినది. అష్టమాశ్వాసాంతమునందు శ్రీరాముడు వైకుంఠ ధామమును వేంచేయుట, పఠన శ్రవణాది ఫలముతో కావ్యము ముగిసినది. కంకంటి పాపరాజు ఈ కృతిని కృష్ణభగవానునకంకితమొనరించి ధన్యుడయ్యెను.

సరస్వతీ దేవి రామాయణము - ఉత్తర కాండ :

సరస్వతీ దేవి రామాయణమున పూర్వభాగము ఆరుకాండములను రచించి, వానితో పాటే ఉత్తరకాండ రచన యొనరించినది కనుక, కథాగమనము పూర్వ కథానుకూలముగానే సాగిపోయినది. శ్రీ రాముడు పట్టాభిషిక్తుడైనంతవరకు ఆరు కాండములు సాగినవి. తరువాత ఉత్తరకాండము వసంతఋతు ప్రవేశముతో ప్రారంభింప బడినది. ఉత్తరకాండములోని రచన ప్రబంధరీతిలో శృంగార రస భరితమై, వర్ణనాధిక్యతతో, అలంకారశోభితమై అలరారినది. తిక్కన 'నిర్వచనోత్తర రామాయణము'నందును, పాపరాజు రామాయణమునందును సీతారాముల ప్రణయ విహార లీలలు దీర్ఘముగా వర్ణింపబడినవి. ఈ కవయిత్రి రామాయణమునందును శృంగార వర్ణన దీర్ఘముగనే సాగినది.

ఇందు వసంతాగమ వర్ణన మనోరంజకములగు పద్యములతో కూడియున్నది.

సీ. మధుమాసమేతెంచె మరుని పౌరుషమెచ్చె
బిక కూజితంబులు పిక్కటిల్లె
క్రొవ్విరి చివురుల గ్రొందేని యలద్రావి
ఝంకారములు సేసె షట్పదములు
నవచూతఫలములు చవిచూచి కీరముల్
శ్రుతిమనోహరముగా రుతమొనర్చె
మలయానిలంబుచే మదనాగ్ని పెంపేచు
విరహార్తిలోకంబు వెచ్చనూర్పె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. విటవిటీ జనమనములు విరివిగాంచె
సుత్తరాయణముఖుడయ్యె నుష్ణరశ్మి
మోదుగులు పూచె వనలక్ష్మి ముసుగుదీసె
మాధ వాగమ వేళ శ్రీమంతమయ్యె.[1]

వసంతుడు కొలువు కూటమునందు పట్టభద్రుడైన విధమును కవయిత్రి కమనీయ మైన వర్ణనమొనరించినది.

సీ. గుజ్జుమామిడి పొన్న కొలువు కూటముగాగ
గుందకోరకములు గొడుగుగాగ
జాంపేయమాధవుల్ చామరంబులుగాగ
భ్రమర పంక్తులు తోరణములు గాగ
మంజుల వకుళముల్ భద్ర పీఠముగాగ
జిల్కపల్కులు ద్విజాశీస్సుగాగ
బరభృతరవములు పటహ ఢక్కలుగాగ
బుప్పొడి గంధపుంబొడులు గాగ

గీ. సకలసుమములు లాజలక్షతలు గాగ
వికసితపలాశముల్ నివాళికలు గాగ
జిగురుటాకులు భాగ్యపు సిరులుగాగ
మాధవుడు పట్టభద్రుడై మహినివెలసె.[2]

వసంత ఋతువు రాగానే శ్రీరాముడు హర్షముతో సీతతోకూడి వన విహారమునకు వెడలినాడు. ఉద్యాన వనమునందు సీతారాముల శృంగార లీలలు మనములరించునట్లున్నవి. ఇందు సీతాదేవిని కేవలము ముగ్ధవలె, వర్ణించినది కవయిత్రి. సీతాదేవి శృంగారమును, అందచందములను గాంచి మరుని మాయల

1. సరస్వతీ రామాయణము.
2. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండము - పద్యం 5.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జిక్కన శ్రీరాముడు వసంత శోభలతో అలరారిన వనరాజమును చూడలేదు. సీతాదేవి లావణ్యమునే గమనించుచు ఆమెతో మృదూక్తులనిట్లు పలికెను :

సీ. దాడి మీతరువుల దండజేరగ జిల్క
గమివాడి ముక్కుల గరచునేమొ
నెలమావి నీడలో నిలువకోయిలగుంపు
కిసలయభ్రాంతిచే మెసపు నేమొ
పొన్నగున్నల చెంతబోయినవ్విన జకో
రంబులబ్బురముగా బ్రబలునేమొ
కమలాకరంబుల గరిడి చరించిన
బంభరంబులుగాసి పలుచునేమొ

గీ. మేలు పరికించ సంపెంగ పూలపొదను
జాజి విరిపాన్పుజేరుట సమయమునకు
దగిన కార్యంబు వేరుగా వలద
టంచు బొదరిల్లుజూపు నాయతివకపుడు.[1]

భ్రాంత్యలంకారముతో నొప్పుచున్న పై పద్యము శృంగార రసభరితమై శ్రీరాముని మధుర భాషణములను తెలుపుచున్నది.

వనలక్ష్మి శోభల నింపుతో నింపుకొనిన, ఆ వన మధ్యమున ఒక సరస్సును గాంచి శ్రీరాముడు జలక్రీడ నాడుటకు ఉత్సహించెను. చక్కని లయబద్ధమై, అనుప్రాసాలంకార సహితమైన పదగుంభనతోకూడిన సరోవర వర్ణనము హృద్యముగా గలదు.

సీ. నవజాత వనజాతనవసీధురసపీత
మధుకరకుల జాత మధురగీత
మిందీవరోత్పల బృందావలంబిత
కోకకోలాహలా కులితకూల

1. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండము - పద్యం 17.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాలోలబిస రుహ నాళాదనామత్త
కలహంస, కలవర కలితలలిత
మనుసరస్మంద వాతానీత సుమరజ
స్సైకత విహరద్బలాకపాక

గీ. మవిరళోల్లల దంబుజ కువలయవన
మధ్యసా నటత్కర్కట మత్స్య భేక
నిచయసంచార చంచల నిబిడభంగ
సంభ్రమారావ శోభితత్సరముగాంచి.[1]

సరోవరమునందు స్త్రీలందరు జలక్రీడలాడినపుడు వారి శరీరములందున్న అంగరాగములు కరిగి నీరు త్రివేణివలె కానుపించిన విధమున వర్ణించినదికవయిత్రి.

ఉ. పాటలగంధు లక్కరణి బద్మసరోవరమందు మున్గగా
గాటుకతోడ గస్తురియు గాంచన గంధుల మేనిపూతయున్
నీటగరంగి యొప్పె సురనిమ్నగతో యమునాసరస్వతుల్
కూటమి యౌ త్రివేణిగతి గుంకుమ శారద నీలశోభతోన్.[2]

కాంచనగంధుల మేనిపూత నీటకరగుటతో సరస్సునందలి జలము కుంకుమ, శారద. నీలశోభతో త్రివేణివలె అలరినదని, తద్గుణాలంకారమును కూర్చి రచించినది కవయిత్రి.

సీతాదేవి సౌందర్యమును గాంచిన శ్రీరామచంద్రుడు ప్రణయోక్తులతో మురిపించెను. భేదాభేద అతిశయోక్త్యలంకార సహితమగు ఈ క్రింది పద్యము ముదావహముగా నున్నది.

చ. గగన తలంబునం కొలను గాంచితి నీలపు మెట్లు దాని కిం
పగు నటుపైన గొప్పిన్నవకమందిన తామర తీవె దానిపై
సొగసగు రెండు జక్కవలు సొక్కుచునున్న విదాని జేరగా
నగపడుచంద్రబింబమరుదా? యమృతమ్మట భాగ్యశాలికిన్.[3]

---

1. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండము - పద్యం 25.
2. సరస్వతీ రామాయణము- ఉత్తరకాండము- పద్యం 32.
3. సరస్వతీ రామాయణము- ఉత్తరకాండము- పద్యం 13.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మధ్యభాగమందలి నాభి, వళులలోనున్న నూగారు, స్తనములు, ముఖమున అధరామృతము అను ప్రకృత వస్తువులు చెప్పబడక వానితో సంబధించిన అప్రకృతములు మాత్రమే, చెప్పబడినవి. ఇట్టి భేదాభేద అతిశయోక్తినే కువలయానందకారుడు - రూపకాతిశయోక్తి అనెను.

పై పద్యమును పోలిన పద్యమే కావ్యాలంకారసంగ్రహమున కలదు.

చ. విలసిలు బావి యొండు వినువీధిని, నాపయిబైడి మెట్లలో
మలచిన యింద్రసీల మయ మార్గముగ్రాలు దదగ్రమందు వ
 త్రిలును గిరిద్వయంబది సుకృజ్జనగమ్యము, చందనాంక, మా
స్థలమున కేగ లభ్యమమృతంబు సుధానిధి యుంటజెంగటన్.[1]

కావ్యమున సీతారాముల శృంగార కేళిని దీర్ఘముగా యేబది పద్యముల వర్ణించుట చూడగా, ముందు ముందు వారికి గలుగు వియోగమును తెల్పుటకే అని నట్లున్నది.

సీతాదేవి గర్భము దాల్చిన విధమును చతురవాక్కులతో వక్రోక్తిలో రామునిచే చెప్పించినది కవయిత్రి.

సీ. నల్లకల్వలబోలు నాతినీకనుగవ
వెలి దమ్మిరేకులై వింతగొల్పె
పిడికిట నడగు నీనడుము తొయ్యలిమిన్న
హెచ్చె నానాటికి హేతువెద్ది
పసిడి చెక్కుల కాంతిపాండు రంబై తోచె
నిద్రపైనాసలు నిండుకొనియె
గనకాద్రిపై నిల్చుఘన మేఘముల భాతి
జూచు కంబుల కొక శోభవచ్చె.

---

1. కావ్యాలంకార సంగ్రహము - పంచమాశ్వాసము - భేదాభేదాతిశయోక్తి అలంకారము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. దేటచూపులెనీజాడ దెల్పుచుండె
గోర్కెలెవి యన్నసిగ్గులో గొనక నాకు
నెరుగ బల్కవె నీయాసలేను దీర్తు
దారకాధిపవదన సౌందర్యసదన.[1]

సీతాగర్భధారణ వరకు శృంగార వర్ణనలతో సాగిన ఈ కావ్యము రాముడు భద్రునిచేత వినిన వార్తచే సీతాపరిత్యాగ మొనరింప దలచినప్పటి నుండియు కరుణరస భరితముగా సాగినది. ప్రతి పద్యమును హృదయమున ఆవేదన కల్గించి, కన్నుల నీరు కురిపించునట్లు రచింపబడినది. అరణ్యమునకు గొనిపోయిన లక్ష్మణుడు వదినగారి పాదముల పైబడి, ఎలుగెత్తి ఏడ్చినపుడు సీతాదేవి ఇట్లు ప్రశ్నించినది: "నాయనా లక్ష్మణా, ఎందులకు కంటినీరు కురిపించుచుంటివి? పగవారికి వెన్నిచ్చినావా? సజ్జనులను తెగనాడితివా? భగవంతుని మరచి, పసులను, ద్విజులను, మగువలను మదియించినావా ? పరనిందకొడిగట్టితివా? మరియాద మీరి తప్పినావా?"[2] అని అమాయకముగా ఆమె ప్రశ్నించిన తీరు మనసు జుమ్మలు వారునట్లు చేయును.

సీతాదేవి తన కష్టమును తెలిసికొనలేక మరిదియైన లక్ష్మణుని ప్రశ్నించిన విధానము పాపరాజుగారి ఉత్తర రామాయణమునందును కలదు. దుఃఖించుచున్న లక్ష్మణుని పరిపరి విధముల ప్రశ్నించిన జనకాత్మజ మనోవ్యథను, లక్ష్మణుని యందలి అనురాగమును కవి చక్కగా వర్ణించినాడు. కాని తిక్కనగారి సీత మాత్రము మరిదిని దుఃఖించుటకు కారణమేమని ప్రశ్నించినట్లు సంక్షిప్తముగనే వర్ణింపబడినది.

శ్రీరాముని యాజ్ఞను లక్ష్మణుని నోట వినిన సీతాదేవి రామారామాయని ధరణిపై మూర్ఛిల్లినది. మూర్ఛతేరిన పిదప ఆమె విలపించిన తీరు దుస్సహము. భీకర కాననసీమకంపిన రామభద్రుని తలచుకొని దుఃఖించి ఇట్లనినది:

1. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండము - పద్యం 54.
2. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండము - పద్యం 74 నుండి 78 వరకు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. వాక్కెటులాడెనో మనసు వజ్రమయంబయి పోయెనోకటా
మక్కువమాయమయ్యెనొ కుమర స్వసౌఖ్యము గోరియైనన
న్నక్కడ నిల్పద య్యెగద హా, యిక నేటికి మేన ప్రాణముల్
వ్రక్కలు గాదె నాదుమది వజ్రమొ నేటి కఠోర వార్తకున్.[1]

సీత రామునెడబాసి దుఃఖించిన విధమును కవయిత్రి పరిపరి విధములుగా వర్ణించినది. భర్త పరిత్యజించినపుడు భార్య మనసెంత వేదనచెందునో ప్రతి పద్యమునందును హృదయమునకు హత్తుకొనునట్లు వర్ణింపబడినది.

ఉ. స్వామిని వీడి దేహమున ప్రాణము నిల్వదుయీ భవంబులో
రాముని జూచుకాలమిక రాదు కృపారహితాత్మ నౌచునే
నేమిధునంబులం గలచి యెగ్గొనరించితి నోగదా యిటుల్
తామసమేల నీవు చని తప్పక చెప్పుమనాదు మాటగాన్.[2]

లక్ష్మణుడు వదలి వెడలిన పిదప 'కోటి బలగంబులుండియు మాకైన దోడు లేదాయ నక్కటా'యని దురపిల్లినది గర్భవతియైన సీతాదేవి. వాల్మీకి ముని వచ్చి గొనిపోయిన పిదప, అతని ఆశ్రమమునందు పుత్రులిరువురిని కన్నది. కుశ లవు లిద్దరికీ వల్మీకభవుడు మేటి విద్యల గరపినాడు. శ్రీరాముడొనరించిన యాగ మును చూచుటకు వాల్మీకిముని కుశ,లవుల సహితముగా వచ్చెను. గురువు నాజ్ఞతో రామచంద్రుని దివ్యచరితమును పాడిరి. వారి చరిత్రను తెలుసుకొనిన రాఘవుడు వసుధాతనయను పిలువనంపెను. రూపమెత్తిన శోకదేవత వలెనున్న సీతాదేవిని కవయిత్రి ఇట్లు వర్ణించినది :

చ. పదములొకింత తొట్రు వడబైబయిబొంగు విషాద వేదనన్
బెదవిస్ఫురింప నంగములు స్వేదజలార్ద్రములై వడంకగా

---

1. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండ పద్యం 86.
2. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండ పద్యం 89.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సదసునమోము వంచుకొని జానకి శోకము రూపమెత్తెనా
వదనము నెత్తలేకకడు వాడి వగన్ బడి నిల్చెనయ్యెడన్.[1]

మనసునందు కలిగిన వేదనను స్ఫురింపజేయుచు, శరీరమందు కలిగిన సాత్విక భావ వర్ణన సముచితముగా చేయబడినది.

విమల చరిత్రయైన సీతను గొనుమని వాల్మీకి పలికినపుడు రాముడు సత్యము దెలియ శపథమును, ఇందరలో జనకజ సేయుట మేలని యనుటతో సీతాదేవి కంపించిపోయినది. ఆతని చరణారవిందములను హృదయమున నిల్పి తల్లిని ప్రార్థించినది.

ఉ. శ్రీకర రామ పాద సరసీ జములన్ భజియింతునేని య
స్తోక పతి వ్రతాగుణముతో నలరారుచునుందునేని యున్
లోకులు నాడు సత్యముగనుంగొన నావెతదీ రుసట్లుగా
జేకొనుమమ్మ నీజఠర సీమజొరన్ జననీ! ధరావతీ!.[2]

అని సీతాదేవి ప్రార్థింపగనే బ్రహ్మాండంబు కంపింపగా, మేదిని భేదిల్లినది. ఆ మహా బిలమునుండి ఒక్క సింహాసనముతో గూడ వచ్చినది భూదేవి. కరములు సాచి బిడ్డను గ్రుచ్చి, కౌగిలించి, శిరము మూర్కొని -

గీ. కురులు సవరించి చక్కగా విరులు దురిమి
భూషణాదులుగై సేసి పొందుగాను
బీఠమెక్కించి కొంపోయె బేర్మిదనర
సీత పాతాళమునకు భూమాతయపుడు.[3]

---

1. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండము - పద్యం 120.
2. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండ - పద్యం 125.
3. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండ - పద్యం 129.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ విధముగా కవయిత్రి, సీతాదేవి తనతల్లియైన భూదేవిని చేరుటను వర్ణించినది. సీతాదేవి అదృశ్యమైన పిదప శ్రీరామచంద్రుడు దీనదృష్టితో రెక్కలు తెగిన పక్షివలె పలవరించెను.

శా. దేవీ నాయెడ రోషమూనినను జింతింపన్ జుమీ పుత్రులన్
ఖావోత్పన్న సమానమూర్తులను నీ బంగారపున్ బొమ్మలన్
హేవా కాబ్ధుల డించి పోవుటకు నీకెట్లాడెనో పాదముల్
నీ వాత్సల్యము నీ కృపారసమెటుల్ నిష్కాసితంబయ్యెనో.[1]

సీతావియోగ దుఃఖమున శ్రీరాముడు తలచి, తలచి, కుమిలి విలపించిన తీరు ఎంతయు కరుణ రసప్లావితమై యున్నది.

విలపించి, విలపించి, తుదకు రాముడు, సోదరులతోపాటు సరయూతటమును చేరి అవతారమును చాలించిన విధమును కూడ కవయిత్రి అద్భుతకల్పనతో రచించినది. అంతమున శ్రీరాముడు వైకుంఠపురమున కేగి విష్ణు రూపమును పొంది, అచట లక్ష్మీదేవిని సమాశ్వాసించి, ఆదరించినట్లు రచింపబడినది.

శ్రీరాముడు వైకుంఠపురమునకేగి నిలచినట్లు పాపరాజుగారి ఉత్తర రామాయణమున కలదు. తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణమునందు శ్రీరాముడు కుమారులతోపాటు రాజ్యపాలనచేయుచున్నట్లు వ్రాయబడినది. కవయిత్రి పాపరాజుగారి విధముగనే శ్రీరాముడు వైకుంఠవాస మొనరించినట్లు రచించినది.

ఉత్తరకాండమునందు మొదటి యేబది పద్యములలో శృంగారముసాగినను, మిగిలిన దంతయు కరుణరస భరితమై సీతావిలాపము, శ్రీరాముని ఆవేదనతోనే నడిచినది. సహృదయ రంజకమగు ఈ రామాయణం ఏడు కాండలయందు మొత్తము 900 పైన పద్యములు గలవు. ఈ కావ్యాంతమున కవయిత్రి భరత వాక్యము నిట్లు తెలిపినది:

---

1. సరస్వతీ రామాయణము - ఉత్తరకాండ - పద్యం 133.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భరత వాక్యము :

సీ. కొడుకులు వినయ సద్గుణరాసులై గౌర
వించి తండ్రులను సేవింత్రుగాక
పతి దైవ మనుచు శాశ్వత భక్తి బెంచుచు
గులసతుల్ భర్తల గొల్తురిగాక
ప్రజల నిజప్రజా వర్గంబువలె గూర్మి
పొదలగాన్నృపతులేలుదురు గాక
అన్య రక్షార్థ మాత్మార్పణం బొన రించు
యోగ్యులార్తుల గాచుచుంద్రుగాక

గీ ఆవని బహుసస్యశాలిని యగునుగాక
ఆయురారోగ్య భోగభాగ్యములు దనరు
ప్రజలతో నిండి యీ పుణ్య భరత భూమి
మల్లెపూదోట కరణి రంజిల్లుగాక.

కావ్య పఠనమువలన కలుగు ఫలశ్రుతిని కూడ చెప్పినది కవయిత్రి సరస్వతీ దేవి.

ఫలశ్రుతి :

శా. ఈ రామాయణమున్ బఠించుటనుస
త్కృత్యంబు లెన్నేనియున్
ధారాళంబుగ జేసినట్టి ఫలముల్
తథ్యంబుగా నబ్బు, వి
స్తారామోద సుఖంబులున్ గలుగు స
త్సంతానమున్ గల్గు శో
భారమ్యంబుగ వంశవృద్ధి యొసగున్
భక్తాళికెల్లప్పుడున్.

సకలజన శుభావహమైన సరస్వతీ రామాయణమును రచించి, సరస్వతీదేవి చిర యశస్సును పొందినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ సరస్వతీ శతకము

-చేబ్రోలు సరస్వతీదేవి

ఆంధ్ర సాహిత్యమున శతకములకు ప్రత్యేక స్థానమున్నది. ఆంధ్రములో శతకములు అనేకము కలవు. శతకములెక్కువభాగము భగవన్నుతి ప్రధానములై యుండును. ప్రాచీనులైన కవులు కొందరు గవితా సృజనాభ్యాసముకొరకును, భగవదనుగ్రహప్రాప్తికొరకు శతకములు వ్రాయుచుండిరి. కొందరు కవులు తమ వృద్ధాప్యమునందు భగవంతునికి ఆత్మనివేదన మొనరించుకొనుచు శతక రచనమొనరించినారు. శతకములోని పద్యములకు చివర సమానమైన మకుటము కనుపించును. కావ్యములకు వలె శతకములందలి పద్యములన్నింటికిని సంబంధము సమకూర్చు కథాసూత్రము ఉండదు. అందలి పద్యములు వేనికవే స్వతంత్రములుగా నుండును. అందుచే వీనిని ముక్తక కావ్యములనియు అనవచ్చును. శతకములలో రకరకముల శతకములు కలవు. నీతి శతకములు, భక్తి శతకములు, వ్యాజస్తుతి శతకములు, వేదాంత శతకములు అని నాలుగు విధములుగా శతక విభజన చేయబడినది. పెద తిరుమలాచార్యుని వేంకటేశ్వర శతకము, నీతి పద్యములతో కూడిన బద్దెన నీతి శతకము, సుమతి, భాస్కర శతకములు, నరసింహ శతకము, దాశరథి శతకము, కాళహస్తీశ్వర శతకము, ఆంధ్ర నాయక శతకము మున్నగు ఎన్నియో శతకములు సాహిత్యలోకమున చిర స్థాయిగా నున్నవి.

గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులలో కూడ శతకరచన మొనరించినవారు కలరు. కొన్ని శతకములు మహిళలకు నీతిబోధకములైనవి. మరికొన్ని భక్తిరసపూరిత శతకములు కలవు. కావ్యములలో వారి రచనా శైలి ఎంత ధారాళముగా సాగినదో అట్లే శతకములలోకూడ అనర్గళముగానే సాగినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రస్తుతము కవి కలహంసి చేబ్రోలు సరస్వతీ దేవిగారి 'సరస్వతీ శతకము'ను పరిశీలించుదము:

సరస్వతీ శతకము :

సరస్వతీ దేవిగారి సరస్వతీ శతకము భాషా మహాదేవికి చిన్న భూషణము వలె సమర్పింప బడినది. ఈ పుస్తకము చిన్నదే అయినను, భక్తి ప్రధానమై కవయిత్రి ప్రతిభా సంపన్నతకు బాహ్యాణము వలె నున్నది. 'శ్రీ సరస్వతీ' మకుటముతో రచింపబడిన ఈ శతకమునందు సరిగా నూరుపద్యములు మాత్రమే కలవు.

ప్రార్థనా పద్యమునందు కవయిత్రి ముచ్చటగా మూఁడు కోరికలను కోరి నది. ఆ మూఁడు వరములు మానవునికి లభించినచో, అంతకంటె మించినదేమీ లేదు. ఒకదాని కొకటి సంబంధించి యున్న ఆ మూఁడు వరములను దేవి పాద యుగ్మములను కొలచి వేడినది సరస్వతీ దేవిగారు.

ఉ. శ్రీదయివార భాగ్యమును, చెల్వగువిద్యయు నిత్యశాంతియున్
భేదమొకింతలేక సితనీ రజవాసిని భక్తకోటికిన్
మోదముతోదనియ్యగల మూర్తివి నీవని యెంచి యాత్మలో
పాదసరోజ యుగ్మముల పైబడి వేడెద శ్రీ సరస్వతీ.[1]

కవయిత్రికి తాను నమ్మిన, దేవి మూఁడు రూపములందును కన్పించును. ఒక్కొక్కతరి ఒక్కొక్కరీతిలో కన్పడు శారదాంబ నిట్లు తలచినది :

చ. ఒకపరి పద్మసంభవుని యుత్తమ పత్నిగదోచు చుందు వీ
వొక పరి విష్ణువక్షమున నున్నతి జూపెడు నాది లక్ష్మివై
యొకపరి రుద్రురాణివయి యుండుదు వెన్నగనీదు తత్వమున్
సకలసురేశ్వరుల్ తెలియజాలరు నిక్కము శ్రీ సరస్వతీ.[2]

---

1. సరస్వతీ శతకము - పద్యం 1.
2. సరస్వతీ శతకము - పద్యం 15.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్ష్మి, పార్వతి, సరస్వతి రూపమున నిలిచిన ఆ దేవిని తాను మనసు నందు నిలిపి ధ్యానించును గాని లోకమునకు చూపించెడి బాహ్యాడంబరములతో వ్రతములు, ఉపవాసములు చేయలేనని కవయిత్రి సరస్వతికి నివేదించినది.

చ. వ్రతములు సేయలేను నుపవాసములైనను సల్పలేను నా
దృతి జపమైననున్ సరిగ దీరికగాంచి తదేకనిష్ఠతో
మతి నిలబెట్టి చేసెడు క్రమంబెరుగన్ నినుమాత్రమెంతయున్
పతితముగాని చిత్తమున భక్తిగ గొల్చెద శ్రీ సరస్వతీ.[1]

విద్య మానవునిలోని అజ్ఞానాంధకారమును తొలగించుచు. మనసుకు వికాసమును, విజ్ఞాన వికాసముతో కూడి ముఖమునకు కాంతిని, ప్రకాశత్వమును కలిగించును. విద్యనేర్చిన వాని మనసు మలినమై యుండకూడదు. అందుకేనేమో కవులు ఎల్లప్పుడు సరస్వతీ దేవిని అన్నీ తెల్లని వస్తువులతోనే అలంకరించెదరు. తెల్లనిచీర, తెల్లని పూలహారములు ఆమె కూర్చొను పీఠము తెల్లనిది. ఆమె కనులు కూడ ధవళాయతలోచనములే. అంతయు శ్వేతభరితమైన ఆ దేవి నిలిచినచోట చీకటికి తావే లేదు. అజ్ఞాన తిమిరము అంతమైపోవును.

ఉ. తెల్లని చీరగట్టికడు తేజముతుంపెసలాడు పీఠమం
దుల్లము పల్లవింప స్వరయోగ మనోహర వీణమీటుచున్
ఫుల్ల సరోజ నేత్రములు పూర్ణ కృపారసమున్ వెలార్చునో
పల్లవపాణి కొల్చెద భవత్పద యుగ్మము శ్రీ సరస్వతీ.[2]

తన జీవితమునందు కాలమంతా వృధాగా గడిచిపోయినదని కవయిత్రి చింతిల్లుచున్నది. కాలము గోడపై నీడవంటిది. మనకొరకు వేచియుండదు. మొదట వృధా చేసి పిమ్మట చింతించిన లాభముండదు అను పలుకులు జీవిత సత్యమును తెలుపుచున్నవి.

1. సరస్వతీ శతకము - పద్యం 17.
2. సరస్వతీశతకము - పద్యం 22.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చ. భవము తలంచి చూచుతరి పాపపుకర్మలు పెక్కు లైపున
ర్నవసతమై తమో గుణగణంబుల కాస్పదమై సుపుణ్యముల్
లవమును జేయలేక ఫలలాభము లొందక కాలమెల్లనో
కువలయలోచనా చెడియె కోర్కెల గూర్చుము శ్రీ సరస్వతీ.[1]

భగవంతుని కొలిచెడి భక్తులందరూ, ముసలితనమున వచ్చెడి కఫ, వాతరోగ ములతో నిన్ను మనస్సారా స్మరింతునో లేదో, ఇప్పుడే మనసుతీరా ప్రార్థించు శక్తి నొసంగుమని భగవంతుని ప్రార్థింతురు. కవయిత్రికూడ సరస్వతీదేవినట్లే ప్రార్థించినది.

చ. గళమున శ్లేష్మవాతముల గ్రమ్మశరీరము పోవునప్డు నీ
సలలితనామ రూపములు సంస్మరణంబొనరించు నేర్పునన్
బలమురహింప బోవదు భవచ్చరణాంబురుహంబులిప్పుడే
కొలిచెడి భాగ్యమిచ్చునను గూరిమి నేలుము శ్రీ సరస్వతీ.[2]

అస్థిరమైన దేహమును, శైశవ, బాల్య, స్థవిరాది ప్రాయములు ఆరట పెట్టును. దీనినమ్మియుండలేను, అని కవయిత్రి, శరీరపు అశాశ్వతను తెలియ జేయుచున్నది.

ఉ. అస్థిరమైన దేహమిది యాకలి దప్పుల కోర్వలేక చ
ర్మాస్థులు రక్తమాంసములు నాయతమైనది శైశవంబు బా
ల్యస్థవిరాది ప్రాయముల నారట బెట్టెడు దీనినమ్మి స
త్యస్థితిగానలేను వరదాయి కృపన్గను శ్రీ సరస్వతీ.[3]

మానవునికి ఉన్నవయసులో సగము నిద్రలోనే గడిచిపోవును. కొంత ధనార్జనములో, కొంత విషయాసక్తిలో దొరలిపోవును. ఇక భగవంతుని తలచే దెప్పుడు? అందుకని కవయిత్రి దేవి దయను కోరుచున్నది.

---

1. సరస్వతీశతకము-పద్యం 32.
2. సరస్వతీ శతకము-పద్యం-34.
3. సరస్వతీ శతకము-పద్యం-37

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. ఆయువు కొంచమయ్యెను తదర్థము రాత్రులయందు నిద్రలో
బోయెనహంబు సర్వమును బూని ధనార్జన మందు బుచ్చుచున్
న్యాయపథంబు దప్పి, విషయాబ్ధిని మున్గుచు నింతకాలమున్
వేయి విధంబులన్ జెడితి నీదయగోరితి శ్రీ సరస్వతీ.[1]

కవయిత్రి సరస్వతీదేవి రూపమును మనసునందిట్లు భావనచేసి ప్రార్థించినది.

చ. వికసితమైన ఫాలమున వేడుకమీరగ కమ్మ వజ్రిపుం
తిలకముదిద్ది కన్నులకు తీరుగ కాటుకబెట్టి యందమౌ
వెలగల యాణి ముత్యముల పేరులురంబున చౌకళింపగా
పలుకువెలంది నీ ముఖము భావనజేసెద శ్రీ సరస్వతీ.[2]

చంచలమైన ఈ జీవితనాటకములో నటించుచు, కవయిత్రి అచంచలమైన దేవి నామమునిట్లు తలచినది :

చ. జననమునీటిబుగ్గ ధనసంపదభోగము చంచలాభమౌ
తనువులనిత్యముల్ రుజలు దారొకనిచెందరవందరయ్యెడున్
తనయులు బంధుమిత్రములు తాజనువేళలవెంటరారు పా
వనమగు నీదు నామమునె పాటిగకొల్చెద శ్రీ సరస్వతీ.[3]

కవయిత్రి, సరస్వతీదేవిని అర్థముకోరి ప్రార్థించలేదు. కాలము వ్యర్థము కాకుండునట్లు దేవిప్రార్థనలో గడుపు శక్తిని కల్గింపుమని ప్రార్థించినది.

ఉ. అర్థముగోరికాదు, ధనమన్నను కాంక్ష జనించికాదు నిన్
ప్రార్థన జేయుటల్ వినుమునందున, రాత్రులయందు కాలమున్

---

1. సరస్వతీ శతకము-పద్యం-42.
2. సరస్వతీ శతకము-పద్యం-56.
3. సరస్వతీ శతకము-పద్యం-72

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యర్థముగాక యుండునటులర్థ్య బలమ్మును నాటజేసి లో
స్పర్థ జనింపకుండుటకు సమ్మతిగొల్చెద శ్రీ సరస్వతీ.[1]

జ్ఞాన సముపార్జనకై కవయిత్రి శారదాదేవిని మనసారా గొల్చినది. ఈ క్రింది పద్యము సంస్కృత సమాస భూయిష్ఠమై ధారాశుద్ధితో సాగినది.

ఉ. శారదచంద్రికాధవళ సన్నుతగాత్ర, కురంగనేత్ర, నీ
హారసముజ్వలస్ఫటిక హారకరాంకుశ పాశ వల్లకీ
ధారిణి దీనపోషణి సుధారసభాషిణీ
శారద నీదు పాదముల సన్నుతి చేసెద శ్రీ సరస్వతీ.[2]

కవయిత్రి రచనాపటిమను వెలార్చుచు, సరస్వతీ దేవిని తన కవితా కుసుమములతోనే అర్చించినది. చంపకములు, ఉత్పలములను కవితాపుష్పములను చేర్చి దేవికి భక్తితో సమర్పించినది.

ఉ. భారతిచంపకంబులును, భవ్యములై తగు నుత్పలంబులున్
చేరిచిపూజసేయుటకు సిద్ధముచేసితి శుద్ధభక్తిమై
పారములేని నీకరుణపైవయి జూపి కృతార్థు సేయుమా
నేరుపు చాలదయ్యెనిక నీవశరణ్యము శ్రీ సరస్వతీ.[3]

చంపకమాలను, ఉత్పలమాలను చేర్చి కవయిత్రి రచించినట్టి ఈ సరస్వతీ శతకము భక్తిపూరితమై, శతకశ్రేణిలో శాశ్వతస్థాయినందినది. కవి కలహంసి సరస్వతి దేవిగారు సరస్వతీరామాయణము, సరస్వతీ శతకము మున్నగు రచనలతో కవితాలోకమున శాశ్వతస్థాయి నందినారు. వారి ఇతర రచనలు లభింపలేదు. కవయిత్రి ప్రతిభాసైపుణ్యమును చూపించుటకీ రచనలు రెండు చాలును. కేసరిగారిచే స్వర్ణకంకణగ్రహీతయై మన్ననలందిన ఈ కవయిత్రి ధన్యురాలు.

1. సరస్వతీ శతకము-పద్యం-78.
2. సరస్వతీ శతకము-పద్యం-93.
3. సరస్వతీ శతకము-పద్యం-2

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సరస కవయిత్రి
గంటి కృష్ణవేణమ్మ (1950)

సరస కవయిత్రి శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ గారు స్వర్ణకంకణ ప్రదాన మొనరింపబడిన కవయిత్రులలో ఎన్నదగినవారు. శ్రీమతి కర్రా సుబ్బలక్ష్మమ్మ గారు, శ్రీ రామశర్మగారు కృష్ణవేణమ్మగారి మాతాపితలు. అనంతపురము జిల్లా తాడిమర్రి గ్రామములో 20-12-1910 సంవత్సరము నందు జన్మించినదీ కవయిత్రి. వీరి భర్తపేరు గంటి వెంకట సుబ్బయ్యగారు. కడప జిల్లాలోని ప్రొద్దుటూరు తాలూకా ఎర్రగుంటపల్లె వీరి గ్రామము. ఈమె తాతలు దివాన్‌పేష్కార్లుగను, ప్లీడర్లుగను, ఆస్థానపండితులుగను జీవితము గడిపిరి. ఈమె భర్తగారు వెంకటసుబ్బయ్యగారు ఆంధ్ర భాషాభిమానులు. భర్తయైన వెంకట సుబ్బయ్యగారి ఆదేశముతో పండితులకడ తెలుగు నేర్చి కవిత్వము చెప్పనేర్చినది కృష్ణవేణమ్మగారు. కేవలము తెలుగే కాక కన్నడము, మహారాష్ట్రము, హిందీ భాషలను కూడ ఆయా ప్రదేశములకు ఉద్యోగరీత్యా భర్తతో వెళ్లినపుడు నేర్చినది. బొంబాయిలో భర్తతోపాటు ఉన్నపుడు వార్ధా పీఠమున 'హిందీ భాషా కోవిద' గౌరవపత్రమును కూడ పొందినది. కృష్ణవేణమ్మ గారి కిరుపురు సంతానము. 1941 వ సంవత్సరమున వీరికి వైధవ్యము ప్రాప్తించినది. 1942వ సంవత్సరమున అక్క, తల్లిగారు కూడ మరణించిరి. తండ్రిగారు దుఃఖమునోర్వజాలక సన్యసించిరి. ఇన్ని కష్టముల నొందినను ఈ కవయిత్రి సన్నిహితుల ప్రోత్సాహమున, తన కవితా ప్రతిభతో సారస్వతలోకమున చిర యశస్సునందినది. బాల్యమునందే కుమారసంభవమును చదివినప్పుడే 'గిరిజా కళ్యాణ'మను ప్రబంధరచన చేసినది. సైరంధ్రి నిర్వేదము, స్థైర్యము, తెలుగు తల్లి, పవన దూత్యము మున్నగు ఖండకావ్యములను గృహలక్ష్మి పత్రికయందు వెలువరించిరి. అక్కగారి జ్ఞాపకార్థ మామెపేరున 'జ్ఞానప్రసూనాంబిక' శతకమును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచించిరి. ఈ శతకమును శ్రీ కేసరిగారే ముద్రింపజేసినారు. తన భర్తగారు వ్రాయుచు విడిచిన 'కౌలుట్లాధిప చెన్నకేశవ శతకము'ను కూడ కృష్ణవేణమ్మ గారు పూర్తియొనరించినారు. ఈ రచనలన్నియు వీరి మనోధైర్య, స్థైర్యములకు ప్రతిబింబములుగా నున్నవి. శ్రీ కేసరిగారిచే 1950వ సంవత్సరమున నీ కవయిత్రి 'స్వర్ణకంకణ' బహుమతిని పొంది గౌరవించబడినది.

గిరిజా కళ్యాణము

కృష్ణవేణమ్మగారిచే రచింపబడిన కావ్యము గిరిజా కళ్యాణము. దీనికి మూలము కుమార సంభవము అని రచయిత్రి పీఠిక యందు చెప్పుకొనినది. ఈ కావ్యమును బ్రహ్మశ్రీ గడియారము వేంకటశేష శాస్త్రిగారు దిద్ది పరిష్కృత మొనరించినారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కావ్య ముద్రణకు కొంత సహాయ మొనరించినది. ఈ కావ్యము కుమార సంభవమునందలి ఇతివృత్తమును గ్రహించి వ్రాయబడినది. కాని కుమార సంభవమునకు అనువాదమేమీకాదనవచ్చును. గిరిజా కళ్యాణమను ఈ కావ్యము ప్రాచీన కావ్యముల పద్ధతిలోనే నడిచినది. ఇష్టదేవతా స్తుతి, సుకవి స్తుతి, కుకవి నింద, వంశావతార వర్ణన, షష్ఠ్యంతములు మున్నగు వానిని చూచిన కవయిత్రి కావ్యమును ప్రాచీన కవుల ఫణితియందే వ్రాయ సంకల్పించినట్లు భావింపవచ్చును. ఇందు పంచమాశ్వాసములు గలవు. ప్రబంధ రీతిలో వర్ణనలు కలవు. ప్రబంధ లక్షణములతో చక్కగా నొప్పియున్నదీ గ్రంథము. ప్రబంధములలో అష్టాదశ వర్ణనలుండవలయునని నియమము కలదు. ఆ విధముగా, అన్ని వర్ణనలు లేకున్నను కొన్ని వర్ణనలు మాత్రము కనుపించు చున్నవి. హిమవద్వర్ణనము, వసంత ఋతువర్ణనము, సూర్యోదయ, చంద్రోదయ వర్ణనము, పుష్పాపచయ వర్ణన, సూర్యాస్తమయ వర్ణన, చంద్రాద్యుపాలంభనము, వివాహము మున్నగు వర్ణనలన్నియు గాంచిన, కవయిత్రి కావ్యమును ప్రబంధము గానే తీర్చిదిద్దవలెనను సంకల్పమున రచించినట్లు తెలియుచున్నది. అవి మాత్రమే గాక పూర్వకవులైన శ్రీనాథాదులు వర్ణించినట్లు భోజన వర్ణన, వివాహాచారముల వర్ణన మున్నగు సాంప్రదాయములపై కవయిత్రికి గల ఆసక్తిని ఈ కావ్యము తెలియబరచుచున్నది. మొదట వర్ణనలను పరిశీలించుదము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హిమవద్వర్ణన :

చంద్రశేఖరున కాశ్రయమొసంగినవాడు
నిఖిలౌషధీశుడై నెగడువాడు
అప్సరోంగనలకు ఆటపట్టగువాడు
గంగాభవానిని గన్నవాడు
కామధేనువునకు గ్రాసమిచ్చెడివాడు
నిధుల కాకరమౌచు నెగడువాడు
సన్మునీంద్రుల గ్రూరసత్వంబులను నొక్క-
కరణియేవేళల గాచువాడు

గీ. జలదముల శ్రమ బాపంగదలచువాడు
పరమ శీతల హృదయుడై బరగువాడు
ధీరుడాతని సరి భువి జేరనంగ
దనరుహిమవంతుడన పర్వతప్రభుండు.[1]

వసంత ఋతువర్ణన : తపమొనరించుచున్న ఈశ్వరునిపై పుష్పబాణ ప్రయోగ మొనరించి, అతని హృదయమున ప్రణయాగ్నిని రగుల్కొల్పవలయునని ఉద్దేశమున కంతుడు వసంతునితో కూడివచ్చెను. ఆ సమయమున వసంత ఋతువర్ణన మొనరించబడినది. తృతీయాశ్వాసమునందీవర్ణనము హృదయంగమముగా చేయబడినది. ఈ ఋతువర్ణనయందు కవయిత్రి ప్రయోగించిన వృత్తములు, జాతులు ఆ సందర్భమునకు తగినట్లుగా ఔచిత్యవంతముగా నున్నవి. మదన విలసితము, మత్తకోకిల, గీతము, ఆటవెలది, మాలిని, తరళము, పంచచామరము, కవిరాజవిరాజితములను వానిని ఆ సందర్భమున కుచితమగునట్లుగా వాడినది. ఈ వృత్తముల నుపయోగించు నపుడీ కవయిత్రి ప్రాచీన కవులగు నన్నెచోడాదుల సరళితో ముద్రాలంకారమును వాడినది.

1. గిరిజా కళ్యాణము - ప్రథమాశ్వాసము - పద్యం - 52.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముద్రాలంకార ప్రయోగవృత్తములు

మదన విలసితము :

మదన విలసితంబది యన నలరెన్
ముదితలమదికిన్ ముదముగలుగగన్

మత్తకోకిల:

ఆవసంతజయంతుడామరుడా వసంబును డాయగా
ధీవిశాలురమౌని వర్యులధీరతత్వము భంగమై
పోవ నావనకాంత యంతట బూనె తాకయిసేయగా
మావిక్రొన్నన మెక్కికూసెను మత్తకోకిలలెల్లెడన్.

గీతము:

వనితవన లక్ష్మికిని వసంతునకు పెండ్లి
సమయమునజేయు సంగీత సభలనంగ
క్రొవ్విరుల దేనియలద్రావి క్రొవ్వియున్న
తేటగీతంబు లెల్లెడనీటుగులెక్క.

ఆటవెలది:

చిగురు కుసుమవన్నె చీరయై యొప్పార
పండుటాకురైక పగిదిజెలగ
పూతక్రమగంధపుంబూతయైమావి
ఆటవెలది యనగ నలరెనపుడు.

ఈ విధముగనే మానినీ వృత్తము, తరళము వాడబడినవి. ముద్రాలంకారమున రచియింపబడిన పద్యములు హృద్యమై యొప్పుచున్నవి.

వసంతఋతువునందు పుష్పములు, పశు, పక్షిజాలము, అన్నియు నూతనత్వమును ఆపాదించుకొనును. యాదృచ్ఛికముగనే జీవజాలము జంట నభిలషించును. ఈ విషయమునే కవయిత్రి-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. అర్రులెత్తియున్నయిర్రులగొమ్మున
గోకె జింకలెల్ల కోమలముగ
పద్మపాత్రయందు పడతితోడనుగూడి
నారగించెమధుపు నళినివిభుడు.[1]

అని రెండు జంటలకుగల అనురాగమును వెల్లడిచేసినది. కవయిత్రి పుష్పాపచయ వర్ణనయందు 'వృషభగతిరగడ' నుపయోగించినది. ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన, రామరాజ భూషణుడు మున్నగువారు వృషభగతిరగడ ప్రయోగించినారు. ఈ రగడ సంఖ్యారహితపాదవృత్తములలో నొకటి కనుక, ఇచ్చ వచ్చినన్ని పాద ద్వయములు కలుగునట్లు చెప్పవచ్చును. కావ్య గుణములలో నొకటియగు కాంతిగుణము కలిగినట్టి చిత్రవర్ణ క్రమస్థితులతో గూడినచో వృషభగతి రగడ రమ్యముగా కనుపించును. పెద్దనాదులవలెనే కవయిత్రియు 'వృషభగతి రగడ'ను హృద్యముగా రచించినది.[2] ప్రాచీన కవుల రీతిలోనే పుష్ప వృక్షముల కొనరించు దోహదములను వర్ణించినది.[3]

సూర్యాస్తమయ వర్ణన :

హరుడు తన తపోభంగమును చేయవచ్చిన మారుని తన ఫాలనేత్రాగ్నిచే భస్మమొనరించిన పిదప రతీదేవి శోకముతోనున్న సమయమున సూర్యాస్తమయమైనట్లు వర్ణింపబడినది. ఈ వర్ణనయు తృతీయాశ్వాసమునందే కలదు.

చ. చరమ దిశాంగనామణికి ఛందురుకావి మడుంగుకట్టెనా
సురవనితాలలామములు జూడగనిల్పిన దర్పణంబునా
వరుణునిరాణి నెన్నొసట వాసిజె లంగెడి కుంకుమంబునా
సరగున పశ్చిమాంబునిధి జారె ప్రభాకరబింబమంతటన్.[4]

---

1. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం - 17.
2. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం - 19.
3. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం -
4. గిరిజా కళ్యాణం - తృతీయాశ్వాసము - పద్యము - 63

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సూర్యాస్తమయ వర్ణన చక్కని ఉత్ప్రేక్షాలంకారయుక్తమై సహృదయ రంజితమై యొప్పుచున్నది.

సూర్యాస్తమయమైనతోడనే యామినీ కాంత తనను రారాజు వచ్చి చూచు ననెడు సంభ్రమముతో ముత్యాల నీలి యంబరముగట్టి యెదురు చూచినది.[1]

చంద్రోదయము :

అభ్రవనితకు వేణిపైనలరుచుండు
పుష్యరాగంపుబిళ్లనాపోలుపు మీరె
యెల్లదిశలందు వెల్లయై యెసగుచుండె
చుక్కలను గూడి సోముండు సొబగుమీర.[2]

చతుర్థాశ్వాసమున చంద్రోదయ వర్ణనలోఁ అభ్రవనితకు వేణిపై నొప్పిన పుష్య రాగంపు బిళ్లవలె చంద్రుడున్నాడని కవయిత్రి ఉత్ప్రేక్షించినది.

చంద్రాద్యుపాలంభనము : హరునిపై మరులుగొనిన గిరితనయను విరహానలము దహించగా దుఃఖమున ప్రకృతియందలి సర్వవస్తుజాల మామెకు దావానల సమాన మైనది. శంకరు నెడబాసిన గిరికన్యక చంద్రునిట్లుపాలంభించినది :

ఉ. కాదిది చంద్రబింబమగుగాని, దవాగ్ని, కడుంబుజూడగా
గాదిది, తారకాచయము కన్గొన భాసుర విస్ఫులింగముల్
కాదిది లేతవెన్నెల వికాసము పావకచండ దీప్తియే
కాదిది రేయియంచు గిరికన్యకపల్కె వియోగవేదనన్.[3]

అపహ్నవాలంకారముతో గూడిన ఈ పద్యమెంతయు రమ్యముగా నున్నది.

సూర్యోదయము: వర్ణనలన్నియు ప్రబంధరీతిలోనే నడచినను కవయిత్రి నూత్న భావములతో వర్ణనలొనరించెననుటలో సందియము లేదు. ఉదయించు సూర్యుని-

---

1. గిరిజా కళ్యాణం - చతుర్థాశ్వాసం - పద్యం - 3.
2. గిరిజా కళ్యాణం - తృతీయాశ్వాసం - పద్యం - 56.
3. గిరిజా కళ్యాణం - చతుర్థాశ్వాసం - పద్యం 17.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. కాంచనంబునుగొని తానుగరగబోసి
రసముగా జేసి వేయి కరంబులందు
భువనభాండమున కుపూతపూయుననగ
భానుడుదయించె పూర్వదిగ్భాగమందు

అని క్రొత్త భావముతో వర్ణించినది.

పార్వతీ పరమేశ్వరుల వివాహ ఘట్టమునకు ముందు నగరాజ తనయను మేలుకొలిపిన సమయమునకూడ సూర్యోదయ వర్ణన చేయబడినది.

గీ. హారతులనిడ్డ పళ్ళెరమందు భవుడు
కాన్కగానిడ్డ నాణెంబు కరణిదోప
అరుణకాంతులనడుమ భాస్కరుడు వొలిచె
అంతపురికాంతలెల్ల నయ్యవసరమున.[1]

శుభకార్యముల సమయమున మంగళహారతి ముత్తైదువలు పట్టినపుడు మంగళ హారతి పళ్లెరములో రూపాయల బిళ్లలు వేయుచుండిరి. ఈ దినములందు నోట్లు కూడ వేయుచున్నారు. కాని ఆ కాలమున వెండిరూపాయ బిళ్లలే వేయుచుండిరి. హారతుల వెలుగులో గుండ్రని బిళ్లలు మెరయుచూ కనిపించెడివి. కవయిత్రి ఉదయించు సూర్యుని రూపాయి బిళ్లతో పోల్చుట సహజముగా నున్నది.

ప్రబంధ రీతిలో కవయిత్రి యొనరించిన ఓషధిప్రస్థపుర వర్ణనము మనోహరముగా గలదు.

ఓషధీప్రస్థపుర వర్ణన :

సీ. చుట్టునగడ్తలై సొంపు గుల్కుచునుండు
దేవతాభాగీరథీ స్రవంతి
సద్యోష ధీలతాశక్తి విడంబించు
మణిశిలా ప్రాకారమండపములు

---

1. గిరిజా కళ్యాణం - చతుర్థాశ్వాసం - పద్యం - 29.
2. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసం - పద్యం - 106.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంజకెంజాయలు చారుకాంతి హసించు
వరగోపురస్థ ప్రవాళదీప్తి
ఉపకంఠమున నొప్పునుద్యానవాటిక
గంధమాదనమును కాలదన్ను

గీ. వెలయు బహుళరత్న వైడూర్యవితతితోడ
ఆపురంబున కెన యలకాపురంబు
సంపదల దాన శౌర్యాది సంపదలను
దనకుదా సాటియైయది దనరుచుండు.[1]

ఆ పురమునందలి హయములను, మదగజములను, పురవైభవమును కూడ కవయిత్రి చక్కగా వర్ణించినది.[2]

పార్వతీ పరమేశ్వరుల వివాహ వర్ణన కవయిత్రి అచ్చముగా తెనుగువారి పెండ్లివలె నడిపించినది. భోజన వర్ణన ప్రాచీన కవుల రీతిలోనే చేయబడినది. ముని వర్గమును ఒకవైపు, అమరుల నొకవైపు, ప్రమథాముల నొకవైపు బంతులుగా కూర్చుండ నియమించి మధ్యన రత్నపీఠములపైన ఆది దంపతులను కూర్చుండబెట్టి విందు ఏర్పాటుచేసిరి. "నింబ, జంబీర, మధుర, మాకంద, కదళీ, కపిత్థ,ఖర్జూర,పనస, ద్రాక్షాగుళుచ్ఛంబులాది బహువిధపరిపక్వ ఫలరసంబులును, అనూనశాకాపూప భక్ష్యభోజ్యలేహ్యంబులును, కలమాన్నక్షీరాన్నదధి గోఘృతంబులును, కొమ్మలు పరిహాసవాక్యములతో వడ్డనలొనరించిరి.[3] కలకలనవ్వుకొనుచు వారొనరించిన పరిహాసభాషణములు రమణీయముగా నున్నవి.

---

1. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసం - పద్యం-17.

2. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసం - పద్యం-18,19,20.

3. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము - వచనం - 146.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పాయసాన్నము వడ్డించు నొక పద్మగంధిని మేలమాడిన రీతిట్లున్నది-

గీ. పాయసాన్నంబు లిటుదెమ్మ పద్మగంధి
యనుచునడుగంగ వడ్డించె నతివయతడు
తియ్యగా నున్నదే యిది తెలుపుమన్న
బలికె హాలెర సంజ్ఞనప్పడతిమిన్న.[1]

గిరిజా కళ్యాణమున ఇతివృత్తము చిన్నదైనను కవయిత్రి ప్రబంధ దృష్టితో వర్ణన లొనరించి కథను విస్తరింపచేసినది. వర్ణనాభరితమైనను ఇతి వృత్తమునందలి ఔచిత్యమేమియు తగ్గలేదు. ద్రాక్షాపాకముతోగూడిన పద్యము లతో, శృంగార రసభరితమైన ఈ ప్రబంధమునకు మహేశుడు నాయకుడు. శృంగారముకూడ అతివేలముగా వర్ణింపబడలేదు. ఈ ఉత్తమ ప్రబంధమును కవ యిత్రి శ్రీ కాళహస్తీశ్వరస్వామి కంకితమొనరించినది.

సంభాషణలు కొన్నియెడల పద్యములలో దీర్ఘముగా సాగినవి. గిరిజను తపమునకు పోవలదని తల్లి ఆటంకపరచిన సందర్భమునను,[2] మాయావటువు రూపమున పరమేశ్వరు డేతెంచినపుడు శివ పార్వతులకు జరిగిన సంభాషణలు[3] దీర్ఘముగానున్నను రసభరితమై యొప్పుచున్నవి. ఉమా శంకరుల వివాహమున లేగ వలయునను తొందరపాటుతో స్త్రీలొనరించుకొను అలంకరణలను గూర్చియు వారి పరిహాసములను గూర్చియు కవయిత్రి స్త్రీసహజమైన నేర్పుతో వర్ణించినది.[4]

సీ. చెలియబంగారంచుచేలంబుగట్టకు
చెంగావిసరిగంచు చీర కొనుము
కాంతయూ మొగ్గల కంచుకంబేటికే
రాయంచపేటుల రైకలేదె

---

1. గిరిజా కళ్యాణము- పంచమాశ్వాసము - పద్యం - 149.
2. చతుర్థాశ్వాసం- పద్యం 32నుండి వచనం 46 వరకు.
3. చతుర్థాశ్వాసము - పద్యం 94నుండి - 128వ పద్యంవరకు.
4. పంచమాశ్వాసము - పద్యము 77నుండి 80 వరకు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తరుణి యీ చామంతి విరులేల ముడిచెదు
విరజాజి పువ్వుల సరులులేవె
నవ్యకాంచన భూషణంబుల పెట్టకు
రమణీయ రత్నహారములనిడుము.

గీ. అనుచు సతులెల్ల నుచితహాస్యములతోడ
పలువిధంబులగై సేసిపడతులెల్ల
మించుదీవలనంగ, రాయంచలనగ
కనులు మిరుమిట్లుగొలుపగా గలిగిరపుడు. (పద్యం 78)

కావ్యమునకు మూలము కుమారసంభవమే అయినను కవయిత్రి, ఇతర కావ్య పఠనకూడ యొనరించినట్లు గ్రంథపరిశీలనవలన తెలియుచున్నది. గిరిజా కళ్యాణ ఇతివృత్తముగల నన్నెచోడ కుమారసంభవమునుకూడ కవయిత్రి పఠనమొన రించియుండవచ్చును. ఉదాహరణమునకు నన్నెచోడ కుమారసంభవమునందలి రచనా రీతులీ కావ్యమున కన్పట్టుచున్నవి. గిరిజా కళ్యాణమున మేనక గర్భము దాల్చినప్పుడు-

చ. శివకథలాలపింప మదిచింతనసేయు మహేశపాద సం
స్తవనమొనర్చు సూనముల చంద్రకళాధరు పూజ సేయగా
చిపురు భుజంగభూషణు నుతింపుచు గీతికలాలపించునా
ధపుప్రియురాలు గర్భమున భాసిలుచుండ నగేంద్రునింతియున్.[1]

ఇట్టి పద్యమే నన్నెచోడుని కుమారసంభవమునందును కలదు. గర్భవతి యగు మేనకాదేవిని గూర్చి వర్ణింపబడినది.

ఉ. ఆ ధవళాయతాక్షి విషమాక్షు సదాశివునిచ్చ మెచ్చనా
రాధన సేయగోరు, నుడురాజశిఖామణి జూటదార భూ
మీధర మెక్కగోరునెడ మేనక మానక భక్తియుక్తి గంగా
ధరుగొల్వగోరు మదిగౌరి మనంబున గోర్కెగూడగాన్.[2]

ఇట్లే కావ్యమును పరిశీలించిన పోలికలు కనిపించును.

1. గిరిజా కళ్యాము-ప్రథమాశ్వాసము-పద్యం-68.
2. నన్నెచోడుని కుమారసంభవము-తృతీయాశ్వాసము-పద్యం-25.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంస్కృత కవియగు భానునిచే ప్రవేశపెట్టబడిన ముద్రాలంకారము నన్నెచోడ కవి కుమార సంభవమున చేర్చినాడు. స్వాగతవృత్తము, మానినీవృత్తము మణిగణనికరము మొదలగు వృత్తములను ముద్రాలంకారముతో రచించినాడు నన్నెచోడుడు. అట్టి ముద్రాలంకార రచన కవయిత్రి తన గిరిజా కళ్యాణమున కూడ యొనరించినది.

నన్నెచోడుని కుమార సంభవమున మానినీ వృత్తము:

అననలీల సుధాకర బింబమునంబురుహంబుల చెల్వగుటన్
వేనలిగృష్ణ భుజంగకలాప సవిస్తరభాసురమై చనుటన్
దానతిబాంకియయ్యె దపంబుచిలస్థితి జేయుచునుండుటనీ
మానినిరూప చరిత్రలుదార సమంబగుచున్నవి చిత్రగతిన్.

ఇట్లే గిరిజా కళ్యాణమున కూడ పుష్పలావికల వర్ణన కలదు.

మానినీ వృత్తము:

ఆ దెసమల్లెలసంటగ బోవకు మయ్యనిగావలెనాకు ననన్
ఈదెసరాకుసుమీ యిపిగోయకు నింపగుజూచు సువాసనచే
గావివి సంపెగలేదివి వాసన కామినికోయకువానికిన్
పోదమురండికవాదన తెలని పూవులుగోయుచు మానినులన్.

వృత్తరచనా చతురతయందును, వర్ణనా నిపుణత యందును గిరిజా కళ్యాణము ఎంతయు సహృదయరంజకముగా నున్నది.

గిరిజా కళ్యాణము - కుమారసంభవ ప్రభావము
తృతీయాశ్వాసము - తృతీయసర్గము

గంటి కృష్ణవేణమ్మగారి గిరిజా కళ్యాణమునకు మూలము కాళిదాసు కుమార సంభవము. ఈ కావ్యము ప్రత్యక్షానువాదము కాకపోయినను మూలము నందలి శ్లోకముల నాధారముగా గొనియే రచనయొనరింప బడినది. కొన్ని వర్ణనా సందర్భములందు కవయిత్రి స్వతంత్ర రచన చేసినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుమారసంభవ తృతీయస్వర్గయందలి శ్లోకముల నాధారముగాగొని గిరిజా కళ్యాణము తృతీయాశ్వాస రచన యొనరింపబడినది. ఇంద్రుని ప్రోత్సాహమున మన్మథుడు తపోనిమగ్నుడైన శంకరుని తపోభంగమొనరించుట, అగజాత్మజ వేదనచెందుట తృతీయాశ్వాసమునందలి ఇతివృత్తము. గిరిజా కళ్యాణము నందలి పద్యములపై కుమార సంభవమునందలి శ్లోకచ్ఛాయలు యే విధముగ నున్నవో పరిశీలింతము.

మన్మథుడు చూచినపుడు ఈశ్వరుడు తపోనిమగ్నుడై యున్నాడు. తపోనిష్ఠుడైన శివుని మదనుడు-

గీ. గాలలేకుండు దీపంబు కరణి వాన
లేక యుండెడి జలదంబు లీలనిస్త
రంగుడై యుండు సాగర రాజు మాడ్కి
చంచలింపక ధ్యానించు శంభుగనియె. [1]

అని వర్ణింపబడినది. ఈ పద్యమునకు తృతీయ స్వర్గ యందలి-

శ్లో. అవృష్టి సంరంభమి వాంబువాహ
మపామి వాధార మనుత్తరంగమ్
అంతశ్చరాణాంమరుతాంనిరోధా
న్ని వాత నిష్కంప మివప్రదీపమ్. (శ్లో 48)

అను శ్లోకము ఆధారమై యున్నది. అయినను కవయిత్రి తన కవిత యందు కొద్ది మార్పొనరించినది. శ్లోకము నందలి చివరి పాదమును మొదటి పాదముగా గ్రహించినది. ఇట్లే పద్యపాద క్రమములను తన భావమునకు తగినట్లు మార్చినది. తపమొనర్చుచున్న శంభుని గూర్చి కుమార సంభవమున అయిదు శ్లోకములందు విస్తరముగా వర్ణింపబడినది. కాని గిరిజా కళ్యాణమున

1. గిరిజా కళ్యాణము తృతీయాశ్వాసము - పద్యం 23.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ శ్లోకములందలి భావమునుగ్రహించి రెండు పద్యములలో మాత్రమే వర్ణించినది. తాపసుల కైనను పొందగా తరముగానట్టి వానిని ఫాలనేత్రునిగని మరుడు భీతితో పారిపోయెను. అట్టి సందర్భమును తెలుపు దిగువ పద్యము కలదు.

గీ. తాపసులకైన బొందగాదరముగాని
యట్టి పూర్వోక్త లక్షణుండైన వాని
ఫాల నేత్రుని గని భీతి బారె మరుడు
బాణబాణా సనంబుల బారవైచి.[1]

దీనికి కుమార సంభమునందలి-

శ్లో. స్మరస్తథాభూత మయుగ్మ నేత్రం
ప్రశ్యన్న దూరా న్మనసాప్య ధృష్యమ్
నాలక్షయత్ సాధ్య సపన్న హస్తః
స్రస్తంశరం, చాప మపి స్వహస్తాత్.

అను శ్లోక మాధారమై యున్నది. భయముతో పరుగెత్తుచున్న మరునకు గిరిజాత్మజ పడతులతో పాటు కనుపించినది. ఈ సందర్భమున-

క. వెరవున బరువిడుమరునకు
కరమరుదగు రూప విభవకాంతుల చేతన్
నరుదారెడి గిరి జాత్మజ
పరిసరముల గాననయ్యె పడతుల తోడన్.

ఈ పద్యమునకు కుమార సంభవ తృతీయ సర్గయందలి ఏబది రెండవ శ్లోకము కొంత ఆధారమై యున్నది.

---

1. గిరిజా కళ్యాణము తృతీయాశ్వాసము - పద్యం 24.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిర్వాణ భూయిష్ఠ మథాస్య వీర్యం
సంధుక్షయంతీవ వపుర్గుణేన
అనుప్రయాతా వనదేవతాభ్యా,
మదృశ్యత స్థావర రాజకన్యా.[1]

తపమొనరించుచున్న శివుని సేవించుటకు పార్వతి చెలికత్తెలతో వచ్చినది. ఆమెను గాంచగానే మదనునకు మరల ఆశ కలిగినది. ఈ సన్ని వేశమును వర్ణించు పద్యము సీస పద్యము. దీనికి కుమార సంభవము సందలి ఏబది యారవ శ్లోకము యొక్క ప్రభావము సీసమునకు బంధమగు గీత పద్యము పైని కలదు.

పార్వతీదేవి భక్తితో శంభుని గొలుచుటకు వచ్చెను. ఆ సమయమున కవయిత్రి 'తరళ' వృత్తమునుపయోగించినది. ఆ వృత్తము కూడ ముద్రా లంకారముతో నొప్పుచున్నది.

తరళ:

తరళలోచన వచ్చె భక్తిని దైవత ప్రభు గొల్వగా
పరమపావనుడైన శంభుడు బాలగన్గొని యోగమున్
విరతి జేసె మనోజ్ఞ వీథిని వెల్గు జ్యోతిని గాంచి యా
వర కృపాఘని భక్త పాలుని వాంఛ యొయ్యది యోగదా.[2]

ఈ తరళ వృత్తముపై కుమార సంభవమునందలి శ్లోకమైన-

శ్లో. భవిష్యత: పత్యురుమాచ శంభో
సమాస పాదప్రతి హారభూమిమ్
యోగాత్ సచాంతః పరమాత్మ సంజ్ఞం
దృష్ట్వా పరంజ్యోతి రుపారరామ. (శ్లో. 58 తృతీయసర్గ)

---

1. కుమార సంభవము - తృతీయ సర్గము - శ్లో. 52.
2. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను శ్లోక ప్రభావము కలదు. కాని తెలుగు పద్యమున కవయిత్రి 'పరకృపాళుని భక్తపాలుని వాంఛ మెయ్య దియా' అను పాదమును తానే రచించినది.

శైలాత్మజ శంకరుని సేవించుటకు వచ్చినదని నంది వచ్చి ప్రణమిల్లి శివునకు తెలిపినాడు-

గీ. నందియేతెంచి ప్రణమిల్లి నగతనూజ
వెలదులను గూడి మిమ్ము సేవింప వచ్చె
ననిన భ్రూసంజ్ఞ నాతనినసుప నాత
డిందు ముఖులకు దెలిపె నయ్యాశ్వరాజ్ఞ.[1] (29 పద్యం)

పై పద్యమునకు సంస్కృత కుమార సంభవమునందలి శ్లోకమిట్లు గలదు.

శ్లో. తస్మైశశంస ప్రణిపత్యనందీ
శుశ్రూష యాశైల సుతాముపేతామ్
ప్రవేశ యామా సచభర్తురేనాం
భ్రూక్షేప మాత్రాను మతప్రవేశామ్.[2]

శంకరుని యానతి పొందిన పిదప పార్వతి చెలికత్తెలతో గూడి పరమేశ్వరునకు పుష్పముల నర్పించి నమస్కరించినది. ఈ విషయము-

ఉ. శంకరునానతింబడసి చానలగూడి సఖిలలామని
శ్శంక మహేశు చెంత జని చక్కని యామని పూలనెల్ల నే
శాంక శిఖావతంసునకు నర్పణ సేసి యపార భక్తినా
పంకజపాణి తెల్ల భువిఫాలతలంబులు సోకమ్రొక్కెనన్.

---

1. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము పద్యం 29.
2. కుమార సంభవం - తృతీయసర్గ శ్లోకం 60.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ పద్యమునకు కూడ సంస్కృత శ్లోకమాధారముగా గలదు.

శ్లో. తస్యాః సఖీభ్యాం ప్రణిపాత పూర్వం
స్వహస్త లూనః శిశిరాత్య యస్య
వ్యకీర్యత త్రంబక పాదమూలే
పుష్పోచ్చయః పల్లవ భంగభిన్నః.[1]

గిరిజా కళ్యాణమున పార్వతి శంకరునకు ప్రణమిల్లిన సందర్భమున భవానిని భవుడు మనసారగ ఇట్లు దీవించెను :

క. మ్రొక్కిన దీవించెను భవు
డక్కటికముతోడ నగజనతివరొమదిలో
జిక్కిన కాంతుని బడయుదు
వొక్కప్పుడు నీకు సపతులుండరటంచున్. (పద్యం 32)

ఈ పద్యమునకు మూలము 61వ శ్లోకమునందలి మొదటి పాదము 'అనన్య భాజంపతి మాప్నుహీతి' అనునది. మిగిలిన మూడు పాదములను కవయిత్రి గ్రహింపక తన సొంతముగా రచించినది.

యోగీశ్వరుడైన ఈశ్వరుడు తన చిత్తమందు కలిగిన వికారమునకు కారణ మరయ గోరెను.

చ. కుసుమ శరంబు వక్షమున గ్రుచ్చుకొనంగ నెరుద్రదు కంతటన్
గసటగు కోర్కెలింద్రియ వికారముచే కలుగంగ జొచ్చెనీ
యసదృశచిత్త విభ్రమము కారయకారణ మేమిటంచువె
క్కసముగ ఫాలలో చనుడు గాంచెను రోషకషాయితాక్షుడై.[2]

---

1. కుమారసంభవము - తృతీయాశ్వాసము - శ్లోకం 61.
2. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై పద్యమునకు—

శ్లో. అర్థేంద్రియ క్షోభమయుగ్మ నేత్రః
పునర్వశిత్వాద్బ లవన్నిగృహ్య
హేతుంస్వచేతో వికృతేర్ది దృక్షు
ర్ది శాము పాంతేషు ససర్జ దృష్టిమ్.[1] (శ్లో. 69.)

అను శ్లోకసమాధారముగా గలదు. కొన్ని శ్లోకములలోను, పద్యములందును భావమొకటే యున్నను వర్ణనారీతుల యందు భేదము కలవానిని ఇచట గ్రహింపలేదు. పోలికలున్న గ్రహించి పరిశీలన చేయబడినవి. ముక్కంటి కోపాగ్ని నడంచుటకు దేవతలు భయభ్రాంతులై -

గీ. శాంతుడవుగమ్ము శివమహేశ్వర యటంచు
నమరవరులెల్ల ప్రార్థించునంతలోన
భవుని నేత్రాగ్ని మారుని భస్మముగను
జేసె దివిజాధిపతులెల్ల చింతిలంగ.[2]

ఈ పద్యమునకు కుమారసంభవమునందలి తృతీయాశ్వాసమునగల 72 వ శ్లోకము ఆధారమైనది.

మన్మథుని భస్మమొనరింపగనే చూడలేక రతీదేవి ఆ దుఃఖమును మరచుటకే యన్నట్లు క్షణకాలము మూర్ఛిల్లినది. దీనికి మూలమైన శ్లోకమునందలి వర్ణన కొలది భేదముతో కలదు. అయినను రెండింటికి చక్కని సామ్యము కుదిరినది.

హరుని నయనాగ్నిచూసి భీతిల్లిన పార్వతి మూర్ఛిల్లిన సందర్భమున :

చ. హరునయనాగ్ని కుల్కి-యట నంబుజలోచన మూర్ఛనొందినన్
గిరివరుడెంతొ నెమ్మదిని ఖిన్నత చెంది కుమారినింటికిన్

---

1. కుమార సంభవము - తృతీయవర్గ - శ్లో 69.
2. గిరిజా కళ్యాణం - తృతీయాశ్వాసము - పద్యం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కరుణను నెత్తి కొంచరిగె కాంచగగంధ గజేంద్ర మింపునన్
సరసిజహస్తుడై చనెడి చాడ్పున దోపగ జూచువారికిన్.[1]

ఇందు చక్కని ఉపమాలంకార సౌందర్యము భాసిల్లుచున్నది. ఈ ఉపమానము కాళిదాస కవి ఉపయోగించినాడు.

శ్లో. సపదిముకుళితా క్షీంరుద్రసంరంభ భీత్యా
దుహితరమను కంప్యా మద్రి రాదాయదోర్భ్యామ్
సురగజ ఇవ బిభ్రత్ పద్మినీం దంతలగ్నాం
ప్రతి పథగతి రాసీద్వేగ దీర్ఘీకృతాంగః.[2] (శ్లో. 76.)

ఈ శ్లోకమునందలి యుపమాలంకారమే కవయిత్రి గ్రహించి చక్కని రచన యొనరించినది.

తన తపస్సునకు స్త్రీ జనసాన్నిధ్యము ఆటంకముగా నున్నదని తలచి నాడు భూతేశ్వరుడు - కోపముతో "విఘాతములు కూడును కాంతల సఖ్యమున్నయంచు" అని పరమేశ్వరుడు ప్రమథాదులతోడ నదృశ్యుడయ్యె.[3]

దీనికి మూలము 'స్త్రీ సన్నికర్షం పరిహర్తు మిచ్ఛన్నంతర్ద ధేభూత పతిస్సభూతః' అను శ్లోకపాదము. (శ్లో. 74 తృ. స.)

మూర్ఛనుండి తేరిన రతీదేవి దుఃఖము ప్రబంధరీతిలో వర్ణింపబడినది. ఈ పద్యములకు. మూలము కుమార సంభవమునందలి తృతీయ సర్గయందు లేవు. హిమవంతుడు కుమార్తెను కరములపైగొనిపోవు వరకు తృతీయ సర్గ ముగిసినది. కాని గిరిజా కళ్యాణమున రతీ విలాపము, మరియు సూర్యాస్తమయ వర్ణన చేయబడిన పిదప తృతీయాశ్వాసము ముగిసినది

1. తృతీయాశ్వాసము పద్యం 42 (గిరిజా కళ్యాణము)
2. కుమార సంభవము - తృతీయ సర్గ - శ్లో.- 76.
3. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం 43.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రతీవిలాప ఘట్టమునందలి పద్యములు కరుణ రసభరితములై యొప్పుచున్నవి. రతీ విలాపమంతయు రచయిత్రి సొంత భావనలతో రచించినది. ఈ ఘట్టము కుమార సంభవ చతుర్థ స్సర్గయందు అతి వేలముగా వర్ణింపబడినది. గిరిజా కళ్యాణమున సంస్కృత కావ్యమునందలి శ్లోకము లాధారముగా లేదు. కాని విలపించుచున్న రతీదేవికి ఆకాశవాణి పల్కులు వినిపించిన సమయమున తెలుగు పద్యములపై కుమార సంభవ చతుర్థ స్వర్గమందలి శ్లోక ప్రభావము కలదు. విలపించుచున్న రతీ దేవికి ఆకాశవాణి వినిపించినది.

గీ. అనలశుష్క నదీ పూరమందు బెలగు
మత్స్యకారితకు వర్షాగమంబు వోలె
ఆసలన్నియు గోల్పోయినట్టి రతికి
బలికె దశరీరవాణి యిప్పగిది కరుణ.[1]

పై పద్యమునకు-

శ్లో. ఇతిదేహ విముక్త యేస్థితాం
రతిమాకాశ భవాసరస్వతీ
శఫరీంహ్రదశోష విక్లబాం
ప్రథమావృష్టి రివాన్వకంపయ్యత్.[2] (శ్లో. 39 చతుర్థ సర్గ)

అను ఈ శ్లోకము మూలమై ఒప్పుచున్నది.

రతీదేవి నూరడించుటకై 'ఆకాశవాణి'-

క. కనుగొందువు నీపతిమది
ననుమానము వలదు వినుము హరుని తపోగ్నిన్
గనలిన కారణమును నే
వినిపించెద దుఃఖముడిగి వినుము లతాంగీ.[3]

---

1. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం 55.
2. కుమార సంభవము - చతుర్థ సర్గ - శ్లో. 39.
3. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసం - పద్యం 56.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ పద్యమునకు-

శ్లో. కుసుమాయుధ పత్ని దుర్లభ
స్తవభర్తా నచిరాద్భవిష్యతి
శృణుయేన సకర్మణాగతః
శలభత్వం హరలోచనార్చిషి. (40 చతుర్థ సర్గ)

అను శ్లోకము కొంత ఆధారమైనది.

ఆకాశవాణి రతీదేవికి మన్మథ శాప కారణము వివరించినది. బ్రహ్మ సరస్వతిని సృష్టించి యామె అందమును తిలకించుచుండెను. మన్మధుడాతని ఇంద్రియములకు కామము కల్గించెను. ప్రజాపతి తన పుత్రికయందే తనకు వలపు కలిగిన కారణము తెలిసికొని మదనుని త్రిలోచనాగ్నియందు పడి మరణించుమని శపించెను.[1] గిరిజా కళ్యాణమునందలి ఆ పద్యమునకు-

శ్లో. అభిలాషము దీరితేంద్రియః
స్వసుతాయామకరోత్ప్రజాపతిః
అథ తేనని గృహ్య విక్రియా
మభిశప్తః ఫలమే తదన్వభూత్.[2] (శ్లో. 41 చతుర్థ స్సర్గ)

బ్రహ్మదేవుని శాపమును వినిన యమధర్మరాజు కామము నశించినచో సృష్టియే నశించునను భయముతో-

క. కమలాసను ప్రార్థించెను.
యముడంతట భీతి సృష్టియగు బెట్లనుచున్
శమనంబు శాపమునకే
సమయంబున కలుగు పంచశరునకు ననుచున్.[3]

1. గిరిజా కళ్యాణము - తృయాశ్వాసము - పద్యం 57.
2. కుమార సంభవము - చతుర్థ సర్గ - శ్లో. 41.
3. గిరిజా కళ్యాణము - తృతీయాశ్వాసము - పద్యం 58

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ పద్యమునకు-

శ్లో. ఇతిచాహస ధర్మయాచితః
స్మరశాపావధి దాం సరస్వతీమ్
అశనేరమృత స్య, చోభయోః
వశినశ్చాంబుధరాశ్చ యోనయః.[1] (శ్లో. 43 కు. సం. చ.)

అను శ్లోకము మూలమైనను శ్లోకము నందలి చివరి రెండు పాదములకును, పద్యము నందలి చివరి రెండు పాదములకును కొలది భేదము కలదు.

మన్మథ శాపకారణమును ఆకాశవాణి వివరించి రతీదేవి నూరడింపుచు-

గీ. ఈ వియోగంబు సతమని యెంచవలదు
కొమ్మదే హంబుగా పాడు కొనుచునుండు
యెండిపోయిన చెరువులు నిండుకొనవె
కుంభవృష్టియు జడిపట్టి కురిసె నేని.[2]

అని పలికినది. ఈ పద్యమునకు కుమార సంభవము నందలి శ్లోకమాధారముగా నున్నను, అందు యెండిపోయినది గ్రీష్మము ముగిసినంతనే మరల ప్రవాహముతో కూర్పబడును అని కలదు.[1] (చతు. శ్లో. 44.)

శ్లో. తదిదంపరి రక్షశోభనే
భవితవ్యప్రియ సంగమం వపుః
రవిపీత జలాత పాత్యయే
పునరోఘేన హియుజ్యతే నదీ.

ఈ విధముగా గిరిజా కళ్యాణము తృతీయాశ్వాసమునందు కుమార సంభవము నందలి తృతీయ, చతుర్థ స్సర్గల యందలి శ్లోకము నందలి ప్రతి పదమును గ్రహించకున్నను భావము నేమాత్రము చెడిపోకుండునట్లు కవయిత్రి గ్రహించినదని చెప్పవచ్చును.

---

1. కుమార సంభవము-చతుర్థ స్సర్గ - శ్లో. 43.
2. గిరిజా కళ్యాణము - తృతీయా శ్వాసము - పద్యం 61.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము

కుమార సంభవము - షష్ఠసర్గ

గిరిజా కళ్యాణమునందలి చతుర్థాశ్వాసమునందు శైలాత్మజ తపము, శివుడు మాయావటువు వేషముతో చనుదెంచి, ఆమె మనోభావమును గ్రహించి, తన నిజ రూపమును చూపుట, మరియు పార్వతి తన హృదయగత భావనను చెలికత్తెలతో శివునకు చెప్పినంతవరకు కలదు.

ఆమె పలికిన పలుకులను స్మరించి శంకరుడు సప్త ఋషులను పిలపించుటకు పూనుకొనినప్పటినుండియు పంచమాశ్వాసము ప్రారంభమైనది. పంచమాశ్వాసము నందలి కొన్ని పద్యములపై కుమార సంభవములోని షష్టసర్గ యందలి శ్లోకములు మూలములై యున్నవి.

శంకరుడు సప్త ఋషులను మనసున స్మరించుట తోడనే తేజోమూర్తులగు సప్త ఋషులు అరుంధతీ దేవితో పాటు వచ్చిరి. అంతట :

ఉ. వచ్చిన మౌని వర్యులను వారిజనేత్రసరుంధతీ సతిన్
బొచ్చములేని ప్రేమమున పూజ యొనర్చె సగౌరవంబుగా
మచ్చికమాటలాడె మదిమానిని యంచు నుపేక్షసేయకే
సచ్చరితుల్ మహాత్ములటు సల్పరుగాదె విభేదమారయన్.[1]

ఈ పద్యమునకు, కుమార సంభవము నందలి-

శ్లో. తామగౌరవ భేదేన మునీంశ్చాపశ్య దీశ్వరః
స్త్రీ పుమానిత్య నాస్థైషా వృత్తంహిమహితం సతామ్.[2]

అను శ్లోకము మూలమైనది.

---

1. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము - పద్యం 4.
2. కుమార సంభవము - షష్ఠ సర్గ - శ్లో 12.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సప్తఋషులు పరమేశ్వరుని ప్రార్థించి తమను పిలిపించిన కారణ మడుగగా, నా కొరకై నేను కోరిక కోరుట లేదు. తారకుడింద్రలోకమును కారియ పెట్టగా నిర్జరులు గాసిలి రక్కసుని జంపుటకై యొక పుత్రుని వేడిరి. అందువలన నేను అగ్నియొక్క ఉత్పత్తి కొరకు యజమానుడు అరణిని సంగ్రహించు నట్లు పుత్రోత్పత్తికొరకై శైల సుతనుద్వాహ మాడ దలచినాను అని శంకరుడు పలికెను.[1]

ఈ పద్యములపై కుమార సంభవమునందలి శ్లోకముల ప్రభావము కొలది భేదముతో కలదు.[2]

తన యొక్క కోరికను సప్తఋషులతో తెలిపిన పిదప భవుడు :

క. సకల ధర్మార్థ వేది విజ్ఞాన నిధియు
సచ్చరిత్ర యరుంధతీ సాధ్వి మీకు
సాయమొనరించు నిక్కార్య సాధనమున
సతులు సమయోచితాలాప చతుర మతులు.[3]

అని అరుంధతీ దేవిని ప్రశంసించెను, ఈ పద్యముపై :

శ్లో. ఆర్యాప్యరున్ధతీ తత్రవ్యాపారం కర్తుమర్హతి
ప్రాయేణైవం విధేకార్యేపు రన్ధ్రీణాం ప్రగల్భతా.[4]

అను శ్లోక ప్రభావమున్నది.

హిమవంతుడు మునుల కర్ఘ్యపాద్యామొసంగిన సందర్భమున పద్యమిట్లున్నది:

---

1. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము - పద్యములు 11, 12.
2. కుమార సంభవము షష్ఠ సర్గ - శ్లోకములు 27, 28.
3. గిరిజా కళ్యాణము - పద్యం 15.
4. కుమార సంభవము - చతుర్థసర్గ - శ్లో 32.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చ. తన పదఘట్టనంబునను ధారుణి గ్రుంగ హిమాద్రి యంతపూ
జనమొనరింపవచ్చె తన జాయనుగూడి యపార సంతసం
బెనయగ నాతి ధేయము మునీశ్వరు లెల్లరకిచ్చి యున్నతా
సనమిడి యర్ఘ్య పాద్యముల సర్వ జగంబులు సంతసిల్లగన్.[1]

ఈ పద్యమునకు కుమార సంభవమునందలి-

శ్లో. తానర్ఘ్యానర్ఘ్య మాదాయదూరాత్ ప్రత్యుద్య యౌగిరిః
నమయన్ సారగురుభి : పాదన్యాసైర్వ సున్ధరామ్.[2]

అను శ్లోకమాధారమై యున్నది.

సప్తఋషులను పూజించి, వారి నుచితాసనములపైన ఆసీనుల నొనరించి, నగరాజు :

గీ. ఉరుము లేకయె పెనువృష్టి గురిసినటుల
ఫలితమొనగూడు మీరాక వలన మాకు
పరహితము పొందె యెద్దియో బలుకరయ్య
అరయుదును మీరు నిష్కాములనుచు దేవ.[3]

అని పలికెను. ఈ పద్యమునకు :

శ్లో. అపమేఘోదయం వర్షమ దృష్ట కుసుమం ఫలమ్
అతర్కితోప పన్నం వోదర్శనం ప్రతిభాతిమే.[4]

అను శ్లోకము కొంత ఆధారముగా గలదు.

---

1. గిరిజా కళ్యాణము - పద్యం 24.
2. కుమార సంభవము - షష్ఠ సర్గ - శ్లో 50
3. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము - పద్యం 27.
4. కుమార సంభవము - శ్లో 54.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరమేశ్వరుని కార్యార్థమై ఏతెంచిన సప్తఋషులను గాంచి, హిమవంతుడు-

క. ఏనును నా భార్యయునిదె
నానోముల ఫలితమైన నాసుత మీరల్
బూనిన కార్యములేరితొ
గానున్నవొ యట్టివారి గ్రహియింతురొకో.[1]

అని యనెను. ఈ పద్యమునకును సంస్కృత శ్లోకమాధారముగా గలదు.

శ్లో. ఏతేవ యమమీ దారాః కన్యేయం కులజీవితమ్
బ్రూతయేనాత్రవః కార్యమనాస్థాబాహ్యవస్తుషు (శ్లో. 63)

హిమవంతుని ప్రార్థన వినిన సప్త ఋషులు కథా ప్రసంగములందును-

గీ. సమయ సందర్భముల యందు సముచితముగ
మాటలాడంగ నేర్పిన మౌనివర్య
అంగిరసుజూడ నాతండు అనువుగా
పలికె హిమవంతుతో మృదుభాషలొలుక.[2]

అను ఈ పద్యము-

శ్లో. అథాఙ్గిరస మగ్రణ్యముదాహరణ వస్తుషు
ఋషయ నోదయామాసుః ప్రత్యువాచస భూధరమ్.[3]

అను శ్లోకముపై ఆధారపడినది.

సమయోచిత సంభాషణా చతురుడైన అంగిరసుడు హిమవంతునితో:

ఉ. కోరినవానికన్న పదికోటె మడుంగులు గూర్తువయ్యునిన్
ధీరుడవంచు విష్ణుడని తెల్పుచు నుందురు నీదు కీర్తి
యాధారుణి కెల్ల వెల్లయయి దొర్కొనుచున్నది యద్రిరాజ నీ
కారయనెంత కోర్కులిడ నర్థిజనంబులు వేదవచ్చినన్.[4]

---

1. గిరిజా కళ్యాణము - పంచామాశ్వాసము - పద్యం 28.
2. గిరిజా కళ్యాణము పంచమాశ్వాసం - పద్యం 29.
3. కుమార సంభవము సప్త సర్గ - శ్లో. 65.
4. కుమార సంభవము - షష్ఠ సర్గ - శ్లో. 66, 67.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుమార సంభవమునందలి శ్లోకములలో రెండు శ్లోకముల నాధార మొన రించి పై పద్యము రచింపబడినది.[1] సప్తఋషులు హిమవంతునికి శంకరుని యొక్క కోరికను తెలిపి, పార్వతి నిమ్మని వేడగా సంతసమున హిమవంతుడు తన భార్యయగు మేనకను చూచెను. ఆమెయు-

క. పతి మదిదెలిసి మెలంగెడి
సతి మేనక దెలిపె తనదు సమ్మతి యెందున్
పతిదేవత యెదురాడునె
పతిమాటకు, నద్రియంత బహుమోదమునన్.[2]

శ్లో. మేనే మేనాపి తత్ సర్వంపత్యుః కార్యమ భీప్సితమ్
భవన్త్యవ్యభిచారిణ్యో భర్తురిష్టే పతివ్రతాః.[3]

అను శ్లోకము పై పద్యమునకు మూలమనవచ్చును. మేనకాదేవి యభీష్టమును కూడ తెలిసికొనిన హిమవంతుడు కుమార్తె నిచ్చుట కంగీకరించగా, వసిష్ఠ మహర్షి పత్ని అరుంధతీదేవి ప్రేమతో పార్వతిని ఒడిలో నిడుకొనెను. మేనకాదేవి తన పుత్రిక తన కప్పుడే దూరమైనట్లు దుఃఖించినది. ఆమెను అరుంధతి యూరడించెను.

ఆ సందర్భమున గల పద్యములు :

క. కడుపడిన రుంధతీ సతి
యొడిలోనిడు కొన్న గిరిజనోడకగని బ్రా
న్పడినటు మేనక కన్నుల
తడిపెట్టగ సాగె యేమి దలచె నామదిలో. (పద్యం 49)

1. కుమార సంభవము - షష్ఠ సర్గము - శ్లో. 66,67.
2. గిరిజా కల్యాణం - పంచమాశ్వాసము - పద్యం 47.
3. కుమార సంభవము - షష్ఠ సర్గ - శ్లో. 36.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. అంత నరుంధతి మేనక
చింత దెలసి యిట్టులనియె చెలి యామదిఁ
నావంతయు చింతిల్లకు నీ
స్వాంతము సిద్ధించు హరుడు సర్వేశ్వరుడా.[1] (పద్యం 51)

ఈ రెండు పద్యములపైనను ఒక్కటే సంస్కృత శ్లోక ప్రభావము కలదు.

శ్లో. తన్మాతరం చాశ్రుముఖీం దుహి తృస్నేహ విక్లబామ్
పరస్యానన్య పూర్వస్య విశోకామ కరోద్గుణైః.[2] (శ్లో. 92)

అను శ్లోక ప్రభావము గల దనవచ్చును.

వారందరి యభీష్టమును గుర్తించిన మునులు వివాహమునకు లగ్నము నిశ్చయించి చెప్పిరి.

చ. వినయముతోడ నద్రిపతి వేడిన మౌని వరేణ్యు లెల్లనో
వినుత చరిత్రమాటలిక వేయివచింపగ నేలపెండ్లికిన్
అనువగు మూడు నాళ్లకిక నన్నియు లెస్సగనున్న వయ్యయా
దినమునలగ్న యోగతిథి దివ్యము తారయు భూధరాగ్రణీ.

ఈ పద్యమునకు,

శ్లో. వైవాహికీం తిథిం పృష్టాస్తత్ క్షణం హరబన్ధునా
తేత్ర్యహా దూర్ధ్వ మాఖ్యాయ చేరు శ్చీర పరిగ్రహాః (శ్లో. 93 ష. స.)

అను శ్లోకము మూలమై యున్నది.

ఈ విధముగా గిరిజా కళ్యాణమునందలి పంచమాశ్వాసములోని కొన్ని పద్యములపై సంస్కృత కుమార సంభవ షష్ఠసర్గయందలి శ్లోకముల ప్రభావము కలదు. ఔచిత్యము చెడకుండునట్లుగా అనువదించుటలో కవయిత్రి తన ప్రతిభా పాటవములను చూపించినది.

---

1. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసం - పద్యం 49, 51.
2. కుమార సంభవము - షష్ఠ సర్గ - శ్లో. 92.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గిరిజా కళ్యాణమున గల విశేషములు

గిరిజాకళ్యాణ కావ్యమునకు కుమారసంభవము మూలమైననూ కవయిత్రి కొన్ని యెడల స్వతంత్రముగా రచించినది. మేనకాదేవి గర్భధారణమును గూర్చియు పార్వతీదేవి బాల్యదశను గూర్చియు వర్ణించుటలో స్వాభావికతగలదు.

మేనకాదేవి గర్భవతియైన పిదప -

ఉ. పుల్లని నిమ్మపండ్లు దినబుద్ధి దలంచు మరెవ్వరేని ద
న్నుల్లసమాడ జూతురని యూరక 'మూర్కొని పారవైచునే
పల్లవ పాణులైన పసిపాపను గందువటన్న సిగ్గుచే
నుల్లము పల్లవింప నికయూరక యుండుదటంచు నవ్వెడిన్.[1]

ఈ పద్యమున సామాన్యముగా మగువలు నెలమసలిన తరువాతకోరు కోర్కెలను స్త్రీ సహజముగా వర్ణించినది. అంతేకాక, గర్భవతియైన స్త్రీ మనసునందెట్టి చింతయునులేక ఉత్తమ కథాపఠన మొనరించి, ఆనందకరమగు ఆలోచనల నొనరించిన జన్మించు శిశువుపై కూడ తల్లియొక్క ప్రభావముండునను భావమును తెలిపినది కవయిత్రి.[2]

మేనకాదేవి శివకథాలాపన మొనరింపుచు, మహేశు పాదములనే స్తవన మొనర్చుచు, చంద్రకళాధరునే పూజసేయగోరుచు, భుజగ భూషణుని నుతింపుచు ఆతనిపై గీతిక లాలపించుచు నుండెనది.[3] శివభక్తురాలగు తల్లి గర్భమున జనించిన పార్వతియు శివప్రియురాలైనది.

హిమవంతుని ముద్దుల పట్టియైన పార్వతి యేడు లోకములు మురియునట్లుగా పెరిగెనది. మెల్లన పలుకులు పలుకుట నేర్చినది.

---

1. గిరిజాకళ్యాణము - ప్రథమాశ్వాసము - పద్యం 65.
2. గిరిజాకళ్యాణము - ప్రథమాశ్వాసము - పద్యం 68.
3. గిరిజాకళ్యాణము - ప్రథమాశ్వాసము - పద్యం 68.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. అత్తత్తయనుట నేర్చెను
యెత్తరి నెవరైన బిలిచరేని కనుగొనున్
పుత్తడి బొమ్మలగైకొని
బిత్తరులాడింప కేక పెట్టుచు నవ్వున్.[1]

చిట్టిపాప పెరిగి మాటలు నేర్చినపుడు 'అత్తత్త' అను మాటలు తప్పక పలుకును. ఆ విధమునే సహజముగా వర్ణించినది కవయిత్రి.

సర్వమంగళరూపిణియై పార్వతీదేవి అనేక నామములతో నొప్పుచున్నది. ఆమెకు గల నామములలో కొన్నిటిని విపులముగా వివరించినది. ఒక్కొక్క పద్యమున దేవికి గల పేరును, తత్కారణమును వివరించినది.

హిమవంతుని సుతయైన కారణమున హైమవతి అనియు, ఈశ్వరుని అర్ధాంగి అగుటచే ఈశ్వరి అనియు, శివసతి యగుటవలన 'శివ' అనియు, భవుని కిల్లాలై యుండుటచే 'భవాని' అనియు, రుద్రునకిల్లాలయి యుండుటచే 'రుద్రాణి, అనియు వ్యవహరింపబడినది. మంగళాలయయైయొప్పుటచే సర్వమంగళ అనియు' పర్వతేంద్రుని బిడ్డకనుక 'పార్వతి' అనియు, దుర్గముల నివసించునట్టిది కనుక దుర్గ అనియు పిలువబడినది. గిరిరాజు దుహిత కనుక 'గిరిజ' అనియు, ఆకులను, అలములను దిని హరునిపై ఏకాగ్రతతో మనసు నిలిపి తపమొనరించుటచే 'అపర్ణ' అనియు నామములను పొందినది. 'కత్య' యను గోత్రమున పుట్టుటచే 'కాత్యాయని' యనియు, గౌరవర్ణపు కాంతులచే నొప్పుటచే 'గౌరి' అనియు పిలువబడినది. శర్వునికి పత్ని యగుటచే 'శర్వాణి' అనియు, తపమునకు పోవునపుడు వారించుటచే 'ఉమ' అను పేర్లతో పిలువబడినది.[2]

---

1. గిరిజాకళ్యాణము - ప్రథమాశ్వాసము - పద్యం 96.
2. గిరిజా కళ్యాణము - ప్రథమాశ్వాసము-పద్యములు 82 నుండి 91 వరకు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పార్వతి తపమొనరించునపుడు, శంకరుని మనసునందు నిలిపి పంచాగ్ని మధ్యమున, ఆయా ఋతువులందు ఘోరతపమ్మొనరించినది చక్కగా వివరించినది కృష్ణవేణమ్మగారు.

పార్వతి తపస్సు :

గీ. మండువేసవి పంచాగ్ని మధ్యమందు
జోరువానల బయలుల సుదతి నిల్చి
పర్ణభక్షణమేది తపంబుసల్పె
మునులకెల్లను నాశ్చర్యమును ఘటింప.

ఆ.వె. మేను మధ్యమందు మెరుపుతీగయు పోలె
వర్షఋతువునందు వనితయొప్పె
చంద్రుడయ్యె వెలది శారదవేళల
భక్తియంతకంత ప్రబలుచుండ.

క. హేమంతఋతువునందా
భామామణి జలములందు బద్ధాంజలియై
కామారి దలచుచుండెను
శ్రీమానిని కలమగేహసీమన్ బోలెన్.

క. పంచాగ్ని మధ్యమందా
పంచాసన మధ్యనిలువబడి ధ్యానించెన్
మించెడి కాంచనలతయన
నించుకయును వాడదయ్యె నింతివదనమున్.

గ్రీష్మ, వర్ష, శరదృతువులందు హేమంతఋతువునందు, పంచాగ్ని మధ్యమున నిల్చి పార్వతి యొనరించిన తపోవర్ణనము హృదయంగమముగా నున్నది.

పార్వతి వివాహ సందర్భమున కూడ కవయిత్రి తెలుగు వారి పద్ధతులను సహజముగా వర్ణించినది. పెండ్లి కొడుకైన పరమేశ్వరుడు కాశీయాత్రకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెడలినాడు. కాశీయాత్రకు హరుడేగుచున్న విషయము తెలిసిన హిమగిరీంద్రుడు తన సతీసుతులతో, అమాత్య ఋషిబృందముతో కూడ వచ్చి బ్రతిమాలెను.

ఎదురయి కాశియాత్రకిపుడేటికి బోవలెనయ్య శంకరా
ఇదెగొనుమంబరంబులును, నింపగు దివ్యరథంబు లశ్వముల్
మదకరులున్ సుభూషలును మానిత కాంచన పాదుకద్వయిన్
ముదితనొసంగుదున్ గొనుము మోదముతో మమునుద్ధరింపగన్.[1]

కాశియాత్రవలదని కన్నె నిత్తునని శివునితో పల్కి తోడి తెచ్చినాడు. అంత గట్టుల దొర తనయుడు శ్వేతఛత్రము పట్టి పాదుకలు పెట్టినాడు.

పట్టెను శ్వేతచ్ఛత్రము
బెట్టెను పాదుకలు వేదవేద్యున కెదలో
నెట్టిన భక్తిని నపుడా
గట్టులదొర తనయుడంత గారాబముగా.[2]

ఈ ఆచారము ఇప్పటికినీ ఆంధ్రుల వివాహ సందర్భమున గలదు. అది యొక సునిశిత హాస్యరస పోషకమగు అపూర్వమైన ఘట్టము. ముగ్ధయగు పార్వతి వివాహ సందర్భమున హరుని చూచుటకు మది దలంచు చుండినది కాని దొరకొను సిగ్గుచేత శివుని చూడలేక -

గీ. నిటలతట దాసికము దిద్దు నెపముచేత
కుటిలకుంతలముల ద్రోసికొనునెపమున
హోమధూమంబుచే కనులొత్తికొనెడి
కారణంబున కడకంట గాంచుచుండె.[3]

---

1. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము - పద్యం 119.
2. గిరిజా కళ్యాణము - పంచమాశ్వాసము - పద్యం 125.
3. గిరిజాకళ్యాణము - పంచమాశ్వాసము - పద్యం 136.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముగుదలైన కన్యలు వివాహ సందర్భమున భర్తను క్రీగంట చూచు విషయమును ఎంతో సహజముగా వర్ణించినది కవయిత్రి.

కన్యాదానమొనరించిన తర్వాత హిమవంతుడు ఈశ్వరునికి షోడశదానముల నొసగెను. ఈనాడు కన్యలకిచ్చు వస్తు, వాహనములను, ఆనాడే హిమవంతుడు వేడుకతో, ఒసగినాడు. పెండ్లియైన పిదప కన్యకు, అల్లునికి ధన, ద్రవ్యములనిచ్చు ఆచారము అనూచానముగా వచ్చుచున్నది. హిమవంతుడు తన పుత్రికకు, అల్లునికి, ఇచ్చినట్టి వస్తు సంభారములను కవయిత్రి వరుసతో వర్ణించినది.

సీ. మరకత మాణిక్యమయమైన సింహాస
        నంబులు దశ సహస్రంబు లిచ్చె
కామధేనువుతోడి కయ్యంబునకుపచ్చ
        గోగణంబుల నొక్కకోటి యొసగె
తపనీయ దివ్యసంపన్నమై యొప్పారు
        కనక రథంబుల కాన్కనిచ్చె
గంధసింధుర మతంగశతంబుల
        దాసీస హస్రంబు దానమిచ్చె.[1]

గీ. రత్నకుండలముల నవరత్నములతో
నలరుచుండెడి యంగుళీయకములొసగె
పట్టు సరిగంచు చేలముల్ భక్తినొసగె
అభవునకు కన్యనొసగి ధన్యాత్ముడయ్యె.[2]

తలంబ్రాలు పోసికొనుట, సన్నెకల్లు త్రొక్కుట మున్నగు తెలుగువారి ఆచారములను వివాహ ఘట్టమునందు వివరముగా తెలుపబడినవి.

---

1. గిరిజాకళ్యాణము - పంచమాశ్వాసం పద్యం 136.
2. గిరిజాకళ్యాణము - పంచమాశ్వాసము - పద్యం 136

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అచ్చతెనుగు పదములు :

కవయిత్రికి సంస్కృతాంధ్రములయందు మంచి పాండిత్యము గలదు. అచ్చతెనుగు పదములను ఔచిత్యవంతముగా ఉపయోగించినది. ఇష్టదైవత ప్రార్థనయందు గణేశుని స్తుతించునపుడు పూర్తిగా అచ్చతెనుగు పదముల తోడనే, పద్యరచన మొనరించినది.

గీ. కొండరా చూలిముద్దుల కొడుకు గుఱ్ఱ
ఆ ముటేనుగు తలగలసామి మొదటి
విద్యలకునెల్ల నొజ్జయై వెలయు పెద్ద
బొజ్జగల ప్రోదగొల్తునే పొద్దుబుత్తి.
తెల్లదామరగద్దె, పలుకులవెలంది, అచ్చి,
గట్టులయకిమీదు, తెలిపులుగువజీరు

పలుకులచెలి, వలిమలపట్టి, గట్టులదొర మున్నగు అచ్చతెనుగు పదములను సందర్భోచితముగా కవయిత్రి ఉపయోగించినది.

ప్రబంధోచిత రీతిలో గిరిజాకల్యాణమును రచించి సరసకవయిత్రి గంటి కృష్ణవేణమ్మగారు కవయిత్రులయందు పేరుగాంచినారనుటకు సందియము లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సైరంధ్రి

గంటి కృష్ణవేణమ్మగారి రచనలో 'గిరిజా కళ్యాణము' తరువాత ఎన్న దగిన చిన్న కావ్యము 'సైరంధ్రి'. దీనిని కూడ బ్రహ్మశ్రీ గడియారము శేష శాస్త్రిగారు పరిష్కరించినారు. దయార్ద్రహృదయులైన శతావధాని వెంకటశేష శాస్త్రిగారు కృష్ణవేణమ్మగారి కవితలన్నింటిని చక్కగా దిద్దినారు. ఈ పద్యము లను ఉదారహృదయులగు శ్రీ కె. యస్. కేసరిగారు తమ గృహలక్ష్మి పత్రిక యందు ముద్రించి ఆంధ్రలోకమునకు వెల్లడించిరి. తరువాత వారి సహాయముననే ఈ 'సైరంధ్రి' అను చిన్న కావ్యము పుస్తకరూపమున వెలువడినది. 'శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా' శతకమును రచించిన కొలది కాలమునకు 1941 లో ఈమె భర్తగారి హఠాన్మరణముతో కవయిత్రి దుఃఖసాగరమున మునిగిపోయినది. పది సంవత్సరముల కుమారునితోను, పదమూడు సంవత్సరముల పుత్రికతో వారి స్వగ్రామమైన ప్రొద్దుటూరునకు చేరినది. అప్పుడు ఆమె భర్తగారి బాల్య మిత్రులు శ్రీ ఆర్. నారాయణరావుగారు, వారి సతీమణి సావిత్రీదేవిగారు కవ యిత్రికి బాసటగా నిలచి, ఆమె ఏకైక పుత్రుని పురోభివృద్ధికి మార్గమును చూపి నారు. అనదయైన కృష్ణవేణమ్మగారు హృదయశాంతికి భారతమును చదువుచున్న సందర్భమున, పాండు మహీపాలుని కోడలు, పాండవుల ధర్మపత్నియైన ద్రౌపది సైరంధ్రియై విరాటరాజు గృహమున ఊడిగములు చేయుచు, అజ్ఞాతవాసమునందు వగచుచున్న ఘట్టమును చదివినపుడు వారి మనసునందు కలిగిన వేదనారూపమే ఈ లఘుకావ్యము. ఈ కావ్యమును అట్టి దుఃఖభరిత హృదయముతోడనే రచించి, గతించిన తన పతిదేవున కంకితమొనరించుకొనినది.

పతికి అంకితమొనరించిన పద్యములు :

అంబరచుంబియై యలరునట్టి మహోన్నత సౌధమందునే
సంబరమొప్ప నీవెనుక ఛాయక్రియన్ విహరించునాడు నె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

య్యంబున గావ్యగోష్ఠిని నహర్నిశలున్ దుటబుచ్చునాడు ని
క్కంబిదియంచు నాసరి జగంబున లేరని విప్రవీగితిన్.

నాటి దినములు జనెరెప్పపాటు లోన
నిపుడు నిముషాలె యుగములై యేగకుంట
నీవు నేర్పిన విద్యయే నీకు మరల
నప్పజెప్ప వ్రాసితిని గావ్యంబు నిట్లు.

సతికేడు గడయు బతియును
గతినాకు గురుండ వీవ కరుణాంబుధి స
మ్మతిగొను పద్యకుశేశయ
మతిభక్తిన్ నీ పదముల కర్పణసేతున్.

భర్త వియోగ దుఃఖముచే ఆమె హృదయ భాండమునుండి వెలువడిన ఈ కవితా వాహిని మనసునకు ఆవేదనను కల్గించును.

ఈ కవిత రసవత్కావ్య ఖండము. ఈ కావ్యము ప్రాచీనకావ్య రచనా ధోరణిలోనే సాగినది. 'అవతారిక' అని ప్రత్యేకముగా పేరుడకున్నను దీనికి అవతారిక కలదు. అవతారికయందు గిరిజాకళ్యాణావతారిక యందలి పద్యములు గలవు. జ్ఞానాంబానాయకుడైన కాళహస్తీశ్వరుని ప్రార్థన కూడ కలదు.

ఈ కావ్యము యొక్క ఎత్తుగడ ఒక చక్కని నాటకీయతా దృష్టితో ప్రారంభింపబడినది. అది ప్రశాంతమైన రేయి. అల్లనల్లన పిల్లగాలి నడయాడు నట్టి వేళలో, మింటచుక్కలరాజు మెరయుచున్నాడు. అట్టి ఏకాంత సమయమున ఒక కాంతవచ్చి నిల్చి తనలోతానే పలికినట్లు రచించబడినది. ఈ సంఘటన మనకు కన్నులకు గట్టినట్లుగా వర్ణింపబడినది. అట్లు ఆ ప్రశాంత నిశీధి సమయములో నిలిచిన కాంత 'సైరంధ్రి'యే. ఆమె మనోగతవేదనమే ఈ కావ్యము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎంతటి వేదనా భరిత కావ్యమైనను దీనియందును ప్రబంధ ధోరణిలో వర్ణనలు సాగినవి. దుఃఖములో నున్నను, సుఖములో నున్నను రసభరిత హృదయము ఎప్పుడైనా రసగుళికలను పోలిన పద్యములనే అల్లగలుగునేమో! కవయిత్రి నిశావర్ణనము చేయుచు వ్రాసిన పద్యము హృద్యముగా నున్నది.

సీ. ఉపవన పద్మాకరోర్మికాతరులకు
శీతకరుడు వెండి పూతపూయ
వెండి పూతబెడంగు వింతసోయగముల
తరువులు నిలువెల్ల విరిసి వెలయ-
మలసిన యలయిక దొలగ సమీరుండు
థిరముగా నిలిచి నిద్రించుచుండ
మర్త్యభూమీశ హర్మ్య తలంబులు ప్రశాంత
ముగ నిల్చికొని మౌనముద్రనూన
ప్రకృతి చిత్రార్పితంబైన పగిదిదోప
రాజశుద్ధాంతమున నిద్రరాక నాళ
నాళము ద్రేకమున బొంగ నాతియొకతె
బోనులోపడి పులియట్లు ప్రొద్దుపుచ్చు.

కవయిత్రి వేదనతో తనకు నిదురలేక అర్ధరాత్రి తిరుగుటకు అనుభూతి చెందినదై సైరంధ్రియందాభావము నారోపించి రచించిన ఈ పద్యము కవయిత్రి మానసికావస్థకు దగ్గరగా నున్నది. కొన్ని పద్యములు సైరంధ్రి మానసికావేదన పూర్తిగా కనుపించునట్లు వ్రాయబడినవి. ఏకాంతమున నిలిచిన ద్రౌపదికి-

అగ్ని హృదయములో మండుచుట్లు.దోప
కన్నులరుణారుణంబులై క్రాలుచుండె
మానవతులగు సతులవమానమునకు
నోర్తు రే శివములునీడ నోర్తు గాని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనలమునందు పుట్టిన మహా మహిమాన్వితమైన ద్రౌపది రోసము, అభిమానము, విహ్వలభావము పెనగొనగా పాణితలకుంచిత కోమలగండ భాగయై నిలిచినదట. చీకటిలో నిలచిన 'సైరంధ్రి' యొక్క మనమున గలిగిన ఆలోచనలనూ సంచారి భావములను, ఆమె కపోలమునందు చేయి చేర్చి నిలచిన తీరు, కవయిత్రి కన్నులకు కట్టినట్లు వర్ణించినది. ఒంటరిగా ఆ నిశీధిలో నిలిచిన ద్రౌపది మనసునందు మాధవుని, ధర్మజుని, పాండుపుత్రులందరిని కూడ, ఒక్కొక్కని తలచి తలచి బాధపడిన విధము కవయిత్రి వర్ణించినది.

ధర్మజునకు గల ద్యూత వ్యసనమును గూర్చి చింతించిన సైరంధ్రి-

రాజు నిజ ప్రజావళికి రక్షకుడంతియగాని స్వేచ్ఛగా
నోజ సెడంగ భూతలము నొడ్డగవచ్చునె, యొడ్డెబోమహా
తేజులు తమ్ములున్ నయ విధిజ్ఞులు పెద్దలు గూడ గాదనం
గాజనదే? యమాయిక జగంబున ధర్మము లిట్లు సెల్లునే.

అని వాపోయినది. రాజ్యలక్ష్మి వీరభోజ్యమగును. కాని, శాంతులైనవారి యొద్ద నుండునా, చేకొనుమని రాజ్యమిచ్చుటకు అది యేమి పెన్నముద్దయా? ఓర్పుతో ముచే దాయలను యముని పాలొనరించి స్వధర్మ పద్ధతిచే రాజ్యమును గొనవలయును కాని శాంతము వలన పని కాదని భర్త యొక్క శాంతగుణమును తలపోసినది.

చక్కని, చిక్కని శైలిలో రచింపబడిన ప్రతి పద్యము నందును ద్రౌపది మనోవేదన స్పష్టముగా వర్ణింపబడినది. ఆ ఏకాంతమున ద్రౌపది బాధపడిన తీరు ఒక్క తీరునలేదు. పాండవుల బాల్యమున వారికి కలిగిన యిక్కట్లు, భీమునకు విషాన్నము పెట్టి శత్రువులు చంపబూనుట, లక్కయిల్లు కాల్చిన విధము, తనను దుశ్శాసనుడు, సైంధవుడు, కీచకుడు అవమానించిన సందర్భములు అన్నియు తలచి, ఎన్ని కష్టములు సంభవించినను ధర్మరాజు శాంతస్వభావముతోనుండుట చూచి దుఃఖముతో, అవమానముతో ఒకపరి కరుణ రస భరితముగా, మరియొకపరి వీర రసము చిందునట్లుగా, ఇంకొకమారు రౌద్ర భయానకరసములను పద్యముల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నుంచి వెలువరించుచు ద్రౌపది తనలో తాను పలికిన మాటలను, భావనా తీవ్రతతో రచించి ద్రౌపదిని సజీవమూర్తిగా మనకన్నులముందుంచిన కవయిత్రి కవితా నైపుణ్యమెంతయు అభినందనీయము. స్త్రీ హృదయములోని బాధను స్త్రీలే చక్కగా నెరుగజాలుదురను మాట కవయిత్రి స్థిరమొనరించినది. దాయాదులచేత అవమానింపబడిన ద్రౌపది హృదయమునిట్లు ఎరుకపరచినది.

పుడమినాకన్న కష్టముల్ పడినవారె
గలరు దమయంతి మొదలుగా గాంతలెల్ల
గాని సభలోన దాయాదివానిచేత
నీడ్వబడిరొక్కొ సిగబట్టి యింతులెందు?

ఇందు పాపివానిచేత పరాభవింపబడిన ద్రౌపది హృదయ వేదన తెలుపబడినది

ఈ చిన్ని కావ్యమున నూటికి మించిన పద్యములు మాత్రమే యున్నవి. కాని ఒక్కపద్యము కూడ రచనా శిల్పములో తక్కువగాలేదు. చక్కని భాషా పనిమకొసంగిన ఈ పద్యములలో ప్రతి పద్యముకూడ చక్కని శైలితో కూడి యున్నది.

తన వలువలు వలిచి దాయాది అవమానించిన సమయమున తాను ప్రార్థించుటచే గోవిందుడు రక్షణచేసెనవిధము, అంకపీఠమునకు సన్నచేసి రమ్మనిన దుర్యోధనుని దురభిమానత్వమును, అన్నియు తలచి తలచి తన భర్తలైన - భీమార్జునులు వారిని హతమార్చిన గాని తన మనసునకు శాంతిలేదని రోషాగ్నితో జ్వలించిపోయినది ద్రౌపది. వ్యథాభరితమైన మనసులో నిలచిన ద్రౌపదినిట్లు వర్ణించినది కవయిత్రి.

చెక్కిట చెయి చేర్చి చెదరని దృష్టిచే
మినుగాంచె వింతేమి గనెనొయందు
దనలోన దానే తాదవిలి సంభాషించె
సంతనిగూఢ రహస్యమేదో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేడినిట్టూర్పుల వేమారువెడలించె
    హృదయమందే యగ్ని రగులుకొనెనో
బొమముడి వైచుచు బొరిబొరి తలయూచె
    నే కార్య నిశ్చయంబెంచుకొనెనొ
బయలు పరికించు దానేమిభయముగనెనో
    మౌనమువహించె నేమనిమదిదలచెనో
వెగటునవ్వులు పెదవులు విరియుటేమొ
    భీకరాకృతియై కొమ్మ పెదవిగరచె?

ఎడతెగని అవమాన జ్వాలాతప్తమానసయగు ద్రౌపది రూపమును ఈ చిన్ని కావ్యమున చిత్రమును దిద్దినట్లుగా, వ్రాసి సహృదయుల కన్నుల ముందుంచెననుటలో అతిశయోక్తి లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజరాజేశ్వరీ శతకము

గంటి కృష్ణవేణమ్మగారి రచనలలో 1979 వ సంవత్సరమున వెలువడిన గ్రంథము రాజరాజేశ్వరీ శతకము. వారిచే రచింపబడిన గిరిజా కళ్యాణమునకు సాహిత్య అకాడమీవారు అయిదు వందల రూపాయలను సహాయమొనరించినారు. తరువాత మరల వారి గ్రంథముల ముద్రణ కొరకు రు. 750-00 లను ఇచ్చినారు. కవయిత్రి గంటి కృష్ణవేణమ్మగారి రచనలన్నియు సాహితీ లోకమున శాశ్వతస్థాయి నంది నిలచియున్నవి. ప్రస్తుతము రాజరాజేశ్వరీ శతకమును పరిశీలింతము.

కవయిత్రి శతకమునకు ప్రారంభమున గురుస్తుతి యొనరించినది.

గురుస్తుతి :

గురుడు నాగపూడి కుప్పు స్వామయ్యాచార్యుండు
తల్లి లక్ష్మమాంబ తండ్రి రామ
శర్మ పాదములకు సాగిలిబడి మ్రొక్కి
శతకమేను వ్రాతు సమ్మదమున.

గురుస్తుతి తరువాత భర్త వెంకట సుబ్బయ్యగారిని తలంచినది.

ఆంగ్లమున పట్టభద్రుడై యలరువాడు
ఉభయ భాషాప్రవీణుడై యొప్పువాడు
భర్త వేంకట సుబ్బయ్య పాదములకు
భక్తి ప్రణమిల్లి శతకంబు పలుకుదాన.

ఇందు తొంబది నాలుగు పద్యములు కలవు. ప్రారంభ పద్యముతోనే కవయిత్రి మధుర నిష్యంది లేఖిని నుండి వెలువడిన కవితామృతమును మనసారగ్రోల వచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజరాజేశ్వరీ దేవిని ప్రస్తుతించిన ప్రారంభ పద్యము హృద్యముగా నున్నది.

కవి సంస్తుత్య పదారవింద విలసత్కంజాత పత్రేక్షణా
శివ వామాంక విభూషితోజ్వల బుధిస్యేవ్యాంఘ్రి సంశోభితా
నవనీలోత్పల నీలదేహ లతికా నాదాత్మికా శాంకరీ
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీ రాజరాజేశ్వరీ.[1]

కవయిత్రి అవివేకమను అంధత్వముచే దేవి పదముల నర్చింపజాలననియు తన అవివేకాంధ్యమును మాన్పుమనియు దేవిని ప్రార్థించినది.

అవివేకాంధ్యము చేత నీ పదములన్నర్చింప లేనైతినా
రవికోటి ద్యుతి వెల్గు నీచరణ సద్రాజీవకాంతిచ్ఛటన్
అవివేకాంధ్యము మాన్పి బ్రోవుము సదా అర్చింతు కామేశ్వరీ
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీ రాజరాజేశ్వరీ.[2]

ఈప్సితార్థ వరప్రదాయినియైన రాజరాజేశ్వరిని కవయిత్రి ప్రార్థించిన విధము రమణీయముగా నున్నది.

నవరత్నాంచిత కావ్యభూషణ పటానాగేంద్ర హారోజ్జ్వలా
స్తవ సుప్రీతిమతంగమౌని తనయా దధ్యాన్న సక్తామనో
భవసంప్రార్థిత మీప్సితార్థ వరదా బ్రహ్మాండ భాండోదరీ
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీ రాజరాజేశ్వరీ.[3]

భరతమాత పూర్వ వైభవమును స్మరించుకొనుచు కవయిత్రి వర్తమాన కాలమున కలుగుచున్న దౌర్భాగ్యపరిస్థితులకు వేదన చెందుచు ఇట్లు పల్కినది:

---

1. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 1.
2. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 6.
3. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 8.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సువిశాలంబగు భారతావని బుధస్తుత్యంబు ధర్మాత్ములా
హవదోర్వీర్య పరాక్రమోజ్వలులు నిత్యానందముల్ గూర్చి ప్రా
భవమేపారగ నేలినారు యిపుడీ దౌర్భాగ్య మెట్లాయెనో
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీ రాజరాజేశ్వరీ.[1]

అవిరామమైన కృషిని సల్పి పంట పండించు రైతు కష్టములలో మ్రగ్గుట గాంచి కవయిత్రి మనసు నవనీతమువలె కరగి వేదనాశ్రువులను కురిపించినది.

అవిరామ కృషి సల్పి సర్వులకు మృష్టాన్నంబు లందించుచు
న్నివసింపంగను కొంపలేక కడుపే నింపింపలే కాకటన్
అవనిన్ మ్రగ్గెడి రైతు రాజ్యమనగా నాశ్చర్యమై తోపదే
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీ రాజరాజేశ్వరీ.[2]

దివారాత్రములు కష్టించి, పూటగంజికి లేని రైతును గాంచి వ్యథతో కవయిత్రి తన వేదనను తెల్పుచున్నది.

అవుగా కేమన జెల్లునమ్మ జగతిన్ అన్యాయమే నాయమై
రవికోటి ద్యుతి వెల్గుచున్నది దివారాత్రంబు కష్టించు మా
నవుడీనాడొక పూట గంజికిని నోచన్ లేక యల్లాడెడిన్
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీరాజరాజేశ్వరీ.[3]

కష్టజీవి రైతు నివసించు ఇంటిని, అతని పరిసరములను గాంచి ఆవేదనతో దేవికిట్లు విన్నవించినది కవయిత్రి కృష్ణవేణమ్మ గారు.

---

1. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 9.
2. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 11.
3. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 13.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవిగో గాంచుము జీర్ణమై శిథిలమౌ ఆ పూరిపాకల్ అవే
నివసింపగ మహాత్మ్యముల్ పశుపులే నేస్తంబు సుక్షేత్రమే
శివుగర్భాలయమంచు గొల్చురయితున్ శీతాంశు బింబాననా
శివగంగా నగరాధివాసిని శివే శ్రీరాజ రాజేశ్వరీ.[1]

ఈనాడు పేదలపాలిటి కల్పతరువులైన వారు నూటికొక్కరుందురు అను భావమును తెల్పుచు ఈ పద్యము రచియింపబడినది.

ఎవరో నూటికి కోటికొక్కరుగదా యీనాడు నిస్వార్థులై
అవనిన్ పేదలపాలి కల్పతరువై అన్యాయముల్గాంచి బాం
ధవముల్ నేస్తములంగణింపక యదార్థంబెంచి చేకూర్చగా
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీరాజరాజేశ్వరీ.[2]

పైపైకి దూసుకొని వచ్చు వృద్ధాప్యముతో, కవయిత్రి శారీరకముగా అలసిపోయినది. ఆమెకు చిన్ననాడే భర్తగారు పోవుట, ఇద్దరు పిల్లలతో జీవితము గడుపుట కష్టమైనదని ఆమె 'సైరంధ్రి' కావ్యము వలన తెలిసినది. ఇక వయసు పడమటి ప్రొద్దుకు వ్రాలిన పిదప రచించిన శతకములో ఆమె తన బాధను తెలిపినది.

నవయం జొచ్చెను యింద్రియంబులు మదిన్ నానాటికిన్ మాంద్యమున్
గవయం జొచ్చెను చింతవంతలను విజ్ఞానంబు క్షీణించియే
చవ సంబో, నిముసంబొ యెందొ తనువున్ ద్రెళ్లంగ వేళయ్యె
శివ గంగానగరాధి వాసిని శివే శ్రీరాజరాజేశ్వరీ.[3]

మానవునికి వయసు పైబడుచున్నపుడు వేదాంత ధోరణి యలవడును. స్వార్థధోరణి విడనాడును. కాని వయసు జారిపోయినను సంసార తాపత్రయము

---

1. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 16.
2. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 17.
3. రాజరాజేశ్వరీ శతకము - పద్యం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విడువనివారు మూర్ఖులుగా భావింపబడుదురు. కవయిత్రి విద్యా సంస్కృతులకు నిలయమైన మహిళ. ఆమె అందుకే "ఋణానుబంధరూపేణ పశుపత్నీ సుతాలయా" అను సూక్తిని తాను తెలిసికొని, నలుగురికి చెప్పుచున్నది.

ఇవి నాయిండ్లు కళత్రమియ్యది సుతుండీతండు నావాడునా
యవి యీసంపదలేను పెంచితనుచున్ ఆనందమున్పొందుటా
నవివేకంబున, శాశ్వతం బెసెరి నిత్యంబౌనె దేహంబుశ్రీ
శివగంగా నగరాధి వాసిని శివే శ్రీ రాజరాజేశ్వరీ.[1]

ఈ విధమగు నీతిబోధకమైన పద్యములతో, మనోల్లాసమును చేకూర్చుచు హృదయమును భక్తిపూరిత మొనరింపచేయు ఈ రాజరాజేశ్వరీ శతకమును కవయిత్రి ఇంచుమించు తన షష్ఠిపూర్తి అయిన పిదప రచించినట్లు భావన కలుగుచున్నది.

పద్యములన్నియు ధారాళమైన శైలిని రచింపబడినవనుటకు కొన్ని పద్యములనుదహరించితిని. పుస్తకమునందచ్చుటచ్చట అచ్చు తప్పులు కొన్ని దొరలినవి. అది కవయిత్రి దోష మనలేము. కాని మిగిలిన పద్యములన్నియు ధారాశుద్ధి కలిగి పఠనాసక్తిని కలిగింప జేసినవి. శతకమునకు అంతమున కూడ కవయిత్రి భరత భూమి యశస్సునే కోరుచూ దేవిని ప్రార్థించినది.

అవివేకంబుల దంచి ధర్మపదమందాసక్తి చేకూర్చిమా
నవులన్ సత్యము, శాంత్యహింసలను విజ్ఞానంబు బోధించి శాం
భవి యీ భారత భూమి పుణ్యనిధియై భాసిల్లగా జేయుమా
శివగంగా నగరాధి వాసిని, శివే శ్రీ రాజరాజేశ్వరీ.[2]

---

1. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 25.
2. రాజరాజేశ్వరీ శతకము - పద్యం 94.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సరస కవయిత్రి గంటి కృష్ణవేణమ్మగారు రచించిన ఈ రాజరాజేశ్వరీ శతకము సరళ శైలితో కూడి, భక్తి భావమును కల్గించు విధముగా రచింపబడినది. ఇందు కవయిత్రి దేశాభిమానము, మానవతావాదము కూడ కొన్ని పద్యములలో కానుపించినది. ఈ రాజరాజేశ్వరీ శతకము శతకశ్రేణిలో చేరి కవయిత్రి పేరును స్థిరముగా నిల్పినది.

ఈ కవయిత్రి రచనలగు, గిరిజా కళ్యాణము, సైరంధ్రి, రాజరాజేశ్వరీ శతకములు పరిశీలనమొనరించినాను. ఇతర శతకములు లభ్యము కాలేదు.

డా॥ కె. యస్. కేసరిగారిచే స్వర్ణకంకణ గ్రహీతయై ఈ కవయిత్రి మహిళా లోకమున చిర కీర్తి నొందినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గిడుగు లక్ష్మీకాంతమ్మ
(1951)

ఒకవైపు గృహిణీ ధర్మముల ననుసరించుచు, తన పదిమంది సంతానమును ఓర్పుతో పోషించుచు, లాలింపుచు, మరొకవైపు తెలుగు భాషామతల్లికి యెనలేని సేవ యొనరించిన సతీవతంసము గిడుగు లక్ష్మీకాంతమ్మగారు. ఆమె ఎంతో సహనము, దీక్ష, కార్యదక్షత గలిగిన మహిళ అనుటకు ఆమె రచనలే ఉదాహరణములు. పవిత్రమైన ఆశయములతో రచించిన ఆమె కవితలన్నియు కమనీయమై, నీతిబోధకములై యొప్పుచున్నవి. రమణీయమగు రచన లొనరించి, సాహిత్యాంబర వీధిలో కాంతులను వెదజల్లిన కవయిత్రులందరి సరసన నిల్చిన కవయిత్రీమణి గిడుగు లక్ష్మీకాంతమ్మగారు.

లక్ష్మీకాంతమ్మగారి తల్లిదండ్రులు శ్రీ వక్కలంక గవరరాజుగారు, చెల్లాయమ్మగారు. లక్ష్మీకాంతమ్మగారు రాజమహేంద్రవరమున 1903 ఫిబ్రవరి నెల మూడవ తేదీనాడు జన్మించినారు. ఈ కవయిత్రి మాతామహుల వంశమువారు కవిత్వాభిమానులు. మేనమామల ఇంట కవిత్వ వాతావరణమున పెరుగుటచే వీరికి సద్విద్య లభించినది. బాల్యమున చదువుచున్నపుడే వివాహము జరిగినది.

వ్యావహారిక భాషాభివృద్ధికి పాటుపడిన శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారి అన్నకుమారుడైన శ్రీ గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారు ఈ కవయిత్రి భర్త. వెంకటరామమూర్తిగారు కూడ మంచి కవి, పండితుడు. విద్యాశాఖయందు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉద్యోగపదవియందుండిరి. పంతులుగారు, భార్యయైన లక్ష్మీకాంతమ్మగారికి, చెల్లెలైన శారదాంబగారికి కవిత్వాభ్యాసము చేయించినారు. భర్త చెంతనే సంస్కృత కావ్యపఠనము కూడ యొనరించినదీ కవయిత్రి. కేసరిగారు 1951 వ సంవత్సరమున వీరికి స్వర్ణకంకణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బహూకృతి నొసంగి సన్మానించినారు. వీరి కాలమునందు కొల్లాపుర మునందు (మహబూబ్‌నగర్ జిల్లా) "స్నేహలతా కవితా సంఘ"మను నొక సాహితీమండలి ఉండెను. అందు గిడుగు లక్ష్మీకాంతమ్మగారు, శారదాంబగారు కూడ సభ్యు రాండ్రుగా నుండిరి. ఆ సంఘమునకు అధ్యక్షులైన వాజపేయ యాజుల రామ సుబ్బారాయడు గారు నూతన రచయిత్రులకు, రచయితలకెంతో ప్రోత్సాహమిచ్చి ఆ సంఘమునుండియే వారి కవితలను ముద్రింపించుచుండిరి. లక్ష్మీకాంతమ్మగారి రచనలు ఆ స్నేహలతా కవితా సంఘమునుండియే ముద్రింపబడినవి. వీరి గ్రంథములన్నియు యెక్కువగా శారదాంబగారి పేరు కూడ కలిపి 1. లక్ష్మీ శారదాగీతములు, 2. లక్ష్మీ శారదా శతకములు, 3. లక్ష్మీ శారదా సుభాషిత ములు అని కలవు. 'లేఖదూత' అను చిన్న కావ్యము వేరుగా గలదు. ఇవికాక 1. తిరుపతి వేంకటేశ్వర శతకము, 2. రామచంద్ర శతకము, 3. కన్నీరు అనునవి అముద్రితములు. వీరి కవితలలో 'లేఖదూత' అను కావ్యము నిప్పుడు పరిశీలింతము.

లేఖదూత

గిడుగు లక్ష్మీకాంతమ్మగారి భర్తయగు వెంకటరామమూర్తి పంతులుగారు ఉద్యోగ రీత్యా కృష్ణాజిల్లా, నూజివీడు గ్రామమునుండి అనంతపురం జిల్లా 'కదిరి' గ్రామమునకు బదిలీ చేయబడిరి. అట్లు పోవుట భార్యాభర్త లిరువురికిని ఇష్టము లేకుండెను. అయినను ఉద్యోగ నిర్వహణయందు ఎడబాటు తప్పనిది. ఒకరినొక రెడబాసి ఐదు మాసములు గడిపిరి. ఈ వియోగావస్థయందు దంపతులు పరస్ప రము వ్రాసికొన్న లేఖలు పద్యరూపములోనే ఉన్నవి. భార్యాభర్త లిరువురు కూడ కవితా రచనా కుశలు రగుటచే, వారి లేఖినినుండి వెలువడిన ప్రతి పదమూ పద్యముగానే మారినది. ప్రేయసీ, ప్రియు లిరువురు వేరు, వేరు ప్రదేశములందుండి వియోగావస్థను పొందుటను విప్రలంభ శృంగారముగా పరిగణించబడినది. ప్రాచీన కావ్యములలో ప్రేయసీ, ప్రియులంపుకొనిన ప్రణయ వార్త లెన్నియో రచియింప బడినవి. వారి మధ్యన దౌత్యమొనరించిన హంస, చకము మున్నగువాని కథలు కలవు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రసిద్ధ కవియగు కాళిదాసు, యక్షునికి ప్రియకాంతతో కలిగిన విరహావస్థలో సందేశకర్తగా మేఘుని నిలిపినాడు. ఆ పేరుతో 'మేఘసందేశము, మేఘదూతము' అని పిలువబడినవి. "పవనదూత, ఇందుదూత, హంసదూత" అను కావ్యములుగూడ కలవు. [1]

నలదమయంతుల మధ్యన హంస సందేశకర్తగా నుండినది. ప్రభావతీ ప్రద్యుమ్నము నందు శుచిముఖి దౌత్య వ్యవహారమొనరించినది. ఆధునిక కాలము వచ్చువరకు తపాలా శాఖలు ఏర్పడుటచే ప్రతివారికినీ లేఖలే దూతలైనవి. ఈ దంపతుల నడుమ నడచిన లేఖలలో పరస్పర అనురాగ ప్రకటన, సంతానము యొక్క క్షేమవార్తలు మాత్రమే రచింపబడినవి. కాని శృంగార భావ ప్రకటన లెచ్చటను లేవు. వీరువురు వ్రాసికొనిన లేఖలలోని కొన్ని పద్యములనేరి, ఖండ కావ్యముగా ప్రచురించినారు. ఇందు రెండు భాగములు గలవు. మొదటి భాగమున భార్యాభర్తల లేఖలు, రెండవ భాగమున లక్ష్మీకాంతమ్మగారు వియ్యపురాలైన నిడమర్తి అంక రాజేశ్వరమ్మ గారితోను, తోడికోడలు రామలక్ష్మితోను జరిపిన ఉత్తరప్రత్యుత్తరములు పద్యరూపమున నున్నవి. ఏమైనను స్త్రీ విద్యయే, కఠినమైన ఆ రోజులందు చక్కని పాండిత్యమును పొంది భర్తగారితో పద్యరూపమున లేఖారచన మొనరించినట్టి లక్ష్మీకాంతమ్మగారు ప్రశంసనీయురాలు.

7975

లేఖదూత : కవి మిథునము వ్రాసికొనిన ఈ లేఖలయందలి పద్యము లన్నియు నాతికఠినముగా నుండి స్వాభావికమైన ప్రేమరసవాహినిని ప్రవహింప చేయుచున్నవి. ముందుగా కవిటినుండి 7-9-34 నాడు గిడుగు వెంకటరామమూర్తి గారు వ్రాసినారు. మొదటిసారిగా భార్యా పిల్లలను వీడి దూరపు దేశమునకేగిన రామమూర్తిగారు భార్యా, పిల్లల క్షేమము నరయుచు వ్రాసిన లేఖయందలి పద్యములలో నొకటి.

ఉ. శ్రీకాంతామణి - నీవును, నీదుపిల్లలును నేరుపుమీర సుఖమ్ము గాంచుచున్
భావిశుభోదయమ్ములను భావన జేయుచు నుంటిరంచును

---

1. లేఖదూత - తొలిపలుకు - అచ్యుతుని వేంకట చలపతిరావు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ధ్యానమునందు దేటపడ బల్మరు లేఖల వ్రాయుచున్నచో
దైవముమీద భారమిడి ధైర్యముతోడుత నుండు నెచ్చెలీ.

దూరప్రదేశమున నుండిన భర్తలేఖ అందుట తోడనే నూజివీడునందున్న కవయిత్రికి భర్తను చూచినట్లే అయినది. తన పతి కన్నులముందు నిలిచినట్లు ఎల్లప్పుడూ భావించినట్టి, ఆ కవయిత్రి వెంటనే పద్యములలోనే బదులు చెప్పినది.

ఉ. ధీవరమిమ్ము వీడుచు విదేశమునన్ వసియించి యున్నమీ
భావము నిర్మలంబగుట, బాయని ప్రేమను జూచుచుంటమా
కేవిధమైనలోటు నిసుదెన్నడు గల్గదు. ఇంక మమ్ములన్
దైవముతోడునీడ యయి తప్పక, గాచుచునుండు నమ్మిలిన్.

అని బదులు వ్రాసినది. భర్త ఎడబాటును సహింపలేక తన పూర్వకర్మమును దూరుకొనుచు కవయిత్రి 21-9-34 నాడు వ్రాసిన లేఖలో పద్యమిట్లు గలదు:

చ. ఎరుగకపూర్వ జన్మమున నేమిథునంబుల బాయజేసియా
తెరుపున నవ్వుచుంటినొ, ధీవర, నాయఘమట్టిదౌనె, దు
స్తరమగుచుండె మిమ్ము నిమిసంబయినన్ విడనట్టిదానినీ
కరణి గలంగుచుంటకగు కారణమయ్యెది యంచునెంచెదన్.

అని తన బాధను వ్యక్తపరచి 'కష్టములెల్ల వీడవొకొ గాలి దగుల్కొను మేఘ మట్లు' అని తన ఆశను తెలుపుచు మూర్తిగారికిట్లు వ్రాసినది:

ఉ. కష్టములిండ్లు గట్టుకొని కాపురముండున యేడనైనను
ద్దోష్టిని ధైర్యమూని కడుతోషములో జయియింపుచున్న నా
కష్టములెల్ల వీడవొకొ, గాలిదగుల్కొను మేఘమట్లు సం
తుష్టిని గూర్చి యాపిదప దూగగ జేయవె సౌఖ్యసంపదల్.[1]

---

1. లేఖదూత - లేఖ 21-9-34.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బద్ధానురాగమైన కాంతను మూర్తిగారు, ఊరడించుచు, తన పిల్లల క్షేమ మరయుచు లేఖ వ్రాసినారు. వారి లేఖ అందగానే సంతసముతో బదులిడినది కాంతమ్మగారు. సంతసముతో పాటు వియోగబాధను వెలిబుచ్చినది.

చ. స్థిరమతిపూర్వజన్మమున జేసిన నాసుకృతమ్ముకల్మినో
వరగుణ సాంద్ర నీ చెలిమి బట్టితి బట్టినదాది జూడనా
కరమరలేని సౌఖ్యములె యబ్బుచునుండె నటంచు నెంతయేన్
మురియుచు బొంగుచుండ విధి బూనగజేసెవియోగవేదనన్.[1]

వియోగవేదనతో ఒకవైపు కుములుచూ, మరియొకవైపు భర్తగారికి ధైర్య వచనములు తెలిపినది. 14-10-34 లేఖయందిట్లు వ్రాసినది:

గీ. కష్టసుఖములు సమమౌచు కాలగతిని
ననుసరింపుచు బోయిన యంతమునకు
గలుగకుండునె సర్వసౌఖ్యంబులెలమి?
వేరెనే జెప్పనేలనో విమలచరిత.

అని భర్తకు ధైర్యవచనములు తెలిపినది. భర్త కొత్త ప్రదేశమున చరియింపు చున్నపుడు ఆయా ప్రదేశములయందలి కొత్త విషయములను వ్రాయుమని ఉత్సుకతతో బదులిడినది. దూరముగా నున్న భర్తను తలచుకొనుచు, పిల్లలందరి చదువు, సంధ్యలను శ్రద్ధతో పరిశీలింపుచు ఒంటిగనున్నపుడు చింతతో పతికి తన బాధను తెల్పెడిది.

ఉ. పిల్లల కోడినొట తెరపించుక లేదిక నేమిసేతునే
నిల్లును దిద్దుకొంచు నొక యించుక తెన్నొక టబ్బెనేని నే
నుల్లసమంది యత్తరిని నోపిక దెచ్చుక కొన్ని పద్యముల్
జల్లగ వ్రాయజూతు సుమ చారుగుణాకర శ్రీ మనోహరా.[2]

1. లేఖదూత - లేఖ 2-10-34.
2. లేఖదూత - లేఖ - 27-10-34.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పది మంది సంతానముతో ఆమె కెన్నియో యింటి బాధ్యతలు కలవు. అయినను మనసుననున్న ప్రేమచే కొంత, భర్తగారిపైన ఆమెకుగల భయ, భక్తులచే కొంత లేఖలను తప్పక వ్రాయుచు విదేశమునందున్న భర్తకు ఉత్సాహ మును కల్గించినది.

ఉ. తల్లివి దండ్రివౌచు, మఱితాతవు, నేతవు నీవెయౌచు నీ
చల్లని ప్రేమనంత వెదజల్లుచు మాపయిజూచుచుండినా
యుల్లము రంజిలంగ దొకొ ఉమ్మలికంబెటు గల్గునాకు సం
పుల్ల సరోజ నేత్ర పొలుపొంద వచించితి నిశ్చయంబుగన్.[1]

పదిమంది పిల్లలలో పిల్లకోడివలె ఉన్న ఆ సాధ్వి లేఖలను సహనముతో పద్యములలో వ్రాయుట ఎంతయు ముదావహము. ఆమె కవిత్వ రచనా ధోరణిని జూచి భర్త యెంతో గర్వించినాడు. ఇంతటి శైలితో, శబ్ద సౌష్టవముతో, విశేష భావముతో కూడిన కవిత్వ విలాస వైఖరి భార్య కెటులబ్బినదని ఆశ్చర్య మందినాడు భర్త మాత్రమేగాదు, పఠించినవారు కూడ అబ్బురపడదగి నంతటి కవితాశైలి కలిగిన కవయిత్రి ఆమె. భర్త ఆశ్చర్యజనిత హృదయముతో వ్రాసిన లేఖకు ఆమె ఎంతో వినయముతో నూజిలీడుచుండి-

క. విరులుదయించినయంతనె
పరిమళముదయించినట్లు భాసితమయియో
వరగుణ నీ పద్యములన్
స్థిరమతి జదువంగ బ్రహ్మతేజంబొదవున్.

అని తన సహృదయమును చాటుకొన్నది.

పిల్లలు తండ్రిని గురించి 'నాన్న యెప్పుడు వత్తురమ్మా' అని అడిగినపుడు ఆ తల్లి మనసున కలిగిన ఆవేదనను వెంటనే భర్తకు తెలిపినది.

---

1. లేఖ - 11-11-34 - లేఖదూత.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. వేగమె వత్తునంచిటకు ప్రీతి లిఖించిన పద్యరత్నముల్
నేగనుచున్ బఠింపవిని యెంతయునీ దగు ముద్దుబిడ్డలున్
ఏ గడియన్ దలంచుచును 'ఎప్పుడు వచ్చెదరమ్మ' యంచు మీ
యాగమనంబుకై యెదురు నందరు చూచుచునుంద్రునిత్యమున్.[1]

అని పిల్లలు తండ్రికొరకు ఎదురు చూచు విషయమును మనసునకు హత్తుకొను నట్లు వ్రాసినది కవయిత్రి.

రామమూర్తి పంతులుగారితో పాటు కదిరిపెళ్లి కొన్నాళ్లు అచ్చట నివసించి, నూతన ప్రదేశములను, దేవాలయములను, కదిరి నరసింహస్వామిని దర్శించి, ఇంటికి చేరిన పిదప మరల లేఖ వ్రాసినది. దత్తమండలమున రామమూర్తిగారి సుగుణములను, అతని మిత్రులందరు ప్రశంసింపగా, తనకు సంతసము కలిగి నట్లు, భావియందు శుభములు తప్పక కలుగునని కోరుచు, భగవంతుని ప్రార్థించుచు చివరి లేఖ నిట్లు వ్రాసినది:

మ. పరమేశుండు శుభావలోకనములన్ బ్రాపింపగా జేయుచున్
బరమానందము గూర్చు మత్పతిని, మద్బాంధవ్యులన్ బుత్రులన్
గరమొప్పన్గనిపెట్టి సేమమిడుచున్ గాపాడి రక్షించెన
క్కరుణాసాగరు కెల్లవేళల నమస్కారంబుగావించెదన్.[2]

ప్రతి పద్యమునందును భర్త యెడలగల భక్తి, అనురాగములు, కొన్ని పద్యములందు మాతృహృదయపు ప్రేమ, ఆవేదనలు, మరికొన్ని పద్యములలో తండ్రి మనసులోని వాత్సల్యము, భర్తగానే కాక ఒక యజమానిగా, గురువుగా ఆమె కాదేశించిన విషయములు అన్నియు విపులముగా వర్ణింపబడినవి. ఇట్లు 1934 సెప్టెంబరు నుండి, 1935 జనవరి వరకు వీరిమధ్యన సాగిన లేఖలను

1. లేఖదూత - లేఖ - 2-10-34.
2. లేఖదూత - 1-1-35.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంక్షిప్తపరిచి ప్రకటించినారు. దాదాపు ఏబది సంవత్సరముల క్రింద దంపతుల మధ్య సాగిన ఈ పవిత్ర లేఖావాహిని నేటికి గూడ సజీవముగా నొప్పుచున్నది. భారత దేశమున, అందునను ఆంధ్రులలో దాంపత్య జీవితపు పవిత్ర అనుబంధము సాగినన్ని దినములు వారికి ఆదర్శముగా భావింపబడు ఈ 'లేఖదూత' అను లఘు కావ్యము చిరకాలము నిలుచును. భార్యాభర్తల అనురాగమునకు నిదర్శనమైన ఈ 'లేఖదూత' వలన ఈ దంపతులు కవితాలోకమున చిర యశస్సు నందినారు.

రెండవ భాగమున లక్ష్మీకాంతమ్మగారు తోడికోడలైన రామలక్ష్మితో నడిపిన లేఖలు కొన్ని, ఓయ్యాపురాలగు అలకరాజేశ్వరమ్మకు వ్రాసిన లేఖలు కొన్ని గలపు చివరకు లక్ష్మీకాంతమ్మగారి మరది పుత్రిక సరసహాంబకు, అలకరాజేశ్వరమ్మగారి కుమారుడు బసవరాజునకు జరిగిన వివాహమునందు వారిని ఆశీర్వదించుచు లక్ష్మీకాంతమ్మ శారదాంబగారలు, గిడుగు వెంకటరామమూర్తిగారు వ్రాసిన ఆశీర్వాద పద్యరత్నావళితో శుభాంతము అయినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్ష్మీశారదా కుమారీ నీతి

- గిడుగు లక్ష్మీకాంతమ్మగారు

కవయిత్రి లక్ష్మీకాంతమ్మగారు తమకుమార్తెలను అత్తవారిండ్లకు పంపునపుడొనరించిన నీతిబోధనలే ఈ పద్యములు. ధనధాన్యములనీయ లేకున్నను, నైతిక మార్గములనుద్బోధించవలయునను ఉద్దేశ్యముతో కవయిత్రి ఈనీతి పద్యములను రచించినది.[1] ఈ గ్రంథమును రచించుటలో కూడ ఆమె ఆడపడుచైన శారదాంబగారు చేదోడువాదోడుగా నున్నది. ఆమె గురువుగా, భావించిన భర్త శ్రీ గిడుగు వెంకట రామ మూర్తి పంతులుగారు ప్రోత్సాహకులుగ నుందిరి. ఈ పుస్తకము కూడ స్నేహలతాకవితా సంఘము వారిచేతనే ముద్రింపబడినది.

---

1. నాకు ముప్వురు పుత్రులును, ఏడుగురు కొమార్తెలును గలరు. నా కూతుల తమ యత్తవారిండ్లకు పంపునెడ, నేను వారికెక్కుడు ధనధాన్యములీయ లేకున్నను, నాయాశీర్వచన పురస్సరంబులగు నైతిక మార్గములనుబోధించు వాక్యములను పద్యరూపమగు కాన్కగనిచ్చిన, వారి మానస వీధులందు శాశ్వతముగ నిలిచి యుండి సఫలీకృతము కాగలవను ఉద్దేశ్యముతో నీపద్యములను వ్రాసితిని. ఇందుద్బోధించిన ధర్మములు ప్రపంచమునకు కొత్తలు కాకుండినను పెద్దలు నుడివిన ధర్మములనే మరల మరల నుగ్గడించుచు నిట్లుద్బోధించుట మాతృప్రేమ సూచకముగా కోవిదులు గ్రహింపకపోరని నా నమ్మకము. నాకు విద్యాబుద్ధులు నేర్పుచు నిట్టి గ్రంథముల రచించునెడ నాకు గురువులుగను, ప్రోత్సాహకులుగను నుండుటయేగాక మా కూతులకీ ధర్మమార్గముల ప్రబోధించుట యందు నాకు తోడును, నా భర్తగారును అగు శ్రీ గిడుగు వెంకట రామ మూర్తి పంతులుగారికి నమస్కారములు.

ఇట్లు బుధజన విధేయు,
శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందు నూరు పద్యములున్నవి. అన్నియు చక్కని నీతిబోధకములు: అత్తవారింటికి పోయిన పిదప కొత్తకోడలు మెలగవలసిన రీతులను కవయిత్రి లోక ధర్మములను, తన అనుభవములను అన్నియు జోడించి ఈ పద్యములను రచించినది. మంగళదాయకములైన మాటలను వచింపుమని సత్సంగతి చేయుమనియు సత్యమార్గమున చరింపుమని బోధించినది. ఆర్తిని చెందు బీదలకు అన్నము పెట్టి తృప్తి చేయవలయుననియు, భర్త మనోగతభావములను గ్రహించి ఉండవలయుననియు, పరులను దూరవద్దనియు, పరభామలను గేలిసేయవద్దనియు కుమార్తెకు నీతి గరపినది. [1] పుట్టినింటి కీర్తి నిలబెట్టుచు, అత్తవారింటికి యశము కల్గునట్లుగానడుచుకొమ్మనిచెప్పినది. [2] భర్తనెట్లు గౌరవించవలెనో చెప్పిన ఈ క్రింది పద్యమిట్లున్నది.

ఉ. అన్నము బెట్టువేళ బతిసమ్మరొ చూడుమ మాతవోలె సం
పన్నత గార్య తంత్రముల దాసిలుమమ్మరొ మంత్రివోలె భా
గ్యోన్నతులొందినన్ సతము నుత్సవమందగ ప్రాణమిచ్చి సౌ
ఖ్యోన్నత సాంప్రదాయముననుండుమ, శయ్యనురంభ బోలికన్.[3]

ఈ పద్యము చదువుచుండగనే ప్రసిద్ధమైన నీతిశాస్త్ర శ్లోకము మనసునకు స్ఫురించును.

శ్లో. కార్యేషు దాసీ కరణేషు మంత్రీ,
భోజ్యేషు మాతా శయనేషు రంభా
రూపేచలక్ష్మీ క్షమయాధరిత్రీ
షట్కర్మ యుక్తా కులధర్మపత్నీ (నీతి శాస్త్రము)

ఈ శ్లోకచ్ఛాయ పై పద్యమునందు గలదు.

1. లక్ష్మీశారదా కుమారీ నీతి - పద్యం - 4.
2. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం - 68.
3. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం - 9.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కూరిమితోడ, పతికి సంతోషమును కల్గించుచు సరికాంతలతో కలహింపక, గృహకార్యములను నెరవేర్చుకొనుచు, గృహదీపము వలె నుండుమని బోధించిన ఈ కవయిత్రి తన భర్త యింటికి దీపమువలె, వెల్గిన దనుటలో ఎట్టి సందియము లేదు.[1] వ్రతములు చేయవలయును, ఉపవాసములతోనుండవలయు నను ఆచారములను కవయిత్రి మృదువుగా తిరస్కరింపుచు తన భావమునిట్లు చెప్పినది. వ్రతములు చేసినదానికంటె, ఉపవాసములతో కృశియించుట కంటె, సతతపతివ్రతానుస్మృతి సర్వ శుభములను కలిగించునని చెప్పినది.[2] స్వజనముతో నయమున సంచరించవలయునని ఇట్లు చెప్పినది కవయిత్రి:

చ. భయమున నేరినేనియును బాల నుద్రావగ జేయనేర్తువే?
నయమున నెంతవారికయినన్ విషమీయగవచ్చుగాదె నీ
దయవిడకుండ సౌమ్యతను దప్పక నీ స్వజనంబు తోడురన్
ప్రియముగ సంచరించి నెరవేర్చుమ నీగృహకార్య పద్ధతుల్.[3]

ఈ పద్యము వంటిదే సుమతి శతకమున గల పద్యము

క. నయమున పాలుంద్రావరు
భయమున విషమ్ము నైన భక్షింతురుగా
నయమెంత దోసకారియొ
భయమే చూపంగ వలయు బాగుగ సుమతీ.

పై పద్యమున కవి భయమే మంచిదనియు, నయమున విసరనియు వ్రాసినాడు. కాని కవయిత్రి భయమున పాలను కూడ త్రావించలేము, నయమున విషము నైన కూడ త్రాగించగలమని తన అభిప్రాయమును తెలిపినది. కవయిత్రి అనుభవముననే చెప్పియుండవచ్చును. ఆద్యంతములు నీతి బోధకములైన

1. లక్ష్మిశారదాకుమారీ నీతి - పద్యం - 12, 13.
2. లక్ష్మిశారదాకుమారీ నీతి - పద్యం - 16.
3. లక్ష్మి శారదాకుమారీ నీతి - పద్యం - 41.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ పద్యములు చక్కని శైలితో వ్రాయబడినవి. కొన్ని పద్యములు దీర్ఘ సంస్కృత సమాసములతో ధారాళముగా సాగినవి. ఉదాహరణమునకీ పద్యము చూడవచ్చును.

మ. పరిపూర్ణాయత సత్కృపాగరిమ సద్వ్యాపార పారీణవై
యురు సత్ప్రక్రియ సర్వ భూతహిత సంయోగ ప్రభావార్థివై
వర మిత్ర ప్రకర ప్రబోధనమహాభాగ్యోన్నతా లీలవై
చిరకీర్తిన్ ప్రకటింపు మమ్మ గృహలక్ష్మీకాంత కాంతామణీ.[1]

ఇట్టివే సంస్కృత సమాస భూయిష్టములైన పద్యములెన్నియో గలవు. పద్యములు చదువుచున్నపుడు ప్రాచీన కవులశైలి మనసుకు తోచును. తాను పుట్టిన భూమి యందు ఈ కవయిత్రికి అభిమానము మెండు. ఆ అభిమానమునిట్లు చాటుకొన్నది:

ఉ. భారత వీరులున్ బరమభక్తులు రాజనరేంద్రుడున్ మహో
దారులు పండితుల్, స్వమత ధర్మపరుల్ జనిగన్న గౌతమీ
తీరమునందు బుట్టితివి తెన్గుపడంతివి తెన్గుతోట శృం
గారముగాగ జేయుటకుగా గృషిజేయగ దమ్మ తల్లిరో.[2]

గీ. పూత వీరాంగనల కీర్తి బోలిసతము
దేశసౌభాగ్యగరిమ సుధీరవృత్తి
గనులగాపాడు చుండుమా కనులదెరచి
భరతమాతకు బుత్రివై పరసుకతన.

తన మాతృదేశాభిమానమును చాటుకొనుచు వ్రాసిన పద్యములన్నియు భావబంధురమై యున్నవి. నీతిబోధకములైన ఈ పద్యములలో కొన్ని అంత్యాను ప్రాసతో కూడి, చక్కని తూగు కల్గియున్నవి.

---

1. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం - 46.
2. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం - 60.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. పున్నెపుబంటవై, సుగుణపుంగనివై సదసద్వివేక సం
పన్నవునై, బుధానుగుణభావ విశేష విలాసచిత్తవై
సన్నిహితాత్మ సర్వజనసన్నుత పాత్రమవౌచునిత్యమున్
మన్నన లందుచుండుమ క్రమంబుగ బ్రౌఢ సతీమతల్లివై.[1]

చ. పసితనమందు దండ్రికిని భాసుర యౌవనమందు భర్తకున్
ముసలి తనంబునందు నిజపుత్రులకున్ వశవర్తియౌచు సం
తసమున స్త్రీమెలంగుటది ధర్మము, యుక్తము శ్రేయదంబులా
యసమ సుధీమతమ్మునగు నార్షపథమ్మున సంచరింపుమా.[2]

తండ్రికి, భర్తకు, పిల్లలకు, సంతసముతో తానే స్వయముగా వశవర్తి యౌచు ఉండవలయునని, కవయిత్రి అభిప్రాయము. విద్యారంగమునందును, కవితారంగమునందును, ఆమె పూర్తి స్వాతంత్ర్యమును కలిగి కూడ తనవారికి ప్రేమతో కట్టుబడియుండుట ధర్మమని భావించినది.

వియ్యానికైనా, కయ్యానికైనా సమానత్వముండవలయును. వియ్యమొనరించి, కయ్యమునకు దిగు బంధుగులను గూర్చి ఇట్లు తెలిపినది :

ఉ. వియ్యమునన్ బరస్పరము వేయు విధంబుల సానుభూతుతై
నెయ్యమునన్ సుఖింపగల నేరుపుజూపరు స్వార్థ వృత్తినే
కయ్యము పెట్టుకొంచు బరుకష్టములెంచక నిష్ఠురంబులన్
జయ్యన జూపు బంధుగుల స్వాంతమెరుంగుము పుత్రికామణీ.[3]

సత్కులవతియైన చానకు కలిమి కంటె కూడ బుద్ధిమంతుల తోడ చెలిమి కూర్చుకోనదగినదని తెలిపినది.[4] గృహిణి ప్రతిదినము తులసికి నీరుపోసి, అరికి

1. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం - 62.
2. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం - 81.
3. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం-85.
4. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం-89.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముగ్గులు పెట్టి, భక్తితో పూజలనొనరించి గొలిచినచో శుభంబులొనగూడునని కుల సతులకు హితవు గరపినది.[1] తన లోపములను పరిశీలించుకొనవలయును కాని పరుల దోషములెంచుట పాడిగాదని బోధించినది లక్ష్మీకాంతమ్మగారు.

గీ. పరుల దోషంబు లెంచుటపాడి గాదు
తన సుకృతము జెప్పికొనుట దగవుగాదు
పరసుగుణమెల్ల భావింప భావ్యమగును
దనకుగల లోపమరయుట ధర్మమగును.[2]

కొందరు స్త్రీలు పుట్టినింటి వారిని గౌరవముతో చూచి, అత్తింటి వారిని అవ మానింతురు. అట్లు చేయక గౌరవింపవలయునని కవయిత్రి ఇట్లు చెప్పినది.

ఉ. సాదర వృత్తి జూడు సరసంబుగ నీపతి వంకవారలన్
సాదర దృష్టి జూడదగు నట్టులె నీదగు తల్లి దండ్రులన్
సోదర సోదరీ మణుల సొంపుగ నట్లిరువంకవారి భా
గ్యోదయముల్ సమానగతినుద్ధతి నొందగ గోరుమమ్మరో.[3]

కలిమి లేములందు కష్టసుఖాలలో బంధుమిత్రులతో సానుభూతితో మెలగ వలయునని కవయిత్రి తెలుపుచు ఈ క్రింది పద్యమున వివరించినది:

చ. కలిమి యొకింతగల్గు నెడ గౌరవ మిత్తురు తోడునీడలై
కలిమి యొకింత దగ్గునెడ కన్పడ కుందురు బంధుమిత్రులె
కలుములలేములన్ మనకు గష్టసుఖాలకు సానుభూతితో
మెలగెడు బంధుమిత్రులిల జిక్కుటసాధ్యము గన్న తల్లిరో.[4]

1. లక్ష్మీశారదాకుమారీ నీతి - పద్యం-93.
2. లక్ష్మీశారదా కుమారీ నీతి - పద్యం - 94.
3. లక్ష్మీశారదా కుమారీ నీతి - పద్యం - 83.
4. లక్ష్మీశారదా కుమారీ నీతి - పద్యం - 84.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కలిమిలేములు, కష్టసుఖాలు ప్రతి మనుజునికి అనుభవానికి వచ్చును. కనుక లేదనక సహకరించు మిత్రులు లభించుట ఎంతో అసాధ్యము. కలిమి లేములు, కష్టసుఖాలు కావడి కుండల వంటివని తెలియవలయును. కలలయందు కూడ అనృతము పలుకవద్దనియు, ధర్మగుణము తప్పరాదనియు, పరుష వాక్యములను పల్కుట పాడి గాదనియు, భారమైనాకూడ ఆడి తప్పగరాదనియు పుత్రికలకు హితబోధ నొనరించిన ఈ తల్లి ఎంతటి ఉత్తమురాలో, ఆమె కవితలే చెప్పును.[1]

అతిథి అభ్యాగతులను సంతృప్తులనొనరించుమనియు, పతి పదారవిందములను పూజింపుమనియు, అతిథి సంతర్పణము భాగ్యకరమనియు, తల్లి దండ్రుల పలుకు వేదముతో సమానమనియు తెలిపినది. దాన ధర్మములను విడువక, బీదసాదలను కనిపెట్టి రెండు వంశములకును కీర్తి తెమ్మని కవయిత్రి తన పుత్రికలకు ఇట్లు హితబోధ యొనరించినది:[2]

గీ. శ్రిత జనంబులనెల్ల రక్షింపుమమ్మ
దానధర్మంబులేనాడు మానకమ్మ
బీదసాదలనెల్ల గన్పెట్టుమమ్మ
రెండు వంశంబులకును గీర్తిగొనితెమ్మ.

అని కుమార్తెలను దీవించినది.

పుత్రికలకు నీతిగరపుచు వ్రాసిన ఈ పద్యములలో అచ్చటచ్చట చక్కని జాతీయములు గలవు. 'ఊయెలనూపినట్టి కరమూర్విని నూపవలంతురందురమ్మా' అనియు, 'నేరక రావిక్రింద రమణీమణి పాలను ద్రావినన్ గుణోద్ధారులు కూడ కల్లనరె' అనియు, ఇట్లే చిరుజాతీయములు కలవు. 'ఆత్మవత్సర్వభూతాని', 'అతిథి దేవోభవ' 'అభ్యాగతస్స్వయం విష్ణుః' అను నట్టి కొన్ని సంస్కృత సూక్తులను కూడ పద్యములలో చేర్చినది. కవయిత్రి కేవలము తన పుత్రికలపేరున వ్రాసినను ఈ గ్రంథము ఈనాటికీ ప్రతి స్త్రీకి ఉపయోగకరములైన మంచి సూక్తులను చెప్పుచున్నది.

---

1. లక్ష్మీశారదా కుమారీ నీతి - పద్యం - 96.
2. లక్ష్మీశారదా కుమారీ నీతి - పద్యములు - 97, 98, 99, 100.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్ష్మీశారదా సుభాషితము

శ్లో. కావ్యం యశసే అర్థకృతే శివేతరక్షతయే
సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే.[1]

అని అలంకారశాస్త్రజ్ఞులు నుడివిన పద్ధతిననుసరించి పలువురు కవులు తమకావ్యము లందచ్చటచ్చట నీతి బోధకములైన పద్యములను చేర్చినారు. ప్రత్యేకముగా సుభాషితములను రచించి పేరొందినవాడు సంస్కృతకవియైన భర్తృహరి. భర్తృహరి సుభాషితములు వెలలేని రత్నములవంటివి. వానిని పోలి తెనుగులో కూడ కొన్ని సుభాషితములు వెలువడినవి. ఏనుగు లక్ష్మణకవి మున్నగువారు భర్తృహరి సుభాషితములను తెలుగులోని కనువదించినారు. భాస్కర శతకము కూడ నీతిపద్య బంధురమైనది. సుమతి శతకము మొదలగు కొన్ని శతకములు నీతి బోధకములైనవి గలవు. లక్ష్మీశారదా సుభాషితములు కూడ నీతిబోధకములైనవని వేరుగా వ్రాయ సక్కరలేదు.

లక్ష్మీకాంతమ్మగారి సమకాలీనులైన కవయిత్రులు, ఆ కాలమున ప్రబంధం రచనచేసి పేరు గాంచినవారు కలరు. కాని లక్ష్మీకాంతమ్మగారు మాత్రము కేవలము నీతిబోధకములను వానినే చేపట్టినది. ఈ కవయిత్రి రచనలలోని ప్రత్యేకత యిదియే యని చెప్పవచ్చును.

ఆ కాలమున కవులలో జంటకవులుగా పేరొందినవారు చాల మంది కలరు. తిరుపతి వెంకట కవులు, వెంకట రామకృష్ణ కవులు జగమెరిగిన జంట కవులు. కాని మహిళలలో జంటకవయిత్రులుగా ఈ వదిన, మరదండ్రే పేరొందినట్లున్నది. వీరి పేర్లుకూడ సముచితముగా లక్ష్మీశారద అని సమకూడినవి. ప్రతి కావ్యమును రచించుటలోను లక్ష్మీకాంతమ్మగారికి మరదలైన కొన్నలగడ్డ శారదాంబగారెంతో

---

1. కావ్యాలంకార సంగ్రహము - ద్వితీయాశ్వాసము - పుట - 116.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సహకరించినారు. వీరిరువురి కవిత్వము పువ్వు, దారమువలె ఒద్దికతో కలసి పోయినది. ఈ లక్ష్మీశారదా సుభాషితము అను గ్రంథమున రెండు వందల ఒక్క పద్యములున్నవి. అన్ని పద్యములు రచించి సమకూర్చుట వీరి పాండితీ విశేషము నకు, సహన శీలత్వమునకు ఉదాహరణ మనవచ్చును.

కుటుంబ నిర్వహణమొనరించుచు, భర్తల సేవ యొనరించుచు, ఇట్టి కవిత్వ రచనాప్రవృత్తిని విసుగులేక చేపట్టిన ఈ మహిళలు నిరంతరం ప్రశంస నీయలు.

"లక్ష్మీశారదా సుభాషితము"లందు ముందుగా ఇష్టదేవతా ప్రార్థనమొన రించినారు. విఘ్నేశ్వర స్తుతి, సరస్వతీస్తుతి, లక్ష్మీస్తుతి, గౌరీస్తుతి, శ్రీకృష్ణ స్తుతి, శ్రీరామస్తుతి భక్తిరసభరితములగు పద్యములచే యొనరించినారు. ఈ సుభా షితములకు ప్రతి పద్యమునకు తాత్పర్యము వ్రాసినారు. ఒక పద్యము లక్ష్మీ కాంతా అను మకుటముతోను, మరియొకటి 'శారదా' అను మకుటముతోను వ్రాయ బడినవి. అట్లే గ్రంథమంతయు వ్రాయబడినది. ఈ గ్రంథమునందలి పద్యము లన్నింటి యందును ఉపమానము తప్పక చేర్చబడినది. ఏ కొన్ని పద్యములో సామాన్య ధోరణిలో సాగినవి. పెద్దలైనవారు, ఇతరులకు సద్బుద్ధిని బోధించు నపుడు పోలిక చెప్పుట లోకసహజము. ఇందు ప్రతి పద్యమునను గల పోలిక ఉదాత్తమై యున్నది. ప్రతి పద్యము కూడ చదువదగి యున్నది. విజ్ఞానమును తమకంటె పిన్నవారినుండికూడ బడయవచ్చునను ఉద్దేశ్యము గల పద్యమిట్లున్నది.

గీ. జ్ఞానహీనతబాపు విజ్ఞానములను
బాలు చేనైన బడయంగవచ్చుగాదె
కాఱుచీకట్లు గ్రమ్మిన కాలమందు
సన్న దివ్వెయు వెల్గదె ? శారదాంబ. (పద్యం 2)

విద్యా పరిపూర్ణుడైన మానవుడు నిర్గర్వంబుగా ఉండునని. మూడు పోలిక లను చెప్పినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మ. ఘనవిద్యాపరిపూర్ణు డౌజనుడు నిర్గర్వంబుగా నెప్పుడున్
దనరుం, సాగర మధ్యమందు, బహుళాంతంబొప్పియేయుండు,
నిండిన భాండంబున నీరు తొణ్కదెపుడున్
శ్రీ తొల్కుచున్నట్టి పండిన చేనే తలవంచి యుంట
గనుగొంటే లక్ష్మీకాంతామణీ (పద్యం 3)

ఈ పద్యమున విజ్ఞాన ఖనియైనవాడు గర్వము లేకుండ ఉండుననుటకు సాగర మధ్యమందు మిక్కిలి శాంతముగా నుండుననియు, నిండుకుండలోని నీరు తొణకదనియు, పండిన చేను తలవంచి యుండుననియు ఉపమించినది. 'నిండుకుండ తొణకదు' అను వాక్యము నిత్య వ్యవహారమునందలి తెలుగు నుడికారముతే గ్రహించి నీతి బోధ యొనరించినదీ కవయిత్రి.

దాన గుణము గల్గిన వారినిట్లు వర్ణించినది :

మ. దానదయాది సద్గుణ వితానములన్ విలసిల్లు వానికె
న్నేనియు కష్టముల్, పరమ నిష్ఠురముల్ గలుగంగ జూడమే
మానిత దివ్యసత్ఫల సమన్వితమైన కుజమ్ముకే సుమీ
మానక రాళ్ల దెబ్బలనుమాట నిజమ్మని నమ్ము శారదా. (పద్యం - 6)

అతిథి సత్కారమును గూర్చి యిట్లు చెప్పినది :

గీ. శాత్రవునకైన దనయింట సఖునకట్టు
లతిథి సత్కారములజేయు నార్యహితుడు
తన్ను నరుకంగవచ్చు నాతనికి నైన
ఛాయనీయదె వృక్షంబు శారదాంబ. (పద్యం - 8)

పరోపకారమును కల్గిన వారినిట్లు వర్ణించినది :

చ. ఒనర బరోపకారి సుగుణోన్నతి వెల్గుచు నోపినంత, తా
జనహిత కార్యముల్ సలిపి చక్కనొనర్పగ జేయునొల్లచే
నినుడు దివంబునన్ వెలుగునిచ్చుచు రాత్రి సుధాంశుచే భువిం
దనుపగ జేయడే బహుళధార్మిక వృత్తిని శారదాసతీ. (పద్యం - 12)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరయందు బడి నలిగిపోవు చెరకులు, పరులకు మధుర రసము నిచ్చునట్లు పరోపకారులైనవారు తాము కష్టముల కోర్చికూడా, ఇతరులకు మేలు చేయుదురని తెలిపినది లక్ష్మీకాంతమ్మ. అంతేకాక పరోపకారులను మంచి గంధపు చెక్కతో పోల్చినది. మంచి గంధపు చెక్క తాను నలిగి పోవుచు నితరులకు సుగంధమును పంచియిచ్చును. అట్లే పరహితము కోరువారు తమకు కష్టములెదురైనను లెక్కచేయరని తెలిపినది. పరసౌఖ్యాపాదనాసక్తి కలిగిన మానవుడు, దీపపువత్తి తాను మండి భస్మమైపోయినను జనులకు కాంతిని వెదజల్లినట్లు, తాను కష్టసంకలితుడై కూడా యితరులకు సేవ యొనరించునని చెప్పినది.[1]

ఈర్ష్యాపరులనుగూర్చి ఇట్లు తెలిపినది: అఖిల ప్రాణులకు సౌఖ్యమునిచ్చుటకు వెలుగు సూర్యుని రాహువు బాధించినట్లు, పరహితులగు వారిని దుష్టబుద్ధులు మదోన్మాదముతో హీనముగా జూతురని పద్యరూపమున తెలిపినది. అంతేకాక ఎన్ని కష్టాలుపడినను మానవుడు ఘనతరమైన కీర్తిని పొందగల్గును. కత్తిని ధార కొరకు సానపైన నూరకున్నచో తేటరాదని ఉపమించినది.[2]

ఉత్తముడైన మానవునిట్లు ప్రశంసించినది:

చ. కేతకికుండునే ఫలము? కేకిసుగీతము పాడనేర్చునే
ప్రీతిదలిర్పగా జనసమశ్రుతగంధి సుమమ్ము లీనునే
చూతుమె నాగవల్లికడ సూనఫలంబులు? సర్వమౌగుణ
వ్రాతము గల్గకున్న ఘనిగ్రాలుటలేదె ఘనుండు? శారదా. (పద్యం-20)

ఘనుడైనవాడు కొన్ని మంచి గుణములతోడనే ప్రకాశించగలడు అని మొగలిని, నెమలిని, తమలపాకు తీగను, పనసచెట్టును పోలిక చూపించినది.

సహజ అలంకారములను గూర్చి యిట్లు చెప్పినది: పట్టు వస్త్రములు గట్టుకొనినంతమాత్రాన అందము వృద్ధిచెందదు. మనస్సు యొక్క నిర్మలత్వము,

---

1. లక్ష్మీశారదా సుభాషితము - పద్యములు - 13, 14, 15.
2. లక్ష్మీశారదా సుభాషితము - పద్యములు - 16, 17.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సహజమైన అందము మొదలగునదియే శృంగారములగును. గులాబి, చంపక పుష్పములే పట్టు వస్త్రములను ధరించును? వాటి నైజమృదుత్వము, అందము వానికి శృంగారములు.[1]

రసికత లేనివానినిట్లు నిరసించినదీ కవయిత్రి: విషధారియైన భుజంగము మణిని దాల్చినంతమాత్రాన దానిని చేరనిత్తురా? సరసతలేని మనుజుడు చక్కని విద్యల నెన్నిటిని నేర్చినాకూడా దగ్గరకు చేరనివ్వరని తెలిపినది.[2]

నిర్మలుడైన వానికి వివేకము, శాంతముకూడా కలిగినచో అతడు మరింత పూజ్యుడగును. సౌరభముగలిగిన పుష్పమునకు మంచి వర్ణముకూడా యున్నచో అది యింకను మిక్కిలి అనుభవింపయోగ్యమౌనుగదా - అని భావించినది.[3] భోగభాగ్యములు అశాశ్వతములను అభిప్రాయముకల కవయిత్రి తన భావనిట్లు తెలిపినది:

గీ. తావిగల్గిన పుష్పము దలను దాల్చి
వాడిపోవంగనే పారవైచుకరణి
భాగ్యమున్నంత కాలము యోగ్యుడందు
రది తొలంగిన నీచాత్ముడందురు కాంత [4]

వాడిపోయిన పూవును పారవైచినట్లు భాగ్యములేని వానిని హీనముగా జూతురని లోకరీతిని తెలిపినది కవయిత్రి. ధర్మయుక్తముగానట్టి ధనమును గూర్చి యిట్లు చెప్పినది :

---

1. లక్ష్మీశారదా సుభాషితము - పద్యము - 21
2. లక్ష్మీశారదా సుభాషితము - పద్యము - 24
3. లక్ష్మీశారదా సుభాషితము - పద్యము - 25
4. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 27.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. కానబండిన పండుల క్కరకురాక
ఎండి తమయంతబడిపోవు చుండునట్లు
ధర్మయుక్తంబుగానట్టి ధనచయంబు
లూరకే కాలగతిబోవె? శారదాంబ.[1]

మనుజునకు ధైర్యము అనునది మిత్రము వంటిది, గంభీరమైన సము ద్రము నుండి నావ రక్షించి దరిచేర్చినట్లుగా, భయమును గలుగజేయు సంసార సాగరమునుండి ధైర్యమే మిత్రమై తరింపజేయుననియు చెప్పబడినది.[2]

సత్సాంగత్యమును గూర్చి యిట్లు తెలిపినది: పూలదండలో నుండు దారముకూడ ఆ పుష్పములకు గల సువాసనలతో శోభించునట్లు సద్గుణములు గల వారి స్నేహము వలన మూఢుడు కూడ సద్గుణుడగునని చెప్పినది.[3]

లక్ష్మీకాంతమ్మగారు కవయిత్రి కనుక సత్కవులను గూర్చి తన అభి ప్రాయమునిట్లు వివరించినది.

శా. నానాసూనసుధారసంబులను నానందంబునన్ గ్రోలి హృ
ద్గానంబుల్వి, ప్రమోదమొందునటులన్ గావింపవే భృంగముల్
పానార్హంబగు కావ్యసారముల సంపాదించుచున్ సత్కవుల్
జ్ఞానాపూరిత గానముల్ సలుపరే శాంతాఢ్యకాంతామణీ.[4]

వివిధములైన పూల తేనెను గ్రోలి భృంగములు గానము చేసినట్లు చదువ దగిన కావ్యసారములను గ్రహించి సత్కవులు జ్ఞానముతో నిండిన గానము మనకు ఇచ్చెదరని సత్కవులను ప్రశంసించినది.

---

1. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 32.
2. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 33.
3. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 47.
4. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 49.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఏనుగు పోవుచుండగా ఎన్ని కుక్కలు మొరుగవు?" అను వ్యావహారిక నానుడి నుపయోగించి లక్ష్మీకాంతమ్మగారు శ్రేష్ఠుని దూషించువారిని పోల్చినది. గంధగజేంద్ర మేగునపుడు శునకము లెక్కువమొరిగినంత దాని ప్రభావము తగ్గునా అని తెలిపినది. [1]

సుగుణశీలుని మనస్థైర్యమును చక్కగా వర్ణించినది కవయిత్రి. జలనిధు లింకినను, జలజాప్తుడు తేజము వాసినను, భూవలయము తల్లడిల్లినను, కులపర్వతములు నేలకూలినను, నక్షత్రపంక్తి భూమియందు వ్రాలినను, సుశీలుడైన వానికి చలనముండదు. అతడు తన గుణశీలములను విడువ జాలడు. [2]

నీచునితో స్నేహము హీనగతి నొందజేయునని, ఇట్లుపమించినారు :

క. నీచుంగూడి చరించిన
దోచెడి నీమంచి బుద్ధి తొలగును సుమ్మీ
నాచునుగూడిన నీరము
నీచతనొందంగ గనవె నిజముగ గాంతా. [3]

స్వచ్ఛమైన జలము కూడ నాచు చేరిన పిదప ఉపయోగహీనమగును. నీచులతో స్నేహము కూడ అట్టిదే యని చెప్పబడినది. అంతేగాక 'కామిలరోగి కెల్లపుడు లోకము పచ్చగా గన్పించునట్లు' దుర్జనుడైనవానికి లోకమునందలి మనుజులందరును దుర్జనులుగనే కనిపించెదరని తెలిపినదీ కవయిత్రి.

మానవునికి కావలసినది తృప్తికానీ ఘనమైన భోగములను కోరుట కష్టములకే హేతువని తెలిపినారు. అసమానమైన దానగుణము కలిగినవారు ఎన్ని కష్టములు కల్గినను వారి మనసు సూర్యునివలె స్వచ్ఛముగ నుండును. విసురుగా

1. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 58.
2. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 62.
3. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 79.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీచు గాడ్పులకు ఆకసమున కంటు భూధరము కదలదు కదా అని స్థిరమైన దానగుణము గలవారి ప్రశంస చేయబడినది.[1]

ఉత్తమురాలైన స్త్రీని గూర్చి ఇట్లు వర్ణించినారు : మహోజ్జ్వల మణిహార మెప్పుడును బంగారు తీగను కూడి తళుకు తళుకుమని ప్రకాశించునట్లు, ఉదార భావగుణముతో ఉదంచిత మానసమైన భార్యతో స్నేహము వలన గృహస్థు శోభిల్లును.[2]

విశ్వాసమును గూర్చి కవయిత్రి అభిప్రాయమిట్లున్నది : పట్టెడు కూడు పెట్టినచో కుక్క యజమానిని తన పాలిట దైవముగా భావించి అతనిని గాంచగానే మోదము చూపును. నారికేళపు వృక్షానికి నీరు పెట్టినచో మరల ఆ నీటితో గూడిన ఫలములను సంతుష్టితో నొసగును. విశ్వాసపాత్రులైన వారు కూడ అట్టివారేనని తెలిపినది.[3]

కపట స్నేహము జూపెడు వారిని దరికి జేరనివ్వరాదు. నివురు గప్పిన నిప్పును చేతబట్టిన చేయికాలును అని కపటస్నేహితులను విమర్శించినది.[4] కమ్మని కస్తూరి కర్పూరపు పొడి, మంచి గంధముతో తడిపినను, ఉల్లిపాయ తన సహజ గుణమును వీడదు. అట్లే దుర్జనుడు తన చెడ్డ గుణమును మానజాలడు.[5] పాలు పోసిన వానినే పాము కరిచినట్లు క్రూరుడు ఉపకారికే అపకారమెంచును.[6] మహనీయు డుండదగిన స్థానమునందు నీచుని చేర్చరాదు. చూడామణి నుంచదగిన స్థానమున పాదుకల నుంచముగదా. అని కవయిత్రి ఎన్నో విధములుగా మానవులలోని భేదములనరసి చెప్పినది.[7]

---

1. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 87.
2. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 105.
3. లక్ష్మీశారదాసుభాషితము - పద్యం - 111.
4. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 119.
5. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 129.
6. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 131.
7. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 149.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీతి బోధకములైన వానిలో భర్తృహరిసుభాషితములు ప్రసిద్ధములైనవి. అందున్న కొన్ని శ్లోకములు, పద్యముల ఛాయలు కొన్ని పద్యములపై గలవు.

శ్లో. దుర్జనః పరిహర్తవ్యో విద్యయాలంకృతో, పిసన్
మణినాభూషితత్సర్పః కిమసౌన భయంకరః[1]
పై శ్లోకమునకు అనువాద పద్యమిట్లు కలదు.

తే. విద్యచే భూషితుండయి వెలయుచున్న
దొడరి వర్జింప నగుజుమీ దుర్జనుండు
చారు మాణిక్యభూషిత శస్తమస్త
కంబుగల పన్నగము భయంకరముగాదె.

వీని రూపమే ఈ క్రింది పద్యమున పొడగట్టుచున్నది :

చ. సరసత లేని యట్టి జనుజక్కని విద్యల నెన్ని నేర్చినన్
సరసులు మెచ్చబోరతని, జక్కికి జేరగనీరు కాంచగన్
కరవిషధారియైన భుజగంబు మణిన్ దలదాల్చినంతనే
సరసకు జేర నిచ్చెదరే సాధువులైనను శారదా సతీ.[2]

భర్తృహరి సుభాషితమునందు మూర్ఖపద్ధతి అను భాగమున గల శ్లోక మాధారముగా లక్ష్మీశారదా సుభాషితమునందొక పద్యము హృద్యముగా రచింపబడినది.

మూర్ఖపద్ధతిని శ్లోకము :

శ్లో. ప్రసహ్య మణి ముద్ధరేన్మకరవక్త్రి దంష్ట్రాన్తరా
త్సముద్రమపి సంతరేత్ప్రచలదూర్మి మాలాకులం
భుజఙ్గమపి కోపితం శిరసిపుష్పవద్ధారయే
న్నతు ప్రతిని విష్ట మూర్ఖజనచిత్త మారాధయేత్.[3]

---

1. నీతిశతకము - దుర్జన పద్ధతి - శ్లో. 42.
(భర్తృహరి సుభాషితము)
2. లక్ష్మీశారదా సుభాషితము - పద్యం - 24.
2. భర్తృహరి సుభాషితము - మూర్ఖపద్ధతి - శ్లో. 3.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాద పద్యము :

చ. మకరముఖాంత రస్థమగు మానికమున్ బెకలింపవచ్చు బా
యక చలదూర్మికానికరమైన మహోదధి దాటవచ్చు మ
స్తకమున బూవు దండవలె సర్పమునైన ధరింపవచ్చు మ
చ్చిక ఘటియించి మూర్ఖజన చిత్తము దెల్ప నసాధ్యమేరికిన్.

భర్తృహరివలెనే దుష్టాత్ములైన వారి మనసును మరలింప సాధ్యము కాదని కవయిత్రి, ఇట్లు సీసపద్యమునందు విస్తరించి చెప్పినది.

సీ. మదగజంబును దెచ్చి మర్దింపగా వచ్చు
గుపిత హర్యక్షమ్ము గూల్పవచ్చు
నిశిత ఖడ్గంబుపై నృత్యమాడగవచ్చు
భయదవారాశిపై బండవచ్చు
జ్వలదనలంబులో జెలిమి జేయగవచ్చు
కుధర రాజమ్ముల గూల్పవచ్చు
గంగా ప్రవాహంబు గట్టి నిల్పగవచ్చు
సూర్యుని దరిజేరి చూడవచ్చు

గీ. రాంగరగించి నీరుగా ద్రాగవచ్చు
గనగ నజ్జాండమంతయు నణచవచ్చు
గాని దుష్టాత్మ గరగింప గష్టమగును
లక్షితాఖిల శాస్త్రాంత లక్ష్మికాంత.

అచ్చటచ్చట చుక్కలు రాలినట్లు ఒకటి రెండు పద్యములపై ప్రాచీనుల ప్రభావ మున్నను, ఎక్కువ భాగము, కవయిత్రీమణుల ప్రతిభావ్యుత్పత్తులకు తార్కాణ ముగా నున్నదీ సుభాషిత గ్రంథము. పండిత జన రంజకమగు, ఉపమానములనే కాక, సామాన్యజనవ్యవహారమున నుండు పలుకుబడులు కూడ యిందు చేర్చ బడినవి. ఉదాహరణమునకు కొన్ని యిచ్చుచున్నాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1. 'గోరంతలు కొండంత.' పద్యం-60
2. నిండిన భాండమున నీరుతొణ్క దెపుడున్. పద్యం-3
3. కామిలరోగి కెల్లపుడు లోకంబెల్ల దాపచ్చనై గనిపించుస్గద. పద్యం-8
4. ఉప్పులేనట్టి కూరల చొప్పు. పద్యం-85
5. చిరుచిరుగంతలన్నిటిని చింతన సేతుమె మంచమందు?
(మంచములో పండుకొని గంత లెన్నుదుమా అని అర్థం) పద్యం-104
6. వాయువునందు దీపమిడి భారము నీయదెదైవమా యని.
(గాలిలో దీపంపెట్టి దేవుడా నీ దయ అన్నట్లు) పద్యం-108
7. నిపురుచే జల్లనై యున్న నిప్పు. పద్యం-119
8. కంటకము దదీయుటకు కంటకమున్ గయికొంట యుక్తమౌ
(ముల్లును ముల్లుతోనే తీయాలి) పద్యం-118
9. వహ్ని నెందేని చెదపుర్వుముట్టగలుగున్. పద్యం-123
(నిప్పును చెదలు ముట్టునా)
10. పాలు పోసెడివానినే పాము కరచు పద్యం-131
11. ప్రసాదమునకై గుడి పంచజేరు. పద్యం-134
(ప్రసాదము మీది భక్తికాని దేవుని భక్తిరాదు)
12. వేడి పాలను వైచిన తోడువలెను. పద్యం-144
13. గోకిన కొలది 'తామర' కూర్పు సుఖము. పద్యం-167
14. పెట్టి పుట్టిలిది. పద్యం-168

ఇట్లు మృదుమధురముగా పలుకుబడులను, చెప్పి నీత్యుపదేశకరములైన పద్యములు రచించినను, గ్రంథాంతమున రెండు చక్కని శ్లోకములను రచించి తమ సంస్కృత రచనా పటిమను కూడ చూపినారు.

శా॥ వందేపూర్ణశశాంక సన్నిభముఖీం వందే జగన్మోహినీం
వందే పండిత పోషిణీం శుభకరీం వందే కృపాసాగరీం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వందే గానకళావినోదన కరీం వందే సరోజాసనాం
వందే మామక మానసాబ్జ నిలయాం వందే సతీం శారదాం.[1]

అని శారదా దేవిని ప్రార్థించినది.

శా. వందే విష్ణుమశేషలోక నిలయం వందే రమానాయకం
వందే సన్ముని మానసాబ్జ నిలయం వందేగుణాంభోనిధిం
వందే ఫుల్ల సరోజ పత్రనయనం వందే మనోరంజకం
వందే పాలిత భక్తమార్య వరదం వందే జగన్మోహనం.[2]

కవయిత్రి బోధించిన సుభాషితములలో అన్నియు తడిపిచూడ దగినయున్నవి. మానవ సహజగుణములైన శాంతము, కోపము, అల్పత్వము, దుష్టసాంగత్యము, విషయ సుఖములు, పాపము, ఐక్యత, సత్కార్యములు, శీలము, క్రూరత్వము, భక్తి, తాలిమి మున్నగు ఎన్నో విషయములను గూర్చి సహనముతో, ఉపమానములను చేర్చి వర్ణించినది. వదినా, మరదండ్రు కలిసి వ్రాసిన ఈ పద్యములు పాలు నీరువలె కలిసి పోయినవి. పద్యరచనలో, ధారాళమైన శైలిని గూర్చి ఒకరికొకరు తీసిపోని విధముగా వ్రాసినారు. సుభాషితములు చెప్పుటలో ప్రాచీన కవుల కేమాత్రము తీసిపోని రీతిలో చెప్పినదీ కవయిత్రి. నిరవధికమైన శ్రమ యొనరించి ఈ సుభాషితములనందించిన కవయిత్రి యెంతయు సుగుణశీల, సహనశీలగా గుర్తింపవచ్చును.

కావ్యరచనలో తోడునీడవలెనుండిన శారదాంబ గారు 1944వ సంవత్సరమున లక్ష్మీకాంతమ్మగారిని ఒంటరిని చేసిపోయినది. అంతకుముందే 1942వ సంవత్సరమున రామమూర్తిగారు భార్యను వీడి పరలోకమునకేగినారు. కవయిత్రి ఒక్కసారిగా సంభవించిన ఈ దుస్సంఘటనల నెదుర్కొనుచు, ఓపికతో అప్పుడపుడు రచనలొనరించినది. లక్ష్మీకాంతమ్మగారి రచనలలో 'లక్ష్మీశారదా

1. లక్ష్మీ శారదా సుభాషితము పద్యం-189.
2. లక్ష్మీ శారదా సుభాషితము పద్యం-200.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీతములు' అను స్త్రీల పాటలు కూడ గలవు. వీనిని కూడ లక్ష్మీకాంతమ్మగారు, శారదాంబగారు కలిసి రచించినారు. లక్ష్మీకాంతమ్మగారు అత్తవారింటికి వచ్చిన పిదప, మామగారు ప్రేమతో సంగీతము నేర్పించినారు. అందువలన ఈ కవయిత్రి సంగీత, సాహిత్య సరస్వతిగా విలసిల్లినది. లక్ష్మీశారదా గీతములందలి రచన చక్కని భాషను, భావమును కలిగి వినుట కానంద కరముగా నున్నవి. గీతములను గురించి కవయిత్రులు తమ అభిప్రాయమును తెలిపినారు.[1] 'పండగ వేళలందు' వివాహము, డోలోత్సవము, జన్మదినము మున్నగు సందర్భములందు పాడుకొనుటకీ పాటలెన్నో అత్యంతోపయుక్తములుగా నున్నవి.

రామమూర్తిగారు కీర్తిశేషులైన పిదప కూడ కవయిత్రి కన్నీటి ధారముతోనే రచనలొనరించినది. కాని అవి అముద్రితములు. పతి వియోగ దుఃఖముతో వ్రాసిన 'కన్నీరు' అముద్రితము. అదియొక కరుణ రసవాహినియని విమర్శకుల అభిప్రాయము.[2] ఉత్తమ రచనలచే ఆంధ్ర సరస్వతి నలరించి, కేసరిగారిచే స్వర్ణకంకణ బహూకృతి నొంది గౌరవింప బడిన ఈ కవయిత్రి చిరయశస్సు నందినది.

---

1. విజ్ఞప్తి - లక్ష్మీశారదా గీతములు.

ఆంధ్ర భాషామతల్లికి సేవ చేయుటయు, సోదరీ మణుల యుపయోగార్థ మిచ్చుటయు మా అభిమతము. ఇందలి గీతములు మా స్వానుభవ మనోభావ జనకములు, భక్తి జ్ఞాన హితబోధకములు. హిందూ బాలికా సుందరీమణుల కత్యంతోపయుక్తముగా నుండగలవని మా నమ్మకము.

బుధజన విధేయులు
లక్ష్మీశారదలు.

2. ఆంధ్రకవయిత్రులు - పుట - 199.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మధుర కవయిత్రి
స్థానాపతి రుక్మిణమ్మ (1952)

గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన వారిలో 'మధుర కవయిత్రి' బిరుదుగాంచినది స్థానాపతి రుక్మిణమ్మగారు. ఈమె జన్మస్థానము నిడదవోలు. శ్రీ శ్రీకాకుళపు పురుషోత్తముగారు. గరుడమ్మగారు ఈమె తల్లి దండ్రులు. క్రీ.శ. 1915 వ సంవత్సరమున ఈ కవయిత్రి జన్మించినది. విశాఖపురి కన్యకా పరమేశ్వరీ పవిత్ర పూజాప్రాంగణమున నివాసమొనరించి నట్టి శ్రీ స్థానాపతి సత్యనారాయణగారి ధర్మపత్ని ఈ కవయిత్రి. ప్రస్తుతము వీరి నివాసము విశాఖపట్టణమునందే కలదు. ఈమె అచటి 'కవితాసమితి' అను భాషా సంస్థకు కార్యదర్శిగా నుండి సాహిత్యసేవ యొనరించుచున్నది.

బాల్యము-విద్య :- బాల్యమునుండియు రుక్మిణమ్మగారికి భారత, భాగవత, రామాయణాది పురాణగాథలందు అమితమైన ప్రీతి కలదు. ఆనాటి గొల్ల కలాపములు, భామాకలాపములు, తోలుబొమ్మలాటలు మొదలైన వానిని తన మేనత్తయైన పాపమ్మగారితోపాటు చూచుచుండినది. ఇంటికి వచ్చిన తాను వినిన పద్యాలను, పాటలను యథాతథముగ చదివి పెద్దలను ఆశ్చర్యపరచెడిది. ఈమె లోని ఏక సంథాగ్రాహకశక్తిని గమనించి పాపమ్మగారు ప్రోత్సాహము కల్పించి, అధ్యాత్మరామాయణములోని కీర్తనలను, గుమ్మడి పాటలను, గరుడాచల యక్ష గానమును నేర్పించిరి.

అయిదవ సంవత్సరమున స్థానిక బోర్డు ప్రాథమిక పాఠశాల యందుచేరి అయిదవ తరగతివరకు చదువుకొన్నది రుక్మిణమ్మగారు. ఆ తర్వాత ఆమెను పెద్దలు చదువు మాన్పించుటతో, ఇంటి యొద్దనే సంస్కృతము నేర్చినది. రఘు వంశ, కుమార సంభవములందు కొన్ని సర్గలను, మేఘసందేశము మున్నగు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంస్కృత కావ్యములను పఠనమొనరించినదీ విదుషీమణి. సంస్కృత కావ్యము లతో పాటు, ఆంధ్ర ప్రబంధములను గూడ పఠించినది.

వైవాహిక జీవితము : ఈ కవయిత్రికి పన్నెండవ యేటనే విశాఖ పట్టణ నివాసులైన శ్రీ స్థానాపతి సత్యనారాయణ శాస్త్రిగారితో వివాహమైనది. శాస్త్రిగారు సంస్కృత పండితులు. విమర్శకులు. రసజ్ఞులు. వారితో సాహ చర్యము రుక్మిణమ్మగారికి పసిదికి తావి అబ్బినట్లయినది. సహజ ప్రతిభావంతు రాలగు రుక్మిమ్మగారు భర్త ప్రోత్సాహముతో రచయిత్రిగ ప్రఖ్యాతి నందినది. తన భర్తయే తనకు సాహిత్య గురువు అని రుక్మిణమ్మగారు "భర్తయే నాకు గురువు, మార్గదర్శి, ఆయనయొక్క సాంగత్యము, సంపోషణ, చోదకత్వము, లేనిచో నేను యే గ్రంథమును వ్రాసియుండజాలను. ఆయన యొక్క ఆశ్రయమే నా కవిత్వమునకు అంకురము, పోషకము, గ్రంథరచనకు కారణము" అని చెప్పుకొన్నారు.[1]

రుక్మిణమ్మగారి రచనలు : రుక్మిణమ్మగారు గృహకృత్యములను తేలికగా నిర్వహించుచు సాహిత్యసేవ యొనరించినారు. క్రీ. శ. 1928 నుండి ఈమె కవితా రచన ప్రారంభమైనది. అప్పటి నుండియు నవలలు, నాటకములు, కవితలు, ఖండికలు, కథానిలు, పుంఖానుపుంఖములుగా వెలువరించి కీర్తి సము పార్జనమొనరించినదీ కవయిత్రి. వానిలో—

ఖండకావ్యములు : కాదంబిని, పూలమాల, పూర్వగానము.

నాటకములు : వత్సరాజు, చారుదత్తము, దూత ఘటోత్కచము. (భాస మహాకవి నాటకానువాదము).

కథానికలు : ఊర్మిళ, ప్రతిజ్ఞ, దయ్యాలు, ప్రార్థన, నీలాటిరేవు, యుక్తిమాల మొదలైనవి.

వచన పురాణములు : దేవీ భాగవతము, గోలోకము మొదలగునవి.

---

1. కాదంబిని-తిలకము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అముద్రితములు :

సప్తశతి : పద్య సంకలనము.

నవల : ఛాయ.

కావ్యము : లీల.

సప్తశతి విభిన్న వస్తువుల నాధారముగా గొని, అపుడపుడు వ్రాసిన యేడు నూర్ల పద్య సంకలన గ్రంథము. ఇందు లౌకిక వృత్తముతో పాటు ఆధ్యాత్మిక ప్రవృత్తియు గలదు.

వివిధోపనిషత్తులనుండి యేర్చి కూర్చిన సూక్తులను సంకలన మొనరించి 'దేవుడు, ప్రార్థన' అను గ్రంథములను రచించినదీ కవయిత్రి.

వ్యాసరచితమైన దేవీ భాగవతమునకు స్వేచ్ఛానువాద మొనరించి తెలుగు సంధు వచనములో దేవీ భాగవత రచనమొనరించినది రుక్మిణమ్మగారు. ఈ విధ మైన రచన చేసి ఈమె పండిత లోకమునందు కీర్తి గాంచినది.

సన్మానములు : క్రీ. శ. 1952 వ సంవత్సరమునందు గృహలక్ష్మి జయంతి మహోత్సవ సందర్భమున కేసరిగారు స్వర్ణకంకణ ప్రదాన మొనరించి ఈ కవయిత్రికి సన్మానమొనరించినారు. ఆనాటి వీరి సన్మాన సభకు వావిలి కొలను పద్మాసనమ్మగారు అధ్యక్షురాలిగా నుండిరి. ఆ సంవత్సరమునందే విశాఖపట్టణపు టౌను హాలులో సన్మానించిరి. ఆ కాలమున ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో సంస్కృతాంధ్ర ప్రధానాచార్యులుగా నున్న విద్వాన్ శ్రీ గంటి జోగి సోమయాజిగారి అధ్యక్షతన జరిగిన సభలో 'సువర్ణ ఘంటా కంకణ' బహూ కరణ కావింప బడినది.

క్రీ. శ. 1966 లో విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ ఆకెళ్ళ గోపాలరావు గారి ఆధ్వర్యములో, శ్రీ తెన్నేటి విశ్వనాథముగారి అధ్యక్షతయందు, రుక్మిణమ్మ గారికి ఘన సన్మానము జరిగినది. క్రీ. శ. 1970 లో (30-1-1970)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు హైదరాబాదులో 1116 రూపాయలు బహూకరించి, దుశ్శాలువతో సత్కరించిరి. ఆనాటి సభకు శ్రీ బెజవాడ గోపాల రెడ్డి గారు అధ్యక్షులుగా నుండి ఆమెను సత్కరించినారు. అంతర్జాతీయ మహిళా సంవత్సర సందర్భముగా క్రీ. శ. 1975 జూన్ నెలయందు 'లయన్స్ క్లబ్' వారు ఉత్తమ రచయిత్రిగా సన్మానించినారు. నవంబరు నెలలో విశాఖ జిల్లా స్థాయి సంఘ ఛేర్మను అయిన జిల్లా కలెక్టరు సమక్షమునందును ఆంధ్ర విశ్వ విద్యాలయ వనితా మండలి వైపున వైస్ చాన్సలర్ సతీమణి శ్రీమతి రాజేశ్వరీ అప్పారావు గారి సమక్షమందు సన్మానములు జరిగినవి.

రుక్మిణమ్మగారి వ్యక్తిత్వము : రుక్మిణమ్మగారు మహా కవయిత్రి అయినప్పటికినీ, ఆమెలో ఏమాత్రము గర్వములేదు. రచనలు చిరకాలము స్థిరముగా ఉండునట్లు రచించవలయునని వారి అభిప్రాయము.[1] కావ్యరచనలో తన కాలమును సద్వినియోగపరచిన ఈ కవయిత్రికి పతియందు గౌరవాదరాభిమానములు మెండు.

గృహిణి తన ధర్మములను సక్రమముగా నిర్వహించవలయునని ఈమె కోరిక.[2]

---

1. వనిత - పేజి - 8. 1-4-1977 సంచిక.
   కాళిదాసు, భాసుడు మొదలైన మహాకవుల సాహిత్యమువలె ఏ రచనలైనా స్థిరముగా పది కాలాలపాటు నిలవాలంటే ఆ రచనలు నలుగురికీ ఆదర్శ ప్రాయముగా నుండి తీరవలెను. అవి స్త్రీల రచనలైనా, పురుషుల రచనలైనా వాటిలో సత్యం, ధర్మం, నీతి, నియమము అనునవి ప్రతిబింబించి నంత కాలము అవి జనావళిలో స్థిరంగా నిలుచును. ఈ సత్యాన్ని గమనించి మన ఆధునిక రచయిత్రులు తమ రచనలు సాగించవలెననీ, స్త్రీ లోకానికి పేరు ప్రతిష్ఠలు సంపాదించి పెట్టాలనీ నా ఆకాంక్ష.
2. "స్త్రీకి గృహిణీత్వము, పతిసేవ ప్రధానాశయములుగా నుండాలి. జీవితంలో సమానభాగస్వామి అయినటువంటి పతిని త్రోసి రాజని నిర్లక్ష్యం చెయ్యకుండా పతితోనిదే లోకమని భావిస్తూ ఇంటిని కలకల లాడునట్లు తీర్చిదిద్దుకొనే ఇల్లాలే ఆదర్శ గృహిణిమణి."
   —వనిత పేజి - 1-4-1977 సంచిక.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీమతి రుక్మిణమ్మగారు రచయిత్రిగానే కాక, పండిత సభలయందు సభ్యులు మెచ్చుకొను రీతిలో ఉపన్యసించగల ఉపన్యాసకురాలుగా కూడ కీర్తి గాంచినారు. సమర్థురాండ్రైన మహిళలు గృహిణులుగానే కాక, ఇతర రంగము లందు కూడ ప్రవేశించి ప్రతిభ నొందవలయునని వీరి ఉద్దేశ్యము.[1]

నేటి భారతీయ సంస్కృతీ పరిణామమును గురించి కృత్రిమరీతిలో సాగిపోవుచున్నదని రుక్మిణమ్మగారి అభిప్రాయము[2].

స్త్రీవిద్య అవసరాన్ని గురించి రుక్మిణమ్మగారు గట్టిగా నొక్కి చెప్పినారు. సామాన్య స్త్రీలకు విద్య విజ్ఞానదాయక మవుతుందని అభిప్రాయము వెలిబుచ్చినారు.[3]

---

1. "ఏపనైనా చేసి చెప్పడమే నా అభిమతం. బుద్ధికి తట్టిన సత్యాన్ని నిర్మొగమాటంగా చెప్పడమే నాకు అలవాటు. ఆచరణయోగ్యం కాని మాటలన్నా, ఉపన్యాసాలన్నా నాకు గిట్టవు. సమర్థులయిన మహిళలకు గృహకార్య నిర్వహణలోనే కాకుండా రాచకార్యాలలో కూడ ప్రవేశం కల్పించడం సమర్థనీయమే. అయితే స్త్రీలకసలు ఇంటి పనులలోని మెలకువలు తెలిస్తేనేగాని దేశానికి ముక్తి లేదు."

   —వనిత - పేజి - 10 - 1-4-1977 సంచిక.

2. మన సంస్కృతి సంప్రదాయ సిద్ధమైన మన కావ్యాలలోనే ఉండిపోయింది. ఉదాహరణకు మొగలి మొదలైన పువ్వులలోని పుప్పొడిని అనాటి స్త్రీలు ముఖానికి అద్దుకొని తమ సౌందర్యాన్ని ఇనుమడింపజేసికొనెడివారని గిరికాదేవి చెప్పినట్లుగా వసుచరిత్రలో ఉన్నది. ఇది ఈనాటి స్త్రీలకు ఎంతమందికి తెలుసు? ఇప్పటివారు కృత్రిమ సాధనాలు ఉపయోగిస్తున్నారు.

   (వనిత - పుట - 10 - 1-4-77 సంచిక)

3. ఇంటింటా చదువుకొనిన స్త్రీ ఉంటే దేశము బాగుపడుతుంది. స్త్రీఅయినా, పురుషుడైనా ప్రతిభవలన పైకి వస్తారు. స్త్రీవిద్య ధన సంపాదనకేగాక సామాన్య స్త్రీల విద్యా విజ్ఞానాభివృద్ధికి ఎంతగానో తోడ్పడాలి.

   (వనిత - పుట - 10 - 1-4-1977సంచిక)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రుక్మిణమ్మగారి సాహిత్యసేవ పరిగణించ దగినది. మృదుమధురమైన రచనలు వారివి. పాలు, తేనె కలబోసినట్లు, సంస్కృతాంధ్ర శబ్దములను పొందికగా కూర్చి, భావయుక్తమై, మనోహరమగు రచనలొనరించినది కవయిత్రి స్థానాపతి రుక్మిణమ్మగారు. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారు, వారి కాదంబినికి తిలకము దిద్దినారు. రుక్మిణమ్మగారి కవితలన్నియు ఆంధ్రభాషాయోషఫాలమునందు తిలకముగా దిద్దబడియున్నవి. పద్యములు చదువుచున్నపుడు ప్రాచీన కవుల శైలి స్ఫురించును. ఈ మధుర కవయిత్రి పేరు సాహిత్యలోకమున కలకాలము నిలిచి యుండును. ప్రస్తుతము వీరి కావ్యములను పరిశీలింతము :

పూలమాల - ఖండకావ్యము

చిన్న చిన్న కావ్య ఖండికలచే కూర్చబడినదీ పూలమాల. రుక్మిణమ్మగారి పదునెనిమిదవయేట, ఈ ఖండ కావ్యమును కూర్చినది. కావ్యమునందుగల పద్యములన్నియు కవయిత్రి ప్రతిభా, వ్యుత్పత్తుల కుదాహరణములు. ఈమె ప్రాచీన కవులు, కవయిత్రుల శైలిలోనే కావ్యరచన మొనరించినది. 'పూలమాల' అను నీ ఖండకావ్యము నందలి పద్యములు భారతి, గృహలక్ష్మి, ఆంధ్రభూమి మొదలగు పత్రికలయందు ప్రచురింపబడిన పిదప వానిని ఈ కవయిత్రి పుస్తక రూపమొనరించినది. ఈ గ్రంథమున గల కావ్య ఖండికలు విషయ సూచికలో నిట్లు చెప్పబడినవి :

1. కాత్యాయని.
2. చందమామ.
3. చాటింపు.
4. నిరాసము.
5. కవిత.
6. గుమ్మడు.
7. దశావతారములు.
8. లక్ష్మి.
9. కుంతీ సందేశము.
10. కృష్ణునిలో పాంచాలి.
11. సుమన - శాండిల.
12. పతి సందర్శనము.
13. ఆంధ్రభూమి.
14. స్వస్తి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ గ్రంథమున ముందు 'కాత్యాయని' స్తుతి చేయబడినది. 'కాత్యాయని' అను శీర్షికలోనున్న ఈ పద్యము ప్రసిద్ధమైన ఈ క్రింది శ్లోకమునకు అనువాదము :

ఓంకార పంజరశుకీమ్
ఉపనిషదుద్యాన కేళికలకంఠీమ్
ఆగమవిపిన మయూరీమ్
ఆర్యామ్ - అంతర్విభావయే గౌరీమ్.

దీనికి కవయిత్రి అనువాదమిట్లున్నది :

శ్రీమదోంకార పంజరాసీన శుకము
ప్రాంచదుపనిషదుద్యాన పరభృతమ్ము
ఆగమారణ్యవీథీ మహా మయూర
మైన కాత్యాయనీదేవి నాత్మదలతు.

శ్లోకమునందలి ప్రతిపదమును గ్రహించి చక్కని పద్యరచన మొనరించినది కవయిత్రి.

రెండవది చందమామ. చందమామ మొదలగు కొన్ని కవితలను చదువునపుడు కవయిత్రికి ఆనాటి భావకవితా సరళి పట్టుబడినదని తెలియును. ప్రాచీన కవితలకు కొంత ప్రాముఖ్యము తగ్గి, భావకవిత్వమునకు ప్రాధాన్యత హెచ్చిన రోజులలో నండూరి, రాయప్రోలు, దేవులపల్లి మొదలగు కవులెందరో భావకవితలు రచించి ప్రసిద్ధి నొందినారు. ఆ ప్రభావమే ఈ కవయిత్రి రచనలలో కనుపించును. 'చందమామ' అను ఈ కవిత కూడ భావ కవిత్వములో చేర్చ దగినది. చందమామను గూర్చి కవయిత్రి భావన 'సుకుమార భావయుతమై యున్నది.' వెండి మేఘాల మేడల వీథులలో అమృతవర్షము కురియుచు, చుక్కలతో దాగురుమూతలాడు చందమామ, మల్లెపూదోట తిరుగాడు మాలివోలె నున్నాడని ఉపమించినది కవయిత్రి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గుమ్మడు :- ఈ కవితయందు చిన్నికృష్ణుడు తల్లిని వెన్నయని అడుగగా తల్లి గుమ్మడని భయపెట్టినట్లు కలదు. అల్లరి చేయునట్టి చిన్నిబాలుని ప్రతి తల్లియు 'బూచివాడొస్తాడని' భయపెట్టును. ఈ కవితయందు యశోదాదేవి వర్ణనము, ప్రాచీన కావ్యములలోని స్త్రీల వర్ణనము వలెనే కలదు.

సీ. రాణించు ముత్యాల రావిరేకయు బొట్టు
 యిరులైన కురులలో మెరయుచుండ
బాగైన వజ్రాల పౌజుల కమ్మలు
 తళుకు చెక్కిళ్ళపై తాండవింప
వక్షస్థలమ్మున బిగించిన రవికగని
 ముత్యాల హారముల్ మొనసియాడ
వెలలేని రతనాల నలరారు బహువిధ
 కరకంకణమ్ములు ఘల్లురనగ
నలువైన కవ్వంబున కమర జుట్టి
 చాలవలెమాటు కొంగు యుయ్యాల లూగ
వనిత వయ్యారమునను ప్రభాతవేళ
 పెరుగువడి ఘుమ్మ ఘుమ్మన దరచుచుండ

మిక్కిలి సహజత్వముతో నున్నది ఈ కవిత. చల్ల చిలుకుచున్న తల్లిని చేరి అల్లరి కృష్ణుడు 'అమ్మ వెన్నో' అని అడుగుచు కవ్వము పట్టి పెట్టినాడు. గుమ్మడున్నాడని చెప్పి భయపెట్టిన తల్లిని "ధొల్లినేను భయంకరోగ్రులౌ దనుజులను, కల్మషాత్మకుల నెందరినో వధించితిని. కాని గుమ్మడనగా విచిత్రమగుచున్నదని" పల్కగానే ఆ తల్లికి వెన్నుని మాయ తెలిసివచ్చినది.

ఈ గుమ్మడు కవిత "గుమ్మడేడే గోపిదేవి" అను పాటకు అనుసరణీయముగా వ్రాయబడినది :

గుమ్మడే దేగోపిదేవి గుమ్మడేడే కన్నతల్లి
గుమ్మడిని చూపించ గదవే అమ్మగోపెమ్మా అమ్మా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గుమ్మ గుమ్మని పెరుగు తరచగ కోరివిని
ప్రార్థించి కృష్ణుడు.
అమ్మ పెన్నాయనుచు కవ్వము
నణచి పట్టగనూ

ఒక చిన్న జానపద గేయము నాధారముగా చక్కని కవిత నల్లిన కవయిత్రి ప్రతిభ ప్రశంసనీయము.

దశావతారములు:-దశావతారములను కేవలము ఒక్క సీస పద్యము నందు వర్ణించినది కవయిత్రి సీసపద్యము నందలి ఒక్కొక్క పాదమునం దొక్కొక్క అవతార ప్రశంస. చేయబడినది.

వేదాది విద్యలు వెలయింపగా జేసి
ముదము మీరగలోకములు వహించి
భూగోళమెల్ల విస్ఫూర్తిలో బైకెత్తి
ఘనదుర్మదాంధు రక్కసుని దున్మి
బలిచక్రవర్తిని పాతాళమునగట్టి
క్షాత్ర మండలమును క్షయమొనర్చి
నిశితమార్గణ పంక్తి దశకంఠుని జయించి
కమనీయమైన నాగలిని బట్టి
ఇంపుదనకొత్త కరుణ వ్యాపింపజేసి
భవనకీర్తిగ మ్లేచ్ఛుల మూర్ఛముంచి
అతులమతి నివ్విధి దశాకృతుల దాల్చి
మహిని దనరారు శ్రీకృష్ణమది దలంతు.

లక్ష్మి:-ఈ కవిత ఝాన్సీలక్ష్మీబాయిని గూర్చి వ్రాయబడినది. ఈ కవితలో ఝాన్సీలక్ష్మీబాయి జననము, వివాహము, లక్ష్మీబాయి యొక్క ధైర్యసాహసములు వర్ణింపబడినవి. సంస్కృత పదభూయిష్టమైన రచనతో పద్యములకొక గంభీరత చేకూర్చబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హయమధిష్ఠించి, ధట్టించి, హుంకరించి
కళ్ళెమును నోటితోబట్టి కాల్చిలోన
సవ్యసాచి భయదవిస్తారహనన
కర్మ, శత్రుకోడించు నట్టి ఝాన్సీలక్ష్మి

యొక్క ధైర్యమును ప్రస్తుతించినది కవయిత్రి.

కుంతీ సందేశము:-ఇందు కుంతీదేవి ధర్మజునకు సందేశమిచ్చినట్లు వర్ణింపబడినది. కలుషపూరిత కార్యములందు కుమారులు, రాజ్య పదచ్యుతి నొందుట చూచి చింతించి, మాధవునితో తెలిపినది. పదివేలేన్గులతో సమానమైన బలముగల భీముడు వనవాసమొనరించు విధముచూచి ధర్మజునకు కదనోత్సాహము కలుగునట్లు పలికినది.

పదివేలేన్గులలో సమానబలమున్
ప్రఖ్యాత శౌర్యాది సంపదన్
గ్రాలెడు భీమసేనుడకటా
ప్రాణావశిష్టుండునై
పదము-దేండ్లు వనమ్ములన్ దిరిగెనే
ప్రారబ్ధ మోయంచుమున్
గదనోత్సాహము పుట్టగా బలికెన్
గాలానుగుణ్యంబుగన్

పార్వతీపతిని మెప్పించి పాశుపతము గొనిన పార్థుడు కౌరవుల పడగా పగలబోగిలి, ధర్మజుని తెగపలికినది. అతిసుకుమారులు, పిన్నలైన మాద్రీ తనయులు పేరాకలిచే కృశించుటగాంచి, కుమారునికి 'సంగ్రామ విధులు నుడివి నది'. ప్రథిత పాండుభూవర కుమారులైన పాండవులు దాస్యశృంఖలాబద్ధులై తల్లడిల్లుట గాంచి వారికి కదనరంగ విధుల బోధించినది. కదనమున పాండవులు జయించి రాజ్యార్హత పొందిన పిదప శాంతించిన ఆ తల్లి హృదయము. 'పాండు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పార్థివుని పాలనమున అతీత మహోజ్జ్వల రాజ్యసంపదలను బడసినాను' అని శాంతితో పలికినది.

అవిరళ నిత్య భోగవిభ
వాలిశయోల్లసితుండు పాండు పా
ర్థివు పరిపాలనమ్మున న
తీత మహోజ్జ్వల రాజ్య సంపదల్
దనివి భుజించి శాస్త్రవిధి
దానములన్ బరమేశు తృప్తికై
దివిజసుతమ్ముగా నెరపి
దీప్తిని బొందితిజాలు ధర్మజా.

'ఇకపైన సాంద్రతపోవనములందు ఏకాగ్ర చిత్తముతో ఘోర తపమొనరించి, తనువు జాలించి, నాథుడున్నట్టి పుణ్యార్జిత లోకమును గాంచి అచట సుఖింతును, కాని ఇకపైన నాకీ తీక్ష్ణోరు సామ్రాజ్యముల్ వలదని' పలికిన పతివ్రతగా కుంతీదేవిని వర్ణించినదీ కవయిత్రి. పుత్రులు రాజ్యమును పొందిన పిదప కుంతీదేవి తృప్తితో ఇట్లు పలికినది:

ఇటుపై సాంద్ర తపోవనాంతరమునం
దేకాగ్రచిత్తంబుతో
జటినై ఘోర తపంబొనర్చి తనువున్
జాలింపి నానాథుడే
స్ఫుటపుణ్యార్జిత లోకమందు గలడో
శోధించి నేనాస్థలిన్
దిటమై పొంది సుఖింతుగాని వలదీ
తీక్ష్ణోరు సామ్రాజ్యముల్.

ఈ కవితయందు కుమారుల వెతలను గాంచి వ్యాకులపాటు చెందిన మాతృమూర్తియగు కుంతీదేవి వర్ణన చక్కగా యొనరింపబడినది. వనవాస దుఃఖమును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విడిచి, భీమసేనాదులైన అనుజులు పేర్మిగొలువగా చతురుదధి వలయిత ధరాచక్ర మెల్ల ధర్మములో నేలుకొను ధర్మరాజును గాంచి, ఇక నాకేమియు వద్దు, నా భర్త సాన్నిధ్యమున కరిగెదనను పలుకులు కుంతీదేవి యొక్క మనస్తృప్తిని తెలుపు చున్నవి.

కృష్ణునితో పాంచాలి : మహా భారతమునందు ఉద్యోగపర్వమున ద్రౌపది కృష్ణునితో పలికిన ఘట్టమే 'కృష్ణునితో పాంచాలి' అను కవితకాధారము. ఆ ఘట్టమున ద్రౌపది కృష్ణునితో మొరలిడినట్లే దీనియందును, బాధతో, క్రోధ ముతో, కంపితగాత్రముతో పాంచాలి పలికినది. ఇందలి పద్యములపై తిక్కన పద్యముల ప్రభావము కలదు.

నిలుపుమోయన్న మాధవా, నిలువుమొక్క
సారి పగవారితో సంధి జరుపువేళ
దుస్ససేనుని వ్రేళ్లచేదు నియలైన
యాచికుర శేషమింత స్మరింపవేమి (పూలమాల)[1]

అను పద్యముపై-

క. ఇది దుస్ససేను వ్రేళ్లం
దదిలిసగము వ్రెవ్విపోయి దక్కె నయది, కౌ
రవుల కడదీరుమాటల
యవసరమున దలప వలయునచ్యుతనీనిన్.[2]

ఇందు దుశ్శాసనాదులచే పరాభవింపబడిన ద్రౌపతి హృదయమునందలి ఆవేదన దుఃఖాగ్ని రూపముతో ప్రజ్వలించి మాధవుని ముందు తన బాధను తెలుపు కొన్నది. దాయాదులు తమకు ఒనగూర్చిన కష్టములన్నియు, వయసతో కృష్ణు

1. పూలమాల - పుట - 20.
2. ఉద్యోగపర్వము, మహాభారతములో
(తృతీయశ్వాసము) పద్యం- 116.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నితో చెప్పుకొనినది. తన జన్మ పవిత్రతను, అభిజాత్యమును గూర్చి కృష్ణునితో అభిమానముతో తెలుపుకొన్నది. ఆ పద్యముపైకూడ ఉద్యోగ పర్వమునందలి ద్రౌపది మాటల ప్రభావము కలదు.[1]

పుట్టితినగ్ని గుండమున బుత్రికనై ద్రుపదాధినేతకున్
మెట్టితి కుంతికోడలుగ మేలగునీ భరతాన్వయమ్ము జే
పట్టితి ధర్మమూర్తులగు భర్తలగొంటిని నీతిధైర్యస
మ్మాట్టుల బుత్రులన్, మరియు మాసహజన్ముల ప్రాపుసందితిన్.

అను పద్యమునకు-

చ. పరమున బుట్టితిన్, భరతవంశము జొచ్చితినందుపాండు భూ
వరునకు కోడలైతి, జనవంద్యులనొందితి, నీతి విక్రమ
స్థిరులగు పుత్రులన్ బడసితిన్ సహజన్ముల ప్రాపుగాంచితిన్
సరసిజనాభ! యిన్నిట ప్రశస్తికి నెక్కిన దాననెంతయున్.[2]

తిక్కన ద్రౌపది నీవు సుభద్ర కంటె కడునెయ్యము గారవమునుంపదివ్వ సంభావన సేయుదువు అని పలికినది. ఆ విధముగనే 'ఇన్నిట వన్నెగాంచినను నీవు నమ్మ సుభద్ర కంటెనున్ మన్ననగారవింతువని' కృష్ణునితో పాంచాలి పలికినది.

కృష్ణునితో పాంచాలి పలికిన ప్రతిమాట యందును "అతిశయం కరోదగ్ర దావాగ్నిభాతి ప్రజ్వరిల్లు"నట్టి ఆమె క్రోధము కనుపించినది. మనస్సునందు రగులు చిచ్చును ప్రతి మాటయందును వత్తిపలుకుచు, రుక్మిణమ్మగారు తానే ద్రౌపదిగా నూహించుకొని వ్రాసిన పలుకులా అన్నట్లు ఈ కవిత సహజ గాంభీర్యముతో నడచినది.

1. పూలమాల - పుట - 21.
2. మహాభారతం- ఉద్యోగపర్వం- తృతీయాశ్వాసం -పద్యం-108

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పద్య సందర్భనము : భాసుని 'మధ్యమవ్యాయోగము' అను నాటకము నాధారముగా గొని వ్రాయబడినవీ పద్యములు. పాండవులు ద్యూతమున ఓడి, రాజ్యమును విడిచి ముని వృత్తితో వనవాస మొనరించుచుండిరి. ఆ సమయమున మహాతపశ్శాలియైన ధౌమ్యముని శతకుంభమను యజ్ఞమొనరించెను. భీమసేనుడు యాగసంరక్షణార్థమై నిలిచెను. కేశవదాసను ఒక బ్రాహ్మణుడు మిత్రునింట జరుగు ఉపనయన పుణ్యకార్యమునకు కుటుంబ సహితముగా ఆమహాటవీ మార్గమున పోవుచుండెను. అచటనే తిరుగుచున్న ఘటోత్కచుడు తల్లి యాజ్ఞచే ఆహారము కొరకు వారిని సమీపించెను. 'మీలో నెవ్వరినైన నొక్కరినిచ్చిన, అవశిష్టులెల్ల సంతోషముతో పోవచ్చు'నని ఘటోత్కచుడు పలికెను. జ్యేష్ఠుడు నాకిష్టుడైనవాడని వృద్ధుడు పెద్దవాని నాలింగనమొనరించెను. కనిష్ఠుని విడువ జాలనని బ్రాహ్మణి కౌగిలించుకొనెను. చతుం దీనతయైన దుఃఖాబ్ధిలో మునిగి మధ్యము డటుమసించెను. ఘటోత్కచుడు వానిని గ్రహించి పోవుచుండగా దప్పి గొనిన బ్రాహ్మణ బాలకుడు ప్రాంత జలాశయమునకు వెళ్లెను. వెళ్లినవాడు తొందరగా రాకపోవుటచే రక్కసుడు 'మధ్యమా! మధ్యమా!' అని ఎలుగెత్తి పిలిచెను. ఆ ప్రాంతమున వ్యాయామ మొనరించుచున్న భీముడు ఆ పిలుపు విని వచ్చెను. రక్కసుడు నీ వెవ్వరవని పలుకగా-

> సవభ్యులలోన మధ్యముడగొప్ప
> శత్రులన్ మధ్యముడ, నిలసర్వకార్య
> ములను మధ్యముడను, పంచభూతములను
> మధ్యముడ, భ్రాతలం గూడ మధ్యముడను (పూలమాల)

అని భీముడు పలికెను. ఈ సందర్భమున కవయిత్రి కొంత సునిశితమైన హాస్యమును కూడ సృజించినది. బ్రాహ్మణ బాలకుని వాని తండ్రి కిచ్చి తన వెంట వచ్చుచున్న భీముని గాంచి ఘటోత్కచుడు తన యుగ్రఖడ్గమెత్తి వారించెను. 'నాదు దక్షిణబాహువే నాకు శస్త్రమని' భీముడు పలికెను. ఆ మాటలకు కోపమున 'నా తండ్రికిదక్కనరయనిట్టి పల్కులేరికెందగవని' రక్కసుడనెను. దానికి బదులుగా భీముడు హాస్యముగా -

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'ఎవరయా నీతండ్రి ఎఱిగింపు శక్రుడా?
శంభుడా?, కృష్ణుడా? శక్తిధరుడ,
యముడా, మరియు వీరి కర్మిలిచుట్టమా
సముదాయని' పరిహా సమొనరించెను.

భీముని పరిహాసమునకు మరింత కోపముతో ఘటోత్కచుడు వానిని వెంట నిడుకొని తల్లియగు హిడింబికి ఆహారము కొరకు కొనిపోయెను. వృకోదరుని గాంచిన హిడింబి సంతసముతో వాని పదయుగ్మమందు వ్రాలి, పూజించి, కుమారునకు తండ్రియని తెలిపినది. భీముడు ప్రేమతో కుమారుని, భార్యను కౌగిలించుకొని ఆశ్రమమునకు సంతోషముతో వచ్చినాడు.

భాసుని నాటకమును పద్యరూపమున మృదు పదములలో కూర్చి రచించినది కవయిత్రి. కథాభాగమునకెట్టి అనౌచిత్యము కలుగకుండునట్లు చక్కని, చక్కని పదగుంఫనతో రచించి పరిసందర్భానమొనరింప జేసి. ప్రణయ సందీప్తి మెరయింపజేసినది.

ఆంధ్రభూమి :- మన తెనుగు సీమ ధనధాన్యనిలయము. తెలుగు సీమ పుణ్య సంకలితము. తెనుగు సీమ పుణ్య మండలమని యెందరెందరో కవులు వర్ణించిరి కాని కడుపు కాలెడు వారల గాంచుటచే తెలుగుసీమ ధన ధాన్య నిలయ మనుమాట నేడు వ్యర్థమైనదని కవయిత్రి యిట్లు పలికినది :

ఎందరెందరో ఘనసుధాస్యంది లేఖి
నుల తెనుగుసీమ ధనధాన్య నిలయమనుచు
వ్రాసిరేకాని నేడది వ్యర్థమయ్యె
కడుపు కాలెడి వారల గాంచుకతన.

అట్లే వీరులైనవారు తగ్గిపోవుటచే వీరసంకలిత మనుమాట కూడ అబద్ధమే యగుచున్నదని పల్కినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎందరెందరో రుధిరనిష్యంది రేఖ
నుల తెనుగుసీమ యోధసంకలితమనుచు
వ్రాసిరే కాని నేడవి వ్యర్థమయ్యె
వీరుడొకడును గనరాని కారణమున.

నేడువారికి ప్రణయతత్వ మన్నది తెలియక కేవలము కామ ప్రవృత్తితో మాత్రమే చరించుచున్నారు. కనుక ప్రణయతత్వ భరిత మను మాట అసత్యమే అని కవయిత్రి తన మనో వేదన నిట్లు వెల్లడి చేసినది :

ఎందరెందరో వరమధుస్యంది రేఖ
నుల తెనుగు సీమ ప్రణయమండల మటంచు
వ్రాసిరే కాని నేడవి వ్యర్థమయ్యె
ప్రణయతత్వమ్మె తెలియని ప్రకృతియగుట.

కవయిత్రి ఆవేదనతో దేశమునందు కడుపు కాలునట్టి బీదల చూచి ప్రణయగతి తెలియని పశుప్రవృత్తులను గాంచి వర్ణించినది. ఈ కవిత వ్రాయబడి ఇంచుమించు అరువది సంవత్సరములు గడిచిపోయినవి. అయినను ఆనాటికీ, ఈనాటికీ 'కవిత' యందలి భావన నిత్యసత్యమైయున్నది. ఈనాటికీ మనదేశమున బీదతనము, పిరికితనము, పశుప్రవృత్తి ఇంకను అభివృద్ధిచెందినవే కాని తగ్గలేదని నిర్వివాదాంశముగా చెప్పవచ్చును. ఇట్టివారు దేశమునందున్నంతవరకు కవిత కూడ స్థిరముగా ఉండును.

స్వస్తి : 'పూలమాల' అను ఈ చిన్న ఖండకావ్యారంభమున శుభమగుటకొరకు కవయిత్రి 'కాత్యాయని' స్తుతి యొనరించినది. మధ్యలో చిన్న చిన్న కావ్యసుమాలను కూర్చినది. ఈ పూలమాలను హృదయమునందు దాల్చిన వారికి శుభము కలుగవలయునను కోరికతో 'స్వస్తి' కూడ పలికినది. ఈ పద్ధతి చూడగా ఈ కవయిత్రి యొనరించిన రచన చిన్నదే, అయినప్పటికీ, ప్రాచీన కావ్యాచారములను మాత్రము విడువక, శుభము, మంగళము అను వానిని చేర్చి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నట్లనిపించును, ఈ స్వస్తియను పద్యముకూడా ప్రసిద్ధమైనది. సంస్కృత గ్రంథములలో అంతమునందు 'స్వస్తి' యను శ్లోకముండును.

శ్లో. కాలే వర్షతుపర్జన్యః
పృథ్వీమ్ సస్యశాలినీ
దేశోయంక్షోభరహితః
బ్రాహ్మణాస్సంతునిర్భయః

అను శ్లోకమాధారముగనే ఈ 'స్వస్తి' యను కవిత రచింపబడినది.

కెరలి వానలు కాలాన కురియుగాక
అవని సస్య సమృద్ధమై యలరుగాక
దుఃఖమే లేకలోకంబు తొరలుగాక
వెరపెరుంగక బ్రాహ్మ్యంబు వెలయుగాక
నిర్ధనుడు ధనాధిపుడయి నెగడుగాక
ప్రకృతి సర్వమ్ము నమృతమై బ్రతుకుగాక

అని కావ్యాంతమున మంగళగీతి పాడినది కవయిత్రి.

ఇట్లే 'పూలమాల' యను చిన్ని పొత్తము చూచుటకు చిన్నదైనను కవయిత్రి భావనా లోకమునందలి రసభావ పరిమళభరిత సుమములచే కూర్చబడి సుగంధ భరితమై యొప్పుచున్నది.

కాదంబిని ఖండకావ్యము

రుక్మిణమ్మ గారిచే రచింపబడిన మరియొక ఖండకావ్యము 'కాదంబిని'. కాదంబిని వర్షించిన రసామృత బిందువులు సాహితీ పథికుల హృదయ రసపిపాసను తీర్చుచున్నవి. నీలాంబరమున మేఘమాలికలవలె, పద్యమాలికలన్నియు కలిసి, 'కాదంబిని'గా సాహిత్యాంబరమున వెలసినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ 'కాదంబిని'ని పఠించి డా॥ కట్టమంచి రామ లింగారెడ్డి గారు బహుధా ప్రశంసించినారు. సవ్యసాహిత్యానికి 'సారధి'గా నున్న రెడ్డిగారు ఈ కావ్యానికి చక్కని 'తిలక'రచన మొనరించినారు.

ప్రాచీన కవిత్వపు మోజు తగ్గి భావకవిత్వం ప్రకేప్పరుకుచున్న దినము లందు, ఆధునిక కవులందరూ భావకవిత్వపు జాడలలోనే కవితారచన మొనరించి నారు. ప్రాచీన కావ్యములన్నింటిని పఠించిన రుక్మిణమ్మగారు కూడ భావ కవితా రచననే చేపట్టినారు. అయినను ఈ కవితలన్నియు ఈ కవయిత్రికి గల ప్రాచీన కావ్య పరిజ్ఞానమును చెప్పకయే చెప్పుచున్నవి. 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అనునట్లు వీరి రచనలు ఖండకావ్యములే అయినను రసాత్మకములై కావ్యరూప మును పొందినవి.

రుక్మిణమ్మగారి 'కాదంబిని'ని చదివి డా. కట్టమంచి రామలింగారెడ్డిగారు వీరిని 'అన్యాపదేశపురాణి' అని ప్రశంసించినారు. ఈ గ్రంథము కవయిత్రి తనను కన్న కుమారితవలె చూచినట్టి శ్రీ డా. జీడిగుంట కామరాజుగారికి అంకితమొనరించి నది. జీడిగుంట కామరాజు గారు నిడదవోలులో ప్రసిద్ధినొందిన ఉదారులు.

ఈ గ్రంథమున భావకవితలు పెక్కు గలవు. ప్రకృతి యందలి ప్రతి వస్తువును కూడ ఈమె తన రచనా వస్తువుగా స్వీకరించి రసభావ మిళితమైన చక్కని కవితలల్లినది. మధుపాత్ర, గులాబి, పువ్వులు, పద్మములు, కోకిల, మేఘములు మున్నగునవి వీరి భావ కవితా రచనకు వస్తువులైనవి.

మధుపాత్ర : ఈ మధుపాత్ర అను కవిత చదువుచున్నపుడు ప్రఖ్యాత పారసీక కవి ఉమర్ ఖయాము యొక్క రుబాయతులు జ్ఞప్తికి వచ్చునని డా. కట్ట మంచి రామలింగారెడ్డిగారు వ్రాసియున్నారు.[2]

1. కాదంబిని - పేజి - 15.
2. కాదంబిని - పుట - 10.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జ్యోత్స్నా విహాయసమునందు మందుడై యేగుచున్న, చందురుని గాంచిన ప్రియుడు ప్రియురాలిని పిలిచి చూపి -

పసిడి జిలుగుల రతనాల పాత్రనిండ
బోసి తేతెమ్మ మధుర ద్రాక్షాసవమ్ము
రాలిపోవునులే శరీరాలమరచి
తనివి తీరగ ఏకమై త్రాగుదాము.

అని పిలిచినాడు. ఆ కాలమున తురుష్క రాజుల పాలనలో ఉర్దూ కవిసమ్మేళనములు జరుగుటచే ఉర్దూకవిత్వ ప్రభావము కూడ నాటి కవులపై పడినది.

వనమాలి:-'వనమాలి' అను ఈ కవిత చదువుచున్నపుడు మనసునకు ప్రఖ్యాత కవి జయదేవుని 'గీతగోవిందము' స్ఫురించును. లలిత యమునానదీ తీర కలితవనులయందు, తరుణీ శతాలి గూడి నృత్యహేలాభి రతి విహరించుచుండు వనమాలి కొరకు రాధ విరహ తాపము వలన, ఎదుట భావించి విలపించి, విలపించి, బెదరిచూచి, బయలుకౌగిటజేర్చి, విహ్వలతనూర్చును. ఈ చిన్న కవితలో రాధ విరహమునెంతో రణీయముగా వర్ణించినది కవయిత్రి.

కస్నెడు:-ఈ కవితయందు కార్మికుని మనోవేదన ఎంతయు వర్ణింపబడినది.

ఎండవానల కెంతయు నెండితడిసి
సొలసి జీవించు కష్టజీవులము మనము
తలలు మారిచి ఎప్పుడు ధనము కొరకు
పరులవంచించు దుర్వ్యాత్తి పరుడతండు.

అని వేదనచెందు కార్మికుని రూపమును కవయిత్రి కనులముందుంచినది. వేకువజామునుండి లేచి, చిమ్మచీకటి వరకు పనిచేసి చూపిన 'పాపులా' గిట్టదు. ధనమదాంధాల ఇండ్లలో దైవము బందీయైపోయినాడేమో అని కార్మికుడు వేదన చెందును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిత్య సత్యముగా నిలుచు ఈ క్రింది పద్యము వలన వేదన తొలగునట్లూరడించినది కవయిత్రి:

కాలగతి మారునప్పుడో ఏలవగవ
కాలక్రమమున జగతి కష్టాలు వచ్చు
వాని తరువాత సుఖములు వచ్చు నిజము
న్యాయమరయంగ దైవమున్నాడులెమ్మ.

తుక్కాంబ:- శ్రీకృష్ణదేవరాయల దేవేరులలో నొకర్తెగా పేరొందిన తుక్కాంబ రాయల ఆగ్రహమునకు గురి అయినది. అతనికి తన మనోవేదన నన్యాపదేశముగ అయిదు శ్లోకములలో వ్రాసి పంపినది. వానికి 'తుక్కాపంచక' మని పేరు. శ్లోకములే ఈ పద్యములకు ఆధారమైనవి. ఇందు అన్యాపదేశమే ఎక్కువగా గలదు. ఉదాహరణకొక పద్యము:

దిగ్దిగంతరాళమ్ముల దిరుగునీవు
జాజి పూవున కన్నిట సాటియైన
పూవు గంటివో, వింటివో, పొందినావో,
పలుకు సత్యమ్ము తుమ్మెదా భ్రాంతివీడి.

ప్రియురాలు, ప్రియునితో పలికినట్లుగా ఉన్నది ఇందలి భావము.

'లోకములనన్నింటిని తిరుగునీవు నాతో సమానమైన స్త్రీని చూచినావా, విన్నావా, పొందినావా, సత్యము పలుకుము' అని ఆమె ప్రశ్నించును. ఇట్లే మిగిలిన నాలుగు పద్యములందు కూడ అన్యాపదేశమే యున్నది.

లేఖలు : సతీపతులు దూరముగా నున్నపుడు విరహముతో ప్రియుడు వ్రాసిన లేఖయే లేఖలు కవిత. ఇందొక పద్యమున రాత్రియందు భోజనము చేయునపుడు తుమ్మినచో భార్య నవ్వుచు 'చిరంజీవ' అని పలికి ఊరు పేరు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దైవముల పేరు చెప్పుమని అడుగుట ఎంతో సహజముగా నున్నది. ఆ పద్యమిట్లు గలదు -

రేలనాహారముంగొను వేళ దుమ్మి
నంత 'చిరంజీవి' యంచేమొ చింతనగుచు
నూరు పేరు, దైవములపేరు పేరుకొనుడు
జీవితస్వామి అందువే యేవి నేడు.

విరహావస్థలో ఒకరి నొకరు జ్ఞప్తి చేసుకొనుట చిన్న కవితలోనే ఎంతో విపులముగా చెప్పబడినది.

ఇక మిగిలిన కవితలలో ప్రియురాలి విరహముతో కుమిలిన రురుడు, నాథుడో, సమవర్తియో నా దుఃఖము నంతమొనరింపవలెనని దుఃఖించు విరహిణి, కారు గుండెలు గ్రాలు మేఘములు మున్నగునవి కవయిత్రి ప్రతిభకు తార్కాణములు.

కాదంబిని రచనా విశేషములు

కాదంబిని కావ్య కర్త్రియైన స్థానాపతి రుక్మిణమ్మగారికి డా. కట్టమంచి రామలింగా రెడ్డిగారు 'అన్యాపదేశపు రాణి' అను బిరుదు నిచ్చుట ఆమెకు సముచితముగా ఒప్పియున్నది. ఈ కావ్యమున ఎక్కువ భాగము అన్యాపదేశ కరమైన పద్యములే రచియింపబడినవి.

అన్యాపదేశ వివరణము : నీతి కావ్యశ్రేణికి చేరినవియే అన్యాపదేశ కావ్యములు. ఇందు నీతి, వైరాగ్యములు బోధింపబడును. కాని విధానము మాత్రము వేరుగా నుండును. ఇది నీతిని సూటిగా బోధింపవు. అప్రస్తుత విషయ వర్ణనమువనో, విషయగర్హణమునునో అంతర్గతమయి ఇందు నీతి కనిపించును. అన్యాపదేశ కావ్యములు, శతకములు కూడా సంస్కృతమున లౌకిక సార

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వతము నందు చేర్చబడినవి.[1] రుక్మిణమ్మగారి కాదంబిని యందు తుక్కాంబ, పువ్వులు, కోకిల, అను పద్యములలో అన్యాపదేశము విపులముగా కానుపించును.

తుక్కాంబ : శ్రీకృష్ణదేవరాయల దేవేరియైన తుక్కాంబ రచించిన శ్లోకములు 'తుక్కాపంచకము' ఆధారముగాగొని రచింపబడిన ఈ పద్యములలో అన్యాపదేశ చమత్కృతి కలదు.

దిగ్దిగంతరాళమ్ముల దిరుగునీవు
జాజి పూవునకన్నిట సాటియైన
పూవు గంటివో, వింటివో, పొందినావో
పలుకు సత్యమ్ము తుమ్మెదా! భ్రాంతివీడి.

ఇందు తుమ్మెద నాయకుడు. విరహిణియైన సఖి నాయకుని ప్రశ్నించుచున్నది. దిగంతరాళముల వరకు నీవు తిరుగుదువు. జాజిపూవు వంటి ప్రియురాలికి అన్నిట సాటియైన వారిని చూచినావా?, విన్నావా! సత్యము తెలుపుమనియు భ్రాంతివీడి చెప్పుమనియు పలుకుచున్నది.

దక్షులగు చిత్రకారులు లక్షలుగను
పూనికుసుమముల్ లిఖియింత్రుగాని, అంటు
పరిమళమ్మును నింతురా, భ్రమర తతియు
రసము నాస్వాదమొనరింప డొసగునొక్కొ!

ఇందుకూడ కవయిత్రి తన భావమును అన్యాపదేశముగా నుడివినది. లోకమున ఎంతోమంది స్త్రీలుందురు కాని సౌందర్యవంతులై, సుగుణరాసులైన స్త్రీలందరుందురా? ప్రియుని మనసును అందరు స్త్రీలు ఆకర్షింపలేరుకదా! అను భావము విశదమగుచున్నది.

---

1. విజ్ఞాన సర్వస్వము - 6 వ భాగము - పుట - 227.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వసుధ మాలతీ పుష్పమ్ము వాడవిడిచి
తుమ్మెదా-ముద్దుగొందుపు తుమ్మపూవు
పాదములు నాల్గుగల వాని బశువటంద్రు
ఆరుగల నిన్ను పశువన్నరనగవలదె!

ఇందు నాయకుని తుమ్మెదా! అని సంబోధించినది కవయిత్రి. ఉత్తమ జాతికి చెందిన యువతి మనోవేదన చెందుచుండగా, తుమ్మపూవును పోలిన హీన జాతి స్త్రీనేల చేరెదవు- అని పశువన్నరగా నాయకుని దూషించినది.

మధువ్రతా! ఈ పద్యభాగమున కూడ అన్యాపదేశమే విశదమగుచున్నది. తనతో నిశీథపు వేళలందు కూర్మితో గడిపి, తన హృదయమందలి ప్రేమ నంతయు దోచుకొని పిదప దుర్వ్యథలపాలు చేసి వెడలిన నాయకుని నిలుపుమని ఆక్షేపించిన విధమీ పద్యమున దోచును.

ఓయి, మధువ్రతా! నిలుపుమోయి,
నిశీథపు వేళ కూర్మితో
ప్రాయపు నా విముగ్ధ హృద
యాసవమంతయు గ్రోలి విస్మృతి
చ్ఛాయమునింగి యీయెడ తుషార తిరస్కరిణీ నిబద్ధమీ
తోయజమంచు దుర్వ్యథల
ద్రోసికనుంగొన వేలమంతయున్.

ఈ పద్యమున కూడా నాయకుని తుమ్మెదతో ఉపమించినది. నాయికను తోయజముతో పోల్చినది. పూవు సందలి ఆసవమంతయు గ్రోలి, పరవశించిన పిదప పూవు మంచుతోకూడి యున్నదని విడిచి వెడలిన తుమ్మెద రీతిగా, నాయిక హృదయానురాగమంతయు దోచుకొని, వదలిపోయినదని తలచి వెడలిన నాయకుడు స్ఫురించును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సార శిరీషబంధురవి
కాలరసాల కదంబకుందమం
దార సుమాంతరాళముల
దైవ వశానమధువ్రతమ్ము సం
చార మొనర్చి నీదయిన
సాంద్ర పరీమళ సూత్న సద్గుణాం
కూరములేదలంచు జుమి
కొందలమేల సరోజరాజమా!

ఈ పద్యమునందు నాయికను ఆమె చెలికత్తె ఊరడించుచున్నట్లు కనుపించును. సరోజరాజమా! అని నాయికను సంబోధించినది. వివిధ రకములైన పుష్పములందు విధివశాన మధువ్రతమ్ము సంచారమొనర్చినను, నీ దయిన పరిమళములనే తలంచును. నీవు విచారింపకుము అని పద్మ పరమైన అర్థము. విధివశముచే ఎంతో మంది సుందరాంగులను కూడినప్పటికినీ, నీయొక్క మధురాను రాగమునే నీ ప్రియుడు తలంచును. చింతింపకుము. అని నాయికకు చెలి చెప్పినట్లు తోచును.

పద్మము : ఈ పద్యములందు కూడ ఒక చెలికత్తె నాయికా, నాయకులను సంబోధించి పలికిన విధము గోచరించును.

శ్రీలవిప్పారి తూర్పున శీతకిరణు
డుదయమగుచుండె, పద్మనీ హృదయమిందు
ముడుచుకొని పోయె తుమ్మెదా పొసగదాన
నీదురాకయు వృథయయ్యెగాదె ఆకట.

నాయికను చేర వచ్చిన నాయకునితో చెలికత్తె యిట్లనుచున్నది: నాయికను హద్దులలోనుంచువారు వచ్చుచున్నారు. అందువలన ఆమె మనసు ముడుచుకొని పోయినది. నీ రాక వృథా అయినది గదా అని తెలిపినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అయినను భృంగము యొక్క వేదనగాంచి పద్మముతో నిట్లు పలికినది:

దళములన్నియు మోడిచి దారినొసగ
వేన్ని భ్రమరమ్మునకు బద్మ! లోటు
చూడ సుంతేనిగలుగదు చూతవనులు
అంతటనుబూచి రసవంతమగుచునుంట.

నీవు మనసు ముడుచుకొని నాయకునితో చక్కగా మాట్లాడనిచో అతనికేమీ లోటు లేదు. అతనికొరకు ఎంతో మంది సుందరులు రసభరిత హృదయాలతో చూచుచున్నారు అని పద్మము నెపముతో నాయికతో పలికినది చెలికత్తె.

జగతిలో భృంగమీ పారిజాతసుమము
నెంతవరకును ఎరుగదో అంతవరకు
కుంజకుంజమ్మునన్ గలమంజులతల
యందు జరియించి పూదేనె విందుగుడుచు.

పై పద్యమున తన నాయిక హృదయానురాగమును తెలియసంతవరకు, నాయకుడు ఎంతోమంది కాంతల పొందు కోరుచునే యుండును అని తెలుపబడినది.

పుష్పాలు : కవయిత్రి ఈ పద్యభాగమునకు పుష్పాలు అని పేరిడుటకూడ ఒప్పిదమై యున్నది. కొద్దికాలము మాత్రమే విరబూచి తమ పరిమళములసంతట వెదజల్లు పుష్పములవలె చిన్ని కావ్యమునందే ఎన్నో విషయాలను వివరించు పద్యసుమము లున్నవి:

భూరితరేభ గండమదపూర్ణత వర్ధిలి సారకైరవో
దార పరాగబంధురనితాంత సుగంధ కృతాంగమై సదా
మీరెడు షట్పదంబకట మేదురనింబ సుమార్కవాటి సం
చారమొనర్పగా వలసె శాక్యవిధిన్ గురుతింప శక్యమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై పద్యమున కూడ ఒక పురుషుని తుమ్మెదతో పోల్చినది. కైరవ పరాగబంధురమై, సుగంధకృతాంగ యైన షట్పదము విధికృతముచేత నింబ సుమములయందు సంచార మొనరించుచున్నది అని విధిని దూషించినది. సకల సుఖములతో తులతూగి, సుందరియైన యువతిని కూడియుండు నాయకుడు విధి వశముచేత చేదు అనుభవములను పొందుచున్నాడని అప్రస్తుతముగా గ్రహింప బడుచున్నది. ప్రాచీన కవుల పద్యసరళిలో నడచిన పై పద్యము మధురముగా నున్నది.

కొంతకాలమ్ము నీతోడ గూర్మి నెరపి
తామర మరువకెపుడు నిన్ దలచుచుండు
నంచ, నీవు మానసమున సంచరింపు
మైన, మదిదీని చెల్మియు నరయదగును.

ఇందు అంచను నాయకునిగా నెంచి, నీతోడ గడపిన కొంతకాలమును తామర అను నాయిక మరువక ఎప్పుడు నిన్ను తలంచుచున్నది. నీవు మానస సరోవరమునందు విహరించినను తామర చెలిమిని కూడ నరయవలెను అని చెప్పుచున్నది కవయిత్రి.

పై పద్యము లన్నియు పరిశీలించినచో సమాసోక్తి, అను అలంకారమునకు దగ్గరగా నున్నట్లనిపించును.

ప్రస్తుతము (వర్ణ్యము) చెప్పునపుడు అప్రస్తుతము (మనకు ప్రస్తుతము కానిది) స్ఫురించునేని సమాసోక్తి అనబడును. ఉ. ప్రాచీ (ఇంద్రి) ముఖమును చంద్రు డనురక్తుడై (అరుణకాంతి కలవాడై) ముద్దు పెట్టుకొనుచున్నాడు చూడు.

ఇట ప్రస్తుతము చంద్రోదయ వర్ణనము. ఈ వర్ణనము వినగానే మన కప్రస్తుతమొకటి తోచుచున్నది. చంద్రుడనుట వలన నొకనాయకుడును, ఇంద్ర సంబంధముగల వనితను చంద్రుడు ముద్దు పెట్టుకొనెననుట వలన నాయకుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వభార్యనుగాక పరవని తనుముద్దు పెట్టుకొనె ననుటయు రక్తుడై అనుట వలన నాయకుని కాముకత్వమును తోచుచున్నది. చంద్రోదయము ప్రస్తుతము, పరవని తను నాయకుడు కాముకుడై చుంబించుట అప్రస్తుతము. కనుక సమాసోక్త్య లంకారమని, ఈ లక్షణము చంద్రాలోకమున చెప్పబడి యున్నది.[1]

తుకాల్కాంబ, పద్యము, పువ్వులు. మధువ్రతా- అను ఈ పద్య భాగములలో సమాసోక్త్యలంకార లక్షణమే భాసించుచున్నట్లు గ్రహింపవచ్చును.

పువ్వులు అను ఈ పద్య భాగమున కొన్ని పద్యములు వైరాగ్యమును తెలుపు రీతిలో రచింపబడినవి.

అరయగ బంధుమధ్యమున
నర్థము లేక వసించుకంటె
భీకర వృకభల్లుకాది మృగ కాండవికీర్ణ
మహాటవీ స్థలిన్
వరలుచు గంద మూల ఫల
పత్రములన్ భుజియించి శాద్వలాం
తరముల బండి నారలన
నారతమున్ ధరియించు టొప్పగున్.

అని ప్రేమాభిమానము లేని బంధువుల మధ్య వసించుట కంటె అడవిలో కంద మూలఫలాదులు తిని బ్రతుకుట నయమని నీతిని తెలిపినది కవయిత్రి.

శాంతుడైన పురుషుడు ధీరత్వముతో నుండు విధము నిట్లు వివరించినది:

కాంతాలోలకటాక్ష బాణమెవనిన్
ఖండింపదో, యేని సుస్వాంతంబాగ్రహ వహ్ని

1. చంద్రాలోక వివరణము - పుట - 60.
శ్రీ అక్కిరాజు విద్యా శేఖర ఉమాకాన్తమ్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తాపమున దాభగ్నంబుగా కుండునో,
యెంతే నింద్రియలోభపాశతతుల
న్నెవ్వాని బంధింపవో
శాంతుండాతడు యాతడే విజిత సం
సారుఁడు ధీరుండిలన్

అని స్త్రీల కటాక్ష బాణములకు చలింపని మనసు గలిగిన వాడే శాంతుడని, విజిత సంసారుడని, ధీరుడని వివరించినది.

కోకిల, మేఘములు మున్నగు పద్య భాగములలో కూడ అన్యాపదేశముగా పద్య రచన యొనరించుటయందు మిక్కిలి చాతుర్యము కలదని తెలియుచున్నది. ఏ విషయమైనను వాచ్యముగా చెప్పినదానికంటె అలంకార యుతముగనో, అన్యాపదేశముగనో వర్ణించి వ్రాయుట వలన కవుల రచనా చమత్కృతి వెలువడును. ఈ కాదంబిని కావ్యము వలన రుక్మిణమ్మ గారి రచనా నైపుణ్యము తెలియుచున్నది. ప్రతి పద్యము కూడ సంస్కృత సమాస భూయిష్టమై యొప్పుచు మధురమైన శబ్ద సౌందర్యమును స్ఫురింపచేయుచున్నది. ఇట్టి మధుర రచనా శక్తి కలిగిన ఈ కవయిత్రికి 'మధుర కవయిత్రి' బిరుదమెంతో తగియున్నది.

రుక్మిణమ్మ గారి ఇతర రచనలు యుక్తిమాల, నీలాటిరేవు కథలు, చారుదత్త, వత్సరాజు భాసుని నాటకానువాదములు. వీని యందు గల కొన్ని పద్యములు కవయిత్రి రచనా పటిమ కుదాహరణములుగా నున్నవి. దేవీ భాగవతము కూడ వచనములోనే వ్రాయబడినది. 'సప్తశతి' పద్య భాగమే.

ఏది ఏమైనను, ఉవిదలకు విద్యావకాశములు తక్కువగా నున్న ఆ రోజులందు చక్కని పాండిత్యమును పొంది, విదుషీమణియై, కవయిత్రిగా భాసిల్లి కేసరి గారిచే స్వర్ణ కంకణ బహూకృతినందిన స్థానాపతి రుక్మిణమ్మగారు ప్రశంసనీయురాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అమృత బిందు

స్థానాపతి రుక్మిణమ్మ గారి రచనలన్నియు గృహలక్ష్మి మున్నగు పత్రికలందు ప్రచురింపబడినవి. వీరి రచనలందు పూలమాల, కాదంబిని భావ కవిత్వముతో గూడినవి. గృహలక్ష్మిలో ప్రచురింపబడిన 'అమృత బిందు' అను మకుటముతో గల కవితల వలన వీరు వేదాంత పరమగు కవితను కూడ రమ్యముగా రచింపగలరని తెలియుచున్నది.

కలుష రహితమైన మనసు గూర్చి, ఇట్లు చెప్పినదీ కవయిత్రి :

మనసు శుద్ధ మశుద్ధమ్మన నగబరగు
గామసం కల్ప చిత్తమ్ము కలుషమనియు
గామ వర్జిత చిత్తమ్ము కలుషరహిత
మంచు దెలియుము ఋషుల వాక్యమ్ము సుమ్ము.

మోక్షమునకు ఉనికిపట్టు మనసే అని, మనసు విషయ రాహిత్యముతో నుండిన మోక్షమును పొందగలమని చెప్పినది.

మనసె బంధమోక్షమ్ముల కునికిపట్టు
విషయ సంసక్త చిత్తమ్ము వెలయబంధ
మగుచు విషయ రాహిత్యమౌ యాత్మయగుసు
మోక్షమునకు నెపుడు బుధామోదమొసగ
విషయ రాహిత్యమై హృది వెలయు మనసు.

గోవులు రంగు రంగులలోనున్నను, పాలు తెల్లగానే ఉండునట్లు, లింగములు (అనగా ప్రాణుల ప్రకృతులు) ఎన్నో తీరుల నుండినను జ్ఞానమొక్కటే అని చెప్పినదీ కవయిత్రి.

రంగు రంగుల వెలయ గోరాజికాని
వానిపాల రంగొక్కటై పరలునట్లు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జ్ఞాన మాపాల రీతిగా గానుపించు
లింగముల వెల్ల నావుల లీలదోచు.

జ్ఞాన మనునది పాలలో నేయి యుండినట్లు కలదని కవయిత్రి భావన. పాలను తోడుపెట్టి పెరుగుచేసి చిలికినచో వెన్న వచ్చును. వెన్నను కరిగించిన నేయి అగును. అట్లే మనసును తరచి, తరచి, చూచినచో జ్ఞానము కలదు. దానికి ఉచ్చ నీచత లేదని కవయిత్రి చెప్పినది.

పాలలో నేయి గూఢమై పరగు భాతి
భూత భూతాన జ్ఞానమ్ము పొదివి యుండె
స్వాంతన స్థానమున సదాసరవిదరచ
నది బయల్పడునుచ్చ నీచాదులేల.

అమల బ్రహ్మము నెట్లు తెలియవలెనో కవయిత్రి చెప్పిన తీరు ఇట్లు కలదు:

జ్ఞాననేత్రుండు కట్టెతో గట్టెరాచి
యగ్ని వెలయించునట్టు లత్యంత నియతి
మనసుమథియించి అమల బ్రహ్మమ్మనేనె
యంచు దెలిసి కోవలయు ముఖ్యమ్ముగాగ.

'అమృత బిందు' మకుటముతో రచింపబడిన ఈ కవితలు నిసర్గ మనోహరమగు శైలిలో సాగి, మానవునకు వేదాంతపర తత్వబోధన చేయుచున్నవి. ఇవి 1936 గృహలక్ష్మి సంచికలో ప్రచురింపబడినవి. సంస్కృత భాషాధురీణ యైన ఈ కవయిత్రి వీనిని ఉపనిషత్తుల ఆధారముగా రచించినది.[1]

చారుదత్త - నాటకము

మహాకవి కాళిదాసునకు పూర్వుడైన భాస మహాకవి నాటకములు సంస్కృత వాఙ్మయరంగమున ప్రసిద్ధినందినవి. ఆ మహా కవి రచనలలో చారుదత్త కల్పిత

1. గృహలక్ష్మి - 1936 జూలై, పుట 597.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మైన నాటకము. దశ రూపకాలలో, ఇది ప్రకరణమని విజ్ఞులు భావించినారు. భాసుడు చారుదత్త నాలుగంకములను వ్రాసినాడు. శూద్రకుడు పది అంకములు గల 'మృచ్ఛకటికము' అను పేరుగల మహా నాటకమును రచించినాడు. భాసుని రూపకములను ఎందరో కవులు తెలుగు లోనికి అనువదించినారు. చారుదత్తను మొదట చిలకమర్తి వారు అనువదించినారు. తరువాత స్థానాపతి రుక్మిణమ్మ గారు ఆంధ్రీకరించినారు.

స్థానాపతి రుక్మిణమ్మ గారికి భాసరచనలు ఆంధ్రీకరించుట యనిన మిక్కలి ప్రీతి. భాసుని 'చారుదత్త' అసంపూర్ణరూపకము. అయినను దీనియందలి సంఘటనలు, మృదుమధుర సంభాషణలు అన్నియు కవయిత్రిని ఆకర్షించినవి. అందువలన, ఆ నాలుగంకములనే కవయిత్రి ఆంధ్రీకరించినది. ఈ నాటకమును 1939 నవంబరులో తెనిగించి, అప్పుడపుడు పత్రికలలో ప్రకటించిన పిదప, పుస్తక రూపము నొందించినది. ఈ కృతిని కవయిత్రి తన పతికి పితామహియగు వేంకట రత్నమాంబ గారికి అంకితమొనరించినది. యథానువాదమైనను ఈ నాటకమున కవయిత్రి చక్కని పద్యములను రచించుటచే దీనిని పరిశీలించుచున్నాను. ప్రథమాంకమున నాందీ పద్యమేమియు లేదు. సూత్రధారుని ప్రవేశముతో నాటకము ప్రారంభింపబడినది.

ప్రథమాంకమున నాయకుడగు చారుదత్తుడు మితిలేని దానముచేసి దరిద్రుడైన పిదప చింతిల్లుచు పలికిన పద్యమిట్లున్నది:

ఎవని గుమ్మముల్ దొలిగడునింపుమీరె
బలుల దినుహంస సారసావళుల చేత
అట్టి మాగుమ్మములు బలికైన యవల
బొడము మొల్కలను దినునె - పురుగులకట.[1]

1. చారుదత్త - ప్రథమాంకము - పద్యం 2.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చారుదత్తలో దీనికి మూలమగు శ్లోకమిట్లు కలదు:

శ్లో. యాసాంబలి ర్భవతి మద్గృహ దేహలీనాం
హంసైశ్చ సారస గణైశ్చ విభక్తపుష్పః
తాస్వేవ పూర్వబలి రూఢ యవాంకురాసు
బీజాంజలిః పతతి కీటముఖావలీఢః[1] (చారుదత్త-అం 1 శ్లో 2.)

ప్రథమాంకమున విటశకారులు వెంబడింపగా గణిక పరువెత్తుచుండును. అంత విటుడు గణికను సంబోధించి -

విటు: వసంతసేనా!

నాట్యమును నేర్పు మృదుచరణమ్ముల దర
గాఢభయచంచలములైన కనులు మెరయ
పారిపోయెద వేలనే వ్యాఘ్రమువెను
వరుమగా వేగపరుగిడు హరిణివోలె.

సంస్కృత చారుదత్తమునందు విటుడు :
వసంతసేనే!

కింత్వంభయేన పరివర్తిత సౌకుమార్య
నృత్యోపదేశ విశదౌ చరణౌక్షిపన్తీ
ఉద్విగ్నచంచల కటాక్ష నిరిష్ట దృష్టి
ర్వ్యాఘ్రానుసార చకితాహరిణీ వయాసి[2]
(చారుదత్త - అంకము1, శ్లో 9)

పై శ్లోకములకు రుక్మిణమ్మ గారొనరించిన అనువాదము సహజముగా నున్నది. సంభాషణలు కూడ మూలములో నున్నరీతిగా అనువదించినారని స్థానాపతి సత్యనారాయణగారు వ్రాసిన సమీక్ష వలన తెలియుచున్నది.

---

1. " - సమీక్ష - పుట 8.
2. చారుదత్త - ప్రథమాంకము - పద్యం 9

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ నాటకమున గల నాలుగంకములందును కలిపి యేబది వరకు పద్యము లున్నవి. అన్నియు ఆటవెలది, తేటగీతులలోనే సాగినవి. కొన్ని సంభాషణా రూపముగా నడిచినవి. మరికొన్ని వర్ణనాపరముగ నున్నవి. కొన్నిటిలో చక్కని జాతీయములున్నవి. అనువాదమే, అయినను పద్యరచనా శైలి సహజముగా నున్నది.

మానవునికి పేదతనము ధరింపరాని శత్రువు. అందునను మొదట శ్రీమంతుడుగా నుండి పిమ్మట దారిద్ర్యమును అనుభవించువారి వేదన సహింప లేనిది. శ్రీమంతుడైనట్టి చారుదత్తుడు దానగుణముచే బీదవాడగును. అప్పుడతడు, ఇట్లు చింతించెను:

భాగ్యమునశించె నంచు నేవగవనిపుడు
వచ్చిపోవుచునుండును భాగ్యతతులు
సిరులు లేకున్కి నా మిత్రవరులు కూడ
విడుతురను చింత యొక్కటే వీడదెందు.[1]

భాగ్యములేని వానిని బంధువులు విడుతురు. ఎవరును లక్ష్యపెట్టరు.

ఆలకింపరు మాట చుట్టాలు తరుగు
శీలమను చంద్రుకాంతి నశించు శక్తి
మరుగదురు చెలులాపదల్ పెరుగు పరుల
పాప కృత్యముల్ బడు బేదవాని మీద.[2]

పారిపోవునట్టి వసంతసేనను వెంబడించి శకారుడు పలికినమాటలు మిక్కిలి హాస్యభరితముగ నుండి, వాని అవివేకమును వెల్లడి చేయుచున్నవి :

1. చారుదత్త – ప్రథమాంకము - పద్యం 5.
2. ,, ,, పద్యం 6.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దుస్ససేనుండు సీతను దొంగిలించి
నటుల నేజుత్తు బట్టి నిన్నిట హరింతు
యమపు రేశుండు కృష్ణుడో, యముడొకుంతి
కొడుకు జనమేజయుండొదిక్కు గలదొక్కొ.

కొన్ని పద్యములందు సందర్భోచితముగా చక్కని ఉపమాలంకారమును చేర్చినదీ కవయిత్రి. ఈ క్రింది పద్యములలో కొన్నిట చూపబడినవి.

చారుదత్తుని శీలవర్ణనము:

సకలజనులకు నైదాఘ సమయమందు
వలయునీరిడి యెండిన కొలను పగిది
ప్రియుల బ్రోవంగ నతడు దరిద్రుడయ్యె
వాని ధనమున బ్రతుకనివారు లేరు.[1]

విటశకారులు వెంబడించగా వసంతసేన, నిశివేళ చారుదత్తుని యింటచేరినది. ఆమెను గాంచి చారుదత్తుడు ఇట్లనుకొనెను:

తెలియకొసగిన పై మీది విలువ వలన
భయమునొందిన దీకన్య బహువిధాల
శారదాంబుద సంవృత చంద్రరేఖ
పగిది నొప్పారు చున్నదై వన్నెతొరగి.[2]

ఉదయించుచున్న చంద్రుని గాంచి నాయకుడిట్లనును:

రాజమార్గ ప్రదీపికా రాజమనగ
చదలనుదయించుచున్నాడు చందమామ
పంకమధ్యమ్మునన్ బడుపాలవోలె
పెల్లు చీకటి వ్రాలు జాబిల్లి వెలుగు.

---

1. చారుదత్త-ప్రథమాంకము-పద్యం 26.
2. చారుదత్త-ప్రథమాంకము-పద్యం 27

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అర్ధరాత్రివేళ తనకు నిద్రాసమయము కాగా చారుదత్తుడు మిత్రునితో నిట్లు పలికెను:

సుమటిపై నుండి వేగ గన్నుగవనాను
కొంచుమేని గిరికొను నీఘోర నిదుర
కానరానట్టి జరవోలె మానవులకు
గలుగు బలమెల్ల హరియింప వెలయుమేన.[1]

కానరాకుండగనే మానవుని శరీరమునందు ప్రవేశించి, బలమునంతను హరియించునట్టి ముసలితనముతో నిదురను పోల్చుట యెంతయు సముచితముగా నున్నది. ఇట్లే అచ్చటచ్చట చక్కని ఉపమాలంకార సహితమగు పద్యము లున్నవి.

తృతీయాంకమున చోరవర్ణన కలదు. చోరుడు యెటువంటి కన్నములను త్రవ్వును? వానిలోని భేదములు వివరింపబడినవి.

పులి ముఖమ్ము, ముక్కోణమ్ము, పూర్ణచంద్ర
మును, గజాస్యమ్ము, చంద్రార్ధము, ఝషపత్రి
మాదిగలవు సంధులు, దొంగలబ్బురపడు
సంధి నొనరింతునేనిందు సత్వరమ్ము.

అని సింహాక్రాంతముగ సజ్జలకుడు కన్నము త్రవ్వెను. దొంగవాని చాతుర్య మును, నడకతీరు కవయిత్రి వర్ణించిన తీరువలన విశదము కాగలదు.

మెల్లగా గెంతెద బిల్లి చందమ్మున
పరికింపగలడేగ వలె గృహమ్ము
నిదురించువారిని నిదుర నాగుర్తింతు
పట్టుకో దోడేలు వంటి వాడ

1 చారుదత్త-తృతీయాంకము-పద్యం 4.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మార్చెద రూపమ్ము మాయనానిము సొన
పాముకై వడివేగ బ్రాకగలను
పలుకంగ నేర్తును భారతి విధమున
రేయి దూరెద దీపరేఖమాద్రి

సంకటమ్ముల దిమిరమ్ము కరణి నోర్తు
నేలపై బర్వగా గల గాలిపగిది
జలము మీదను పోవుదు కలము కరణి
గాన నాకెందు సాధ్యమ్ము కానిదెద్ది.[1]

నాటకము నాలుగంకములతోనే కూడియున్నను, రసభరితమైన ఈ పద్యముల వలన, రచన రమ్యముగా సాగి, సహృదయులకు మనోరంజకమై యున్నది. కవయిత్రి యొక్క రచనా పాటవమును తెలుపుటకు నాటికలు ప్రతీకలుగా నున్నవి.

వత్సరాజు (నాటిక)

కవయిత్రి స్థానాపతి రుక్మిణమ్మగారిచే రచింపబడిన వానిలో చారుదత్త-వత్సరాజు మంచి నాటకములు ఇవి పద్య గద్య నాటకములు కావున ఈ నాటకములను పరిశీలించుచున్నాను. భాస మహాకవి రచనలను అనువదించుటయనిన తనకు మిక్కిలి యిష్టమని కవయిత్రి తెలిపినది.

సంస్కృత కవులలో ప్రసిద్ధుడైన భాస మహాకవి రచనలు పెక్కు కలవు. దూతఘటోత్కచము, ఊరుభంగము, దూతవాక్యము, కర్ణభారము, మున్నగు ఏకాంకికలును, స్వప్నవాసవదత్తము, అవిమారకము, పాంచరాత్రము, ప్రతిమ, చారుదత్త మొదలగు నాటకములును మిక్కిలి రసవంతముగ రచింపబడినవి.

1. చారుదత్త - తృతీయాంకము - పద్యం 10.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భాస మహాకవి 'ప్రతిజ్ఞాయౌగంధరాయణమ్' అను పేరులో వ్రాసిన నాటకకు యీ వత్సరాజు స్వేచ్ఛానువాదమని కవయిత్రి వ్రాసికొన్నది. అట్లని ప్రతి పదమును మాత్రము లేదనియు తెలిపినది. దీనిని ముందు కవయిత్రి పతిగారు వ్రాయుట ప్రారంభించి కారణాంతరములచే కవయిత్రిని రచియింపుమనినారు. దీనిని 1939 ఆగస్టులో ప్రారంభించి, అక్టోబరులో ముగించినది.

ఈ నాటకమున నాలుగంకములు కలవు. వేటయందు తమకము కలిగిన వత్సరాజును ఉజ్జయిని రాజగు ప్రద్యోతుడు మోసమున పట్టి తెప్పించి తనకు అల్లునిగా నొనరించుకొనుట, వత్సరాజు మంత్రియగు యౌగంధరాయణుడు మోసమును మోసముతోనే జయించి తన రాజును తెచ్చుకొనుట ఇందలి ఇతివృత్తము. సరసమైన సంభాషణలతో, సరళమైన పద్యములతో ఈ నాటిక హృదయంగమముగా సాగినది.

వత్సరాజును శత్రురాజులు మోసముతో కొనిపోయిన పిదప యౌగంధరాయణుడు కొని వచ్చుటకు ప్రయత్నించుచుండెను. ఉత్సాహవంతులకు ప్రయత్నించినచో సాధ్యపడనిది లేదని అతడిట్లు పలికెను -

కట్ట రాపాడ రాపాడగలుగునగ్ని
నేల ద్రవ్వంగ ద్రవ్వంగ నీరువొడము
సాధ్యపడరాని దున్నె, సోత్సాహమతుల
కన్నియు ఫలించు యత్నాల ననుసరించి.[1]

ద్వితీయాంకమునందు వాసవదత్త, తండ్రియగు మహాసేనుడు (ప్రద్యోతుడు), తల్లియగు అంగారవతి కుమార్తె యొక్క వివాహవిషయమును గూర్చి సంభాషించు సందర్భమున తల్లి బాధనుగాంచి, రాజు ఇట్లు పలికెను:

---

1. వత్సరాజు - ప్రథమాంకము - పద్యం - 17.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కన్యనర్పింపకున్నచో గలుగు లజ్జ
అర్పణముసేయ ప్రాప్తించు నమితబాధ
ధర్మమైత్రుల గిరికొన్న తల్లులకట
విధుర పరితాప మగ్నులు వివిధగతుల.[1]

కన్యనర్పించుట తల్లి విధి. కాని విడిచిపెట్టునపుడు అమితబాధ నొందును. ధర్మము, మైత్రి రెండింటినడుమ తల్లి వేదన చెందునని కవయిత్రి సహజముగా నుడివినది. ఇట్లే అచ్చటచట ఒకటి రెండు పద్యములు లోకరీతులను తెలుపుచు రచింపబడినవి. మిగిలిన పద్యములన్నియు కథకు సంబంధించినట్టివై సంభాష ణాత్మకముగా రచింపబడినవి. ఈ విధముగా ఈ నాటకము నాలుగంకములతో రసవంతముగా నడిచినది.

దేవీ భాగవతము

స్థానాపతి రుక్మిణమ్మగారు కవయిత్రిగానే కాక, గద్యరచనలో కూడ అందెవేసిన చేయి. వారి రచనలన్నింటను ప్రశంసించదగిన గ్రంథము దేవీ భాగవతము. దేవీ భాగవత మహా పురాణమును వ్యాస మహాముని సంస్కృత ములో వ్రాసినాడు. వ్యాసుని రచనకిది స్వేచ్ఛానువాదము. ఈ గ్రంథమును అనువ దించుటలో ఆమె భర్తగారగు స్థానాపతి సత్యనారాయణశాస్త్రిగారు, ఎంతో సహక రించినారు. కవయిత్రి, ఈ గ్రంథమును 1942లో ప్రారంభించి 1948లో ముగించినది. శిష్టవ్యావహారికమునందు, సులభగ్రాహ్యముగా, సరళముగా ప్రవాహ వేగమున నడిచినది వీరి రచనా విధానము. పురాణములు సంస్కృతములో నున్నవి. వానికి అనువాదాలు కొన్ని పద్యరూపములో ఉన్నవి. కాని, ఈ విధముగా వ్యావహారిక వచనములో ఆకర్షవంతముగా, పండిత పామర జనరంజకముగా రచించిన స్థానాపతి రుక్మిణమ్మ గారెంతయు ప్రశంసనీయురాలు.

ఆంధ్రపత్రికా ముద్రణాలయమువారు ఈ గ్రంథమును ముద్రించినారు ఈ దేవీ భాగవతమును కవయిత్రి తమ పట్టణమున నెలకొల్పుకొనిన, తమ యిష్ట దైవములైన కన్యకాపరమేశ్వరీ దేవికి, బాలాత్రిపుర సుందరికి అంకిత మొన రించినది.

---

1. ద్వితీయాంకము - పద్యం - 7.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందు పూర్వార్ధమున ఆరు స్కంధములు, ఉత్తరార్ధమున ఆరు స్కంధములు మొత్తము పన్నెండు స్కంధములు కలవు. పన్నెండు స్కంధాలతోను, మూడు వందల పద్దెనిమిది అధ్యాయాలతోనూ, పద్దెనిమిదివేల శ్లోకాలతోనూ ఉన్న పవిత్రమైన దేవీ భాగవత పురాణమును అనువదించి రుక్మిణమ్మగారు జీవితమునందు ధన్యురాలైనది. 'కవులు కాగానే సరికాదు. కలకాలం నిలిచే రచన చేయగలిగి కీర్తినొందవలయును' అను సూక్తిని రుక్మిణమ్మగారు పాటించి తన రచనలతో ఆంధ్ర సారస్వతమునందు చెరగని, తరగని కీర్తిముద్రవు వేసినారు. వచన రచనలు నా పరిశీలనా పరిధిలోనికి వచ్చునవి కాకున్నను దీనిని కొద్దిగా పరిశీలించినాను.

నైమిశారణ్యమునకు సూతుని రాకను వర్ణించుటతో ఈ గ్రంథరచన ప్రారంభమై, ఫలశ్రుతితో ముగిసినది. పన్నెండు స్కంధములతో కూడిన ఈ బృహద్గ్రంథము దాదాపు వేయి పుటలతో నున్నది. ఆ కాలమున ఇంత పెద్ద గ్రంథము ముద్రించుట కష్టసాధ్యమైన పని కనుక గ్రంథముద్రణ కెందరో మహానుభావులు ద్రవ్యరూపమున సహకరించినారు.

అరువది ఎనిమిది సంవత్సరాల వయసులో ఉన్న రుక్మిణమ్మగారు పాఠకుల కోరికపై మరల ఈ గ్రంథముద్రణాకార్యక్రమమును చేపట్టినది. ఈ గ్రంథ ద్వితీయ ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు, విశాఖపట్టణవాసులలో ఉదారులైన మహనీయులు కొందరు సహకరించినారు.

ఇంతటితో మధురకవయిత్రి స్థానాపతి రుక్మిణమ్మగారి రచనల పరిశీలన ముగిసినది. మహిళాలోక బాంధవుడగు కేసరిగారు రుక్మిణమ్మగారికి స్వర్ణకంకణముచే గౌరవించుట మహిళాలోకమునకే గర్వించదగిన విషయము. ఈ కవయిత్రి సాహిత్యరంగమున తన కీర్తిని చిరస్థాయిగా నిలుపుకొన్నది.

ఈ గ్రంథమును గాంచి పండితులు ప్రశంసించిరి. ఆలపాటి కామేశ్వరరాయకవి ఇట్లు ప్రశంసించెను :

ఏపున సంస్కృతాంధ్రమున నీమెగడించిన పాండితీకలా
దీపిత కీర్తి చంద్రికలు దిక్కులవెల్గు మనోజ్ఞ శబ్ద సం
స్థాపిత కావ్యజాలముల జక్కగ గూర్చు మనంబులందు స్థా
నాపతి రుక్మిణమ్మ కవనంబు కరంబు ముదంబు డంబుగన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కళాప్రపూర్ణ
డా॥ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ (1953)

ఆంధ్ర సరస్వతిని తన కవితామృత ప్రవాహమున ఓలలాడించి, సారస్వత రంగమున, కవితా రంగవల్లికలను తీర్చి శోభాయమాన మొనరించి, మహిళా లోకమున కీర్తి నొందిన కవయిత్రి డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారు. పింగళనామ సంవత్సరమున డిసెంబరు (1917)న ఈ కవయిత్రి ఏలూరులో జన్మించినది. నాళం కృష్ణారావు గారు, సుశీలమ్మగారలు ఈమె తల్లి దండ్రులు. చిన్నతనమున వీధిబడియందు విద్య నేర్చినది. రాజమహేంద్రవరము వైశ్య సేవా సదనము యువతీ సంస్కృత కళాశాలలో బత్తుల కామాక్షమ్మ గారి సమక్షమున సంస్కృతాంధ్రముల నభ్యసించినది. నాట్యము, సంగీతము, చిత్రకళల యందును అభిమానము చూపి బాల్యముననే నేర్చినది. తెలుగు, సంస్కృతములే కాక, ఆంగ్ల, హిందీ భాషలను కూడ పరిచయ మొనరించుకొనినది. 1935వ సంవత్సరమున ఉభయభాషా ప్రవీణ పరీక్షలో ప్రథమ గణనీయురాలైనది. సంగీత సాహిత్యములయందే కాక ఆధ్యాత్మికాసక్తితో యల్లాప్రగడ జగన్నాథ ప్రబోధనసహకారమున ప్రముఖులైన వేదాంతుల తత్వములను తెలిసికొనినది.

లక్ష్మీకాంతమ్మ గారు 'కృష్ణకుమారి' పేరుతో ఎన్నియో రచనలొనరించి పత్రికల యందు ప్రకటించినది. ఈ కవయిత్రి తండ్రి నాళం కష్ణారావుగారు ఏకేశ్వర ప్రార్థనాసక్తులు, బ్రహ్మసమాజ ధర్మపరాయణులు. తండ్రిప్రభావము పుత్రికపై నుండుట సహజము. లక్ష్మీకాంతమ్మ గారు కూడ తన మనస్సును భగవంతుని యందు లగ్న మొనరించి భజనలొనరించెడిది.

ఈ కవయిత్రికి (24-3-1930) పదమూడవయేటనే వివాహమైనది. ప్రముఖులగు న్యాయవాదులైన ఊటుకూరి హయగ్రీవ గుప్తగారు ఈమె పతి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేవులు. ఈ కవయిత్రికి సంగీత, సాహిత్యములందు గల ప్రతిభాసక్తులను పెంపొందించుకొనుటకు హయగ్రీవ గుప్త గారెంతయో సహకరించిరి. తల్లి దండ్రుల ప్రతిభా పాండిత్యములు, అత్తింటివారి సారస్వతాసక్తి లక్ష్మీకాంతమ్మ గారి ప్రజ్ఞాపాటవములు పెంపొందుటకు దోహదమొనరించినవి.

బిరుదములు : ఉభయ భాషాప్రవీణ, తెలుగు మొలక, విద్వత్కవయిత్రి, బ్రాహ్మీభూషణ, సాహితీ రుద్రమ, ధర్మప్రచార భారతి, ఆంధ్ర సరస్వతి అని సారస్వతేయు లామెను కీర్తించినారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఆమెను 'కళా ప్రపూర్ణ' బిరుదముతో మన్నించినది.

ఈ కవయిత్రి కేవలము కవితా రచనలతోనే కాలక్షేపము చేయలేదు. అనేక ప్రముఖ సంస్థలతో సంబంధమును పెంచుకొని సాహిత్యసేవ, సంఘసేవ యొనరించినది.

ఈ క్రింది సంస్థలతో ఆమెకు సత్సంబంధము కలదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ, బాలల ఎకాడమీ, తెలుగు భాషాసమితి, విశ్వహిందూ పరిషత్, గోరంట్ల వెంకన్న ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ, వేట పాలెం సారస్వత నికేతనం, రాజమండ్రి గౌతమి గ్రంథాలయము, రాజమండ్రి ఆంధ్ర యువతీ - సంస్కృత కళాశాల, ఆంధ్ర రచయిత్రుల సలహా సంఘం, సంస్కృత సలహా సంఘం, గిల్డ్ ఆఫ్ సర్వీస్, ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేటు, రేడియో సలహా సంఘం, ఆంధ్ర స్టేట్ సోషల్ వెల్ఫేరు సలహా సంఘం, బాపట్ల వుమన్స్ కోపరేటివ్ కాటేజి యిండస్ట్రీస్, కేంద్ర సాహిత్య అకాడమీ, శ్రీహితైషిణీ మండలి వంటి అనేకములైన సంస్థలలో సభ్యత్వమునో, అధ్యక్షస్థానమునో కలిగి వాటితో సత్సంబంధము కలిగి యున్నారు. సాహితీలోకమే కాక ఇతర సేవాసంఘాలెన్నియో లక్ష్మీకాంతమ్మగారి ప్రతిభా ప్రావీణ్యతలను, సేవా తత్పరతను తెలిసికొని యున్నవి. సంఘములోని దురాచారాలను, దుర్నీతులను లక్ష్మీకాంతమ్మగారు సహింపజాలరు. వారు తమ గంభీరోపన్యాసములందు తమ అభిప్రాయములను వ్యక్తీకరించినారు. తమ రచనలలో చూపించినారు. అంతేకాక స్వయముగా కూడ సంఘసేవ యొనరించి కీర్తి బడసినారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచనలు : కవయిత్రి అనేక రచనలొనరించినది. ఇందు పద్య రచనలనేకములు కలవు.

పద్యరచనలు	గద్యరచనలు
1. మనసాహితి-మధుభారతి	1. ఆంధ్ర కవయిత్రులు
2. మహిళా విక్రమ సూక్తము	2. అఖిల భారత కవయిత్రులు
3. లజ్జాకిరీట ధారిణి	3. ఆంధ్రుల సంగీత వాఙ్మయసేవ
4. ఒక్క చిన్న దివ్వె	
5. సదుక్తి మంజరి	
6. జాలిపిత	
7. నా తెలుగు మాంచాల.	

గేయ కావ్యములు : 1. కాంతి శిఖరాలు 2. కన్యకమ్మ నివాళి.

సంస్కృత రచనలు : 1. శ్రీకన్యకా పరమేశ్వరీ సుప్రభాతము. 2. దేవీ స్తవ హారావళి.

ఇంతటి ప్రతిభాశాలిని, విదుషీమణియగు లక్ష్మీకాంతమ్మ గారిని కేసరిగారు 1953 వ సంవత్సరమున స్వర్ణకంకణ ప్రదాన మొనరించి ఆదరించినారు. డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారికి 'స్వర్ణకంకణ ప్రదానము' రాయపేటలోని కేసరి కుటీరము నందు 1953 మార్చి నెలలో వైభవముగా జరిగినది. కేసరిగారు అనారోగ్యముతో ఉన్నప్పటికిని, అత్యంత ఉత్సాహముతో సభకు వచ్చి లక్ష్మీకాంతమ్మ గారిని ప్రశంసించి స్వర్ణకంకణమొసగినారు. శ్రీమతి జాస్తి సీతామహాలక్ష్మి యం.యల్.సి. గారు నాటి సభకు అధ్యక్షురాలిగా నుండిరి. స్వర్ణకంకణ ప్రదానమే గాక కవయిత్రికి అనేక సభలయందు పండిత సన్మానము జరిగినది. ఆంధ్ర మహిళా లోకమునకు వెలలేని, తులలేని మణి దీపమువంటి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి కావ్యపరిశీలనము నొనరించు భాగ్యమందిన నేను ధన్యురాలనని భావించుచున్నాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక్క చిన్న దివ్వె - ఖండకావ్యము

చిన్ని దీపంతోనే చుట్టూరా ఆవరించి ఉన్న చీకట్లను తొలగించుకోవచ్చు అన్నట్లు ఈ 'ఒక్క చిన్న దివ్వె' కావ్యంతో అజ్ఞానాంధకారాన్ని తొలగించుకొన వచ్చును. ఈ కావ్యమున 17 ఖండికలు కలవు. అన్నియు భావ బంధురములై మనోజ్ఞ రచనా విలసితములై యొప్పుచున్నవి. శ్రీయుత జి. వి. జ్వాల నరసింహ శాస్త్రిగారు బి.కాం.,బి.ఎల్. అడ్వకేటు, బాపట్ల వీనికి ఆముఖము రచించి నారు. ఎంతో విపులముగా వ్రాయబడిన ఆముఖము వలన కవయిత్రి విశిష్టత, కావ్య ప్రత్యేకత తెలియును.

ఈ ఖండకావ్యమున ముందుగా 'ఓహో మహాత్మా - ఓ మహితాత్మ' పేరుతో మహాత్ముని ప్రస్తుతించినదీ కవయిత్రి.

మహితాత్ముడైన మహాత్ముడు అడుగిడిన జాడలు, యెత్తిన కరముల నీడలు, పల్కిన పల్కులు, పిలిచిన పిలుపులు అన్నియు సకల భూతములకు, సర్వలోకములకు హితము, సమహితమును కలిగించునవని కవయిత్రి ఇట్లు చెప్పినది:

నీ మోపిన పదము జాడ సకల తీర్థమనుగ మించె
నీ యెత్తిన కరము నీడ శాంతి దేవి విశ్రమించె
నీ పల్కిన పల్కు చాయ శ్రుతి శిరములు ప్రతిరవించె
నీ పిల్చిన పిలుపునంది భువన పాళి తలలు వంచె-
సకల భూత సమహితాత్మ
సర్వలోక హిత రతాత్మ
ఓహో మహాత్మా - ఓ మహితాత్మ.[1]

సర్వస్వము త్యజించిన త్యాగ హేమాద్రి వంటివాడు, ఏడువారాసులెత్తి వచ్చినా చలింపని మేరుధీరుడు, మేటివీరుడు, రాగభోగములను త్యాగమొనరించిన

---

1. ఒక్క చిన్న దివ్వె - పుట 1.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజయోగి, మనుజ జాతి సమైక్యత దీర్చిన మాన్యుడు, అహింసా ధర్మయుద్ధముల నేకాస్త్రి కొరకు జీవితమును పణముగా పెట్టిన మహాత్ముని మహోన్నత రూపమును కవయిత్రి ఒక్క చిన్న దివ్వెగా చూపించినది. ప్రేమ మూర్తియగు గాంధి రూపమును అనేక రీతుల ప్రస్తుతించినది.

పరిపంథుల హృదయవైర గ్రంథులందు
ప్రేమ గంధ మొలికించిన గాంధివయ్యా
భుజస్కంద మందు ప్రజల దుఃఖదైన్య
భారమ్మును మోచి కలత తీర్చిన దైవ సమస్కంధివయ్యా
ప్రతి క్షణమున పరహితమును
పాటించిన పావనుడవు
కులమత భేదమ్ము బాపి
మనుజ జాతి నొకరీతిగ
భావించిన పండితుడవు.[1]

అని మహాత్ముని కీర్తించి "పూర్వ ఋషులతో పోల్చి మహర్షియనుట మా వాచాలత కానీ, వారికేది ఆర్షమైన ఈ ఘనత" అని నొక్కి పలికినది. పరపీడనలో, అంధకార బంధురమైన జీవితమును గడిపిన ప్రజావళికి, మట్టి మెదపి మణి దీపములుంచినట్టి మహాత్ముడు 'ఒక్క చిన్న దివ్వె'గా ప్రకాశించి వెలుగందించినాడని కవయిత్రి రచించిన ఈ కవిత హృద్యముగానున్నది.

లల్లఆత్మసాధన : ఆధ్యాత్మికపరమైన ఈ కవితలో సాధకుడు భగవంతునికొరకు తపించు రీతి, సాధనమొనరించి సిద్ధి కలిగిన వెనుక భగవదనుభవమును పొందు విషయమును కవయిత్రి విశిష్ట రీతిలో వర్ణించినది.

మూర్తియును శిలయె ఆలయమ్మును శిలయె
రెండునివి యేకవస్తు సముద్భవములె

1. ఒక్క చిన్న దివ్వె - పుట 3.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేని నారాధనము సల్పెదో పండితుండ
ఊర్పులన్ బిగియించి, లగియింపు చిత్తమున్ విడువకుండ.[1]

కవయిత్రికి మూఢాచారముతో నొనర్చు బలులపై, హింసలపై మిక్కిలి యేహ్యాభావము కలదు.

పడియ నీటిని త్రావి పచ్చిక బీళ్ళమేసి
మానసంరక్షణార్థమ్ము, మరిచలినాపుటకును
గొర్రె నీకిచ్చు ఉన్నిని ఇంతింతలేసి
మూఢ బ్రాహ్మణ నిర్జీవ శిలామూర్తి కొరకు
ఈ అమాయిక జీవాల చంపుడనుచు
నెవరు నేర్చిరి ? ఇది నిన్నెట్లుగాచు.[2]

ఒక్క చిన్న దివ్వె ; శూన్యమందు చుక్కవోలె మెరసి, శుభ్రకాంతి ధారలను కురిసి, ఉర్విలోని జీవకోటి ఔన్నత్యమును చాటిన ఒక చిన్న దివ్వెను కవయిత్రి యెన్నో విధములుగా వర్ణించినది. ఆ వర్ణనలో కూడ మాతృదేశ దాస్యమును తొలగించి, తల్లిఋణము తీర్చుకొన్న మహానుభావులను ఒక చిన్న దివ్వెగా చూపించినది. ఒక్క చిన్న దివ్వె వెలుగులో జాతి మత భేదాలు, అవినీతి, అసత్యం మున్నగునవి అన్నీ తొలగిపోయి సౌభ్రాతృత్వము పెరుగును అని కవయిత్రి భావము.

భేదబుద్ధి తొలగింపగ
శక్తి ధారవోసింది
సౌభ్రాత్రము మహిపెంచగ
ప్రేమ పథము పరచింది

1. ఒక్క చిన్న దివ్వె - పుట 12.
2. ఒక్క చిన్న దివ్వె - పుట 14.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చుక్కవోలె మెరసింది
హాస్యమందు శుభ్రకాంతి
ధారలను కురిసింది ఒక్క చిన్న దివ్వె.[1]

యువతరానికి స్వాగతం, నవశకానికి రుచిరాగతం

ఈ కవితలో కుటిల నీతిపాటవంతో ధర్మశక్తిని నశింపజేసి, మాటల నైపుణ్యంతో నిజాయితీని పోటు పొడిచి, పేదల బ్రతుకుల్లో నిప్పులు చెరుగుతూ, రాజకీయ చైతన్యం పరిచిన రంగుల హరివిల్లు అమాయిక ప్రజానీకం అంగిట్లో వరిముల్లై దిగబడి పోయిందని చేదు పడ్డ జీవితాలకు స్వాదుపథం పరచేటందుకు రమ్మని యువతరానికి స్వాగతం చెప్పింది కవయిత్రి.

అంతరంగ ప్రాచికడిగి
విమల భావనా లావణ్య దీధితులను పచరించే
ముత్తెపు దొంతర్లముగ్గులు బెట్టి
విశ్వశ్రేయాన్ని ఆమతించే
శుభకామనల తోరణాలు తీర్చి దిద్ది
భారతి లోకమంగళ గీతికి
గళం సవరిస్తూ ఉన్నది
భవిష్య దర్శానికి బాటలు వెయ్యాలి
భారతమాతకు హారతు లియ్యాలి.[2]

రమ్మని యువతరానికి స్వాగతం పలికి నవశకానికి రుచిరాగత మొనర్చి నది కవయిత్రి.

---

1. ఒక్క చిన్న దివ్వె - పుట 24.
2. ఒక్క చిన్న దివ్వె - పుట 40.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాగాలయా వారి భోగమహల్ ; సమాజంలో భోగ, విలాసాలల్లో మునిగి, మత్తుగా, గమ్మత్తుగా, చిత్తుగా, మత్తకాశినుల మేని అందాలను పురెసిళ్ళతో త్రాగి గాజుబారిన కళ్ళతో, బూజుపట్టిన మనస్సులతో, వాడవదినల పోడుముల ముచ్చటల కోసం పోటీలు పడుతూ తలపడే పోటు మానిసులను చూచి విస్తు పోయింది కవయిత్రి. వారికి మానవత్వంలోని పవిత్రతను గుర్తు చేస్తున్నది—

ఈ మన్మథలీలాస్మరణంలో తలమునకలౌతూ ఉన్నారా
మనం మసిలే ఈ మహీతలమహా మాన్విత
చరిత్రనే మరిచిపోయారా
త్యాగాలయావారి యోగ భూమిలో
ఆర్ష జీవనరాగిణుల అంతస్సౌందర్య వాహికలు
ఆ చైతన్యంతో ఆనందనర్తనం చేస్తూంటే
అనిమేష నయనాలతో అఖండ భక్తితో
అపూర్వ గౌరవాన్ని పచరించే ఆర్య మహాశయుల
ఆవాసమైన అతి పవిత్ర భూమి ఇది.
మనం మానవులం
మస్తిష్కాంకల మాన్యమూర్తులం
ఈ మాన్యధరిత్రీ మాత ప్రసవించిన మహా
పవిత్ర మూర్తులం.[1]

అని తెలియజేసింది కవయిత్రి. ఈ ఒక్క చిన్న దివ్వె ఖండకావ్యంలోని ఖండిక లన్నియు మానవత్వాన్ని ప్రబోధిస్తూ, జాతీయాభిమానాన్ని ప్రేరేపిస్తూ, మాతృ భూమిపై మమతను రేకెత్తించునట్లు రచించినది కవయిత్రి. భారతీయ సంస్కృతి యెడల ఆమెకు గల ప్రేమాభిమానములను తెలియజేస్తూ కొన్ని రచనలున్నవి. కవితలన్నియు కవయిత్రి హృదయంలోని ఉద్విగ్నతను చాటుచు, వీర రసభరిత

1. ఒక్క చిన్న దివ్వె - పుట 46.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ములై యొప్పియున్నది. కవయిత్రి వెలిగించిన ఈ 'ఒక్క చిన్న దివ్వె' ఆంధ్రలోకానికి వెలిగించిన మరొక మహోజ్జ్వల దీపశిఖ అని నరసింహశాస్త్రి గారు నుడివిన పలుకులు నిత్య సత్యములు.

మధుర కవితయగుచు సుధలను జిందించి
తెలుగు జగతి కెవరు వెలుగు దెచ్చె
ప్రథితినిచ్చు నామె ప్రాజ్ఞ యైసాహితీ
ప్రథమ పీఠమెక్కు పరమపూజ్య.[1]

మ న సా హి తి - మధుభారతి

ఖండ కావ్యము

విద్వత్కవయిత్రియగు డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి మధుర లేఖిని నుండి వెలువడిన మరొక మధుర కావ్యము "మన సాహితి - మధుభారతి". ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ వారి ప్రాతినిధ్యముతో ఆంధ్రప్రదేశ్ బాలల ఎకాడమీ సభ్యురాలిగా చేరిన పిదప లక్ష్మీకాంతమ్మగారు చిన్న పిల్లలు పాడుకొని విజ్ఞానమును పెంపొందించుకొనవలెనను భావనతో కొన్ని కవితలను రచించినది. వానితోపాటు మరికొన్ని ప్రౌఢ కవితలను గూడ చేర్చి "మన సాహితి-మధు భారతి" అని ప్రకటించినది. ఆంధ్ర ప్రభుత్వమున విద్యాశాఖా సాంస్కృతిక శాఖామాత్యులుగా నుండి, తెలుగు భాషకు సేవ యొనరించి ఖ్యాతి నొందిన ఆనాటి మంత్రి మండలి వెంకటకృష్ణారావు గారికి సౌహార్ద్ర హృదయముతో ఈ కావ్యము సంకితమొనరించినదీ కవయిత్రీమణి. కళాప్రపూర్ణుడు, కవిశేఖరుడైన డా.దాశరథి గారు ఈ కావ్యమునకు "అభ్యుదయ భాను కిరణ కాంతులు" అను పేరున సమీక్ష వ్రాసినారు.

---

1. ఒక్క చిన్న దివ్వె - జ్వాల నరసింహ శాస్త్రిగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందుగల ఖండికలను "మణిమాలికా కిరణకాంతులు" అని పరిచయమొన రించినది కవయిత్రి, ఆ పేరు వినుటకు ఎంతో శ్రుతిపేయమై యున్నది. కవిత లన్నింటియందును "మనసాహితి-మధుభారతి" మన సంస్కృతి-మనసత్కృతి రుధిర ప్రస్థానం, పార్వనా, మిక్కిలి రమ్యమైన రచనలు.

రుధిర ప్రస్థానం: ఈ గేయము ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు, శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారి యేబది రెండవ జన్మదినోత్సవ సందర్భంగా అవనిగడ్డలో జరిగిన సభలో కవయిత్రి చదివినది. ఈ కవితలో మానవుని భవిష్యత్తులో కలిగే అభ్యుదయాన్ని, ఉజ్వల భవిష్యత్తు వేసే బంగారు బాటలను ఆశిస్తూ కవయిత్రి గడ్డకట్టిన రక్తం మళ్ళీ స్వేదజలాల కాలువగా ప్రవహించా లని కోరుతూ రచించింది. మానవుని చుట్టూ క్రమ్ముకొనిపోయిన చిమ్మచీకట్లు విరిగి, కాంతిగోళాలతో నిండిన వెలుగుతో, ఆంధ్రావనిలో చైతన్యం ప్రవహించి మానవత్వానికి ప్రోదిసల్పాలని భావించింది.

గడ్డకట్టిన రక్తం
అభ్యుదయ భానుని కిరణకాంతులకు
కరగి స్వేదజలాల కాలువగా ప్రవహించి
ప్రజల దుఃఖ దైన్యాలను పోకార్చదా.
ఈ చిమ్మచీకటి విరిగి
ఈ అనంత విశాల విశ్వం కొమ్మల రెమ్మలలో
విరగబూసిన వసంతోదయం
మన నేత్రేంద్రియ తర్పణం చెయ్యదా
ఎందుకు నయన తర్పణం చెయ్యదు.[1]

అని కవయిత్రి విలక్షణమైన భావనతో ప్రజల దుఃఖ దైన్యాలను తొలగించే ఉషోదయం కొరకు వేచి చూచింది.

ఆమె ఆశలు, ఆశయాలు ఫలించినవి. మానవత మేల్కొన్నది.

---

1. మన సాహితి, మధుభారతి, పుట 42.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మేల్కొని -

మానవతా రుధిరం ప్రస్థానం చేసింది
నవయువతలోని ఉడుకు రక్తం
హిమశిఖరాలను అధిగమించి
ఆటంకాలను ఛేదించి.[1]

ఒక్క ఉదుటుతో మానవత్వానికి ప్రోది సల్పి మధురభారతి మూర్తులుగా మలచి స్ఫూర్తినిచ్చింది. లలిత, లలిత పదములతోనే కవితల్లి రక్తం వేడెక్కునట్టి ఉద్విగ్నకరమగు రచనమొనరించి రుధిర ప్రస్థానానికి ధ్యేయాన్ని కూర్చింది, కవయిత్రి.

మన సాహితి - మధుభారతి :- తేనెవంటి తియ్యదనము, తేటదనము కలిగిన తెలుగు భాషను, తెలుగు దనపు అందచందాలను, కవయిత్రి ఈ కవితలో కమనీయముగా వర్ణించినది. ఆదికవి నన్నయ మొదలుకొని ఆధునికుల కాలము వరకు తెలుగుభాష ఎన్ని అందచందాలను సవరించుకొన్నది, ఏయే రచనలలో రూపొందినదో తెలుపుచు తెలుగు తీపిని, తెలుగు తనపు సౌగంధ్యమును వివరించినది. కవయిత్రి, స్వస్థాన వేషభాషలను ప్రస్తవము చేసి ఆంధ్రత్వమును చూపినట్టి నన్నయ ప్రశంస రమణీయముగా నున్నది.

స్వస్థాన వేష భాషల
ప్రస్తవమును సేసి తెలుగు
ప్రజలకు, తెలుగుపైన మోజు
కల్గించిన ఘనయశుడు.[2]

భారత రచనమ్ము పూని
అక్షరమౌ రమ్యార్థము

1. మన సాహితి, మధుభారతి, పుట 4.
2. మన సాహితి, మధు భారతి - పుట 7.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నందమ్ముగ కథల పొదివి
యందించిన ఘన తపస్వి
మతి మంతుడు మహిమాన్వితు
డాంధ్రవాణి ప్రథమార్చకు
డాద్యాంధ్ర కవివతంసుడు
నన్నపార్య నాణ్యమైన
జ్ఞానమంత - కావ్యమంత
మన సాహితి - మధుభారతి
శివరంజని - జ్ఞానాంజని.[1]

ఆంధ్ర భాషయొక్క విశిష్టతను కవయిత్రి, ప్రముఖములై, ప్రత్యేకము లైన ఎన్నియో వస్తువులతో పోల్చి చూపినది.

మధురాంధ్రము మహనీయము
మధు కలశము, పృధుశిఖరము
మహిమోన్నత, హిమకుధరము
మందారపు మకరందము
శృంగారపు శిఖిపింఛము
కాంతా హృత్కమనీయము
సహితాశయ స్పృహణీయము
రాధా విభు రమణీయము
మన సాహితి మధు భారతి
అఘభంజిని - శివరంజని.[2]

1. మన సాహితి, మధు భారతి - పుట 8.
2. మన సాహితి, మధుభారతి - పుట 19.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మన సంస్కృతి-ఘన సత్కృతి : తరతరాలుగా వస్తున్న తెలుగు వారి సంస్కృతిని వివరించి, మన సంస్కృతికి ప్రతీకలుగా నిలచిన శ్రీరాముని, శ్రీకృష్ణుని, బుద్ధుని, పృథ్వీరాజాదులను వర్ణించినది కవయిత్రి. వారందరి మహనీయమైన శీలములు వివరింపబడిన ఈ కవిత ఆంధ్రుల సంస్కృతిని అద్దము పట్టి చూపునట్లున్నది.

ఉత్తమ ధర్మములను బోధించిన వివేకానందుని గూర్చి ఇట్లు చెప్పినది :

సర్వోత్తమ ధర్మమ్మగు
ఆధ్యాత్మిక ధర్మబోధ
ఉర్విగల్గు జనులకెల్ల
ఉత్తమముగ చాటినట్టి
ఘనుని వివేకానందుని
ఘనతను వెలయించినట్టి
మన సంస్కృతి - ఘన సత్కృతి
పుణ్యాకృతి - భువనసుకృతి.[1]

పార్వనా : రష్యను జానపదగాథకు స్వేచ్ఛానువాదమగు కవిత ఇది. 'పార్వనా' అను భూభాగము నేలు రాజునకు సౌందర్యవతియైన కూతురు కలదు. ఆ బాలిక పెరిగిన పిదప తండ్రి స్వయం వరము చాటెను. ఆ వీరులను జూచి ఆ బాలిక కోరిన కోరిక వింతగా ఉన్నది.

వసుధలోగల వజ్రరాసుల
నాహరించిన హర్షమొదవదు
తారకాళిని ధరణి జేర్చిన
సంతసమ్మది సుంతగలుగదు

1. మన సాహితి, మధుభారతి - పుట 21.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాక రాజ్యము నాక్రమించిన
ఆశ తీరదు లేశమయ్యను
ఎప్పుడారని నిప్పు ముద్దను
నిచ్చ వెలిగెడు నిత్య జ్యోతిని
తెగువ మీరగ తెచ్చి యిచ్చెడు
నాతడే హృన్నేత యగునిక
మేలుగలుగగ నేలునన్నిక.[1]

ఆ భామ పల్కిన పలుకువిని వీరులు సర్వ దిశలకు పోయిరి. కాని ఏండ్లు గడచెను. కమ్మనైన కొమ్మ కోరిక తీరు తెరవే తోచదయ్యెను.

అతివ కోరిక అణగిపోయెను
వనిత ఆశాలతలు వాడెను
మూర్తి చెందిన శోక దేవత
యగుచు మూర్ఛిలెనతివయంతట
కనుల వెల్వడు కన్నీరులట
మున్నీరులై ముంచె దుర్గము
సురుచిరమ్మగు సుదతి వీక్షణ
యుగళి వెల్వడి సాగెడి బాష్ప
పూరమందున మునిగి పోయియు
విభుని దుర్గము రీవి విడువదు
దుఃఖవార్నిధి దోగియునహా
వడలి సుందర ప్రభయణంగడు.[2]

కోరరానట్టి కోరిక తీరకపోవుటచే వ్యధ చెందిన ఆ బాల కరుణ గాథను కవయిత్రి మాత్రాచ్ఛందస్సులో కమనీయముగా రచించినది. ఈ ఖండకావ్యమున ఇది గొప్ప కవిత. కవయిత్రి భావనా సౌందర్యమును భాసింపజేయుచున్నది.

1. మన సాహితి - మధుభారతి - పుట 28.
2. మన సాహితి - మధుభారతి - పుట 32.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మధుర శబ్ద భరితములై, రాగయుక్తముగా పాడుకొనదగిన గేయములు కోకిలమ్మ పాడింది, కలువకన్నె మొదలగునవి. ఇట్టి రమణీయమైన రచన లొనరించి ఆంధ్ర భారతి గళహారముగా నొనరించిన కవయిత్రి ప్రశంస నీయురాలు.

మహిళా విక్రమ సూక్తము-ఖండకావ్యము

ఆంధ్ర సరస్వతి, సాహితీ రుద్రమయగు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు "మహిళా విక్రమ సూక్తము" రచించి మహిళా లోకమునకొక వెలుగు చూపినారు. ఆంధ్రప్రదేశ్ ప్రథమ మహిళా గవర్నరు శ్రీమతి శారదా ముఖర్జీ గారికి గౌరవ ప్రేమాదరములతో ఈ కావ్యమును సమర్పించినది.

ఇందు వైదిక ఖండము, పురాణ ఖండము, స్మృతి ఖండము, కావ్య ఖండము, చరిత్ర ఖండము, ఆధునిక ఖండము, సంస్కార ఖండము, ప్రస్తుత ఖండము అని భాగములు కలవు.

వైదిక ఖండము : వైదిక ఖండమున స్త్రీకి ఆనాడు కలిగిన గౌరవ మర్యాదలను కవయిత్రి చక్కగా వివరించినది. సత్వరజస్తమములను త్రిగుణ ములు ప్రకృతిలో సమముగా మేళనమందినచో 'స్త్రీ' ఉదయించుననియు త్రిగుణాతీతగా వర్తించుననియు తెలిపినది.

రమణులు పూజ్యత గనిన స్థలమ్మున
రమి యింతురు సుమి దేవతలెప్పుడు
రాముల భాగ్యమెరస నీ భాగ్యము
రాముల యున్నతి రసకును యున్నతి
వృత్తి విద్యచే నార్జన చేసెడు-
పడతుకలుండెడి భాగ్యకాలమది
వేదగాథలివి విదితము సేయును.[1]

అని వేద కాలపు విశిష్టతను తెలియపరచినది.

1. మహిళా విక్రమ సూక్తము - పుట. 5.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పురాణ ఖండము : పురాణ యుగమునందు మహిళలు పొందిన మర్యాదలను వివరించి, మాతృదేవికే ప్రథమ స్థానము కలదని తెలియబరచి, సాయం సంధ్యల యందు ఋషులతోపాటు, మహిళా ఋషులకు వందన మిడు ఆచారము మనకు కలదని నుడివినది. ఆనాటి మహిళల స్థానము నిట్లు తెలిపినది :

మహిళలు మహాజ్ఞానవతు లంచును
మాండూక్యమ్మది మరిమరి వాకొనె
మానవ సంతతి గురుపరంపరను
మాతృ దేవికే ప్రథమ స్థానము
మాతృదేవో భవ యన్ మాన్యపు
సూక్తికి నియ్యది యేకద యర్థము
భవతి భిక్షాందేహి యను సుతునకు
భిక్షమ్మిడి విద్యార్జన కంపెడు
ప్రప్రథమార్హత జననిదె కాదే [1]

అని పురాణ కాలపు విశిష్టతను తెలిపినదీ కవయిత్రి.

స్మృతి ఖండము : మనువు విధించిన స్మృతియందు స్త్రీలకు గల స్థానమును, అర్హతలను ఈ కవితలో తెలియపరచినది. మనువు చెప్పిన "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అను వాక్యము యుక్తమైనదే అని, స్త్రీలకు వారి దశల ననుసరించి పురుషుల రక్షణ యుండవలెననియు, మానిని పతివ్రతగా యుండి, మహికి శోకము కలుగకుండునట్లు చూడవలెననియు, ఆమె సుపుత్రవతి యగుటకు మానవ సంఘముదే బాధ్యత అని తెలిపినది. స్త్రీలను అవమానము చేయకూడదని కవయిత్రి ఇట్లు బోధించినది.

అట్లని సాధ్వికి నవమతి సల్పుట
అబల అబల యంచును హింసించుట

1. మహిళా విక్రమ సూక్తము - పుట 6.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంతులనవహేళన సేయుట
రామలు ఆత్మ గౌరవము వీడుట
మానిని పదమునకే అపయశమగు
ముగుదలు గౌరవమును కోల్పోవుట
కంటెను నీచము మహిలో గానను
ఆత్మగౌరవము కల్గిన అతివయె
పుడమిని పూజ్యత పొందునటంచును
శకుంతలాసతి చరితమె వాకొను.[1]

అని స్మృతి కాలపు ప్రత్యేకతను వివరించినదీ కవయిత్రి.

కావ్యఖండము : కవయిత్రి దీనిలో శకుంతల, సీత, సులభ మున్నగు వారి గొప్పదనమును చాటినది. అపాల, విశ్వవార, వాగ్దేవినంటి మంత్ర దర్శన మొనరించిన మగువలను గూర్చి వివరించినది. వారి గాథలెంత విన్నను తనివి తీరదను అభిప్రాయమును వెల్లడించినది.

చరిత్ర ఖండము : వీరనారులు, ధీరమహిళల చరిత్రలను ఇందు కవన మొనరించినది. రాణీ రుద్రమ, ఝాన్సీ లక్ష్మి, చాందు బీబీ, రాణీ సంయుక్త మున్నగు వనితలను ప్రస్తుతించినది. స్వయంవరమున భర్తను పొందిన సంయుక్తను వర్ణించునపుడు కవయిత్రి తన భావము నిట్లు తెలిపినది :

వైదిక కాలమునుండియు చూచిన
పేద సాదలను భేదములేకను
ధర్మము దప్పని సరణిని సమగలి
మగువలు వలచిన మగలను
సనువౌ ధర్మము స్వయంవరముకద

1. మహిళా విక్రమ సూక్తము - పుట 10

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వయంవరమ్మే కాంతాస్వతంత్ర
వృత్తిని జాటెడు కేతనమౌగద.[1]

అని స్త్రీ స్వాతంత్ర్యమును కోరి తెలిపినది కవయిత్రి.

ఆధునిక ఖండమునందును, సత్యాగ్రహ ఖండమునందుకూడ కీర్తినొందిన మహిళల పేర్లు తెలిపి నిర్ణయించినది.

ఆండాళ్, మీరా, ఆవ్వైయారు, మొల్ల, గంగాదేవి, మోహనాంగి మున్నగు కవయిత్రులను, గౌతమి, జిజియా బాయి మున్నగు వీరమాతలను, రాజ్యతంత్రమున సమర్థత చూపిన నాయకురాలు నాగమ్మ మున్నగు ప్రమదలనందరిని ప్రస్తుతించినది. గాంధీ మహాత్ముని శంఖారావము విని సత్యాగ్రహమును చేపట్టిన దుర్గాబాయి, లక్ష్మీబాయి, అనిబిసెంటూ, స్లేడుకన్య, సోదరిని వేదిత వంటివారిని గూర్చి వివరించినది.

మహిళా సమాజ మహోన్నతికి పాటుపడిన వీరేశలింగం మున్నగువారిని గూర్చి సంస్కార ఖండమున తెలిపినది.[2]

ప్రస్తుత ఖండము :- చివరదియగు ప్రస్తుత ఖండమున నవ సమాజమున స్త్రీలకు కలుగుచున్న అభివృద్ధిని వివరించి, వారి ప్రతిపత్తికి తగినట్లు ఉద్యోగము లివ్వవలయుననియు, కాంతల బ్రతుకులలో దొరలే అపశ్రుతులను తొలగింపవలయుననియు, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్య ముండవలయుననియు తన అభిప్రాయములను వ్యక్తీకరించినది. స్త్రీలకు స్త్రీలే శత్రువులుగా ఉండుటను చూచి నిరసించినది.

మహిళను మహిళయె ద్వేషించుటయును
సోదర మహిళ యున్నతి నోర్వమి
కూడని పనియని యాడువారెపుడు
గ్రహింతురొ యపుడె మహిళాభ్యుదయము

1. మహిళా విక్రమ సూక్తము - పుట 14.
2. మహిళా విక్రమ సూక్తము. పుటలు 14, 15.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కల్గుట తథ్యము గ్రహింపవలెనిది
మహిళలు దమలో సమరస భావము
సాధించినపుడె మహిళా సంఘము
ఘన విజయము సాధింపగ గలదిల
మహిళా స్వర్గమె మహికి సమస్తము
మహిళల యున్నతి మహికిని నున్నతి
మహిళా విజయమె మహికిని మాన్యము
మంగళ చరితల మంగళ గానమె
మహికిని మంగళ ప్రవిధాయకమా.[1]

మహిళల అభ్యున్నతిని మనసార కోరుతూ ఈ కవయిత్రి మధురమంజుల వాక్కులతో మహిళా విక్రమ సూక్తమును రచించినది.

వేదకాలమునుండి ఆధునిక కాలమువరకు మహిళలకు సంఘమునగల ప్రతిపత్తిని చూపించుచు ఈ కావ్యమును రచించి కవయిత్రి తన హృదయము నందు మహిళాజన అభ్యుదయముపై గల భావములను తెలుపుచు, మహిళల ప్రగతిని ఆశించుచు ఈ చిన్ని కావ్యమును రచించి మాననీయురాలైనది.

లజ్జాకిరీటధారిణి-ఖండకావ్యము

కళాప్రపూర్ణ డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి మధుర లేఖిని నుండి వెలువడిన కావ్య ఖండము లజ్జాకిరీట ధారిణి. లక్ష్మీకాంతమ్మగారికి బాల్యము నుండియు వచన రచన యనిన మిక్కిలి యభిమానము, ఆమె పన్నెండవయేటి నుండియు యెన్నియో వ్యాసములు వ్రాసి గృహలక్ష్మి, ఆంధ్రపత్రిక మున్నగు పత్రికలయందు ప్రకటించుచుండెడివి. కాలక్రమమున పద్యరచనయందు అభిలాష కలిగి కావ్య ఖండికలను రచించినది. ఆ ఖండికలలో కొన్నింటిని చేర్చి "లజ్జాకిరీట ధారిణి" అను మకుటముతో ప్రచురించినది. మృదుమధుర రచనా భరితమైన ఈ కావ్యమును గౌరవనీయులు దేవులపల్లి రామానుజరావు గారికి అంకితమొనరించినది.

---

1. మహిళా విక్రమ సూక్తము - పుటలు 21, 22.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవయిత్రి ఈ ఖండకావ్యమునకు 'లజ్జా కిరీట ధారిణి' అని పేరిడుట యెంతయు ఒప్పిదముగానున్నది. ఈ కావ్యమునకు లజ్జా కిరీట ధారిణియను పేరిడుటకు తన అభిప్రాయమును మృదువుగా వివరించినది.[1] ఈ కృతిని ప్రశంసించుచు 'తెలుగు లెంక' తుమ్మల సీతారామమూర్తిగారు రమణీయమగు పద్యములను రచించినారు. ఈ ఖండకావ్యము ఇరువదియైదు గేయములతో కూడిన కావ్య గుచ్ఛము.

కవయిత్రి మొల్లగా పెక్కు భువన విజయ సభలలో పాల్గొని తాను మొల్ల పాత్ర నిర్వహించినపుడు చెప్పిన పద్యములు 'కవయిత్రి మొల్ల' అను పేరున రచించినది. 'మొల్ల ఆత్మ నివేదనము' అను ఖండిక యెంతో రమ్యముగా రచింపబడినది.

---

1. లజ్జా కిరీట ధారిణి-ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ.

భారత మహిళ యెప్పుడును లజ్జాకిరీట ధారిణియే. ఆ వినమ్రశీలతయే భారత జాతికి కిరీటమై ఈ జాతికౌన్నత్యము చేకూర్చినది. భారతీయుల విజ్ఞాన మెంత యపారము, ఆదర్శప్రాయమునై యలరారియున్నదో, అంత లజ్జారుణ రుచిరమగుటకు భారతీయుల గృహస్థ జీవన పద్ధతి కాధారభూతమైన నవ వధువు యొక్క నవజీవన ప్రాదుర్భావ మధురమైన హృదయ రక్తిమ కారణమై యింపెసలారుచున్నది.

మొగ్గలు దొడుగు నును సిగ్గు దొంతరలలో, ప్రఫుల్లయై జగతి యందలి జన జీవన వికాసమునకు ఆది కారణమగుచు, మల్లియల సరువమ్మును బోలు హృదయ సౌందర్యముతో ఆనంద విపంచీ మంజులారవములను కదల నిండించు స్నిగ్ధ సుందరి. ఆ లజ్జాకిరీట ధారిణి యగు భారత పురంధ్రి, ఈ సౌశీల్యమే జగతికి రక్షయగునని విశ్వసించిన దాననగుటచే పరమ సాధ్వులను గూర్చి ప్రస్తవ మొనరించిన ఈ ఖండ కావ్యమునకు నేను 'లజ్జాకిరీట ధారిణి' అను నామ ముంచితిని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొల్ల ఆత్మ నివేదనము : నీల నీరద ఘన తేజుడు, నిర్మలాత్ముడు రమ్యగుణ సాంద్రుడైన, రఘుకుల రామచంద్రుని తన మొరలు వినుమని ప్రార్థించినది కవయిత్రి మొల్ల. ఆ స్వామి కొరకు తపించి యిట్లు పలికినది :

ఎన్ని భవములుగా మోసులెత్తుచున్న
కాంక్ష రాయిది యాశ్రిత కల్పభూజ
వచ్చి చల్లని జాబిల్లివలె, తపించు
నీక్షణ చకోరముల దనియింపగదవె.[1]

కవయిత్రి మొల్ల బ్రతుకు దోయిలి పట్టి, రామ పాద పీఠమున, రాముని కృపాబిందువుకొరకు వేచియున్నది. ఆమె ఈక్షణ చకోరములు తనియించునట్లుగా చల్లని జాబిల్లివలె రామ దర్శనము కల్గినది. మొల్ల యెద పరిమళించునట్లు దివ్య మాలికా సౌరభముల చల్లుచు, కరుణావతారుడైన మూర్తిని ఆత్మలో దర్శించిన మొల్ల ఇట్లు పలికినది.

నడిచి వచ్చితివే, రఘునాయకమణి
మహిని నవనీతి బాపంగమనసు కలిగి
ధర్మ ముద్ధరింపగ నీకు తలపుకల్గి
నాదు భాగ్యము రూపెత్త నాథనాథ
నడచివచ్చితివే రఘునాయక మణి.[2]

స్వామిరూపును ఆత్మలో దర్శించిన మొల్ల తనను గూర్చి తెలిపినది. శబ్దాలంకారములో కూర్చబడిన ఈ పద్యము హృద్యముగా నున్నది:

మొల్లను రా రామ ఇతర
మొల్లనురా, నీదు చరిత మొల్లల తావుల్

1. లజ్జాకిరీటధారిణి - మొల్ల ఆత్మనివేదన.
2. లజ్జాకిరీటధారిణి - మొల్ల ఆత్మనివేదన.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చల్లగ, మకరందము పెద
చల్లగ పాడితిని మనసు చల్లగ స్వామీ.[1]

మాతృశ్రీ కస్తూరిబా :- భారత మహిళలకు గర్వమును, గౌరవము కలుగునట్లుగా పతియే దైవమని యెంచి, పతితో కష్టపరంపరలను కుడిచి, దయ, ప్రేమ, ఆకృతి నొందినట్లున్న దీనజనసేవధియైన కస్తూరి బాయిని కవయిత్రి వర్ణించినది.

క్షమయే యాకృతి దాల్చి యీధరణిలో కస్తూరిగా గ్రాలెనో!
రమణీయంబగు శీల సంపద యుదారంబయ్యె నీరూపునన్
క్రమశిక్షాయుత జీవితంబదియు విఖ్యాంతంబు నీ ప్రాపునన్
ప్రమదా మండలి కొజ్జ బంతివిగదా రామామణీకస్తురీ.[2]

భర్తతో కలిసి స్వాతంత్ర్య సమరమున యె ధురాలిగా తిరిగినట్టి ఆదర్శ మహిళ కస్తూరీబాయి. ఓరిమితో ఆమె భర్తను సేవించి, మహాత్మునిగా నొనరించి నది. అట్టి సుధామయ హృదయియైన కస్తూరిని కవయిత్రి ఎంతో ప్రశంసించి నది.

సీ కల్లోల సాగరగర్భాన పయనించు
చల్లని నౌక నీసాధువృత్తి
పాషాణమయ శైల పంక్తిని ప్రవహించు
చిరు సెలయేరు నీచిత్త శాంతి
ప్రళయ ఝంఝూరటత్పవనాన వినిపించు
మంజులగీతి నీమాన్య చరిత
కఠిన శిలా తతిన్ గరువాన వికసించు
సన్నజాజియగు నీ చలువ మనసు

1. లజ్జాకిరీటధారిణి - పుట 8.
2. లజ్జాకిరీటధారిణి - పుట 9.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నియమ పరతంత్రుడౌ పతినీడ నీదు
మనికి మధుర గంభీరమై వినుతికెక్కె
అమ్మ, కస్తూరి, నుతియింపనలవియౌనె
తల్లి, భరతాంబ నిన్గని ధన్యయయ్యె.[1]

రణ సూక్తము: విజయమైనను, వీరస్వర్గమైనను ఒకటేయను భావముతో సిద్ధపడి స్వాతంత్ర్యరక్షణకు ప్రాణార్పణ మొనరించిన వీరనారి ఝాన్సి లక్ష్మీబాయి. తన సైనికబృందమునకు ప్రోత్సాహము కల్గించుచు వారి హృదయము లందు శౌర్యాగ్ని రగుల్కొనునట్లు పలికినది. లక్ష్మీబాయి పిలిచిన పిలుపునే రణసూక్తమను పేరున కవయిత్రి రచించినది. సంస్కృత సమాస భూయిష్ఠమై, వీర రసభరితమైన ఈ పద్యములు - కవయిత్రి రచనాపటిమను తెలియచేయు చున్నవి.

కదన రంగమున సైనికులను ప్రోత్సహించుచు వీరనారి లక్ష్మీబాయి యిట్లు పలికినది :

సీ. కదలుడీలయ కాల కాలకంఠనిటాల
చటుల లోచన శిఖిజ్వాల లగుచు
ఉరుకుడీ మదవారణోత్పాటనక్షుధా
హంకార కుపిత సింహమ్ములగుచు
సాగుడీ ప్రళయ ఝంఝా మరుజ్జృంభిత
పుష్కలావర్త కాంబుదములగుచు
తరలుడీ దుష్టదైత్యచ్ఛటా కుంతలుం
తన తాండవ సుదర్శనమ్ములగుచు

1. లజ్జాకిరీటధారిణి - పుట 11.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దశదిశానాథ సంత్రాసదముగ, మహిత
వీర శంఖమ్ములూది, నిర్భీకవృత్తి
శాత్రవుల శోణితంబు వసంత మాడ
పోయి జయలక్ష్మితోడ విచ్చేయుడయ్య.[1]

అమ్మ : సకల సృష్టికి ఆధార భూతమగు మాతృ దేవిని స్తుతించుచు కవయిత్రి మధుర మంజుల కవితా రచన మొనరించినది. కవయిత్రి తన పద్యములలో 'అమ్మ'- విశిష్టత నిట్లు తెలుపుచున్నది :

అమ్మయను శబ్దము చెవులగ్రమ్ముకొనగ
హృదయ మానంద జలధియై చదలుముట్టు
అమ్మ జీవాళి దన్పెడు నమృత రసము
అమ్మ జగతి చైతన్య రసాయనమ్ము.[2]

అమ్మ సృష్టికాధారమౌ అమల శక్తి
అమ్మలేక జీవంబెట్టు లవనిబుట్టు
అమ్మ పదమది వీనులగ్రమ్మినంత
పుడమి యానందమున పొంగి పొరలుననుట
వింతకాదు కావిదియు రవ్వంతయేని
అమ్మ నీ నామమది యెంత హాయినించు
అమ్మ నినుమించు దివ్యత్వమవనిగలదె.[3]

లజ్జాకిరీట ధారిణి : కవయిత్రి కావ్యమునకు పేరిడినట్టి 'లజ్జాకిరీట ధారిణి' యను శీర్షికతో నవ వధువును వర్ణించుచు మనోజ్ఞమగు కవిత లల్లినది.

---

1. లజ్జాకిరీటధారిణి - పుట 15.
2. లజ్జాకిరీటధారిణి - పుట 18.
3. లజ్జాకిరీటధారిణి - పుట 18,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంస్కృత పదబంధురమై, శ్లోకరూపమున నడచిన ఈ కవిత ఆంధ్రగేయమే యనునట్లుగా పాఠకుల హృదికి తోచును. సులలిత, సంస్కృత శబ్దజాలముతో కూడిన ఈ కవిత మనోరంజకముగా నున్నది.

లజ్జాకిరీట ధారిణీ, సజ్జిత వేషహారిణీ
కజ్జల రేఖాలంకృత దృగంచలనిమజ్జిత
సర్వధారుణీ, శోభనకారిణీ, పాపహారిణీ
కళ్యాణ వైభవమణీ, ర్జయనవవధూమణీ.[1]

పైనుదహరించిన కవితలేకాక ఈ 'లజ్జాకిరీట ధారిణి' యను ఖండకావ్యమున ఆంధ్ర భారతి, వాసవీ స్తవము, పూజ్య బాపూజీ, గదాధరుని విద్యాభ్యాసము, గదుని క్రీడాభిలాష, శారదాదేవి యౌవనవికాసము, భావదేవ స్తుతి, దుర్గా సంప్రార్థనము, దివ్య దర్శనము, ఆంధ్ర నాయకరత్నము, కామకోటి పీఠాధిపతి, రాధాకృష్ణోవిరాజతే, బాలమురళి కృష్ణాభినందనము, పరిమిత జగాథా, ఇంతుల శౌర్యర సేష్టియను ఖండికలు కలవు. అన్నియు కవయిత్రి కవితా వైదుష్యమును, పాండిత్య ప్రకర్షను వెలార్చుచు, మధుర రచనా భరితములై యున్నవి. ఈ కవయిత్రి ప్రజ్ఞాపాటవములను ప్రశంసింపుచు తుమ్మల సీతారామమూర్తిగారిట్లు పలికినారు :

కలదు ప్రతిభ, లెస్సకలదు వైదుష్యంబు
కలదు మొక్కవోని పలుకుబడియు
కలదు కలదు లక్ష్మికాంతమ్మ కురసజ్ఞ
జాతికింపు గూర్చు కైతచదురు.[2]

---

1. లజ్జాకిరీటధారిణి - పుట 35.
2. ప్రశంస - లజ్జాకిరీటధారిణి (తుమ్మల సీతారామమూర్తిగారు)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నా తెలుగు మాంచాల

కళాప్రపూర్ణ డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారిచే రచింపబడిన ప్రౌఢ కావ్యము నా తెలుగు మాంచాల. తెలుగువారెన్నడూ మరువజాలని 'పల్నాటి యుద్ధము' నందలి బాలవీరుడు బాలచంద్రుడు. బాలచంద్రుని యుద్ధోన్ముఖుని చేసి తను వీరపత్నిగా రూపొందినది వీరమాంచాల. ఆ వీరపత్ని గాథను కావ్యముగా తీర్చిదిద్దిన లక్ష్మీకాంతమ్మ గారు కవయిత్రులలో తలమానికముగా అలరారినది.

వీరశృంగార రసభరితమగు ఈ కావ్యము ఆంధ్ర సాహిత్యమున శాశ్వత స్థానమును పొందినది. కీర్తిశేషులు అభినవ భక్తపోతన, మహాకవి శేఖరులగు వానమామలై వరదాచార్యుల వారు కవయిత్రికి, కావ్యమునకు శుభాశీస్సు పలికినారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాచార్యులైన కోలవెన్ను మలయవాసిని గారు ఈ కావ్యమునకు 'నీరాజనము' పట్టినారు. మాన్యులు సౌహృదయ శిరోమణియైన డా. బెజవాడ గోపాలరెడ్డిగారికి కవయిత్రి తన కృతి సర్పించినది.

పల్నాటి యుద్ధ చరిత్రను కొంతభాగము కవిసార్వభౌముడు శ్రీనాథుడు రచించినట్లు తెలియుచున్నది. తరువాత కొందరు కవులు రచించిరి. బాలచంద్రుడు వీరనారీమణి మాంచాలచే ప్రేరితుడై యుద్ధమునకు వెడలిన ఘట్టమును అపూర్వముగా ఈ కవయిత్రీమణి రచించినది. ఇందలి కథ చిన్నదైనను కవయిత్రి తన రచనాశక్తితో విలక్షణమైన కృతిగా తీర్చి దిద్దినది. "ఇంత చక్కని గేయ కావ్య రచన నా చూచినంతవరకు మృగ్యము"[1] అని వానమామలై వరదాచార్యుల వారు ప్రశంసించినారు.

నలగామ విభునితో, మలి దేవరాజుకు వైరము కల్గి యుద్ధకారణము కాగా మంత్రియగు బ్రహ్మనాయుడు సైన్యవాహినులతో యుద్ధ రంగమునకు వెడలెను. తండ్రిపోయినట్లే తానును యుద్ధమునకు పోవలయునని సుకుమారుడగు బాలుడు

1. నా తెలుగు మాంచాల - శుభాశీస్సు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాలచంద్రుడు తల్లి దీవన బడయుటకు తల్లి మందిరమునకేగి నమస్కరించి తన కోర్కె తెలిపినాడు. కుమారుని కోరిక విని ఐతాంబ మాతృహృదయము తల్లడిల్లినది. మక్కువతో పుత్రుని శిరము మూర్కొని ప్రేమతో ఇట్లు పలికినది:

అంతిపురమున నున్న
అబలలను రక్షించు
కార్యభారము పూని
శౌర్యమ్ము జూపంగ
సిద్ధపడు మోయయ్య
యుద్ధము సేయంగ
పనిలేదు నీకయ్య
నను వినవె ఓ తనయ.[1]

తల్లి మాటను విని బాలచంద్రుడు :

వీరకాంతవు నీవు
వీరపత్నివి నీవు
వీర మాతృపదమును
కోరగా దలపవో
ఊర్పుతో శౌర్యమ్ము
దీర్పగా నేర్పితివి
యుద్ధ విద్యలనె నా
కుగ్గుగా నుడిపితివి.[2]

ఇపుడిట్లు పలుకగా పాడిగాదని, పసివాడనుకానని, బాలుడు ధైర్యముతో పలికెను. కుమారుని సమరోత్సాహమును గమనించి ఐతాంబ వేరుపాయము పన్నినది.

---

1. నా తెలుగు మాంచాల - పుట 10.
2. నా తెలుగు మాంచాల - పుట 11.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏనాడో పెండ్లియై, ఏడేండ్లు గడచిపోయినను, తన భార్యనుచూడక పర సతీ వ్యామోహ బద్ధుడైయున్న కుమారుని, భార్యయగు మాంచాల చెంతకు పంపుటకు ప్రయత్నించినది. మాంచాల అపురూప సౌందర్యవతి.

తనమేని యందమ్ము
నును కాంతి కిరణమై
దిశలెల్ల వెలిగించి
దివ్యాంగనల రీది
కుద్దీపనమ్మొసగు
పెన్నుద్దియై వరల
మల్లియల పరువమ్ము
ఉల్లమున నిక్షిప్త
మొనరించి యుల్లముల
కుల్లాసముం గూర్చి
చల్లగా మాట్లాడు
ప్రమద యా మాంచాల.[1]

అందాల చుక్క యగు భార్యను చేరి, మరులుగొని బవరము మాటను బాలుడు మరచిపోగలడని ఐతాంబ కాంక్షించినది. యుద్ధమునకేగుటకు ముందు భార్యను కలియుమని ఆదేశించినది.

యుద్ధమునకు నేగ
సిద్ధపడుటకు ముందు
నీవు నీయర్ధాంగి నిర్మలాంతఃకరణ
ధర్మమున నీకు శుభ

1. నా తెలుగు మాంచాల - పుట 15

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కర్మఫల సిద్ధ్యర్థ
మొసగు శుభాశిశముల
నొక పరింగై కొనుట
త్యంత మావశ్యకమ
త్యంత శుభదమ్మోను
ఆ లేమకడకేగి
ఆశీస్సులం బొంది
గుణము సవరించుచును
రణము సల్పగ బొమ్ము
విజయ లక్ష్మీకర
స్వీకారముంజేసి
మరలి రావోయయ్యా
మంగళము నీకయ్యా.[1]

అని బలాంబ కుమారుడగు బాలచంద్రునకుపదేశ మొనరించినది. తల్లిమాటను విని బాలచంద్రుడు మాంచాల సదనమునకు వెడలినాడు. ఆమె గేహమున చేరి ద్వార బంధముపై మెల్లగా తట్టి మంద్ర గంభీరముగ మాంచాలను పిలిచినాడు. విభుని పిలుపు వినిన మాంచాల హృదయములోని ఆవేగమును, ఆమె శరీరము నందు కలిగిన సాత్వికభావములను కవయిత్రి అతి ఆకర్షణీయముగ రచించినది.

తడబడెడి యడుగులను
ఒడబడని యూహలను
ఒయ్యారముగ పేర్చి
సయ్యాట లాడేటి
సఖుల సందడులార్చి

---

1. నా తెలుగు మాంచాల - పుటలు 20, 21, 22, 23.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనసులో మొలిచేటి
మధురోహల విదల్చి
చిరు చెమ్మటలు గ్రమ్మ
వలపు జారికి తనువు
పులకింపగా నోర్చి
....
చెలియ వాకిలి తీయ
చేరవచ్చెను దానె.[1]

విరహిణి యైన మాంచాల చూపున కోపతాపము విరియగా పులుకు పులుకున మగని చూచినది. ఆమె చూచిన చూపులకు ఆ శూరుని గుండె చెదరినది. తననిన్ని నాళ్ళుగా ఒంటరిని చేసి బాధించిన కఠినాత్ముడగు బాలుని గుండెలో తన చూపు బాణము వలెతాకునట్లు చూచినది.

బుస్సుబుస్సున నెగయు
రోషమావేశమ్ము
లాపగా వశపడక
గుండెలోతుల సుడుల
గుండమై సుడి దిరుగు
వలపు తలపుల యూపు
నోర్వజాలగ లేక.[2] [పుట 32]

ఆ తేజవరాలు తన విభుడగు బాలచంద్రుని చూచినది. ఆమెను చూడగనే పారవశ్యముతో చంద్రుడు-

మతిపోయి మాన్పడియె
ధృతితప్పి గతితప్పె

1. నా తెలుగు మాంచాల - పుట 27.
2. —

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిగ్రహము గోల్పోయె
నెలత విగ్రహ యష్టి
చిక్కుపడగా దృష్టి
మక్కువలు పెక్కుత్తై
మరుని పాశములౌచు
చూపులను మరలింప
నోపగా లేక తా
నంతంత వీరుండు
అంబేదమై పోయే. [పుట 36]

భర్తను గాంచినపిదప మాంచాల మాతృదేశ రక్షణ ముఖ్యధర్మమని భావించినది. స్వార్థ సుఖముకొరకు, తల్లి దేశ సేవనుండి భర్తను విడిపించుట పాపమని భావించినది. తన మ్రోల నిలిచిన పతిని-

జనని దేశపు రక్ష
సల్పగా జనుమయ్య
అనుచు మాంచాల పతి
సదలించి మేల్కొలిపె. [పుట 43]

మాంచాల సౌందర్యమునుగాంచి బాలచంద్రుడు భావించిన విధమును కవయిత్రి దీర్ఘముగా వర్ణించినది. ప్రబంధ పాత్రోచిత రీతిలో అంగాంగ సౌందర్య వర్ణన సాగినది. వర్ణనావిధానము హృద్యముగా నున్నది. ఉదాహరణమునకు మాంచాల వర్ణనయందలి ఒక చిన్న గేయభాగము ఇట చూపబడినది:

కలకంఠి కంఠమున
కొలువున్న గీర్వాణి
వీణియను గేల్కొల్పు
పజ్రిపేటికో పటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పద్మరాగపు లలిత
భద్రకవాటములన
పెంపొందు బింబోష్ఠి
పెదవులే ఒక ఎత్తు
అధరయుగళము దెరువ
మధుర మంజులరీతి
ప్రతి రుచిరగీతికా
ఋతులగుచు వెలుగొంది
దంతపంక్తుల కాంతి
దొంతి మల్లియనవ్వ
హితమునుపదేశించు
మితభాషి శుకవాణి
మురువు హరువులు గులుకు
పలుకులును పై యెత్తు.[1]

ఆ బాల అందమును గాంచిన బాలచంద్రుడు ముగ్ధుడై, పరవశించి యుండెను.

ప్రణయ సంభావితుడైన బాలుడు మాంచాల పయ్యెదను పట్టెను.

మాంచాల పౌరుషోద్దీప్తి కలిగించు మాటలను పలికినది.

తే. గీ. కొంగువిడువుము ధూర్తుడా కొంగువిడుము
అంగనల జేరి సంగ్రామభంగిమరచి
మదనపూజల దేర్చెది అదనిదియని
చొరవమాంచాల సదనమ్ము చొరబడితివో
కొంగువిడువుము ధూర్తుడా కొంగువిడుము.[2]

---

1. నా తెలుగుమాంచాల .... పుట. 48
2. నా తెలుగుమాంచాల .... పుట. 62

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తల్లియైతాంబకడ శౌర్యముతో పల్కిన పల్కులను మరచిన బాలుని కదన రంగమునకు వెడలుటకు వీరనారీమణి ప్రోత్సహించిన పల్కులను కవయిత్రి సుదీర్ఘ రచన మొనరించినది. నవ చామర వృత్తమున గల రచన స్ఫూర్తిమంత ముగా సాగిపోయినది.

నవ చామరము :

అవక్ర వీరవిక్రముండవై అనన్య జన్యనాయకుండవై
పవిత్ర భారతీయ పుత్రకుండవై, పరాక్రమోజ్వలుండవై
ఘనాంబురాశి దాటు యోచనన్ బలమ్ముగా దలంపవేమిరా
అవాంఛనీయ మోహవల్లి ద్రెంచరా, ఆహవమ్ము కేగరా దొరా.[1]

అని ప్రోత్సహించి, నీ వ్రేలి కొనగోరు బట్టుచును వేవేగ స్వర్గసోపానముల నధిరోహణము సేతునని వీరనారి మాంచాల పల్కినది.

తన కర్తవ్యమును తలచిన మాంచాల, అభిమన్యుని సాహసమును తలచి, భర్తను అనికి పంపుటకు పూనుకొనినది. బాలచంద్రుని నడుమున గల ఖడ్గమునూడబెరికినది.

చేత ద్రిప్పుచు ఝళిపించి
భపుని చుట్టుతాను తిరిగి
మగనిచేత మగువ ఖడ్గ
మిడుచు మిగుల తేజమలర
మాతృదేవి పిలుపు వినుము
పోయిరమ్ము వీరధనుడ
అనుచు చాల మగని నుదుట
రక్త తిలకమిడియె హార

1. నా తెలుగు మాంచాల - పుట - 63.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిచ్చె పదములంటి కనుల
కద్దుకొనియె - కొంతభక్తి.[1]

సంతసముతో ఉప్పొంగెడి మనసుతో మంగళమునిచ్చి భర్తను రణరంగమునకు పంపినది. రణరంగమునకేగిన బాలుడు మరణించెనను విషయమును కవయిత్రి వ్యంగ్య వైభవముతో చెప్పినది.

నక్కల ఊళలు వినబడె
చుక్కలు భువిపై తెగిపడె
దిక్కుల వెలుతురు తరిగెను
పెక్కులు గూబలు అరచెను
మిక్కిలి రోదన వినబడె
అక్కట భాగ్యము కొరవడె.[2]

అని అనుటలోనే బాలచంద్రుడు మరణించెనని తెలియచేసినది.

వీరవరుడు, శూరవరుడగు మగని తలచి మాంచాల సహగమన మొనరించినది. స్నిగ్ధ హృదయముతో, మాతృ భూమిపై గల మక్కువతో, తనకు తానే భర్త ప్రేమను కూడ బలిదాన మొనరించినది.

మాంచాల దేహము మంటలలో కలిసినది కానీ, ఆమె ఘనకీర్తి మంటికిని, మింటికిని మణిదీపమై వెలిగినది. మాంచాల వీర సతియైన విధము గడిచి ఏండ్లు గడిచినవి. కాని ఆమె చరిత్రను కవయిత్రి ఈనాడు రచియించి, తెలుగు జాతి చరిత్రలో శాశ్వత స్థానమును కూర్చి, తాను ధన్యురాలైనది.

ఈ కావ్యములో ప్రబంధోచిత రీతిలో సాయంసమయ వర్ణన, మాంచాల విరహ వర్ణన, వెన్నెలలో మాంచాల విరహ వేదన, సూర్యోదయ వర్ణన చేయ

1. నా తెలుగు మాంచాల - పుట 83.
2. నా తెలుగు మాంచాల - పుట 90.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బడినవి. వెన్నెల కాంతులలో ముగ్ధయగు మాంచాల విరహ వేదన అతి దీర్ఘముగా సాగినది. కవయిత్రి రచనలలో తెలుగు పలుకులు సొంపులు విరివిగా దొరలినవి. రసస్ఫూర్తి కలిగిన ఈ రచన సుందరముగా, పాత్రోచిత సంభాషణలతో, కల్పనాచాతుర్యముతో సాగినది. సహగమనము నొందిన మాంచాలను కవయిత్రి ఇట్లు స్తుతించినది.

సతియయ్యె మాంచాల
వీర సతియయ్యెనే
నా తెలుగు మాంచాల
నాణెంపు పతిశీల
నవరాగ మణిమాల
స్తవనీయ గుణలోల
సతియయ్యె మాంచాల
వీరసతి యయ్యెనే.[1]

అని వీరపత్ని మాంచాలను వర్ణించినది.

కావ్యమునకు "నా తెలుగు మాంచాల" అని పేరిడుటలో 'నా'అను భావము కవయిత్రికి తెలుగు జాతియందు, తెలుగు మహిళలయందు కల అభిమానమును విశద పరచుచున్నది. ఈ కావ్యమునకు కవయిత్రి నాయికయగు మాంచాల పాత్రకు అధిక ప్రాధాన్యము నిచ్చినది. శ్రీనాథ కవిసార్వభౌముని 'పల్నాటి వీరచరిత్ర' యందు బాలచంద్రునకు యెక్కువ ప్రాముఖ్యము కలదు. అది ఇక్కడ వివరింపబడుచున్నది.

పల్నాటి యుద్ధమున బాలచంద్రుని పాత్ర : ప్రొద్దుపోవుటలేదని చెప్పి, తల్లి వారించినను వినని బాలచంద్రుడు మిత్రులతోగూడ బొంగరములాడి,

1. నా తెలుగు మాంచాల - పుట 91.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్నమ్మయను వైశ్య స్త్రీచే దూషింపబడి, మన్నించుటకు వేడుకొనెను. ఆమె మాటల ప్రభావమున తానును రణరంగమునకేగుటకు పూనుకొని తల్లి ఐతాంబను దీవించుమనెను. ఆమె ఆందోళన చెంది యెన్నియో మాటలు చెప్పి, అతనిని యుద్ధమునకు పోవలదని వారించినది. బాలచంద్రుడు తల్లికి స్వధర్మ నిరూపణ మొనరించి యుద్ధరంగమునకు పోపుదుననెను. తల్లి ఐతాంబ కోడలిచెంతకేగి దీవనలను పొందుమని పుత్రునికి చెప్పెను. ముందుగా ఆమె కోడలి చెంతకు వెడలి కుమారుని బుద్ధి మరల్పుమని కోరినది. మాంచాల తన నగరుకు పంపమని చెప్పినది. తల్లి కోరిక ప్రకారము బాలచంద్రుడు భార్య నగరుకు పోవుచు త్రోవలో తల్లియిచ్చిన ధనము నంతయు వేశ్యయైన సబ్బాయికి ఇచ్చును. తరువాత మిత్రులతోకూడ మాంచాల నగరికి వెడలును. మాంచాలను చెలికత్తెలు అందముగా అలంకరించిరి. భర్తను గుర్తించు ఉపాయమును మాంచాల తన తల్లిని అడుగును. తల్లి అప్పుడు నిన్ను చూచినపుడు నీమరుదులు లేచెదరు. నీ వరుడు [భర్త] లేవడని గురుతు చెప్పినది. మాంచాలను చూచి అనపోతు మాత్రము లేవలేదు. బాలునితో పాటుగా కూర్చుండెను. అప్పుడామె బ్రాహ్మణుని పతియనితలచి పాదములు కడుగ తలచెను. అప్పుడు బ్రాహ్మణుడు "నేను బ్రాహ్మణుడను, నీ మరిదిని, అతడు నీ భర్త"యని బాలచంద్రుని చూపెను. బాలచంద్రుడు తన భార్య సౌందర్యమును గాంచి ముగ్ధుడై తన వేశ్యాలోలత్వమునకు పశ్చాత్తాపమొందెను. తరువాత బాలచంద్రుడు మాంచాలతో సరస సల్లాపము లాడునపుడు ముత్యాలహారము తెగిపోయెను. ఆ ముత్యాల సరము తిన్నగా గూర్చుటకు బాలుడు ప్రయత్నించుట లోనే ఏడు జాములు గడిచినవి, తమ్ములు యుద్ధరంగమునకు రమ్మని మదకరుల వలె తొందర చేసిరి. వారి అట్టహాసమును విని 'నాతోడ మసలిన నయమేమి లేదు, కలనికి పొమ్మని' మాంచాల దీవించి ఖడ్గము చేతికిచ్చి పంపెను. అనపోతు విప్రకుమారుడు కావున అతనిని తోడ్కొని పోవలదని చెప్పెను. బాలచంద్రుడు తిరిగి తమ్ములతో తల్లి చెంతకేగి ఆమె ఆశీస్సులను గొని యుద్ధమునకు వెడలెను.

ఈ ఘట్టములోని మాంచాల వ్యక్తిత్వమును గ్రహించి కవయిత్రి వర్ణనా చాతుర్యముచే మాంచాలకొక విశిష్టతను కల్పించినది. కవయిత్రి తన కావ్యమున

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బొంగరములాటను గాని, వేశ్యా సంబంధమైన విషయమును గాని, ముత్యాల హారమును కూర్చిన రీతినిగాని గ్రహింపలేదు. స్వీయ భావనలో మాంచాల మూర్తి కాక ప్రత్యేకతను కల్పించి, మాంచాలచే బాలచంద్రునికి పౌరుషము కలుగు మాటలను పలికించినది. భర్త యుద్ధమునకు పోవలయునను కోరికచే ఆమె తన ఆనందమును కూడ త్యాగ మొనరించిన మహిళగా వర్ణించినది. వీర శృంగార రసముల మేళవింపొనరించి 'నా తెలుగు మాంచాల'ను తీర్చి దిద్ది కవయిత్రి ఈ కావ్యమాలను కూర్చినది.

వీరవనితల చరిత్రములలో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి 'నా తెలుగు మాంచాల' వీర రస స్ఫూర్తిని కలిగించుచు, తెలుగు సరస్వతికి నూతన - అలంకారముగా భాసిల్లుచు, కవయిత్రి నామమును చిరస్థాయిగా వెలుగొందుసట్లొనరించినది.

ఇతర రచనలు

డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారి రచనలు పెక్కు కలవు. వానిలో కావ్యశ్రేణికి చెందిన వానిని పరిశీలించినాను. ఇక మిగిలిన వానిలో కొన్ని గేయములు, పదములు, వచన రచనలు - వానిని సంక్షిప్తముగా పరిశీలించుచున్నాను.

కాంతి శిఖరాలు :- బాల్యమునుండియు బ్రహ్మసమాజ పద్ధతిలో ప్రార్థనా గీతములను పాడుటకలవడిన కవయిత్రి మనసునుండి వెలువడిన గీతాల సంపుటి కాంతిశిఖరాలు. కవయిత్రికి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి గీతాలనినహో ప్రీతి. వారి గీతాలనే ప్రార్థనా సమయమున ఆలపించెడివారు. ఆ అభిమానముచే, ఈ కాంతి శిఖరాలను మహాకవి దేవుల పల్లి కృష్ణశాస్త్రి గారికి అంకితమొసంగినది. డా. సి. నారాయణరెడ్డిగారు ఈ కృతికి "రాగారాధన"ము చేసినారు. భక్తిభావంతో కూడి, ఆర్ద్రభరితమైన ఈ రమ్యగీతాలు, కమ్మని కవిత్వముచే నిండి పాడుకొనుటకు వీలుగా నున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కన్యకమ్మ నివాళి:-కవయిత్రి "జగన్మాత వాసవీ కన్యకా పరమేశ్వరి"కి అంకిత మొనరించిన పదాలు కన్యకమ్మ నివాళి. రాయలసీమలో ప్రచారములో నున్న 'కూనలమ్మ పదముల'ను వినిన వెనుక కవయిత్రికి అట్టి ఛందముతో కూడిన కవిత లల్లవలెనని భావన కలిగినది. శ్రీ ఆరుద్రగారు 'కూనలమ్మ పదాలు' అను మకుటముతో ఒక చిన్న పుస్తకమును రచించిరి. కవయిత్రి "ఓ కన్యకమ్మా" అను మకుటముతో, కన్యకమ్మ నివాళి రచించినది. ఇందు సంఘములోని లోపముల నన్నింటిని యెత్తిచూపుచు చివరకు 'ఇది లోకపువాళి, ఇది వైకుంఠపాళి, నీకిత్తును నివాళి ఓ కన్యకమ్మా' అని ముగించినది.

సదుక్తి మంజరి :- కబీరు, తులసి, రహీము, సందాల సదుపదేశములలో కొన్నింటిని కవయిత్రి చక్కగా తెలుగులోనికి అనువదించి గీత పద్యములందు రచించినది. హిందీ గీతములకు సరియైన భావానువాద మొనరించి కవయిత్రి 'సదుక్తి మంజరి'ని సరళ శైలిలో రచించినది. ఇది స్వేచ్ఛానువాదమే అయినను మూల గీతమునందలి భావము చక్కగా స్ఫురించుచున్నది.

ఈ గ్రంథమును కవయిత్రి తన పెదతండ్రి కుమారుడగు నాళం రాజారావు గారి షష్ట్యబ్ది పూర్తి ఉత్సవమప్పుడు అంకిత మొసగినది. తత్వచింతాపరుడు, పరోపకారి యగు తన సోదరునికి ప్రేమాదరములతో కవయిత్రి ఈ కృతి నొసగినది. ఈ పుస్తకము నందలి కవితలు కూడ పెద్దల సుద్ది, పలుకుబాట అను మకుటములతో అప్పుడపుడు ఆంధ్రమహిళ, గృహలక్ష్మి వంటి పత్రికలలో ప్రచురింపబడిన తర్వాత పుస్తక రూపమున ప్రకటింపబడినవి. ఇందలి కొన్ని కవితలను పరిశీలింతము.

కబీరువాణి :- స్థిరచిత్తము లేక జపము చేయుట వృథా అను భావమున గల పద్యమిట్లు కలదు :

మలిన మగుచును కేల జపమాల తిరుగు
నోట నాలుక తిరుగును నూరుగతుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిరుగు చిత్తమ్ము నాలుగు దిశల పర్వి
జపము మాత్రమె రవ్వంత జరుగబోదు.[1]

దీనికి హిందీ మూలమిట్లు కలదు :

దోహా

మాలాతో కర్ మే ఫిరే జీభ్ ఫిరేముఖ్ మాహి
మనువాతోచహు దిశిఫిరే యహ్‌తో తుమీన నాహి.

తులసీ పలుకు :- కన్నులందు ప్రేమ కురిపించని ఇంటికి కనకము కురిసినా కూడ కాలు పెట్టకూడదు అను తులసి పలుకును కవయిత్రి పద్యరూపమున ఇట్లు చెప్పినది:

ఎవరికనుల హర్షమెలయదో నిను జూడ
ఎచట గౌరవమ్ము నెసగ దచట
కాలు పెట్టజనదు కనకమ్ము గురిసిన
తులసి పలుకు బాట తెలిసి చనుము.[2]

పై పద్యమునకు హిందీ మూలమగు దోహా ఇట్లు కలదు:

ఆవత్‌హీ హర్షేనహీ నయ్‌నన నహీ సనేహ్
తులసీ తహా నజాయియే కంచన్ బర్‌సేమేహ్.

తులసి పలుకులలో రామ నామము యొక్క మహిమ నిట్లు చెప్పినదీ కవయిత్రి:

లోన, బయట, వెలుగు లోలి, వాంఛించుచో
రామ నామ మనెడు రత్నదీప

1. సదుక్తి మంజరి - కబీరువాణి - పద్యం 2.
2. సదుక్తి మంజరి - తులసి పలుకు - పద్యం 61.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శిఖను బదిలపరపుజిహ్వాగ్ర గేహళి
తులసి పలుకు సరణి దెలిసికొనుము.[1]

మూలమునందు గల దోహా ఇట్లున్నది:

రామ్ నామ్ మణి దీప్ ధరూ జీభ్ దేహరీ ద్వార్
తులసీ భీతర్ బాహరీ జోచాహతీ ఉజియార్.

పరోపకారమును గూర్చి తులసి చెప్పిన పలుకును కవయిత్రి ఇట్లు చెప్పినది.

పరులకొరకె పూచి ఫలియించు సతతమ్ము
సాధుజన రసాల సాలమవని
ఎన్ని రాళ్ల గొట్ట నన్ని పండ్లొసగును
తులసి పలుకు దీని తెలిసికొనుము.[2]

మూలమైన తులసీ దోహా కూడ రమ్యముగా నున్నది.

తులసీ సంత్ సు అంబ్ తరు ఫూల్ ఫలహిపర్ హేత్
ఇత్ తేవే పాహన్ హనత్ ఉత్ తేవేఫల్ దేత్.

కబీరు, తులసి పలుకులతో పాటు రహీము సూక్తులను కూడ కవయిత్రి అనువదించినది. రహీము సూక్తులలో ఒకటి, రెండు ఉదాహరణములుగా చూపుదును.

లోకమున యాచన చేయువాడు మృతునితో సమానుడు. యాచింపబడి దానమియ్యనివాడు అంతకుపూర్వమే మృతుడైనవానితో సమానుడను అర్థములో కవయిత్రి రహీము సూక్తి నిట్లు అనువదించినది:

---

1. సదుక్తి మంజరి - తులసి పలుకు - పద్యం 41.
2. ,, ,, పద్యం 40.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అడుగ నొడబడునట్టి వాడగును మృతుడు
అడుగ బడియును ధర్మమ్ము వదిని గనక
యెవడు దానమ్ము సల్పంగ నిలను బూన
డతడు తలపంగ తత్పూర్వమృతుడు సుమ్ము.[1]

మూలములో రహీము సూక్తి ఇట్లు కలదు:

రహిమన్ వేసర్ మర్ చుకే జోకహీ మాంగన్ జాహి
ఉన్ సే పహలే వేమరే జిన్ ముఖ్ నివసత్ నాహి.

మానవుడు ఒక పనిని సాధించినచో అన్ని పనులు సాధించగలడు. అన్ని పనులను ఒక్కసారి సాధించగోరినచో అన్ని యువృథా యగును అను భావమును చూపించు పద్యరచన మిట్లు కలదు:

ఒకటె సాధింప సకలమ్ము నొనరుచుండ
అన్ని సాధించుట యునః వృథయగును గాదె
మూలమును దడుపగ ఫలపుష్ప వితతి
మనకు లభియించు సద్దాన మాన్యతముడ.[2]

రహీము సూక్తి హిందీలో ఇట్లు చెప్పబడినది:

ఏక్ హిసాధే సబ్ సాధై సబ్ సాధే సబ్ జాయ్
రహిమన్ సేంచే మూల్ కో ఫల్ ఫూల్ ప్రియత అఘాయ్.

చివరలో కవయిత్రి ప్రణయ తత్వమును కూడ పద్యములందు హృద్యముగా తెలిపినది. ఎంత వేదాంత ధోరణిలో మనుజుడు నడచినను ప్రకృతికి మూల తత్వము ప్రణయమే అగును. అట్టి ప్రణయ తత్వమును కబీరు వచించిన దానిని కవయిత్రి అనువదించినది.

---

1. సదుక్తి మంజరి-రహీము సూక్తి - పద్యం 67.
2. సదుక్తి మంజరి - రహము సూక్తి - పద్యం 69.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చదివి చదివి గ్రంథములు జగతి విసిగె
పండితుడొకండు గానంగ బడడు నేడు
ప్రేమయను నక్షరములు రెండు నేర్వ
నెవడు పండిత సత్తముండవును పృథివి?[1]

కబీరు చెప్పిన ప్రణయతత్త్వపు దోహా ఇట్లుకలదు:

పోథీ పఢ్‌పఢ్‌జగ్‌ముఆ - పండిత్ భయాన కోయ్
ఢాయీ అక్షర్ ప్రేమకా పఢేసొ పండిత్ హోయ్.

ఈ విధముగా కవయిత్రి హిందీ దోహా లను తెలుగులోనికి అనువదించినది. తెలుగులో కవయిత్రి రచించిన పద్యములు సులభ శైలిలో సాగినవి. పూర్వ కవులు చెప్పిన సుభాషితముల శ్రేణిలోనికి చేరినది ఈ సదుక్తి మంజరి.

లక్ష్మీకాంతమ్మగారి ఆంధ్ర కవయిత్రులు, అఖిల భారత కవయిత్రులు వచనములో రచింపబడినవి. చక్కని శైలితో కవయిత్రుల జీవితాలను, రచనలను హృద్యముగా రచించినది కవయిత్రి. ఈ గ్రంథములందు ఎందరో రచయిత్రుల వివరములు తెలియును.

శ్రీ కన్యక సుప్రభాతము సంస్కృతములో రచింపబడినది.

కళాప్రపూర్ణ డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు తన అమూల్యమగు రచనలచే ఆంధ్ర సరస్వతికి దివ్యకాంతులొలుకు నీరాజనములొసంగి సాహిత్య క్షేత్రమున స్థిరముగా నిలిచినది. స్వర్ణకంకణము నొందిన లక్ష్మీకాంతమ్మగారు కాంతాజనములకు ఖ్యాతి దెచ్చిన కవయిత్రి.

---

1. సదుక్తి మంజరి - ప్రణయ శతి - పద్యం 104.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొణకా కనకమ్మగారు (1955)

రాసికెక్కినన్ని కవితలు రచింపకున్నను వాసికెక్కిన కవితలను రచించి కవయిత్రిగా పేరొందినది శ్రీమతి పొణకా కనకమ్మగారు. సారస్వత రంగముననేగాక, రాజకీయరంగమునకూడ వీరికి సహకరించిన కవయిత్రి శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు. వీరిరువురు స్వాతంత్ర్యోద్యమ కాలమునందు, గాంధీమహాత్ముని ఆదర్శ మార్గములందు నడిచి; ఎన్నియో మారులు కారాగృహములకేగి, దేశ స్వాతంత్ర్యముకొరకు పాటుపడిన జంట కవయిత్రులు.

డాక్టర్ కేసరిగారిచే నెలకొల్పబడిన "గృహలక్ష్మి స్వర్ణకంకణము"ను వారి మరణానంతరము 1955వ సంవత్సరమున పొణకా కనకమ్మగారు పొంది మహిళల కాదర్శప్రాయురాలైనది.

కనకమ్మగారి తల్లి దండ్రులు మరుపూరు కొండారెడ్డిగారు, రామమ్మగారు. నెల్లూరు జిల్లాలో 1892వ సంవత్సరమున ఈ కవయిత్రి జన్మించినది. కనకమ్మగారి భర్త పొణకా సుబ్బరామిరెడ్డిగారు గొప్ప శ్రీమంతులు. దాన ధర్మము లొనరించుటయందును, దేశసేవ చేయుటయందును వీరి కుటుంబము ప్రసిద్ధికాంచినది.

కాంగ్రెసు పక్షమున 1921 నుండి దేశసేవ యొనరించినదీ కవయిత్రి. దేశసేవలో వీరి ఆస్తి కర్పూరమువలె హరించిపోయినను లెక్కచేయలేదు. జమీన్ రైతు అను పత్రికనుకూడ నెలకొల్పినారు. సత్యాగ్రహ ఉద్యమములో పాల్గొని 1930లో జైలుకు వెడలినారు. ఆలిండియా కాంగ్రెసునకు తొలి తెలుగుస్త్రీ సభ్యురాలుగా, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసునకు తొలి తెలుగు ఉపాధ్యక్షురాలిగానుండి కాంగ్రెసుసేవ యొనరించినది. 1923లో నెల్లూరులో శ్రీ కస్తూరీ విద్యాలయమును స్థాపించి, మిక్కిలి కృషి యొనరించి, సంస్థను ఉన్నతదశకు తెచ్చినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు, కనకమ్మగారు కలిసి దేశసేవ యొనరించి కీర్తిగాంచినారు. వీరి గ్రంథములు ముద్రితములైనవి జ్ఞాననేత్రము, ఆరాధన, నైవేద్యము- గీత, రమణగీత అముద్రితములైన గ్రంథములు. ఆంధ్రస్త్రీలు మున్నగు వచన గ్రంథములున్నవి.

కనకమ్మగారి రచనలు నాకు లభ్యము కాలేదు. అందుకు నేను ప్రయత్నించినను ఫలితము లేనందున విచారించుచున్నాను. కనకమ్మగారి 'జ్ఞాననేత్ర' మను గీతానువాద గ్రంథమును గూర్చియు, రమణ గీతను గురించియు, ఆరాధనను గూర్చియు డా॥ ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు వివరించినారు.[1] ఆ వివరణచేత వీరి కవిత్వవిధానము తెలియుచున్నది. సుకరముగ, సుసంగ్రహముగ, సులలితముగ వీరు గీతానువాదమొనరించినట్లు తెలియును.

గృహలక్ష్మి పత్రికలో పొణకా కనకమ్మగారిచే రచింపబడిన "శ్రీరమణ గురుస్తవము" వలన వీరి కవితా విధానమెట్లున్నది తెలిసికొనవచ్చును.

శ్రీరమణ గురుస్తవము : కవయిత్రికి రమణమహర్షియందు మిక్కిలి భక్తిప్రపత్తు లున్నట్లే కవితవలన తెలియుచున్నది. పరబ్రహ్మమే రమణమహర్షి రూపమును పొందినట్లు కవయిత్రి భావన.

నిరుపమనిస్సంగ నిష్క్రియానంత
నిష్కళంక విమల నిర్వికార ఘన
నిత్య నిరంజన నిర్వికల్ప పర
బ్రహ్మమే తాస్వరూపమ్మవతరించి
నట్టి శ్రీ జగద్గురుడా ప్రణామమ్ము.

తన గురుమూర్తి యొక్క నిర్మల స్వభావమును, స్థిరత్వమును తెలుపుచు, జ్ఞాన జ్యోతి రూపమే రమణ మహర్షియని కవయిత్రి తెలిపినది.

---

1. గృహలక్ష్మి సంచిక. మార్చి-1940- పుట. 55 నుండి 65

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆకాశ సదృశ సత్యము నిరాలంబ
మమలము నిశ్శబ్ద మత్యుచ్ఛమఖిల
మతి పూర్ణమాద్యంత మాన రహితము
పూజ్యమార్యా వర్తమున, మహా ఋషులు
పొంది తరించిన పూత పాపదము
స్థిరము, జ్ఞాతృ, జ్ఞ, జ్ఞేయ శూన్యమగు
శుద్ధ బ్రహ్మజ్ఞాన జ్యోతి మదీయ
సద్గురు మూర్తికి సతము నమోస్తు.

తన నాశ్రయించినట్టి భక్తులను భవసాగరము నుండి తరింపచేయు జ్ఞానమూర్తి తన గురువని, తెలిపినది కవయిత్రి.

సంతతనిశ్చల సహజ సమాధి
నిష్ఠాగరిష్ఠులై నిత్యముక్తులయి
భౌతిక వాసనల్ వాసి సతంబు
ఆత్మపరతులై దయామయులునయి
సన్యాస మది లోక సంగ్రహార్థముగ
భవద్భాశితుల నెల్ల భవసాగరమును
తరియింప బూను శుద్ధ జ్ఞానమూర్తి
మద్గురు స్వామి నమస్కారము ప్రభు.

తాను చిరసుకృత పుణ్య విశేషముచేత, గురుసేవా పరమ భాగ్యమును పొందితిననియు, తన సర్వమును గురు కైంకర్యమున వినియోగించి ధన్యురాలనగుదుననియు, గురుకరుణ చేత తన అజ్ఞానము తొలగినదనియు, గురు సహచర్యము వలన భవబంధ తాపత్రయములు తొలగినవనియు, జీవన్ముక్తిని కలిగించు పరబ్రహ్మరూపమగు మహానుభావునకు పూజ్య రమణ దేవునకు నమస్కరించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దివ్య సంపదలైన దీనత్వమైన
మహనీయమైన సామాన్యమే యైన
సంస్కృతికి జిక్కిన జ్ఞానినై మనిన
నాకేల లక్ష్యమ్ము నాకన్యమేల
ప్రభు భవత్సేవా పరత్వమ్ము గాక
అవ్యాజ కృపబూని యాదరింపుమము
అన్య థానాస్తి శరణ్యంత్వమేవ
మాంపాహి సర్వము మమదేవ దేవ.

ఇనుము అయస్కాంతమును చేరినట్లు,తన మహాపుణ్యముచే గురుపాదముల జేరితినని సంతసించినది కవయిత్రి.

ఏ మహా పుణ్యమో ఏ యోగబలమొ
ఏ పరమహిమయో ఏమి భాగ్యమ్మొ
ఇనుమయస్కాంతమ్ము నెనసిన కరణి
నీపాదముల జేరినేధన్య నైతి
అసమాన దుర్లభ మవ్యయానంద
బ్రహ్మ సాక్షాత్కార పదము ప్రాప్తించి
ఏది తెలిసినలేదొ - ఇక నన్యమెరుగ
నట్టి సుజ్ఞానమ్ము నతి కృపనొసగి
సర్వోత్తమ గతి ప్రసాదించి బ్రోచు
మాజగత్పూజ్య దేవా ప్రణామమ్ము.

హాణకా కనకమ్మగారి రచనల పేర్లను చూచినపుడు ఆమె యెక్కువగా ఆధ్యాత్మికపరమైన గ్రంథములను రచించినట్లు తెలియుచున్నది. శ్రీరమణ గురుస్తవము కూడ సులలిత పదములతో కూర్చబడి, దైవభక్తి, గురుభక్తి ప్రబోధకముగా నున్నది.

సాహిత్యరంగమునందును, రాజకీయరంగమునందును. కృషి సల్పి, జాతీయవాదములో, మానవతావాదముతో, దేశ సేవ యొనరించి కేసరి స్వర్ణ కంకణమును పొందిన హాణకా కనకమ్మగారు ఎంతయు ప్రశంసనీయురాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేశిరాజు భారతీదేవి (1958)

వనితల కుపదేశకరములగు బోధనలతో శతక రచన మొనరించి మహిళా లోకమున కవయిత్రిగా కీర్తినందిన మహిళ దేశిరాజు భారతీదేవిగారు. భారతీదేవి బాపట్ల వాస్తవ్యురాలుగా ఉండినది.

బాపట్లలో న్యాయవాదులుగా ప్రసిద్ధినందిన శ్రీ చంద్రమౌళి చిదంబరరావు గారి ఏకైక పుత్రిక తల్లి అన్నపూర్ణమ్మగారు. 1915 వ సంవత్సరమున భారతీదేవిగారు జన్మించిరి. వీరి తల్లిగారగు అన్నపూర్ణమ్మగారు అధిక విద్యావంతురాలు కాకపోయినను, స్త్రీ సమాజ సేవాసక్తి కలిగినదై, 1913 వ సంవత్సరములో ప్రథమాంధ్ర జన మహాసభతో పాటు బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహిళా సమాజ స్థాపకులలో నొకరుగను పనిచేసిరి. మహిళా సమాజములోనేగాక శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారితో కలిసి, కాంగ్రెసు సేవలో కూడ పాల్గొనిరి. శ్రీమతి లక్ష్మీబాయమ్మగారును, ఆమె భర్తగారును కాంగ్రెసు ఉద్యమ సంబంధమైన ఉప్పు సత్యాగ్రహమున చెరసాల కేగిన కాలములో, శ్రీమతి అన్నపూర్ణమ్మగారు గుంటూరులోని శారదా నికేతనమునకు, లక్ష్మీబాయమ్మగారి స్థానమున నిలిచి, ఆ సంస్థ కార్యభారమును వహించిరి.

శ్రీమతి దేశిరాజు భారతీదేవిగారు బాలికా పాఠశాలలో కొంతకాలము మాత్రమే విద్య నభ్యసించి యుండెనేగాని పరీక్షలనివ్వ లేదు. ఈమెకు పన్నెండవ యేటనే వివాహము జరిగినది. ఇంటియందు, తండ్రిగారి యొద్దనే భారత, భాగవతాది గ్రంథములు పఠించి బాగుగా విజ్ఞానము సంపాదించినది. చిన్నతనము నుండియు వ్యాసరచన మొనరించు అభ్యాసము ఈ కవయిత్రికి కలదు. నెల్లూరు వర్థమాన సమాజము వారు తిక్కన జయంతి జరుపు సందర్భమున ఉత్తమ వ్యాసమునకు శ్రీ కేసరిగారి స్వర్ణ పతకమును బహూకరించెడివారు. 1935 సంవత్సరపు పోటీ పరీక్షలో ఈ బహుమానము భారతీదేవిగారి కొసంగబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తల్లి వలెనే భారతీదేవిగారు కూడ మహిళా సంఘ కార్యమునందును శ్రద్ధ వహించుచు, స్థానిక మహిళా మండలి సభ్యురాలిగను, శ్రీహితైషిణీ మండలి సహాయకార్యదర్శిగను, కార్యవర్గసభ్యురాలిగను పనిచేసి యున్నారు.

భారతీదేవిగారు పద్య, గద్యరచనల రెండింటను ప్రావీణ్యము వహించి యున్నవారు. కాంతాశతకము అను కంద పద్యములతో గూడిన శతకమును రచించిరి. ఆ శతక గ్రంథమును కేసరిగారు దయతో ముద్రింపించినారు. ముక్తాంబ, సత్యాప్రతిజ్ఞ అను ఏకాంకిక నాటికలు కూడ గృహలక్ష్మి పత్రికలో ప్రచురింపబడినవి. "శ్రీకృష్ణ మహిమార్ణవము" అను వచన గ్రంథమొకటి రచించి భారతీదేవిగారు కేసరిగారి కంకితమొనరించినారు. ముద్దుకృష్ణ యను గీతపద్య శతకమొకటి కలదు. ఈ కవయిత్రి ఆకాశవాణిద్వారా అనేక ప్రసంగములొనరించినది. కాళిదాస శాకుంతల నాటకమందలి నాయిక పాత్ర విమర్శనము, ఉత్తర కాండలోని సీత పాత్ర, సూరనార్య ప్రణీతమైన కళాపూర్ణోదయమునందలి సుగాత్రి పాత్రలను గురించి ప్రసంగించినది. మదరాసులోని - తెలుగు భాషాసమితి వారు నిర్వహించిన 'కవిత్రయ కవితా రీతులు - తరువాతి కవులపై వారి ప్రభావము' అను శీర్షికతో పోటీ గ్రంథ రచన సందర్భమున, ఆ రచనకు నిర్ణయమైన అయిదు వందల రూపాయలను, భారతీదేవిగారికి, నండూరి రామకృష్ణాచార్యుల వారికి చెరి సగముగా పంచి యిచ్చిరి. ఈ బహుమాన ప్రదానము రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ గారిచే హైదరాబాదులో 1956 సంవత్సరమున జూన్ నెలలో జరిగినది-

భారతీదేవిగారి మామగారగు శ్రీ దేశిరాజు రంగారావుగారు భావనారాయణ దేవాలయ ధర్మకర్తగా నుండి ఆ పురాణ దేవాలయమును, అనేక విధములుగా ఉద్ధరించిరి. ఈమె భర్తగారి పేరు శ్రీరామచంద్రరావుగారు. ఈమెకు నలుగురు బిడ్డలు - ఇద్దరు మగవారు, ఇద్దరు ఆడవారు.

1958 సంవత్సరము జూలై నెల 5వ తేదీన గృహలక్ష్మి జయంతి ఉత్సవము జరిపినారు. అప్పుడే విదుషీమణియైన భారతీదేవిగారికి గృహలక్ష్మి స్వర్ణ కంకణము బహూకరింపబడినది. గృహిణిగా తనవారిచే మెప్పు పొంది,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవయిత్రిగా విజ్ఞులచే గౌరవింపబడిన భారతీదేవి స్త్రీ లోకమునకు ఆదర్శప్రాయు రాలైనది. "స్త్రీలకు నీతి సౌశీల్యములే ప్రధానములు. అవి లేని విద్య విద్యగాదు. హిందూసుందరులకీ భావములు తప్పక అనుసరణీయములు" అని తన అభిప్రాయ మును తెలిపిన సౌశీల్యవతి భారతీదేవిగారు. సాహిత్యరంగమునకు ఎనలేని సేవ చేయగలిగిన దేశిరాజు భారతీదేవిగారు కాలధర్మమునొందినట్లు తెలియుచున్నది.

కాంతా శతకము

మహిళల కుపదేశకరమగు కాంతా శతకమును, ఈ కవయిత్రి, చిన్ని చిన్ని పలుకులతో రచించినది. గృహమునందే విద్యనేర్చి కవితా రచన చేయ గలిగిన ఈ కవయిత్రి రచనలో దైవభక్తి యెక్కువగా కానుపించుచున్నది. స్త్రీ జన బాంధవుడగు డా॥ కె.యస్.కేసరిగారే ఈ 'కాంతా శతకమును' ముద్రింపించి నారు. విదుషీమణులచే గ్రంథములు వ్రాయించి తమ ముద్రణాలయమునసే అచ్చు ఒత్తించి, వారికి బహుమతులనిచ్చి గౌరవించి కేసరిగారు శాశ్వత కీర్తిని సముపార్జించిరి.

కవయిత్రి దైవభక్తిని గూర్చి కాంతా జనములకు అభిమానముతో బోధించినది.

ఏక స్వరూపుడైన భగవంతు నిట్లు ప్రస్తుతించినది:

శ్రీకరుడపార మహిముడు
లోకములన్జేసి వానిలో వెలుపలదా
నేక స్వరూపుడై కరు
ణాకరుడౌ దేవుగొల్వుమనయము కాంతా.

జ్ఞాన స్వరూపుడైనవాడు, పరమానందమయమగు ఆత్మతో ఆదిత్యునివలె వెలుగొందు పరమాత్మని దలచుమని చెప్పినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జగములన్నీ సంభవించుటకు, వెలుగొందుటకు, అడగిపోవుటకు కారణమగు భగవంతుని కొలువుమని పలికినది. ఆ చంద్రతారార్కము వెలుగొందు దేవుని గురించి ఇట్లు చెప్పినది:

రవి చంద్రులు చుక్కలు న
త్య విరళ తేజంబులోడ నయము వెలుగన్
భువన ప్రకాశ మొసగన్
దవుశక్తి నొసంగ జేసె దైవమె కాంతా.

భగవంతుని అపారమగు కరుణ నిట్లు ప్రస్తుతించినది:

అతని దయ లేనిచో నీ
క్షితిపై నెవ్వడును గొంత సేపైనను దా
బ్రతుకంజాలడు గాదే
యతులిత మహిమాను భావుడాతడె కాంతా.

సర్వజ్ఞుడైన భగవంతునికి తెలియరాని విషయము లేదనియు, ప్రాణుల మనములందు కలుగు భావములను తాను కనుచుండును కావున పాపచింతన మాను మని తెలిపినది.

తన వారు అను వారు ఎందరున్నను భగవంతుని భక్తిని మాత్రము మానవద్దని హితము బోధించినది.

సుతులున్న భూషలున్నను
పతియున్న నశేషభోగ భాగ్యములున్నన్
సతతంబు నీవనంచిత
మతి భక్తి భజింపుమమ్మ మానక కాంతా.

పరమేశ్వర చింతనము, పరహితకార్యానురక్త భావము కలిగిన నిర్మల హృదయముతో జీవయాత్ర జరుపుచు, రవి యుదయింపకముందే లేచి భగవంతుని ప్రార్థింపుమని తెలిపినది.[1]

1. కాంతా శతకము - పుట - 10.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మానవునికి యెన్నియున్నను, లేకున్నను ముఖ్యముగా కావలసినది ఆరోగ్యము. ఆరోగ్యము లేనిది వ్యర్థము అని ఇట్లు చెప్పినది:

ఆరోగ్యము కడుభాగ్యం
బారోగ్యము లేకయున్న నఖిల ధనంబుల్
కారడవిగాయు వెన్నెల
గారాణింపవు సుమీ జగంబున కాంతా.

స్త్రీలకు విద్య అవసరము. చదువుతోనే ముదము కలుగుననియు, చదువు నేర్చుకొనుమని చదువదగిన విషయములను గూర్చి ఇట్లు చెప్పినది:

చదువుము దేశచరిత్రలు
చదువుము మహనీయులైన జనుల చరిత్రల్
చదువుము నీతికథావళి
చదువుము ధీరుల విశుద్ధ చరితము కాంతా.

పావనులైన వారి చరితములను చదివి, హృదయ ఫలకములందు పావన భావములను వర్ధిల్ల చేయుమని ఈ కవయిత్రి బోధించినది.

స్త్రీలు నాటకరంగమున పాల్గొనుట భారతీ దేవిగారికి నచ్చని విషయము. కాని ఈ కాలమున స్త్రీలు ప్రతి రంగమునందును చేరి, ఆ రంగమునకు వన్నె తెచ్చి కీర్తి పొందుచున్నారు. కనుక వారి అభిప్రాయము ఈనాడు చెల్లదు. వారిట్లు చెప్పినారు:

అంగనకు వలదు నాటక
రంగము నెక్కంగ జదువరాదంములకై
సంగీతము సాహిత్యము
నంగనకు న్వలయు భక్తియలవడ కాంతా.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అశాశ్వతమైన ధనమును గురించి, కవయిత్రి తన అభిప్రాయమును సుదీర్ఘముగా తెలిపినది.[1]

ధనగర్వముతో, కులగర్వముతో, విద్యాగర్వముతో నుండక వినయము, నీతి కల్గియుండవలెననియు, కొందరు మగువలు ధనమే ప్రధానముగా భావింతురు కానీ ఘనమగు విద్యయే ధనముకన్న విలువ కలిగినదనియు, విద్యాధనమే గొప్ప ధనమని తెలిపి, ఇతరధనము కాదని వివరించినది.

క. ధనమనగా నొప్పునదియ
ధనమే పరికింప జ్ఞానధనమే ఘనమౌ
వనితలకు మానధనమే
ధనమన్యముగాదటంచు దలపుము గాంతా.

అని శాశ్వతమైన ధనము గురించి తెలిపినది. లోకమునందన్నింటను విలువైన మాతృభక్తినిగూర్చి కవయిత్రి మెత్తని పదములతో వర్ణించినది. నవ మాసములు మోసి నిన్నుగని, ఉగ్గుపాలుపోసి పరమప్రేమతో పోషించి, మారాము చేసినచో ముద్దుతో, ఊరార్చెడు తల్లికి నీవు, ఎంతసేవ చేసినా తరగదు అని కాంతలకు బోధించినది.[2] తల్లిదండ్రులు లొసగునట్టి ఆజ్ఞలను నిర్వర్తించి మంచి ప్రవర్తనతో వారికి గౌరవము కల్గింపవలయునని ఇట్లు చెప్పినది:

తలిదండ్రులొసగు నాజ్ఞకు
దలయొగ్గి విధేయవైచు ధరణి చరింపన్
గలిగిన మంచి ప్రవర్తన
గలుగును గౌరవము గాంచగలదిల గాంతా.

స్త్రీలకు ధర్మము లన్నింటిలో ఉత్తమమైన ధర్మము పతివ్రతా ధర్మము. నిర్మలమతితో పతివ్రతా ధర్మముల నాచరింపుమని తెలిపినది కవయిత్రి.

---

1. కాంతా శతకము - పుట 14.
2. కాంతాశతకము - పుట 15.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. పతిభక్తి దైవభక్తియు
నతులితగురు భక్తి గల్గియదకువతోడన్
క్షితి నాత్మగౌరవముతో
బ్రతుకందగు మానవతి ధరాస్థలిగాంతా.

సతికి లోకమున పతియే అన్నియగును అని తెలుపుచు-

పతి జగతి పరమ మిత్రుడు
పతి భువినీకేడు గదయు పతి బాంధవుడున్
పతిరతయగు సతికి హపర
గతులకు నేకొరత లేదుగదవే కాంతా.

అని చెప్పి, భర్తకు నిరతము సహధర్మచారిణిగా నుండుమనియు, అదే పరమార్థమని నుడివినదా సౌశీల్యవతి.

వనితలకు గృహిణీ ధర్మమును బోధించి గృహిణి విలువ నిట్లు తెలిపినది:

క. గృహిణియె గృహమున దీపము
గృహిణియె పరమార్థ సిద్ధికిని మూలంబున్
గృహిణియె యింటికి రాణియు
గృహిణియె లేకున్న శాస్యమే యిలు గాంతా.

అని చెప్పి గృహమునందుండి శిశువులను, పశువులను పోషించి, పాడి పంటల పెంపొందించుకొనవలయుననియు పురుషుడు ఉన్నతత్వమునకు, వచ్చుటకు, అధోగతికి పోవుటకు తరుణియె కారణమని చెప్పినది.

పురుషుని పాతాళమునకు
జరజర నీడ్చుటకుగాని స్వర్గోద్యానో
త్తర సీమ కెత్తగానీ
తరుణియె కారణమట :చు దలుపుము గాంతా.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్నాతురులైన వారికి అన్నము పెట్టి, సేవకులను మాట మన్ననతో చూడ వలయుననియు, కాలమును వృధా పుచ్చక, రాట్నము వడుకుమని చెప్పి తన దేశభక్తిని వివరించినది.

క. ఖద్దరు దీక్ష వహించుట
శ్రద్ధ మెయి న్దేశసేవ సలుపుట యనుదే
శోద్ధరణ సాధనములగు
సద్ధర్మములంచు నెంచు సతతము గాంతా.

కవయిత్రి శతకమునందుపదేశించిన విషయములన్నియు, ఎంతో సునీతి కరములుగా నున్నది. అలతి అలతి పదములతో ఉదాత్తమైన భావమును చేర్చి కందములను మాకందములవలె కూర్చినది.

పిల్లలకు ఆట వస్తువులు బయటినుండి ధనవ్యయ మొనరించిన దానికంటె, ఇంటనే చేసినచో పరిశ్రమోన్నతి కలుగుననియు, బరులకు ఉపకార మొసరింప వలయుననియు, పరపీడనము పాపమనియు, విశ్వమానవ సేవయె దైవసేవ అనియు, అతిథి అభ్యాగతులను గౌరవించి, గతిలేని వారిని కరుణతో చూడ వలయుననియు, దానములలో విద్యాదానము శ్రేష్ఠమైనది కనుక ఇతరులకు విద్య నేర్పవలయుననియు బోధించినది. జ్ఞానముచే కలుగు లాభము నిట్లు వివరించినది:

క. జ్ఞానమున బోవు మౌఢ్యము
జ్ఞానముచే గల్గునమిత శక్తియుధృతియున్
జ్ఞానమున గల్గు తేజము
జ్ఞానము లేకున్న తిమిరసమమే గాంతా.

అన్యులతో కలహము, మనసునొవ్వగజేసెడు మాటలు, పరుషోక్తులు, దబ్బరలాడుట, ఇంటిగుట్టు వెలితి సేయుట మున్నగునవి పరిహరింపవలయునని పడతులకు బోధించినది. ఐకమత్యముతో మెలగి, నలుగురితో తలలో నాల్క కైవడి వినయముతో నుండవలయుననియు, అన్నదమ్ములు భర్త మెచ్చునట్లుగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిరుగవలయుననియు, ప్రాచీనులైన పెద్దలు వ్యవహరించిన పైనను, కష్టము కలిగించు మూఢ భావములను విడువుమని వివరించినది. నీతి శతకము, కుమారీ శతకమువలె నీతి బోధాకరమగు ఈ గ్రంథమున, కవయిత్రి చల్లని కవితలు అల్లవలయునను తన అభిప్రాయము నిట్లు తెలిపినది:

క. మొల్లవలె గైత జెప్పిన
మల్లెల వలె స్వచ్ఛమైన మంచి యశంబున్
కొల్లగ గాంతువు గనుమా
సల్లలిత గవిత్వమల్లు సరణిం గాంతా.

కవయిత్రి భావించినట్లుగనే, మల్లెలవలె మధుర పరిమళమును కురిపించుచు చల్లని కవిత సాగినది. 'కవిత్వం ఛందోబద్ధమైనదైనా, కానిదైనా దానికి భావము ముఖ్యము. కన్యలు తల్లి దండ్రుల ఆజ్ఞానుసారము నీతినియమములకు బద్ధులై యున్ననే కీర్తిమంతులగుదురు. అట్లే కవితా కన్యయు నియమ బద్ధయై యుండనిచో గౌరవమంద జాలదు' అని కవయిత్రి దేశిరాజు భారతీదేవి గారు వ్రాసినారు.[1] భక్తి, నీతి విషయములు పొదిగినట్టి ఈ శతకము 'కాంతా' మకుటముతో చేర్చబడి స్వచ్ఛందమైన భావములను వెదజల్లుచు, వెలుగు వీడని దీపమువలె ప్రకాశించుచు కవయిత్రికి శాశ్వత కీర్తిని కల్గించినది.

నవరత్నములు

గృహలక్ష్మి స్వర్ణ కంకణ ప్రదానమొనరించి భారతీదేవిగారిని సన్మానించి నపుడు, ఆ కవయిత్రి 'నవరత్నమాల' ను కేసరి గారికి సమర్పించినది.

కేసరిగారి వ్యక్తిత్వమును, దానగుణమును ప్రశంసించుచు రచించిన ఈ పద్యరత్నములు హృద్యముగా ఉన్నవి.

1. కాంతా శతకము - తొలిపలుకు - పుట 2.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. భాషాభిమానియై, వైద్య విద్వర్యుడై
ప్రస్తుతిగాంచిన పండితుండు
సంఘ సంస్కర్తయై, సదమలశీలుడై
సురుచిరమూర్తి యౌపత్రికీర్తి
ధర్మార్థ కామ తత్పర ధీవిలాసుడై
చతురవర్తనుడైన శాంతిధనుడు
మానియై దేశాభిమానియై దానియై
జన్మ సార్థతగను సజ్జనుండు.

కష్టసుఖముల సమముగా సహనము వ
హించి ధీరత, విజయంబు గాంచినట్టి
కేసరీ కీర్తి మూర్తికి గేలు మోడ్తు
భక్తిమై నాంధ్రమహిళల పక్షమునను.

తొలుత స్వయం కృషిలో కొంత కొంతదా
నెంతేని ధనము నార్జించినాడు
ఆర్జించి రక్షించినట్టి ధనంబును
సద్వినియోగంబు సలిపినాడు
అబలాజనంబు, లనామయ స్థితినొంద
నౌషధంబు లొసంగి యలరినాడు
మహిళాభ్యుదయమెంచి గృహలక్ష్మి పత్రిక
వెలయించి తెన్ను జూపించినాడు
సచ్చరిత్రుండు శ్రీనృకేసరికి సాటి
మార్గదర్శకుడొక్కడు మహిని గలడె?

అతని కతండె సాటి యని యందరుని వ్వెరజెందునట్లు సం
తతము స్వయంకృషి న్నెరపి దానదయాపరధర్మ వర్తనన్
వితత యశంబుగాంచి చనె వేల్పుల వీటికి కల్పవాటికా
యతహరి చందనద్రుమ విహారము కేసరి జేయువేడుకన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆశీస్సు

గృహలక్ష్మి సంచిక ఆరవ జన్మదిన సంచికలో దేశిరాజు భారతీదేవిగారు గృహలక్ష్మికి ఆశీస్సు నిచ్చిన పద్యములు గలవు. ఆ పద్యములు హృద్యముగా నున్నవి. గృహలక్ష్మి చిరాయువు నొందవలయునను కోరికతో ఆ పద్యములను రచించినది.

ఉ. శ్రీలలితా సులాపముల చిత్తము నచ్చగ తెల్గునాటిలో
స్త్రీలకు కల్పవృక్షమయి చెన్నలరారుచు వారి పెక్కుచం
దాల పురోభివృద్ధి కృషి తత్పరతై మనునట్లు జేయు స
ల్లాలిత మార్గదాయి 'గృహలక్ష్మి' చిరాయువుగాంచు గావుతన్.

సీ. హిందూవనితల సాహిత్య విజ్ఞానముల్,
పెంపొందజేయుచు వెలసినావు
అజ్ఞాన తిమిరంబున ణగింప సతులకు
మహనీయ కాంతినమర్చినావు
ఆ బాలగోపాల మైకమత్యమెసంగ
చెలికత్తెవై పేర్మి చెలగినావు
అల్లారుముద్దుగా నెల్లవారలచేరి
'గృహలక్ష్మి' వగుచు రహించినావు

తెలుగు వెలుగులు రారమ్మ వెలువయనుచు
పిలిచిభనమిచ్చి చేకొని పేర్మి జూపి
మురిసి పల్కించి సంతసమును వహింప
సంచరించెదు 'గృహలక్ష్మి' సంతతంబు

సీ. ఉయ్యాలలో తల్లి యూచి జోలలు పాడి
జోకొట్టినట్టి రోజులు గతించె
తప్పటడుగులు పైచి తల్లి కేల్పట్టుచు
పోలుచునుండు రోజులు గతించె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పిలిచిన యంతనవ్వోలయగ తలవంచి
చెలువంబు జూపు రోజులు గతించె
కూకటి ముడికినై కురుతించు కించుక
కుట్టుకువచ్చు రోజులు రహించె

పంచశారదలయ్యో క్రొమ్మించుకళల
దేరునారవ వర్షమే తేరవచ్చె
మంజువాక్కుల తోడ సమంజసముగ
దిన దినాభివృద్ధిని నీవు గని ముదంబు
కూర్పుమాయింక గృహలక్ష్మి కూర్మి మీర.[1]

1. గృహలక్ష్మి 1933 ఏప్రిల్ సంచిక - పుట 92. దేశిరాజు భారతీదేవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవిసింహి
గుడిపూడి ఇందుమతీదేవి (1959)

తెలుగు సరస్వతికి కవితా నివాళు లందించిన కవయిత్రీమణులలో గుడిపూడి ఇందుమతీ దేవిగారు కవితా శారదగా పేరొందినవారు. ఇందుమతీ దేవిగారు కవిపండిత వంశమని ప్రసిద్ధినొందిన మతుకుమల్లి వారింటి ఆడుపడుచు. ఇందుమతీ దేవిగారు తాతయగు నరసింహ శాస్త్రిగారు ప్రఖ్యాతినొందిన కవి. పండిత సింహుడు. తరతరములుగా వీరి హృదయములందు కవితా మాధురి నిండుకొని యున్నది.

పూవు పుట్టగనే పరిమళించునన్నట్లు, ఈమె పదియవ సంవత్సరము నుండియే చిన్న చిన్న పద్యములను, గేయములను రచించినది. వీరి తాతగారు రచించిన 'ఇందుమతీ పరిణయ' కావ్యము పేరున వీరికి ఇందుమతి యను నామ కరణమొనరించిరట. తాతగారి అడుగు జాడలలో నడువ వలెనను కుతూహలముతో వీరు 'లక్షణా పరిణయ'మను కావ్యమును రచించి కవయిత్రి తమ పుత్రికకు 'లక్షణ' యను నామముంచినారు.

ఇందుమతీదేవిగారి జన్మస్థానము పాత గుంటూరు. క్రీ.శ. 1889 సంత్సరము ఏప్రిల్ మాసమున జననమందినది. కవిపండితులుగా కీర్తినొందిన మతుకుమల్లివారి వంశమునందు నృసింహశాస్త్రిగారి కుమారుడగు నరహర్యక్షరాయడు, అనంతలక్ష్మమ్మ ఈ కవయిత్రి మాతాపితలు. ఆబ్జనాభ చరణ సరసిజయుగళ సంచరణ చిత్త రాజహంసము' అని కవయిత్రి తన తండ్రిని వర్ణించినది. హరికాంతను, హరుకాంతను, అబ్జునికాంతను నిరసించి మెలగు రమణి తన తల్లి సౌభాగ్యలక్ష్మియగు అనంతలక్ష్మియని, తల్లి గుణగణములను కీర్తించినది. కవయిత్రికి తన పుట్టినింటి వారిపైన ప్రేమాభిమానములు నిండుగా కలవు. తన తండ్రిగారి వంశము నిట్లు ప్రశంసించినది:

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ. మతుకు మల్లి యిల్లు మహి విద్య పెదజల్లు
వరబుధేంద్రులకును బ్రక్కమల్లు
యెఱిగి మెఱగి రేని యెంచిచే వాడల్లు
గాన వారి యిల్లు ఘనత జెందె.

వారి వంశములోనివారు చాల వరకు కవి పండితులే యున్నారు. అందు వలననే ఈ కవయిత్రికి కవితా రచనము వెన్నతో బెట్టిన విద్యయైనది.

ఈ కవయిత్రి వివాహము 1901లో శ్రీయుతులు, సాధు పురుషులు, శ్రీ రామారావుగారితో జరిగినది. కవయిత్రి సాహిత్యాభిమానమునకు ఎడతెగని ప్రోత్సాహమందించిన, సంస్కార పురుషుడు గుడిపూడి రామారావుగారు. వీరు ముందు ఆత్మకూరునందు నివసించుచుండిరి. తరువాత విజయవాడ స్థిరనివాసముగా నేర్పరచుకొనినారు. వీరి పుత్రిక లక్షణాదేవియు మంచి విద్యా సంస్కారములను కలిగిన మహిళ.

ఇందుమతిదేవి రచనలు :- వీరి రచనలన్నియు ప్రసిద్ధములైనవే. 1. అంబరీష విజయము, 1. లక్షణా పరిణయము, 3. తరుణీ శతకము 4. రాజేశ్వరీ శతకము, 5. నీతి తారావళి, 6. నరసింహ శతకము, 7. లోకావలోకనము, 8. సోదరి, 9. గోపిలాపము, 10. అంజనేయస్తుతి, 11. జన్మభూమి 12. నర్మదయను నాటకము, 13. గాంధీ కీర్తనలు, 14. రామ కథామంజరి (వచన రామాయణ గ్రంథము) 15. రామాయణ గానసుధ, (రామాయణకథ అంతయు కీర్తనలుగా వ్రాయబడినది).

ఇన్ని ఉత్తమ గ్రంథములను రచించిన, ఈ కవయిత్రి రచనలను ప్రశంసించుచు శ్రీమతి దేశిరాజు భారతీదేవిగారిట్లు పేర్కొనిరి;

సీ. లక్షణా పరిణయ మక్షర రమ్యత
యక్షర పదమునసట్లు వ్రాసె
అంబరీషుని విజయంబను కావ్యంబు
భక్తిరస ప్రౌఢి వ్రాయగల్లె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సోదరీముఖ కల్పితోదాత్త కావ్యముల్
చిత్ర కల్పన సొంపు చెలగజేసె
సొంపైన శతకముల్ గుంపెడు రచియించి
భక్తి పుంభావంపు ప్రౌఢి జూపె

గీ. రామచరితంబు దివ్య విరాజమాన
వైఖరుల గాన సుధ చింద వ్రాసి సతుల
కతులితానందమును గూర్చె నచ్చ శైలి
ఇందుమతి దేవిగారల స్పంద కవిత.[1]

ప్రజ్ఞాశాలినియైన ఈ కవయిత్రీమణికి 1959 సంవత్సరమున ఏప్రిల్ నెల 26 వ తేదీన శ్రీ కేసగిరిగారి జన్మదిన సందర్భమున 'గృహలక్ష్మి స్వర్ణ కంకణ ప్రదానము' జరిగినది. ఆ దినమున వారి కార్యాలయోద్యోగులకు, పరివారమునకు అన్నవస్త్ర దానములు జరిగినవి.

బహుళ గ్రంథకర్త్రి, చక్కని అనుభవ పాండితీ గరిమ కలిగిన వక్త యైన, ఇందుమతీ దేవిగారిని త్రిలింగ పీఠమువారు, సాంగ వేదకళాశాలవారు, విశిష్టాద్వైత మత ప్రచార సంఘమువారు మొదలగు ప్రముఖు లెందరో సన్మానము లొనరించి, బిరుదుల నొసగినారు. కవయిత్రీమణి, ఉభయ భాషాప్రవీణ, సతీమణి, కవిసింహ, మధుర కవయిత్రి, విద్వత్కవిశిరోమణి, కవితాశారద మున్నగు తన బిరుదము లన్నింటిని తన ఇలువేల్పు తన కిష్టదైవమైన భద్రాద్రి రామునకే అంకిత మొనరించినదీ సాధ్వీమణి.

వీరి రచనలలో లక్షణా పరిణయమును ప్రస్తుతము పరిశీలన మొనరించుచున్నాను.

---

1. లక్షణా పరిణయము - ప్రశంస - దేశిరాజు భారతీదేవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్షణా పరిణయము

లక్షణా పరిణయమును 1914 వ సంవత్సరమున రచించినదీ కవయిత్రి. మొదటి సారి అచ్చువేసి అందరికి సహృదయముతో ఇచ్చినది. మరల దాని పునర్ముద్రణ గురించి వీరి ప్రియ మిత్రురాలగు డా. కొమర్రాజు అచ్చమాంబగారు ఎల్లప్పుడూ ప్రోత్సహించెడిది. కాని వీరికి వీలు కలుగలేదు. ఈ ప్రబంధ ద్వితీయ ముద్రణ సమయమున కవయిత్రి 'స్మృతి' యందు ఆమెను స్మరించినది.

పదిమందిగల కుటుంబములో అత్తవారింట అడుగు పెట్టిన ఇందుమతీ దేవిగారు తన పదునెనిమిదవ యేట, అత్తవారింటిలో రాత్రియందు ఆముదపు దీపము వద్ద కూర్చుని గద్దరెక్కల కలముతో ఈ ప్రబంధమును వ్రాసినది.[1] "కృతి కన్యకు మాల్య శైలేశుడైన నరసింహుని తగినపతిగా" తలంచి అంకిత మొనరించినది. ఆ స్వామినిట్లు తలంచి కావ్యరచన మొనరించినదీ కవయిత్రి:

గీ. మాల్య శైలేంద్ర వాసుని మంగళ తర
మంగళ గిరీంద్ర వాసుని మదిని నిలిపి
భారమంతయు నరసింహుపైన నిలిపి
కావ్య రచనకు గడగెద కడుముదమున.

శృంగార రస ప్రధానమైన ఈ ప్రబంధమును నాలుగాశ్వాసములందు రచించినదీ కవయిత్రి. చిన్నతనమున కావ్య రచనకు తనలో కలిగిన భావము నిట్లు తెలిపినది:

గీ. భట్టుమూర్తి రచించిన వసుచరిత్ర
జదివి కావ్యము రచియింప స్వాంతమందు
నట్టులేను వ్రాసెదనను పట్టుదలయు
హర్షమును మానసంబున నలమికొనగ.

---

1. లక్షణా పరియము - స్మృతి - పుట. 8.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. పిన్న తనమునుత్సాహంబు పెంపుగదుర
నాకు పదునెన్మిదవ యేడునను రచించి
మాల్య శైల నృసింహుల నెమ్మది దలంచి
కృతినొసంగితి నిది కృత కృత్యనైతి.

అని లక్షణా పరిణయ రచనాసక్తిని తెలిపినది.

లక్షణా పరిణయ కథా ప్రారంభమును ప్రాచీన భాగవతాది పురాణముల రీతిలోనే రచించినది. పరీక్షిన్మహారాజు, సూరిజనోత్తముడైన శుకునిగాంచి 'శౌరి కథలు వినుటకు నా మది కోరుచున్నది. హరిచిత్రలీలలు, హరిచరితము, వీనుల విందొనగునట్లు వినిపింపు'మని కోరెను. అపుడా చిలుక జోగి, అరవింద దళాక్షుని కాంతలందరి చరితములు తెలిపితిని. వారిలో హరి అష్టమ సతియైన మద్రేశ్వర సుత లక్షణయను మహిళామణి చరితమును తెలిపెదను, నీవాకర్ణింపు'మని కథా ప్రారంభ మొనరించెను.

లక్షణా పరిణయమను ఈ ప్రబంధమునకు మూలమైన ప్రసిద్ధ కథ మహా భాగవతమునందలి దశమ స్కంధమున 'లక్షణయను కృష్ణుని అష్టమ భార్య, ద్రౌపదీ దేవికి తన వివాహ వృత్తాంతమును దెలుపుట' అను ఘట్టమున కలదు.[1] వచనముతో ప్రారంభమై ముప్పది పద్యములలో సాగిన ఈ కథ మరల వచనము లోనే ముగిసినది. అట్టి క్లుప్తమైన కథను కవయిత్రి తన రచనా నైపుణ్యముచేత, వర్ణనా భరితమొనరించి, నాలుగాశ్వాసములు ప్రబంధముగా తీర్చి దిద్దినది. మూల కథయే గాక పద్యరచనా విధానములో కూడ భాగవతము యొక్క ప్రభావమీ కావ్యముపైన గలదు. అంతేకాక, ఈమె తండ్రిగారు వసు చరిత్రమును మెచ్చు కొనుచుండగా 'అట్టి కావ్యమును నేను వ్రాయజాలనా' అని తలంచి వ్రాయుట వలన ఈ కావ్యములో వసుచరిత్ర రచనా రీతి గలదని తెలియుచున్నది.

1. పోతన భాగవతము - దశమస్కంధము - అధ్యాయము 89-పుట 693.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మద్రదేశకాంతునకు ముద్దుల పట్టియైన లక్షణా దేవి బాల్యమును వర్ణించుటలో కవయిత్రి శ్రీ హృదయమవ గతమగుచున్నది. పసి తనమున పిల్లలు తల్లి దండ్రుల మీదికి ఎగసి ముద్దులు కురిపించునపుడు వారి మనసు అంతులేని పారవశ్యము నొందును. ఈమె ఆ అనుభూతి నిట్లు వ్యక్త పరచినది:

లక్షణ బాల్యము :

గీ. నన్నుగన్న తల్లి నాదునోముల పంట
నాదు ప్రాణప్రదమ నాధనంబ
యనుచు తండ్రి ముద్దులాడిన గనిసవ్వ
నబల రదన కాంతుల లమికొనగ.[1]

విదియ చందురునివలె, నానాటికి వృద్ధిబొందు, ఆ బాల తల్లి పిల్వగా పలుక నేర్చినది. నడువ నేర్చినది. మాటాడ నేర్చినది.అట్లు వృద్ధినందు లక్షణ యొక్క-

గీ. మిసిమి మీగడ పస మీరు మృదుల వాక్య
ములను దొ్రలల బల్కెడు పుత్రి బల్కు-
లనవరతము శ్రోత్ర పేయంబులయ్యె
తల్లి దండ్రుల కట్టె గాదా దలంప.[2]

అని లక్షణ బాల్యవర్ణన మొనరించినది కవయిత్రి.

ఈ కావ్యమునకు మూలకథ భాగవతమునుండి గ్రహించినది. కనుక భాగవత పద్య ప్రభావము చాల పద్యములందు కానుపించును.

భాగవత ప్రభావము :

లక్షణా పరిణయమునందు, దినదిన ప్రవర్థమానయైన లక్షణా దేవి చెలులతో ఆడిన ఆట లిట్లు వర్ణింపబడినవి:

---

1. లక్షణాపరిణయము - ప్రథమాశ్వాసము-పద్యం 95.
2. లక్షణా పరిణయము - ప్రథమా శ్వాశము - పద్యం - 87.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. బొమ్మలపెండ్లిండ్లు బొలుపొందగా జేసి
వేడుక చెలులతో వియ్యమందు
కోమలి గుజ్జన గూండ్లు వండించు వ
డ్డించు కన్నెలు తాభుజించుమించి
శుకపికాళికి వేడ్క ప్రతి గీతముల నేర్పు
నంచకు నడకల సమర నేర్పు
నెమ్మి తండములకు నృత్యంబు వడినేర్పు
బాలామణులతోడ బంతులాడు.

గీ. లలితవన భూములను సుమలతలబెంచి
ఘన తరుల నల్ల జేయు నాకన్నె వేడ్క
సౌధములయందు నింపుగా సఖులగూడి
యలరను య్యాలలూగు పాటలను పాడు.[1]

పై పద్యము చదువగానే భాగవతమున రుక్మిణీ కళ్యాణము నందలి పద్యము జ్ఞప్తికి వచ్చును:

వ. మఱియును, దినదిన ప్రవర్ధమానయై-

సీ. పేర్వేర బొమ్మల పెండ్లిండ్లు సేయుచు
నబలలతోడ వియ్యంబులందు
గుజ్జన గూళ్లను గొమరొప్ప వండించి
చెలులకు బెట్టించు జెలువు మెరయ
రమణీయమందిరా రామ దేశంబుల
బువ్వబీగెలకు నుబ్బోడి సేయు
సదమల మణిమయ సౌధ భాగంబుల
లీలతోభర్మ డోలికలనూగు.

1. లక్షణా పరిణయము - ప్రథమాశ్వాసము - పద్యం 89.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తే. బాలికలతోడ చెలరేగి బంతులాడు
శారికాకీర పంక్తికి జదువు చెప్పు
బల్లిసంఘములకు మురిపెములు గరపు
మదమరాళంబులకు జూపు మందగతులు.[1]

యౌవనవతి యైన ఆ తరుణికి తగిన వరుడు ద్వారకాపురము నందుగల శ్రీ కృష్ణుడేయని, సంయమివరుడైన నారదుడు మద్రనాథునితో తెల్పెను. మౌని యాడిన మాటలను మనమున దలచి, విరహార్త అయినది లక్షణ. తన తోడి చెలికత్తెలతోగూడి కొంతతడవు వనమున విహరించిన పిదప, మున్ను ద్విజకులా గ్రణిచేత వాసుదేవునకు వైదర్భి సందేశమంపినట్లు, నేనును ద్విజకులాగ్రణి చేత సందేశమంపుదునని తలచినది.[2]

శుకమును ద్వారకకు, పంపినది కానీ లక్షణ మనస్సుకూడ రుక్మిణీదేవి చిత్తమువలెనే, ఆకులత చెందినది.

మ. అలరన్ ద్వారకకేగెనో నడుమ సధ్వాయాస ముందీర్పనే
ఫలవృక్షంబుల యందు నిల్చెనొ గదా బద్మాక్షునింగానదో
నలినాక్షుండును యేమి పల్కెనొ కదా నా పుణ్యమెట్లున్నదో
తలపన్ వార్త యికేమిదెచ్చునొ శుకోత్తంసంబు నాకీయెడన్.

ఈ పద్యముపై భాగవతమునందలి రుక్మిణీ కళ్యాణ ఘట్టమున గల—

మ. ఘనుడా భూసురుడేగెనో నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో
విని కృష్ణుండిది తప్పుగా దలచెనో విచ్చేసెనో యీశ్వరుం
డను కూలింపదలంచునో, తలపడో యార్యామహా దేవియున్
నను రక్షింప నెరుంగునో, యెరుగదో నా భాగ్యమెట్లున్నదో.[3]

1. పోతన భాగవతము - దశమ స్కంధము - పుట 521 - పద్యం 1687.
2. లక్షణాపరిణయం - ద్వితీయాశ్వాసము - పద్యం 40.
3. శ్రీమహాభాగవతము - దశమస్కంధము - పద్యం 1724 -.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను పద్య ప్రభావము గలదని సహృదయులందరికి తెలియును. భాగవతమునందలి భక్తి, ప్రపత్తులతో కవయిత్రి రచన భాగవత ధోరణిలోనే సాగినది.

పద్మాక్షునికి లక్షణా వృత్తాంతమును తెలిపి, తిరిగివచ్చిన శుకము కన్యతో పలికిన పల్కులు మత్తకోకిల వృత్తములో తృతీయాశ్వాసమున గలవు.

మ, కాంచితిన్ వన జాతనేత్రునిగాంచెనాతడు నన్నునే
డెంచనీదు మనంబుసంగల యెల్ల కోర్కెలు పుణ్యమున్
మించి వేగఫలించె శౌరియు మెచ్చె నీసుగుణాలికిన్
పంచదారయు పాలునుం ఫలవారమిచ్చెను నాకునున్.[1]

రుక్మిణి చెంతకు తిరిగి వచ్చిన భూదేవుడు పలికిన పలుకుల ఛాయసరపు పల్కులందు కలదు.[2]

లక్షణా దేవి స్వయం వరమునకు రాజకుమారు లెందరో విచ్చేసిరి. యదుకుంజరుడు గోపాలుడు కూడ స్వయంవరమునకు వచ్చెను. అతని అంద చందములను గాంచి, అతని శౌర్యమును తలచి మద్రదేశపు పౌరులందరు ఇట్లు తలపోసిరి:

మ. తను మద్రేశ్వర పుత్రి యూహనునకీ దైత్యారియు న్నామెకుం
దగు నెన్నంధర నిట్టులుండ వలదే దాంపత్య మున్నంతకా
మగువాభూవరులెల్ల రిచ్చవడ నిమ్మత్స్యం బలంగూల్చి దా
మగడౌ గాత యదూద్వహుండు నికనమ్మా లక్షణాకాంతకున్.[3]

---

1. లక్షణా పరిణయము - తృతీయాశ్వాసము పద్యం - 64
2. భాగవతము-పోతన.
3. లక్షణా పరిణయము - చతుర్థాశ్వాసము - పద్యం 34.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై పద్యమును పోలిన పద్యమే భాగవతమునందు కలదు. రుక్మిణీ కాంత స్వయంవరము నేర్పాటొనరించినపుడు విదర్భపుర ప్రజలు హరిరాక విని, చూచి, సంతసమున నిట్లు తలచిరి:

మ. తగునీ చక్రి విదర్భ రాజ సుతకున్ దథ్యంబు వైదర్భి యుం
దగునీచక్రికి నింతమంచి దగునే దాంపత్యమీ యిద్దరిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరిగదా దర్పాహతారాతియై
మగడౌ గావుత జక్రియీరమణికిన్ మాపుణ్యపుంలంబునన్.[1]

కవయిత్రికి ప్రాచీన కావ్యములను పఠించినట్టి పాండిత్య ప్రకర్ష వలన రచనలపై పూర్వకవుల ప్రభావమున్నది. అయినను కథాగమనములో ఎట్టి లోపము లేకుండా, ఔచిత్యవంతముగా సాగినదీ ప్రబంధము. వసుచరిత్రమును పఠించిన పిదప తనకు కూడ నట్టి కావ్యమల్ల వలయునను కోరిక గల్గుట వలన, ఈ రచన మొనరించితినని కవయిత్రి వ్రాసినది. కనుక ఈ కావ్యముపై వసు చరిత్ర ప్రభావమెంతవరకు గలదో గమనింపవలసియున్నది.

ప్రబంధ కవుల అనంతరము కనుపర్తి అబ్బయామాత్యుని పురూరవ చరిత్రము, అడిదము సూరన కృత కవిజనమనోరంజనము మొదలగు కొన్ని కావ్యములు శృంగార వర్ణనా భరితమై, రామరాజభూషణుని రచనను బోలి 'పిల్ల వసుచరిత్ర' లని పిలువబడినవి. ఈ కావ్యము కూడ పిల్ల వసుచరిత్రము వలెనే నడచినది.

లక్షణాదేవి సౌందర్య వర్ణనము, విరహ వర్ణనము, ఆమె వీణ వాయించు ఘట్టము అన్నియు ప్రాచీన కావ్యములను స్ఫురింప జేయును.

తృతీయాశ్వాసమునందు, లోకములన్నియు తిరిగి వచ్చిన దేవముని ద్వారకకు వచ్చెను. ఆ సమయమున, వారిజ లోచనుడైన హరి, ఉద్ధవునితో

1. పోతన భాగవతము-దశమ స్కంధము-పద్యం 1737-అధ్యాయము 53.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కూడి, ఏకాంత మందు ఆలోచనము చేయుచుండెను. నారదమునికి, ఎదురేగి కొని వచ్చి, అర్ఘ్యపాద్యములనిచ్చి, పీఠమున కూర్చుండ చేసి, లోకములందలి వింతలు చెప్పుమని కోరినాడు; శ్రీకృష్ణుడు. అంతట ఆ ముని చంద్రుడు, మద్రభూమీశ సుత యైన లక్షణా సౌందర్యమును గూర్చి తెలిపినాడు. తృతీయాశ్వాసమున గల పదమూడవ పద్యము మొదలుకొని ముప్పది రెండు పద్యములవరకు, లలితాంగి లక్షణాదేవి వర్ణనము దీర్ఘముగా సాగినది. ఇంత వివరముగా చేయ బడిన వర్ణనచే, కేవలము కవయిత్రి వర్ణనా నైపుణ్యము తెలియుచున్నదికాని, దీని వలన కథకే మాత్రము సంబంధము లేదు. కవయిత్రి కాలమునాటికే, ప్రబంధ యుగము నందలి మితిమీరిన వర్ణనా సౌందర్యమును, నిరసించుచు ఒకే మూసలో పోసితీసినట్లున్నవని విమర్శకులు నుడివినారు. అయినను ఈ కవయిత్రి అట్టి రచనమొనరించుచు ముందుగానే తాను వసుచరిత్రవంటి కావ్యమును వ్రాసెదనని చెప్పుకొన్నది. కనుక ఆ తలపుతోడనే ఇట్టి వర్ణనా నైపుణ్యమును చూపించినదని భావింపవచ్చును.

వసు చరిత్రములో వసు రాజుతో, నర్మసఖుడు గిరికాదేవి సౌందర్యమ్మును గురించి తెలిపినాడు. కాని ఇందు దేవమౌని, బ్రహ్మచారి యగు నారదుడు, కృష్ణునితో లక్షణాదేవి సౌందర్యమును గూర్చి, అంగాంగ వర్ణనచేయుచు చెప్పుట యొక కొంత అనౌచిత్యమనిపించును.

కవయిత్రికి తన కవితా చాతుర్యమును, వర్ణనా చమత్కారమును, చూపింపవలయునను భావన ఈ కావ్యమున కనిపించును. అందుకే లక్షణాదేవిని గూర్చి ఒక సురమౌని ఆపాదమస్తకము నిండుగా వర్ణించినాడు.

దోషము లెంచి చూచుట కంటె కావ్యములోని గుణములను గమనించుటయే పరిశీలకుల నిండుమనసుకు దాహరణ మనిపించును. అలనాడు కుమారసంభవకర్త యైన నన్నెచోడుడు కుకవులైనవారు చెరకు రసమును వీడి పిప్పి మీద వ్రాలు ఈగల వంటివారు అని కుకవినింద యొనరించినాడు.[1] అందువలన కావ్యమున

1. నన్నెచోడుని కుమార సంభవం - ప్రథమాశ్వాసము - పద్యం 30.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నున్న చిన్ని దోషములను లెక్కింపక కవయిత్రి అంత చిన్న వయసున ఇట్టి కావ్యమును రచించుటయే ఘనమని తలంపవలయును.

వసుచరిత్ర ప్రభావము :

నారదముని లక్షణాదేవి సౌందర్యమును గూర్చి వర్ణించుటలో ఆమె నాసికావర్ణనము నిట్లొనరించెను:

మ. అళి విద్వేషి యటంచు నెల్లెడల దన్నాడంగ సంపెంగయా
బలునిందం దగబాపగోరి వడినాప ద్మాస్య నా సాకృతిం
జెలువొప్పంగ ధరించి వీక్షణమరీచీ భృంగముల్ రెండు వం
కులమైత్రిం దగ గొల్వ నిల్చెను జుమీ కంజాత పత్రేక్షణా ![1]

ఈ పద్యముపై వసుచరిత్రకారుని ప్రసిద్ధి నొందిన పద్యము యొక్క ప్రభావము కలదు. గిరికాదేవి నాసికా వర్ణన మొనరించిన పద్యము సుప్రసిద్ధ మైనది.

శా. నానా సూన వితాన వాసనల నానందించు సారంగమే
లాననొల్లదటంచు గంధ ఫలి బల్కాకం దపంబంది యో
షానా సాకృతి బూని, సర్వసుమనస్స్వోర భ్య సంవాసమై
పూనెం బ్రేక్షణ మాలికా మధుకరీ పుంజంబు నిర్వంకలన్.[2]

వసుచరిత్రమున ద్వితీయా శ్వాసము నందు చక్కదనములకుప్పయగు నాపోలంతి సర్వవిధముల నీకేతగియున్నది. అని వసురాజుతో అతని నర్మసఖు డనిన పద్యము హృద్యముగా నున్నది.

మ. కమనీయాకృతి, యోగ్య కీర్తనములం గన్పట్టు నా శ్యామయా
సుమబాణాంబక, యాయమూల్యమణి, యా చొక్కంపు పూబంతి, యా

1. లక్షణా పరిణయం - తృతీయాశ్వాసం - పద్యం 15.
2. వసుచరిత్ర - భట్టుమూర్తి - ద్వితీయాశ్వాసం - పద్యం 47.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సుమనోవల్లరి, యాసుధాసరసి, యాసొంపొందు డాల్దీవియా
కౌమరుంబ్రాయపు రంభ యాచిగురు టాకుంబోడి నీకేతగున్.[1]

ఈ పద్యమున కవి గిరికాదేవి యొక్క కన్నులను. అధరోష్ఠమును, స్తనములను, శరీరాకృతిని, నాభిని, పిరుదులను, దొడలను వర్ణించినాడు. ఈ పద్యము యొక్క ఛాయలే ఈ క్రింది పద్యమున గలవు.

లక్షణాదేవిని గూర్చి తెలిపిన నారదుడు 'ఆ కన్యాచూడామణి నీకేతగును. ఆమెకు నీవు తగుదువు' అని కృష్ణునితో చెప్పి, ఇట్లనును.

ఆ. ఆయమూల్యమణికి, నాజాజి పూబంతి
కానవసుమలతకును నాశ్యామకరయ
నౌరులుగారు సాటి యువతికి తగుదీవు
తగును కన్నె నీకు దనుజవైరి.[2]

ప్రాచీన కావ్యములను బోలిన రచనయున్నను, కవయిత్రి స్వతంత్ర భావములే కావ్యమున గలవు. ప్రాచీన ప్రబంధముల రీతిగనే ఈ కావ్యమున కూడ చంద్రోపాలంభనము, మన్మథోపాలంభనము మున్నగునవి కలవు. లక్షణా దేవి విరహముతో చంద్ర, మన్మథోపాలంభన మొనరించినది.

ఇక్షుకోదండు నుద్దేశించి ఇట్లు పలికెనది :

ఉ. అంబుజవాసి నీజనని యంబుజవైరి యతండు నాలలా
టాంబకు భూషణం బతడు యాతడు నీకు విరోధి యౌనునో
శంబరవైరి నీకు నలశంబరధారికి మైత్రి చెల్లునే
యంబుజ పత్రలోచనల నార్తిని బెట్టుటకే గదాకటా.[3]

1. వసుచరిత్ర - ద్వితీయాశ్వాసము - పద్యం 52.
2. లక్షణా పరిణయము - తృ. ఆశ్వాసము - పద్యము 33.
3. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాము - పద్యం 63.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామరాజ భూషణుని వసుచరిత్రము నందలి నాయిక గిరికాదేవి మన్మథోపాలంభన మిట్లొనరించినది:

ఉ. శంబర వైరి వీవు పటు శంబర పోషణ శాలి యాతడ
జ్జాంబక ధారి వీవు మథితాబ్జు డతండునిశాట ఝాటద
ప్పంబడగించు బల్లిదుని పట్టివి నీవు నిశాటు డాతడో
యంబుచరాంక నీకు దగునాహరి ణాంకునితోడి కూటముల్.[1]

మన్మథోపాలంభనము వీరి రచనల యందు కొలది భేదముతో నొకే రీతిలో నొప్పుచున్నది.

వసు చరిత్రకారుడగు రామరాజ భూషణుడు "సంగీత కళారహస్యనిధి" యగుటచే పఠనానుకూలముగ లయను గ్రహించి, అనుప్రాసాద్యలంకారములు ఉపయోగించి యున్నాడు.

ఉదాహరణమునకు :

సీ. ఒక చాయన నపాయ పికగేయ సముదాయ
మొకసీమనానా మయూరని నద
మొకవంక సకలంక మకరాంక హయ హేష
లొక క్రేవవన దేవ యువతిగీత
మొక చెంత సురకాంత లకరాంత త తనాద
మొక దారి నవశారి కోదితంబు
లొక యోర నవచారణ కుమార ఫణితంబు
లొకదండ సలిమండలిక లగాన

తే. మొక్క మొగి మ్రోయగదళి గృహోప పన్నకిన్నరీ
బృంద, బృంద సంగీత రీతి

1. వసుచరిత్ర - చతుర్థాశ్వాసము - పద్యం 39.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నమరు సతివేల కోలాహలముల కలిమి
నధిప యీ యద్రి కోలాహలాఖ్య మెక్కె.[1]

ఇట్టి అంత్యాను ప్రాసాలంకారముతో గూడిన పద్యములెన్నో వసుచరిత్రమున కలవు. వానిలోని లయ శ్రవణానంద కరమగుచు కథాగమనమునకు లోటు లేకుండా సాగును.

ఈ కవయిత్రికి కూడ సంగీతమునందు అభిమానము కలదని లయ బద్ధముగా రచింపబడిన పద్యములను చూచినచో, అభిప్రాయము కలుగును. అంతేగాక గానమును గురించి తన భావమును లక్షణా దేవి చెలికత్తెల ద్వారా చెప్పించినది.

ద్వితీయాశ్వాసమునందు, విరహముతోచింతిల్లుచు, రాత్రియంతయు వేగించుచు, నిట్టూర్చుచున్న లక్షణా దేవిని చేరి ఆమె చెలికత్తె తెల్లవారినదని చెప్పెను. చెలికత్తెల హెచ్చరింపులు విని, యల్లన లేచి, ప్రాతఃకాల కృత్యములు నెరవేర్చిన పిదప సఖులు వీణ వాయింపుమని కోరిరి. వారు గానమాహాత్మ్యము నిట్లు చెప్పిరి:

క. గానంబు శ్రవణ సుఖదము, గానంబానందకరము
గాదే మదికిం
గానంబొనర్చె దేనియు నోనారీ నీకు హర్షమొదవెడు
గదవే.

క. శిశువులకును సర్పములకు పశువులకు నైన గాని
పరమ హితంబౌ
బిసరుహనేత్ర రాగానము వెసవెస నిష్టంబుతోని
పెరిగలాడే.

1. వసుచరిత్ర - ద్వితీయాశ్వాసము - పద్యం 7.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. ఇంతియూరక వీణ వాయింప సరియె
సొంపు మీరగ రాల్గర గింప వలదె
చేతన మచేతన మ్మఖాతి చేయవలదె
వట్టి బ్రమాకైన బల్ల వింపంగవలదె.[1]

అని కవయిత్రి సంగీతమునందు తనకు గల అభిమానమును ప్రకటించినది.

రామరాజ భూషణుని వసుచరిత్రములోని పద్యముల వలె, ఇందుమతీ దేవిగారి లక్షణా పరిణయమునందు కూడ లయబద్ధత యున్నదనుటకీ యొక్క పద్యము చాలును:

సీ. మాటలాయమృతంపు తేటలా ముత్యాల
పేటలా చక్కెర మూటలగును
వదనమా శశి మనోవ్యధనమా సిరికేళి
సదనమా సత్కళా సదనమగును
ఇరులొకో నీలంపు సరులొకో తుమ్మెద
గరులొకో చెలియ పెన్నెరులు జూడ
పరమాణువేమొ నంబరమేమొ లేక, ద
బ్బరయే మొకో మధ్యమరయ చెలికి

గీ. నమృత పుంబావి, జక్కెరల మరుదీవి
కప్పురపు తావి, చక్కని కావిమోవి
గంధ నాగంబు వికచాబ్జ గంధమగును
తరుణి నడసాటి నెమ్మేని తావి సూటి.[2]

---

1. లక్షణా పరిణయం - ద్వితీయాశ్వాసము - పద్యం 87, 88, 89.
2. లక్షణా పరిణయము - తృతీయాశ్వాసము - పద్యం 22.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవయిత్రి 'వసుచరిత్రకారుని కవితను పోలిన పద్యములను రచింతును' అని చెప్పుకొనిన ఆ కవిత్వ ఛాయలే కాక', అల్లసాని వారి అల్లికలోని రమ్యత కూడ అచ్చటచ్చట కానుపించును.

మనుచరిత్ర ప్రభావము :

తృతీయాశ్వాసమునందు విరహార్తయైన లక్షణాదేవి శుకమును శ్రీకృష్ణుడి యొద్దకు సందేశకర్తగా పంపినది. అది కృష్ణుని మనోభిలాష కనుగొని, మరల వచ్చి, ఆ అలివేణి కరమున వ్రాలి వనజాత నేత్రునితో తాను కలిసిన తెరంగు తెలిపినది.

కృష్ణునితో కీరము తానెవ్వరిచెంతనుండి వచ్చినదో, తనెవరో అన్ని విష యములు తెలుపుచున్న పద్యమిట్లున్నది:

సీ. అబ్ధిజాత నివాసమై యొప్ప మద్రదే
శంబునందునను నివాసంబు మాకు
నతుల సత్ఫల వృక్ష తతులొప్పు కేళికా
వనములెన్నగ నున్కి పట్టుమాకు
దండి రుచులనీను కండ చక్కరలపై
శీతకరాన్వయా ప్రీతిమాకు
వెలయు ముద్దులుగుల్కు పలుకుల నేర్పుయు
గ్గున పిన్ననాడె బెట్టినది మాకు

గీ. నరయమద్రదేశసుత లక్షణాఖ్య జెలవ
సారసాసన యేలిక సాని మాకు
నాతలో దరి హస్తాంబుజాత మెపుడు
నాట పట్టగుమాకు నోయంబుజాక్ష.[1]

పై పద్యము వంటిదే పెద్దనగారి మనుచరిత్రమున, వరూథిని ప్రవరునితో తన విషయములను చెప్పునపుడు కలదు.

---

1. లక్షణా పరిణయము - తృతీయాశ్వాసము - పద్యం 98.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. చిన్ని వెన్నెల కందు వెన్నుదన్నిసు ధాబ్ధి
బొడమిన చెలువతో బుట్టువాకు
రహిపుట్ట జంత్రగాత్రముల రాల్ గరగించు
విమల గాంధర్వంబు విద్యమాకు
నన విల్తు శాస్త్రింపు మినుకులా వర్తించు
పని వెన్నతోడబెట్టినది మాకు
హయమేధ, రాజసూయములన బేర్వడ్డ
సవన తంత్రంబులుంకు వలుమాకు

గీ. గనక నగసీమ గల్పవృక్షముల నీడ
బచ్చరాచట్టుగమి రచ్చపట్టుమాకు
బద్మసంభవ వైకుంఠ భర్గసభలు
సాముగరిడీలు మాకుగోత్రామరేంద్ర.[1]

విరహార్తయై నిదురలేని లక్షణాదేవిని, చెలులు ప్రాతఃకాల సమయమున వీణ వాయింపుమని పలికిన హెచ్చరింపులు చూడగా, మను చరిత్రమున విరహోత్కంఠయై నిదురలేని వరూథినిని చెలికత్తెలైన అప్సరసలు, తెల్లవారినది, వీణ వాయింపుమని పలికిన సందర్భమును పోలియున్నది. ఇట్లే కొన్ని పద్యములు కానుపించును.

గుడిపూడి ఇందుమతీ దేవిగారి లక్షణా పరిణయమునకు ముందు, అనాటి కవులలో ప్రసిద్ధి నొందిన కవి వర్యులు, జంట కవులగు తిరుపతి వేంకటకవులు లక్షణా పరిణయమను ప్రబంధమును రచించిరి. భాగవతమునందలి కథాభాగమును గ్రహించి, ప్రబంధ శైలిలో రచించిరి. ఇందు మూడాశ్వాసములున్నవి. గద్వాల రాజుగారి బావమరదియగు, శ్రీ తాటికొండ రామారెడ్డిగారి కోరికపై కవులీ ప్రబంధమును ఆశువుగా చెప్పినారట. భాగవతమునందు లేనట్టి శుక దౌత్యమును, ఇందు

1. మనుచరిత్రము - అల్లసాని పెద్దన - ద్వితీయాశ్వాసం - పద్యం ౩౬.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేర్చినారు. శబ్దాలంకారములతో గూడి, అష్టాదశ వర్ణనలచే రచింపబడిన ఈ ప్రబంధము సహృదయ రంజకముగా నున్నది.

కవయిత్రికూడా తిరుపతి వేంకట కవుల లక్షణా పరిణయమునందు వలెనే, తానును ఒక దౌత్యము చేర్చినది. కవిశేఖరుల లక్షణా పరిణయము కంటె కవయిత్రి యొక్క ప్రబంధమున వర్ణనలు మిక్కుటముగా నున్నవి. లక్షణా పరిణయమునందలి కొన్ని పద్యములపై జంట కవుల ప్రబంధములోని కవితా ప్రభావ మున్నది.

కవయిత్రి లక్షణా పరిణయమునందలి ద్వితీయాశ్వాసమునందు లక్షణాదేవి చెలులతో కూడి, ఉపవనవిహార మొనరించి, జలక్రీడ లాడిన పిదప మన్మథ పూజ యొనరించును. అతివలందరు వనజ బాణునకు వందనములొనరించి యిట్లు పూజించిరి:

సీ. మాధవ పుత్రాయ మాధవ మిత్రాయ
పంకజాస్త్రాయ తుభ్యంనమోస్తు
మాధ వాఖ్యాయ యుమాధవస్తాత్రాయ
పంచబాణాయ తుభ్యంనమోస్తు
మానసజాతాయ మధుపగుణాయపం
ఛత్ప్రితా పాయ తుభ్యంనమోస్తు
సంకల్ప జన్మాయ సంకల్ప సిద్ధాయ
యంగహీనాయ తుభ్యంనమోస్తు.

గీ. సర్వమానవ ఘనమానసంహరాయ
కీరవాహనాయ, మకరకేతనాయ
సుగుణ నిలయాయ జగదేకసుందరాయ
యఖిలలోకైక విజయాయ యనుచు మ్రొక్కె.[1]

1. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిరుపతి వెంకట కవుల లక్షణా పరిణయమునందును, ద్వితీయాశ్వాసమున లక్షణా దేవి, విరహ వేదనతో చెలులను గూడి ఉద్యాన వన విహార మొసరించి, వనమునందు పుష్పశరుని నిలిపి, అతని వామాంకమున రతిని అనుప పరచి, ఆవాహనాది విధులతో మదన దేవుని అర్చించి నుతించిరి.

సీ. మదనాయ తారుణ్య సదనాయ శుభ్రాంశు
దదనాయ దేవ తుభ్యం నమోస్తు
మారాయ వైరాగ్య చోరాయ ధృతకీర
వారాయ దేవ తుభ్యం నమోస్తు
కామాయ సహ చరత్సోమాయ విరహిణీ
వామాయ తుభ్యం నమోస్తు
తరుణాయ సౌందర్య వరణాయ శంబర
హరణాయ దేవ తుభ్యం నమోస్తు.

తె.గీ. పంకరుహ సాయ కాయ తుభ్యం నమోస్తు
పద్మజాది నుతాయ తుభ్యం నమోస్తు
పరమ పుణ్య కథాయ తుభ్యం నమోస్తు
భార్గవీనంద నాయతుభ్యం నమోస్తు.[1]

ఇతివృత్తము రెండు కావ్యములందును కొలది భేదముతో ఒకే రీతిలోనే కలదు. కాని శతావధానుల లక్షణా పరిణయమునందు, లక్షణ వివాహమైన పిదప ఆమె శోభన వృత్తాంతము, తరువాత దక్షిణనాయకుడైన కృష్ణుడు రాధను తలచి విరాళి పొంది, ఆమెను కూడినట్లును, రాధను మాత్రమేకాక తన యితర సప్త భార్యలనుకూడ లాలించినట్లు కలదు. కవయిత్రి తన గ్రంథమున ఈ వర్ణన లేమియు చేర్చలేదు. కావ్యాంతమునందు, స్త్రీ సహజమగు ధోరణిలో లక్ష

1. లక్షణా పరిణయం - తిరుపతి వేంకటకవులు - ద్వితీయాశ్వాసం - పద్యం 118.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ణను అత్తవారింటికి పంపిన మగేంద్రుడు కుమార్తెకు చక్కని నీతిబోధ కావించి నట్లు రచించినదీ కవయిత్రి. ఇది ఈ కావ్యమునందలి ప్రత్యేకత అనవచ్చును.

ప్రాచీన కావ్యముల నూరక కంఠస్థ మొనరించుట వలన కవుల మనసు నందు అవి గట్టిగా ముద్రింపబడి యుండును. వారు రచన లొనరించునపుడు, శైలిలో, వర్ణనలో, ఏదో ఒక విధమున వాని ప్రభావముండును. అంత మాత్ర మున వారిని ప్రతిభాశాలురు కారని అనలేము. ఒక కవి రచనపై ఇంకొక కవి ప్రభావము అనాదినుండి వచ్చుచున్నది. నన్నయ. తిక్కనల ప్రభావము ఎల్లనపై కలదు. శ్రీనాథుని ప్రభావము తరువాత ప్రబంధకవులపై కలదు. నాచన సోముని హరివంశమునకును, పోతరాజు భాగవత రచనకును పోలికలు కలవు. ఇందుమతీ దేవిగారి అభిమాన గ్రంథమగు వసుచరిత్రములోని నాటక రీతులపై అభిజ్ఞాన శాకుంతలమునందలి పోలికలు కలవని విమర్శకుల అభి ప్రాయము. ఇట్లే ఎందరో కవులు తమ అభిమానముతో గ్రంథ పఠన మొనరించుటచే, రచనలలో పోలికలు వచ్చునని నా అభిప్రాయము. ఇంతయేల, ఇందుమతీ దేవిగారి పద్యములపై ప్రముఖ శృంగార కవయిత్రి ముద్దుపళని పద్యముల ప్రభావముకూడ కలదు.

తృతీయాశ్వాసమునందు లక్షణా దేవి తన మనమునందలి అనురాగమును నలినాక్షునకు తెలుపుటకు కీరమును దూతిగా పంపును. కీరముతో లక్షణా దేవి ఇట్లు పలికినది:

సీ. మాధవు పల్కులు మాకందరసమని
మదిలోన నామాట మరతువేమొ
శ్రీ కృష్ణుమాటలంచిత మధురంబని
మదిలోన నామాట మరతువేమొ
కంజాక్షు మాటలే కండ చక్కెరలంచు
మదిలోన నామాట మరతువేమొ
వసుదేవతనయుని వాక్యముల్సుధయంచు
మదిలోన నామాట మరతువేమొ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. వాని యరుణాధరము గాంచి మానసమున
బింబమని యెంచి యడియాస పెంపునంద
నట్టె నిల్చిన నేమి సేయంగవచ్చు
త్వరితగతి వచ్చి నాచింత బాపగదవే.[1]

ఇట్టి పద్యమే ముద్దుపళని రాధికా సాంత్వనము నందు కలదు. కృష్ణుని కడకు చిలుకను దూతిగా పంపుచు రాధిక పలికిన పలుకులిట్లున్నవి:

సీ. మోహనాంగుని తియ్యమోవి బింబమటంచు
మది జొక్కి నామాట మరవ వలదు
నలినలోచనుని తేనగవానవాలంచు
మరు లెక్కి నామాట మఱవ వలదు
కంసారి పలుకులు కండ చక్కెరలంచు
మది దక్కి నామాట మరువ వలదు
రమణు చల్లని చూపు లమృత పూరమటంచు
నెఱిజిక్కి నామాట మరవ వలదు
కమలాక్షుకరములు కల్పశాఖలటంచు
మదినెంచి నామాట మరవ వలదు.

తే. వానిగని రేని ఘనమోహ వనధిలోన
మరగి మున్గుమరయ్యాది మానులైన
బలుకనేటికి ఘనభంటి వారి? గాన
గీరమా తెల్విగొని తెల్పురారితోడ.[2]

ప్రాచీన కవుల ప్రభావము కవయిత్రి రచనలపై నున్నప్పటికినీ, ప్రాచీన కవులవలె స్త్రీల సౌందర్యమును వర్ణించుటలో విశృంఖలతను మాత్రము పాటించ

1. లక్షణా పరిణయము - తృతీయాశ్వాసం - పద్యం 46.
2. ముద్దుపళని, రాధికా సాంత్వనము - ద్వితీయాశ్వాసం - పద్యం 73.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేదు. వనితలకు సముచితమైన రీతిలోనే, లక్షణా దేవి సౌందర్య వర్ణన సాగినది కాని, ఆమె ప్రతి అవయవమును, శృంగారమును అతివేలముగా వర్ణించలేదు. అది ఈ కవయిత్రి వర్ణనలోని ప్రత్యేకత.

లలితములైన పదములను గూర్చి రమణీయాత్మకమైన వాక్యములతో పద్య రచన మొనరించుటలోనేగాక, గద్య రచనయందును దిట్టయనిపించుకొన్నదీ కవయిత్రి. ఆశ్వాసాంత గద్యలే కాక, మధ్య మధ్య పద్యములతో పాటు చేర్చి రచించినట్టి వచనములు లక్షణ యుక్తమై యున్నవి. ఉదాహరణమునకు చతుర్థాశ్వాసమునందలి వచన రచన కూడ లయబద్ధమై యున్నది.

వచనము : అని తలంచునెడ నరదముల దడదడలు, సైనికుల గడబిడలు, కరిఘటల ఘీంకృతులు, భేరీల భాంకృతులు, చటుల హయ హేషలును, భటవీర భాషలును, అంగనల పకపకలు, నెచ్చెలుల వికవికలు, చెలికాండ్ర వకవకలు, వసుధీశుల చకచకలు, మృగనాభి ఘుగఘుగలు, రతనాల ధగధగలు, నూపుర ఝుళంఝుళలు, కింకిణుల ఘలంఘలలు, ఘంటికల ఘణఘణలు, తాళముల ధణ ధణలు, జవ్వాజి గమగమలు, మద్దియల ధిమధిమలు, గాయకుల సరిగమలు, ఢోలముల ఢమఢమలు, ద్విజవేద పఠనములు, వెలయాండ్ర నటనములు, మాగధుల సన్నుతులు, బంధువుల సత్కృతులు, వేత్రహస్తుల బరాబరులు, వీర వరుల గరాగరులు, తలవరుల పెళపెళలు, తరవార్ల తళతళలు, దిగంతంబు బధిరీభూతం బొనర్చుటయు తగువారింబంచి నివారించి మద్ర మహీశుడు రాజ లోకంబు కలయంగని యిట్లనియె.[1]

లక్షణాదేవి, కృష్ణుని వరించిన తరువాత, ఈర్ష్యాపరులైన రాజలోకము నకును, యాదవ సింహుడైన శ్రీకృష్ణునకును కలిగిన ఘోర యుద్ధమును కవయిత్రి దీర్ఘమైన వచనములోనే రచించినది. యుద్ధరంగమును వర్ణించుట యందు తగిన శబ్దములను చేర్చి పద విన్యాసమున తన ప్రతిభను చూపినది.

---

1. లక్షణా పరిణయము - చతుర్థాశ్వాసము - వచనము 61.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవయిత్రి వసు చరిత్రమును పోలిన కావ్యమును రచించెదనని పలికినది. కాని వర్ణనలందు మాత్రమే రెంటికి కొంత పోలిక కన్పట్టుచున్నది. వసుచరిత్రము లోని నాటకీయత, లక్షణాపరిణయమున లేదు. వసుచరిత్ర ధ్వనిప్రధానమగు కావ్యము. ఇందు శ్లేషలు, ప్రతిరంజకమగు అనుప్రాసాలంకారములు, ముక్తపద గ్రస్తములు చెప్పబడినవి. చంద్ర, మలయానిల, మన్మథోపాలంభమునందు, రామరాజభూషణుని శ్లేష చమత్కృతి విరివిగా కలదు. కవయిత్రి కావ్యమునందును అచ్చటచ్చట శ్లేషతో కూడిన పద్యములు కలవు.

సీ. హరిబోలు సుప్రతాపానల గరిమ నా
హరిబోలు దీనజనావనమున
హరిబోల జాలు మహా వైభవంబున
హరిబోలు దుష్ట శిక్షాచణమున
హరిపుత్రుబోలు మహా దాన పటిమ నా
హరిపుత్రుబోలు రూపాతిశయత
హరిపుత్రుబోలు మహాహవ మందున
హరిపుత్రుబోలు ధర్మార్జనమున

గీ. హరికులాగ్రణి యైన రామావనీశు
సాటి గురు భక్తి యందున శాంతముసను
నా హరిశ్చంద్రు బోలు సత్య వ్రతమున
నరయ సమ్మద్ర భూవరుండవని సాధ.[1]

హరి అను పదమునకు నానార్థములు కలవు. విష్ణువు, ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, యముడు, సింహము, కోతి, పాము, గాలి, కిరణము, కప్ప, చిలుక, పచ్చనిది; బంగారు వర్ణము కలది అను అర్థములు కలవు. వాక్య సందర్భముబట్టి ఆయా పదముల అర్థములను స్వీకరించవలయును. ఈ పై పద్యమునందలి పాద

1. లక్షణా పరిణయం - ఇందుమతీదేవి - ప్రథమాశ్వాసం - పద్యం 80.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ములలో సూర్యుడు, సింహము, విష్ణువు, ఇంద్రుడు, యముడు, కర్ణుడు (హరి పుత్రుడు), జయంతుడు, కంతుడు, వాలి, అర్జునుడు, ధర్మరాజు అను అర్థములు స్ఫురించుచున్నవి. కవయిత్రి మద్రభూమీశ్వరుని వీరందరితో పోల్చి వర్ణించినది.

షష్ఠ్యంతములయందును నానార్థములతోకూడిన పద్యములు కొన్ని గలవు. మచ్చునకొకటి వ్రాయుదును :

క. గోపాలక, గోపాలక, గోపాలక మిత్రునకును, గోపాలునకున్
గోపతినుత చరణునకుం గోపవధూ హృదయకుముద కుముదాప్తునకున్.[1]

పై పద్యమునందు 'గోపాలక' శబ్దమునకు నానార్థములను గూర్చి రచన మొనరించినదీ కవయిత్రి. 'గోపాలక' అను పదమునకు రాజు, గొల్లవాడు, కృష్ణుడు అను అర్థములను గ్రహించినది.

ద్వితీయాశ్వాసమునందు లక్షణాదేవి విరహార్తయై శుక, పికములను, మలయానిలమును, చంద్రుని ఉపాలంభించినది. ఆ పద్యము కూడ శ్లేషార్థభరితమై యున్నది.

సీ. పుడమి ద్విజాఖ్య నొప్పుటె గాని వరఫల
భంగ వృత్తులమాని ప్రబలె నొక్క-
పరమహంస ఖ్యాతి వరలుటయే కాని
ఘన విరోధము మాని గ్రాలెనొక్క-
మాధు కరాభిఖ్య మహినొప్పుటయె గాని
మధుపాన దుర్వృత్తి మానె నొక్క-
మహిజగత్ప్రాణ నామమె గాని సుమనస్సు
లను గూల్చుటను మాని మనియె నొక్క-

1. లక్షణాపరిణయము - ప్రథమాశ్వాసం - షష్ఠ్యంతములు - పద్యం 61.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. పేరు మాత్రాన సుగుణంపు పెంపుగలదె
నేతి బీరకాయకు నెందు నేయిగలదె
యమృత కిరణాఖ్యుడౌను దోషాకరుండు
కాల్పడే పూని యప్పద్మకాననముల.[1]

చిలుకలకు కూడ 'ద్విజ' మను పేరు గలదు. 'ద్విజు'డనగా బ్రాహ్మణు డనియు అందురు. బ్రాహ్మణునివలె ఉత్తముడని పేరొందుటేగాని ఫలములను నాశనమొనరించుట మానలేదు అని చిలుకను నిందించినది. పరమహంస అనగా ముని. ఉత్తమమైన పక్షి అను అర్థమున కోయిలను గ్రహింపవలెను. పరమ హంస అని పేరు గాంచినను ఘన విరోధమును మాత్రము మానలేదని కోకిలను దూషించినది. కోకిలకు కాకులతో ఘన విరోధముండునని లోకోక్తి కలదు. మాధుకరులు అనగా బిచ్చమెత్తుకొని జీవించువారు అను అర్థమున మునులు-, తుమ్మెదలు-, మాధుకరమని పేరొందినా కూడ మధుపాన దుర్వృత్తి మాన లేదు అని గండు తుమ్మెదలను దూషించినది. జగత్ప్రాణుడని వాయువునకు పేరు కలదు. జగత్ప్రాణుడని పేరు గాంచుటే కాని సుమనస్సులు కలిగిన వారిని మాత్రము వేధించుట మానలేదు.

దోషాకరునకు అమృత కిరణుడని పేరు కలిగినను పద్మకాననములను కాల్చుట లేదా అని శుక, పికములను మధుకర, మలయానిల, చంద్ర దూషణ మొనరించినది. చక్కని విరోధాభాసాలంకారముతో కూడిన ఈ పద్యము హృద్య ముగా సాగినది.

వర్ణనలు : లక్షణా పరిణయమునందలి వర్ణనలు స్వాభావికముగా నున్నవి. సూర్యోదయ, అస్తమయ వర్ణనలు, చంద్రోదయ వర్ణన, తెల్లవారు జామున జానపదుల దినకృత్యములు మున్నగునవి సహజముగా నున్నవి.

1. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 71.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సూర్యాస్తమయ వర్ణన :

లక్షణా దేవితో చెలికత్తెయగు మంజుభాషిణి సూర్యాస్తమయ సమయము నిట్లు వర్ణించినది :

క. మగువా యపరదిశాంగన మొగమందున నిడిన కుంకుమో
యనగ గడునిం
పగు నరుణకాంతి పశ్చిమ నగమందున వెలుగు చుండె
నలి నాప్తుండున్.[1]

మగువల మొగమునందు వెలుగు కుంకుమ రీతిగా అరుణ కాంతితో వెలుగుచున్న అస్తమయ సూర్యుని వర్ణన చేయబడినది.

చంద్రోదయ వర్ణన :

ఉదయించు చంద్రుని వర్ణనలూ కవయిత్రి చక్కని అచ్చ తెలుగు పదములతో కూర్చిన పద్యమునందు వర్ణించినది.

గీ. లచ్చిసైదోడు నెదపుట్టు మచ్చవాడు
పద్మముల సూడు, కోక దంపతుల కీడు
యామినీ భర్త కలువలనోము పంట
చంద్రుడు దయించు వేలాయె చంద్రవదన.[2]

ఉధయించుచున్నట్టి చంద్రుని అపర దిక్సతి తన కెదురుగా నిల్పినట్టి దర్పణముతోను, దశదిశలను నిండిన పండు వెన్నెలలను రాజు వచ్చునపుడు హజారమున కట్టు ధౌత వస్త్రపు మేల్కట్టుతోను, అంబరమున వెలుగొందు, ఉడుగణమును రాజువచ్చునపుడు పురంధ్రులు అతనిపై చల్లెడు లాజలతోను పోల్చినది కవయిత్రి.[3]

---

1. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 54.
2. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 56.
3. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 5, 9, 60, 61.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెల్లవారు సమయమున జానపదుల దిన కృత్యముల నిట్లు వర్ణించినది :

కాపులు :

గీ. లేదు త్రువ్వని యెడ్లను లేపి వడకి
యోయటన నీరు ద్రావించి యొప్పమీర
నద్రులందున కాడుల నమరనిలిపి
కాపు లేగు చుండిరి చేలకడకు గంటె.[1]

చల్లచిలుకు పడుచు :

కచభరమూడి వ్రేల కరకంకణ నిస్వన మొప్ప మధ్యముం
బ్రచలన మొంద హారములు బల్మరు నుయ్యేలలూగు చుండగా
బ్రచురత గండభాగముల బంగరు కమ్మలు కాంతులీనగా
రచన దధిన్మథించిరదె రాములు లే చెమరంకురింపగన్.[2]

కవయిత్రికి గ్రామజీవితానుభవ మున్నది కనుక కాపుల వర్ణనలో, చల్ల చిలుకు వారి వర్ణనలో సహజత్వము కానుపించును. చల్లచిలుకు నపుడు సిగముడి గదలును. కరకంకణములు నిస్వన మొనరించును. కంఠహారములటునిటు కదలును. దధి మథించిన అలసటతో మొగమున లేచెమటలు క్రమ్ముకొనును. ఈ వర్ణనము హృద్యముగా నున్నది.

అలంకారములు :- కావ్యకన్యకు శోభనొసంగునవి అలంకారములని కొందరు అలంకారికులు భావించిరి. వామనుడు 'సౌందర్యమలంకారః' అని నిర్వ చించి వేనివలన ఆ సౌందర్యము కావ్యమునకు కలుగునో, అవి అలంకారములే యని నుడివెను.[3]

1. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసము - పద్యం 81.
2.
3. కావ్యాలంకార సంగ్రహము - పంచమాశ్వాసము - అలంకార విమర్శ - పుట 709.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దండి 'కావ్యశోభాకరాన్ ధర్మా నలంకారాన్ ప్రభవితే' అని కావ్యశోభాకరములగు ధర్మములను అలంకారములని చెప్పుదురు అని వచించెను. భామహుఁడు అలంకారములన్నిటిని వక్రోక్తులనెను. స్వభావోక్తిని ఆతడంగీకరింపలేదు. సుందరమైన యుక్తితో గూర్చిన అలంకారములు కావ్య కన్యకకు వింత సౌందర్యమును భాసిల్లచేయును.

అలంకారములను కూర్చుటలో కవయిత్రి ప్రసిద్ధమైన వానినే ఎన్నుకొనన్నది. ఉపమ, ఉత్ప్రేక్ష మున్నగునవి కావ్యమునకొక సౌందర్యమును చేకూర్చినవి.

సూర్యోదయ వర్ణనమునందు కూర్చిన ఈ ఉత్ప్రేక్షాలంకారము ఎంతో చక్కఁగా రూపొందినవి:

సీ. ప్రాగ్దిశాసతి ముఖ పద్మంబునందున
బొగడొందు కుంకుమ బొట్టనంగ
పాకారితనయుని పాన్పుపై వ్రేలాడు
కొమరైన కెంపుల గుత్తియనగ
ఘనమైన గాఢాంధ కారాటవుల్గాల్చి
చెలగెడు ఘన దావశిఖియనంగ
రేయెల్ల తమినంది కృశియించినట్టి లూ
పద్మినీ ఘన తపోఫలమనంగ

గీ. కలువ గమివాడ కోకముల్గవలు గూడ
రాజు వెల్వెల్లనై కడురశ్మి దూల
తారలును గ్రుక్క, బ్రాహ్మణోత్తములు మ్రొక్క
సర్కుఁడుదయించె నుదయాద్రి యందులలన.[1]

1. లక్షణా పరిణయము - ద్వితీయాశ్వాసం - పద్యం 79.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తూర్పు దిక్కును ఇంద్రుడు పాలించునని ప్రాజ్ఞులు చెప్పుదురు. అట్టి పాకారి తనయుడైన జయంతుని పాన్పుపై వ్రేలాడు కెంపులగుత్తి యేమో అనునట్లు ఉదయించు బాలభానుని వర్ణించుట మిక్కిలి రమ్యముగా నున్నది.

ఇట్లే కవయిత్రి ప్రథమాశ్వాసమునందు స్మరణాలంకారయుత పద్యమును చక్కగా రచించినది. నారదునివలన శ్రీకృష్ణుని గుణ గణ సౌందర్యములను వినిన లక్షణాదేవి మాధవుని యందే మనసు నిలిపి, దేనిని చూచినను అతడేయని తలచినది.

సీ. అరవిందముల గాంచి యరవిందలోచను
నయనంబులో యంచునాతి దలచు
కుందముల్గాంచి ముకుందుని రదపంక్తి
యంచు దలంచు నయ్యంబుజాక్షి
కనకంబు గాంచి యాకనకాంబరధరు నా
సాదండమని యెంచు చానమదిని
పొన్నల గాంచి యాపున్నాగ వంద్యుని
దరహాసమోయంచు దలచినిలచు

గీ. కాంత నీలోత్పలముల చాల్గని రమేశు
ఘనతనుచ్ఛాయలని యెంచు వనమునందు
మించి హరి చిత్ర పటమును గాంచి గాంచి
యఖిలమును గృష్ణ మాయయటంచునెంచు.[1]

చతుర్థాశ్వాసమునందు లక్షణాదేవికి స్వయంవరము నొసరించు ఘట్టమున రాజలోకమంతయు ఇందుముఖియైన లక్షణాదేవిని గాంచి మనము లందిట్లు భావించిరి:

1. లక్షణా పరిణయము - ప్రథమాశ్వాసము - పద్యం 183.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. తమ్ములో నీలో త్పలమ్ములో లేక మ
త్స్యమ్ములో మరి ఖంజనమ్ములేమొ
కమ్మ విల్తుని ముకురమ్ములో లవలీద
ళమ్ములో శశిలో సగమ్ము లేమొ
నెమ్మదిందలప మేఘమ్ములో యింద్ర నీ
లమ్ములో తేటి మొత్తమ్ములేమొ
యమ్మనోభవు కాహళమ్ములో యలమక
రమ్ములో శాలి గర్భమ్ములేమొ
గీ. చాన నయనకచ కపోల జంఘులెన్న
సరసిజానను సృష్టి కౌశల మయారె
దీని కెనగాన మీర జగాన నెందు
రమణులందుననిది శిరోరత్నమరయ.[1]

సందేహాలంకారముతో గూర్చిన ఈ పద్యము అనుప్రాసభరితమై యున్నవి.

తృతీయాశ్వాసమునందు నారద మునీంద్రుడు గోపాలునితో లక్షణాదేవి సౌందర్యమును గూర్చి చెప్పునపుడు క్రమాలంకారముతో గూడిన పద్యము హృద్యముగా నున్నది:

సీ. ఇంద్ర నీలము దెచ్చి యిందు రేఖను దెచ్చి
వెలయ నిందిందిరములను దెచ్చి
ముకురముల్దెచ్చి చంపక సుమమును దెచ్చి
తలపనిండీ వరములను దెచ్చి
శ్రీకారములు దెచ్చి, చెలగు కుందంబుల
నమృతంబునవ విద్రుమమును దెచ్చి
యబ్జంబు దెచ్చియు నబ్జనాళము దెచ్చి
లలితంపు నవ్య పల్లవము దెచ్చి

1. లక్షణా పరిణయం - చతుర్థాశ్వాసం - పద్యం 57.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. కచము ఫాలము ముంగురుల్ గండయుగము
రమణి నాసానయన కర్ణరదనములును
వాక్య పూరోష్ఠ కంధర బాహుకరము
లరసి నిర్మించె నింతి కయ్యె జుడుకృష్ణ.[1]

క్రమాలంకారముతో గూడిన మరియొక పద్యము గూడ ఒప్పిదముగా రచింపబడినది:

సీ. కమలాకృతిని హేమ కాహళంబులగతి
తారలరీతి కెందమ్మి భాతి
పటఫలంబుల గతి, వర సైకతము ఫక్కి
తలపరంభా స్తంభముల విధమున
మృగరాజ మధ్యంబు రీతి శైవాలంబు
వలెనుండ శోషకాఖిల విధమున
సురపొన్న పువుభాతి సొగసైన కదళికా
పత్రంబు రీతిని బంగరుగతి.

గీ. పదములును, జంఘలు నఖములు పదతలఘులు
గుల్భముల్గంటి యూరులుంగొమ్మ కౌను
నారును వళిత్రయంబులు నరదు నాభి
నెలమి వీపును దనువు సృజించె నజుడు.[2]

కవయిత్రి అలంకారములను కూర్చుటలో గల నైపుణ్యమునకు ఈ కావ్యమున, ఎన్నో అలంకారములు కలవు. ఉచితమైన రీతిలో చేర్చి కూర్చిన అలంకారములతో, ఈ లక్షణా పరిణయ ప్రబంధము సరస హృదయ రంజకముగా ఒప్పుచున్నది. అలంకారములు, వర్ణనలే కాక కవయిత్రి కావ్యమునందు కొంత నీతిని చెప్పినది.

1. లక్షణా పరిణయము - తృతీయాశ్వాసము - పద్యం 13.
2. లక్షణా పరిణయము - తృతీయాశ్వాసము - పద్యం 14.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కావ్యమున నీతి బోధ :

కావ్యం యశసే అర్థకృతే శివేతరక్షతయే
సద్యః పరనిర్వృతయే కాంతా సమ్మిత తయోపదేశయుజే.[1]

అని కావ్య ప్రకాశకర్త తెలుపుటవలన కావ్యమునకు ముఖ్యమైన లక్షణములలో సద్యః పరనిర్వృతి ఉపదేశము గలవని తెలియుచున్నది. హృదయాహ్లాదమును కల్గించుటకు కావ్యములో నెన్ని అలంకారములు, వర్ణన లొనరించినను నీతిపరమగు బోధనలను కూడ చేర్చినచో, అవి సమాజమునకు కొంత ఉపయోగపడును. అట్టి సదుపదేశము లిందు పెక్కుచోట్ల కనుపించును.

హరియందనురక్తయై హరినే స్మరించుచున్న లక్షణా దేవిని గాంచి చెలికత్తె మంజుభాషిణి రాజ్యహీనుడు, శ్యామదేవుడు, సప్త భార్యా సమేతుడైన ఆ శౌరిని వలచుట నీకు తగదు. అతనిపై తలపును విడువుమని పలుకగా, కోపమున లక్షణాదేవి ఇట్లు పలికినది. మునివలన ఆ పుణ్య పురుషుని గురించి విన్నపుడె, నా మనసాతని వరించినది. హృదయగతుడైన నాతని విడిచి, పరునినే నెట్లు వలతును? అట్లు చేసినచో పతివ్రతలగుదురా? అని పలికి సఖితో ఇట్లు చెప్పినది:

గీ. కులసతులు మున్ను మదిలోన వలచినట్టి
వాని గాదని, ధనకాంక్ష పరునిగోరు
టెట్టు లట్లైన నేక పతిత్వమగునె
స్థిర యశో సౌఖ్యములును సిద్ధించుటెట్లు.[2]

అని లక్షణా దేవి ప్రశ్నించి, తరువాత తన స్థిర నిశ్చయము నిట్లు చెప్పినది:

గీ. నాతిహరి రాజ్యహీనుడైనను, సురూప
హీనుడైనను వైభవ హీనుడైన

---

1. కావ్యాలంకార సంగ్రహము - పుట 116.
2. లక్షణా పరిణయము - ప్రథమాశ్వాసము - పద్యం 167.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హరిని జేరిన చిత్తంబు తిరుగదింక
పల్లమున బారు నీరంబు పగిది చెలియ.[1]

హరియందు తనకు గల గాఢానురాగమును వ్యక్తము చేయుచు, కుల సతులు మోహమున అన్యుని కోరువారు కారనియు, జలమున కలసిన తేనెవలె, మాధవునియందు లగ్నమైన తన మనసు నెవరు మరలింప జాలరనియు, హరి పదాంభోజ సేవ నాయత్త చిత్తనైన నేను, అన్యుని కోరజాలనని చెప్పుటలో లక్షణా దేవి యొక్క గుణశీలములు, మహిళ లాచరింప వలసిన మంచి పద్ధతులు తెలిపి యున్నది.

కన్యలందరు వన విహారమొనరించు నపుడు కింశుక పుష్పమును గాంచి, తమ ఉద్దేశ్యమును తెలుపునపుడు, వారినోట విద్యావిహీనులగువారినిట్లు నిరసించి నది కవయిత్రి:

గీ. తరుణి యాకింశుకము పుష్పభరితమై సు
గంధహీనంబగుట సొంపు గాంచదయ్యె
దలప వరరూప సంపద గలిగి యుండి
వినయ విద్యా విహీనుడౌ మనుజుబోలి.[2]

మోదుగ పువ్వు సుగంధ హీనమగుటచే సొంపుగాంచలేదు. అట్లే రూప సంపద కలిగిన నరుడు కూడ విద్యా గంధము లేని యెడల కీర్తి నొందలేదని, విద్యకు విలువ నిచ్చి పలికినది కవయిత్రి.

చతుర్థాశ్వాసమునందు మద్ర దేశపు రాకుమార్తెయగు లక్షణా దేవికి స్వయం వరము. ఏర్పాటు చేయుటతో రాజు లెల్లరు వచ్చిరి. మత్స్యయంత్ర మును భేదించు వానికే తన కూతు నిచ్చెదనని రాజు పలికెను. అసమాన శౌర్య

1. లక్షణా పరిణయము - ప్రథమాశ్వాసము - పద్యం 170.
2. లక్షణా పరిణయము - ప్రథమాశ్వాసము - పద్యం 21.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కలితులగు రాజు లెవ్వరును, జలమునందు ప్రతిబింబమును చూచి మత్స్యమును గూల్చలేకపోయిరి. మరికొందరు ధనువును చూచి కంపము నొందిరి. ఘన శస్త్రాస్త్ర కళా విదుడైన గాండీవియు, శస్త్ర కళా కలాపనిధియైన రాధేయుడు కూడ ఝషమును కూల్చలేక సిగ్గునందిరి.

పురుష సింహుడగు, కృష్ణుడు పటు దర్పముతో మత్స్యయంత్రమును ధారుణియందు కూల్చెను. లక్షణను విక్రమముతో గొనిపోవుచున్న యదువీరుని పైకి, శత్రురాజు లందరు పూనుకొని యుద్ధము ప్రకటించిరి. కాని వారినందరను మాధవుడలుకతో నోడించి, జయలక్ష్మీ సమేతుడై నిజపురమునకు వెడలెను. శుభసమయము నందు హరిమధ్యయైన లక్షణను శ్రీహరి పెండ్లి యాడెను.

కృష్ణునకు తగిన అరణము లిచ్చి మద్ర దేశ నాథుడు, తన కుమార్తె నాతనికి అప్పగింత చేసి యిట్లనియెను. ఆ సమయమున కవయిత్రి స్త్రీ విద్యను గూర్చి తన భావము నిట్లు తెలిపినది:

క. విద్యాభిలాషి యగుటను
విద్యయె తాగర పెతల్లి విజ్ఞానఘనా
విద్యయు నీతి కరంబని
విద్యయె భూషణము ధాత్రి వెలదులకంచున్.[1]

స్త్రీ విద్యయందు తనకుగల సదుద్దేశ్యమును తెలిపినదే కాక కవయిత్రి పతులు మెలగవలసిన రీతుం నిట్లు తెలిపినది :

గీ. చక్రవర్తి యైనను రాజచంద్రుడైన
ధనికుడు సుగుణియైన నిర్ధనుడునైన
నాథుడన దైవమగు గాన నాతిమదిని
విభుని నిర్మలభక్తి సేవింపవలయు.

---

1. లక్షణా పరిణయము - చతుర్థాశ్వాసము - పద్యం 115.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. నాథుడు దైవముం గురుడు నాథుడు కర్తయు నాత్మ బంధుడున్
నాథుడు లోకమున్విభుడు నాథుడె కూర్మి సఖుండు జీవమున్
నాథుడె సర్వ సౌఖ్యములు నాథుడు భోగము లిష్టసంపదల్
నాథుడు గూర్పగావలయు నాతికి నెందు గుమారి ధాత్రిలో.[1]

నాథుని సమస్తముగా భావించుటేగాక, నగలను, చీరల నిమ్మని, నాణ్యపు వస్తువు లిమ్మని పదే పదే నాథుని బాధల పెట్టవద్దనియు, అత్తమామల భక్తితో సేవింపవలయుననియు, ఆడబిడ్డలతో, తోడి కోడండ్రతో మైత్రితో మెలగవలయుననియు, రూప, విద్యావంతురాండ్రైన, ఇతర సుగుణవతులనుజూచి ఈర్ష్యపడవద్దనియు, పుట్టినింటి వారితోపాటు భర్తవైపు బంధువులందరు గౌరవించ దగినవారనియు, పుట్టినింటివారికంటెకూడ వారియందు మిక్కిలి గౌరవమును చూపవలెననియు, చెప్పెను. పనులు చేయునపుడు స్త్రీలు, ఇంటిలోనున్న వారికి వంతులుపెట్టి కలహములాడెదరు. అట్టి వంతులు పెట్టవద్దనియు, గృహకృత్యములు చయ్యన తీర్చుకొనుమని తండ్రి చెప్పెను. రామాయణమువంటి మంచి గ్రంథము లను చదువుకొనుచు, సత్కాలక్షేపము చేయుమని తండ్రి ప్రియముతో ఎన్నియో నీతుల నుపదేశించెను. చతుర్థాశ్వాసమున నూట పందొమ్మిదవ పద్యమునుండి మొదలుకొని నూట ముప్పదియైదవ పద్యము వరకుగల, సుదీర్ఘమైన ఈ యుప దేశము మద్ర దేశపు రాజు తన ముద్దుకూతురికి చెప్పినదే కాదు- అత్తవారింటికేగు అతివలందరికీ ఆచరింపదగునట్టివి; ఈ ఉపదేశములు. ఈ ప్రబంధము శృంగార రసప్రాధాన్యమైనప్పటికినీ, అంతమున కవయిత్రి మహిళల కుపదేశించిన నీతి పద్యములు సుజన మనోరంజకముగా నున్నవి.

నీతిపద్యములయందు రామాయణమును గురించి మద్రదేశపు రాజు చెప్పిం చిన పద్యములచేత, కవయిత్రికి చిన్ననాటినుండియే రామాయణమునందభిమానము కలదనియు, ఆమె శ్రీరామ పదసేవాభిలాషిణియని విశద మగుచున్నది.

2. లక్షణా పరిణయము - చతుర్థాశ్వాసము - పద్యం 122, 123.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణమునందు తనకుగల గౌరవాభిమానముల నిట్లు చాటినదీ కవయిత్రి :

గీ. కలిత శబ్దార్థమయ మలంకార సహిత
సరస భావాంచితము, సాధు సన్నుతంబు
సర్వధర్మ సమేతంబు, సత్యఫలము
నార్షసమ్మత మఖిల వేదార్థమయము.[1]

గే. మహిత వాల్మీకి రచిత రామాయణంబు
సర్వపాపహరంబును జానకీ మ
హామహిమ నొప్పుచుంట కళ్యాణదాయి
యై వెలంగెడు గాన నీకంపువాడ.[2]

అని రామాయణ ప్రశంస చేయుటలోనే కవయిత్రి రామాయణా పఠనాభిమానియు శ్రీరామ పదసేవి అనియు విశదమగును.

ఈ విధముగా ప్రబంధోచిత రీతిలో రచింపబడిన ఈ కావ్యము ప్రౌఢత్వమునందును, లాలిత్యమునందును, ఔచిత్యమునందును ఏమాత్రము లోపము లేక కవిత ధారావాహికముగా సాగినది. ప్రాచీన ప్రబంధముల రీతిలోనే నడచినను-కవయిత్రి తనకై కొంత ప్రత్యేక పద్ధతిలో రచన సాగించినది. సమకాలీనుల ప్రశంసల నందినది. ప్రాత మూసలో పోసిన పోతయే యని ఆనాటి వారెవరూ విమర్శించలేదు. ఆమె కవితాశైలిని ప్రశంసించినవారు ఎక్కువగా కలరు.

లలిత లలిత వాసంత విలాసములును
క్రమ నవరసభరిత సత్కార్యములును
మృదుల ప్రాభాతమల యసమీరములును
ప్రాతవారునె అవినిత్యనూతనములు.[3]

---

1. లక్షణా పరిణయము - చతుర్థాశ్వాసము - పద్యం 132.
2. లక్షణా పరిణయము - చతుర్థాశ్వాసము - పద్యం 133.
3 లక్షణా పరిణయము - కవయిత్రీ ప్రశంస - నండూరి చంద్రమతీదేవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జన్మభూమి

కవయిత్రీమణియగు శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవిగారు తమ జన్మభూమి యగు పాత గుంటూరుపై గల గౌరవ ప్రేమంచే తన ఇరువదవ ఏటనే 'జన్మభూమి' అను పేరున పద్యములను రచించినది. 'జననీజన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని పెద్దలనిరి. సౌజన్యహృదయయైన ఇందుమతీదేవిగారికి తన జన్మభూమి యందు ప్రేమాభిమానము లుండుటలో వింతలేదు. పుట్టిన ఊరి పైన గల మమకారమును వెల్లడించుచు ఈ కవయిత్రీమణి రచించిన కవితలను, ఆమె బాల్య మిత్రురాలగు దేశిరాజు లక్ష్మీనరసమ్మగారును, ఏకా ఆదిలక్ష్మీదేవి గారును విద్యాభిమానముచేతను, గ్రామాభిమానము చేతను, స్త్రీ జాత్యభిమానము చేతను 'జన్మభూమి' పుస్తక ముద్రణకగు ధనవ్యయమును భరించి, ఇందుమతీ దేవిగారి యందు తమకుగల గౌరవ ప్రపత్తులను వెల్లడించిరి.

శ్రీమతి దేశిరాజు లక్ష్మీనరసమ్మగారు, ఇందుమతీదేవి గారికి బాల్య మిత్రురాలు. చిన్నతనము నుండియు, ఇరువురకు ఒకరిపైనొకరికి గల స్నేహ సౌహార్ద్రములను పురస్కరించుకొని కవయిత్రి రచించిన గాంధీ పాటలను ఆమె తన స్వంత ధనముచే ముద్రింపించినది. వారి గుణగణములను వివరించి, వారి శ్రేయస్సును కోరుచు ఇందుమతీ దేవిగారు 'నా తొలిపలుకు'లో వ్రాసినది.[1]

ఇందుమతీ దేవి గారిని ప్రశంసించుచు వారి మరియొక బాల్యమిత్రము రాముడుగు వెంకట సుబ్బమ్మ గారు వ్రాసిన లేఖ కూడ యిందు కలదు.

కవయిత్రి ఈ కావ్యారంభమునందు తన యిష్ట దైవమైనవాడు పాత గుంటూరి పురపాలుడైన వేణుగోపాలుని సన్నుతించినది. రమ్యమైన శైలితో కూర్చిన ఈ పద్యములు మనోరంజకముగా నున్నవి.

1. జన్మభూమి - తొలి పలుకు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శా. శ్రీరమ్యంబు, సుధామయంబతులముంజిత్తప్రియంబౌచు బృం
దారణ్యస్థితశైలరాజములు నీరౌచుండ గోవత్సముల్
జేరన్ రావరవల్ల వాంగనలు రంజిల్లంగనానందమిం
పారం గూర్చెడు వంశనాదము మనంబందెప్పుడుండోచెడున్.[1]

అని ప్రస్తుతించి వేణువు నూదునట్టి గోపాలునిట్లు వర్ణించినది:

గీ. నవజపాపుష్ప భాగ్యంబు నవ్వుచుండి
వంశదండంబునకు వింతవన్నె బట్టు
వేణుగోపాలు నధరోష్ఠ విద్రుమంబు
పల్లవాంగుళ లెదలోన ప్రస్తుతింతు.[2]

అని రుక్మిణీలోలుడైన, గోపాలాగ్రణికి నమస్కరించినది.

తన జన్మస్థలమైన పాతగుంటూరునందు తాను పొందిన ప్రతి అనుభూతిని తెలిపినది కవయిత్రి. ఉయ్యాలలూగిన రోజులు ఆమె మరువలేదు. తలచి, తలచి మురిసిపోయినది.

ఉ. పయ్యెరతాకునం గదలి పయ్యెద వ్రేలగవేణి దూలగా
నొయ్యనముంగురుల్జెదరి యొప్పుగ మోమున జిందులాడగా
నయ్యోన లేత చేతులును, సారెకు త్రాడటులాగ కందగా
నుయ్యెల లూగు వేడ్కమది నొక్కపుడున్మరువంగరాదుగా.[3]

పాతగుంటూరు పురముయొక్క ప్రశస్తి నిట్లు తెలిపినది. మంచి పాడి పసువులతో, వితరణశూరులతో, మంచి కూరగాయల తోటలతో, పైరుల క్షేత్రములతో, కళాచతురవాక్కలితులైన పండితులతో, మానవులకు మంద జాడ్యము

---

1. జన్మభూమి - పద్యము - 1.
2. జన్మభూమి - పద్యము - 2.
3. జన్మభూమి - పద్యం - 19.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లను తొలగించి, చైతన్యమును కలిగించు నిర్మలనీరముతో, వాపీ, కూప, వన తటాకములతో గుంటూరు పురము శోభిల్లునని, అభిమానముతో చెప్పినది కవయిత్రి. పురవర్ణన మొనరించుచు కవయిత్రి దీర్ఘమైన సీసపద్యమును రచించినది.[1]

తాను జన్మించిన స్థలమగు పాత గుంటూరు ఘనతను మహోన్నత గర్వముతో వివరించినది.

ఉ. చారుకవిత్వ వైఖరుల శారద పాదములందు మొల్క బం
గారపు మువ్వలన్ మొరయగా నొనరించుచు నాంధ్ర భారతిన్
భారత వేదరూపమున బ్రస్తుతికెక్క నొనర్చినట్టి యా
ధీరుని దిక్కయజ్వగని దివ్యయశోస్వితమైన పాతగుం
టూరున బుట్టినాసను మహోన్నత గర్వము మోదమూనుదున్.[2]

పుట్టిన భూమిపైన కవయిత్రికి మిక్కిలి ప్రేమ, ఆ నగరమును గూర్చి ఆమె యెన్నడు మరపురాదని, తన కెప్పుడూ కన్నులకు కట్టినట్లే ఉండునని చెప్పినది. తనకేకాదు-ఎవరికైనా తాను పుట్టిన ఊరు మరపురాదని లోకరీతిని తెల్పినది. ఇది నిజము. ప్రతి వ్యక్తికి తాను పుట్టిపెరిగిన ఊరిపై మమకారముండుట సహజము.

చిన్నతనమున తన చెలికత్తెలతో గడిపిన దినములను జ్ఞప్తికి తెచ్చుకొని కవయిత్రి, ఇట్లు చెప్పినది.

ఉ. చిన్నతనంబు నందుకడు ప్రేమ దలిర్పగ గూడి యాడునా
కన్నెలు పాఠశాల చెలికత్తెలతో విహరించు చోటులన్
వెన్నెలలోన నాటలును వేడుకచెప్పు వినోదపుంగథల్
నిన్నటి మొన్నటట్లుగనె నిల్చి దొలంగవు మానసంబునన్.[3]

---

1. జన్మభూమి - పద్యం - 11.
2. జన్మభూమి - పద్యం 8.
3. జన్మభూమి - పద్యం 9.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ గ్రామమున తమ కుటుంబముతో స్నేహపాత్రులై మెలగి, తమను ప్రేమాదరములతో చూచిన ఎందరో కుటుంబీకులను వర్ణించినది. ఆర్వేలవారు, మాచిరాజువారు, పోచిరాజువారు, పొత్తూరువారు, దొంతరాజువారు, పీసపాటి వారు, ఏకావారు, కొండవారు, సేడంబివారు. మానూరువారు, చట్టివారు, మప్పవారు, చెరుకుపల్లివారు, రాయప్రోలువారు మొదలగు నెందరో మాననీయులగు వారిని ప్రశంసించినది.

తాను పుట్టిన ఊరిలోని కుటుంబములవారందరితో మెలగి, వారిని సహృదయముతో వర్ణించుట స్త్రీలకు మాత్రమే సహజగుణము. పురుషునికంటె కూడ ఆడపిల్లలకు తాను పుట్టి పెరిగిన గడ్డపై అధికమైన వాత్సల్యముండును. ఆమె మనసు నవనీతమువలె మెత్తనై యుండుటవలన, జన్మభూమిపై తరగని ప్రేమ పెంచుకొనును.

పూవులన్నీ యేరి, పూలమాలలుగా కూర్చి, వేణుగోపాలునికి, గౌరీశునికి అర్పించి, చెలులతో పోటీపడి చండీ ప్రదక్షిణ మొనరించినట్టి వినోదములను వింత వింతలుగా వ్రాసినది.

సీ. అరయ వర్షర్తు సంధ్యాకాలమందున
 వింత బూచెడు చంద్రకాంత పూలు
శారద వేళను షఃకాలమున బూచి
 బాగుగరాలు పున్నాగ పూలు
సంజవేళల గూర్చి జడలుగా మాలిక
 లమరించి దేవాలయములకేగి
భక్తితో వేణుగోపాలుని, గౌరీశు
 గాంచి మాలికల నర్పించిమించి

గీ. చెలులతోడ ప్రదక్షిణములను జేసి
యెవరు మున్ముందు జేతురో యిప్పుడంచు
దనర వేవేగ చండి ప్రదక్షిణంబు
జేసి వచ్చు వినోదంబు జెప్పగలనె.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తన చిన్నతనమంతయు గుంటూరున గడచినదనియు, బాల్యముకంటె మరొక సుఖమేమియు లేదనియు. చలికాలమునందు చేయి జిడ్డగునట్లు ముదురు వెన్నెలలను మించి పెరుగును పోసి తన తల్లి లాలించిన దనియు లేయెండలో చలిగాచుకొనుచు బడికి తానేగిన సుఖదినములు మరువగాజాలనని తెల్పినది. ఎట్టి కష్టములోనైనను, సౌఖ్యమందును, ఎట్టి వేళను, పాత గుంటూరు మనసునుండి మరపు రాదనియు, తన తనువున ఉసురులున్నన్ని నాళ్లు, పాత గుంటూరునకు రాకపోకలు కలుగజేయుమని వేణుగోపాల మూర్తిని ప్రార్థించిన దాసుమనస్కయగు కవయిత్రి.

గుంటూరు పురమునకు పూర్వమున మృత్యుంజయా నగరమనియు, గర్తపురమనియు పేళ్ళు కలవనియు, నీరధులను పానముచేసినట్టి మహాత్ముడు అగస్త్యునిచే ప్రతిష్ఠితుడగుట వలన, ఆ పురమున అగస్తేశ్వర స్వామి యను పేరున, భక్తిచిత్త వశంకరుడైన శంకరుడు నివసించినాడనియు, రఘురామ భక్తుడగు ఆంజనేయుడు ప్రాగ్దిశయందు నిలిచి పుర రక్షణ చేయుననియు పట్టణ ప్రాశస్త్యమును తెలిపినది.

రమ్యమైనట్టి ఆ గుంటూరు పురమును ఈశ్వరుడా చంద్రతారార్కమును రక్షింపవలయునని ఇట్లు ప్రార్థించినది :

శా. ఆరమ్యంబు, బుధాశ్రితంబు ననవద్యారామ వంతంబుగుం
టూరుం బ్రోచెడుగాక నీశ్వరుడు దానొప్పారు సద్విద్యలన్
శ్రీ రాజిల్లగ సత్యధర్మములు సౌశీల్యంబు పెంపొందగా
నారీ రత్నములన్ దయావతులుగా నవ్యప్రభా ముక్తినిం
పారంగీర్తిదిగంత భాసురముగా నాచంద్రతారార్కమున్.

తాను పుట్టిన ఊరిపై ప్రతివారికీ మక్కువ మెండుగానే, ఉండును. సామాన్యుడు తన మనోభావములను కేవలము మాటలద్వారా వ్యక్తము చేయును. సరస హృదయులగు కవులు, కవయిత్రులు, సుందరమగు భావనలతో పద్యములల్లి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తమ గౌరవా భిమానములను, భక్త్యంజలులతో ప్రకటింతురు. నన్నయాది కవులందరూ జన్మభూమిపై తమకుగల అభిమానమును, తమ రచనలలో వ్యక్తీకరించినారు. 'ఏ మంచి పూపులన్ ప్రేమించినావో నినుమోసె, ఈ తల్లి కనకగర్భమున' అని రాయప్రోలువారు జన్మభూమిని ప్రశంసించినారు. కవితాశారదయైన గుడిపూడి ఇందుమతిదేవిగారు కూడ జన్మభూమిపై తమకు గల హార్దికాభిమానమును ప్రకటించి, చిరకీర్తిని పొందినది.

మందార మాల

మధుర కవయిత్రి గుడిపూడి ఇందుమతీ దేవిగారు కీర్తిశేషురాలయిన పిమ్మట ఆమె యితర రచనలన్నియు కలిపి పుస్తక రూపమున ప్రకటించినారు. దానికే 'మందార మాల' అని పేరు కలదు. ఇందు కవయిత్రి వివిధ రచనలు కలవు. వ్యాసములు, ఖండకావ్యములు, కొన్ని గేయములు, కొన్ని దేశభక్తి గీతములు, అన్నియు కలిపి మందార మాల అను పేరున ప్రచురించినారు. ఈ మందార మాలకు 'పీఠిక' కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసినారు. వారు కవయిత్రి కావ్యములనెంతయో ప్రశంసించినారు. 'ఈమె పండితురాలు, ఈమె గ్రంథములో దోషములుండవు' అని విశ్వనాథ వారు కవయిత్రిని ప్రశంసించుట సముచితముగా నున్నది. ఆమెకు ఛందస్సుతో గూడిన పద్యరచన యందే ఇష్టమని విశ్వనాథ వారు నుడివినారు. "సంగీతమునకు తాళము ప్రాణము. అట్లే పద్య సాహిత్యమునకు గణయతి తప్పని నడక ప్రాణము" అని కవయిత్రి వ్రాసిన వాక్యము విశ్వనాథ వారి మనసును అలరించినది. కవి సమ్రాట్ కూడ ఛందస్సుతో కూడిన పద్యములనే యెక్కువగా ఆదరించెడివారు.

మందార మాలయందున్న వ్యాసములు ఆంధ్ర సాహిత్యము, మేఘసందేశము, కాళిదాసు భావము, మధురకవయిత్రి, సంక్రాంతి లక్ష్మి, గొబ్బిళ్ల పండుగ' శ్రీరామనవమి, నరక చతుర్దశి - దీపావళి అర్థాంతరము ఇవి వ్యాస రచనలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఖండకావ్యములు : శరన్నిశలు, వేణుగానము, గానకోవెల, ద్రౌపది ఓర్పు, ప్రకృతి వర్ణన, ఆంధ్రమహిళామణి రుద్రమాంబ, తెలుగుకవులు, ధనుర్ ధ్వని, శ్రీదేవీ నవరాత్రులు, హనుమత్స్వాగతము, తరళగీతి, గానమాధురి, భ్రమరగీతిక, గౌరీ కళ్యాణము మొదలగునవి ఉన్నవి.

దేశభక్తి పద్యములు : స్వతంత్రదినము, భరతమాత స్తుతి, రిపబ్లిక్ దినోత్సవము, ఆంధ్ర రాష్ట్రావతరణము, కత్తిలేని కాల్బంటు, గాంధీ జయంతి, మహాత్మాగాంధీ నిర్యాణము, వినోబా భావే, పద్య పుష్పగుచ్ఛము, శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి స్మృతి మున్నగునవి కలవు.

ద్వితీయ భాగమునందు తమిళములో ప్రసిద్ధినొందిన తిరువాయిమొళి, శ్రీరాజరాజేశ్వరీ శతకము, మంగళాద్రి నారసింహ శతకము, తరుణీ శతకము, సోదరీ శతకము, గోపిలాపము, గాంధీ పాటలు, నీతి తారావళి కలవు. ఈ సంపుటమంతయు సుమారు 170 పుటల గ్రంథముగా వెలసినది.

మందార మాలయందున్ను కొన్ని గేయకవితలను పరిశీలించి వానియందలి సౌరభమును ఆఘ్రాణించుటకు ప్రయత్నింతము.

శరన్నిశలు వేణుగానము : ఈ గేయ కవిత ద్విపద రచనలో సాగినది. నిర్మలమైన శరద్రాత్రుల యందుగల వెన్నెలలను కవయిత్రి మనోహరముగా వర్ణించినది. అఖిల దిగ్భిత్తులయందు వజ్రాలు పొందుగా చెక్కినట్లు, పాల సముద్రము పైపైకి పొంగివచ్చినట్లు, సత్యవంతుల కీర్తిసారమువలె, సంగీతములో రాజిల్లి పొంగిన రసము రీతిగా, తాండవ ఖేలనాతత్పరుడై పరవశముతో నవ్విన పార్వతీనాథుని అట్టహాసపు రాశియేమో అనునట్లు, పాండురచ్ఛాయలతో బ్రహ్మాండంబు నిండినది.

ఆ వెన్నెలరాత్రి యందు చుక్కలు తారాపథమున ముత్యాల ముగ్గులను నట్లు మెరసినవి. కమలసైదోడైన చంద్రుడు-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అలనిశాసతి దాల్చునట్టి యమూల్య
మగు శిరోభూషణంబౌనా యనంగ
కలువ నెచ్చెలిగాడు కమలసైదోడు
ఖచరమార్గంబున కడు విరాజిల్ల.[1]

పున్నాగ పూవులన్నీ విరిసినవేళ విశ్వ మోహనమైన వేణునాదము విని పించినది.

విశ్వమోహనమైన వేణునాదంబు
బ్రహ్మగాంధర్వ సద్భావ లసనంబు
సామగానాది విచార సారంబు
గానాంబునిధీ తరంగ ప్రచారంబు [2]

అయిన ఆ వేణుగానము, బాహ్య ప్రపంచక భావహీనంబు, షడ్గుణచాపల్య సంహారకంబు, వెలయు తాపత్రయ విని వారకంబు, ప్రణవ సంకలితంబు ప్రణయ రూపంబు అయిన ఆ వేణుగానమును వీనుల విందుగా విన్నయెడల చిత్తమింక చెదరబోదు. అఖిలాత్ముడైన భగవానుని వేణుగానము వినినచో, అన్ని వేళలయందు అన్నిటియందు ఆ దివ్యగానమే వినవచ్చును.

పర్ణనాతీత మౌ వంశినాదంబు
వేణుగాన విలోలు గానమాలించి
యానంద వారాసి యందు దేలుచును
ప్రణవ స్వరూపియౌ బ్రహ్మంబునందు
చేరవేచిత్తమా చెదరబోకమ్మ. (మందారమాల - పుట 24)

---

1. మందారమాల - పుట 22.
2. మందారమాల - పుట 23.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని కవయిత్రి మనసును హెచ్చరించినది. మధుర భక్తితో కూడిన భావనా లహరిలో తేలిపోయి, వేణుగానరవళిలో పరవశించిన కవయిత్రి మనసునుండి వెలువడిన ఈ శరన్నిశలయందలి వేణుగానము అపూర్వమైనది. ఆపాతమధుర మైన దనుటలో సందియమేమియులేదు.

గానకోవెల :- సవసుధారస భవ్యగానముతో, చిగురు కొమ్మల చాటున చేరి నిలిచి, పంచమస్వరముతో పాడు కోయిలను కవయిత్రి యెన్నియో విధముల ప్రశంసించినది.

ఉ. ఏమి తపంబు చేసితివె యెట్టి మహౌషధముల్ భుజించితే
ఏమహనీయు గొల్చితివె ఎట్టి సుకర్మము లాచరించితే
ఈ మధురంపు గాన సుధ ఈ ధర నీకె లభించె కోయిలా
ఏమి ఫలంబు గోరకెద నిట్టుల పాడెద పుణ్యమెద్దియో.[2]

(మందారమాల - పుట 24)

చిన్న కందపద్యమును అందముగా రచించి కోయిలను పిలిచినది :

క. మాకందము నీకందము
మాకందము నీకు గూర్చె మరిమరి యందం
బోకోయిల యీ మాధవు
రాకయెగదె భువికి మేలు రాక యయారే.[3] (మం. మాల పుట 29)

ఎల్లరసములు నెపుడు భుజించు మాకు నీ మధురగాన పటిమ లభింప దాయెను, మెత్తనౌ వగరు చిగురులను మేసినంత మాత్రాన నీ కుత్తుకలో నేర్పు కలిగినది అని కోయిలగళము విని అబ్బురపడినది కవయిత్రి.

ద్రౌపది ఓర్పు : నిద్రయందున్న పసికందులను పట్టి చంపినట్టి అశ్వత్థామను పట్టి తెచ్చి, భీముడు, అర్జునుడు ద్రౌపది ముందు నిల్పినారు. వానిని వధింపవలయునని తలచినారు. కాని సహనశీలయైన ద్రౌపది వానిని వధించుటకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంగీకరించలేదు. ఆమె సహనమును, శాంతమును గాంచి, భీమార్జునులు, కృష్ణుడు, ధర్మరాజు మిక్కిలి ఆశ్చర్యపడెరి. ఆ ఘట్టమును కవయిత్రి కన్నుల ముందు కట్టినట్లుగా రచించినది. సంభాషణా రూపములో నడచిన ఈ పద్యముల ధోరణి ప్రశంసనీయముగా నున్నది.

భీమార్జునులు అశ్వత్థామను పట్టి తెచ్చి వానిని వధించి తన మదికి వేడుక కల్గింతుమనగానే ద్రౌపది వారించి అశ్వత్థామతో యిట్లు పలికినది:

1. ఆలములోన గాచుకదయాయుధ హీనుల నిద్ర జెందునా
బాలుర బట్టి చంపితివి పాపమటంచు దలంపకెంతయున్
బేలవె, హీనచిత్తుడవె, భీతుడవే ఇటు డొంక పొద్దునం
జాలి వహింప కింత పని సల్పగ న్యాయమె నీతికోవిదా.
(మందారమాల-పుట 33)

2. అన్నా ద్రోణతనూజ శత్రువులటే యస్మత్తనూజాతులే
మన్నన్ ద్రోణుడు సద్గురుండగును నీవట్లే గదే వీరికిన్
మున్నెన్నండును ఇట్లు జేసితెకటా మూఢుండవే నీవునే
మన్నందీరదు కర్మముంగెలువగా నభ్యాసమందోపు నే
నిన్నింకేమన నేర నిట్లు సలుపన్ నీ చేతులెట్లాడెనో!
(మందారమాల-పుట 33)

ద్రౌపది, అశ్వత్థామను 'నీ చేతులెట్లాడెనో' అని నిందించుటతో స్త్రీ సహజమైన రూపము కన్పించుచున్నది.

పుత్రహంతకుడైన వానిని కోపముతో చంపుమని పల్కుట లేదని భీముడు ద్రౌపదిని విమర్శించగా ద్రౌపది ఇట్లు పల్కినది. ఈ పద్యములో తల్లి హృదయము కన్నుల ముందు కన్పడుచున్నది.

తనయులు బోవనేయెటుల తల్లడమందుచు నుంటినట్టులీ
తని మరిమీరు గూల్చిననుతల్లడ మందదె వీని తల్లి హా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఘనమతి నెన్నగా సమముగా దొకొ దుఃఖము యెల్ల వారికిన్
ఘనకరుణా మయాత్ములయి కావరె విప్రుని, వేశమింపరే.

(మందారమాల-పుట 34)

అని భర్తలను ప్రార్థించినది. కాని భీముడు అర్జునుని శపథము తీర్చుకొనుమని పలుకగా ద్రౌపది వారించుచూ, అశ్వత్థామ తల్లియగు కృపిని గురించి ఆమె యెంత బాధపడునో వివరించినది.

అన్నలు దమ్ములున్ జనకులాత్మజులెల్లరు పోయినన్ గటా
మన్ననసేయు నాథులిదె మాన్యులు మీరలు గల్గుకాలమున్
గ్రన్నన బుచ్చనెంచితినిగా కృపికింకిటనేమి యున్నదే
యున్న తనూజు నొక్కని మహోగ్రత మీరిట గూలనేసినన్.

(మందారమాల-పుట 35)

అని 'కృపి' ఒంటరిదగునని చెప్పి, ధాత్రీసురుండని యెంచియైన వీని విడువుమని, ధర్మతనూజుని పాదములపై ఆన పెట్టినది. తన భర్తల సుకృతము జగమునందు వెలుగవలయునని కోరినది. ఆయుధ హీనుడైన వానిని దునుముట తగదని వాయు నందనునికి వందనమిడి చెప్పినది. ద్రౌపది మాటలనాలకించి, చివరకు కృష్ణుడు అశ్వత్థామకు ముండన మొనరించి, వాని శిఖయందలి రత్నమును గొనుమని చెప్పెను.

పాండవోత్తమ యిదే శిక్ష బ్రాహ్మణునకు
ముండ సమ్మను పెడల ద్రొబ్బుటయె గాని
చంపదగుదోషమున్నను జంపదగదు
ధాత్రిపతులకు నిది ఘనధర్మమయ్య. (మందారమాల -పుట 38)

అని పలికి కృష్ణుడు శాంతమొనరించెను. పుత్రులేపురుని వధించిన హంతకుని తెచ్చి ముందు నిలిపినను, ఓరిమితో పలికిన ద్రౌపదిని, ఆమె సహనశీలములో కూడిన భాషణములను వర్ణించిన ఇందుమతీదేవిగారి సౌశీల్యము ప్రశంసించదగినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రకృతి వర్ణన :- ఇందు వసంత, శరదృతువుల అందచందములను కవయిత్రి హృద్యముగా వర్ణించినది.

సీ. ఘన తరంబైనట్టి గండశిలలనొప్పి
స్వచ్ఛమౌ సైకత స్థలుల నొప్పి
రమణీయమగు హంసరవముల రంజిల్లి
కమనీయతర పంకజముల నొప్పి
యమల మీనోద్వర్తనములచే నొప్పి
ఘనతరావర్తంబు గాంచ నొప్పి
లలిత సూక్ష్మవీచి కాలావణ్యముల మించి
శోషరేఖలచేత సొంపుమీరి

గీ. లలిత గంభీరగతుల విలాసమొప్ప
దసరి వర్షర్తువను బాల్యదశ దొలంగ
విలసితమగు శారద వేళదోచె
నదులు యవ్వనదశనొందు సుదతులట్లు.

(మందారమాల - పుట 39)

వర్షరుతువను బాల్యదశ దొలగినదీ కన్యలు శారదవేళలందు యవ్వనదశ నొందిన సుదతులవలె నున్నట్లు పై పద్యమున రమణీయముగా వర్ణింపబడినది.

తెలుగు కవులు :

కవయిత్రియైన ఇందుమతీదేవిగారు తెలుగు కవులను ప్రస్తుతించుటలో వింత లేదు. ఆమె రచించిన లక్షణా పరిణయమునందు సంస్కృత కవులను, తెలుగు కవులను స్తుతించినది. ఇప్పుడు తెలుగు కవులు అను శీర్షికతో వారిని గన్న తెలుగు తల్లిని స్తుతించినది. మహనీయులైన పుత్రులను బడసినపుడు ఆ తల్లి కూడ సకలజనులచే ప్రస్తుతింపబడును. అందుకే మహాకవులను, కవయిత్రులను కన్న తెలుగు తల్లిని ప్రశంసించినది మన కవయిత్రీమణి. మొదట తెలుగుతల్లి కన్నవారిలో ఆడపడుచగు కవయిత్రి మొల్లను గురించి వర్ణించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొల్లయొక్క వ్యక్తిత్వము ఈ క్రింది పద్యమువలన విశదమగుచున్నది:

సీ. రాజవర్యాస్థాన పూజలు గోరక
నిశ్చలభావాన నిలిచె నెవరు
ముప్పతిప్పలుబెట్టు మూర్ఖప్రజల జూచి
జంకక నిలిచిన సాధ్వి యెవరు
వాదించి యోడింప వచ్చిన పండిత కవులకు
వెరువని కన్నె యెవరు
ఇహ సౌఖ్యజాలములెల్ల వర్జించి
ధర్మంబునే పూనిన మాన్య యెవరు

గీ. మహిత మధుమాస వికసితమల్లికాభ
చారుతరమూర్తి శ్రీరామచంద్రమూర్తి
భవ్యచరితంబు రచియించి పావనతర
ధవళ యశమును వెలయించి దిశదిశల
రాముగుణధాము కరుణాభిరాము
నెపుడు భజియించి ధ్యానించి యెలమి రాము
తేజమందున వెలసిన పూజనీయ
మొల్ల నొప్పారగన్నట్టి తల్లి యెవరు
ధీరగుణ సుమవల్లి మా తెలుగుతల్లి. (మందారమాల - పుట 42)

కవయిత్రి మొల్లతో పాటు ఆదికవి నన్నయ భట్టారకుని, ఆస్థానకవియు, రాజ్యాంగ తంత్ర రహస్య మంత్రంబు నెరపిన మాన్యుడు తిక్కనామాత్యుని కూడ వర్ణించినది, తిక్కనార్యుని వర్ణన హృదయంగమముగా కలదు.

గీ. తీలకూలంకష కవిత్వ లోలుడాహి
తాగ్ని యజ్వసుధా వందనార్హుడైన
భూసురాగ్రణి తిక్కన బుధ వినోది
కడుపు నిండార ముదమున గన్న తల్లి
దివ్య గుణ సుమవల్లి మా తెలుగు తల్లి.

(మందారమాల - పుట 44)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మందార మకరంద మాధుర్య సుకవిత్వమున మత్తభృంగమై మనిన పోతనార్యుని, ఆ కవి రచించిన పద్య పాదములతోనే పద్యము రచించి చక్కగా వర్ణించినది.

సీ. మందార మకరందమాధుర్య సుకవిత్వ
 మున మత్త భృంగమై మనియెనెవడు
నిర్మల మందాకినీ వీచికా సాహి
 తిని రాజహంస యైదనరె నెవడు
లలిత రసాల పల్లవ తుల్య సుకవిత్వ
 పటిమకోయిల యౌచు బరగె నెవడు
పూర్ణేందు చంద్రికా స్ఫురితమంజు కవిత్వ
 గరిమ చకోరమై గ్రాలె నెవడు

గీ. అంబుజోదరు దివ్య పాదార వింద
చింతనామృత పాన విశేష మధుర
కవితలో మున్గి తేలుచు కదలికి దర
మొల్ల నేరనిచిత్తాన యొప్పె నెవడు?

(మందారమాల - పుట 45)

అట్టి భక్తాగ్రగణ్యుని, బ్రహ్మవేత్తను, పోతనామాత్యుని గన్నట్టి మాతను, సుజ్ఞాన వల్లి, తెలుగు తల్లిని ప్రశంసించినది.

తరువాత రాజులకు రాజగు రామరాజును పవలు రేయును పాడి, రామనామ సుధారసముగ్రోలి, ధన్యమతి రాము గలిసిన త్యాగరాజును కన్నతల్లి, భాగ్యవల్లి యైన తెలుగు తల్లిని స్తుతించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ విధముగా తెలుగు కవులను ప్రస్తురించుటలో వారి గుణగణములను, వర్ణించి కవయిత్రి వారికొక విశిష్ట స్థానమును మనసులో కల్పించుకొన్నది.

ఈ కవయిత్రి రచించిన ఖండ కవితలు, ధనుర్ధ్వని, శ్రీదేవి నవరాత్రులు, హనుమత్స్వాగతము, తరళగీతి, గానమాధురి, భ్రమరగీతిక, గౌరీ కళ్యాణము, స్వతంత్ర దినము, భరత మాత, రిపబ్లిక్ దినోత్సవము, ఆంధ్ర రాష్ట్రావతరణ, కత్తిలేని కాల్చుంటు, గాంధీ జయంతి, వినోబా భావే, పద్య పుష్పగుచ్ఛము, శ్రీ మగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి స్మృతి, జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీ లాల్ బహదూర్ స్మృతి, ఆంధ్ర ఆస్థాన కవి చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి, చెన్న కేశవ స్వామి - స్తోత్రం, శివస్తోత్రం, మానసబోధ గీతము, కాలమహిమ, ఉగాది, విజయదశమి - దేనికదే సాటి యన్నట్లున్నవి. ప్రతి పద్యమును రమణీయ శబ్ద గుంఫితమై, భావ రస ధునిలో పాఠకులను ఓలలాడించునట్లున్నవి. ఆ మహా కవయిత్రి రచించిన ప్రతి పద్యమును వివరించుట సామాన్యులకు సాధ్యముకాదు.

ఉగాది పండగ సందర్భమున కవయిత్రి గావించిన ప్రకృతి వర్ణనము సహృదయుల మన మలరించునట్లున్నది. మృదుమధుర శబ్దభరితమగు ఆ సీస పద్యము దీర్ఘముగా సాగినది. అది కవయిత్రి హృదయములో కలిగిన ఆనందోత్సాహములకు ప్రతీకగా ఉన్నది.

సీ. రమ్య పల్లవితకోరకిత పుష్పితలతా
కుంజ మంజీరములు కొమరు మీర
లలిత పుష్ప సమేత లతికావితానంబు
చల్లని పందిళ్ల నల్లుచుండ
పల్లవతోరణా లెల్లె డలను తరుల్
కన్నుల పండువుగా రచింప
మధుకరాభి ఖ్యాత మంగళ పాఠకుల్
సన్నాయి మేళంపు సరణి నెరప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హితమంద పవన పూరిత చలద్వేణువుల్
 శుషిర వాద్యంబుల సొంపునింప
మంజుల ద్విజరుతి మానితా శీర్వాద
 ములు జలంగుచు నింగి ముట్టుచుండ
కలకలధ్వనులతో కలకంఠ కలకంఠు
 లొగి గాన సభల సొంపుగ నొనర్ప
పూగొమ్మలలరులు పుణ్యాంగనాకృతా
 చారలాజలవోలె జల్లుచుండ

గీ. మాధవుడు వనలక్ష్మిని మదిజలంగ
పెళ్లి యాడగ జిలుకలు పేర టాండ్రు
కుంకుమపు బొట్టు మోమున గూర్చు కొనుచు
పెత్తన మొనర్ప జూడగా ప్రేమతోడ.
వచ్చె జనలోకమోది సంవత్సరాది.[1] (మందారమాల-పుట 121)

మందార మాలయందు ద్వితీయ భాగములో 'తిరువాయిమొళి'లోని ఒక పాశురమును తెనిగించిన భాగము, శ్రీరాజ రాజేశ్వరీ శతకము, మంగళాద్రి నరసింహ శతకము, తరుణీ శతకము, సోదరి, గోపిలాపము, గాంధీ పాటలు, నీతి తారావళి కలవు.

మంగళాద్రి నరసింహ శతకము : ఈ శతకము కంద పద్యములలో నడచినది. ముందుగా కవయిత్రి మంగళాద్రి నరసింహుని నిట్లు ప్రార్థించినది :

క. శ్రీమానినీ విమల హృ
త్తామరస దివాకరాసు దర్శనహస్తా
శ్రీమంగళ శైలోపరి
ధామానరసింహ నామ దైవలలామా.[1]

---

1. మం-మాల (ద్వితీయ భాగము) - పుట 64.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొన్ని పద్యములందు నరసింహ స్వామిని ప్రార్థించిన పిదప దయ, శాంతము, మైత్రీ గుణము మున్నగు సద్గుణములను గూర్చి రచించినది.

దయ :

దయనరునకు తొడవెయ్యెడ
దయయే నీరూపమంచు దలచెద నేనా
దయ లేనివాడు శాత్రవ
జయముంగాంచంగ లేడు జయనరసింహా.

(మం. మాల - ద్వి. భాగం - పుట 68)

శాంతము :

శాంత విహీనుండాదివి
జాంతకు డెరుగంగ జాలెనా నిన్ను మహా
శాంతుడు ప్రహ్లాదుడు బహి
సంశరముల నిన్నె జూచె నయ్యా నృసింహా.

(మం. మాల - ద్వి. భాగం - పుట 69)

ధనలోభము :

ధనలోభము నెదలయును
వినయము త్యాగంబు స్నేహ విభవంబులును
మ్మనమున కెక్కువ ధనమే
ఘనమా సద్గుణము ఘనము ఘన నరసింహా.

(మం. మాల - పుట 68)

పరహితము :

పరహితమతి కవ్వేళను
గురుతింపగ హేతు వేల కూరిమి చూపం
బరహింసాసక్తునకును
గురు కారణమేలచెరుపగోరు నృసింహా.

(మం. మాల - పుట 68)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సకల సుగుణ శాలినియైన ఈ కవయిత్రి సతులకు కావలసిన మంచి గుణములను ఇమ్మని నరసింహుని కోరినది.

సతులకు పతియందు బ్రియో
న్నతి, భూత దయారతియును నయవిద్యాసం
తత ధైర్యమతియు సజ్జన
హితమతియు నొసంగి బ్రోవు మీశ నృసింహా.
(మం. మాల - ద్వి. భాగం - పుట 75)

మానవునికి ధర్మ తత్పరత తప్పక ఉండవలయునని చెప్పి, ధర్మము కొరకు బాధలు పడినవారిని వివరించినది.

ధర్మము :

ధర్మమునకై త్రిశంకుడు
ధర్మసుతుడు, నలుడు, రామధరణీశ్వరుడున్
నిర్మల కీర్తి ధనులుస
త్కర్ములు బాధలు సైచిరికద నరసింహా.
(మం. మాల - ద్వి. భాగం - పుట 77)

భగవంతుని దశావతారములను ఈ నరసింహ శతకమున కవయిత్రి కందపద్యములందు చక్కగా వర్ణించినది. ఆవిరళ మహిమాన్వితములు, అనఘంబులు అయినట్టి దేవుని రూపములను భక్తితో ప్రస్తుతించినది.

నరసింహావతారమునందు వర్ణనకు తగినట్లు పద గుంభన చేయబడినది :

నరసింహావతారము :

నరరూపము సగము మహా
హరి రూపము సగము తాల్చి యమరులు వొగడన్
బరువడికంబము వెడలితి
సురవైరి కుమారు బ్రోవ శుభనరసింహా.
(మం.మాల ద్వి. భాగం-పుట 82)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అరుణ సటాఘర చరితా
ధర భ్రుకుటి, కుటి లధవళ దంష్ట్రోజ్జ్వలమా
నరసింహ రూపమెంచిన
నరుడౌగద వయ్యమరగణాదిని నృసింహా.

(మం.మాల- ద్వి.భాగం-పుట 82)

కవయిత్రి నూరుపద్యములతో కూడిన ఈ శతకమునందు దశావతారము లను ప్రార్థించుటయేగాక, సద్ధర్మముల నెన్నియో నుడివినది. సుగుణోపదేశ కరమైన ఈ గ్రంథము మాల్యశైల నృసింహవర ప్రసాద కవితా లబ్ధయై రచించి తినని, దీనికి నరసింహస్వామినే కృతి పతి నొనరించినది. నరసింహ శతకము తర్వాత తరుణీ శతకము కలదు. మహిళలకు సదుపదేశములను బోధించుచు ఈ గ్రంథమును రచించినది.

తరుణీ శతకము :- గుడిపూడి ఇందుమతీ దేవిగారు మంచి విద్యావంతు రాలు. సుగుణశీల. చక్కని వాగ్ధాటికలిగిన మహిళ. ఆమె తరుణీశతకమునందు స్త్రీ విద్య కెక్కుడు ప్రాధాన్యత నిచ్చుచు రచించినది. విద్య తప్పక నేర్పవలయు నని కవయిత్రి మహిళలను ప్రోత్సహించిన విధానము యెంతో బాసుగా కలదు.

"చదివితిని ఇకచాలు అని భావించరాదు. చదువునకంతము లేదనియు, చదివిన కొలదిని రుచి యగుననియు, బ్రతికిన దినములలో వదలక చదువుకొన వలయుననియు" బుద్ధి గరపినది. "చదివిన అడది, వంట నేర్చిన మగవాడును బ్రతుకెట్లా" అని అనెడు మూడుకలను నిరసించినది. స్త్రీలకు చదువెందుకు అని మూర్ఖులందురుగానీ, శారద, ద్రౌపది, శకుంతల, సీత, సావిత్రి-వీరందరు చదు వుల చేతనే మాన్యత చెందిరిగదా అని నుడివినది. చదివితినని గర్వముతో బరు లను చుల్కన చేయవద్దనియు, చదువుచే వినయమును పొందవలయునని తెలిపినది.

మధ్యకాలములో స్త్రీలకు చదువులేదుకాని పూర్వకాలమున అందరును చది విన వారే ఉన్నారు. ఈ మధ్యకాలములోనే కన్యాశుల్కము, అతిబాల్య పరిణయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ములు మొదలైనవి. నేడైనా మీరు తెలియవలయును అని ఆనాటి స్త్రీల పరిస్థితిని తెలిపినది. గంటలకొద్ది తలదువ్వుకొని, మేని కైసేత చేసికొందురుగానీ ఒక గంటయినను చదివినచో బాగుండునని కాలము వ్యర్థముసేయు మహిళలకు చెప్పినది. కమ్మలు, మురుగులు, కనకమయములైన రవణములు, రత్నపుసొమ్ములు సతులకు భూషణములు కావనిచెప్పి, చక్కని భూషణము విద్యా వినయములేయని పలికినది.

భూషణము విద్య, వినయము
భూషణమగు భర్త సేవభూషణమౌ స
ద్భూషణములు సుగుణంబులు
భూషణములు సత్య నియతి పొలతికి దరుణీ.

(మం. మాల - ద్వి. భాగం - పుట 95)

తరుణులకు తగినట్టి సూక్తుల నెన్నింటనో ఈ కవయిత్రి సహసముతో తెలిపినది. పుత్రులను, పుత్రికలను సమానముగా చూడుమని, కుమార్తెలకు కూడ చదువు నేర్పవలయునని బోధించినది.

గృహనిర్వహణ విషయములందు, సంతానమును ప్రేమతో చూచుటయందు యెన్నియో మంచి మాటలను కవయిత్రి నుడివినది. పరకట్నమును నిరసించుచు కొన్ని పద్యములను రచించినది. కట్నముల వలన కలుగు కష్టనష్టములెన్నియో తెలిపి వాటిని మానవలెనని ఓవరించినది.

ధనయుతులాశా వంతులు
ఘనమగు నీ వెయ్యి నూర్ల కట్నంబులుమా
నని యెడ మనదేశంబిక
ఘనతర సుఖ భాగ్య దశను గాంచునె తరుణీ.

(మం. మాల - ద్వి. భాగం - పుట - 106)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వరకట్నములతో దేశము బాగు పడదని కవయిత్రి ఆనాడే వాపోయినది. కాని వానికీ కాలమున విలువ యెక్కువైనదని చూచినచో కవయిత్రి యింకనెంత వాపోయెడిదో. మహిళలకు తరతరములకు తరగనట్టి హితములను ఉపదేశించి రచించిన ఈ తరుణీ శతకమును కవయిత్రి తన మాతృ దేవతయైన అనంత లక్ష్మికి అంకితమొనరించి, తన మాతృ భక్తిని ప్రకటించుకొన్నది.

శ్రీ రాజరాజేశ్వరీ శతకము

తాదేపల్లి నివాసులు, అచ్చటి దేవియగు రాజరాజేశ్వరీ దేవిపై కృతి రచియింపుమని కవయిత్రి ఇందుమతీ దేవిగారిని ప్రేమతో కోరినపుడు,కవయిత్రి రాజరాజేశ్వరీ శతకమును రచించి ఆ దేవతకే అర్పించినది. కవయిత్రి ఈ కవితను 'నక్షత్రమాల'గా రచింతునని, నక్షత్రమాలను దేవికి సమర్పింతునని చెప్పినది. 'నక్షత్రమాల' అనగా యిరువదియేడు పద్యములతో కూడినదని కావ్యజ్ఞులు చెప్పుదురు. కవయిత్రి నక్షత్రమాలను అర్పింతునని చెప్పినను, ఇందు యేబది పద్యములవరకు గలవు. తాను నక్షత్రమాల నొసగదలచితిననియు, భారతితో కూడ తన ఎదలో నిలుపుమని దేవిని కోరినది.

నక్షత్రమాలనొసగగ
నక్షీణ ప్రమదమొప్పనాత్మదలచితిన్
నక్షీణ కరుణతోనా
వక్షంబున నిల్వు మీవు భారతి తోడన్.

అని రాజరాజేశ్వరిని కోరినది.

సరస్వతిని స్తుతించిన పద్యము సంస్కృత శబ్ద భూయిష్టమై చక్కని ధారతో సాగినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సరస్వతి ప్రార్థన :

ఉ. సారెకు బ్రస్తుతింతు మది శారద నీరద పారదేందుక
ర్పూర తుషారతుల్య రుచిపూరితగాత్ర పవిత్ర వాణినా
భారతి నాముఖాబ్జమున బాయకనిల్చి మరంద తుల్యవా
గ్రూపములొల్క నాజతనసున్సఫలంబుగ జేయుగావుతన్.

ఇష్టదేవతలను, తల్లి దండ్రులను స్తుతించి, దేవికి నక్షత్రమాల నర్పించెద నని చెప్పినది.

కం. అర్పించెద విమలయశో
కర్పూరచ్ఛన్న దశదిగంతకుసుమకున్
నేర్పున మృదువాక్తతిచే
గూర్పగ నక్షత్రమాల కోమలమగుటన్.

ఇందలి పద్యములు దేవీ ప్రార్థనతో కూడి సీసపద్యములలో రచింపబడి నవి. సీసపద్యములన్నియు ప్రవాహవేగమున సాగినవి.

ఏ ఆభరణములూ లేనివానిని, రాజేశ్వరీదేవి వరించుటవలన ఆమె పాతి వ్రత్యము తెలియుచున్నదని కవయిత్రి వర్ణించినది. కవయిత్రి ప్రతి రచన యందును ధనమునకు విలువనివ్వని రీతిలో రచించినది. ఆమె నిజ జీవితములో గూడ చాల సామాన్య వేషమున ఖద్దరు చీరలు ధరించి యుండెడిదని తెలిసినవారు వ్రాసినారు. ఈ పద్యమువలన స్త్రీలు భర్తయొక్క ఐశ్వర్యాదులను కోరకూడ దనియు, అతని శీలముమాత్రమే స్త్రీలకు వలసినదనియు, వ్యంగ్యముగా రాజేశ్వరీ స్తుతిలో ధ్వనించుచున్నది.

సీ. నవరత్నమయ భూషణంబు లానాస్తిరు
ద్రాక్ష పేరులెగదా దాల్చుటకును
ఘనదు కూలంబులాకరవయ్యె వ్యాఘ్రాజి
నంబెగా గట్టుటకంబరంబు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

త్రాగబాత్రయు నాస్తి తలపుత్రెయేగదా
వల్లకాటనె గదావాసమరయ
రసిక తయాసున్న రౌద్రమూర్తి యెగదా
శయనింపగా గజచర్మమాగద.

గీ. హారములు ఘోర సర్పంబులట్టి పేద
యైన యుగ్రాక్షునర్ధాంగి వౌటలోక
మాన్యనీదు పాతివ్రత్యమహిమగాదె
మించి భక్తిని శివుని పూజించినావు
రాజరాజేశ్వరీ యక్షరాజ వంద్య.

రాజరాజేశ్వరీదేవి లక్ష్మి, శారదా, పార్వతీ మూర్తుల రూపమే అని కవయిత్రి నమ్మకముతో తెలిపినది.

సీ. సకల కళావిలాసములలోక ఖ్యాతి
దీపించుశారదా దేవి నీవు
అణిమాది ఘనత రాష్టైశ్వర్యములనొప్పి
దీపించు పార్వతీ దేవి నీవు
వనజాక్షునురమున వసియించి శ్రీవైభ
వములచే నొప్పారు కమలవీవు
ఘనకదంబ వనస్థలి సురల్నుతి సేయ
దీపించు కాళికా దేవివీవు

గీ. తలపమహిషాసురేంద్ర మర్దనివి నీవు
ఘనకళా చతురవును శృంగారశాంత
మూర్తివి ప్రసాదమూర్తివి ముగ్ధవీవు
రాజరాజేశ్వరీ గజరాజయాన.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజరాజేశ్వరీదేవి యొక్క శుభలక్షణములను జూచియే హరుడు గిరిరాజు చెంత కేగి నిలిచినాడని కవయిత్రి దేవి సౌందర్యమూర్తిని వర్ణించినది.

సీ. అర్ధేందు పటలంబు నపహసించెడుఫాల
ఫలకంబు సొగసాత్మదలచిదలచి
బాలచంద్రికలను బరిహసించెడు మంద
హాసంబు మదిలోననరిసి యరసి
ధవళాబ్జముల కాంతి తారుమారుగజేయు
సొగ కన్నుల హొయల్జూచి చూచి
అఖిలజగన్మోహనంబైన నీదులా
వణ్యాబ్ధి దేలగా వాంఛ జేసి

గీ. జపతపమని యోగివేసంబునూని
హరుడు గిరిరాజు దరిజేరెనరుడుగాదు
అఖిల లక్షణవతివినై యట్టి జోగి
నీవు వరియించు టాశ్చర్యమోవరాంగి
నీమనో నిశ్చయంబింకనేమనందు
రాజరాజేశ్వరీ మృగరాజమధ్య.

రాజరాజేశ్వరీ శతకమునగల ప్రతిపద్యము కూడ మృదుమధుర పదసమ్మిశ్రితమై, కవయిత్రి మధుర రచనకు తార్కాణముగా నున్నది. ప్రతి పద్యము చదువుచున్న కొలదియు చవులూరించుచున్నది. పార్వతీదేవి అవతారమగు రాజరాజేశ్వరి, శివునికొరకు తపించి, పంచాగ్ని మధ్యమున జేరి తపస్సుజేసి, విశ్వేశ్వరుని పొందినది. పరమేశునితో వివాహము జరిగిన ఘట్టమున ముద్దుల మురిపెంపు పెండ్లి కూతురగు దేవిని, రాక్షసమర్దన చేయునపుడు రౌద్రమూర్తియైన దేవిని కవయిత్రి మనోహరముగా వర్ణించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ. మురిపెంపు పెండ్లి కూతురవై శిరము వాంచి
శర్వుపై దలప్రాలు జల్లునాడు
పాపపేరులగాంచి భయపడ్డ చందాన
నొక్కచెంపకొదిగి యుండునాడు
పల్లవమృదుపాణి పద్మంబులను బ్రీతి
యొప్పార హరునంఘ్రు లొత్తునాడు
అర్ధశరీరంబు నాక్రమించి యునుండ
బాయక నెవ్వేళ బరగునాడు
వీర రౌద్రాద్భుతా వేశమొప్పగ విజృం
భించి రాక్షసులమర్దించునాడు

గీ. ముగ్ధ శృంగార విస్మయ మూర్తి వౌచు
రౌద్రమూర్తివి నైనవరసము లొప్ప
మొనర నొక్కొకవేళ నొక్కొక్కరీతి
హర్షమొదవించితి వయారెహరునిమదికి
రాజరాజేశ్వరీ భృంగ రాజిచికుర.

ప్రతి సీస పద్యమునకు అంతమునగల గీత పద్యము యొక్క చివరి పాదమున ఒక్కొక్కరీతిగా దేవిని వర్ణించినదీ కవయిత్రి. రాజరాజేశ్వరీ మృగరాజ మధ్య అనియు, రాజరాజేశ్వరీ భృంగరాజి చికుర అనియు రాజరాజేశ్వరీ యుడురాజ వదన అనియు, శ్రీమతి తాజరాజేశ్వరీ పరాంగి అనుచును, రాజరాజేశ్వరీ మృగరాజవాహ, రాజరాజేశ్వరీ మదమరాళగమన, రాజరాజేశ్వరీ కవి రాజవినుత, రాజరాజేశ్వరీ దిగ్విరాజకీర్తి, శ్రీకరీ రాజరాజేశ్వరీ భవాని, శ్రీసమర్పిత రాజేశ్వరీ మృడానీ, శ్రీమతి రాజరాజేశ్వరీ నమోస్తు, అమ్మ రాజేశ్వరీ సకలార్థదాయి, రాజరాజేశ్వరీ సర్వరాజవేణి, రాజరాజేశ్వరీ హేమ రత్నభూష, రాజరాజేశ్వరీ లోకపూజనీయ, రాజరాజేశ్వరీ జగత్ప్రథితచరిత, రాజరాజేశ్వరీ భక్త రాజపోష, రాజరాజేశ్వరీ దైత్యరాజహారి, గానరాజేశ్వరీ సామగానలోల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజరాజేశ్వరీ విఘ్నరాజమాత, గౌరి రాజేశ్వరీ శ్రిత కల్పవల్లి, తల్లి రాజేశ్వరీ గుణ ధన్యమాన్య, శ్రీకరీ రాజరాజేశ్వరీ దయాళు, రాజరాజేశ్వరీ రమ్యహీరకీర్తి అనుచు, అనేక భంగుల దేవిని కవయిత్రి సంబోధించి, తన కవితా ప్రావీణ్యా తను చాటుకొన్నది.

మహిషాసురమర్దనియైన దేవిని కవయిత్రి నుతించిన తీరు చక్కగా నున్నది. దేవి కన్నులలో వీరరసము, కృపారసమొలుకుచుండగా, దేవత లందరు నుతించుచుండగా రాక్షస మర్దనమొనరించినది.

సీ. ఒకవేళ విస్మయంబొక వేళ వీరంబు
నొకట కృపారసంబొలుకు చుండ
ఒక వంక ప్రమథులు నొకవంక దైత్యులు
నొవంక దేవతా నికరములును
కంకణ ఝుంకార ఘనధనుష్టంకార
దనుజహాహా నినాదములు సెలగ
బాణవర్షంబును, ప్రసవ వర్షంబును
రాక్షస రక్తవర్షంబు గురియ

గీ. సురలు పొగడగ ప్రమథులు స్తుతులు సేయ
దనుజభామిను లార్తులై తత్తరింప
మహిషదానవు గూల్చిన మహితమూర్తి
రాజరాజేశ్వరీ మదమరాళగమన.

అంబను బలిప్రియ యని తలచి మూఢులు కొందరు సాధు జంతువులను సంహరించి దేవికర్పణము సేయు విధము కవయిత్రి నిరసించినది. బలి యనగా పసుపు, కుంకుమ, పూలు, అర్పణము సేయవలయునుగాని జీవహింస చేయుట గాదని, అట్టి అజ్ఞానులకు జ్ఞానోదయము కల్గించుమని దేవిని వేడుకొన్నది. కవయిత్రికి శ్రీరామునియందు భక్తిమెండు. తన బిరుదము లన్నింటిని శ్రీరామునకే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమర్పితమొనరించినది. రామాయణ గ్రంథపఠనయందు ఆసక్తి గలదని చెప్పు కున్నది. రాజరాజేశ్వరీ శతకమునందు కూడ రామనామము యొక్క మహాత్మ్య మును వివరించినది. మూర్ఖులను తరియింప జేయుటకొరకు రామ తారకమంత్ర మును, దేవి పరమేశుని యొద్ద శిష్య భావముతో నుండి తెలిసికొని లోకరక్షణ కొరకు ప్రకటనమొనరించినది. రామ తారకమంత్రరాజము యొక్క గొప్పదన మును కవయిత్రి ఇట్లు చెప్పినది:

సీ. రామతారకమంత్ర రాజంబు భవతరు
వారంబునకును కుఠారధార
రామతారకమంత్ర రాజంబు షడ్వర్గ
భూధరంబులకు దంభోళిధార
రామతారక మంత్ర రాజంబు తాపత్ర
యాగ్నులకెన్నగా నంబుదంబు
రామతారక మంత్ర రాజమెన్నంగదుః
ఖాంబోధికిని బడబానలంబు

గీ. మదన భూతంబు వదలించు మంత్రమౌచు
వెలయు రామనామంబు నీదిమలహృదయ
రాజితాంభోజ ముఖ భృంగ రాజమయ్యె
శ్రీసమర్పిత రాజేశ్వరీ మృడాని.

రాజరాజేశ్వరీ దేవి రూపము సాధుమానసులైన సజ్జనుల కొకరీతిగా, దుష్ట వర్తనులైన ధూర్తులకొక తీరుగా కన్పించును. కవయిత్రి దేవిని వర్ణించిన తీరు భాగవతమున పోతన సత్యభామను వర్ణించినట్లు సాగినది—

సీ. వెలిదమ్మి రేకులై తలపకెందమ్ములై
మెరయు నీ చేరల మీరు కనులు
అరయ రాకా చంద్రుడై గ్రీష్మ మధ్యాహ్న
భానుడై యొప్పు నీ యాననంబు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వల్లకీనాదమై ప్రళయాంబు దరవమై
బరగునీ వాక్యప్రపంచమరయ
రాజిల్లు కృప తోడ రౌద్రంబుతో నొప్పు
నిరుపమాన స్ఫూర్తి నీదు మూర్తి.

గీ. తలపప్రియ దాయియును భవదాయి యౌను
సాధుమానసులైన సజ్జనుల కట్లు
దుష్టవర్తనులైన ధూర్తులకునిట్లు
నీశుభాకృతి దోచునిర్నిద్రతేజ
శ్రీమతీ రాజరాజేశ్వరీ నమోస్తు.

రాజరాజేశ్వరీ దేవి పాదాబ్జముల వర్ణన ఈ గ్రంథమున రాగభరితముగా నున్నది. తన ఆత్మ యందు నెలకొన్న దేవి తరుణారుణ పాదములను కవయిత్రి మధుర రాగ పూరితమైన హృదయముతో వర్ణించినది.

సీ. ప్రణయ సందర్భ నిర్భర రాగమానస
గరకంతఫాలసంఘటితమగుచు
మాణిక్య మయ హేమమంజీర నినదరం
జితఫాలలోచన చిత్తమగుచు
శారదామృదుహస్త జలజాతచర్చిత
కలితరాగారాగకాంతమగుచు
కమలాల యాహస్త కంజాతరాగస
మ్మానితోన్నతమహా మహిమయగుచు

గీ. వెలగితరుణారుణచ్ఛాయజిక్కుపరచు
నఖిలసజ్జనఘనవిపదబ్ధిపోత
నీపదాబ్జాత యుగమాత్మ నేదలంతు
రాజరాజేశ్వరీ సర్వరాజవేణి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తాడేపల్లిపురమునవెలసిన రాజరాజేశ్వరీదేవిని చెరుకుపల్లి వంశ శీత కరుడగు వేంక యార్యుడను ఘనుడు స్థాపన మొనరింపజేసినాడు. దేవి మహిమ ఆచంద్ర తారార్కముగా వెలుగొందునట్లే వేంకయార్యుని కీర్తి నిలచును. దేవిని ప్రస్తుతించినట్టి పద్యములతో ఇందుమతీదేవిగారి యశశ్చంద్రికలు కూడ నలు దిక్కుల విస్తరిల్లినవి.

సోదరి (లఘు కావ్యము)

మందారమాలలో కూర్పబడిన మరియొక పరిమళ భరిత పుష్పము సోదరి శతకము. ఇది కల్పిత కథ. సోదరి శతకము అని పునర్ముద్రణలో పేరు పెట్టినారు కాని 'సోదరి' చిన్న కల్పిత కావ్యము మాత్రమే. ఇది శతకము కాదు.

అన్న చెల్లెండ్ర మధ్యగల ప్రేమానురాగములు, అన్న భార్య అలకలు మున్నగునవి సహజముగా ఉండును. వానినే కథా కావ్యముగా మలచినది కవయిత్రి. మనోరంజకమగు చక్కని పద్యములచే కూర్పబడిన ఈ కల్పిత కథా కావ్యము అన్న చెల్లెళ్ల ఆత్మీయతను సూచించుచు చిరకాలము శాశ్వతముగా నుండును. ఇందు నాలుగు దళములు కలవు.

సోదరియైన రాజేశ్వరమ్మకు పుట్టి నింటిపైన మక్కువ యెక్కువ. తన పుత్రునికి మేనకోడలిని గురించి చెప్పి, మేన మరదలిని చూచి, కలియ మనియు, మేనమామతో కలిసి మాట్లాడమనియు రాజేశ్వరమ్మ కుమారునికి చెప్పును. రాజేశ్వరమ్మ సోదరుడు మంచివాడే కాని భార్య గయ్యాళిది. ఆమెకు జడిసి అన్న, చెల్లెళ్లు ఒకరితో నొకరు యెన్నినాళ్లుగానో కలియలేదు కాని. తన భర్త ఉద్యోగరీత్యా తన పుట్టిన ఊరికే చేరిన రాజేశ్వరమ్మకు తన వారిని చూడ వలయునని, మేనకోడలితో, తన కుమారునకు పెండ్లి యొనర్చి, మరల సంబంధము కలుపవలయుననియు ఆమె తపించును. ఆమెకు వరకట్నముపై మక్కువలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కేవలము-అన్నతో సంబంధమొనర్ప వలయునని ఆమె కోరిక. ఓదరకు ఎంతయో ప్రయత్నించి అన్న చెల్లెళ్ళు తమ కోరిక తీర్చుకొనిరి.

సోదరి రాజేశ్వరమ్మకు పుట్టింటిపై చాల మక్కువ. అందుకే తన పుత్రుడగు శ్యామలునితో నిట్లనును :

గీ. కానవేవేలు గణియింప గలముకాని
మేనరికమంద గలిగెడు మేలుగలదె!
భాగ్యమునకును నేనాస పడను తండ్రి
యన్నతో వియ్యమంద నాకాసగలదు.

గీ. కఠిన మానస యెవతె యోకాదటనును
గాని పుట్టింటిపై ప్రేమ ఘనముసలికి
మనకు దైవ మొసంగిన ధనము చాలు
ధనము ఘనమౌనె? సత్కీర్తి ఘనము కాదె?

అని తన కుమారునికి, తనకు పుట్టినింటిపై గల మమతాను రాగములను వెల్లడి చేసినది. తనకు ఒక్కడే కుమారుడగు శ్యామలుని, ఆమె తన ముద్దు దీర్చుమని కోరినది. తల్లి కోరిక ననుసరించి శ్యామలుడు, తాలూకాఫీసులో మేనమామను కలిసినాడు. వారిరువురు కలసి మాట్లాడుకొనిన పిదప, శ్యామలుడు మేనమామను తమ ఇంటికి రమ్మని చెప్పును. అతడు వత్తునని చెప్పిన పిదప శ్యామలుడు వెడలి తన తల్లితో చెప్పును.

తృతీయదళమునందు అన్న మనోవేదన. చెల్లెలి ఆరాటము కవయిత్రి శ్రీ సహజమైన ఆర్ద్ర హృదయముతో వర్ణించినది. చెల్లెలిని చూచి పదేళ్ళు గడిచి పోయినవని, తన నెంత యేవగించుకొందురోయని అన్న కుమిలిపోవును. భార్య పుట్టినింటికి పోయిన దినము చూచి మెల్లగా వెడలును. అన్న రాకకొరకు ఎదురు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చూచు చెల్లెలు అన్న పోలికతో వచుచ్చున్న ఒక పురుషుని గాంచి వేగముగా ఎదురేగి అన్న కానందున నిరాశతో వ్యధ చెందును.

గీ. ఆతడెవ్వరొయగుట గాళ్ళదుర, మది ని
రాసచే మేను నీరస మాయెనన్న
యేల వచ్చును? రాడు పోయిన్ని నాళ్ళ
నుండి లేనట్టి ప్రేమ నేడుండునెట్లు?

అని అన్నను గూర్చి తలపోసినది.

అన్న రాక కొరకు మనసులోనే కుమిలినది. దేవతలకు మ్రొక్కులిడినది. ఇందు కవయిత్రి, సోదరి మనసులోని ఆకులత, ఆరాటము, ఆత్మీయత ఒక్క విధముగా చిత్రింపలేదు.

సీ. అన్న నేడిటువచ్చెనా పక్రవారంపు
సేవ దుర్గకు రేపె జేయుదాన
అన్న నాతో వియ్యమందెనా డిగదోపు
జంకక నిత్తునో వెంకటేశ
పుట్టింటికే బోవు పుణ్యంబు గల్గ పా
నకము జేయింతునో నారసింహ
వదినయు మంచిగా వరల పెద్దలకును
పేరటాండ్రకు ప్రీతి బెట్టుదాన

గీ. చిన్న సుందరి కోడలై చెలగి యింట
దిరుగు భాగ్యంబు గలుగగా ధరణి గలుగు
నన్ని నోములు నోతునేనంచు, గోడ
నాని పైగలి జింతసేయంగ దొడగె.

ఆమె సోదరుని గురించి ఆత్మలో తలచు చున్నపుడే వచ్చి నిలచినాడు తోబుట్టువు. అతడు పిలువగానే వెంటనే కన్నులు విప్పిచూచి 'వచ్చితివా, అన్నయని'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్న భుజములపై చేతులు వేసి నిలచినది. వారిరువురి మనోభావములు సోదరీ, సోదరులకు మాత్రమే అనుభవైక వేద్యమగును. కాని ఒంటరి తనమున పెరిగిన వారికి తెలియవు. అన్నతోపాటు వచ్చిన మేనకోడలిని చూచి మురిసి, అక్కున చేర్చుకొని, చెక్కు ముద్దులాడి, మురిసిపోయినది మేనత్త. మేనకోడలగు బాలసుందరిని గాంచి -

గీ. నన్ను గన్న తల్లి, నా చిన్ని పొన్నారి
యమ్మ పేరు పెట్టెననుచు పగులు
జెప్ప వినుగాని యెప్పుడు గనరాదు
కాలమహిమ మట్లు గాజరించె.

గీ. ఒడిని బాలనుంచు, నొయ్యన ముద్దాడు
శిరము మూరు కొనుచు, చేతనిమురు
కనుల నీరునించు గనుగొంటి నిన్నాళ్ల
కమ్మ నిన్నటంచు హర్షమందు.

ఆ అన్నా చెల్లెళ్ల అప్యాయతను యెంత వర్ణించినను, కవయిత్రికి తరుగు లేదు. వారి ప్రేమమయములైన మనసుల నిట్లు వివరించినది:

ఆ. అన్నయంట జెల్లెలనురాగ నతియంట
మానసములు ప్రేమ మయములంట
చాల రోజులకును సందర్శనంబంట
యెట్టులుండు వారికెంచి చూడ.

సంతసముతో వారు పిల్లల వివాహము కొరకు ముచ్చటించుకొన్నారు. అన్నతో సోదరి తనకు పుట్టినింటపై గల కూర్మి నిట్లు తెలిపెను:

క. కడుధనము నొసగె నీపడు
కుడువను ముడువంగ గట్ట గొడుకు నొసంగెన్
పెడబుట్టు డెందముననా
కెడపక బుట్టింటిపైన నెనసిన కూర్మిన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తనకు మేనరికిమందు ఆశగలదని, ధనముపై లేదని సోదరి రాజేశ్వరమ్మ వదినతో కూడ అట్లే పలికినది.

గీ. వదిన మీరలొసంగిన వలదనజుమి
మేనరికమును మించెడి మేర గలదె
ధనము నాకేల? వలయు బాంధవ్య మొకటి
యిచ్చెద నటను మీవునే బుచ్చుకొందు.

మేనరికముపై ఆశగల సోదరి రాజేశ్వరమ్మ అన్నా, వదినలతో పెండ్లి మాటలాడి, ధనముపై ఆశలేదని నొక్కి చెప్పినది.

గీ. ధనముపై గోర్కె లేదు మా తలపులోన
నన్నతో వియ్యమందెదు నాస యొకటి
మేన గోడలిపై నాస మిక్కుటంబు
పుట్టినింటిపై నాస వేపుట్టు నాకు.

అని గద్గద స్వనముతో పలికిన చెల్లెలిని, ఆమె జాలిగొలిపెడు మొగమును సలిల పూర్ణ నయనములను గాంచి, అన్న అత్యాదరముతో దైవసాక్షిగా ఒప్పు కొనినాడు. కాని వదినకు, వారి అనురాగము చూచి, ఎదనిండ కోపము కల్గినది. అలిగి కోపముతో ఉపవాసములు చేయుచు పరుండినది. అలకతోనున్న వదినెగారిని సోదరి రాజేశ్వరమ్మ ద్వేషించలేదు. తానే స్వయముగా పెండ్లి పనులన్నియు నిర్వహించి, మేనకోడలిని కోడలిగా జేసుకొని అయిదు రోజుల పెండ్లి జరిపినది. పెండ్లి అయిన పిదప అన్నా చెల్లెళ్ళ సంతోషమునకు హద్దేలేదు.

గీ. అన్న జెల్లెలి హర్షమింతంత గాదు
చింతగింజను మొలవేసి పంతమొప్ప
పులుసు ద్రాగితి మనుచును పొంగుచుండ్రి
మెలతలకు పుట్టినింటిపై మెండు ప్రేమ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని వారి అనురాగమును వర్ణించినది కవయిత్రి. శ్యామలుడు, సుందరి కూడ సంతసముతో రాజేశ్వరమ్మ దీవనలతో కూర్మితో నుండిరి.

కావ్యాంతమున కవయిత్రి శుభములను కోరుచు-

ఆ. సకల సద్గుణముల సతుల కొసంగి శ్రీ
నేత యెపుడు బ్రోచుగాత పాడి
పంటలమర ధర్మ వంతులై ప్రజలొప్ప
భరతమాత యశము ప్రబలుగాత.

అని భరతమాత యశమును కోరినది.

ఈ 'సోదరి' కావ్యము, ముఖ్యముగా అన్నా, చెల్లెళ్ళ అనురాగమే గాక, వరకట్నమును నిరసించుచు కవయిత్రి తన భావములను రాజేశ్వరమ్మ ద్వారా చెప్పినది. ఆ రోజులందు వరకట్న దురాచారమును నిరసించుచు ఆధునిక కవులు కొందరు కవితలల్లినారు. రాయప్రోలు సుబ్బారావుగారి 'స్నేహలత' కావ్యము వరకట్న దురాచారమును నిరసించుచు వ్రాసిన కావ్యము. కవయిత్రి ఇందుమతీ దేవిగారు కూడ తన మనోభావమును 'సోదరి' అను చిన్న కల్పిత కథలో చేర్చి చెప్పినది. దీనిని రచించి యెన్నో సంవత్సరములు గడిచినవి. కవయిత్రియు దివంగతురాలైనది. కాని లోకమున, నన్నా చెల్లెళ్ళ ఆప్యాయతకు చిహ్నంగానూ, వరకట్నమును నిరసించు కావ్యముగానూ ఈ లఘుకావ్యము చిరకాలము మహా కావ్యమై నిలుచుననుటలో సందియము లేదు.

డా. కె. యన్. కేసరిగారు కవయిత్రీమణి ఇందుమతీదేవిగారి రచనలను గూర్చి అమూల్యమైన అభిప్రాయములను తెలిపినారు. "దేశమాత అదృష్టమునకు తార్కాణమై ఆధునికాంధ్ర ప్రపంచమున వెలుగొందుచున్న విదుషీమణులలో ఇందుమతీ దేవిగారు చిరప్రతిష్ఠితురాలైనదని" వారు ప్రశంసించినారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీతి తారావళి

మైలవరము రాణీగారగు మంగయాంబ గారి పేరున మకుటము నుంచి 'నీతి తారావళి' అను శతకమును కవయిత్రి రచించినది. మైలవరము రాణీగారి కోరిక ప్రకారమే 'తిరువాయ్ మొళి' లోని పది పాశురములను అనువాదమొన రించినది. అందు వేయి పాశురములుండును. పుస్తకము లభ్యము కాకపోవుటతో పెద్దతనముచే ఓపిక సన్నగిల్లుట వలన కవయిత్రి పూర్తిగా అనువదించలేదని వ్రాసినది. 'నీతి తారావళి'లో మంగయాంబ గారిని ప్రస్తుతించుచు కొన్ని, నీతి పథములైనవి కొన్ని పద్యములున్నవి.

మంచి మిత్రులైన వారినిగూర్చి తెలిపి, మిత్రుత్వమునుగూర్చి తన భావన నిట్లు చెప్పినది:

ఉ. మిత్రులు మిత్రులంచు మిడిమేలపు మాటలనిందు నందునం
జిత్రముగా గబల్కుచును చిత్తములోన గళంకమూనుచున్
బాత్రమెరుంగలేక హితభావము లేక చరించువారు స
న్మైత్రి నొనర్పనేరు తురె మానక శ్రీవర మంగయాంబికా.

తెలివిగల వారమని గర్వించువారిని కవయిత్రి నిరసించినది.

చ. తెలివిగలార మేమనుచు ధిక్కృతి జేసిగలంతురక్కటా
ఖలమతులెన్న సజ్జనులకాలము వీరలసాధ్యమౌనెయా
తెలివి జగత్ప్రభుంగొలిచి దీనుల బ్రోవగ నొప్పెనేనివా
రిలనుత కీర్తి గాంచ రొకొ యేమన శ్రీవర మంగయాంబికా.

కవయిత్రీమణి నీతితారావళిలో రచించిన పద్యములు ధారాళమైన శైలితో పండితులను మెప్పించెడి రీతిలో సాగినవి. సజ్జనులైన వారు సుజన సంగతి చేరినచో అందెంత మేలు కలుగునో యిట్లు చెప్పినది:

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. పాలను జక్కెరంగలుపు భాతిగ గంధము కప్పురంబులో
బోలగ నుంచినట్లు, హిమపూరమున త్తరు జెరినట్టులే
చాలగ సజ్జనుల్ సుజన సంగతి జేసిన నెట్టివేళలో
మేలి సుఖంబు కీర్తియును మేకొను శ్రీవర మంగయాంబికా.

బాల్య యౌవనములు ఆట పాటలతోనే గడిచిపోయినవి. వృద్ధాప్యమున భగవంతుని ఎట్లు ప్రార్థింపవలయునో అను వేదనను తెలియజేసినదీ కవయిత్రి.

ఉ. ఆటల బోయె బాల్యమును యౌవనమెన్న విలాసకేళి పూ
దోటల బోయె వార్థకము దోచెమనంబున చింత దక్కనే
బాటయు దోచదా దనుజపాటను గొల్చుచు నాత్మ శత్రులన్
మీటుట యెన్నడో నరుడు మేదిని శ్రీవరమంగ యాంబికా.

పేదలను పీడించి ద్రవ్యార్జన చేసి, గొప్ప గొప్ప దానములొనరించి కీర్తిని పొందు వారిని దూషించినది.

ఉ. పేదలనెత్తి గొట్టి వడిచేర్చిన గర్వముతోడ గీర్తియున్
రాదలపోసి దానములు రాజిలజేయుట లెస్స యౌనొకో
యీదరి గొట్టిగాకులను యేటికి గ్రద్దలకే యుమేదినిన్
రాదు యశంబు ముక్తియును రాదట శ్రీవర మంగయాంబికా.

సుగుణశీల యైన ఈ కవయిత్రి యెల్లప్పుడు వనితలకు సద్గుణములే ఉండవలయునని కోరును. చదువగానే కాదు. గృహము దిద్దు నేర్పు, పతివ్రతాత్వము కలిగియుండవలయునని, మృదువగు మానసముతో అలరవలయునని చెప్పును. సుశీలవతులై కీర్తి గాంచవలయునని అభిలషించును.

సీ. దయయు సత్యంబును దాతృత్వ భావంబు
వెలది యందెప్పుడు వెలుగవలయు
పరహిత భావంబు బంధుపోషణమును
కాంతలయందున గ్రాలవలయు
కరుణయు శాంతంబు కలిత మర్యాదయు
గృహిణి యెప్పుడును వహింపవలయు
నోర్పును కలిమికి యొప్పు తీయని మాట
లతివలందెప్పుడు నలరవలయు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ. నాపదలవేళ ధైర్యంబు సందవలయు
సంపదలవేళ ప్రేమయు జాలిగలిగి
మెలగవలె నిట్టి గుణమణుల్ వెలసెనీకె
మాన్యసుగుణ కదంబ శ్రీ మంగయాంబ.

సత్పురుషులైన వారికి మంచి గుణములబ్బిన యెడల, పూవుకు తావి అబ్బినట్లు, బంగారములో రత్నము పొదిగినట్లు భాసించును. ఇట్టి ఉపమానముతో-చక్కని బోధన యొనరించినదీ మధుర కవయిత్రి.

సీ. ధనవంతుడే మహా దాతృత్వ మతియైన
పూవుతావియు నొప్పు పోల్కిగాదె
బలవంతుడే కృపాపర తంత్రుడైనచో
మణి హేమ మందొప్పు మాడ్కిగాదె
అధికారి న్యాయంబు ననుసరించి జరింప
ఫలమందు రుచియొప్పు పగిది గాదె
వినయ సంపన్నత విద్యాధికునకున్న
నెలయు వెన్నెల యట్టులలరుగాదె

గీ. అఖిల సుగుణములొప్ప లోకాభినుతుడు
గాడె పురుషుడు, లేకున్న కఠిన దైత్య
పతులవలె వైభవస్ఫూర్తి బడయనేమి?
మహిత సుగుణ కదంబ శ్రీమంగయాంబ.

సదుపదేశములతో నొప్పుచు, సరసశైలితో గూడిన 'నీతితారావళి' పద్యములను కవయిత్రి ఇందుమతీ దేవిగారు తన ప్రియమిత్రురాలగు మంగయాంబికగారి కంకితమొనరించి 'మంగయాంబికా' మకుటముతోనే రచించినట్టి ఈ నీతి తారావళి ఇరువురు మిత్రురాండ్ర నామములను చిరకాలము నిల్పును.

ఈ మందార మాల యందలి కవితా కుసుమములన్నియు, కవయిత్రి చెప్పినట్లుగా పూవుకు తావి అబ్బినట్లుగా, పాలలో చక్కెర కలిపినట్లుగా, హిమపూరమునందత్తరు చేర్చినట్లుగానే యుండి కవయిత్రి కీర్తి సౌరభములను వెదజల్లుచున్నవి.

కేసరిగారి గృహలక్ష్మి స్వర్ణ కంకణమును పొందుట ఈ కవయిత్రికి బంగారమునకు తావి కూర్చినట్లు శోభిల్లుచున్నది. కవితా విశారదయగు ఈ కవయిత్రి కాలగతిలో కలిసిపోయినను, ఈమె కవితలు చిరకాలము నిలిచి, సాహిత్య రంగమునందీమె పేరునిలుపును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డా॥ నాయని కృష్ణకుమారి (1979)

విదుషీమణియై, మహిళా లోకమున మణిదీపమై వెలుగుచు, ఉస్మానియా విశ్వ విద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య పదవిని సమర్థవంతముగా నిర్వహించుచున్న కవయిత్రి. ఈ కవయిత్రి కావ్యములను పరిశీలించుట సూర్యుని వైపు దివిటీ పట్టి చూచినట్లుండును. ఆమె విద్యా విజ్ఞానానుభవములు, ఆమె బాల్యమున గడిపిన విశాఖలోని అపార సాగరము వంటివి.

తెలుగు వారికి సుపరిచితులైన మహాకవి నాయని సుబ్బారావుగారి పుత్రిక కృష్ణకుమారిగారు. తల్లి శ్రీమతి హనుమాయమ్మగారు. కృష్ణకుమారిగారి జన్మ స్థలం గుంటూరు. 14-3-1930 న వీరు జన్మించినారు. భర్తగారు శ్రీయుత కనకవల్లి మధుసూదనరావుగారు. కృష్ణకుమారిగారికి ముగ్గురు సంతానము- ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు.

గుంటూరు నందలి ఎ సి. కాలేజీలో పట్టభద్రురాలైన కృష్ణకుమారిగారు ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో ఎం.ఏ. ఆనర్స్ చేసినారు. 'తెలుగు జానపద గేయ గాథలు' అను సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి ఉస్మానియా విశ్వ విద్యాలయములో పిహెచ్. డి. పట్టము పొందినారు. 1952 నుండి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉపన్యాసకురాలిగా పని చేయుచు అనేక మంది విద్యార్థులచే ప్రశంసలనందినారు. విద్యార్థి దశ నుండియు రచనా వ్యాసంగం చేపట్టినారు. భారతి, ఆంధ్ర శిల్పి, ప్రతిభ, కిన్నెర వంటి సాహిత్య పత్రికలు వీరి రచనలను ఆదరించినవి.

'తెలుగు జానపద సరస్వతి' యని జానపద సాంస్కృతిక సంస్థను నెలకొల్పి, సమర్థతతో నిర్వహించుచున్నారు. జానపద సాహిత్య పరిషత్తును అధ్యక్షురాలిగా నుండి దాని పురోగతికి కృషి చేయుచున్నారు. డా. నాయని కృష్ణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుమారిగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య రచయిత్రుల సలహా సంఘానికి కన్వీనరు గానూ, సాధారణ సంఘంలో సభ్యురాలుగానూ ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీలో గౌరవనీయ సభ్యురాలిగా నుండి సాహిత్య సేవ యొనరించుచున్నారు. ప్రజ్ఞా పాటవములు కలిగిన ఆంధ్రోపన్యాసకురాలిగా కీర్తి గాంచినారు. వీరి రచనలు అగ్నిపుత్రి (ఖండ కావ్యము), ఆంధ్రుల కథ, ఆయాథా, పరిశీలన, పరిశోధన, కాశ్మీర దీపకళిక, తెలుగు జానపద గేయ గాథలు (సిద్ధాంత వ్యాసము). కళాశాలలో పాఠాలు చెప్పడం, పూర్వ కవుల రచనలలో అంతులేని భావ సంపద ఉన్నదని ఆనందించుట వీరి సరదాలు.

1979వ సంవత్సరమున కేసరిగారి గృహలక్ష్మి స్వర్ణ కంకణమును పొంది వనితా లోకమునందు వాసి గాంచినారు డా. కృష్ణకుమారిగారు. అనేక సభల యందు పాల్గొని తమ కవితా పఠనముచే సహృదయుల కానందము నొసంగినారు. మహిళా సభలు. యువ భారతి సాహిత్య సభలు, మున్నగు సభలయందు ఉపన్యాసములిచ్చి ప్రశంసల నందినారు. ఆకాశవాణి యందు వీరి విజ్ఞాన భరితమైన ప్రసంగములు శ్రోతల మనసుల నలరించినవి.

విదేశ యాత్ర లొనరించి అచ్చటి సంస్కృతిని పరిశీలించి వచ్చినారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ఏర్పరచిన స్వర్గీయ నాళం కృష్ణారావుగారి సంస్మరణ వార్షిక సన్మానాన్ని ఉత్తమ రచయిత్రిగా పొంది సాహిత్య అకాడమీ వారిచే గౌరవింపబడినారు.

అగ్నిపుత్రి

ఈ కవయిత్రి యొక్క సుమధుర లేఖిని నుండి వెలువడిన ఖండకావ్యము "అగ్నిపుత్రి". అగ్నిపుత్రి యని నామమిడుటలోనే కవయిత్రి మనోభావము వ్యక్తమగుచున్నది. అగ్నియెంత నిర్మలమైనదో, ఎంత ధగధగమండునో, అట్లే అగ్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పుత్రి మనసు నిర్మలమైనది. సమాజమునందలి లోపములను చూచినపుడు అగ్ని వలెనే భగభగమని మండును.

'అగ్నిపుత్రి' కావ్యానికి కవయిత్రి తానే స్వయముగా 'అంతరంగావిష్కార' మొనరించి తన మనసులోని మాట వ్రాసికొన్నది. ఆమె అన్నట్లుగా ఆమెది విశ్వ విద్యాలయానికి అంకితమైన మేధోజీవితము. ప్రశ్నలూ, పరిశోధనలూ, విమర్శలూ, మరల వానికి తగిన ప్రత్యుత్తరాలు కూర్చుట అన్నీ ఆమెకు కరతలామలకాలు. ఇక అట్టివారి కవితను వేరొకరు సమీక్షించుట అనవసరము. తన కావ్యాన్ని గురించి ఆమె వ్రాసిన మాటలు ఆమె అంతరంగానికి అద్దంపట్టి చూపునట్లున్నవి. ఆమె నిండు మనము నవ్యనవనీతము వంటిది. అందుకే ఆమె కవిత నిండా మనుష్యుల మీద మమత ఉన్నది. ఆమె కవిత్వం దుఃఖంలోనుండి వచ్చినది కాదని, కన్నీళ్లు తన కవిత్వానికి ప్రాణాధారం కావని తెలిపినది. తన కవిత్వాన్ని గురించి ఇట్లు చెప్పినదీ కవయిత్రి :

ప్రతినీటి కణంలో తోచే
ప్రభాకర ప్రతిఫలనంలాగా
నా కవిత్వమంతటా
నమ్మకం అక్షరమై మెరుస్తుంది.

అని తన ఆత్మవిశ్వాసాన్ని వెల్లడి చేసినది.

ఆధునిక యుగపు కవిత్వ శ్రేణికి చెందినది వీరి రచన. లోకములో మానవు లే భాషలో పరస్పరము కష్టసుఖములు చెప్పుకొందురో ఆ భాషకు సన్నిహిత మగు భాషలో కావ్యము రచింపవలెననుట ఆధునికుల సిద్ధాంతము. కవికిని, సహృదయునికిని నడుమ నడచు ఒక అపూర్వమైన సంభాషణ భావకావ్యమను పేరున నిలిచినది. ఇందు వ్యర్థపదములకు, అప్రసిద్ధ పదములకు తావుండదు. శబ్దము సజీవమై యుండి, కవి భావమును వ్యక్తము చేయును. స్వేచ్ఛాప్రియులైన ఆధునిక కవులు ఛందస్సును వ్యతిరేకించిరి. ఛందస్సు లక్షణానుగుణముగా కూర్చిన దాని కన్న భావానుగుణముగా ఉండవలయునని వారి ఆశయము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ కవయిత్రికికూడా కవిత్వమంటే జీవితమనీ, అనుభవాల తామర తంపర అనీ, విశ్వాసమున్నది. కవిత్వమంటే సర్కస్ ఫీట్ల సమామ్నాయము కాదు అని చెప్పినది. చెప్పదలచుకొనిన విషయాన్ని సూటిగా గుండెకు తగిలేటట్లు చెప్పడము తన కిష్టమని తెలిపినది. డొంక తిరుగుడుగా చెప్పే ఆసక్తి ఆమెకు లేదు. తన మనసులోని ఊహలను భావంగా రూపాంతరం చెందించి ఆనందించుట ఈ కవయిత్రి పద్ధతి. కాని భావాలకు ఆశ్రయభూతాలైన శబ్దాలను కూరగాయలను ఎంపిక చేసినట్లు చేసి కవితా రచన చేయదు. పాఠకులకు అర్థంకాని శబ్దాలకొరకు నిఘంటువుల నాశ్రయించి వెదుకుట ఆమె కిష్టంకానిపని. "అట్లయినచో అందంగా అలంకరించుకొని వయ్యారాలు పోయే శబ్దాలు మాత్రమే గోచరిస్తాయి కాని కవిత్వము కనుపించదు. కవి శక్తివంతముగా చిత్రింప దలచుకొనిన భావము కనుపించదు" అని కవయిత్రి ఉద్దేశం. అందుకే ఆమె కవిత సమాజములోని ప్రతి అణువునూ తాకి, ఆవేదన, ఆరాధన, ఆత్మీయత, అన్నీ కలగలుపుకొని మృదులమైన భావ స్ఫూర్తితో నిండియున్నది.

ఈ కావ్యాన్ని తన పితృదేవులైన మహాకవి నాయని సుబ్బారావుగారికి, వారి ఎనుబదియవ జన్మదిన సందర్భమున, ఆశ్వయుజ బహుళ దశమినాడు అంకితమొనరించినది. ఇందుగల ఖండికలన్నియు విలక్షణమైన శీర్షికలతో కూర్చబడినవి. 1951 నుండి 1978 వరకు అప్పుడప్పుడూ రచించిన 27 ఖండికలు ఇందు పొందుపరుపబడినవి. రిక్తసాధన, కందుక కేళి, సుప్తమందిరం మున్నగు విశిష్టమైన పేర్లతో రచింపబడిన ఖండికలు ఈ కావ్యమునకు అలంకార ప్రాయములై ఉన్నవి. ఈ ఖండికలలో కొన్నింటిని పరిశీలించుచున్నాను.

సుప్తమందిరం :

ఈ కవితలో మనః కాసారాంతరంలోకి మరుద్వేగంతో దూసుకుపోయి సుప్తగాథల అట్టడుగున గుప్తంగా దాచుకోచూచిన భగవంతుని రూపాన్ని వర్ణించుటతో పాటు, మనసు నిండా చుట్టుకొన్న మధుర సంగీత తరంగ మూర్తి కొరకు తీయని ఆర్తితో వేదన చెందుచూ మనసు అడుగు పొరల లోపల గుడి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కట్టుకున్న భక్తుని రూపుకూడా వర్ణించబడింది. అయస్కాంత శిలాశక్తివంటి చూపు గలిగిన భగవంతుని దృష్టిని కవయిత్రి ఇట్లు వర్ణించినది:

నీ చూపుల్లోని
　　అయస్కాంత శిలాశక్తిని
నిద్రలేపి
　　అతిసామాన్యంగా మోగే
హృదయ తంత్రుల్ని
　　నిస్తంద్ర మోహనంగా
నీవైపుకు లాక్కుంటున్నావు.[1]

గొంతులోనుంచి
　　సుంతైన వెలికి పెగలని
మాటలనిండా
　　నా మనస్సు నేనింపి
నిర్విరామంగా నీ చుట్టూరా తిప్పుకొంటున్నావు.[2]

భగవంతుని చేరడానికి తాను ఏడుకొండలు ఎక్కి, ఏవేవో దాటి రాలేనని, తన నట్టు రమ్మనవద్దని, చులకన చేయవద్దని పలికే భక్తుని మొరనిట్లు తెలిపినదీ కవయిత్రి:

నిన్ను పట్టుకోడానికి
　　ఏడుకొండలూ ఎక్కిరమ్మనకు
సప్తసముద్రాలూ ఒక్క
　　లిప్తలో ఈది

---

1. అగ్నిపుత్రి - సుప్తమందిరం - పుట 1.
2. అగ్నిపుత్రి - సుప్తమందిరం - పుట 2.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అడవులూ, అఘాంతరాలూ
        అడ్డంవస్తే దాటిరమ్మనకు
నా కళ్లకు గంతలు కట్టి
        కడగండ్ల పాలు చేసి
కవ్వించకు
        నన్ను చులకన చేయకు.

ఆశా జీవియైన ఈ కవయిత్రి ఎన్ని ఆటంకాలు కలిగినా తన మనసులో అతనికి గుడికట్టి, తలిరాకువంటి మెత్తని మనసుతో 'సుప్తమందిరం'లో నుండి చూచినది.

ఎన్నటికీ చావని
        నా ఆశలు అప్సరసలు
కఠిన శిలల్లో సైతం
        కదలికలు కలిగించగల
గిలిగింతలు
        నీ ఉనికిని నిర్దాక్షిణ్యంగా
శాసించగల
        ఇంద్రజాలిక హస్తచామరాలు

తన మనసు అడుగు పొరలోపల గల అతనికి ఇంద్రజాలిక హస్తచామరాలతో సేద దీర్చింది. ఈ కవిత 1971 లో విశ్వ రచనలో ప్రచురించబడింది.

నేనూ - సముద్రం :

1970 లో భారతిలో ఈ కవిత ప్రచురించబడింది. విశాఖలోని నిశ్చల సాగర తీరంలో బాల్యజీవితాన్ని గడిపిన కవయిత్రికి సముద్రంపై ఎంతో మక్కువ. అద్భుతంగా కదిలే అపార పారావారాన్ని ఎంతో అపూర్వంగా వర్ణించింది. నిరంతర, తరంగతాడిత నిశ్చలసాగరతీరంతో తనను పోల్చుకొని తత్తర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పడిపోతుంది. "కవి తన చుట్టూ ఉన్న పరిసరాలతో అనుభూతిని పొంది కవిత వ్రాయాలని" అన్న వాక్యానికి ప్రతీకగా ఉంది నేనూ - సముద్రం.

తనలో కదిలే కాంక్షలను నిర్విరామంగా కదిలేకడలితోనూ, వాటిని సహించ లేని తనను సైకత తీరంతో పోల్చుకొని రమ్యంగా వర్ణించింది.

కాంక్ష కల్లోలమై
  మనస్సులో పొరల లోపలి
అపార పారావారాన్ని
  అద్భుతంగా కదిలిస్తోంది
నిర్విరామ కాంక్షా తాడనాన్ని
  సుంతైనా సహించలేని -
నిరభిమాన సైకత తీరాన్నిగా
  నిలిపి భయపెడుతోంది.[1]

అని సముద్రాన్నీ - తననూ పోల్చి చూచుకొన్నదీ భావుకురాలు.

అగ్నిపుత్రి :

ఈ కావ్యానికి 'అగ్నిపుత్రి' అను పేరు కవయిత్రి ఎందువలన ఉంచిందో ఈ అగ్నిపుత్రి కవితవలన తెలియును. ఆ అగ్నిపుత్రి కన్నులలో కోర్కెల మందారాల కోరగింతలు లేవు. మనోగగనాన ఆశల హరివిల్లులు లేవు. ఎర్రతేలు పిల్లలవలె, ఎఱ్ఱగా మెరుస్తూ ప్రాకే నలికల త్రాచువలె ఉండే మానవులను చూచి సన్నని చీకటిపొర నిండుతుంటే ఎర్రగా, మత్తుగా దిగజారుతూ ఆర్భటించే ఆకాశంలాగ అతి భయంకరంగా ఉన్నది ఆమె మనసు. అందుకే ఆమె మనో గగనంలో లేచే మంటలనిట్లు తెలిపింది:

చిట్టచివరి కాంతి రేఖను సైతం
కనుమరుగు కానీక
కసుగాట్లు కరిచే
అస్తమిత సంధ్యా-

1. అగ్నిపుత్రి - నేనూ సముద్రం - పుట 6.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుపితారుణ ముఖరాగ
ప్రతిరూపాలై
లేచే మంటలు
నా మనోగగనాన.[1]

ఆవేదన, ఆగ్రహం మేళవింపబడిన ఈ కవిత భారతి సంచికలో 1970లో ప్రచురింపబడినది.

దూరపు కొలత :

అందిన అవకాశాలను నిర్లక్ష్యంచేస్తూ, అందని వానికొరకు అర్రులు చాస్తూ ముందుకు నడిచే తత్వంగల కొందరు మానవులను కవయిత్రి అన్యాపదేశంగా అధిక్షేపించింది. కవితలోని ప్రతి చిన్న భాగానికి చివర 'ఎందుకనీ' అని కవయిత్రి ప్రశ్నించిన తీరు ముందుకు పరుగులెత్తజూచేవారిని అట్టే స్థిరంగా నిలుపుతున్నది. తిరిగి తన ప్రశ్నకు తానే బదులు చెప్పింది కవయిత్రి. కోరుకున్న వస్తువు అరుదుగా దొరికితే చిక్కనైన ఆకర్షణ చిరకాలం నిలుస్తుందని తెలిపింది. ఆమె ప్రశ్నించిన తీరు ఎంత అందంగా ఉన్నదో, బదులు పలికినతీరు కూడా అంతే రమ్యంగా ఉన్నది.

చుట్టూ లెక్కలేనన్ని నీటి పడియలుండగా, ఎక్కడో దిక్కుల చివళ్ళ ఒక్కటే హోరెత్తి తెరలే అనంత పారావారం మాత్రమే అంతగా నిన్నాకర్షిస్తుందెందుకనీ, అని ఇట్లు ఎన్నో ప్రశ్నలు వేసింది. కోకిల గొంతుకోసం అలమటించే భావుకుణ్ణి ఇలా ప్రశ్నించింది:

ఏడాదికోసారి వచ్చే వసంతంలో
గొంతు విప్పే కోకిలమ్మనే
వినాలని నీ కెందుకనీ

1. అగ్నిపుత్రి - పుట 7.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీ చుట్టూ ఎన్నెన్ని జీరంగులు
మరెన్ని మదించిన తుమ్మెదలో
ఝుమ్మంటూ నదిస్తున్నా.[1]

విరిసిన రోజాలను నిర్లక్ష్యంచేసి, అరుదుగా విరిసే నీలికొండల గోరింటల కోసం కలవరించేవారినిలా ప్రశ్నించింది:

అరుదుగా అందంగా విరిసే
నీలికొండల గోరింటలకోసం
కలవరించే వెందుకనీ !
నీ చుట్టూ రోజూ పూస్తున్న
రోజాలను సైతం
నిర్లక్ష్యం చేస్తూ !

తనచుట్టూ ఎన్నో అందమైన వస్తువులు తేలికగా లభ్యమౌతున్నాకూడ అరుదుగా లభ్యమయ్యే వానిపైన చిక్కనైన ఆకర్షణ పెంచుకొనే మానవ మన స్తత్వం ఈ దూరపుకొలత అనే కవితలో స్ఫురిస్తుంది. అరుదుగా లభించే వాని కొరకు ఎందుకు అంతగా అంతరంగంలో అనురాగం పెంచుకుంటావు? అని కవ యిత్రి ఎన్నో ప్రశ్నలువేసి, పిదప తానే బదులు చెప్పింది.[2]

నీకూ నీ కోరికకూ మధ్య
ఎంత ఎక్కువైతే దూరం
అంతగా పెరుగుతుంది
అంతరంగంలో రాగం

1. అగ్నిపుత్రి - దూరపుకొలత - పుట 15.
2. అగ్నిపుత్రి - దూరపు కొలత - పుట 16.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆస్తి పెరగడానికి
అదొక కారణం
వింతకాంతుల్తో
కాంక్ష వెలగటానికి అదే కారణం.
అందుకే
అన్ని కొలతల్లోకి
ఎన్నికైన దొక్కటే
అదే దూరపు కొలత.[1]

అని అపురూపంగా లభ్యమయ్యే వస్తువుయొక్క విలువనూ, దాని కొరకు అలమటించే మానవ మనస్తత్వాన్నీ వెల్లడిచేసిందీ కవయిత్రి. అంతేకాక, మానవునికి, అతనికి పిల్లలపట్ల కూడా పనికివచ్చే నిజమైన నీతిని ఇట్లుపదేశించింది:

అక్కరలేనంత దగ్గరలో
అమృతాన్నయినా చేరనీయకు
కావలసిన దానికంటే ఎక్కువగా
కామితఫలాన్ని
ఒడిగట్టి చూడకు.[2]

మనసు చిలక :

కవయిత్రి వర్ణించిన ఈ మనసు చిలక ఎవరో కాదు- భగవంతుడే! ఆమె గుండె గూడులో గొంగళిపురుగులాగ ముడుచుకోవాలని ప్రయత్నించిన వాడు. ఎక్కడో ఏడుకొండల ఎత్తున ఒక్కడే ఉండి అందకుండా ఉన్నవాడు. ఒకసారి జ్వాలవలె భయాన్ని కొలుపుతూనే అందంగా కనుపిస్తాడు. మరొకసారి ముట్టుకుంటే వేళ్లను కాలుస్తాడేమోనన్నట్లుగా కనిపించి, మనసును మరింతగా ఆకర్షి

1. అగ్నిపుత్రి - దూరపు కొలత - పుట 17.
2. అగ్నిపుత్రి - దూరపు కొలత - పుట 18.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్తాడు. అతడు లేకున్న ఆమె బ్రతుకంతా కాటుక పట్టిన కత్తిపలె చీకటిగా మారి పోతుందని తన మనసు చిలకతో మాట్లాడుతున్నదీ కవయిత్రి.

మంచుతుప్పర నుండి
మహా సముద్రం దాకా
అన్నింటిలోనూ ప్రతిఫలించే
అరుణకిరణ ప్రసారంలాంటి
నువ్వు నువ్వే లేకపోతే
నా బ్రతుకంతా
కాటుక పట్టిన కత్తికాదూ!
ఎక్కడో ఏడుకొండల ఎత్తున
ఒక్కడివై అందనంటావా
అయినా నువ్వు నా ప్రేమవే కావూ![1]

అని ఆప్యాయంగా పలకరించింది.

గాలి పిడికిలి :

సూర్యకాంతికి పరావర్తనం నేర్పే అపూర్వమైన రూపం కొరకు, గాలి కౌగిలికి చల్లదనాన్ని పులిమే అమేయ స్పర్శ కొరకు గాలిలో పిడికిలి విసిరిందీ కవయిత్రి. ఎక్కడో ఉన్న భగవంతుని అనురాగాన్ని అందుకొన్న ఆమె గుండె కదలిపోయినట్లు తెలిపింది కవయిత్రి.

ఎక్కడో ఉన్న నువ్వు
ఇక్కడ నా గుండె కదలికకు
లయను నేర్పిస్తూ
నా ఊర్పువే నీపై

1. అగ్నిపుత్రి-మనసు చిలక-పుట 22, 23.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పల్చని పరిమళాన్ని
ఊహలన్నింటికీ పంచిపెడుతూ
ఉన్నాడని భగవంతుని గూర్చి పలికింది.

ఎన్నో యుగాలుగా రాళ్లూ రప్పలూ, నీళ్లూ, నక్షత్రాలూ, కాంతికదలికా అన్నింటిలో పల్లవించిన, భగవంతుని రూపాన్ని -

ఎన్నటికి పట్టుకోలేనా నేను, అని అంటూ
పట్టుకోసం అతని వైపుకు
పదే పదే కదిలే చేతులు.[1]

గాలిలోకి విసిరింది. కొంటె నవ్వులు రువ్వుతూ ఉండే స్వామిని, గుండె గుడిలోపల దీపంగా ఉంచింది.

రిక్త సాధన :

ఈ కవిత కూడా కవయిత్రి భగవంతుని కొరకు పడిన వేదననే వివరిస్తున్నది. భగవంతుని దాపునే ఉండి అందుకోలేక, అతనిని ప్రతిక్షణమూ తలపోసి తన తలపుల చిక్కదనాన్ని కొలుచుకొని, రిక్త సాధన తప్పించి, ఏమి సాధించాను అని ఆరాట పడుతున్నది కవయిత్రి. చికిలీ చేసిన చిరుకత్తుల వాదరల వంటి చూపులతో భగవంతుని ఇట్లు పరిశీలించింది:

నన్ను తప్ప
ప్రతికళ్ల జతనూ పలకరిస్తున్న
నీ అమృత నిష్యంది
దృగ్రేఖను అందుకోలేని
అసమర్థపు వ్యగ్ర రేఖలు.[2]

1. అగ్నిపుత్రి - గాలిపిడికిలి - పుట 28.
2. అగ్నిపుత్రి - రిక్తసాధన - పుట 39.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని తన చూపులను నిందించుకొన్నది. మనఃఫలకం మీద పల్చని మంచుపొరలు క్రమ్మగా :

మసక మసకగా
కలగలుపుగా
ఎర్నోరంగులు విరుస్తూ వ్యాపిస్తూ
ఎగసిపడుతున్న గుండె.[1]

కలిగిన కవయిత్రి "నీదాపునే ఉండి, నిన్నందుకోలేనని" భగవంతుని కొరకు అలమటించింది.

కందుక కేళి :

భగవంతుని గురించి కవయిత్రి మనఃకాసారంలో అనేక సందేహ తరంగ వలయాలు. ఆమె మనసొక బంతివలె భగవంతుని చేతుల్లో పడుతూ, లేస్తూ ఉంది. అదే కందుక కేళి అతన్ని ఆరాధిస్తూ, తన బ్రతుకు విడిపోని వికట గ్రంధిగా మారినపుడు విప్పమని దీనంగా కోరుతూ, పిలిచింది.

ఈ బ్రతుకులో
విభ్రమించే అస్పష్టోహలు
నీవు గాలిలో చెక్కిన అక్షరాలై
ఎన్నో సందేహ సూచక
హస్తచాలనాలకు
అర్థాల్ని వెతుక్కుంటూ
ఆరాధిస్తూ.[2]

అతని అడుగు కొనకేలి స్పర్శలో ఫలితాన్ని వెదుకుతూ చూచింది. తనను చూస్తే అతనికి ఆట అని ఉడికిపోయింది.

---

1. అగ్నిపుత్రి - రిక్తసాధన - పుట 39.
2. అగ్నిపుత్రి - కందుకకేళి - పుట 40.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పైన వివరించిన కవితలలో సుప్తమందిరం, మనసు చిలక, గాలి పిడికిలి, రిక్తసాధన, కందుక కేళి అను వీనిలో కవయిత్రి కనరాని భగవంతునికొరకు - అలమటించిన విధము కానవస్తున్నది. ప్రాచీన కవులు, కవయిత్రులు కూడా ఎందరో భగవంతుని కొరకు అలమటించి ఇటువంటి రచన లొనరించినారు. ఒక విధమైన మధురభక్తి, సఖ్యభక్తి వీనిలో కనుపించును. నేను పరిశీలించి వ్రాసిన "ఈ భగవంతుడు, భక్తుడు" అను విషయాన్నే కవయిత్రి తన భావనలో ఒక అతీత శక్తిగా ఊహించి వివరించినది.[1] ఆమె పడక గదిలో గల విష్ణువు బొమ్మ ఎప్పుడూ ఆమెను చూచి చిరునవ్వు నవ్వుతూ, ఆమె మనసు చివుకుమన్నపుడు లాలించి సేద దీరుస్తుంది అని వ్రాయుటలో కూడ కవయిత్రి ఎంత ఆధునిక కాలపు మార్పును ఆహ్వానించినప్పటికినీ, ఆమె మనసులోని అట్టడుగు పొరల్లో అతీతమైన శక్తి అనిపించే భగవంతునిపై నమ్మకము కలదని తెలియును.

జీవితానుభవాలనూ, సారస్వతానుభూతులను మేళవించి మనసులో పండించు కొనిన ఈ కవయిత్రి హృదయంలో మానవతా భావము చాల ఎక్కువగా ఉన్నది. అందుకే ఆమె తన కవిత్వాన్ని గురించి "అరవిరిసిన మొగ్గలోపల మరంద నిష్యం

---

1. అగ్నిపుత్రి - నామాట

పూర్తిగా ఒక శక్తి విషయంలోనో, మూర్తి విషయంలోనో నేను ఖచ్చితంగా ఉండలేకపోతున్నాను. ఎంత హేతువాద బద్ధంగా ఆలోచిద్దామన్నా ఒక అతీత శక్తికి సంబంధించిన 'స్పృహ' ఒక కాల్పనిక మూర్తి నన్నడగకుండానే నా మెదడులోకి జొరబడిపోతుంది. నా గుండెను ఆక్రమిస్తుంది. అందుకు నా తల్లీ తండ్రీ నాకు అందించిన కౌటుంబిక నేపథ్యం కారణం కావచ్చు. అప్పుడే నేను సుప్త మందిరాలను నిర్మించుకొంటాను. గాలిపిడికిళ్ళు విసురుతాను. మనసుని చిలకనిచేసి మాట్లాడిస్తాను. రిక్త సాధనలూ, కందుక క్రీడలూ, సహన శిఖలూ, అన్నీ అటువంటి సందర్భంలో అవతరించేవే.

డా॥ నాయని కృష్ణకుమారిగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దంలాగా, నా కవిత నిండా మనుష్యుల మీద మమత, నేను వేరు- లోకం వేరని ఎన్నడూ నా కవిత నన్ను అందల మెక్కించదు, నన్నూ ఈ లోకాన్నీ ఒక్క క్షణం విడిగా బతకనివ్వదు"[1] అని చెప్పుకొన్నది. ఆ విషయం ఆమె, ఇతర కవిత లగు 'రాళ్ళూ-పిచ్చివాళ్లూ', నిత్య దుఃఖిత, మట్టిమనిషి, నిప్పులచెండు, ఎక్కడిది కదులుతున్న అగ్ని, అనువానిలో దర్పణం పట్టి చూపినట్లు కనుపించును.

నిత్య దుఃఖిత :

ఈ కవితలో కవయిత్రి దేశంలో ఆకలితో అలమటించే వారిని, కష్టాలూ కన్నీళ్ళతో కలిపి చేసిన మామూలు మనుషులను చూచి అలమటించును. తన దేశాన్ని గురించి ప్రాచీన కవులు ప్రస్తుతిస్తూ వ్రాసిన కవితలను చదివి దేశాన్ని నిజంగానే రత్నగర్భ అని తలచి కలలు కన్నది. కాని అనాదినుంచీ కరడుగట్టు కొన్న దుఃఖాన్ని కరిగించి, జాలిగా రాగాలు తీస్తున్న దేశాన్ని గాఢ సుషుప్తిలో సైతం కలవర పెట్టే కన్నీటి అలలు చూడగానే కవయిత్రి కదలిపోయింది.

ఆకారం అందీ అందక
    అహర్నిశలా వేధించుకు తినే
గోరువెచ్చని కోరికలాంటిది నా దేశం
    నా దేశాన్ని గురించి
నా కెన్నో కలలు
    గాఢ సుషుప్తిని సైతం
కలవర పెట్టే కసపైన కన్నీటి అలలు
    నా కలలో నా దేశం
నా బహిశ్చర ప్రాణం
    ఎప్పుడూ ఏడుపు మొహంతోనే
ఎదురౌతుంటుంది.[2]

అని వేదన చెందింది ఈ కవయిత్రి.

---

1. అగ్నిపుత్రి - నా మాట - డా. కృష్ణకుమారి.
2. అగ్నిపుత్రి - నిత్యదుఃఖిత - పుట 35.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విశాఖ నా నెచ్చెలి :- ఈ కవిత ఎంతో హృదయంగమంగా ఉన్నది. తమ ఆత్మీయులైన వారిని గురించి చెప్పుకొనునప్పుడు వ్యక్తి ముఖములో కలిగే ఉత్సాహమూ, మాటల్లో కదలాడే మధురానుభూతులూ ఈ కవితలో కొట్టవచ్చి నట్లు కనిపిస్తున్నవి. సాగర గంభీర మనస్కయైన ఆ కవయిత్రికి సాగరం పైననూ, సాగరతీరానగల విశాఖపైననూ అమితమైన ప్రేమ అని ఈ కవిత చెప్పును. తన పాతికేళ్ల అనుభవాల - పరవళ్ళ హోరు విశాఖను క్రమ్ముకొనే కొండగాలి ఈలల్లో కలిపి ఆనందించిందీ కవయిత్రి. అక్కడే ఆమె విద్యాజీవితం ఎక్కువగా గడిచినట్లు-

ఇక్కడ విద్యా గంధాన్ని
చిక్కగా అలముకొన్న నేను
ఇప్పటికీ పరిమళిస్తూ
మీ ఎదుట నిలచి.[1]

అను వాక్యం వలన తెలియుచున్నది. అక్కడే ఆమె జీవిత పాఠాలన్నీ నేర్చింది.

ఈ అవనీ ఉత్సంగతలాన
ఆడుకొంటూ పాడుకొంటూ
అలవోకగా నేర్చుకొన్నాను
అతి చిక్కని జీవిత పాఠాలు.[2]

మనుష్యులను మమకారంతో గెలుచుకోవడము విశాఖ ఆమెకు గురువు. పాతికేళ్ళ క్రింద విశాఖ ఎంతో అందంగా ఉండేదట. పసిపిల్ల చేయెత్తి పిలిచి నట్లు పరమ రమణీయంగా ఉండేది. అంతేకాక-

ఆలోచనకు అందని యెత్తున
అతి స్వచ్ఛంగా మెరుస్తూ కవ్విస్తూ

---

1. అగ్నిపుత్రి - పుట 51.
2. అగ్నిపుత్రి - పుట 52.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరమ శివ జటానిబద్ధ శశిరేఖ
అలనాటి విశాఖ.[1]

కవయిత్రికి విశాఖలో గడిపిన స్మృతులు చెరపరానివి. 'కర్పూర గంధస్థగిత నిర్భర మరుద్వీచికలా' ఆమెను చల్లగా చుట్టుకొని ఉన్నవి. కాలం గడిచిపోయి నీలి తెరలు పెరిగిపోయినవి. ఆ నీలి తెరలే-

భవనాలై రాజమార్గాలై
కిటకిటలాడే
అశేష జనసందోహ సంభ్రమాలై
అడుగడుక్కూ అడ్డం వస్తూ
అగమ్య గోచరంగా ఇప్పుడు.[2]

నానాటికీ పెరిగిపోయే నాగర జీవన వైఖరి కవయిత్రికీ, విశాఖకూ మధ్య చిక్కని మాయా వారణం వలె నిండి, విశాఖ ఆత్మను పోల్చుకోనీయని విధంగా మారిపోయిందని కవయిత్రి వేదన చెందినది. తన నెచ్చెలియైన విశాఖతో ఆమెకెంత పటిష్ఠమైన సంబంధం, అనురాగం ఉందో ఈ కవిత వలన తెలియుచున్నది.

కదులుతున్న అగ్ని : ఈ కవిత చదువగానే 'కవయః క్రాంతదర్శినః' అన్నమాట కవయిత్రి నిజం చేసిందా అన్నట్లు స్ఫురించును.

అమ్మో
అమ్మ పడిపోయిందా
హుందాగా పొందిగ్గా ఉండే

---

1. అగ్నిపుత్రి - పుట 53.
2. అగ్నిపుత్రి - పుట 54.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మా అమ్మేనా పడిపోయింది
అమ్మో ఏమయిందేమయింది.[1]

ఎంత సహజత్వమున్నది ఈ కవితలో. తల్లి మరణించి పడగానే "అమ్మో, అమ్మో" అని విలపించే పిల్లలు కళ్ళనిండా కనుపిస్తున్నారు.

కవయిత్రి దేశమాతను సంబోధిస్తూ ఒక దశాబ్దానికిముందే 1974లో ఈ కవిత రచించింది. కాని ఇది 1984లో జరిగిన "అమ్మ" హత్యను గూర్చిన కవితవలె నవ్యత సంతరించుకొని ఉన్నది.

రక్తపు మడుగులో మునుగుతూ
రేకులు మణగిన ఎర్ర తామర
తెగబారెడు తలకట్టుతో
నాచు చుట్టుకొన్న నళినీరూపం.[2]

ఈ కవితలో కవయిత్రి హృదయావేదన ఎంతో కనిపిస్తున్నది.

అయ్యో ఆ పడిపోయింది
ముమ్మాటికీ మా అమ్మేనా
అమ్మో వీళ్ళు విసరిన రాళ్ళకేనా
నుదురు చిట్లి రక్తం గూడుకట్టింది
ఎదకు పెద్ద దెబ్బే తగిలి
కమిలి క్రక్కదలిపోయింది.
అమ్మ పడిపోయింది.[3]

---

1. అగ్నిపుత్రి - కదులుతున్న అగ్ని - పుట 63.
2. అగ్నిపుత్రి - కదలుతున్న అగ్ని - పుట 63.
3. అగ్నిపుత్రి - పుట 64.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పడిపోయిన తల్లి కొరకు ఆ బిడ్డ హృదయం ఎంతో కరుణరస భరితముగా విలపిస్తున్నది.

జరగరేమర్రా
కాస్తంత అవతలకు పొంది
ముఖంమీద పడుతున్న
ముంగురుల్ని సవరించనీయండి-
కళ్ళు తెరిచే వేళకు
చూపాన నిస్తాయో లేదో
పొడారిపోయిన గొంతుకలో
చిట్టెడు నీళ్ళు జారనీయండి
వావిడిచి ఏమన్నా
వివరిస్తుందో ఏమో.[1]

కన్న బిడ్డల కరుణ రసభరిత విలాపమును విన్నది అమ్మ. మెల్లగా తెప్పరిల్లింది.

చూపుల్లో అగ్నిని కదలిస్తూ
అరాచకాన్ని దహిస్తుంది
చీకటి మాటున గజగజలాడే
ఆశకు ఆలంబనమిస్తుంది
విశ్వాసపు కాంతి రేఖల్ని
విశ్వమంతా వెదజల్లుతుంది
శాంతిని పావురంగా మార్చి
తెలరెక్కల్ని మురిపెంగా దువ్వుతుంది
అమ్మ కదలాడుతోందరా
అగ్ని కదలాడుతోంది.[2]

1. అగ్నిపుత్రి - పుట 65.
2. అగ్నిపుత్రి - పుట 66, 67.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వభావోక్తితోకూడిన ఈ 'కదలుతున్న అగ్ని' కవిత ఎంతో హృద్యంగా ఉన్నది. సామాజిక స్పృహను తెలియపరుస్తుంది.

ఊడల మర్రి : ఈ కవిత ఎంతో కరుణరస భరితముగా ఉన్నది. జంటపక్షుల ప్రేమానురాగాలూ, వాని అనురాగపు పంటయగు ఇద్దరు పిల్లల ముద్దుమురిపాలూ, విధివశాన తండ్రి పులుగు ఆకస్మిక మరణం, ఆడ పిట్ట ఆరాటము, పిల్లలు తల్లడిల్లుట అన్నీకూడా సహృదయుల మనసును ఆవేదనా భరిత మొనరించును. తన ప్రాణమిత్రురాలికి జరిగిన అన్యాయాన్ని కవయిత్రి పక్షి జంట రూపంలో వర్ణించినది. ప్రేమానురాగాలకు నిలయమైన ఆ జంటకు కలిగిన ఎడబాటును చూచిన కవయిత్రి హృదయమున కలిగిన ఆరాటమే ఈ కవితగా రూపొందినది.

నీడలు పరచి నిలిచిన ఊడలమర్రి ఒడిలో మక్కువ పెంచుకొని చిలకా, గోర్వంకా చేరినవి. ఈడుజోడూ కుదిరిన ఆ పులుగులకు ఆటపాటలతో బ్రతుకును పెంచుకొనే రసజ్ఞత ఉన్నదని కవయిత్రి ఇట్లు చెప్పినది:

పనిచేస్తూ పాట పాడుతూ
పడుకోబోతూ రాగం తీస్తూ
ప్రశ్నలనన్నిటి పాటలచేసి
బదులు జవాబుల రాగం కూర్చి
బ్రదుకు పల్లవిని పెదవుల మీదే
పదేపదే కదిలించు రసజ్ఞులు.[1]

ఎండవానలూ, కష్టసుఖాలనూ అన్నింటినీ నచ్చేటి పరవశమైన చిత్తం గలిగినది ఆ జంట. ఆ జంటకు ప్రకృతిలోని అన్ని వస్తువులూ ఇష్టమే.

చంద్రుడు ఇష్టం చీకటి ఇష్టం
శబ్దం ఇష్టం శూన్యం ఇష్టం

1. అగ్నిపుత్రి - పుట 73.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిండి ఇష్టమే వస్తులు ఇష్టం
ఇష్టంలేనిది ఇంత సృష్టిలో
ఇసుమంతైనా దొరకని జీవులు
ఈసడింపనున దెరుగని ప్రాణులు.[1]

ఆ జంట నోచిన పంటవలె రెండు మొలకలు తలలు చూపినవి. తండ్రికి ఊపిరిగా, తల్లికి స్వర్గంగా భావించుకొన్నారు ఆ పిల్లల తల్లిదండ్రులు. విధి పగ వట్టినట్టి ఆ పాపలకు కష్టం ఎదురైంది.

మేతకోసం గూడు విడిచిన ఆ తండ్రి పులుగుకు తన కథ ఇక ముగియ నున్నదని యేమి తెలియును? ఇల్లు దాటుచు వీడ్కోలిచ్చినాడు కానీ తిరిగివచ్చుట అన్నది ఈ జన్మలో పొసగని పని యని తెలియదు.

కాలం బెబ్బులి పంజా దెబ్బకు
లేడిపిల్లవలె నేలకరిచెనూ
కాలం పెనుసుడిగాలి పాటులో
పండుటాకువలె కొట్టుకుపోయెను
కాలం రక్కసి కరకు కోరలకు
ఒక్కమానిపై చిక్కిపోయెనూ
కాలం జారి వలను విసరగా
చేపపిల్లవలె ఊపిరి విడిచెను.[2]

తండ్రి పక్షి కనుమూయగనే అమ్మ కన్నులు వాయగా యేడ్చింది. అమ్మ ఆటపాటలన్నీ మరచిపోయింది.

పాట మరిచెను ఆట మరిచెను
వెన్నెలో మరి వానజల్లో

1. అగ్నిపుత్రి - పుట 74.
2. అగ్నిపుత్రి - ఊడలమర్రి - పుట 76

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎండ వేడో వెండి మబ్బో
ఎట్టి భేదము లెరుగనేరక
వట్టి శూన్యములోన బ్రతికెడి
అమ్మ కన్నులు నీటి చెలమలు.[1]

అమ్మకోసం అలమటించే ఆ పిల్లలను ఆకుల వీవనలతో విసరి ఊడల మర్రి తల్లి పిల్లల తరగని దుఃఖాన్ని చూచి గుండెలో నిండుగా మంటల పొలకువతో, మానని గాయంతో నిలచింది. ఎంతటి కఠిన హృదయులైనా ఈ గేయము చదివినపుడు కంట తడిపెట్టకమానరు. కరుణ రస ప్లావితమైన ఈ గేయ కవిత కవయిత్రిలోని మానవత్వాన్ని నిరూపిస్తున్నది.

ఈ ఖండకావ్యంలో కవయిత్రి హృదయములోని మానవత్వం, విప్లవాత్మకత, అనురాగాలకు ప్రతీకలుగా ఎర్రని వస్తువులు ఎక్కువగా వర్ణింపబడినవి.

ఎర్రటి సాంధ్యరాగం, ఎర్రటి మంటలు, నిర్గంధబంధూకాలు, ఎర్రతేలు పిల్లలు, అరుణకిరణ ప్రసారాలూ, జ్వాలలు, కావిరంగు, పిశంగవర్ణబంధం, ఎర్రమట్టి పొరల అందం, ఎర్రని మిరప మందారాలు, తామరపువ్వు, మగరాతి పతకం, నుదుట మెరిసే ఎర్రబొట్టు, కషాయరేఖలు మున్నగునవి కనుపించును. విప్లవాత్మకతకు గుర్తుగా అగ్నిపుత్రి కవితను చూడవచ్చును.

చిట్టచివరి కాంతిరేఖను సైతం
కనుమరుగు కానీక
కసుగాట్లు కరిచే
అస్తమిత సంధ్యాకుపితారుణ ముఖరాగ
ప్రతిరూపాలై లేచేమంటలు నా మనోగగనాన.[2]

---

1. అగ్నిపుత్రి - ఊడలమర్రి - పుట 77.
2. అగ్నిపుత్రి - పుట 7.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏదో నలికల తాచు
ఎట్టిగా మెరుస్తూ పాకుతున్న సందడి లోలోపల
ప్రశ్నార్థకాల్ని మోసుకుంటూ
పదేపదే మనసంతా
పొరాడుతున్న ఎట్టితేలు పిల్లల పెనువడి.[1]

ఆవేదనకు చిహ్నంగా 'మనసు చిలక' కవితను గమనింపవచ్చును.

మంచు తుప్పరనుండి
మహాసముద్రం దాకా
అన్నింటిలోనూ ప్రతిఫలించే
అరుణ కిరణ ప్రసారం లాంటి-
'నువ్వు' నువ్వే లేకపోతే
నా బ్రతుకంతా కాటుక పట్టిన కత్తిగాదూ
జ్వాల లాంటి నువ్వు
భయం కొలుపుతూనే
అందంగా ఉన్నావు.[2]

మానవత్వాన్ని చూపించే 'నిత్య దుఃఖిత' కవిత పరిశీలింపదగినది-

ఆవిడ గుండెల్లో ఉండీ లేనట్లు కునుకుతున్న
ఆశల చిరువత్తిని ఎగసనతొయ్యాలనుకొంటాను
ఆవిడ ముఖాన వెలుగు కోసం నేనే కర్పూరంలా
ఎట్టిగా మండాలనుకొంటాను.[3]

---

1. అగ్నిపుత్రి - పుట 8.
2. అగ్నిపుత్రి - పుట 22.
3. అగ్నిపుత్రి - పుట 34.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'మట్టిమనిషి' కవితలో అనురాగమూ, మానవత్వమూ జోడించి ఉన్నవి. కవయిత్రి మనసులోని ఆ భావాలను చూద్దాం.

చిలిపిపిల్లలు చిలకల్లా చెదిరి
చేతికందక కవ్విస్తూ
అమ్మ బుగ్గల్లోకి ఆ మీద
కళవళించే కన్నుల్లోకి కావిరంగును తెచ్చిపెడితే
ఏమి సొగసు !

అదే సుమా అతి ఎర్రగా
చిట్టి రేగే చిన్న చిన్న రవ్వల్లాగా
వలయాలు తప్పుకొంటూ
చుట్టుకొన్న పిశంగ వర్ణ బంధంలాగా
ఒక్కుమ్మడి చెలరేగే
ఎట్టమట్టి పొరల అందం.[1]

'విక్రమభోగి' కవితలో కూడ అనురాగము ఎర్ర రంగునే పులుముకొని కానవచ్చును.

తమ్ముణ్ణి చూస్తూ తనను మరచిన
మా పెద్దవాడి నీలికళ్ళల్లో
నిలుపెత్తు మంటల ఎర్రని సొగసులు
అవును నాకు ఇద్దరు కొడుకులు
ఇద్దరూ రెండు ముద్ద బంతి పూలు
రెండు ఎర్రని మిరప మందారాలు.[2]

---

1. అగ్నిపుత్రి - పుట 44.
2. అగ్నిపుత్రి - పుట 58

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మంట కవతల మావాళ్లిద్దరూ మంతనాలాడుకొంటూ
ఒకడి మొహం నిండుగా పూచిన తామర పువ్వు
మరోడి మొహం మంటల్లో మెరిసే మగరాతి పతకం.[3]

కవయిత్రి 'కదులుతున్న అగ్ని' కవితలో ఆగ్రహాన్నీ, ఆవేదననూ జోడించి వ్రాసింది.

అమ్మో ఏమయిందేమయింది
రక్తపు మడుగులో మునుగుతూ
రేకులు మణిగిన ఎర్రతామర
తెగబారెడు తలకట్టుతో
నాచు చుట్టుకొన్న నళినీ రూపం.
పడిపోయినావా అమ్మ
పది యేనుగుల పెట్టు
నుదుట మెరిసే ఎర్ర బొట్టు
ఉగ్రకోపానికి ప్రతీక.

ఈ విధంగా ఎరుపు రంగు వస్తువులను కవయిత్రి తన కవితలో ఎక్కువగా వర్ణించింది. భావానుకూలముగా గ్రహింపబడిన వర్ణనలు కవితలకు గాంభీర్యాన్ని చేకూర్చినవి.

కృష్ణకుమారి గారి ఇతర రచనలన్నియు వచన రచనలు. వచనరచనలను నేను పరిశీలన చేయలేదు. అందువలన 'అగ్నిపుత్రి' ఖండకావ్యముతో ఈ కవయిత్రి రచనా పరిశీలన ముగించుచున్నాను. ఆగని వేగంతో ప్రవహించే ఈ కవయిత్రి కవితా వాహినిలో ఆంధ్ర సరస్వతి ఓలలాడి తనివి నొందగలదని భావించుచున్నాను.

---

3. అగ్నిపుత్రి - పుట 62.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉపసంహారము

మహిళా జన బంధువగు డా. కేసరిగారిచే నెలకొల్పబడిన గృహలక్ష్మి పత్రికను గురించియు, 'గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు – వారి కావ్యములను, నాకు సాధ్యమైనంత వరకు పరిశీలించినాను. ఈ కవయిత్రుల గ్రంధములన్నియు లభ్యము కాకున్నను, ఎక్కువ భాగము లభించినవి. స్వర్ణ కంకణ గ్రహీతలలో కవయిత్రులుగా పేరొందిన వారి కావ్యములను చూచినాను నాటకములలో కూడ పద్యములుండుటచే నాటకములను కూడ పరిశీలించినాను.

రచయిత్రులుగా పేరొందిన వారి రచనలను పరిశీలన చేయలేదు. రచయిత్రులలో అందరూ ప్రముఖులైన వారున్నారు. వారి నవలలు, కథానికలు కొన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులను పొందినవి. ప్రముఖమైన ఆంధ్ర ప్రభ, పత్రిక, భూమి వంటి పత్రికలు ఈ రచయిత్రుల రచనలను ప్రోత్సహించి ఉత్తమ బహుమతుల నిచ్చి గౌరవించినవి. వేల కొలది రూప్యముల నిచ్చి సన్మానించినవి. ఈ రచయిత్రీమణుల రచనలు కొన్ని చలన చిత్రములుగా కూడ రూపొంది అశేష జనాదరణమును పొందినవి. అన్ని విధముల ఈ రచయిత్రులు, వారి రచనలతో యశస్సునందినారు. కాని నా పరిశీలనా పరిధిలో కవయిత్రులు - వారి కావ్యములే వచ్చును. అందువలన నేను రచయిత్రుల రచనలను గ్రహించి లేదు కనుక క్షమించగోరుచున్నాను. అట్లే సంఘసేవికలైన మహిళామణులు కూడ పున్నారు. అట్టి వారిని గూర్చి కూడ పరిశోధించలేదు.

స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రుల పరిశీలనకు ముందు ప్రాచీన కవయిత్రులను గురించి క్లుప్తముగా వ్రాసినాను. ప్రాచీన కవయిత్రులను గూర్చి పండిత లోకమంతయు యెరిగినదే. అందువలన వారి వివరములను మొదటి అధ్యాయమున సంక్షిప్తముగా వ్రాసినాను. అట్లే గృహలక్ష్మి పత్రికకుముందు, ఆ పత్రిక వికాసమునకు దోహదకారులైనట్టి ఆనాటి పత్రికలను గురించియు క్లుప్తముగనే ప్రథమాధ్యాయమున వ్రాసినాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గృహలక్ష్మి పత్రిక నెలకొల్పుటయేగాక, స్వర్ణకంకణమును కూడ మహిళా కవయిత్రులకు, రచయిత్రులకు, సంఘసేవికలకు మున్నగువారికిచ్చి వారిని ప్రోత్స హించిన డా. కె. యన్. కేసరిగారి వృత్తాంతము కొంత ద్వితీయాధ్యాయమున వ్రాసితిని. తరువాత గృహలక్ష్మి కంకణ గ్రహీతలైన కవయిత్రులను, వారి కావ్య ములను పరిశీలించినాను. కనుపర్తి వరలక్ష్మమ్మగారు మొదలుకొని, డా. నాయని కృష్ణకుమారి గారి వరకు వారి కావ్యములను పరిశీలించి ఈ సిద్ధాంత వ్యాసమును రచించినాను. ఈ కవయిత్రులందరి రచనలయందును దైవభక్తి, దేశభక్తి, మాన వతా వాదము, జాతీయాభిమానము, గృహిణీ ధర్మములు మున్నగు సౌశీల్య కరములగు సదుపదేశములు ఏక సూత్రముగా ఇమిడి యున్నవి. వీరి గ్రంథము లన్నియు మహిళా జనములకు ఉపయోగకరమైనవి.

గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలయిన కవయిత్రుల రచనలలో, పద్మినీ పరిణయము, గిరిజా కళ్యాణము, లక్షణా పరిణయము, సరస్వతీ రామాయణము ప్రబంధ ధోరణిలో సాగినవి.

శతకములు, ఖండ కావ్యములు, కల్పిత కావ్యములు. సుభాషితములు కలవు. లేఖ దూతవంటి లేఖా రచనా కావ్యము కూడ గమనింపదగినది. అను వాదములు కూడ కలవు.

కావ్యములు ఎక్కువ భాగము ప్రాచీన కవుల శైలి ననుకరించి గద్య, పద్య మిశ్రమై రచింపబడినవి. కొన్ని ద్విపద కావ్యములుగా రచింపబడినవి. మరికొన్ని ఆధునిక కవిత్వపు శైలితో వచన కవిత్వంలో రచన చేయబడినవి.

ఈ కవయిత్రులలో చాలమంది గృహములందే పెద్దల చెంత కావ్య, నాటక, అలంకార, వ్యాకరణ శాస్త్రాదుల నభ్యసించి కవితలల్లు శక్తిని పొందిన వారు. కొందరు తమ పాండిత్యమునకు తగిన డిగ్రీలను పొంది ఉద్యోగములను కూడ యొనర్చి కీర్తి గాంచినవారు. హిందీ పరీక్షలు కూడ వ్రాసిన కవ యిత్రులు కలరు. ఏది ఏమైనను స్త్రీ విద్యకు ఆ రోజులలో అన్ని అవకాశములు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేవు. తమకు గల ఆసక్తి చేతనే కవితా రచన చేపట్టిన ఈ కవయిత్రీమ తల్లులందరు చిర యశస్సు నందినారు. స్వర్ణ కంకణమును వారి హస్తముల నలంకరించుకొని వారి ప్రతిభతో మెరుగులు దిద్దినారు. ఈ కవయిత్రు లందరి రచనలను పరిశీలించుట నాభాగ్యముగా భావించుచున్నాను.

ఉపయుక్త గ్రంథ సూచిక

1. ఆంధ్ర కవయిత్రులు - డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు (1980)
2. యుగ యుగాలలో భారతీయ మహిళ - కె. వరలక్ష్మిగారు, ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాదు (1977)
3. వీరేశలింగం - సమగ్ర పరిశీలనం - డా. అక్కిరాజు రమాకాంతరావుగారు
4. నా చిన్ననాటి ముచ్చట్లు - డా॥ కె. యన్. కేసరి (1953 ప్రచురణ)
5. అబలా సచ్చరిత్రరత్నమాల - బండారు అచ్చమాంబ
6. మహాభారతము-సంశోధిత ముద్రణము - ఉస్మానియా విశ్వ విద్యాలయము తెలుగు శాఖ (1968)
7. శ్రీమదాంధ్ర మహా భాగవతము - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ (1983)
8. నిర్వచనోత్తర రామాయణము - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ (1968)
9. ఉత్తర రామాయణము - కంకంటి పాపరాజు
10. మొల్ల రామాయణము - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ (1968)
11. భాస్కర రామాయణము - అరణ్య పర్వము
12. నన్నెచోడుని కుమార సంభవము - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

13. రామాయణ సుధాలహరి - యువ భారతి ప్రచురణ
14. లక్షణా పరిణయము - తిరుపతి వేంకటేశ్వర కవులు
15. పల్నాటి వీర చరిత్ర - శ్రీనాథుడు
16. మనుచరిత్ర - అల్లసాని పెద్దన
17. వసుచరిత్ర - రామరాజ భూషణుడు
18. విజయ విలాసము - చేమకూర వేంకట కవి
19. రాధికా సాంత్వనము - ముద్దుపళని
20. రఘువంశము - కాళిదాసు
21. కుమార సంభవము - కాళిదాసు
22. మేఘ సందేశము - కాళిదాసు
23. అభిజ్ఞాన శాకుంతలము - కాళిదాసు
24. భర్తృహరి సుభాషితములు - సంస్కృతం
25. కావ్యాలంకార సంగ్రహము - శిరోమణి సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి, యం. శేషాచలం అండ్ కంపెనీ ప్రచురణ
26. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము - శిరోమణి విద్వాన్ చెలమచర్ల రంగాచార్యులుగారు (1967)
27. ఆంధ్ర చంద్రాలోక వివరణము - అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు
28. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - డా॥ దివాకర్ల వెంకటావధానిగారు
29. తెలుగులో సాహిత్య పరిశోధన - రజతోత్సవసంచిక, సాహిత్య అకాడమి (1983)
30. తెలుగు సాహిత్య విమర్శ అవతరణ - వికాసాలు - డా॥ ఎస్. వి. రామారావు
31. ఆంధ్ర శతక సాహిత్య వికాసము - డా॥ కె. గోపాలకృష్ణారావుగారు
32. తెలుగు జానపద సాహిత్యము స్త్రీల గేయములలో సంప్రదాయములు - డా॥ సి. వసుంధరరెడ్డి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

33. విజ్ఞాన సర్వస్వము 3,4,6, సంపుటములు -

34. సమగ్ర ఆంధ్ర సాహిత్యము 6 వ సంపుటము - ఆరుద్ర

35. వనిత పత్రికలు -

36. వనితా జ్యోతి పత్రికలు -

37 పాత గృహలక్ష్మి పత్రికలు -

38. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రశంసా పత్రాలు - డా॥ నాయని కృష్ణకుమారిగారి ప్రశంసలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సవరణ సూచిక

తప్పు	ఒప్పు	పుట	వరుస
వెలసినాయి	వెలసినారు	1	15
కవయితులు	కవయిత్రులు	7	22
ఆభరణ	ఆభరణము	9	14
నందినాడు	నందినారు	27	13
యామద్వమున	యామద్వయమున	34	17
ఆగిపోయినది	మాత్రము నడచినది	36	19
—	(1950) గంటి కృష్ణ వేణమ్మగారు (కవయిత్రి)	37	25
1954	1953	37	చివరినుండి మూడు
ముంపుగా	ముందుగా	59	13
వంశవర్ణము	వంశవర్ణనము	67	16
అశ్వాసము	ఆశ్వాసము	69	1
వసుచరిత్ర	మనుచరిత్ర	69	చివరలో హెడ్ లైను
మాధవీకృతి	మాధవాకృతి	74	సీసపద్యంలో 4 వ లైను
ముక్తి	వ్యక్తి	76	22
వర్ణనాయుతమ్తై	వర్ణనాయుతమై	77	2
సేధు	సీధు	80	శ్లోకమున
తృటు	తృటు	80	,,
న్న వేరు	న్న మేరు	80	,,
అహ్నవము	అపహ్నవము	160	22
గాల	గాలి	192	గీత పద్యం మొదట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నెరవున	వెరవున	193	కందపద్యం మొదట
దుశరీరవాణి	అశరీరవాణి	199	గీత పద్యంలో
యెండిపోయినది	యెండిపోయిన నది	201	14
సహనములతో	సమాసములతో	237	2
లక్ష్మీకాంతష్మ కురసజ్ఞ	లక్ష్మీకాంతమ్మకు, రసజ్ఞ	317	19 పద్యపాదం చివరలో
నవరత్నమలు	నవరత్నములు	347	చివరలో హెడ్ లైను

7975

గమనిక : 1. దుర్గాబాయమ్మగారు 1937 లో ఆంధ్ర మహిళాసభ యను పేరుతో మహిళా సమాజమును స్థాపించి, మద్రాసులోను, ఆ తర్వాత హైద్రాబాదులోనూ పెద్ద పెద్ద భవనములు కట్టి మహిళా సేవ యొనరించినారు. అవి ఇప్పటికిని మహిళలకెంతో సేవ చేయుచున్నవి.

2. స్వారకంకణగ్రహీతలైన కవయిత్రుల పేర్ల పట్టికలో కవయిత్రి గంటి కృష్ణవేణమ్మ (1950) పేరు కూడ చేర్చుకొని చదువవలయును.

3. నా పరిశోధనకు కృష్ణదేవరాయ భాషానిలయమువారి సహకారము చాల లభించినది. శ్రీయుత M. L. నరసింహారావు గారికి నా కృతజ్ఞతాభివందనములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
Accession
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రంథకర్త్రి పరిచయం

డా॥ గూడా సుమిత్రాదేవి

[సుమిత్రా రామకృష్ణ]

భర్త పేరు	:	డా॥ గూడా రామకృష్ణారావు
జననం	:	1943 జనవరి 13 పుల్లెంల గ్రామం, చండూరు మండలం, నల్లగొండ జిల్లా.
తల్లిదండ్రులు	:	యం. లక్ష్మీదేవి, యం. వెంకటేశ్వరావు గారు
ప్రాథమిక విద్య	:	చండూరులో.
ఉన్నత విద్య	:	హైదరాబాదు.
అచ్చయిన పుస్తకం	:	తెనుగు మహిళ (స్త్రీల కొరకు వ్యాసాలు)
అభిరుచులు	:	సంగీతం, సాహిత్యం, ఇతర కళలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar